12. Analyse the effect of technical progress on trade.
వ్యాపారముపై సాంకేతిక ప్రగతి యొక్క ప్రభావమును విశ్లేషించుము.

13. State the role of foreign aid in the development of develping economies.
అభివృద్ధి చెందుతున్న దేశాల యొక్క అంతర్జాతీయ వ్యాపార సమస్యలేవి?

14. What are the international trade problems of developing countries?
అభివృద్ధి చెందుతున్న దేశాల యొక్క అంతర్జాతీయ వ్యాపార సమస్యలేవి?

15. Explain the secular deterioration interms of trade hypothesis.
అంతర్జాతీయ వ్యాపార నిబంధనలలో జరుగు 'సుదీర్ఘ పతన' పరికల్పనను వివరించుము.

16. Explain the objectives of exchange control.
వినిమయ నియంత్రణ లక్ష్యాలను వివరించుము.

17. Explain the concept of Foreign Trade Multiplier
విదేశీ వ్యాపార గుణకము భావనను వివరించుము.

18. What are the objectives and functions of World Trade Organisation?
ప్రపంచ వాణిజ్య సంస్థ యొక్క లక్ష్యాలు మరియు విధులు ఏవి?

## SECTION - C (3 x 15 = 45)

***Answer any Essay type questions. THREE of the following***

***All questions carry equal marks.***

19. Define comparative cost advantage. How does Ricardo explain the possibility of trade between two countries with the help of this concept? What are its limitations?
తులనాత్మక వ్యయ ప్రయోజనమును నిర్వచింపుము. ఈ భావన ద్వారా రెండు దేశాల మధ్య వ్యాపారానికిగల అవకాశమును రికార్డో ఏ విధంగా వివరించెను? దాని పరిమితులేవి?

20. Discuss the theory of customs union.
కస్టమ్స్ యూనియన్ సిద్ధాంతమును చర్చించుము.

21. What is meant by immiserising growth? Show developing countries are experiencing immiserising growth?
తిరోగమన వృద్ధి అనగానేమి? అభివృద్ధి చెందుతున్న దేశాలు ఏ విధంగా తిరోగమన వృద్ధికి గురియగుచున్నవో వివరించుము.

22. Explain the various measures for making adjustments in balance of payments.
విదేశీ వ్యాపార చెల్లింపుల శేషమును సర్దుబాటు చేయుటకు వివిధ రకాల చర్యలను వివరించుము.

23. What is international liquidy? Analyse the role of IMF in solving the problem of international liquidity.
అంతర్జాతీయ ద్రవ్యత్వం అనగానేమి? అంతర్జాతీయ ద్రవ్యత్వ సమస్య పరిష్కారంలో అంతర్జాతీయ ద్రవ్య నిధి యొక్క పాత్రను శ్లేషించుము.

24. Critically explain the purchasing power parity theory.
కొనుగోలు శక్తి సామ్య సిద్ధాంతమును విశితముగా వివరించుము.

# విషయ సూచిక


పాఠం - 1 వ్యాపారానికి సైద్ధాంతిక మూలం - సాంప్రదాయిక అంతర్జాతీయ వ్యాపార సిద్ధాంతం ఆడమ్‌స్మిత్, డేవిడ్ రికార్డో, జాన్ స్టూవర్ట్ మిల్ 1.1 - 1.21

పాఠం - 2 నవ్య సాంప్రదాయ సిద్ధాంతం - హబర్లర్ అవకాశవ్యయ సిద్ధాంతం వ్యాపార ఉదాసీనతా వక్రరేఖలు - ఆఫర్ రేఖలు 2.1 - 2.20

పాఠం - 3 నవ్య వ్యాపార సిద్ధాంతం - హెక్చర్ - ఓహ్లిన్ సిద్ధాంతం - ఉత్పత్తి కారకాల ధర సమానత్వ సిద్ధాంతము - ఉత్పత్తి కారకాల ధరలు - ఉత్పత్తి కారకాల సాంద్రతలో పరివర్తనము 3.1 - 3.26

4. విదేశీ వ్యాపారం - ఆర్థికాభివృద్ధి 4.1 - 4.19

పాఠం - 5 వర్తక నిబంధనలు - సాంకేతిక ప్రగతి మరియు అంతర్జాతీయ వ్యాపారము - అంతర్జాతీయ మూలధన కదలికలు మరియు అభివృద్ధి 5.1 - 5.16

పాఠం - 6 స్వేచ్ఛా వ్యాపారము - రక్షణ విధానము - రక్షణ వ్యాపార విదానము కొరకు వాదనలు సుంకాలు - కోటాలు 6.1 - 6.14

పాఠం - 7 ఆర్థిక సమైక్యతా సిద్ధాంతము - కస్టమ్స్ యూనియన్ సిద్ధాంతము - స్వేచ్ఛా వ్యాపార ప్రాంతము - ఉమ్మడి మార్కెట్ - యూరోపియన్ యూనియన్ 7.1 - 7.9

పాఠం - 8 అభివృద్ధి చెందుతున్న దేశాల వాణిజ్య సమస్యలు - నూతన అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ ఐక్యరాజ్య సమితి యొక్క వ్యాపారము మరియు అభివృద్ధి - అంతర్జాతీయ సమావేశము వ్యాపార సుంకాల సాధారణ ఒడంబడిక - ప్రపంచ వాణిజ్య సంస్థ 8.1 - 8.14

పాఠం - 9 ఎగుమతుల పెంపుదల మరియు దిగుమతుల ప్రత్యామ్నాయీకరణ - విదేశీ సహాయము 9.1 - 9.11

పాఠం - 10 విదేశీ మారకపు మార్కెట్ - స్థిర విదేశీ మారకపు రేట్లు - అస్థిర (లేక) సరళ విదేశీ మారకపు రేట్లు - కొనుగోలు శక్తి సామ్య సిద్ధాంతము 10.1 - 10.12

11. చెల్లింపుల శేషము 11.1 - 11.11

12 మూల్యన్యూనీకరణ - మారకపు నియంత్రణ 12.1 - 12.14

పాఠం - 13 విదేశీ వ్యాపారము మరియు జాతీయాదాయం విదేశీ వ్యాపార గుణకము 13.1 - 13.15

14. అంతర్గత మరియు బహిర్గత సమతౌల్యము సాధించుటకు అనుసరించవలసిన మార్గాలు 14.1 - 14.11

పాఠం - 1

# వ్యాపారానికి సైద్ధాంతిక మూలం - సాంప్రదాయిక అంతర్జాతీయ వ్యాపార సిద్ధాంతం - ఆడమ్ స్మిత్ డేవిడ్ రికార్డో, జాన్ స్టూవర్ట్ మిల్

## 1.0 లక్ష్యం :

ఈ పాఠ్యభాగము చదివిన తరువాత, మీరు ఈ క్రింది అంశాలను తెలుసుకోగలరు

- ☆ అంతర్జాతీయ అర్థశాస్త్ర స్వరూప, స్వభావాలు
- ☆ దేశీయ, అంతర్జాతీయ వ్యాపారాల మధ్యగల తేడాలు
- ☆ సాంప్రదాయిక వ్యాపార సిద్ధాంతానికి పూర్వ రంగంలో అంతర్జాతీయ వ్యాపారంపై గల అభిప్రాయాలు
- ☆ సాంప్రదాయ అంతర్జాతీయ వ్యాపార సిద్ధాంతము - ఆడమ్ స్మిత్, డేవిడ్‌రికార్డో, జాన్ స్టూవర్ట్ మిల్ ప్రతిపాదించిన సిద్ధాంతాలు - వాటి విశ్లేషణ

## విషయ సూచిక :


1.1 పరిచయము
1.2 అంతర్జాతీయ అర్థశాస్త్రమనగానేమి ?
1.3 దేశీయ, అంతర్జాతీయ వ్యాపారాల మధ్య తేడాలు
1.4 మార్కెంటలిసమ్
1.5 సాంప్రదాయ అంతర్జాతీయ వ్యాపార సిద్ధాంతము
1.6 ఆడమ్ స్మిత్ వ్యాపార సిద్ధాంతము : సంపూర్ణ అనుకూలత సిద్ధాంతము
1.7 రికార్డో తులనాత్మక వ్యయ సిద్ధాంతము
1.7.1. ప్రమేయాలు
1.7.2. వివరణ
1.7.3. విమర్శలు
1.7.4. సాంఖ్యిక పరీక్షలు
1.7.5. తులనాత్మక వ్యయ సిద్ధాంతము : అభివృద్ధి చెందుతున్న దేశాలు
1.7.6. తులనాత్మక వ్యయ సిద్ధాంతము - మెరుగులు
1.8 మిల్ సిద్ధాంతము
1.8.1. పరస్పర డిమాండు సిద్ధాంతము : ప్రమేయాలు
1.8.2. వివరణ
1.8.3. విమర్శలు
1.9 సారాంశము
1.10 ముఖ్య పదాలు
1.11 నమూనా ప్రశ్నలు
1.12 చదువదగిన గ్రంథాలు

## 1.1 పరిచయము :

ఈ పాఠములో మనము అంతర్జాతీయ అర్థశాస్త్రము స్వరూప స్వభావాలు, అది పరిశీలించే అంశాలను ముందుగా తెలుసుకుంటాము. దేశీయ, అంతర్జాతీయ వ్యాపారాల మధ్యగల తేడాలు, అంతర్జాతీయ వ్యాపార సిద్ధాంతపు ఆవశ్యకతను గూర్చి పరిశీలిస్తాము. అంతర్జాతీయ వ్యాపార అధ్యయనానికి సంబంధించి ప్రతిపాదింపబడిన కొన్ని సిద్ధాంతాలను పరిశీలిస్తాము. సాంప్రదాయ వ్యాపార సిద్ధాంతాన్ని పరిశీలించే ముందుగా, అంతర్జాతీయ వ్యాపారంపై మర్కంట లిస్ట్ (Mercantalist) ఆర్థికవేత్తల అభిప్రాయాలను, వారి ఆలోచనలను అధ్యయనం చేస్తాము.

యీ పాఠములో, ముఖ్యముగా సాంప్రదాయ అంతర్జాతీయ వ్యాపార సిద్ధాంతముపై దృష్టి కేంద్రీకరించుతాము. అర్థశాస్త్ర మూల పురుషుడు ఆడమ్ స్మిత్, ప్రతిపాదించిన సంపూర్ణ అనుకూలత సిద్ధాంతపు అధ్యయనంలో, అంతర్జాతీయ వ్యాపారానికి ఆధారం సంపూర్ణ అనుకూలత అని తెలుసుకుంటాము. తర్వాత, రికార్డో ప్రతిపాదించిన తులనాత్మక వ్యయ సిద్ధాంతమును విపులంగా చర్చిస్తాము. దానిపై వచ్చిన విమర్శలు, తదనంతర కాలంలో ఆ సిద్ధాంతానికి పెట్టిన మెరుగులను పరిశీలిస్తాము. తర్వాత జాన్ స్టూవర్ట్ మిల్ ప్రతిపాదించిన పరస్పర డిమాండు సిద్ధాంతాన్ని అధ్యయనం చేస్తాము. స్థూలంగా యీ పాఠములో పరిగణించే విషయాలు యివే.

## 1.2 అంతర్జాతీయ అర్థశాస్త్రమనగానేమి ?

అంతర్జాతీయ అర్థశాస్త్రము, ప్రపంచంలో వివిధ దేశాలు పరస్పరం ఒకరి మీద ఒకరు ఆధారపడటాన్ని అధ్యయనం చేస్తుంది. ఒక దేశము మరియు మిగతా ప్రపంచము మధ్య వస్తువుల, సేవల ప్రవాహము, చెల్లింపులను, యీ ప్రవాహాన్ని నియంత్రించే విధానాలను మరియు ఆ దేశపు సంక్షేమంపై వీటన్నిటి ప్రభావాలను విశ్లేషిస్తుంది. దేశాల మధ్య యీ పరస్పర ఆధారిత రాజకీయ, సామాజిక, సాంస్కృతిక సంబంధాలపై ప్రభావము చూపుతుంది. అంతేకాక వాటి వల్ల ప్రభావితమవుతుంది.

ముఖ్యంగా అంతర్జాతీయ అర్థశాస్త్రము అంతర్జాతీయ వ్యాపార సిద్ధాంతాన్నీ (International Trade Theary) అంతర్జాతీయ వ్యాపార విధానాన్నీ (International Trade Policy) విదేశీ చెల్లింపుల శేషాన్ని, (Balance of Paymants) మరియు విదేశీ మారకపు మార్కెట్లను (Foreign Exchange Makes) విశ్లేషిస్తుంది.

అంతర్జాతీయ వ్యాపార సిద్ధాంతము, వ్యాపారానికి ఆధారము లేదా ప్రాతిపదికను (Basic), స్వేచ్ఛా వ్యాపారము వల్ల ఒనగూడే లాభాలను విశ్లేషిస్తుంది. అంతర్జాతీయ వ్యాపార విధానము, వ్యాపారంపై ఆంక్షలలోగల కారణాలను, వాటి ప్రభావాల్ని, రక్షణ విధానాలను పరిశీలిస్తుంది. విదేశీ చెల్లింపుల శేషము, ఒక దేశానికి వచ్చే వివిధ రాబడులు, మిగతా ప్రపంచానికి ఆ దేశము చేసే చెల్లింపులను తెలియజేస్తుంది. యీ శేషములో, మిగులు లేదా లోటు సంభవించటానికి గల కారణాలను అన్వేషించి, వాటిని సర్దుబాటు చేసే వివిధ పద్ధతులను వివరిస్తుంది. ఒక దేశపు కరెన్సీ మారకపు రేటును నిర్ణయించే పద్ధతినీ, వివిధ అంశాలను, విదేశీ మారకపు మార్కెట్లు అధ్యయనం తెలియజేస్తుంది. యీ అంతర్జాతీయ అర్థశాస్త్ర సూక్ష్మ (Micro) మరియు స్థూల (Macro) అర్థశాస్త్ర అంశాలు యిమిడి ఉంటాయి. అర్థశాస్త్రములో ఒక విశిష్ట శాఖ ఈ అంతర్జాతీయ అర్థశాస్త్రము.

గత రెండు దశాబ్దాల కాలంలో, యీ అంతర్జాతీయ అర్థశాస్త్రము గణనీయంగా అభివృద్ధి చెందింది. ఆడమ్ స్మిత్, డేవిడ్ రికార్డో, జె.ఎస్. మిల్, మార్షల్, కీన్సు, శామ్యూల్ సన్ వంటి ప్రముఖ ఆర్థికవేత్తలు దీని అభివృద్ధికి తోడ్పడ్డారు. ప్రస్తుత పాఠములోనూ, తరువాతి పాఠాలలోను, వీరివేగాక మరి కొందరి ఆర్థిక వేత్తల సిద్ధాంతాలను అధ్యయనం చేస్తాము.

అంతర్జాతీయ వ్యాపార సిద్ధాంతాలను అధ్యయనం చేసే ముందుగా, దేశీయ, అంతర్జాతీయ వ్యాపారాల మధ్య గల తేడాలను పరిశీలించాలి. దానిని బట్టి అంతర్జాతీయ వ్యాపార విశ్లేషణలో ఒక ప్రత్యేక శాస్త్రీయం అవసరమా ? అన్న విషయాన్ని నిర్ధారించగలము. అందువలన ముందుగా మనము దేశీయ (Internal) మరియు అంతర్జాతీయ (International) వ్యాపారానికి మధ్యగల తేడాలను పరిశీలించాలి.

## 1.3 దేశీయ (Internal) అంతర్జాతీయ (International) వ్యాపారాల మధ్య తేడాలు

దేశీయ వ్యాపారానికి, అంతర్జాతీయ వ్యాపారానికి కొన్ని పోలికలు, సారూప్యాలు ఉన్నాయి. దేశీయ వ్యాపారంలో ఒక దేశపు వ్యక్తులు మధ్య వస్తు వినిమయము జరుగుతుంది. అంతర్జాతీయ వ్యాపారంలో, వేరు వేరు దేశాలలో నివసించే వ్యక్తుల మధ్య వస్తు మార్పిడి జరుగుతుంది. అంటే యీ రెండు రకాల వ్యాపారాలలో వ్యక్తుల మధ్య వస్తు వినిమయము (Exchange) జరుగుతుంది.

కాని, సాంప్రదాయిక ఆర్థికవేత్తలు దేశ, విదేశ వ్యాపారాలలో ప్రధాన వ్యత్యాసాలున్నాయనీ, అంతర్జాతీయ వ్యాపారము ఒక ప్రత్యేకతను కలిగి ఉందనీ, అందువలన అంతర్జాతీయ వ్యాపారాన్ని విడిగా అధ్యయనం చేయవలసిన ఆవశ్యకత ఉందనీ విశ్వసించారు. ఈ కారణాల వలన విడిగా అంతర్జాతీయ వ్యాపార సిద్ధాంతం అవసరమని వాదించారు. దేశీయ వ్యాపారానికి, అంతర్జాతీయ వ్యాపారానికి మధ్య వారు తెలియజేసిన వ్యత్యాసాలు.

**1) ఉత్పత్తి కారకాల గమనశీలత :** ఉత్పత్తి కారకాల గమనశీలతపై యీ రెండు వ్యాపారాల మధ్య ముఖ్యమైన తేడా ఉందని, సాంప్రదాయ ఆర్థికవేత్తలు వాదించారు. ఉత్పత్తి కారకాలు - శ్రమ, మూలధనం దేశీయంగా పూర్తి గమనశీలత కలిగి ఉంటాయి. అందువలన, అవి, వాటి ప్రతిఫలాలు ఎక్కువగా ఉండే కార్యకలాపాలలోకి కదలివెడతాయి. కాని అంతర్జాతీయంగా ఉత్పత్తి కారకాలు ముఖ్యంగా శ్రమ, మూలధనము గమనశీలత ఉండదనీ, అటువంటి గమనశీలత కష్టమని ఊహించారు.

దేశీయంగా అంటే ఒక దేశంలో వివిధ ప్రాంతాల మధ్య, పరిశ్రమల మధ్య, ఉత్పత్తి కారకాల పూర్తి గమనశీలత వలన, వాటి ప్రతిఫలాలు సమానంగా ఉంటాయి. అట్లా లేనపుడు, అవి తక్కువ ప్రతిఫలం వచ్చే చోటు నుండి, ఎక్కువ ప్రతిఫలం వచ్చే చోటుకు తరలిపోతాయి. అంతర్జాతీయంగా అటువంటి గమనశీలత సాధ్యపడదు. దీనికి అనేక కారణాలు భాషా బేధాలు ఆచార వ్యవహారాలు, కుటుంబ సంబంధాలు, వృత్తి నైపుణ్యతలలో తేడాలు, ఆంక్షలు వీటి వలన అంతర్జాతీయంగా ముఖ్యంగా శ్రామిక గమనశీలత ఉండదు. అందువలన యీ రెండింటి మధ్య తేడా ఉందని సాంప్రదాయిక ఆర్థికవేత్తలు అభిప్రాయపడ్డారు.

ఈ అభిప్రాయం తరువాతి కాలంలో విమర్శకు గురి అయింది. ఉత్పత్తి కారకాల గమనశీలతలో గల తేడా సంపూర్ణమైనది కాదని, అది కొంత మేరకేనని ఒక విమర్శ. దేశీయంగా కూడా, ఉత్పత్తి కారకాల గమనశీలత సంపూర్ణంగా ఉండదనీ, అనేక ఆంక్షలు ఉన్నాయని, విభిన్న దేశాల మధ్య గమనశీలత ఉందనీ, యీ విమర్శకులు సూచించారు. ఆడమ్‌స్మిత్ శ్రామికులు వలస పోవడాన్ని గుర్తించారు. జె.ఎస్.మిల్ కూడా మూలధనము, పెట్టుబడి రూపంలో, యితర దేశాలకు తరలి పోవడాన్ని గుర్తించారు. కెయర్న్స్ (Carins) దేశీయంగా పోటీలేని శ్రామిక వర్గాలు (Non - Competing Groups of Labour) ఉంటాయనీ, వీటి మధ్య గమనశీలత ఉండదనీ చెప్పారు. కానీ, దేశీయంగా, ఉత్పత్తి కారకాల గమనశీలత, అంతర్జాతీయంగా కంటే ఎక్కువగా ఉంటుంది. ఇది వాస్తవము. కాబట్టి యీ కారణము వలన, దేశీయ, అంతర్జాతీయ వ్యాపారాల మధ్య తేడా ఉందనడం సమంజసమనీ, ప్రముఖమైనదనీ చెప్పవచ్చు. అందువలన సాంప్రదాయ ఆర్థికవేత్తలు ప్రత్యేక అంతర్జాతీయ వ్యాపార సిద్ధాంతము అవసరమని వాదించారు.

**వివిధ కరెన్సీలు :** ఒక దేశంలో ఒకే రకమైన ద్రవ్యం చలామణీ అవుతుంది. దేశీయ వ్యాపారంలో ఆ దేశపు ద్రవ్యాన్ని ఉపయోగిస్తారు. అంతర్జాతీయ వ్యాపారంలో వివిధ ద్రవ్యాలనుపయోగించవలసి ఉంటుంది. భారతదేశంలో రూపాయి దేశ వ్యాప్తంగా చలామణీ అవుతుంది. కాని ఇంకొక దేశంలో మన దేశపు కరెన్సీ రూపాయి చలామణీ కాదు. ఆ దేశపు కరెన్సీలోకి మన రూపాయను మార్చి తద్వారా ఆ దేశపు వస్తువులను కొనుగోలు చేయాలి. అందువలన ద్రవ్య మారకము సమస్య ఎదురవుతుంది.

కాబట్టి అంతర్జాతీయ వ్యాపారంలో, కరెన్సీలలో తేడాలుంటాయి. అంతేకాక, వాటి సాపేక్ష విలువలలో మార్పులను గూడా గమనించవలసి ఉంటుంది. ఒక దేశపు కరెన్సీలో, ఇంకొక దేశపు కరెన్సీ విలువ మారినప్పడల్లా అనేక దేశపు కరెన్సీ విలువ మారకపు రేట్లు బాగా మార్పు చెందవచ్చు. అంతేకాకుండా, కొన్ని దేశాల కరెన్సీలను అమెరికన్ డాలర్లు, బ్రిటన్ పౌండ్లు స్టెర్లింగు - అంతర్జాతీయ లావాదేవీలలో విస్తారంగా ఉపయోగిస్తారు. అందువలన అంతర్జాతీయంగా అనేక సమస్యలుత్పన్నమవుతాయి. వివిధ దేశాలు వివిధ ద్రవ్య విధానాలు, విదేశీ మారకపు విధానాలను అవలంబించడం వలన, ఎగుమతుల సప్లయ్ గాని, దిగుమతుల డిమాండ్ కాని ప్రభావితమవుతాయి. అందువలన, యిటువంటి విధానాలలో తేడాల వల్ల అంతర్జాతీయ వ్యాపారానికి, దేశీయ వ్యాపారానికి మధ్య తేడా ప్రస్ఫుటమవుతుందని కిండెల్ బర్గర్ సూచించారు.

**విదేశీ చెల్లింపుల శేషపు సమస్య :** విదేశీ చెల్లింపుల శేషపు సమస్య అంతర్జాతీయ వ్యాపారానికి సంబంధించి ప్రత్యేక సమస్య. దేశీయంగా అటువంటి సమస్య ఉత్పన్నమవదు. ఎందుకంటే దేశీయంగా మూలధనము ఒక ప్రాంతము నుండి ఇంకొక ప్రాంతానికి తరలిపోవడానికి అవకాశం ఎక్కువ. చెల్లింపుల శేషములో అసమతౌల్యాన్ని పరిష్కరించటానికి అనుసరించే విధానాల వలన అనేక ఇతర సమస్యలు ఎదురవచ్చు. ప్రతి ద్రవ్యోల్బణము కాని, మూల్యహీనీకరణగాని, దిగుమతులపై ఆంక్షలు వల్ల గాని, మరికొన్ని సమస్యలు ఉత్పన్నమవుతాయి. దేశీయ వ్యాపారంలో ఇటువంటి సమస్యలుండవు.

**వివిధ జాతీయ విధానాలు :** ఇంకొక తేడా, వాణిజ్య, వ్యాపార, పన్నుల మరియు ఇతర విధానాలకు సంబంధించినది. దేశీయంగా యీ విధానాలు ఒకే రకంగా ఉంటాయి. కాని అంతర్జాతీయంగా టారిఫ్‌లు, కోటాలు, దిగుమతి సుంకాలు వంటి రూపంలో వ్యాపారంపై ఆంక్షలు ఉంటాయి. ఎగుమతి, దిగుమతి సుంకాలనేవి అంతర్జాతీయ వ్యాపారానికే పరిమితము. దేశీయంగా వివిధ ప్రాంతాల మధ్య వ్యాపారంపై యిటువంటి ఆంక్షలు ఉండవు. కానీ, వీటివల్ల అంతర్జాతీయ వ్యాపారంలో ఏర్పడే పరిణామాలను ప్రత్యేకంగా విశ్లేషించవలసి ఉంటుంది. యీ పరిస్థితులలో దేశీయంగా ఆర్థిక విధానాలలో కూడా మర్పులు ఉంటాయి.

**జీవన ప్రమాణాలలో తేడాలు :** అంతర్జాతీయ వ్యాపారం, విభిన్న జీవన ప్రమాణం గల ఉత్పత్తిదారుల మధ్య వస్తు వినిమయంగా హారడ్ (Harrod) పేర్కొన్నాడు. అటువంటి వస్తు వినిమయ విషయంలో కొన్ని అంశాలలో వ్యత్యాసముంటుంది. ఈ కారణంగా, అంతర్జాతీయ వ్యాపారాన్ని, ఒక ప్రత్యేక శాస్త్రంగా అధ్యయనం చేయవలసిన అవసరం ఉందని హారడ్ అభిప్రాయము. ఒకే రకపు శ్రామికులకు, వివిధ దేశాలలో జీవన ప్రమాణాలు ఒకే విధంగా ఉండక పోవచ్చు. కాని దేశీయంగా, అటువంటి వ్యత్యాసాలుండటానికి వీలు లేదు.

వివిధ దేశాల మధ్య ఉత్పత్తిదారుల జీవన ప్రమాణాలలో తేడాలుండటమే గాక, విభిన్న ఉత్పత్తి సౌకర్యాలుగల ఉత్పత్తి దారుల మధ్య జరిగే వినిమయంగా అంతర్జాతీయ వ్యాపారాన్ని గుర్తించడం జరిగింది. వివిధ దేశాలలో ప్రభుత్వ పరిపాలనా సామర్థ్యము వేరు వేరుగా ఉంటుంది. పైన పేర్కొన్నట్లు, ఒక దేశంలో ఉత్పత్తి దారులందరికీ ఒకే విధానం వర్తిస్తుంది. కాని వివిధ దేశాలలోని ఉత్పత్తి దారులకు ఉత్పత్తి సౌకర్యాలలో తేడాలుండటం వలన, అంతర్జాతీయ వ్యాపారానికి అవకాశం ఉంది.

పైన చెప్పిన కారణాల వలన, అంతర్జాతీయ వ్యాపారానికి, దేశీయ వ్యాపారానికి మధ్య మౌళికమైన తేడాలున్నాయి. అందువలన ప్రత్యేక అంతర్జాతీయ వ్యాపార సిద్ధాంతానికవసరం ఉందని సాంప్రదాయ ఆర్థికవేత్తలు భావించారు.

కాని బెర్టిల్ ఓహ్లిన్ (Bertil Ohlin) అంతర్జాతీయ వ్యాపారానికి, దేశీయ వ్యాపారానికి మధ్య తేడా ఏమీ లేదని వాదించాడు. అంతర్జాతీయ వ్యాపారము,దేశీయ వ్యాపారానికి చెందిన ఒక ప్రత్యేక అంశము. అందువలన ప్రత్యేక అంతర్జాతీయ వ్యాపార సిద్ధాంతానికవసరం లేదని అతని వాదన.

ఉత్పత్తి కారకాల గమనశీలత విషయంలో, సాంప్రదాయ ఆర్థికవేత్తల అభిప్రాయంతో, ఓహ్లిన్ విభేదించాడు. దేశీయంగా కూడా, ఉత్పత్తి కారకాల గమనశీలత సంపూర్ణంగా ఉండదని ఓహ్లిన్ వాదన దేశీయంగా కూడా వివిధ వృత్తుల, ప్రాంతాల మధ్య వేతనాలలోని వ్యత్యాసాలుంటాయి. అదే విధంగా వివిధ ప్రాంతాల మధ్య, ఉపయోగాలలోనూ వడ్డీ రేట్లలో తేడాలుండవచ్చు.

అదే విధంగా, శ్రమ, మూలధనము అంతర్జాతీయంగా గమనశీలత ఉండదని చెప్పలేము. గతంలో వీటి గమనశీలతకు ఉదాహరణలున్నాయి. 19, 20 శతాబ్దాలలో అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల అభివృద్ధిలో, ఇంగ్లాండ్, యూరప్ నుంచి వెళ్ళిన శ్రమ, మూలధనము పాత్ర గణనీయమని యీ సందర్భంగా గుర్తించాలి.

వివిధ కరెన్సీలుండటం వలన, ప్రత్యేక అంతర్జాతీయ వ్యాపార సిద్ధాంతానికవసరం ఉత్పన్నమవుతుంది. రెండు దేశాల మధ్య మారకపు రేటు, ఆ రెండు దేశాల కరెన్సీల కొనుగోలు శక్తిని బట్టి నిర్ణయింపబడుతుంది. ఒక దేశపు కరెన్సీ, మరొక దేశపు కరెన్సీలోకి మార్పిడి చేసుకోవచ్చుంటే, అంతర్జాతీయ వ్యాపారానికి, ప్రాంతీయ వ్యాపారానికి మధ్య తేడా లేదు.

యీ కారణాల వలన, ప్రత్యేక అంతర్జాతీయ వ్యాపార సిద్ధాంతపు ఆవశ్యకత లేదనీ, దేశీయ వ్యాపారము యొక్క ప్రత్యేక అంశంగా అంతర్జాతీయ వ్యాపారాన్ని పరిగణించాలని ఓహ్లిన్ అభిప్రాయము. దేశీయంగా వస్తువుల ధరలు నిర్ణయింపబడినట్లే, అంతర్జాతీయంగా కూడా అదే విధంగా వస్తువుల ధరలు నిర్ణయింపబడతాయి. డిమాండ్, సప్లయ్‌ల మధ్య సమతౌల్యాన్ని బట్టి, దేశీయంగా ధరలు నిర్ణయింపబడతాయి. ఇది అంతర్జాతీయ వ్యాపారానికి కూడా వర్తిస్తుంది. టారిఫ్‌లు, కరెన్సీలలో తేడాలు, మిగతావన్నీ ఒకే రకంలో వివిధ స్థాయిలకు చెందినది కాని, వీరు రకరకాలుకు చెందినవారు (Differences of degree and not of kind)

కానీ, యీ రెండింటి మధ్య మౌళికమైన తేడాలున్నాయి. ప్రతీ దేశానికి, ఒక స్వంత కరెన్సీ ఉంది. దానితో దేశీయంగా వివిధ వస్తువులను, ఆ దేశపు ప్రజలు స్వేచ్ఛగా కొనుగోలు చేయవచ్చు. కానీ, విదేశీ వస్తువులను అట్లా కొనుగోలు చేయటం సాధ్యపడదు. వారి కరెన్సీలు స్వేచ్ఛగా అందుబాటులో ఉండవు. మార్పిడి కూడా సమస్యలతో కూడుకున్నది. కాబట్టి దేశీయ వ్యాపారంలో, మారకపు రేట్ల సమస్యలు చెల్లింపుల శేషము, టారిఫ్‌లు మున్నగు సమస్యలుండవు. అంతర్జాతీయ వ్యాపారంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరిండానికి, అంతర్జాతీయ ద్రవ్య నిధి, గాట్, ప్రపంచ వాణిజ్య సంస్థ (W.T.O.) అంక్టాడ్ (UNCTAD) మొదలైన అంతర్జాతీయ సంస్థలు ఆవిర్భవించాయి. వీటికి దేశీయ వ్యాపారంతో సంబంధం లేదు.

## 1.4. మర్కెంటలిజమ్ (Mercantalism) :

అంతర్జాతీయ వ్యాపార సిద్ధాంతాలను, సూత్రాలను అధ్యయనం చేసే ముందు, గతంలో విదేశీ వ్యాపారంపై ప్రబలంగా ఉన్న అభిప్రాయాలను, విధానాలను తెలుసుకోవాలి. యీ సందర్భంగా మర్కెంటలిస్ట్ వ్యవస్థను ప్రస్తావించాలి.

16వ శతాబ్దం, 18వ శతాబ్దం మధ్య తరహా, మర్కెంటలిజమ్, ప్రభుత్వాల ఆర్థిక విధానాలను, ముఖ్యంగా అంతర్జాతీయ వ్యాపార విధానాన్ని గణనీయంగా ప్రభావితం చేసింది. యీ ఆర్థికవేత్తలు (Mercantalists) ప్రభుత్వము పటిష్టంగా, శక్తివంతంగా ఉండటానికి అవసరమైన చర్యలను సూచించారు. ప్రభుత్వ శక్తి ఆ దేశ సంపదపై ఆధారపడుతుందని వారు భావించారు. దాని కొరకు, విలువైన లోహాన్ని ముఖ్యంగా బంగారము, వెండి అధిక పరిమాణంలో సంచయనం చేసుకోవాలి. ఇటువంటి విధానానికి, మార్కెంటలిజమ్ అని ఫిజియోక్రోట్స్ (Physiocrats) పేరు పెట్టారు. యీ లక్ష్య సాధనను, వారు వివిధ మార్గాలను అన్వేషించారు. వ్యాపారం ద్వారానే, యీ లోహాల సంచయనం సాధ్యపడుతుందని వారు భావించారు. దానికి వ్యాపార శేషము అనుకూలముగా ఉండాలని (Favourable Balance of Trade) విశ్వసించారు. అంటే, ఆ దేశపు ఎగుమతులు, దిగుమతుల కన్నా ఎక్కువగా ఉండాలి. అప్పుడు వ్యాపారశేషము అనుకూలముగా ఉండి, విదేశాల నుండి బంగారం వస్తుంది. దేశీయంగా బంగారపు నిల్వలు పెరిగి, దేశ సంపద పెరిగి, ప్రభుత్వ శక్తి పెరుగుతుంది. కాబట్టి అంతర్జాతీయ వ్యాపారంలో, వ్యాపార శేష సిద్ధాంతాన్ని (Balance of Trade Theory) ప్రతిపాదించారు. వ్యాపార శేషము అనుకూలముగా ఉండటానికి, వ్యాపారంపై నియంత్రణ అవసరమని భావించారు. తదనుగుణంగా మర్కెంటలిస్ట్ ఆర్థిక వ్యవస్థ విధానాలు యీ విధంగా ఉండాలని నిర్దేశించారు.

1. వ్యాపార, ప్రభుత్వ ఆంక్షలకు లోబడి జరగాలి. ప్రభుత్వం అనుమతించిన వస్తువుల ఎగుమతులను పెంచాలి. దిగుమతులు, సాధ్యమైనంత వరకు తక్కువగా ఉండాలి.
2. విదేశాలకు బంగారం ఎగుమతిని పూర్తిగా నిషేధించాలి. దేశంలోకి వచ్చిన బంగారము, వెండిని జాగ్రత్త పరచి, మరల విదేశాలకు పోకుండా జాగ్రత్త పడాలి.
3. విదేశీ వ్యాపారంలో ప్రభుత్వ ఏకస్వామ్యం (Monopoly) ఉండాలి. చాలా తక్కువ భాగము, వ్యక్తులు స్వేచ్ఛగా వదలాలి. అనుకూల వ్యాపార శేషం కోసం, టారిఫ్‌లు, కోటాలు, ఇతర వాణిజ్య విధానాల ద్వారా వ్యాపార నియంత్రణ చేయాలి.

స్థూలంగా అంతర్జాతీయ వ్యాపారానికి సంబంధించి, మర్కెంటులిస్ట్ విధానాలు యివే. 17, 18 వ శతాబ్దాలలో, యివి అనేక దేశాలలో ప్రభుత్వ విధానాలను గణనీయంగా ప్రభావితం చేసాయి.

తరువాతి కాలంలో, మర్కెంటలిస్ట్ ఆర్థిక విధానాలు తీవ్ర విమర్శలకు గురి అయ్యాయి. David Hume, Price - specie flow doctrine ప్రకారము, అనుకూల వ్యాపార శేషము స్వల్పకాలములోనే సాధ్యమని, కాలక్రమేణా అది పూర్తిగా అదృశ్యమవుతుందని వాదించారు. మర్కెంటలిస్ట్ విధానాలు, స్వల్పకాల ఆర్థిక ప్రయోజనాలను మాత్రమే అందజేస్తాయని, యీ సిద్ధాంతము నిరూపించింది.

## 1.5. సాంప్రదాయ అంతర్జాతీయ వ్యాపార సిద్ధాంతము :

ఈ నేపథ్యంలో, సాంప్రదాయ అంతర్జాతీయ వ్యాపార సిద్ధాంతము ప్రతిపాదింపబడినది. సాంప్రదాయ ఆర్థికవేత్తలు - ముఖ్యంగా ఆడమ్ స్మిత్ మరియు డేవిడ్ రికార్డో మర్కెంటలిస్ట్ వ్యాపార విధానాలను, తీవ్రంగా వ్యతిరేకించారు. వ్యాపారంపై ఆంక్షలు అ సందర్భమైనవనీ, స్వేచ్ఛా వ్యాపారం వలన దేశ సంపద పెరుగుతుందనీ అభిప్రాయపడ్డారు.

ఆడమ్ స్మిత్, ఒక దేశ సంపద వస్తువులు కానీ, బంగారపు నిల్వలు కాదనీ, మొదటి సారిగా చెప్పారు. మర్కెంటులిస్ట్‌లు నిర్దేశించిన ఆంక్షలు, విదేశీ వ్యాపారంపై తొలగిస్తేనే, దేశ సంపద త్వరితగతిని పెరుగుతుందని వాదించారు. స్వేచ్ఛా వ్యాపారం వలన, వివిధ దేశాల జాతీయాదాయాలు, జాతీయసంపదలు పెరుగుతాయని తెలియజేసారు. స్వేచ్ఛా వ్యాపారం ఉత్పత్తి వనరుల సద్వినియోగానికి, మానవ సంక్షేమానికి దోహదపడుతుందని వాదించారు.

స్వేచ్ఛా వ్యాపారం, అంతర్జాతీయ శ్రమ విభజనను ప్రోత్సహిస్తుందని అభిప్రాయపడ్డారు. దాని వలన ప్రతిదేశము తాను చౌకగా ఉత్పత్తి చేయగల వస్తువుల పైననే దృష్టి కేంద్రీకరిస్తుంది. తాను చౌకగా ఉత్పత్తి చేసి, సప్లయ్ చేయగల వస్తువులను ఎగుమతి చేసి, ఇతర దేశాలు చౌకగా సప్లయ్ చేయగల వస్తువులను దిగుమతి చేసుకొంటుంది. ఇది ఉత్పత్తి సాధనాల సమర్థవంతంగా కేటాయింపబడటానికి దారి తీస్తుంది. అంతర్జాతీయ శ్రమ విభజన వలన, అంతర్జాతీయ వ్యాపారం ద్వారా అన్ని దేశాలు లాభపడతాయని నిరూపించారు.

అంతర్జాతీయ వ్యాపారానికి, అంతర్జాతీయ శ్రమ విభజనే మూలాధారము. ఆడమ్ స్మిత్ స్వేచ్ఛా వ్యాపార వాది. స్వేచ్ఛా వ్యాపారం, అంతర్జాతీయ శ్రమ విభజనకు దోహదం చేస్తుందని వాదించారు. అయితే, యీ స్వేచ్ఛా వ్యాపార సూత్రానికి కొన్ని మినహాయింపులున్నాయని స్మిత్ గుర్తించారు. దేశ రక్షణ దృష్ట్యా కీలక పరిశ్రమలకు రక్షణ అవసరమని భావించారు. కాని ఆంక్షలు లేని వ్యాపారం వలన ఒనగూడే ప్రయోజనాలకే ఆడమ్ స్మిత్ ఎక్కువ ప్రాముఖ్యతనిచ్చారు. స్వేచ్ఛా వ్యాపారం వలన, మార్కెట్ విస్తరించి, ఉత్పాదకత పెరుగుతుంది.

## 1.6. ఆడమ్ స్మిత్ వ్యాపార సిద్ధాంతము : సంపూర్ణ అనుకూలత సిద్ధాంతము (Theory of Absolate Advantage)

దేశాల మధ్య వస్తుమార్పిడి, వ్యయాలలో తేడాలపై ఆధారపడుతుందనే ఆలోచనే ఆడమ్ స్మిత్ సిద్ధాంతానికి ఆధారము. అయితే, వ్యయాలలో తేడాలు ఎందుకుంటాయి ? ఉత్పత్తి కారకాల ఉత్పాదకతలలో తేడాలు, ఉత్పత్తి వ్యయాన్ని నిర్ణయించే ముఖ్య అంశము. ఉత్పాదకత శీతోష్ణస్థితి, నేల, ఖనిజ సంపద, ప్రత్యేక నైపుణ్యతలు, సాంకేతికతలు మున్నగు వాటిపై ఆధారపడుతుంది. దీనికే సంపూర్ణ అనుకూలత (Absolute Advantage) అని స్మిత్ వ్యవహరించారు.

స్మిత్ వ్యయ భావన శ్రమ విలువ సిద్ధాంతం (Labour Theory of Value) పై ఆధారపడినది. ఈ సిద్ధాంతము ప్రకారము, 1) ప్రతి దేశములోనూ శ్రమ ఒక్కటి ఉత్పత్తి కారకము 2) శ్రమ సజాతీయము (Homogeneess) 3) ఒక వస్తువు యొక్క వ్యయము లేక ధర, ఆ వస్తువునుత్పత్తి చెయ్యడానికవసరమైన శ్రమపై ఆధారపడుతుంది.

ఈ ప్రమేయాలపై, శ్రమ విలువ సిద్ధాంతము ఆధారపడినది.

స్మిత్ యీ సిద్ధాంతము నాధారముగా చేసికొని, సంపూర్ణ అనుకూలత సూత్రము (Principle of Absolute Advartage) అనే వ్యాపార సూత్రాన్ని ప్రతిపాదించాడు. ఈ సూత్రము ప్రకారము, కొన్ని వస్తువుల ఉత్పత్తిలో ఒకే దేశానికి సంపూర్ణ అనుకూలత ఉంటే, ఇంకొన్ని వస్తువుల ఉత్పత్తిలో ఇంకొ దేశానికి సంపూర్ణ అనుకూలత ఉంటుంది. ఈ పరిస్థితిలో, ఆ దేశము తన సంపూర్ణ అనుకూలత ఉన్న వస్తువుల ఉత్పత్తిపైనే కేంద్రీకరించి, ఆ వస్తువులను ఇంకొక దేశపు వస్తువులతో (ఆ దేశానికి సంపూర్ణ అనుకూలత ఉన్నవి) వ్యాపారము ద్వారా మార్పిడి చేసుకొంటే, స్వేచ్ఛా వ్యాపార పరిస్థితులలో, అంతర్జాతీయ శ్రమ విభజనకు దారి తీసి ఉభయ దేశాలు లాభపడతాయి.

విశ్లేషణ సులభతరంగా ఉండటానికి, మనము రెండు దేశాలు, రెండు ఉత్పాదనలు విషయం పరిశీలించవచ్చు. ఒక్కొక ఉత్పత్తి కారకము శ్రమ. ఒక దేశము ఒక వస్తువుత్పత్తిలో సంపూర్ణ వ్యయ అనుకూలత (Absolute cost Advantage) ఉందనుకుందాము. అటు ఒక యూనిట్ వస్తూత్పత్తిలో తక్కువ శ్రమని ఉపయోగించడం. మరొక దేశానికి, యింకొక వస్తూత్పత్తిలో సంపూర్ణ వ్యయ అనుకూలత ఉందనుకుందాము. ఆయా వస్తువుల ఉత్పత్తిలో, ఆయా దేశాలు ప్రత్యేకీకరణ సలిపి, వ్యాపారంలో పాల్గొంటూ, రెండు దేశాలు లాభపడతాయి.

ఈ సూత్రాన్ని ఒక ఉదాహరణ ద్వారా విశదీకరించవచ్చు. మనము యీ ఉదాహరణలో రెండు దేశాలు (A, B) రెండు వస్తువులు (X,Y) ఒక ఉత్పత్తి కారకము (శ్రమ) ని పరిగణిస్తున్నాము.

పట్టిక 1.1

| దేశీయ | వస్తువు X | వస్తువు Y |
|---|---|---|
| A | 5 | 20 |
| B | 15 | 10 |

యీ పట్టిక ప్రకారము A దేశము, 1 శ్రామికునితో 5 యూనిట్ల X వస్తువును కాని, లేదా 20 యూనిట్ల Y వస్తువును కాని ఉత్పత్తి చెయ్యగలదు. అదే విధంగా B దేశము 1 శ్రామికునితో 15 యూనిట్ల X వస్తువును కాని, లేదా 10 యూనిట్ల Y వస్తువును కానీ ఉత్పత్తి చెయ్యగలదు.

దానిని బట్టి A దేశమునకు Y వస్తూత్పత్తిలో సంపూర్ణ అనుకూలత ఉన్నదని మనము గ్రహించవచ్చు. 1 శ్రామికులలో 20 యూనిట్ల Y వస్తువునుత్పత్తి చెయ్యగలదు. అదే విధంగా B దేశానికి X వస్తూత్పత్తిలో సంపూర్ణ అనుకూలత ఉందని గ్రహించవచ్చు. 1 శ్రామికునితో 15 యూనిట్ల X వస్తువునుత్పత్తి చెయ్యగలదు. Y వస్తూత్పత్తిలో A దేశములో శ్రామిక ఉత్పాదకత ఎక్కువ. అందువలన ఉత్పత్తి వ్యయము తక్కువ. అదే విధంగా X వస్తూత్పత్తిలో B దేశియంలో ఉత్పత్తి వ్యయము తక్కువ.

యీ పరిస్థితిలో స్మిత్ ప్రకారము A దేశము Y వస్తూత్పత్తిలో ప్రత్యేకీకరణ సలిపి, B దేశము X వస్తూత్పత్తిలో ప్రత్యేకీకరణ సలిపి, వ్యాపారం ద్వారా రెండు వస్తువులను ఒక దానికొకటి పరస్పరం మార్పిడి చేసుకొనటం రెండు దేశాలలో లాభదాయకము.

పట్టిక 1.2

వ్యాపారం వలన లాభాలు

| దేశము | వ్యాపారానికి ముందు ఉత్పత్తి | | వ్యాపారానికి తర్వాత ఉత్పత్తి | | వ్యాపారం వలన లాభము | |
|---|---|---|---|---|---|---|
| | X | Y | X | Y | X | Y |
| A | 5 | 20 | - | 40 | -5 | +20 |
| B | 15 | 10 | 30 | - | +15 | -10 |
| మొత్తము ఉత్పత్తి | 20 | 30 | 30 | 40 | +10 | +10 |

యీ ఉదాహరణలో, వ్యాపారానికి ముందు, ఒక శ్రామిక యూనిటు వలన 25 యూనిట్ల X వస్తువుకాని, 25 యూనిట్ల Y వస్తువుకాని రెండు దేశాలు ఉత్పత్తి చేస్తున్నాయి. A కనుక Y వస్తూత్పత్తిలో ప్రత్యేకీకరణ సలిపితే, రెండు యూనిట్ల శ్రమ వలన 40 యూనిట్ల Y వస్తువు ఉత్పత్తి చెయ్యగలుగుతుంది. అదే విధంగా B దేశము X వస్తువుత్పత్తిలో ప్రత్యేకీకరణ సలిపితే, 30 యూనిట్ల X వస్తుత్పత్తి చెయ్యగలుగుతుంది. వ్యాపారం వలన రెండు దేశాలలో ఉండే ఉమ్మడి లాభాలు 10 యూనిట్ల X వస్తువు, 10 యూనిట్ల Y వస్తువు.

సంపూర్ణ అనుకూలత సూత్రాన్ననుసరించి, ప్రత్యేకీకరణ వలన, వనరులు సమర్థవంతంగా వినియోగింపబడి, ప్రపంచ ఉత్పత్తి పెరుగుతుంది. పెరిగిన ఉత్పత్తి, వ్యాపారం ద్వారా రెండు దేశాల మధ్య పంపిణీ అవుతుంది. పై ఉదాహరణ ద్వారా, మనము దీనిని గ్రహించవచ్చు.

కాని స్మిత్ సిద్ధాంతములో స్పష్టత కొరవడిందని విమర్శ. స్మిత్ ప్రకారము అంతర్జాతీయ వ్యాపారానికి, ఎగుమతిదారునికి సంపూర్ణ అనుకూలత ఉండాలి. ఉన్న ఉత్పత్తి కారకాలతో, ప్రత్యర్థి కన్నా ఎక్కువ పరిమాణములో వస్తువునుత్పత్తి చెయ్యవలె. కాని వ్యాపారానికి, యీ రకమైన ప్రాతిపదిక వాస్తవానికి దూరం. ఉదాహరణకు కొన్ని అభివృద్ధి చెందిన దేశాలకు, ఏ వస్తువుత్పత్తిలోనూ సంపూర్ణ అనుకూలత ఉండదు. అందువలన అవి వ్యాపారంలో పాల్గొనడానికి వీలులేదా ? అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. అంతేగాక, ఆ పరిస్థితిలో, ఏ దేశము ఏ వస్తువునుత్పత్తి చెయ్యవలె ? ఏ వస్తువును దిగుమతి చేసుకోవాలి ? అనే ప్రశ్నలు కూడా తలెత్తుతాయి. అంతర్జాతీయ వ్యాపారంలో ప్రవేశించడానికి, ఆ వస్తువులు ఎట్లా అర్హతను సంపాదిస్తాయో చెప్పవలసి వుంటుంది. స్మిత్ ప్రతిపాదించిన సంపూర్ణ అనుకూలత సూత్రం, యీ ప్రశ్నలకు సమాధానం చెప్పలేదు.

యీ ప్రశ్నలకు సమాధానం చెప్పగలిగే విధంగా డేవిడ్ రికార్డో ఒక సూత్రాన్ని ప్రతిపాదించాడు. అదే తులనాత్మక వ్యయ సిద్ధాంతము. ఆ సిద్ధాంతాన్ని యిపుడు పరిశీలిద్దాము. స్మిత్‌ననుసరించి, వ్యాపారం ఉభయ దేశాలకు లాభసాటిగా ఉండాలంటే, ప్రతి దేశము కనీసం ఒక వస్తువునైనా కనిష్ఠ వ్యయంతో ఉత్పత్తి చేసి ఎగుమతి చెయ్యగలగాలి. కాని, ఒక దేశము తన ప్రత్యర్థి దేశము కన్నా, అన్ని వస్తువుల ఉత్పత్తిలోను, సామర్థ్యము కలిగి ఉండి ఏం చెయ్యాలి ? స్మిత్ సిద్ధాంతము దీనికి సమాధానమివ్వలేదు. డేవిడ్ రికార్డో (1772-1823) తన సిద్ధాంతము ద్వారా, ఒక దేశము అన్ని వస్తువుల ఉత్పత్తి లోనూ, సంపూర్ణ సామర్థ్యము కలిగి ఉన్నా, పరస్పర లాభసాటిగా వ్యాపారానికి అవకాశం ఉందని నిరూపించాడు. దీనినే తులనాత్మక అనుకూలత (Comparative Advantage) సిద్ధాంతమనిగూడా అంటారు.

## 1.7. రికార్డో తులనాత్మక వ్యయ సిద్ధాంతము (Ricardo's Theory of Comparative Costs) :

1817లో ప్రచురితమైన "Principles of Political Economy and Taxation" అనే గ్రంథంలో రికార్డో యీ తులనాత్మక వ్యయ సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. అంతర్జాతీయ వ్యాపార సిద్ధాంతాలలో ఇది చాలా ముఖ్యమైనది. సాంప్రదాయిక వ్యాపార సిద్ధాంతానికి యిది మూల స్తంభము. యీ సూత్రాన్ని ముందుగా రాబర్ట్ టొరెన్స్ (Robert Torrons) ప్రతిపాదించారని ఒక అభిప్రాయము ఉంది. కానీ, యీ సూత్రము రికార్డో పేరులోనే ముడిపడివుంది. రికార్డో తులనాత్మక వ్యయ సిద్ధాంతము యీ క్రింది ప్రమేయాలపై ఆధారపడి వుంది.

### 1.7.1 ప్రమేయాలు :

1. రెండు దేశాలున్నాయి.
2. అవి రెండే వస్తువులనుత్పత్తి చేస్తాయి
3. ఈ రెండు వస్తువులను, ఒకే ఉత్పత్తి కారకము - శ్రమతో ఉత్పత్తి చేస్తారు
4. శ్రమ దేశీయంగా పూర్తి గమనశీలత కలిగి ఉంటుంది. అంతర్జాతీయంగా గమనశీలత ఉండదు
5. శ్రమ సప్లయ్ స్థిరంగా ఉంటుంది.
6. శ్రమ యూనిట్లన్నీ సజాతీయాలు
7. సాంకేతిక విజ్ఞానము స్థిరంగా ఉంటుంది.
8. రెండు దేశాలలోనూ, ప్రజల అభిరుచులు ఒకే రకంగా ఉంటాయి.
9. వస్తువుల ధరలు శ్రామిక వ్యయాన్ని బట్టి నిర్ణయింపబడతాయి.
10. వస్తువుల ఉత్పత్తిలో స్థిర ప్రతిఫలాలుంటాయి.
11. దేశాల మధ్య స్వేచ్ఛా వ్యాపారం ఉంటుంది. వ్యాపారంపై ప్రభుత్వ ఆంక్షలేవీ ఉండవు.

12. రవాణా వ్యయాలుండవు

13. రెండు దేశాలలోనూ సంపూర్ణ ఉద్యోగిత

14. దేశీయంగాను, అంతర్జాతీయంగాను మార్కెట్లలో సంపూర్ణమైన పోటీ ఉంటుంది.

ఈ ప్రమేయాలాధారంగా ఒక దేశానికి రెండు వస్తువుల ఉత్పత్తిలోనూ సంపూర్ణ అనుకూలత ఉన్నా, ఒక వస్తువుత్పత్తిలో తులనాత్మక అనుకూలత ఉంటే వ్యాపారానికి అవకాశం ఉంది. ఇదే విషయాన్ని రికార్డో పోర్చుగల్, ఇంగ్లాండ్ దేశాల ఉదాహరణతో వివరించాడు.

## 1.7.2. వివరణ :

పట్టిక 1.3

| దేశము | ద్రాక్ష సారా (Wine) | వస్త్రాలు (Clothes) |
|---|---|---|
| ఇంగ్లాండ్ | 120 | 100 |
| పోర్చుగల్ | 80 | 90 |

పై పట్టికలో రెండు దేశాలలోను 1 యూనిట్ వస్తువుమత్పత్తి చేయడానికి కావలసిన శ్రామికులు (ఒక సంవత్సర కాలానికి) సంఖ్య యివ్వబడింది. ఇంగ్లాండ్‌లో ఒక యూనిట్ ద్రాక్షసారా ఉత్పత్తి చేయడానికి సంవత్సరానికి 120 మంది శ్రామికులవసరం. కాని 1 యూనిట్ వస్త్రాన్ని ఉత్పత్తి చేయడానికి 100 మంది శ్రామికులు మాత్రమే కావాలి. పోర్చుగల్‌లో 1 యూనిట్ ద్రాక్షసారాను ఉత్పత్తి చేయడానికి 80 మంది శ్రామికులు, 1 యూనిట్ వస్త్ర ఉత్పత్తికి 90 మంది శ్రామికులు అవసరం. దీనివి బట్టి ఇంగ్లాండ్ రెండు వస్తువుల ఉత్పత్తిలోనూ, ఎక్కువ మంది శ్రామికులనుపయోగిస్తున్నది. రెండు వస్తువుల ఉత్పత్తిలోనూ పోర్చుగల్ ఉత్పత్తి వ్యయము (శ్రమ వ్యయము) తక్కువగానే ఉంది. అంటే రెండు వస్తువుల ఉత్పత్తిలోనూ, పోర్చుగల్‌లో శ్రామికుల సామర్థ్యము (Efficiency) ఎక్కువగా ఉంది. అందువలన రెండు వస్తువుల ఉత్పత్తిలోనూ, పోర్చుగల్ సంపూర్ణ అనుకూలత ఉంది. కాని ఆ దేశానికి, ద్రాక్ష సారా ఉత్పత్తిలో తులనాత్మక అనుకూలత (Compaiative Advantage) ఉంది. మరొక విధంగా చెప్పాలంటే, రెండు వస్తువుల ఉత్పత్తిలోనూ ఇంగ్లాండ్‌కి అనుకూలత (Disadvantage) ఉంది. కాని ఆ అనుకూలత, ద్రాక్షసారా ఉత్పత్తిలోకన్నా వస్త్రాల ఉత్పత్తిలో తక్కువగా ఉంది. అంటే ఇంగ్లాండ్‌కు వస్త్రాల ఉత్పత్తిలో తులనాత్మక అనుకూలత ఉందని చెప్పవచ్చు.

ఇంగ్లాండ్‌లో వస్త్రాల ఉత్పత్తి వ్యయము (100 / 90) ద్రాక్షసారా ఉత్పత్తి వ్యయము (120/80) కన్నా తక్కువగా ఉంది. అదే విధంగా పోర్చుగల్‌లో ద్రాక్షసారా ఉత్పత్తి వ్యయం (80/120), వస్త్రాల ఉత్పత్తి వ్యయము (90/100) కన్నా తక్కువగా ఉంది. ఈ పరిస్థితులలో పోర్చుగల్ ద్రాక్షసారా ఉత్పత్తిలోనూ ఇంగ్లాండ్ వస్త్రాల ఉత్పత్తిలోనూ ప్రత్యేకీకరణ చేస్తాయి. పోర్చుగల్, ఇంగ్లాండ్ ద్రాక్షసారాలను ఎగుమతిచేసి వస్త్రాలను దిగుమతి చేసుకుంటుంది. ఇంగ్లాండ్ పోర్చుగల్‌కు వస్త్రాలను ఎగుమతి చేసి ద్రాక్షసారాను దిగుమతి చేసుకుంటుంది. ఈ విధమైన వ్యాపారం వలన ఉభయ దేశాలు లాభపడతాయి.

పై విశ్లేషణను బట్టి ఒక దేశానికి ఏ వస్తువు ఉత్పత్తిలో తులనాత్మక అనుకూలత ఎక్కువగా ఉంటుందో, ఆ వస్తువునుత్పత్తి చేస్తుందని తేలింది. రెండో దేశానికి ఏ వస్తువు ఉత్పత్తిలో అననుకూలత, తులనాత్మకంగా తక్కువగా ఉంటుందో ఆ వస్తువును ఉత్పత్తి చేస్తుందని చెప్పవచ్చు.

పై ఉదాహరణలో పోర్చుగల్‌కు ద్రాక్ష సారా ఉత్పత్తిలో తులనాత్మక అననుకూలత ఉంది. ఇంగ్లాండ్‌కి వస్త్రాల ఉత్పత్తిలో సంపూర్ణమైన అననుకూలత లేకపోయినప్పటికీ, తులనాత్మక అనుకూలత ఉంది. ఆ రెండు దేశాల మధ్య వ్యాపారం జరిగితే రెండు దేశాలు లాభం పొందుతాయి. దీనినే తులనాత్మక వ్యయ సిద్ధాంతం అంటారు.

ఈ ఉదాహరణలో లాభం ఏ మేరకు ఉంటుందో పరిశీలిద్దాము. రికార్డో, యీ వస్తు మార్పిడి ఏ నిష్పత్తిలో జరిగేదీ, రెండు దేశాలు ఏ మేరకు వ్యాపారం వలన లాభపడేదీ చర్చించలేదు. కాని మనము యీ విషయాలు పరిశీలిద్దాము.

వ్యాపారం లేనపుడు, దేశీయంగా (With each country) రెండు వస్తువుల వినిమయ నిష్పత్తి యీ క్రింది పట్టికలో చూడవచ్చు.

పట్టిక 1.4

దేశీయ వినమయ నిష్పత్తులు (Domestic Exchange Rates)

| ఇంగ్లాండ్ | పోర్చుగల్ |
|---|---|
| ద్రాక్షసారా 120 : వస్త్రాలు 100 (6/5) | ద్రాక్షసారా 80 : 90 వస్త్రాలు (8/9) |
| 1 : 1.12 | 1 : 0.89 |
| వస్త్రాలు 100 : ద్రాక్షసారా 120 (5/6) | వస్త్రాలు 90 : 80 ద్రాక్షసారా (9/8) |
| 1 : 0.83 | 1 : 1.13 |

ఇంగ్లాండ్‌లో 1 యూనిట్ ద్రాక్షసారా ఉత్పత్తికి 120 మంది శ్రామికులవసరం, 1 యూనిట్ వస్త్రాల ఉత్పత్తికి 100 మంది శ్రామికులవసరం. అందువలన ఇంగ్లాండ్‌లో 1 యూనిట్ ద్రాక్షసారా, 1.2 యూనిట్ల వస్త్రాలతో వినిమయం జరుగుతుంది. పోర్చుగల్‌లో 1 యూనిట్ ద్రాక్షసారా ఉత్పత్తికి 80 మంది శ్రామికులవసరం, 1 యూనిట్ వస్త్రాల ఉత్పత్తికి 90 మంది శ్రామికులవసరం. వస్త్రాల ఉత్పత్తి వ్యయం, (ద్రాక్షసారా) ఉత్పత్తి వ్యయం కన్నా ఎక్కువ. అందువలన 1 యూనిట్ ద్రాక్షసారా పోర్చుగల్‌లో 0.89 యూనిట్ల వస్త్రాలకు వినిమయం జరుగుతుంది.

ఇప్పుడు రెండు దేశాల మధ్య వ్యాపారం జరిగిందనుకొందాము. ఇంగ్లాండ్, పోర్చుగల్ నుండి, 1.2 యూనిట్ల వస్త్రాల కన్నా తక్కువకు, 1 యూనిట్ ద్రాక్షసారాను దిగుమతి చేసుకోగలిగితే లాభపడుతుంది. అదే విధంగా పోర్చుగల్ 1 యూనిట్ ద్రాక్షసారా యిచ్చి, 0.89 యూనిట్ల కన్నా ఎక్కువ వస్త్రాలు దిగుమతి చేసుకోగలిగితే లాభం పొందుతుంది.

దేశీయంగా ఇంగ్లాండ్‌లో వినిమయ నిష్పత్తి, 1 యూనిట్ వస్త్రాలు = 0.8 యూనిట్ల ద్రాక్షసారా

దేశీయంగా పోర్చుగల్‌లో వినిమయ నిష్పత్తి, 1 యూనిట్ ద్రాక్షసారా = 0.89 యూనిట్ల వస్త్రాలు

యీ రెండు దేశాలు వ్యాపారంలో పాల్గొనేటపుడు వస్తు వినిమయ నిష్పత్తి 1 : 1 అనుకొంటారు. అంటే 1 యూనిట్ వస్త్రానికి, 1 యూనిట్ ద్రాక్షసారా లభ్యమవుతుంది. యీ పరిస్థితులలో ఇంగ్లాండ్ 1 యూనిట్ వస్త్రానికి (1 - 0.83) = 0.17 యూనిట్ల ద్రాక్షసారా అదనంగా పొందుతుంది. అదే విధంగా పోర్చుగల్ 1 యూనిట్ ద్రాక్షసారాను ఇంగ్లాండ్‌కు ఎగుమతిచేసి, (1 - 0.89) = 0.11 యూనిట్ల వస్త్రాన్ని అదనంగా పొదుతుంది. యీ విధంగా వ్యాపారం, ఉభయ దేశాలకు లాభసాటిగా ఉంటుంది.

కాబట్టి, తులనాత్మక వ్యయ సిద్ధాంతాననుసరించి ఇంగ్లాండ్, పోర్చుగల్ ఒక వస్తువుత్పత్తిలోనే ప్రత్యేకీకరణ సలుపుతాయి. పైన ఉదాహరణలో ఇంగ్లాండ్ వస్త్రాల ఉత్పత్తిలో, పోర్చుగల్ ద్రాక్షసారా ఉత్పత్తిలోను ప్రత్యేకీకరణ జరుపుతాయి. ఉత్పత్తి కారకాలను తదనుగుణంగా కేటాయించి, తులనాత్మక అనుకూలత ఉన్న వస్తువును ఎగుమతిచేసి, తులనాత్మక అననుకూలత ఉన్న వస్తువును దిగుమతి చేసుకొంటాయి. వ్యాపారం వలన, రెండు దేశాలు లాభపడతాయి. రెండు వస్తువుల వినియోగము పెరుగుతుంది.

రికార్డో, రెండు దేశాలు, రెండు వస్తువులు, ఒక ఉత్పత్తి కారకము, (శ్రమ) పరిధిలో తన విశ్లేషణ కొనసాగించాడు. ఈ ఒక ఉత్పత్తి కారకుడు, ఒక దేశములోకన్నా, ఇంకొక దేశములో ఎక్కువ సామర్థ్యము కలిగి ఉంటుందని అతని విశ్లేషణలో ఆధారము.

**1.7.3. విమర్శలు :** రికార్డో ప్రతిపాదించిన తులనాత్మక వ్యయ సిద్ధాంతం మొదటి ప్రపంచ యుద్ధకాలం వరకు, చాలా ప్రాచుర్యంలో ఉంది. సుమారు ఒక శతాబ్ద కాలం అంతర్జాతీయ వ్యాపారానికి ప్రతిపాదిక అయింది. సాంప్రదాయక వ్యాపార సిద్ధాంతానికి మూల

స్తంభమైన యీ సిద్ధాంతము అనేక తీవ్ర విమర్శలకు గురి అయింది. ముఖ్యంగా, బెర్టిల్ ఓహ్లిన్, ఫ్రాంక్ గ్రాహమ్ యీ సిద్ధాంతాన్ని అనేక అంశాలపై తీవ్రంగా విమర్శించారు. వాటిలో కొన్ని ముఖ్యమైన విమర్శలను పరిశీలిద్దాము. ఇది చాలా సంక్షిప్తీకరింపబడిన సిద్ధాంతమనీ, అవాస్తవికమనీ (Unrealistic) గా ఉందని విమర్శ.

నిశ్చల సిద్ధాంతం (Static Theory) : తులనాత్మక వ్యయ సిద్ధాంతము నిశ్చల ప్రమేయాల పై ఆధారపడినదని ఒక విమర్శ. ముఖ్యంగా, ఉత్పత్తి కారకాల పరిమాణాలు స్థిరంగా ఉంటాయని ప్రమేయం. ఇది వాస్తవ దూరము. చలన ప్రపంచంలో ఉత్పత్తి కారకాల సప్లయ్‌లలో అనేక మార్పులు ఉంటాయి. యీ మార్పులన్నీ, అంతర్జాతీయ వ్యాపారంపై ప్రభావం చూపిస్తాయి. అందువలన క్రొత్తరకపు విశ్లేషణ అవసరమని ఎల్స్‌వర్త్ (Ellswoth) భావించారు.

1) శ్రమ విలువ సిద్ధాంతము : శ్రమ విలువ సిద్ధాంత ప్రమేయము. ముఖ్యముగా, అది తీవ్ర విమర్శలకు గురి అయింది. తులనాత్మక వ్యయ సిద్ధాంతపు ప్రమేయాలలో యిది ముఖ్యమైనది. ఉత్పత్తి వ్యయాల గణనలో శ్రమ వ్యయాలనే పరిగణించి, శ్రమేతర ఉత్పత్తిలో వ్యయాలను, యీ సిద్ధాంతం పరిగణించదు. ఇది చాలా అవాస్తవికమని, ద్రవ్య వ్యయాలు వస్తు వినిమయ నిర్ణయక అంశాలని వాదన.

శ్రమ విలువ సిద్ధాంతము, శ్రమ సజాతీయమనే ప్రమేయంపై ఆధారపడింది. ఇది కూడా అవాస్తవికము. శ్రమ నైపుణ్యతలలో తేడాలుంటాయి.

అంతేకాక, పోటీలేని శ్రామిక వర్గాలు (Non - Competing groups of labour) వుంటాయని మనము గుర్తించాలి. దీని వలన శ్రమ సజాతీయం కాదనీ, అందువలన వేతనాలు అన్నీ పరిశ్రమలలోనూ ఒకే విధంగా ఉండవనీ, దేశీయంగా వస్తు వినిమయ నిష్పత్తి, శ్రమ నిష్పత్తికనుపాతంలో ఉందనీ, టౌసిగ్ (Taussig) వాదించాడు. అంతర్జాతీయ వ్యాపారంలో కూడా ఇది నిజమనీ, అందువలన శ్రమ విలువ సిద్ధాంతంపై ఆధారపడిన తులనాత్మక వ్యయ సిద్ధాంతం, వ్యాపారానికి తగు వివరణ యివ్వలేదని విమర్శ.

2) డిమాండ్ విషయాల నిర్లక్ష్యం : ఈ సిద్ధాంతము సప్లయ్ అంశాలమీదనే కేంద్రీకృతమైనదనీ, డిమాండ్ పరిస్థితులను ఏ మాత్రమూ పరిగణించలేదనీ, అందువలన, అసంపూర్ణము (Incomplete) అని విమర్శ. సాంప్రదాయ వాదులు, వ్యయాలు స్థిరంగా ఉంటాయని భావించారు. ఈ ప్రమేయము వలన, వారు డిమాండ్ అంశాలను నిర్లక్ష్యం చేసారు. అంతర్జాతీయ ధరలు, వ్యయాలలో తేడాలను, సప్లయ్ అంశాల పరిస్థితులను బట్టి వివరించకలిగారు. ఉత్పాదనలో, యూనిట్ వ్యయాలు మారకపోతే, డిమాండ్ ఎంత వస్తువు ఉత్పత్తి చేయబడేదీ నిర్ణయిస్తుంది కానీ ఎక్కడ ఉత్పత్తి చెయ్యాలి అనేది నిర్ణయించదు. అనగా డిమాండ్, ధరను ప్రభావితం చేయదు. ఉత్పత్తిలో సంబంధం లేకుండా స్థిరంగా ఉంటుంది.

కానీ యూనిట్ వ్యయాలు ఉత్పత్తి స్థాయిని బట్టి మారతాయి. ఉత్పత్తి పెరిగినపుడు అవి పెరగవచ్చు. లేదా తగ్గవచ్చు. అప్పుడు, ఒక వస్తువు ధర, వ్యయము దాని సప్లయ్ పరిస్థితులపైననేగాక, డిమాండ్ పరిస్థితులపై గూడా ఆధారపడతాయి. పెరుగుతున్న వ్యయం పరిస్థితులలో (Increasing cost coalition) దిగుమతులతో పోటీ పడగల వస్తువును ఉత్పత్తి చెయ్యాలా ? వద్దా ? చేస్తే ఎంత పరిమాణములో ఉత్పత్తి చెయ్యాలి ? అనే అంశాలు దేశీయ, విదేశీ డిమాండ్లపై ఆధారపడి ఉంటుంది.

3) రెండు దేశాలు, రెండు వస్తువుల నమూనా : రికార్డో సిద్ధాంతము, రెండు దేశాల మధ్య, రెండు వస్తువుల వ్యాపారాన్ని గూర్చి సూత్రీకరించింది. కానీ, అనేక దేశాలు, అనేక వస్తువుల వ్యాపారంలో పాల్గొంటాయి. ఆ పరిస్థితులలో యీ సిద్ధాంతం వర్తించదు, ఉపయోగపడదు. ఇది అవాస్తవికము. వాస్తవ ప్రపంచంలో అనేక వస్తువులలో అంతర్జాతీయ వ్యాపారము జరుగుతుంది.

4) స్వేచ్ఛా వ్యాపారము (Force Trade) : ఈ సిద్ధాంతము, స్వేచ్ఛా వ్యాపార ప్రమేయంపై ఆధారపడినది. వాస్తవ ప్రపంచంలో, అంతర్జాతీయ వ్యాపారము, స్వేచ్ఛగా జరగదు. ప్రతి దేశము, కొన్ని వస్తువుల ఎగుమతుల, దిగుమతులపై వివిధ రకాల ఆంక్షలను విధిస్తుంది. టారిఫ్‌లు, కోటాలు, యితర ఆంక్షలు ప్రపంచంలో ఎగుమతులను, దిగుమతులను ప్రభావితం చేస్తాయి. వీటిని విస్మరించడం వలన యీ సిద్ధాంతము వాస్తవ పరిస్థితులలో వ్యాపారం ఎలా జరిగేదీ వివరించలేదు.

5) రవాణా వ్యయాలు : తులనాత్మక అనుకూలత పరిశీలనలో రికార్డో రవాణా వ్యయాలను పరిగణనలోకి తీసుకొనలేదు. రవాణా వ్యయాలుండవని ప్రమేయము. ఇది చాలా అవాస్తవికము. రవాణా వ్యయాలు, అంతర్జాతీయ వ్యాపార సరళిని నిర్ణయిస్తాయి. రవాణా వ్యయాలు అధికంగా ఉంటూ, తులనాత్మక అనుకూలత తగ్గుతుంది. అందువలన అంతర్జాతీయ వ్యాపారం వల్ల వచ్చే లాభాలు గూడా గణనీయంగా తగ్గుతాయి.

6) అసంపూర్ణ సిద్ధాంతము (Incomplete Theory) : అంతర్జాతీయ వ్యాపారం వలన, రెండు దేశాలు ఏ విధంగా లాభం పొందుతాయో, తులనాత్మక వ్యయ సిద్ధాంతం వివరిస్తుంది. కాని, యీ లాభాలు రెండు దేశాల మధ్య, ఎలా పంపిణీ అవుతాయో, యీ సిద్ధాంతము చెప్పలేదు. అందువలన యీ సిద్ధాంతము అసంపూర్ణమని విమర్శ.

పైన చెప్పిన విమర్శలు, అభ్యంతరాలు ఉన్నా, యీ సిద్ధాంతము యిప్పటికే ముఖ్యమైన అంతర్జాతీయ వ్యాపార సిద్ధాంతము. కాల పరీక్షకు నిలబడినది. శామ్యూల్సన్ అభిప్రాయంలో "సులభతరమైన సిద్ధాంతములో ఒక నిజం ఉంది. ఏ దేశమైనా దీనిని నిర్లక్ష్యం చేస్తే, జీవన ప్రమాణాలు మరియు సంచార వ్యయ వృద్ధి రేట్ల విషయంలో భారీ మూల్యాన్ని చెల్లించవలసి వస్తుంది".

**1.7.4. సాంఖ్యిక పరిక్షలు (Emprical Tests) :** రికార్డో సిద్ధాంతాన్ని, సాంఖ్యిక పరిక్షల ద్వారా అధ్యయనం చేయడం జరిగింది. అటువంటి సాంఖ్యిక పరిక్షల ఫలితాలను ఇపుడు పరిశీలిద్దాము.

రికార్డో నమూనా యొక్క మొదటి సాంఖ్యిక పరీక్ష బ్రిటీష్ ఆర్థికవేత్త జి.డి.ఎ. మెగ్డోగల్ (G.D.A. McDougall) 1951 లో చేసిన అధ్యయనము. 1937 సంవత్సరానికి అమెరికా, బ్రిటన్ దేశాలలోని 25 పరిశ్రమల శ్రామిక ఉత్పాదకతను, ఎగుమతి రీతులను పరిశీలించారు. శ్రామిక ఉత్పాదకత ఎక్కువగా వున్న వస్తువులనే ఒక దేశము ఎగుమతి చేస్తుందనే రికార్డో అభిప్రాయాన్ని మెగ్డోగర్ పరీక్షించాడు. అతను అధ్యయనం చేసిన ప్రతి పరిశ్రమలోనూ, అమెరికన్ శ్రామికుల ఉత్పాదకత, బ్రిటిష్ శ్రామికుల ఉత్పాదకత కన్నా ఎక్కువగా ఉంది. అనగా అమెరికాకు ఆయా పరిశ్రమలలో సంపూర్ణ అనుకూలత ఉంది. కాని అమెరికాలో వేతనపు రేటు, బ్రిటిష్ వేతనపు రేటుకు రెండు రెట్లు అధికంగా ఉంది. అందువలన అమెరికాకు సంపూర్ణ వ్యయ అనుకూలత ఉంది. కాని, కొన్ని పరిశ్రమలలో, అమెరికాకు తులనాత్మక అనుకూలత ఉంది. అందువలన బ్రిటన్ కన్నా చౌకగా యీ వస్తువులను మూడో దేశాలనికి అమ్మగలదు. అదే విధంగా బ్రిటిష్ శ్రామికుల ఉత్పాదకత, అమెరికన్ శ్రామికుల ఉత్పాదకత కాన్న,సంగం కంటే ఎక్కువ వున్న పరిశ్రమలలో, బ్రటిన్‌కు తులనాత్మక అనుకూలత ఉంది. యీ వస్తువులను, బ్రిటన్ అమెరికా కంటే చౌకగా మూడో దేశానికి అమ్మగలదు. ఈ అధ్యయన ఫలితాలు, శ్రామిక ఉత్పాదకతకు, ఎగుమతులకు మధ్య ధనాత్మక సహ సంబంధముందని (Positive Coordination) చెప్పాయి. 20 పరిశ్రమలలో అమెరికన్ శ్రామిక ఉత్పాదకత ఎక్కువగా ఉంది. వాటి ఎగుమతులు కూడా బ్రిటన్ వాటి కన్నా ఎక్కువగా ఉన్నాయి. ఈ విధంగా మెగ్డోగల్ అధ్యయనం రికార్డో సిద్ధాంతాన్ని బలపరచింది.

వివిధ దత్తాంశాల (Data) ద్వారా, బెలాసా (Belasa) స్టెర్న్ (Stern) చేసిన అధ్యయనాలు కూడా రికార్డో సిద్ధాంతానికి అనుకూలంగా ఉన్న ఫలితాలనిచ్చాయి.

తాజా అధ్యయనం కూడా రికార్డో సిద్ధాంతానికి అనుకూలంగానే ఉంది. 1990 దత్తాంశములో, స్టీఫెన్ గొలబ్ (Stephen Golub) శ్రామిక యూనిట్ వ్యయానికి, ఎగుమతులకు మధ్య గల సంబంధాన్ని అధ్యయనం చేసారు. అమెరికా కొన్ని దేశాలకు బ్రిటన్, జపాన్, జర్మనీ, కెనడా ఆస్ట్రేలియాలకు చేసే ఎగుమతుల తీరును పరిశీలించారు. సాపేక్ష శ్రామిక యూనిట్ వ్యయం ఎక్కువ ఉంటూ, అమెరికా ఎగుమతులు మిగతా దేశాలకు తక్కువగా ఉన్నాయి. ముఖ్యంగా, అమెరికా - జపాన్ దేశాల మధ్య వ్యాపారం, శ్రామిక వ్యయానికి, ఎగుమతులకు మధ్య దృఢ సంబంధాన్ని సూచించింది. తద్వారా రికార్డో సిద్ధాంతాన్ని యీ తాజా అధ్యయనం గూడా గట్టిగా బలపరచింది.

మనుము పై ఉటంకించిన సాంఖ్యిక పరీక్షలో రికార్డో సిద్ధాంతాన్ని బలపరచేదిగా ఉన్నాయి. అంటే రెండు దేశాల మధ్య వ్యాపారము, ఆయా దేశాలలోని వివిధ పరిశ్రమలలోని శ్రామిక ఉత్పాదకతలపై ఆధారపడి ఉంటుంది. మిగతా అంశాలు అంటూ శ్రమ ఉత్పత్తి వ్యయాలు, డిమాండ్ అంశాలు, రాజకీయ సంబంధాలు, వివిధ వ్యాపార ఆంక్షలు మొదలైనవి ఎగుమతులకూ, శ్రామిక ఉత్పాదకతకు మధ్య గల సంబంధాన్ని (రికార్డో చెప్పిన దానిని) ఛేదించలేకపోయాయి.

**1.7.5. తులనాత్మక వ్యయ సిద్ధాంతము : అభివృద్ధి చెందుతున్న దేశాలు :** మనము ఇంత వరకు తులనాత్మక వ్యయ సిద్ధాంతము దానిపైన వచ్చిన విమర్శలను పరిశీలించారు. ఇప్పుడు యీ సిద్ధాంతము అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఎంతవరకూ వర్తిస్తుంది అనే అంశాన్ని పరిశీలిద్దాము. సాంప్రదాయిక వ్యాపార సిద్ధాంతము, అంతర్జాతీయ శ్రమ విభజనపైన, తులనాత్మక అనుకూలత సూత్రముపైన ఆధారపడినది. స్థూలంగా పరిశీలిస్తే, యీ సిద్ధాంతము అభివృద్ధి చెందుతున్న దేశాలకు వర్తించదని చెప్పవచ్చు. యీ సిద్ధాంతపు ప్రమేయాలే దీనికి కారణమని చెప్పవచ్చు. ముఖ్యమైన ప్రమేయాలు, అభివృద్ధి చెందుతున్న దేశాలకు వర్తించవు. యీ సందర్భంగా, ఆ ముఖ్య ప్రమేయాలను పునరావృతం చేసుకుందాము.

1. ఉత్పత్తి కారకాలు, గుణాత్మకంగాను, పరిమాణాత్మకంగాను స్థిరంగా ఉంటాయి.
2. ఉత్పత్తి కారకాల సంపూర్ణ ఉద్యోగిత
3. దేశీయంగా ఉత్పత్తి కారకాల పూర్తి గమనశీలత, అంతర్జాతీయంగా గమనశీలత ఉండదు.
4. ఉత్పత్తి పద్ధతి స్థిరంగా ఉంటుంది.
5. వినియోగదారుల అభిరుచులలో మార్పులుండవు.
6. సంపూర్ణమైన పోటీ
7. ప్రభుత్వ జోక్యము ఉండదు.

అభివృద్ధి చెందుతున్న దేశాలలోగల పరిస్థితులను పరిశీలిస్తే, యీ ప్రమేయాలు ఎంత వరకూ వర్తిస్తాయని అనుమానించవలసి వస్తుంది.

1. మొదటి ప్రమేయము అవాస్తవికము-వాస్తవానికి, ఉత్పత్తి కారకాల పరిమాణము మార్పు చెందవచ్చు. వాటిలో గుణాత్మక మార్పులు రావచ్చు. అభివృద్ధి చెందుతున్న దేశాలలో, మానవ, భౌతిక వనరులు త్వరితగతిని అభివృద్ధి చెందుతున్నాయి. విద్యారంగం అభివృద్ధి చెందటంతో, శ్రామికుల నైపుణ్యతలలో మార్పులు వస్తున్నాయి. మూలధన సంచయనం వలన, భౌతిక వనరులు కూడా అభివృద్ధి చెందుతున్నాయి. ఈ మార్పులు సంభవిస్తున్నా, అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే, యీ దేశాలకు తులనాత్మక అననుకూలత ఉన్నది. దీనికి కారణము అభివృద్ధి చెందుతున్న దేశాలు ప్రాథమిక ఉత్పత్తులను, అభివృద్ధి చెందిన దేశాలు పారిశ్రామిక ఉత్పత్తులను ఉత్పత్తి చెయ్యడమే. యీ దేశాల మధ్య, స్వేచ్ఛా వ్యాపారం వలన, అభివృద్ధి చెందిన దేశాలు ఎక్కువగా లాభపడతాయి. ప్రాథమిక ఉత్పత్తుల ధరలు, పారిశ్రామిక ఉత్పత్తుల ధరలతో పోలిస్తే తక్కువగా ఉండడం, అంతర్జాతీయ మార్కెట్లలో వీటి డిమాండ్ అవ్యాకోచంగా ఉండడం దీనికి కారణము. స్వేచ్ఛా వ్యాపారం వలన, అభివృద్ధి చెందుతున్న దేశాలు ఎక్కువగా నష్టపోవడానికి అవకాశం ఉంది. అందువలన ఆ దేశాలు ఎప్పుడూ పేద దేశాలుగానే ఉండిపోవచ్చు.

2. అభివృద్ధి చెందుతున్న దేశాలలో, నిరుద్యోగిత ముఖ్యంగా ప్రచ్ఛన్న నిరుద్యోగిత ఎక్కువగా ఉంటుంది. అందువలన, సంపూర్ణ ఉద్యోగిత ప్రమేయము వర్తించదు. సాంప్రదాయ సిద్ధాంతము ననుసరించి, ఒక దేశము వ్యాపారంలో పాల్గొనేటప్పుడు, దిగుమతి చేసుకునే వస్తూత్పత్తిని తగ్గించి, ఎగుమతిని చెయ్యదలచుకునే వస్తూత్పత్తిని పెంచుతుంది. సంపూర్ణ ఉద్యోగిత వలన వనరులను ఎగుమతి చెయ్యదలచే వస్తూత్పత్తికి బదలాయిస్తుంది. కాని అభివృద్ధి చెందుతున్న దేశాలలో, వనరుల నిరుద్యోగిత వలన, యీ విధంగా జరగదు.

3. ఉత్పత్తి కారకాల గమనశీలత ప్రమేయము గూడా అభివృద్ధి చెందుతున్న దేశాలకు వర్తించదు. ఈ దేశాలకు ఒక పరిశ్రమ నుండి వేరొక పరిశ్రమకు గానీ, ఒక ప్రాంతము నుండి వేరొక ప్రాంతానికి గానీ, ఉత్పత్తి కారకాలు పూర్తిగా, స్వేచ్ఛగా కదలవు. బహుళ జాతి సంస్థల వలన, మూలధనము, సాంకేతికత యీ దేశాలకు వస్తున్నాయి.

4. ఉత్పత్తి పద్ధతులు స్థిరంగా ఉంటాయన్న ప్రమేయము గూడా వర్తించదు. పరిశోధన, నవకల్పనల వలన యీ దేశాల ఎగుమతులు ప్రభావితమవుతున్నాయి. యీ దేశాలు కూడా పారిశ్రామిక వస్తూత్పత్తిలో నిమగ్నమై ఉన్నాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలు,

వ్యవసాయోత్పత్తుల నెగుమతి చేసి, పారిశ్రామికోత్పత్తులను దిగుమతి చేసుకునే స్థితి నుండి మార్పు చెందుతున్నాయి. యీ దేశాలు కూడా పారిశ్రామిక వస్తూత్పత్తికి ప్రాముఖ్యతనిచ్చి, వాటిని ఎగుమతి చెయ్యగలిగే పరిస్థితిలో ఉంటున్నాయి. సాంకేతికతలలో వచ్చిన మార్పుల వల్లనే యిది సాధ్యపడింది.

5. అభివృద్ధి చెందుతున్న దేశాలలో, వినియోగదారుల అభిరుచులు త్వరితగతిని మార్పు చెందుతున్నాయి. అందువలన అవి స్థిరంగా ఉంటాయన్న ప్రమేయం నిజం కాదు. ఆర్థిక వ్యవస్థ మార్పు చెందిన కొద్దీ, యీ దేశాలలో, వినియోగదారుల అభిరుచులలో మార్పులు వస్తాయి. యీ దేశాలలో బహుళజాతి సంస్థల విస్తరణ, వాటి కార్యకలాపాలు దీనికి కారణము.

6. ఈ సిద్ధాంతము సంపూర్ణమైన పోటీ ప్రమేయంపై ఆధారపడినది. కాని వాస్తవ ప్రపంచంలో, అంతర్జాతీయ మార్కెట్లలో ఏకస్వామ్య, పరిమిత స్వామ్య పోకడలు కనిపిస్తాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలు, అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడలేవు. వాటి బహుళ జాతి సంస్థలతో దీటుగాపోటీ చెయ్యలేవు. అందువలన పోటీ సంపూర్ణమైనదిగా ఉండదు.

7. సాంప్రదాయ సిద్ధాంతము అంతర్జాతీయ వ్యాపార సంబంధాలలో ప్రభుత్వ జోక్యముండదని భావించింది. కాని అభివృద్ధి చెందుతున్న దేశాలలో, చాలా దేశాలు వలస పాలన నుండి విముక్తి పొందినవే. అభివృద్ధి కొరకు,ఆ దేశాలు కొన్ని దేశీయ పరిశ్రమలకు రక్షణ కల్పించాలి. అందువలన అవి టారిఫ్‌లు, కోటాలు, సబ్సిడీలు మొదలైనవి చేపడుతున్నాయి. అభివృద్ధి చెందిన దేశాలు కూడా యిటీవల కాలంలో రక్షణ విధానాలవలంబిస్తున్నాయి. వివిధ రూపాలలో ప్రభుత్వ జోక్యము దాదాపు ప్రపంచ దేశాలన్నిటిలోను ఉంది.

కాబట్టి, అంతర్జాతీయ వ్యాపార రంగంలో వస్తున్న మార్పుల దృష్ట్యా, అభివృద్ధి చెందుతున్న దేశాలలోని ప్రత్యేక పరిస్థితులను బట్టి, సాంప్రదాయిక సిద్ధాంతము తులనాత్మక వ్యయ సిద్ధాంతము యీ దేశాలకు వర్తించదని చెప్పవచ్చు.

1.7.6. తులనాత్మక వ్యయ సిద్ధాంతము : మెరుగులు : సాంప్రదాయక తులనాత్మక వ్యయ సిద్ధాంతము పైన గమనించినట్లు, అనేక ప్రమేయాలపై ఆధారపడినది. వాస్తవ ప్రపంచం చాలా సంక్లిష్టమైనది. విషయాలు చాలా జటిలంగా ఉంటాయి. విశ్లేషణ సులభతరం చెయటానికి, యీ ప్రమేయాలను చేయడం జరిగింది. తర్వాత కాలంలో, యీ సిద్ధాంతపు ప్రమేయాలను కొన్నిటిని సడలించి, సవరించి రికార్డో సిద్ధాంతానికి, కొంతమంది ఆర్థిక వేత్తలు మెరుగులుదిద్దారు. తద్వారా సిద్ధాంతం, వాస్తవ ప్రపంచాన్ని ప్రతిబింబించేటట్లు చేసారు. వాటిలో కొన్నిటిని యిప్పుడు పరిశీలిద్దాము.

1. తులనాత్మక వ్యయ సిద్ధాంతము, వస్తు మార్పిడిని గూర్చి ప్రస్తావించింది. ఉత్పత్తి వ్యయాన్ని, వస్తువుల ఉత్పత్తి వ్యయాలలోని తులనాత్మక వ్యత్యాసాలను, ధన రూపంలో చూపిస్తే, సిద్ధాంతము ఏమవుతుంది అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. కానీ, వ్యయాలను ధన రూపంలో మార్చినా, వ్యాపార అవకాశాలు, వర్తక నిబంధనలేవీ మారవు. అందువలన తులనాత్మక వ్యయ సిద్ధాంతము చెప్పిన నిర్ణయాలేవీ మారవు.

2. ఈ సిద్ధాంతాన్ని పరిశీలిస్తే, ఒక దేశము తనకు సంపూర్ణ (Absolute) లేదా తులనాత్మక (Comparative) అనుకూలత ఉన్న వస్తువులకే ఉత్పత్తి చేస్తుందని భావించవచ్చు. మిగిలిన వస్తువులను, అటువంటి అనుకూలత గల దేశాల ఉత్పత్తులను, తన వస్తువులకు బదులుగా దిగుమతి చేసుకుంటుందని చెబుతోంది. ఈ అనుకూలతలకు, ఉత్పత్తి సామర్థ్యము కారణమని చెప్పడం జరిగింది. కాని, రెండు దేశాల మధ్య శ్రామిక వేతనాలు వేరుగా ఉన్నా, సామర్థ్యాలలో (Efficiencies) వ్యత్యాసం ఎక్కువగా ఉంటే, వ్యాపారానికి అవకాశం ఉంటుందని తెలుస్తోంది.

నిజానికి, ఒక దేశంలో అనేక వస్తువులు ఉత్పత్తి అవుతాయి. కొన్ని వస్తువులను దేశంలోనే ఉపయోగించుతారు. కొన్ని వస్తువులను మాత్రమే దిగుమతి చేసుకొంటారు. ఇంకా కొన్ని రకాల వస్తువులు ఎగుమతి అవుతాయి. ఉత్పత్తి వ్యయాల నిర్ధారణలో, శ్రామిక సామర్థ్యము, శ్రామిక వేతనాలు ముఖ్య అంశాలు. యిది అన్ని వస్తువులకు వర్తిస్తుంది. కొన్ని వస్తువుల ఉత్పత్తిలో శ్రామిక వేతనాలు ఎక్కువగా ఉన్నా, శ్రామిక సామర్థ్యం అంతకన్నా ఎక్కువగా ఉండవచ్చు. అపుడు, ఆ వస్తువుల ఉత్పత్తి వ్యయం తక్కువగా ఉండి, వాటిని రెండో దేశానికి ఎగుమతి చేయడం జరుగుతుంది. వ్యయాలలో తేడాల వల్ల, రెండు దేశాల మధ్య వ్యాపారం జరుగుతుంది.

3. అంతర్జాతీయ వ్యాపారంలో పాల్గొనే రెండు దేశాలలోనూ, శ్రామిక వేతనాలు ఒకే విధంగా ఉండవకపోవచ్చు. ఆ రెండు దేశాల శ్రామిక వేతనాల మధ్యగల వ్యత్యాసానికి, ఒక గరిష్ట పరిమితి, ఒక కనిష్ట పరిమితి ఉంటుందని చెప్పాలి. ఉత్పత్తి సామర్థ్యం ఎక్కువగా గల దేశంలో, వేతనం ఎక్కువగాను, తక్కువగా గల దేశంలో తక్కువగాను ఉంటుంది. వేతనంపై తుది నిర్ణయం ఆ దేశాల ఎగుమతులకు ఉండే పరస్పర డిమాండ్‌లపై ఆధారపడి ఉంటుంది. ఇది కేవలం, ఎగుమతి పరిశ్రమలకు సంబంధించినది మాత్రమే.

ఒక దేశంలో, శ్రామిక వేతనానికి గరిష్ట పరిమితిని ఎగుమతి పరిశ్రమలు నిర్ణయిస్తాయి. సంపూర్ణమైన పోటీ, ఉత్పత్తి కారకాల గమనశీలత పూర్తిగా ఉన్నపుడు, శ్రామిక వేతనాలు, ఆ మేరకు అన్ని పరిశ్రమలలోను మార్పు చెంది సమానమవుతాయి. విదేశీ వ్యాపారం చేసే రెండు దేశాలలోనూ, వ్యాపారం వలన శ్రామిక వేతనాలకు ఒక సంబంధం ఏర్పడుతుంది. తులనాత్మక అనుకూలత ఎక్కువగా ఉండి, ఆ వస్తువులకు విదేశీ డిమాండ్ ఎక్కువ ఉంటే, ఆ పరిశ్రమలలో శ్రామికుల వేతనం ఎక్కువగా ఉంటుంది. అందువలన వారి కొనుగోలు శక్తి ఎక్కువగా ఉండి, విదేశీ వస్తువులను కొనుగోలు చేస్తారు. ఆ వస్తువులు చౌకగా లభ్యం కొరడం వలన, నిజ ఆదాయము (Real Income) పెరుగుతుంది. దేశంలో వ్యాపారం వలన ఉత్పత్తి సామర్థ్యం ఎక్కువై, ఉత్పత్తి వ్యయాలు తగ్గుతాయి.

4. శ్రామికులందరూ సజాతీయులు (Homogereous) అని యీ సిద్ధాంతపు ప్రమేయం. అందువలన, శ్రామిక వేతనం ఒకే రకంగా ఉంటుందని చెప్పింది. నిజానికి, శ్రామికులు సజాతీయులైనా, గమనశీలత లేకపోతే, వేతనాలలో వ్యత్యాసాలుండవచ్చు. అంతేకాక, ప్రతి దేశంలోనూ, పోటీ లేని శ్రామిక వర్గాలు (Non - competing Groups) ఉంటాయని, దాని వలన ఒక పరిశ్రమలోని శ్రామిక వేతనం చాలా తక్కువగా ఉండటానికి అవకాశం ఉందని, టౌసిగ్ (Taussig) అనే అర్థికవేత్త చెప్పారు. శ్రామిక వేతనాలలో తేడాల ప్రభావం, విదేశీ వ్యాపారంపై ఉంటుంది. శ్రమ రూప వ్యయాల నిష్పత్తి, ధన రూప వ్యయాల నిష్పత్తిలో ఉండదు. ఒక పరిశ్రమలో వేతనాలు, చాలా తక్కువగా ఉంటూ, ఉత్పత్తి వ్యయాలు తగ్గి ఆ వస్తువును ఆ దేశం ఇతర దేశాలకు ఎగుమతి చేసే అవకాశమేర్పడవచ్చు. ఇటువంటి శ్రామిక వర్గాల వలన వ్యాపార అవకాశాలు ఏ విధంగా ఏర్పడవచ్చో, టౌసిగ్ చూపించారు. కాని, దాని వలన సాంప్రదాయ సిద్ధాంతము ప్రాముఖ్యత ఏమీ తగ్గదు. శ్రామిక వర్గాల తీరు, వాటి అనుక్రమణిక (Hierarchy) ఆ రెండు దేశాలలోనూ ఒకే విధంగా ఉంటే, ఆ వర్గాల ప్రభావం అంతర్జాతీయ వ్యాపారంపై ఉండదని టౌసిగ్ చెప్పాడు. ఆ వర్గాల వేతనాల స్థాయి కూడా రెండు దేశాలలోనూ ఒకే విధంగా ఉంటే ఆ వర్గాల ప్రభావం ఉండదు. ఒక వేళ, వేతనాలు వేరుగా ఉన్నా, అటువంటి శ్రామిక వర్గాలనుపయోగించిన నిష్పత్తి, రెండు దేశాలలోనూ ఒకే విధంగా ఉంటే, ఉత్పత్తి వ్యయాలు రెండు దేశాలలోనూ ఒకే మేరకు పెరిగి, వ్యాపారం తులనాత్మక వ్యయ సిద్ధాంతం ప్రకారం జరుగుతుందని టౌసిగ్ చెప్పాడు.

శ్రామిక వర్గాలు, వాటి అనుక్రమణిక, వారి వేతనాలు, అటువంటి వర్గాలను ఉపయోగించిన నిష్పత్తి, రెండు దేశాలలోనూ వేరుగా ఉన్నపుడు, వాటి ప్రభావం వ్యాపారంపై తప్పక ఉంటుంది. పాశ్చాత్య దేశాలలో, యీ వర్గాల అనుక్రమణిక, వారి వేతనాల మధ్య తేడాలు ఒకే విధంగా ఉండడం వలన, ఆ దేశాల మధ్య జరిగే వ్యాపారానికి, తులనాత్మక వ్యయ సిద్ధాంతం వర్తిస్తుందనీ, పోటీలేని శ్రామిక వర్గాల ప్రభావం వ్యాపారంపై ఉండదనీ టౌసిగ్ చెప్పాడు.

5. వడ్డీ ఖర్చులు (Capital Charges) : తులనాత్మక వ్యయ సిద్ధాంతం, శ్రమ రూప వ్యయాలనే పరిగణించింది. ద్రవ్య వ్యయాలన్నీ వేతనాలే అని భావించింది. కానీ, ప్రతి వస్తువుత్పత్తిలోనూ, శ్రమతో పాటు, మూలధనాన్ని కూడా ఉపయోగిస్తారు. మూలధనముపై వడ్డీ కూడా ద్రవ్య వ్యయాలను నిర్ణయించే ఒక అంశము. సాంప్రదాయ సిద్ధాంతం యీ వ్యయాలను పరిగణనలోకి తీసుకోలేదు. అందువలన, వీటి ప్రభావం విదేశీ వ్యాపారంపై ఎలా ఉంటుందో సూచించలేదు. అయితే వడ్డీరేటు, శ్రమ : మూలధన నిష్పత్తి రెండు దేశాలలోని అన్ని పరిశ్రమలలోనూ ఒకే విధంగా ఉంటే, వస్తువుల ధరలు ఒకే విధంగా ప్రభావితమవుతాయి. అపుడు, సాంప్రదాయిక తులనాత్మక వ్యయ సిద్ధాంతాన్ని సవరింపనక్కరలేదు. వ్యాపార సూత్రంగా అన్వయించుకోవచ్చు. వడ్డీ రేట్లలో కానీ, శ్రమ, మూలధన నిష్పత్తులలో కానీ, రెండు దేశాలలో తేడాలున్నా, అవి అన్ని వస్తువులకు ఒకే విధంగా అనువర్తితమయితే, సాంప్రదాయిక సిద్ధాంతం వర్తిస్తుంది. అటువంటి పరిస్థితులలో, ఎక్కువ వడ్డీ రేట్లున్న దేశపు ద్రవ్య వ్యయాలు ఒక స్థిర ప్రమాణంలో పెరిగితే, శ్రమ వ్యయాలు అనుపాతంలో ఉంటాయి. వడ్డీ ఖర్చుల భారము, వివిధ దేశాలలోని వివిధ పరిశ్రమలలో వివిధముగా ఉంటూ, సాంప్రదాయిక సిద్ధాంతాన్ని, ఆ మేరకు సవరించవలసి వుంటుందని టౌసిగ్ అభిప్రాయము. వడ్డీ ఖర్చులలో తేడాని, ఒక వ్యాపార సూత్రంగా అంగీకరించాలి.

టౌసిగ్ పై విధంగా చెప్పినప్పటికీ, అటువంటి అనుకూలతలు ఒక ప్రత్యేక స్థితిగానే గుర్తించాడు. అది సర్వసాధారణ విషయంగా తీసుకోనక్కరలేదని చెప్పాడు. అభివృద్ధి చెందిన దేశాలలో వడ్డీ రేట్లు, ఉత్పత్తిలో మూలధన ప్రాముఖ్యత, ఒకే మాదిరిగా ఉంటాయనీ అందువలన, వడ్డీ ఖర్చుల భారం ఆయా దేశాలలో సమానంగానే ఉంటుందనీ, కాబట్టి వ్యాపారంపై దాని ప్రభావం ఉండదని చెప్పవచ్చని, టౌసిగ్ వివరణ. యీ విమర్శల ద్వారా, సాంప్రదాయిక సిద్ధాంతాన్ని ఆ మేరకు వాస్తవ పరిస్థితులకు దగ్గరగా టౌసిగ్ తీసుకువచ్చాడు.

6. అనేక వస్తువులు (Many Goods) : రెండు దేశాల మధ్య, రెండు వస్తువులలో జరిగే వ్యాపారం గూర్చి సాంప్రదాయిక సిద్ధాంతం విశ్లేషించింది. రెండు దేశాల మధ్య అనేక వస్తువులలోనూ, అనేక దేశాల మధ్య అనేక వస్తువుల లోనూ జరిగే వ్యాపారానికి పై సూత్రం వర్తిస్తుందా ? అనే సందేహం కలగవచ్చు. రెండు దేశాల మధ్య వ్యాపారం అనేక వస్తువులలో జరిగినా, తులనాత్మక వ్యయ సిద్ధాంతం, వ్యాపార సూత్రంగా సరిపోతుంది.

ఒక దేశం ఎగుమతి చేసే వస్తువులన్నిటికీ, ఆ దేశం, రెండో దేశం నుండి దిగుమతి చేసుకునే వస్తువులన్నిటికన్నా తులనాత్మక అనుకూలత ఉంటుందని చెప్పవచ్చు. అదే విధంగా, రెండో దేశం ఎగుమతి చేసే వస్తువులన్నిటికీ, మొదటి దేశాల నుండి దిగుమతి చేసుకునే వస్తువులన్నిటికన్నా, తులనాత్మక అనుకూలత ఉంటుందని చెప్పక తప్పదు. కాని, పరస్పర డిమాండ్‌లు యీ సందర్భంలో ముఖ్యమైన నిర్ణయాంశమని గుర్తించాలి.

అంతర్జాతీయ వ్యాపారానికి మూలం వ్యత్యాసాలు. అందువలన, ధరల పట్టికతో పాటు, ద్రవ్య మారకపు రేటు, ఎగుమతులకు గల పరస్పర డిమాండ్ తెలిస్తేనే తప్ప, ఎగుమతులను, దిగుమతులను ఖచ్చితంగా నిర్ణయించలేము.

7. అనేక దేశాలు, అనేక వస్తువులు (Many Countries, Many Goods) : తులనాత్మక వ్యయ సిద్ధాంతం అనేక దేశాల మధ్య, అనేక వస్తువులలో జరిగే వ్యాపారానికి కూడా వర్తిస్తుంది. రెండు దేశాల మధ్య, అనేక వస్తువులలో జరిగే వ్యాపారాన్ని విశ్లేషించిన విధంగానే, అనేక దేశాల మధ్య, అనేక వస్తువులలో జరిగే వ్యాపారాన్ని కూడా విశ్లేషించవచ్చు.

ఒక దేశాన్ని విడిగాను, మిగతా దేశాలన్నిటినీ కలిపి (Rest of the world) మరొక దేశంగాను పరిగణించి, రెండు దేశాల మధ్య జరిగే వ్యాపారానికి సంబంధించిన సూత్రాలకు, వీటి మధ్య జరిగే వ్యాపారానికి కూడా అన్వయింపవచ్చు.

ఏ దేశము, ఏ వస్తువులను ఎగుమతి చేస్తుంది ? ఏఏ వస్తువులను దిగుమతి చేసుకుంటుంది ? - యీ విషయాలను నిర్ధారించాలంటూ, ఆయా దేశాలలో, ఆయా వస్తువుల ఉత్పత్తి వ్యయాల పట్టికే గాక, వర్తక నిబంధనలు (Terms of Trade) కూడా తెలియాలి. వర్తక నిబంధనలను బట్టి ఒక దేశీయ వ్యాపారంలో పాల్గొనే అవకాశమున్నదీ, లేనిదీ నిర్ధారణ చేయవచ్చు. అంటే వర్తక నిబంధనలు, లాభసాటిగా ఉంటేనే వ్యాపారంలో పాల్గొంటుంది. ఏ దేశం, ఏ వస్తువును ఉత్పత్తి చేసి ఎగుమతి చేస్తుంది ? ఏ వస్తువులను దిగుమతి చేసుకొంటుంది ? వీటిని నిర్ధారణ చేయడానికి, ఆయా వస్తువులకు విదేశాలలో గల డిమాండ్ల మీద ఆధారపడుతుంది. పరస్పర డిమాండ్ల సాపేక్ష బలబలాల్ని (Relative Strongers of Reciprocal Demands) బట్టి యీ వస్తువులు నిర్ధారింపబడతాయి.

8. రవాణా వ్యయాలు (Transport Costs) : తులనాత్మక వ్యయ సిద్ధాంతం, రవాణా వ్యయాలుండవని ప్రమేయం చేసినది. వాస్తవ ప్రపంచంలో, రవాణా వ్యయాలుంటాయని, మనకు తెలుసు. కాబట్టి రవాణా వ్యయాల ప్రచారం ఒక దేశపు ఎగుమతుల, దిగుమతులపై తప్పక ఉంటుంది. అయితే సిద్ధాంతాన్ని ఏమీ మార్పనక్కర లేదు. కానీ, అవి వ్యాపారాన్ని మాత్రం తప్పక ప్రభావితం చేస్తాయి. వ్యాపార పరిమాణాన్ని తగ్గించడం, వ్యాపారం వల్ల వచ్చే లాభాలను తగ్గించడం, వ్యాపార తీరుపై నిర్ణయాత్మక ప్రభావాన్ని చూపుతాయి. కాబట్టి, రెండు దేశాల మధ్య రవాణా వ్యయాలను తగ్గించే ఏ ప్రయత్నమైనా, వ్యాపార పరిమాణాన్ని పెంచి, వ్యాపారం వల్ల వచ్చే లాభాలను పెంచి, వ్యాపార తీరుని మార్పు చేస్తాయి.

9. స్థిర ప్రతిఫలాలు : తులనాత్మక వ్యయ సిద్ధాంతము, స్థిర వ్యయాలు లేదా స్థిర ప్రతిఫలాల సూత్ర ప్రమేయంపై ఆధారపడినది. రెండు దేశాలలోను, స్థిర ప్రతిఫలాల సూత్రాన్ననుసరించి, వస్తూత్పత్తి జరుగుతుందని ప్రమేయము. కాని వాస్తవ ప్రపంచంలో, వ్యయాలు పెరిగే స్థితి, తగ్గే స్థితి కూడా వస్తూత్పత్తిలో ఉండవచ్చు. ఉత్పత్తి సాధారణంగా, క్షీణ ప్రతిఫలాల దశ (Diminishing Returns Stage) లో వస్తూత్పత్తి జరిగే అవకాశం ఎక్కువ. అందువలన, ఉత్పత్తి ఎక్కువైతే, ఉపాంత వ్యయము పెరుగుతుంది.

వ్యాపారం మొదలైన తర్వాత, ఒక దేశం తనకు తులనాత్మక అనుకూలత ఉన్న వస్తూత్పత్తిని పెంచినపుడు, ఆ వస్తూత్పత్తిలో గల తులనాత్మక అనుకూలత తగ్గుతుంది. అపుడు, వస్తూత్పత్తి రెండు దేశాల మధ్యగల వ్యయ వ్యత్యాసాలు తగ్గిపోయే వరకు కొనసాగుతుంది. అందువలన, పెరిగే వ్యయాలుండే పరిస్థితిలో, తులనాత్మక వ్యయ సిద్ధాంతంలో మౌళికమైన మార్పులేవీ అవసరం లేదు. వ్యాపారము లాభదాయకంగానే ఉంటుంది. కాని స్థిర వ్యయాలున్నపుడు ఉండే పరిమాణంలో లాభాలుండవు.

అదే విధంగా, వస్తూత్పత్తిలో వ్యయాలు తగ్గవచ్చు. అంతర్గత, బహిర్గత ఆదాలవలన, ఉత్పత్తి వ్యయాలు తగ్గవచ్చు. ఇవి తులనాత్మక అనుకూలతను సూచిస్తాయి. యీ వస్తువునుత్పత్తి చేసే దేశము, ఎక్కువ పరిమాణములో యీ వస్తువును ఎగుమతి చెయ్యగలుగుతుంది. ప్రత్యేకీకరణ పూర్తిగా జరుగుతుంది. వాస్తవానికి, తగ్గే వ్యయాలు, వ్యాపారానికి ఆధారము. అందువలన, స్థిర వ్యయాల ప్రమేయాన్ని సడలించినప్పటికీ, తులనాత్మక వ్యయ సిద్ధాంతాన్ని ఏ విధంగానూ మార్పు చేయనక్కరలేదు.

తులనాత్మక వ్యయ సిద్ధాంతపు ప్రమేయాలను సడలిస్తే నిర్ణయాలు ఏ విధంగా ఉండేదీ, కొంత మంది ఆర్థిక వేత్తలు పరిశీలించారు. పైన వివరించిన దానిని బట్టి, చాలా విషయాలలో, అటువంటి సడలింపుల వలన, సిద్ధాంతపు మౌళిక నిర్ధారణలలో, ఏ విధమైన మార్పు రాదని చెప్పవచ్చు.

## 1.8. మిల్ (Mill) సిద్ధాంతము :

మనము ఇప్పటి వరకు పరిశీలించిన ఆడమ్ స్మిత్ సంపూర్ణ అనుకూలత, రికార్డో తులనాత్మక అనుకూలత నమూనాలు - రెండూ - అంతర్జాతీయ వ్యాపారాన్ని, సప్లయ్ కోణం నుంచి మాత్రమే విశ్లేషించాయి. అంతర్గత వ్యయ నిష్పత్తులు, వర్తక నిబంధనలను నిర్ణయిస్తాయి. అనగా సప్లయ్ పరిస్థితులు మాత్రమే నిర్ణయిస్తాయని వారి అభిప్రాయము. కాని ఇది సరికాదు. ప్రతి వస్తువు ధరను, దాని సప్లయ్, డిమాండ్ అంశాలు రెండూ కలిసి నిర్ణయిస్తాయి. అంతర్జాతీయ వ్యాపారంలో, వస్తువుల ధరలు కూడా అదే విధంగా నిర్ణయింపబడతాయి. స్మిత్, రికార్డో డిమాండ్ అంశాలను పరిగణించక, సప్లయ్ అంశాలను మాత్రమే పరిగణనలోకి తీసుకొని, అవే నిర్ణయాత్మక అంశాలని విశ్లేషించారు. సాంప్రదాయ సిద్ధాంతములో యిది ముఖ్య లోపము. యీ లోపాన్ని, తరువాతి కాలంలో, మిల్, మార్షల్, ఎడ్జ్‌వర్త్ వంటి ఆర్థికవేత్తలు సరిదిద్దారు. మిల్, తన పరస్పర డిమాండ్ (Reciprocal Demands) సిద్ధాంతము ద్వారా, డిమాండ్ అంశాలను కూడా విశ్లేషించాడు.

తులనాత్మక వ్యయ సిద్ధాంతము, సాంప్రదాయక ఆర్థికవేత్తలు అడిగిన మొదటి ప్రశ్నకు సమాధానమిస్తుంది. అంతర్జాతీయ వ్యాపారానికి ఆధారము లేదా ప్రాతిపదిక ఏది ? అనే ప్రశ్నకు యీ సిద్ధాంతము సమాధానాన్ని అందజేస్తుంది. కాని యీ సమాధానము సంపూర్ణము కాదు. యీ సమాధానములో డిమాండ్ అంశాలు కూడా ముఖ్యమైనవి. ఏ ధరల వద్ద వ్యాపారము జరుగుతుంది ? అనే ప్రశ్నలకు సమాధానము కోసం మనము అన్వేషించాలి. యీ అన్వేషణ ఫలితమే పరస్పర డిమాండ్ సిద్ధాంతము.

జె.ఎస్.మిల్ 1848లో ప్రచురితమైన "Principles of Political Economy" అనే గ్రంథంలో యీ పరస్పర డిమాండ్ సూత్రాన్ని ప్రతిపాదించారు. తరువాత, మార్షల్, ఎడ్జ్‌వర్త్, offer Curve పద్ధతి ద్వారా దీనిని అభివృద్ధి చేసారు.

వస్తు మార్పిడి నిబంధనలు (Barter Terms of Trade) వ్యయ పరిస్థితుల పైననే గాక, డిమాండ్ పరిస్థితులపై గూడా ఆధారపడతాయని మిల్ చెప్పాడు. ఏ వస్తువులు వ్యాపారంలో ప్రవేశిస్తాయి అనే విషయంలో, వ్యయ పరిస్థితుల పాత్రను రికార్డో చెప్పాడు. అంతర్జాతీయ డిమాండ్ పాత్రను మిల్ విశ్లేషించాడు.

### 1.8.1 పరస్పర డిమాండ్ సిద్ధాంతము : ప్రమేయాలు :

మిల్ సిద్ధాంతము యీ క్రింది ప్రమేయాలపై ఆధారపడినది

1. రెండు దేశాలు
2. రెండు వస్తువులు

3. రెండు వస్తువులూ స్థిర ప్రతిఫలాల సూత్రాన్ననుసరించి ఉత్పత్తి చెయ్యబడతాయి

4. రవాణా వ్యయాలుండవు

5. రెండు దేశాల అవసరాలు ఒకే రకంగా ఉంటాయి.

6. సంపూర్ణమైన పోటీ

7. సంపూర్ణ ఉద్యోగిత

8. రెండు దేశాల మధ్య స్వేచ్ఛా వ్యాపారము

9. తులనాత్మక వ్యయ సూత్రము రెండు దేశాల మధ్య వ్యాపార సంబంధాలకు వర్తిస్తుంది.

1.8.2. వివరణ : పై ప్రమేయాలాధారంగా, మిల్ తన పరస్పర డిమాండ్ సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. ఒక దేశానికి, మరొ దేశపు వస్తువులకు గల డిమాండ్ ధృఢత్వము (Strengths) వ్యాకోచము (Elasticity) ని బట్టి, వ్యాపారంలో వాటి మారకపు నిష్పత్తి నిర్ణయింపబడుతుంది. దీనినే పరస్పర డిమాండ్ అంటారు. ప్రతి దేశపు ఎగుమతుల విలువ, దిగుమతుల విలువకు సమానమయినపుడు, యీ నిష్పత్తి స్థిరంగా ఉంటుంది.

ఈ క్రింది ఉదాహరణ ద్వారా యీ సిద్ధాంతాన్ని వివరిద్దాము

పట్టిక 1.5

**ఉత్పత్తి అయ్యే వస్తు పరిమాణాలు**

| దేశము | X ఉత్పత్తి | Y ఉత్పత్తి |
|---|---|---|
| A | 10 | 10 |
| B | 6 | 8 |

A దేశము 1 సంవత్సరపు శ్రమతో 10 యూనిట్ల X వస్తువును కాని, 10 యూనిట్ల Y వస్తువును కాని ఉత్పత్తి చెయ్యగలదు. అదే విధంగా B దేశము, 6 యూనిట్ల X వస్తువును కాని, 6 యూనిట్ల Y వస్తువును కానీ ఉత్పత్తి చెయ్యగలదు. దీనిని బట్టి B దేశము, A దేశము నుండి Y వస్తువును దిగుమతి చేసుకొని, A దేశము, B దేశము నుండి X వస్తువును దిగుమతి చేసుకొంటూ, రెండు దేశాలకు లాభదాయకంగా A దేశానికి రెండు వస్తువుల ఉత్పత్తి లోనూ, సంపూర్ణ అనుకూలత ఉన్నది. B దేశానికి రెండింటిలోనూ తులనాత్మక అననుకూలత ఉన్నది. కాని X వస్తూత్పత్తిలో, అననుకూలత కనిష్టముగా ఉన్నది. దేశీయ మారకపు నిష్పత్తి కాని, అంతర్జాతీయ మారకపు నిష్పతిని కాని పరిశీలిస్తే ఇది స్పష్టమవుతుంది.

వ్యాపారానికి ముందు, A దేశములో దేశీయ ఉత్పత్తి వ్యయ నిష్పత్తి 1 : 1, B దేశములో 3 : 4 గా ఉన్నాయి. ఈ రెండు దేశాలు వ్యాపారంలో పాల్గొంటూ, A దేశానికి, B దేశముపైన X వస్తూత్పత్తిలో అనుకూలత 5 : 3 (లేదా 10 : 6) Y వస్తూత్పత్తిలో 5 : 4 (10 : 8) $\frac{5}{3} > \frac{5}{4}$. అందువలన A దేశానికి X వస్తూత్పతిలో తులనాత్మక అనుకూలత ఉన్నది. కాబట్టి A దేశము B దేశానికి X వస్తువును ఎగుమతి చేసి, Y వస్తువును దిగుమతి చేసుకోవటం శ్రేయస్కరం. అదే విధంగా B దేశంలో ,దేశీయంగా ఉత్పత్తిలో X వస్తువుత్పత్తిలో $\frac{3}{5}$ లేదా 6/10) వస్తూత్పత్తిలో $\frac{4}{5}$ (లేదా 8 / 10) $\frac{4}{5} > \frac{5}{5}$ కాగా B దేశము, A దేశానికి Y వస్తువును ఎగుమతి చేసి, X వస్తువును దిగుమతి చేసుకోవటం శ్రేయస్కరం.

మిల్ సిద్ధాంతము, రెండు దేశాల మధ్య వస్తు మార్పిడి రేట్లకు సంబంధించినది. దీనినే Barter Terms of Trade - వస్తు మార్పిడి నిబంధనలు అని అంటారు. ప్రతి దేశములోని శ్రామిక సామర్థ్యమును బట్టి, దేశీయ మార్పిడి రేట్లు నిర్ణయింపబడతాయి. ఇవి, అంతర్జాతీయంగా, వినిమయ నిష్పత్తికి, పరిమితులను విధిస్తాయి.

ఉదాహరణకు, A దేశంలో ఇద్దరు శ్రామికులు 10 యూనిట్ల X వస్తువును కాని, 10 యూనిట్ల Y వస్తువును కాని ఉత్పత్తి చెయ్యగలరని అనుకొందాము. B దేశములో, ఇద్దరు శ్రామికులు 6 యూనిట్ల X వస్తువును కానీ, 8 యూనిట్ల Y వస్తువును కానీ, ఉత్పత్తి చెయ్యగలరని అనుకొందాము. A దేశములో, దేశీయ మార్పిడి నిష్పత్తి 1 : 1, B దేశయంలో 1 : 1.33.

కాబట్టి వర్తక నిబంధనల (Terms of Trade) పరిమితులు - A దేశములో 1 యూనిట్ X కు, 1 యూనిట్ Y వస్తువు B దేశీయంలో 1 యూనిట్ కు 1.33 యూనిట్ల Y వస్తువు - అందువలన రెండు దేశాల మధ్య, వర్తక నిబంధనలు, 1 యూనిట్ X కు 1 యూనిట్ Y కాని 1.33 యూనిట్ల Y కాని - వీటి మధ్య ఉంటాయి.

అసలు నిష్పత్తి పరస్పర డిమాండ్ పై ఆధారపడుతుంది. ఒక దేశపు వస్తువులకు, మరొక దేశపు డిమాండ్ దృఢత్వము, డిమాండ్ వ్యాకోచములను బట్టి నిర్ణయింపబడుతుంది. B దేశపు Y వస్తువునకు A దేశపు డిమాండ్ అధికంగా ఉండి, అర్వాకోచయుగా (Inclastic) ఉంటే, A దేశీయ 1 యూనిట్ X వస్తువునిచ్చి, B దేశము నుండి 1 యూనిట్ Y వస్తువును పొందటానికి సిద్ధ పడుతుంది. వర్తక నిబంధనలు, B దేశానికి అనుకూలంగాను, A దేశానికి ప్రతికూలంగాను ఉంటాయి. అందువలన వ్యాపారం వలన A దేశానికి ఒనగూడే లాభము, B దేశపు లాభం కన్నా తక్కువగా ఉంటుంది. అలా కాక, A దేశపు డిమాండ్ (B దేశపు Y వస్తువునకు) వ్యాకోచముగా ఉంటే, వర్తక నిబంధనలు 1 : 1.33 కి దగ్గరగా ఉంటాయి. అపుడు, A దేశము 1 యూనిట్ X వస్తువునకు 1.33 యూనిట్ల Y వస్తువును మార్పిడి చేసుకొనేందుకు సిద్ధపడుతుంది. వర్తక నిబంధనలు, A దేశానికి అనుకూలంగానూ, B దేశానికి ప్రతికూలంగాను ఉంటాయి. వ్యాపారం వలన, A దేశానికి వచ్చే లాభం, B దేశానికి వచ్చే లాభం కన్నా అధికంగా ఉంటుంది. కాబట్టి, అసలు వర్తక నిబంధనలు, పరస్పర డిమాండ్ వ్యాకోచాల్ని బట్టి, దేశీయ వ్యయ నిష్పత్తుల పరిమితుల మధ్య ఉంటాయి.

**1.8.3.** విమర్శలు : ఫ్రాంక్ డి గ్రాహమ్, సాంప్రదాయిక వ్యాపార సిద్ధాంత విమర్శకులలో ప్రముఖుడు. ఇతడు, పరస్పర డిమాండ్ సిద్ధాంతమును తీవ్రంగా విమర్శించాడు. రికార్డో సిద్ధాంతమును తీవ్రంగా విమర్శించాడు. రికార్డో సిద్ధాంతము, ఏ అవాస్తవిక ప్రమేయాలపై ఆధారపడినదో, మిల్ సిద్ధాంతము కూడా వాటిపైనే ఆధారపడినదని విమర్శ.

గ్రాహము చేసిన ముఖ్య విమర్శలు :

1. మిల్ సిద్ధాంతము, డిమాండ్ పైనే దృష్టి కేంద్రీకరించి, సప్లయ్‌ను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. డిమాండ్ ఒకటే ముఖ్యం కాదు. ఉత్పత్తి వ్యయాలు (సప్లయ్) కూడా, అంతర్జాతీయ వ్యాపారములో, కీలకమైనవిగా ఉంటాయి. కాబట్టి, వినిమయ నిష్పత్తిని నిర్ణయించేటప్పుడు, సప్లయ్ పరిస్థితులను గూడ పరిగణనలోకి తీసుకోవాలి.

2. మిల్ సిద్ధాంతము, వస్తువుకు దేశీయంగా గల అంతర్గత డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకోదు. వైనరు (Viner) చెప్పినట్లు, ఒక దేశము, తన అంతర్గత డిమాండ్ అవసరాలు తీరిన తర్వాత, ఏ వస్తువునైనా ఎగుమతి చేస్తుంది.

3. మిల్ సిద్ధాంతము, రెండు దేశాలు ఆర్థికంగా ఒకే పరిమాణము (Same Economic Size) గా ఉన్నపుడే వర్తిస్తుందని గ్రాహమ్ అభిప్రాయము. అపుడే ఒక దేశపు డిమాండ్ ప్రభావం మార్కెటు ధరపై గణనీయంగా ఉంటుంది. అలా కాకుండా, ఒక దేశము చిన్నది, మరొకటి పెద్దది అయినపుడు, పెద్ద దేశపు అంతర్గత నిష్పత్తి కీలకమవుతుంది. ఏక స్వామ్య శక్తులు, మార్కెట్లలో లేకపోతే, చిన్న దేశము, తను ఎగుమతి చెయ్యగలిగినంత వస్తువులను ఎగుమతి చేసి, తద్వారా ఎక్కువగా లాభపడుతుంది.

   రెండు దేశాలు సుమారుగా ఒకే ఆర్థిక పరిమాణములో ఉండి, అభిరుచులు కూడా ఒకే రకంగా ఉంటే, వ్యాపారం వల్ల వచ్చే లాభాలు, రెండు దేశాల మధ్య సమానంగా పంపిణీ అవుతాయి. కాని ఒక దేశము, ఇంకొక దేశము కన్నా పెద్దదయినపుడు, చిన్న దేశానికి లాభం అధికంగా ఉంటుంది.

4. పరస్పర డిమాండ్, అంతర్జాతీయ విలువల నిర్ణయంలో అనవసరమని గ్రాహమ్ వాదన. స్థిర వ్యయాల ప్రమేయమున్నపుడు, అంతిమ మారకపు నిష్పత్తిని నిర్ణయించటానికి, సప్లయ్ పరిస్థితులొకటే సరిపోతాయి. కాని పెరిగే వ్యయాలున్నపుడు, డిమాండ్ పరిస్థితులను గూడా పరిగణించాలి.

5. రెండు దేశాలలోని, ఆదాయాలలో వచ్చే ఒడుదుడుకులు (Fluctuations) వర్తక నిబంధనలను ప్రభావితం చేస్తాయి. కాని మిల్ సిద్ధాంతము వీటిని పరిగణనలోకి తీసుకోలేదు.

పై కారణాల వలన, మిల్ సిద్ధాంతము, లోపభూయిష్టమైనదని, అందువలన దానిని తిరస్కరించాలని, గ్రాహము వాదించాడు. కాని గ్రాహమ్ విమర్శలు అంత హేతుబద్ధమైనవి కావు. వైనరు చెప్పినట్లు, వర్తక నిబంధనలు, పరస్పర డిమాండ్ల వల్లనే ప్రభావితమవుతాయి. యింకా ఇతర విషయాల వల్ల కాదు. యీ పరస్పర డిమాండ్లు వ్యయ పరిస్థితులను బట్టి నిర్ణయింపబడతాయి.

## 1.9. సారాంశము :

అంతర్జాతీయ అర్థశాస్త్రము ప్రపంచంలో వివిధ దేశాల మధ్య గల పరస్పర ఆధారితను అధ్యయనం చేస్తుంది. వివిధ దేశాల మధ్య వస్తువుల, సేవల ప్రవాహాన్ని దానిని నియంత్రించే విధానాలను విశ్లేషిస్తుంది. అంతర్జాతీయ వ్యాపార సిద్ధాంతాలు, అంతర్జాతీయ అర్థశాస్త్రములో ఒక ముఖ్య భాగము. అంతర్జాతీయ వ్యాపారానికి, దేశీయ వ్యాపారానికి మధ్య అనేక విషయాలలో తేడాలున్నాయి. అందువలన ప్రత్యేక అంతర్జాతీయ వ్యాపార సిద్ధాంతపు ఆవశ్యకత ఉందని సాంప్రదాయ ఆర్థికవేత్తలు వాదించారు.

అంతర్జాతీయ వ్యాపారముపై మర్కెంట లిస్ట్ ఆలోచనలు ముఖ్యమైనవి. విలువైన లోహాల నిల్వలు, జాతి సంపదను తెలియజేస్తాయని వారి అభిప్రాయము. వ్యాపారంపై ఆంక్షల ద్వారా, దిగుమతులను పరిమితం చేసి, ఎగుమతులనధికం చేయాలని వారి వాదన. అప్పుడే ఒక దేశము విలువైన లోహాలను బంగారం, వెండి ఎక్కువగా సమకూర్చుకోగలదని వారి అభిప్రాయము.

సాంప్రదాయ ఆర్థికవేత్తలు యీ అభిప్రాయాలను తిరస్కరించారు. ఆడమ్ స్మిత్, మార్కెంటలిస్ట్ ఆలోచనలను, అభిప్రాయాలను గట్టిగా వ్యతిరేకించాడు. స్వేచ్ఛా వ్యాపారం వలన, ప్రత్యేకీకరణ జరిగి, ప్రపంచ ఉత్పత్తి గణనీయంగా పెరిగి, అన్ని దేశాలు లాభం పొందుతాయని ఆడమ్ స్మిత్ వాదించారు. సంపూర్ణ అనుకూలత సిద్ధాంతాన్ని దీనికనుగుణంగా ప్రతిపాదించారు. ఒక దేశము సంపూర్ణ అనుకూలత ఉన్న వస్తువులనుత్పత్తి చేసి, ఎగుమతి చేసి, వ్యాపారం ద్వారా లాభం పొందాలని యీ సిద్ధాంతము ద్వారా సూచించారు.

రికార్డో దీనితో విభేదించి, సంపూర్ణ అననుకూలత ఉన్నా, ఒక దేశము వ్యాపారం ద్వారా లాభం పొందవచ్చని నిరూపించారు. తులనాత్మక వ్యయ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. తులనాత్మక అనుకూలత ఉన్న వస్తువునుత్పత్తి చేసి, ఎగుమతి చేసి లాభం పొందవచ్చని నిరూపించారు. ఈ సిద్ధాంతము అనేక ప్రమేయాలపై ఆధారపడినది. అందువలన అనేక విమర్శలకు గురైనది. సాంఖ్యక పరీక్షలు యీ సిద్ధాంతానికనుకూలంగా ఉన్నాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలకు యీ సిద్ధాంతాము వర్తించదని కొందరి అభిప్రాయము. ఈ సిద్ధాంతపు ప్రమేయాలను కొన్నింటిని సడలించి, సవరించి, సిద్ధాంతానికి మెరుగులుదిద్దారు. తులనాత్మక వ్యయ సిద్ధాంతము, ఇప్పటికి ఒక ముఖ్యమైన అంతర్జాతీయ వ్యాపార సిద్ధాంతముగా కొనసాగుతున్నది.

తులనాత్మక వ్యయ సిద్ధాంతము, డిమాండ్ అంశాలను పరిగణించలేదని ఒక విమర్శ. దీని దృష్ట్యా, జాన్ స్టువర్ట్ మిల్ పరస్పర డిమాండ్ సిద్ధాంతాన్ని ప్రతిపాదించి, డిమాండ్ అంశాలను పరిగణనలోకి తీసుకొన్నారు. అంతర్జాతీయ వ్యాపారంలో డిమాండ్ అంశాలు కూడా ముఖ్య పాత్రను నిర్వహిస్తాయని మిల్ అభిప్రాయము.

## 1.10. ముఖ్య పదాలు

మార్కెంటలిసమ్

సంపూర్ణ అనుకూలత

తులనాత్మక అనుకూలత

శ్రమ విలువ సిద్ధాంతము

సంపూర్ణ అనుకూలత సిద్ధాంతము

తులనాత్మక వ్యయ సిద్ధాంతము

పరస్పర డిమాండ్ సిద్ధాంతము

పోటీ లేని శ్రామిక వర్గాలు.

## 1.11. స్వయం సమీక్షా ప్రశ్నలు :

1. అంతర్జాతీయ వ్యాపార సిద్ధాంతపు ఆవశ్యకతను వివరింపుము
2. అంతర్జాతీయ వ్యాపారంపై, మార్కెంటలిస్ట్ ఆలోచనలను పరిశీలింపుము
3. సంపూర్ణ అనుకూలత సిద్ధాంతమును వివరింపుము
4. తులనాత్మక వ్యయ సిద్ధాంతమును, విమర్శనాత్మకంగా పరిశీలింపుము
5. మిల్ ప్రతిపాదించిన పరస్పర డిమాండ్ సిద్ధాంతాన్ని వివరింపుము

## 1.12. చదువవలసిన గ్రంథాలు


| | | | |
|---|---|---|---|
| 1. | P.T. Ellsworth | : | International Economy |
| 2. | Bo Sodersten | : | International Economics. IV Edition |
| 3. | D. Saluatore | : | International Economics |
| 4. | J.N. Bhagwati | : | "The Pure Theory of International Trade:A Survey "Economic Journal Macro 1964. pp 1 - 84 |
| 5. | C.P. Kindle Berer | : | International Economics |


ఆచార్య. ఎమ్. జగదీశ్వరరావు

పాఠం - 2

# నవ్య సాంప్రదాయ సిద్ధాంతం - హాబర్లర్ అవకాశ వ్యయ సిద్ధాంతం - వ్యాపార ఉదాసీనతా వక్రరేఖలు - ఆఫర్ రేఖలు

## 2.0 లక్ష్యం :

ఈ పాఠ్యభాగమునందు ఈ క్రింది అంశాలను తెలుసుకోగలరు

- ☆ నవ్య సాంప్రదాయ సిద్ధాంతము
- ☆ హాబర్లర్ అవకాశ వ్యయ సిద్ధాంతం
- ☆ వ్యాపార ఉతాసీనతా వక్రరేఖలు మరియు అంతర్జాతీయ సమతౌల్యము
- ☆ ఆఫర్ రేఖలు మరియు అంతర్జాతీయ సమతౌల్యము - మీడ్ వివరణ

## విషయసూచిక :


2.1 పరిచయము
2.2 హాబర్లర్ అవకాశ వ్యయ సిద్ధాంతం
2.2.1. ప్రమేయాలు
2.2.2. ఉత్పత్తి అవకాశాల వక్రరేఖ
2.2.3. స్థిర అవకాశవ్యయాలు, వ్యాపారము
2.2.4. పెరిగే అవకాశ వ్యయాలు, వ్యాపారము
2.2.5. తగ్గుతున్న అవకాశ వ్యయాలు, వ్యాపారము
2.2.6. అవకాశ వ్యయ సిద్ధాంతం : విమర్శలు
2.3 మీడ్ విశ్లేషణ
2.4 సామాజిక ఉదాసీనతా వక్రరేఖలు
2.5 వ్యాపారానికి ఆధారం, వ్యాపారం వలన లాభాలు, పునఃప్రకటన
2.6 వ్యాపార ఉదాసీనతా వక్రరేఖలు
2.7 ఆఫర్ రేఖలు
2.8 ఆఫర్ రేఖలు - అంతర్జాతీయ సమతౌల్యము
2.9 ఆఫర్ రేఖలు - అంతర్జాతీయ సమతౌల్యము - మీడ్ వివరణ
2.10 సారాంశము
2.11 ముఖ్య పదాలు
2.12 స్వయం సమీక్షా ప్రశ్నలు
2.13 చదువవలగిన గ్రంథాలు

## 2.1 పరిచయము :

మనము మొదటి పాఠములో సాంప్రదాయ అంతర్జాతీయ వ్యాపార సిద్ధాంతమును అధ్యయనం చేసినాము. ఈ సిద్ధాంతము, ముఖ్యముగా శ్రమ విలువ సిద్ధాంతముపై ఆధారపడినది. శ్రమ విలువ సిద్ధాంతపు నిర్బంధ ప్రమేయాన్నుంచి, అంతర్జాతీయ వ్యాపార సిద్ధాంతాన్ని బయటకు తేవటానికి కొన్ని ప్రయత్నాలు జరిగాయి. వాటి ఫలితమే నవ్య సాంప్రదాయ వ్యాపార సిద్ధాంతం. యీ నవ్య సాంప్రదాయ సిద్ధాంతాన్ని అభివృద్ధి చేసిన వారిలో ముఖ్యులు హాబర్లర్, లియోంటిఫ్, మార్షల్, ఎడ్జ్‌వర్త్, మీడ్. వీరు ప్రతిపాదించిన సిద్ధాంతాలను భావనలను ప్రస్తుత పాఠంలో తెలుసుకుందాము. నవ్యసాంప్రదాయ అర్థికవేత్తలు, అంతర్జాతీయ వ్యాపార సిద్ధాంతములో కొన్ని క్రొత్త విశ్లేషణ ఉపకరణాలను ప్రవేశపెట్టారు. నవ్యసాంప్రదాయ వ్యాపార సిద్ధాంతము, అవకాశ వ్యయము, ఉత్పత్తి అవకాశాల రేఖలు, సామాజిక ఉదాసీనతా వక్రరేఖల వంటి భావనలనుపయోగించి అభివృద్ధి చేయబడినది. హాబర్లర్ ఉత్పత్తి అవకాశాల వక్రరేఖను, లియోంటిఫ్ సామాజిక ఉదాసీనతా వక్రరేఖను, మీడ్ వ్యాపార ఉదాసీనతా వక్రరేఖ భావనలను ప్రవేశపెట్టి అంతర్జాతీయ వ్యాపారాన్ని విశ్లేషించారు. మార్షల్ ఆఫర్ రేఖల ద్వారా అంతర్జాతీయ సమతౌల్యాన్ని విశ్లేషించారు. మీడ్ వ్యాపార ఉదాసీనతా వక్రరేఖ భావనల ద్వారా అంతర్జాతీయ సమతౌల్యాన్ని వివరించారు. యీ పాఠములో వీటినన్నిటినీ అధ్యయనం చేద్దాము.

## 2.2 హాబర్లర్ అవకాశ వ్యయ సిద్ధాంతము

రికార్డో ప్రతిపాదించిన తులనాత్మక వ్యయ సిద్ధాంతము, శ్రమ విలువ సిద్ధాంతముపై ఆధారపడినదని ముఖ్య విమర్శ. శ్రమ విలువ సిద్ధాంతము అన్ని వ్యయాలను శ్రమ రూపంలో కొలుస్తుంది. వ్యయాలను శ్రమ రూపంలోనూ, నిజ వ్యయాల (Real costs) రూపంలోను గణించటానికి కొన్ని ప్రతిబంధకాలున్నాయి. శ్రమ యూనిట్లలో విలువలను కొలవడం అసాధ్యం అని కొందరు ఆధునిక శాస్త్రవేత్తలు అభిప్రాయపడ్డారు.

శ్రమ విలువ సిద్ధాంతముననుసరించి శ్రమ ఒక్కటే ఉత్పత్తి సాధనము; శ్రమ సజాతీయము మరియు శ్రమను అన్ని వస్తువుల ఉత్పత్తిలోనూ, ఒకే స్థిర అనుపాతములో ఉపయోగిస్తారు. కానీ ఇవన్నీ అవాస్తవికము. ఒక వస్తువు ఉత్పత్తి ఒకే ఉత్పత్తి కారకముతో జరగదు. అనేక ఉత్పత్తి కారకాలను ఉపయోగిస్తారు. శ్రమ ఒక్కటే ఉత్పత్తి కారకం కాదు. శ్రమ సజాతీయం కాదు. వివిధ రకాల, తరహాల శ్రమ ఉంటుంది. వీటిలో పోటీ లేని వర్గా (Non-Competing groups) లుంటాయని మొదటి పాఠంలో చెప్పాము. అంతేకాక, శ్రమను, ఇంకొక ఉత్పత్తి కారకముచే ప్రతిష్ఠాపన చేయవచ్చు. అందువలన, అంతర్జాతీయ వ్యాపార సమస్యకు వర్తించే ప్రత్యామ్నాయ వ్యయ సిద్ధాంతాన్ని రూపొందించడానికి ప్రయత్నాలు జరిగాయి. అటువంటి ప్రయత్నాలలో ముఖ్యమైనది - హాబర్లర్ అవకాశ వ్యయ సిద్ధాంతము. సాంప్రదాయ నిజ వ్యయ సిద్ధాంతానికి ప్రత్యామ్నాయంగా హాబర్లర్ తన సిద్ధాంతాన్ని 1936లో ప్రతిపాదించారు. సాంప్రదాయ సిద్ధాంతం కన్నా యిది చాలా మెరుగైనది. చర అనుపాతాల స్థితిని కూడా యీ సిద్ధాంతము పరిగణనలోకి తీసుకొంటుంది.

ఈ సిద్ధాంతముననుసరించి ఒక దేశము X వస్తువును కానీ, Y వస్తువును కానీ ఉత్పత్తి చెయ్యగలిగితే, 1 యూనిట్ X వస్తువుసుత్పత్తి చెయ్యడం వలన, కోల్పోయిన Y వస్తువు పరిమాణము, X వస్తువు యొక్క అవకాశ వ్యయముగా పరిగణిస్తారు. అందువలన, ఆ రెండు వస్తువుల మారకపు నిష్పత్తి, వాటి వాటి అవకాశ వ్యయాలనుబట్టి ఉంటుంది. ఈ అవకాశ వ్యయ సిద్ధాంతపు వివరాలను యిప్పుడు పరిశీలిద్దాము.

### 2.2.1 ప్రమేయాలు :

1. రెండు దేశాలు - A, B - ఉంటాయి
2. ప్రతి దేశములోనూ రెండు ఉత్పత్తి కారకాలు - శ్రమ, మూలధనం ఉంటాయి.
3. ప్రతి దేశము రెండు వస్తువులను X, Y లను ఉత్పత్తి చెయ్యగలదు.
4. ఉత్పత్తుల, ఉత్పత్తి కారకాల మార్కెట్లలో సంపూర్ణమైన పోటీ ఉంటుంది.

5. ప్రతి వస్తువు ధర, దాని (ద్రవ్య) ఉపాంత వ్యయానికి సమానంగా ఉంటుంది.

6. ప్రతి ఉత్పత్తి కారకపు ధర, దాని ఉపాంత ఉత్పాదకత విలువకు సమానంగా ఉంటుంది.

7. ఉత్పత్తి కారకాల సప్లయ్ స్థిరంగా ఉంటుంది.

8. ప్రతి దేశములోనూ సంపూర్ణ ఉద్యోగిత ఉంటుంది.

9. సాంకేతిక జ్ఞానము స్థిరంగా ఉంటుంది.

10. ప్రతి దేశంలోను, దేశీయంగా, ఉత్పత్తి కారకాల పూర్తి గమనశీలత ఉంటుంది.

11. దేశాల మధ్య ఉత్పత్తి కారకాల గమనశీలత ఉండదు.

12. రెండు దేశాల మధ్య స్వేచ్ఛా వ్యాపారముంటుంది. వ్యాపారంపై ఎటువంటి ఆంక్షలుండవు.

**2.2.2. ఉత్పత్తి అవకాశాల వక్రరేఖ (Production Possibilites curve) :** పై ప్రమేయాలాధారంగా మనము ఉత్పత్తి అవకాశాల వక్రరేఖను గూర్చి తెలుసుకుందాము. ఒక దేశము ఉత్పత్తి చేయగల రెండు వస్తువుల వివిధ ప్రత్యామ్నాయ సముదాయాలను, యీ రేఖ తెలియజేస్తుంది. ఉత్పత్తి కారకాలు స్థిరంగాను, సాంకేతిక విజ్ఞానం స్థిరంగాను ఉన్నపుడు, సంపూర్ణ ఉద్యోగిత ఉన్నపుడు, పూర్తి సామర్థ్యంతో, ఒక దేశము ఉత్పత్తి చెయ్యగల రెండు వస్తువుల గరిష్ఠ పరిమాణాలను తెలియజేస్తుంది. ఒక వస్తువు యొక్క అదనపు యూనిట్‌ను పొందటానికి, ఎంత పరిమాణములో మరొక వస్తువును కోల్పోవలసి వస్తుందో, దానిని యీ వక్రరేఖ వాలు తెలియజేస్తుంది. దీనినే ఉపాంత మార్పు రేటు (Marginal Rate of Transformation) అని అంటారు. యీ వక్రరేఖ ఆకారం ఏమయినా దానివాలు ఎప్పుడూ ఋణాత్మకంగా ఉంటుంది.

ఈ వాలు, వ్యయ పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. స్థిర అవకాశ వ్యయాలున్నపుడు, యీ వక్రరేఖ సరళరేఖ రూపంలో ఉంటుంది. పెరుగుతున్న అవకాశ వ్యయ పరిస్థితులలో, యీ రేఖ మూలబిందువునకు పుటాకారంగా (Concave to the origin) ఉంటుంది. తగ్గుతున్న అవకాశ వ్యయ పరిస్థితులలో, యీ రేఖ మూలబిందువునకు కుంభాకారంగా (Convex to the origin) గా ఉంటుంది.

వివిధ వ్యయ పరిస్థితులలో దీని ఆకారము అంతర్జాతీయ వ్యాపారానికి ఆధారాన్ని, దాని వల్ల చేకూరే లాభాలను నిర్ణయిస్తుంది. అవకాశ వ్యయ సిద్ధాంతములో, యిదే ప్రధానాంశము. కాబట్టి, మనము వివిధ వ్యయ పరిస్థితులలో ఉత్పత్తి అవకాశాల వక్రరేఖను పరిశీలించి, అంతర్జాతీయ వ్యాపారము ఎలా జరుగుతుందీ, దాని వలన ఏ దేశము, ఏ మేరకు లాభపడేదీ తెలుసుకుందాము.

**2.2.3. స్థిర అవకాశ వ్యయాలు, వ్యాపారము (Trade Under Constant opportunity costs) :**


మన విశ్లేషణ రెండు ప్రశ్నలపై కేంద్రీకరిస్తుంది.

1) వ్యాపారానికి ఆధారం (Basic) ఏది ? వ్యాపార దిశ (Direction of Trade) ఎలా ఉంటుంది ?


2) ఒక దేశానికి గానీ, ప్రపంచానికి గానీ, వ్యాపారం వలన వచ్చే లాభాలేవి ?

ముందుగా మనము స్థిర అవకాశ వ్యయాల పరిస్థితిని పరిశీలిద్దాము, పైన చెప్పినట్లు, స్థిర అవకాశ వ్యయాలున్నపుడు, ఉత్పత్తి అవకాశ వ్యయాల వక్రరేఖ, సరళరేఖ రూపంలో ఉంటుంది.

పటము 2.1




పటము 2.2




పటము 2.1 లో A దేశపు ఉత్పత్తి అవకాశాల రేఖ, మరియు PB, B దేశపు ఉత్పత్తి అవకాశాల రేఖలను తెలియజేస్తాయి. A దేశము, OP పరిమాణములో Y వస్తువును కానీ, OA పరిమాణములో X వస్తువును కానీ ఉత్పత్తి చెయ్యగలదు. అదే విధంగా, B దేశము OB పరిమాణములో X వస్తువును కానీ, OP పరిమాణములో Y వస్తువునుకానీ ఉత్పత్తి చెయ్యగలదు. ఆ దేశాలు రెండు వస్తువులను ఉత్పత్తి చెయ్యదలిస్తే తమ తమ ఉత్పత్తి అవకాశాల రేఖలపై (PA లేదా PB) ఏదో ఒక బిందువు వద్ద ఉత్పత్తి చెయ్యాలి. ఉదాహరణకు B దేశము, PB రేఖపై E బిందువు వద్ద ఉత్పత్తి చేస్తోందనుకొందాము. అపుడు OM పరిమాణములో X వస్తువును, ON పరిమాణములో Y వస్తువును ఉత్పత్తి చెయ్యగలదు. PB రేఖ వాలు, రెండు వస్తువుల సాపేక్ష ధరలను తెలియజేస్తుంది. PB సరళరేఖ. కాబట్టి దాని వాలు స్థిరంగా ఉంటుంది. అనగా ఈ రేఖపై అన్ని బిందువుల వద్ద వస్తుధరల నిష్పత్తి ఒకే విధంగా ఉంటుంది. అవకాశ వ్యయాలు స్థిరంగా ఉన్నాయి. కాబట్టి, వస్తు ధరల నిష్పత్తి, అన్ని బిందువుల వద్ద సమానముగా ఉంటాయి. ఈ రెండు వస్తువుల వ్యయ నిష్పత్తి (లేదా ధరల నిష్పత్తి) A దేశములో OP/OA - B దేశములో OP/OB లకు సమానము.

OP/OA OP/OB కి సమానము కాదు. కాబట్టి యీ రెండు దేశాల మధ్య వ్యాపారానికి అవకాశం ఉంది. రెండు దేశాలు OP పరిమాణములో, Y వస్తువునుత్పత్తి చెయ్యగలవు. కానీ, A దేశము X వస్తువును B దేశము కంటే ఎక్కువ పరిమాణములో - OA - ఉత్పత్తి చెయ్యగలదు. అందువలన, A దేశానికి, X వస్తూత్పత్తిలో తులనాత్మక అనుకూలత ఉందని చెప్పవచ్చు. B దేశానికి, Y వస్తువుత్పత్తిలో తులనాత్మక అనుకూలత ఉంది. ఈ పరిస్థితులలో A దేశము, X వస్తువుత్పత్తిలో ప్రత్యేకీకరణ సలిపి దానిని B దేశానికి ఎగుమతి చేస్తుంది. B దేశము Y వస్తువునుత్పత్తి చేసి A దేశానికి ఎగుమతి చేస్తుంది.

ఇక్కడ B దేశము A కన్నా చిన్న దేశమనుకుందాము. A తో వ్యాపారం చేసిందనుకొందాము. A పెద్ద దేశము కావడం వలన, దాని అంతర్గత ధర రేఖ - PA - B దేశానికి అంతర్జాతీయ ధర రేఖ అవుతుంది. వ్యాపారానికి ముందు B దేశము, తన దేశీయ ధర రేఖ PB పై, E బిందువు వద్ద ఉత్పత్తి, వినియోగము చేస్తోంది. వ్యాపారం తర్వాత Y వస్తూత్పత్తిలో ప్రత్యేకీకరణ చేస్తోంది. E బిందువు నుండి, P బిందువు వద్దకుచేరి, అక్కడ ఉత్పత్తి చేయవచ్చు. E బిందువు నుండి, క్రొత్త అంతర్జాతీయ ధర రేఖ, PA పై గల C బిందువు వద్దకు చేరి, తన వినియోగాన్ని పెంచుకోవచ్చు. C బిందువు వద్ద B దేశము, TC పరిమాణములో Y వస్తువును ఎగుమతి చేసి, PT పరిమాణములో X వస్తువును దిగుమతి చేసుకుంటుంది. వ్యాపారంలో పాల్గొనటం వలన B దేశము లాభం పొందుతుందని దీనిని బట్టి చెప్పవచ్చు.

కానీ, యీ పరిస్థితులలో వ్యాపారం వలన A దేశము లాభపడట్లేదు. దీనికి కారణము వ్యాపారానికి ముందు, తర్వాత కూడా ధరల రేఖ PA అవడం వలన. కానీ, వ్యాపారం తర్వాత, ధర రేఖ యీ రెండింటి మధ్య అంటే PA, PB ల మధ్య ఉంటే, రెండు దేశాలూ లాభపడతాయి. అట్లా ఉండే పరిస్థితిని, పటము 2.2లో చూడవచ్చు. ఈ పటములో PR అంతర్జాతీయ ధర రేఖ అని అనుకుందాము. ఇది PA, PB ల మధ్య ఉన్నది. వ్యాపారానికి ముందు B దేశము, E బిందువు వద్ద రెండు వస్తువులను ఉత్పత్తి చేసి, వినియోగము చేస్తోంది. వ్యాపారం తర్వాత ఆ దేశము P బిందువు వద్ద ఉత్పత్తి చేస్తుంది. అనగా పూర్తిగా Y వస్తూత్పత్తిలో ప్రత్యేకీకరణ చేస్తుంది. వినియోగస్థాయి E బిందువు నుండి C బిందువునకు మారుతుంది. C బిందువు అంతర్జాతీయ ధర రేఖ PR పై ఉంది. ఇపుడు TC పరిమాణములో Y వస్తువును ఎగుమతి చేసి, PT పరిమాణములో X వస్తువును A దేశము నుండి దిగుమతి చేసుకుంటుంది. B దేశము, ఇంతకు మునుపు కన్నా తక్కువగా లాభపడుతుంది. కానీ, A దేశము కూడా వ్యాపార లాభాలలో పాలు పంచుకుంటుంది. A దేశము X వస్తూత్పత్తిలోనూ, B దేశము Y వస్తూత్పత్తిలోనూ ప్రత్యేకీకరణ చేస్తాయి.

పై విశ్లేషణను బట్టి, స్థిర అవకాశ వ్యయ పరిస్థితులలో తులనాత్మక అనుకూలత సూత్రాన్ననుసరించి, పూర్తి ప్రత్యేకీకరణ ఉంటుందని గ్రహించవచ్చు. ఉత్పత్తి స్థాయిని బట్టి వ్యయాలు మారవు. కనుక, ఒక వస్తువును ఎక్కువ లేదా తక్కువగా ఉత్పత్తి చెయ్యడం వలన, దేశము తన తులనాత్మక అనుకూలత (లేదా అననుకూలతను) కోల్పోదు.

2.2.4. పెరిగే అవకాశ వ్యయాలు, వ్యాపారము **(Increasing opportunity costs and Trade) :** ఉత్పత్తి కారకాలను, స్థిర అనుపాతములో ఉపయోగిస్తారని, అవి ఒక దానికొకటి పూర్తి ప్రత్యామ్నాయాలు కావనే ప్రమేయాల వలన, అవకాశ వ్యయాలు స్థిరంగా ఉంటాయి. పై విశ్లేషణ యీ పరిస్థితినే పరిశీలించింది. స్థిర అవకాశ వ్యయ పరిస్థితులలో, వ్యాపారం తర్వాత పూర్తి ప్రత్యేకీకరణ జరుగుతుంది. యీ ప్రత్యేకీకరణ తులనాత్మక అనుకూలత సూత్రానికనుగుణంగా జరుగుతుంది. ఈ విధంగా అవకాశ వ్యయ సిద్ధాంతము సాంప్రదాయిక వ్యాపార సిద్ధాంతాన్ని విశదీకరించింది.

కానీ, వాస్తవ ప్రపంచంలో రెండు వస్తువుల ఉత్పత్తిలోనూ, ఉత్పత్తి కారకాలనొకదానికొకటి ప్రతిష్ఠాపన చేయవచ్చు. ఉత్పత్తి కారకాల అనుపాతాలు స్థిరంగా ఉండకపోవచ్చు. అంతేకాక, అన్ని ఉత్పత్తి కారకాలు, రెండు వస్తువుల ఉత్పత్తికి సమానంగా సరిపోకపోవచ్చు. కొన్ని ఉత్పత్తి కారకాలు ప్రత్యేక తరహా (Specific) గా ఉంటాయి. అంటే, అవి కొన్ని వస్తువుల ఉత్పత్తికే ఉపయోగపడతాయి. Specific and Non-Specific factors వలన పెరిగే అవకాశ వ్యయ పరిస్థితులు ఉత్పన్నమవుతాయి. అపుడు, ఉత్పత్తి అవకాశాల వక్రరేఖ, మూలబిందువులకు, పుటాకారంగా ఉంటుంది. ఒక దేశము, తనకు తులనాత్మక అనుకూలత ఉన్న వస్తూత్పత్తిలో ప్రత్యేకీకరణ సలిపితే, అవకాశ వ్యయాలు పెరుగుతాయి. కానీ, సాంప్రదాయ ఆర్థికవేత్తలు, శ్రమ విలువ సిద్ధాంతం ఆధారంగా, పెరిగే వ్యయ పరిస్థితుల వల్ల ఉత్పన్నమయ్యే క్లిష్ట సమస్యలనధిగమించగలిగారు.

స్థిర అవకాశ వ్యయాలున్నపుడు, ఉత్పత్తి అవకాశాల వక్రరేఖ సరళరేఖగా ఉంటుందని తెలుసుకున్నాము. దాని వాలు స్థిరంగా ఉంటుంది. యీ వాలు వస్తువుల స్థిర ధర నిష్పత్తిని తెలియజేస్తుంది.


పెరిగే అవకాశ వ్యయ పరిస్థితులలో, ఉత్పత్తి అవకాశాల వక్రరేఖ, మూల బిందువునకు పుటాకారంగా ఉంటుంది. దాని వాలు (దేశీయ ధర నిష్పత్తి), ఒక బిందువు వద్ద నుండి మరొక బిందువుకు మారుతుంది. స్థిరంగా ఉండదు. దేశీయ డిమాండ్ పరిస్థితులు తెలిస్తే తప్ప, యీ దేశీయ ధర నిష్పత్తిని నిర్ణయించలేము.

ఉత్పత్తి అవకాశాల వక్రరేఖ, పుటాకారముగా ఉన్నపుడు, రేఖపై, పై నుండి క్రిందకు ఒక బిందువు నుండి మరొక బిందువునకు కదులుతున్నపుడు రేఖ వాలు పెరుగుతుంది. అంటే, అవకాశ వ్యయాలు పెరుగుతాయి. తులనాత్మక అనుకూలత ఉన్న వస్తూత్పత్తిలో ప్రత్యేకీకరణ చేస్తే, దాని అవకాశ వ్యయాలు పెరుగుతాయి.


పటము 2.3 (A), 2.3 (B) లలో పెరిగే అవకాశ వ్యయ పరిస్థితులలో, రెండు దేశాల ఉత్పత్తి అవకాశాల వక్రరేఖలను చూడవచ్చు.

2.3 (A) పటములో AA$^1$ - A దేశపు ఉత్పత్తి అవకాశాల వక్రరేఖ. ఇది మూల బిందువునకు పుటాకారముగా ఉంది. AA$^1$ వాలును పరిశీలిస్తే, A దేశము X వస్తూత్పత్తిలో ప్రత్యేకీకరణ చేస్తుందని గ్రహించవచ్చు. ఈ రేఖపై A బిందువు నుండి A$^1$ బిందువునకు కదలుతుంటే, X వస్తువును 1 యూనిట్ అదనంగా ఉత్పత్తి చెయ్యాలంటే, Y వస్తువును ఎక్కువ యూనిట్లలో కోల్పోవాల్సి వస్తుంది.

పటము 2.3 (A)




పటము 2.3 (B)




అందువలన A దేశము X వస్తూత్పత్తిలో, పెరిగే అవకాశ వ్యయాల పరిస్థితి నెదుర్కొంటుందని గ్రహించాలి. A నుండి A$^1$ బిందువునకు కదులుతుంటే రేఖ వాలు పెరుగుతుంది. ఇది పెరిగే అవకాశ వ్యయాలను సూచిస్తుంది.

పటము 2.3 (B) లో, B దేశపు ఉత్పత్తి అవకాశాల వక్రరేఖ-BB$^1$ ను చూడవచ్చు. దీని వాలును పరిశీలిస్తే, B దేశము, Y వస్తూత్పత్తిలో ప్రత్యేకీకరణ చేస్తుంది. B$^1$ బిందువు నుండి, B బిందువునకు రేఖ వెంబడి పైకి కదలుతుంటే, 1 యూనిట్ Y వస్తువుని అదనంగా ఉత్పత్తి చెయ్యాలంటే, X వస్తువును ఎక్కువ యూనిట్లలో కోల్పోవాల్సి వస్తుంది. అందువలన B దేశము తను ప్రత్యేకీకరణ చేసే Y వస్తువులో ప్రతి అదనపు యూనిటు ఉత్పత్తికి పెరిగే అవకాశ వ్యయాల పరిస్థితి నెదుర్కొంటుంది.

వ్యాపారం లేనపుడు, A దేశము K బిందువు వద్ద సమతౌల్య స్థితిలో ఉంటుంది. ఈ బిందువు వద్ద MN- దేశీయ ధరల నిష్పత్తి రేఖ, AA$^1$ ఉత్పత్తి అవకాశాల వక్రరేఖకు స్పర్శ రేఖగా ఉంది. అంటే K బిందువు వద్ద, A దేశము, రెండు వస్తువులను - X, Y - లను ఉత్పత్తి చేసి వినియోగము చేస్తుంది. (పటము 2.3 A). అదే విధంగా, పటము 2.3 (B) ని పరిశీలిస్తే, B దేశము K$^1$ బిందువు వద్ద సమతౌల్య స్థితిలో ఉంది. ఈ బిందువు వద్ద M$^1$N$^1$ దేశీయ ధరల నిష్పత్తి రేఖ, BB$^1$ ఉత్పత్తి అవకాశాల వక్రరేఖకు స్పర్శ రేఖగా ఉంది. అంటే K$^1$ బిందువువద్ద B దేశము రెండు వస్తువులను XY లను ఉత్పత్తి చేసి వినియోగము చేస్తుంది. ఇది వ్యాపారం లేనప్పటి పరిస్థితి.

ఇపుడు, రెండు దేశాలు వ్యాపారంలో పాల్గొనాలని నిర్ణయించాయనుకొందాము. అంతర్జాతీయ ధర నిష్పత్తి, రెండు దేశాలలోని దేశీయ ధరల నిష్పత్తి కన్నా భిన్నంగా ఉన్నపుడే యిది సాధ్యపడుతుంది. PL రేఖ అంతర్జాతీయ ధరల నిష్పత్తిని తెలియజేస్తుంది. 2.3 (A) లోని PL రేఖ, 2.3 (B) లోని P$^1$L$^1$ రేఖ సమాంతరంగా ఉన్నాయి. అంటే వీటి వాలు ఒకటే. అనగా రెండు దేశాలకు, అంతర్జాతీయ ధరల నిష్పత్తి ఒకటే.

ముందుగా, మనము A దేశపు పరిస్థితిని పరిశీలిద్దాము. E బిందువు వద్ద, అంతర్జాతీయ ధర రేఖ PL, AA' కు స్పర్శరేఖగా ఉంది. అంటే E బిందువు, A దేశపు నూతన సమతౌల్య స్థితిని తెలియజేస్తుంది. PL రేఖ వాలు, MN రేఖ వాలు కన్నా ఎక్కువగా ఉంది. అంటే X వస్తువు ధర, దేశీయ మార్కెటులో కన్నా, అంతర్జాతీయ మార్కెటులో ఎక్కువగా ఉంది. అందువలన A దేశము, X వస్తూత్పత్తిలో ప్రత్యేకీకరణ చెయ్యాలి. Y వస్తూత్పత్తికి కేటాయించిన ఉత్పత్తి కారకాలను, X వస్తూత్పత్తికి తరలించి, X వస్తువును ఎక్కువ పరిమాణంలో ఉత్పత్తి చెయ్యడం, A దేశానికి లాభదాయకం. K బిందువు నుండి, E బిందువుకు ఉత్పత్తి స్థాయి మారుతుంది. X వస్తువును, OR పరిమాణములోనూ, Y వస్తువును OQ పరిమాణములోనూ ఉత్పత్తి చేస్తుంది.

వినియోగపు బిందువు C అనుకుందాము. TR పరిమాణములో X వస్తువు నెగుమతి చేసి, QS పరిమాణములో Y వస్తువును దిగుమతి చేసుకుంటుంది. CDE వ్యాపార త్రిభుజము (Trade Triangle) DE = TR = X ఎగుమతుల పరిమాణము. DC = QS = Y వస్తువు దిగుమతుల పరిమాణము. X వస్తువు వినియోగ పరిమాణము QD = OT, Y వస్తువు వినియోగ పరిమాణము TD = OQ. వ్యాపారంలో పాల్గొనటం వలన, A దేశము అంతకు ముందు కంటే ఎక్కువ పరిమాణములో X,Y వస్తువులను వినియోగం చేస్తుంది. C బిందువు K బిందువుకు కుడివైపుగా ఎగువన ఉంది.

B దేశాన్ని పరిశీలిద్దాం. క్రొత్త సమతౌల్య బిందువు E'. ఈ బిందువు వద్ద, అంతర్జాతీయ ధర రేఖ P'L' - BB' కు స్పర్శ రేఖగాఉంది. (పటము 2.2 (B), Y వస్తువు ధర, దేశీయ మార్కెటులో కన్నా, అంతర్జాతీయ మార్కెటులో ఎక్కువ. P'L' వాలు M'N' వాలు కన్నా తక్కువ. అందువలన, X వస్తూత్పత్తి నుండి, Y వస్తూత్పత్తికి, ఉత్పత్తి కారకాలను తరలించి, ఎక్కువ పరిమాణములో Y వస్తువునుత్పత్తి చేయడం B దేశానికి లాభదాయకం. ఉత్పత్తి స్థాయి K' బిందువు వద్ద నుండి E' బిందువుకు మారుతుంది. అపుడు, OQ' పరిమాణములో Y వస్తువును, OR' పరిమాణములో X వస్తువునుత్పత్తి చేస్తుంది. B దేశపు వినియోగ బిందువు C' (P'L' ధర రేఖపై) B దేశము D' C' పరిమాణములో X వస్తువును దిగుమతి చేసుకొని, D'E' పరిమాణములో Y వస్తువును ఎగుమతి చేస్తుంది. E'D'C' వ్యాపార త్రిభుజము - దేశీయంగా OS' పరిమాణములో Y వస్తువును, OR' పరిమాణములో X వస్తువును వినియోగం చేస్తుంది. B దేశము కూడా మునుపటి కన్నా, X, Y వస్తువులను ఎక్కువ పరిమాణములో వినియోగం చేస్తుంది. C' బిందువు, K' బిందువుకు కుడివైపున ఉన్నది.

పెరిగే అవకాశ వ్యయాల పరిస్థితి విశ్లేషణ ఒక ముఖ్య విషయాన్ని తెలియజేస్తుంది. ప్రతి దేశము తనకు తులనాత్మక అనుకూలత ఉన్న వస్తూత్పత్తిలో ప్రత్యేకీకరణ చేస్తుంది. కాని ఇది పాక్షికంగా మాత్రమేనని గ్రహించాలి.

రెండు దేశాల్లో వ్యయాలు, పెరిగే అవకాశ వ్యయాల దృష్ట్యా Converge అవుతాయి. అందువలన వ్యయాలలో ఉన్న తేడాలు తొలగిపోతాయి. కాబట్టి, యింకా అధికంగా ప్రత్యేకీకరణ చేయడానికి ఆధారం ఉండదు. ప్రత్యేకీకరణకు గల ఆధారం తొలగి పోయినపుడు, రెండు దేశాలు, రెండు వస్తువులను, ఎంతో కొంత పరిమాణములో ఉత్పత్తి చేస్తాయి. కాబట్టి, వాస్తవ ప్రపంచంలో పెరిగే అవకాశ వ్యయ పరిస్థితులలో, స్వేచ్ఛా వ్యాపారం వలన పాక్షిక ప్రత్యేకీకరణ జరుగుతుంది. అందువలన , యీ పరిస్థితులలో వ్యాపారం వలన లాభాలు తక్కువగానే ఉంటాయి (సంపూర్ణ ప్రత్యేకీకరణ పరిస్థితితో పోలిస్తే).


పై విశ్లేషణ ఒక విషయాన్ని స్పష్టం చేస్తుంది. పెరిగే అవకాశ వ్యయ పరిస్థితులుండి, ఉత్పత్తి అవకాశాల వక్రరేఖ పుటాకారంగా ఉన్నపుడు కూడా, తులనాత్మక వ్యయ సిద్ధాంతం వర్తిస్తుంది. శ్రమ విలువ సిద్ధాంతాన్ని విడనాడి, స్థిర వ్యయాల ప్రమేయాన్ని వదలి వేసినా రికార్డో తులనాత్మక వ్యయ సిద్ధాంతం మారదు. ఏ విధంగానూ ఈ సిద్ధాంతం మార్పు చెందదు.

**2.2.5. తగ్గుతున్న వ్యయాలు, వ్యాపారం :** ఇపుడు మనము తగ్గుతున్న అవకాశ వ్యయ పరిస్థితులను పరిశీలిద్దాము. రెండు దేశాలలోనూ యీ పరిస్థితి ఉన్నపుడు ఉత్పత్తి అవకాశాల వక్రరేఖలు మూల బిందువునకు కుంభాకారంగా (Convex to the origin) ఉంటాయి. యీ పరిస్థితులలో ప్రతి దేశము వ్యాపారంలో పాల్గొన్న తర్వాత, ఒకే ఒక వస్తువుత్పత్తిలో ప్రత్యేకీకరణ సలుపుతుంది. అంతర్గత ఆదాల వలన పెరిగే ప్రతిఫలాలు సంభవించి వ్యయాలు తగ్గుతాయి.

పటము 2.4 ఇటువంటి పరిస్థితులలో వ్యాపారాన్ని తెలియజేస్తుంది. $AA^1$, A దేశపు ఉత్పత్తి అవకాశాల వక్రరేఖ. $BB^1$, B దేశపు ఉత్పత్తి అవకాశాల వక్రరేఖ. ఈ రెండూ మూల బిందువునకు (O) కు కుంభాకారంగా ఉన్నాయి.

$AA^1$ వక్రరేఖకు, దేశీయ ధర రేఖ $aa^1$ K బిందువు వద్ద స్పర్శరేఖగా ఉంది. ఆ బిందువు వ్యాపారానికి ముందు A దేశములో ఉత్పత్తి, వినియోగములను తెలుపుతుంది. అదే విధంగా $bb^1$ B దేశములో ధర రేఖ. ఇది $BB^1$ రేఖకు $K^1$ బిందువు వద్ద స్పర్శరేఖగా ఉంది. ఈ బిందువు వ్యాపారానికి ముందు B దేశములో ఉత్పత్తి, వినియోగాలను తెలియజేస్తుంది. ఈ రెండు దేశాల ధర రేఖలను పోల్చి చూస్తే A దేశపు ధర రేఖ - $aa^1$ - వాలు దేశానికి X వస్తూత్పత్తిలో గల తులనాత్మక అనుకూలతను తెలియజేస్తుంది. అదే విధంగా, $bb^1$ వాలు B దేశానికి Y వస్తూత్పత్తిలో తులనాత్మక అనుకూలత ఉందని తెలియజేస్తుంది. K $K^1$ బిందువులు సమతౌల్య బిందువులు. కాని, అవి స్థిర సమతౌల్య బిందువులు కావు. ప్రత్యేకీకరణ చేసే వస్తువు ధరలో ఏ స్వల్పమార్పు వచ్చినా, పూర్తి ప్రత్యేకీకరణకు దారి తీస్తుంది.

**పటము 2.4**




ఇపుడు రెండు దేశాలు వ్యాపారంలో పాల్గొన్నాయను కొందాము. అంతర్జాతీయ ధర రేఖ $BA^1$ అని అనుకుందాము. దీని వాలు A దేశములోని ధర రేఖ ($aa^1$) వాలుకన్నా ఎక్కువ. అనగా అంతర్జాతీయ మార్కెట్లో X వస్తువు ధర ఎక్కువగా ఉంది. అందువలన A దేశము X వస్తూత్పత్తిలో ప్రత్యేకీకరణ చేస్తుంది. A దేశము తన వనరులన్నీ X వస్తూత్పత్తికే కేటాయించి K బిందువు నుండి $A^1$ బిందువుకు కదులుతుంది.

ఈ విధంగా A దేశము X వస్తూత్పత్తిలో ప్రత్యేకీకరణ చేసి, $A^1$ బిందువు వద్ద ఉత్పత్తి చేస్తుంది. B దేశము Y వస్తూత్పత్తిలో ప్రత్యేకీకరణ చేసి B బిందువు వద్ద ఉత్పత్తి చేస్తుంది. ఇపుడు ప్రతి దేశము అంతర్జాతీయ ధర రేఖ - $BA^1$ - వెంబడి కదులుతుంది. A దేశము $A^1$ బిందువు నుండి పైకి, B దేశము $B^1$ బిందువు నుండి క్రిందకు కదలుతాయి. $BA^1$ రేఖ వెంబడి కదలుతూ, C బిందువు వద్దకు చేరతాయి. C వినియోగ బిందువు. అంటే, A దేశము $D^1A^1$ పరిమాణములో X వస్తువును B దేశానికి ఎగుమతి చేసి, ఆ దేశము నుండి $D^1C$ పరిమాణములో Y వస్తువును దిగుమతి చేసుకుంటుంది. $C^1D^1A^1$ - వ్యాపార త్రిభుజము. A దేశము, $OD^1$ పరిమాణములో X

వస్తువును దేశీయంగా వినియోగం చేస్తుంది. అదే విధంగా B దేశము DB పరిమాణములో Y వస్తువును A దేశానికి ఎగుమతి చేసి, ఆ దేశము నుండి DC పరిమాణములో X వస్తువును దిగుమతి చేసుకుంటుంది. BDC - వ్యాపార త్రిభుజము - దేశీయంగా OD పరిమాణములో Y వస్తువును వినియోగం చేస్తుంది.

**2.2.6. అవకాశ వ్యయ సిద్ధాంతం - విమర్శలు :** తులనాత్మక వ్యయ సిద్ధాంతం, శ్రమ విలువ సిద్ధాంతాన్ని ఆధారంగా చేసికొని ప్రతిపాదింపబడింది. కానీ శ్రమ విలువ సిద్ధాంతం, అవాస్తవిక ప్రమేయాలపై ఆధారపడినది. కావున, దానిని విడనాడి అవకాశ వ్యయ సిద్ధాంతం తులనాత్మక వ్యయ సిద్ధాంతానికి ప్రత్యామ్నాయంగా రూపొందింపబడినది. అందువలన ఈ సిద్ధాంతము వాస్తవికతకు దగ్గరగా ఉంటుంది. స్థిర, పెరిగే, తగ్గే అవకాశ వ్యయ పరిస్థితులలో, వ్యాపారానికి ముందు తర్వాత ఉండే పరిస్థితులను యీ సిద్ధాంతం విశ్లేషించింది. తులనాత్మక వ్యయ సిద్ధాంతం, స్థిర వ్యయాలపై ఆధారపడినది. కాబట్టి, విశ్లేషణ విస్తృతి దృష్ట్యా అవకాశ వ్యయ సిద్ధాంతం సాంప్రదాయిక తులనాత్మక వ్యయ సిద్ధాంతము కన్నా మెరుగైనది.

కానీ, జాకబ్ వైనరు (Jacob Viner) యీ సిద్ధాంతాన్ని తీవ్రంగా విమర్శించి, సాంప్రదాయిక వాదాన్ని గట్టిగా సమర్థించారు. శ్రేయస్సు మదింపులో యిది సాంప్రదాయక సిద్ధాంతానికన్నా మెరుగైనది కాదని విమర్శించాడు. త్యాగాలు ఇబ్బందులను కొలవటంలో ఇది విఫలమవుతుంది. ఉత్పత్తి కారకాల సప్లయ్‌లలో మార్పులను విశ్రాంతి, ఆదాయ, సంపాదనల మధ్య శ్రామికుల యిష్టా యిష్టాలను, అవకాశ వ్యయాల వక్రరేఖ పరిగణనలోకి తీసుకోలేదని యితని విమర్శ.

కానీ యీ విమర్శలన్నీ నిరాధారమైనవి. ఈ విశ్లేషణ ద్వారా శ్రేయస్సును గూర్చి చెప్పలేమనే విమర్శ సరికాదు. ఆచార్య శామ్యూల్‌సన్, యీ విశ్లేషణ ద్వారా ఒక దేశము తన శ్రేయస్సును వ్యాపారంలో పాల్గొని లాభాలను పెంచుకోవచ్చని నిరూపించారు.

ఉత్పత్తి కారకాల సప్లయ్‌లలోని, మార్పులను గూడా యీ సిద్ధాంతము పరిగణిస్తుందని, వి.సి. వాల్ష్ (V.C. Walsh) అనే ఆర్థిక వేత్త నిరూపించారు. విశ్రాంతి ఎక్కువగా అభిలషించటం వలన, అవకాశ వ్యయాల వక్రరేఖ ఏ ఆకారంలో ఉండేదీ, యీ సిద్ధాంతము పరిగణిస్తుందని నిరూపించారు.

పై విమర్శలున్నప్పటికీ అవకాశ వ్యయాల సిద్ధాంతం సమగ్ర సమతౌల్య నమూనా యొక్క సంక్షిప్తీకరించబడిన భాగమని Richard Caves అభిప్రాయము. ఈ సిద్ధాంతాన్ని విమర్శించినవారు కూడా, దానిని తమ విశ్లేషణలలో ఉపయోగించడాన్ని యీ సిద్ధాంతము యొక్క ప్రాచుర్యాన్ని చాటుతుందని ఆచార్య శామ్యూల్‌సన్ అభిప్రాయపడ్డారు.

## 2.3. మీడ్ విశ్లేషణ :

నోబెల్ బహుమతి గ్రహీత జేమ్స్ మీడ్ వ్యాపార ఉదాసీనతా వక్రరేఖ (Trade Indifference Curve) అనే విశ్లేషణ ఉపకరణాన్ని రూపొందించారు. దీనినుపయోగించి, ఉత్పత్తి అవకాశాల వక్రరేఖ మరియు సామాజిక ఉదాసీనతా వక్రరేఖను బట్టి, ఒక దేశపు Offer curve ను రాబట్టవచ్చును. ఈ ఉపకరణము ద్వారా మీడ్ ఉత్పత్తి వినియోగములపై వ్యాపార ప్రభావము మరియు వ్యాపారము వల్ల వచ్చే లాభాలను మదింపు చేసారు.

ఉత్పత్తి అవకాశాల వక్రరేఖను గూర్చి మనము పైన తెలుసుకున్నాము. ఇపుడు, సామాజిక ఉదాసీనతా వక్రరేఖలను గూర్చి తెలుసుకోవాలి. సూక్ష్మ అర్థశాస్త్రములో మనము వినియోగదారుని ఉదాసీనతా వక్రరేఖలు గురించి తెలుసికొని యున్నాము. వినియోగదారుని అభిరుచులను తెలియజేసే సాధనమది. సామాజిక ఉదాసీనతా వక్రరేఖలు ఒక సంఘము యొక్క అభిరుచులను తెలియజేసే సాధనము.

నవ్య సాంప్రదాయ వ్యాపార సిద్ధాంతము రెండు సులభమైన ప్రమేయాలను చేస్తుంది.

1) వినియోగదారుని ఉదాసీనతా వక్రరేఖల వలె, సామాజిక ఉదాసీనతా వక్రరేఖలు, ఒక సంఘము యొక్క అభిరుచులను తెలియజేసే సాధనము.

2) ఈ సామాజిక ఉదాసీనతా వక్రరేఖలలో అత్యున్నతమైన వక్రరేఖను అందుకోటానికి ఒక సంఘము ప్రయత్నం చేస్తుంది.


## 2.4. సామాజిక ఉదాసీనతా వక్రరేఖలు (Community Indifference Curves) :

ఒక జాతికి లేదా దేశానికి సమాన సంతృప్తి నిచ్చే రెండు వస్తువుల వివిధ సముదాయాలను ఒక సామాజిక ఉదాసీనతా వక్రరేఖ తెలియజేస్తుంది. ఒక రేఖకు ఎగువన ఉన్న రేఖలు ఎక్కువ సంతృప్తిని, దిగువన ఉండే రేఖలు తక్కువ సంతృప్తిని తెలియజేస్తాయి. అవి మూల బిందువునకు కుంభాకారముగా ఉంటాయి. అవి పరస్పరం ఖండించుకోవు. వాటి వాలు ఋణాత్మకంగా ఉంటుంది. ఒక రేఖ వాలు, రెండు వస్తువుల మధ్య ప్రతిష్టాపనోపాంత రేటుని తెలుపుతుంది. ఒక దేశము, ఒక వస్తువు యొక్క అదనపు యూనిట్టును పొందటానికి, ఎంత పరిమాణములో మరొక వస్తువును కోల్పోవటానికి యిష్టపడేదీ తెలియజేస్తుంది.

ఈ వక్రరేఖలనుపయోగించి, మనము వ్యాపారానికి మూలము (Basic) మరియు వ్యాపారం వలన లాభాలను విశ్లేషించవచ్చు.

పటము 2.5లో $CI_1$, $CI_2$, $CI_3$ సామాజిక ఉదాసీనతా వక్రరేఖలు. $PP_1$ ఉత్పత్తి అవకాశాల రేఖ. వ్యాపారానికి ముందు, A దేశము, E బిందువు వద్ద సమతౌల్య స్థితిలో ఉంది. $CI_2$ సామాజిక ఉదాసీనతా వక్రరేఖ, A దేశపు ఉత్పత్తి అవకాశాల వక్రరేఖ $PP^1$ కు E బిందువు వద్ద స్పర్శరేఖగా ఉంది. పటములోని $CI_1$, $CI_2$, $CI_3$ వక్రరేఖలలో, $CI_2$ వక్రరేఖ A దేశము అందుకోగల అత్యున్నత వక్రరేఖ. F బిందువు $CI_3$ పై ఉన్నది.

పటము 2.5




కాని దేశపు ఉత్పత్తి అవకాశాల రేఖ $PP^1$ కాబట్టి ఈ బిందువును అందుకోలేదు. కాబట్టి $PP^1$ ఉత్పత్తి అవకాశాల వక్రరేఖగా ఉన్నపుడు, $CI_2$ యే A దేశము అందుకోగల అత్యున్నత వక్రరేఖ. E బిందువు వద్ద A దేశపు సంతృప్తి గరిష్ట స్థాయిలో ఉంటుంది. వినియోగానికి అందుబాటులో ఉన్న వస్తువుల పరిమితులను $PP^1$ రేఖ తెలియజేస్తుంది.

G, H బిందువులు దిగువన గల ఉతాసీనతా వక్రరేఖ $CI_1$ పై ఉన్నవి. అవి తక్కువ సంతృప్తి స్థాయిని తెలుపుతాయి. $PP^1$ ఉత్పత్తి అవకాశాల వక్రరేఖ అయినపుడు ఎగువన ఉన్న $CI_2$ రేఖను అందుకోవచ్చు.

కాబట్టి, E బిందువు వ్యాపారం లేనపుడు సమతౌల్య ఉత్పత్తిని, వినియోగాన్ని తెలియజేస్తుంది.


## 2.5. వ్యాపారానికి ఆధారం, వ్యాపారం వలన లాభాలు : పునః ప్రకటన :

ఉదాసీనతా వక్రరేఖలనుపయోగించి ఒక ఉదాహరణ ద్వారా మనము వ్యాపారానికి ఆధారము మరియు వ్యాపారం వలన లాభాలను మరల ఒకసారి గ్రహించవచ్చు. పటము 2.6 యీ రెండింటిని విశదీకరిస్తుంది.

పటము 2.6 A దేశపు వ్యాపార స్థితిని తెలియజేస్తుంది. సంతృప్తిని గరిష్ఠం చేస్తుందనే ప్రమేయాధారంగా, A దేశము, బిందువు A వద్ద సమతౌల్య స్థితిలో ఉంటుంది. $CI_1$ రేఖ, ఉత్పత్తి అవకాశాల వక్రరేఖకు, A బిందువు వద్ద స్పర్శరేఖగా ఉంది. ఈ బిందువు, A దేశపు ఉత్పత్తి వినియోగాలను తెలుపుతుంది. ఈ బిందువు వద్ద, $T_A$ రేఖ, A దేశపు సాపేక్ష ధరల నిష్పత్తిని తెలియజేస్తుంది. A బిందువు వద్ద, $T_A$ రేఖ వాలు, ఉత్పత్తి అవకాశాల వక్రరేఖకు సమానము.

ఇపుడు, మనము మరొక దేశము B ని గూడా పరిశీలిద్దాము. ఈ దేశంతో పోలిస్తే A దేశానికి X వస్తూత్పత్తిలో తులనాత్మక అనుకూలత ఉందనుకొందాము. అందువలన A దేశము X వస్తూత్పత్తిలో ప్రత్యేకీకరణ చేస్తుంది. రెండు దేశాలలోని X వస్తువు సాపేక్ష ధరలు సమానమయ్యే వరకూ యీ ప్రత్యేకీకరణ కొనసాగుతుంది. B బిందువు వరకూ యీ ప్రక్రియ కొనసాగిందనుకుందాము. ఈ బిందువు వద్ద A దేశపు ధర, B దేశపు ధరకు పెరుగుతుంది. TT సరళరేఖ, దీనిని తెలియజేస్తుంది. TT రేఖయే అంతర్జాతీయ వర్తక నిబంధనల రేఖ అని అనుకొందాము.

**పటము 2.6**




B బిందువు వద్ద నుండి ఉత్పత్తి నారంభించి A దేశము X వస్తువును B దేశానికి ఎగుమతి చేసి, ఆ దేశము నుండి Y వస్తువును దిగుమతి చేసుకుంటుంది. TT రేఖ వెంబడి A దేశము వ్యాపారాన్ని చేస్తుంది.

A దేశపు సమస్య - తన శ్రేయస్సును గరిష్ఠం చేసే వ్యాపార స్థాయిని నిర్ణయించుట - PQ యూనిట్ల X వస్తువును, RS యూనిట్ల Y వస్తువునకు, ( TT రేఖ వెంబడి) మార్పిడి చేసుకుందనుకుందాము. దీని వలన, A దేశపు ఉత్పత్తి బిందువు వ్యాపారం తర్వాత వినియోగ బిందువు D కి మారుతుంది. కానీ, A దేశపు స్థితి వ్యాపారానికి ముందు కంటే మెరుగ్గా లేదు. దీనికి కారణము రెండు బిందువులు $CI_1$ రేఖపైనే ఉన్నవి. PQ యూనిట్ల X మరియు RS యూనిట్ల Y - A దేశానికి ఆమోద యోగ్యమైన కనిష్ట వ్యాపార పరిమాణము. దీని కన్నా తక్కువ వ్యాపార పరిమాణము, ఆ దేశాన్ని యింకా దిగువన ఉండే ఉదాసీనతా వక్రరేఖ మీదకు చేరుస్తుంది.

అట్లా కాకుండా A దేశము, LQ యూనిట్ల X వస్తువును, RV యూనిట్ల Y వస్తువు కొరకు మార్పిడి చేసినదనుకొందాము. అపుడు ఆ దేశము B ఉత్పత్తి బిందువు వద్ద నుండి వ్యాపారం తర్వాత వినియోగ బిందువు E వద్దకు చేరుతుంది. వ్యాపారం తర్వాత కూడా A దేశము మరల $CI_1$ రేఖపైనే ఉంటుంది. వ్యాపారం వలన లాభమేమీ లేదు. LQ యూనిట్ల X వస్తువు మరియు RV యూనిట్ల Y వస్తువు, A దేశానికి ఆమోద యోగ్యమైన గరిష్ట వ్యాపార పరిమాణము. ఇంతకన్నా ఎక్కువ పరిమాణము A దేశాన్ని $CI_1$ కన్నా దిగువన ఉండే ఉదాసీనతా వక్రరేఖ పైకి చేరుస్తుంది.

వర్తక నిబంధనల రేఖ TT వెంబడి వ్యాపారం చేస్తూ, A దేశము గరిష్ట సంక్షేమాన్ని సాధించాలి. MQ యూనిట్ల X వస్తువును, ఎగుమతి, చేసి RV యూనిట్ల Y వస్తువును దిగుమతి చేసుకుంటే యిది సాధ్యపడుతుంది. A దేశపు వ్యాపారం తర్వాత వినియోగ బిందువు C ఇది $CI_2$ రేఖపై ఉంది. $CI_2$ రేఖ $CI_1$ రేఖకు ఎగువన ఉంది. అంటే అది ఎక్కువ సంతృప్తి స్థాయిని తెలియజేస్తుంది. ఇది A దేశము సాధించగల గరిష్ట సంతృప్తిస్థాయి.

ఇపుడు A మరియు C బిందువులను పోల్చి చూడాలి. A బిందువు వ్యాపారం లేనప్పటి పరిస్థితిని, C బిందువు వ్యాపారం తర్వాత ఉండే పరిస్థితిని తెలియజేస్తాయి. వ్యాపారం లేనప్పటికంటే వ్యాపారం తర్వాత A దేశము, Y వస్తువును ఎక్కువ పరిమాణములోనూ, X వస్తువును తక్కువ పరిమాణములోనూ వినియోగము చేస్తుంది. కాని C బిందువు అభిలషణీయ బిందువు. ఉదాసీనతా వక్రరేఖ విశ్లేషణలో, సంతృప్తి స్థాయిని బట్టి వ్యాపారం వలన లాభాలను కొలుస్తాము కాని వినియోగం చేసే వస్తువుల సంఖ్యను బట్టి కాదు. కావున, సామాజిక ఉదాసీనతా వక్రరేఖలనుపయోగించి, వ్యాపారానికి ఆధారం (Basic) మరియు వ్యాపారం వలన వచ్చే లాభాలను మనము మరల పునరుద్ఘాటన చేయవచ్చు.

వ్యాపారం లేనపుడు ఒక దేశము తన సామాజిక ఉదాసీనతా వక్రరేఖ, ఉత్పత్తి అవకాశాల వక్రరేఖకు స్పర్శరేఖగా ఉన్నచోట సమతౌల్య స్థితిలో ఉంటుంది. ఈ స్పర్శ బిందువు వద్ద రెండింటి వాలు సమానము. సమానంగా వున్న యీ ఉమ్మడి వాలు, దేశీయంగా రెండు వస్తువుల సాపేక్ష ధరను తెలుపుతుంది. రెండు దేశాలలో వస్తువుల సాపేక్ష ధరలలో తేడాలున్నపుడు ఉభయ దేశాలకు లాభదాయకంగా ఉండే వ్యాపారానికి ఆధారం ఏర్పడుతుంది.

వ్యాపారం లేనప్పటికన్నా వ్యాపారం ఉన్నపుడు ఉన్నత ఉదాసీనతా వక్రరేఖను చేరుకోగలిగితే, ఒక దేశము వ్యాపారం వలన లాభపడుతుంది. వ్యాపారం తర్వాత వినియోగ బిందువు అంతర్జాతీయ వర్తక నిబంధనల రేఖ ఒక సామాజిక ఉదాసీనతా వక్రరేఖకు స్పర్శ రేఖగా ఉన్న బిందువుల వద్ద ఉంటే వ్యాపారం వలన లాభాలు గరిష్టముగా ఉంటాయి.

## 2.6. వ్యాపార ఉదాసీనతా వక్రరేఖలు (Trade Indifference Curves) :


వ్యాపార ఉదారసీనతా వక్రరేఖలు జేమ్స్ మీడ్ ప్రవేశపెట్టిన రేఖాత్మక ఉపకరణము. 1952లో ప్రచురితమైన A Geometry of International Trade అను గ్రంధములో మీడ్ యీ ఉపకరణము ద్వారా offer curve పొందే పద్ధతిని వివరించారు. ఈ పద్ధతి ద్వారా ఉత్పత్తి, వినియోగము, వ్యాపార లాభాలపై వ్యాపారం యొక్క ప్రభావం ఎలా ఉంటుందో వివరించారు. వర్తక మార్పుల వల్ల, వ్యాపార పరిమాణములో మార్పుల వల్ల దేశీయ ఉత్పత్తి వినియోగము మరియు వాస్తవిక ఆదాయాలలో వచ్చే మార్పులను ఒక వ్యాపార ఉదాసీనతా వక్రరేఖ తెలియజేస్తుంది.

సామాజిక ఉదాసీనతా వక్రరేఖల నుండి మరియు ఉత్పత్తి అవకాశాల వక్రరేఖ నుండి, యీ వ్యాపార ఉదాసీనతా వక్రరేఖలను రాబట్టవచ్చును. ఒక సామాజిక ఉదాసీనతా వక్రరేఖ నందుకోటానికి ఒక దేశానికి అవసరమైన వివిధ ఎగుమతి దిగుమతుల సముదాయాలను యీ వ్యాపార ఉదాసీనతా వక్రరేఖ తెలియజేస్తుంది. ప్రతి సామాజిక ఉదాసీనతా వక్రరేఖ నుండి ఒక వ్యాపార ఉదాసీనతా వక్రరేఖను రాబట్టవచ్చును. ఒకే వ్యాపార ఉదాసీనతా వక్రరేఖ, ఒక దేశానికి సమాన శ్రేయస్సునందించే వివిధ వ్యాపార పరిస్థితులను సూచిస్తుంది. ఒక వ్యాపార ఉదాసీనతా సూచించే శ్రేయస్సు స్థాయి, అది ఏ సామాజిక ఉదాసీనతా వక్రరేఖ నుండి రాబట్టబడినదో దానిపై ఆధారపడుతుంది.

పటము 2.7లో వ్యాపార ఉదాసీనతా వక్రరేఖను రాబట్టే పద్ధతి వివరించబడినది. రెండు దేశాలు A, B ఉన్నాయనుకుందాము. ఇవి రెండు వస్తువులను ఉత్పత్తి చేస్తాయనుకొందాము. వీటినే మీడ్ A - Exportables అనీ, B - Exportables అనీ వ్యవహరించారు. A - Exportables అనగా A దేశము ఎగుమతి చెయ్యడానికి సాధ్యపడే వస్తువు. B - Exportables అనగా B దేశము ఎగుమతి చెయ్యడానికి సాధ్యపడే వస్తువు. ఇక్కడ A - Exportables, B - Importables అనీ, B - Exportables A - Importables అని గ్రహించాలి. పటము 2.7లో A - Exportables X - అక్షాలు - OX మరియు OX' పైన, B - Exportables Y - అక్షాలు - OY మరియు OY' పైన కొలుస్తాము. X అక్షము కుడి నుండి ఎడమకు ధనాత్మక పరిమాణాలను సూచిస్తుంది. (సాధారణంగా ఎడమనుండి కుడికి యీ పరిమాణాలను సూచించటం జరుగుతుంది. దీనికి భిన్నంగా యీ పటంలో సూచించబడుతుంది. గ్రహించవలసిన అంశము )

A దేశపు ఉత్పత్తి అవకాశాల వక్రరేఖను పటము 2.7లో రెండవ వృత్త పాదము (Second Quadrant) లో చూపించాము. MPN, A దేశపు ఉత్పత్తి అవకాశాల వక్రరేఖ. సామాజిక ఉదాసీనతా వక్రరేఖలను గూడా, రెండవ వృత్త పాదములోనే చూపించాము. $CI_1$, ఒక సామాజిక ఉదాసీనతా వక్రరేఖ. ఇది P బిందువు వద్ద, MPN రేఖకు స్పర్శ రేఖగా ఉంది. వ్యాపారం లేనపుడు, A దేశము P బిందువు వద్ద ఉత్పత్తి చేసి వినియోగము చేస్తుంది. $CI_1$ సూచించే సామాజిక శ్రేయస్సు స్థాయిని పొందుతుంది.

**పటము 2.7**




ఈ OMPN ను ఉత్పత్తి బ్లాకు (Production Block) గా వ్యవహరిద్దాము. ఈ బ్లాకును $CI_1$ రేఖ వెంబడి పైకి గానీ, క్రిందకు గానీ కదలించవచ్చునుకొందాము. యిలా కదలించినప్పుడు MPN ఎల్లప్పుడూ $CI_1$ కు స్పర్శరేఖగా ఉంటుంది. $M_o$ రేఖ ఎల్లప్పుడు సమాంతర స్థితిలోనే ఉంటుంది. ఈ ప్రక్రియలో యీ బ్లాకు యొక్క మూల బిందువు -o- కదలుతూ, $TI_1$ రేఖ యొక్క ప్రతి (Trace) ని సృష్టిస్తుంది. ఈ $TI_1$ రేఖనే వ్యాపార ఉదాసీనతా వక్రరేఖ అని పిలుస్తాము. పైన వివరించినట్లు, A దేశము సామాజిక ఉదాసీనతా వక్రరేఖ $CI_1$ ను అందుకోవటానికి అవసరమైన వివిధ ప్రత్యామ్నాయ ఎగుమతి - దిగుమతి సముదాయాలను, యీ వ్యాపార ఉదాసీనతా వక్రరేఖ తెలియజేస్తుంది.

ఉదాహరణకు V బిందువును పరిశీలించండి. A దేశము OC (= DV) యూనిట్ల A - Exportables ను ఎగుమతి చేసి, ODC = CV యూనిట్ల B - Exportables ను దిగుమతి చేసుకొంటుంది. ఈ ఎగుమతి దిగుమతి సముదాయము A దేశాన్ని, $CI_1$ సామాజిక ఉదాసీనతా వక్రరేఖను చేరుకోవటానికి దోహదపడుతుంది.

మొదటగా A దేశము OC యూనిట్ల A - Exportables ను OD యూనిట్ల B - Exportables కు మార్పిడి చేసుకుందని అనుకుందాము. ఈ మార్పిడి తర్వాత A దేశము FHUG రేఖ వెంబడి మాత్రమే వినియోగము చేయగలదు. FH సరళరేఖ X అక్షానికి లంబ రేఖ కూడా. అందువలన A దేశము బిందువు వద్ద వినియోగము చేస్తుంది. U బిందువు వద్ద $CI_1$ రేఖ ఉత్పత్తి బ్లాకుకు స్పర్శరేఖగా ఉంది. ముఖ్యంగా A దేశము JV యూనిట్ల A - Exportables ను ఉత్పత్తి చేస్తుంది. DV యూనిట్లను ఎగుమతి చేస్తుంది. అంటే JD యూనిట్లను మాత్రమే వినియోగం చేస్తుంది. అదే విధంగా A దేశము VSC (= JV) యూనిట్ల B - Exportables, ను ఉత్పత్తి చేసి CVC (= RJ) యూనిట్లను దిగుమతి చేసుకొని, మొత్తము B దేశపు Exportables ను RU (= CS) పరిమాణములో వినియోగము చేస్తుంది. $TI_1$ రేఖపై వుండే మిగతా బిందువులన్నిటికీ, యిదే రకమైన వివరణ యివ్వవచ్చు.

$TI_1$ రేఖ $CI_1$ రేఖకు సంబంధించినది. ప్రతి సామాజిక ఉదాసీనతా వక్రరేఖ నుండి, ఒక వ్యాపార ఉదాసీనతా వక్రరేఖను పొందవచ్చు. ఉదాహరణకు OMPN ఉత్పత్తి బ్లాకు, $CI_2$ వెంబడి క్రిందకు పైకీ కదలిస్తే యీ బ్లాకు మూల బిందువు క్రొత్త వ్యాపార ఉదాసీనతా వక్రరేఖను సూచిస్తుంది. దానిని మనము $TI_2$ అనవచ్చు. $CI_2$ $CI_1$ కి ఎడమ భాగమున ఎగువన ఉన్నది. అందువలన $TI_2$ కూడా $TI_1$ కు ఎడమ భాగమున ఎగువన ఉంటుంది. సాధారణంగా ప్రతి సామాజిక ఉదాసీనతా వక్రరేఖకు, ఒక వ్యాపార ఉదాసీనతా వక్రరేఖ ఉంటుంది. సామాజిక ఉదాసీనతా వక్రరేఖ ఎంత ఉన్నతంగా ఉంటూ, దానికి సంబంధించిన వ్యాపార ఉదాసీనతా వక్రరేఖ అంత ఉన్నతంగా ఉంటుంది.

పెరిగే అవకాశ వ్యయ పరిస్థితులలో వ్యాపార ఉదాసీనతా వక్రరేఖల కుంభాకారత, తత్సంబంధ సామాజిక ఉదాసీనతా వక్రరేఖలు కుంభాకారత వలె ఉంటుంది. ఏ బిందువు వద్దనైనా, వ్యాపార ఉదాసీనతా వక్రరేఖలు, దానికి సంబంధించిన సామాజిక ఉదాసీనతా వక్రరేఖలకు సమానంగా ఉంటుంది. మరియు ఉత్పత్తి అవకాశాల వక్రరేఖకు, తదనుగుణ (Corresponding) బిందువు వద్ద వాలుకు సమానంగా ఉంటుంది. ఉదాహరణకు, V బిందువు వద్ద $TI_1$ వాలు, U బిందువు వద్ద ఉత్పత్తి అవకాశాల వక్రరేఖ మరియు $CI_1$ రేఖ ఉమ్మడి వాలుకు సమానము.

ఈ విధంగా ప్రతి సామాజిక ఉదాసీనతా వక్రరేఖ నుండి, ఒక వ్యాపార ఉదాసీనతా వక్రరేఖను పొందవచ్చును. ఒకటి కన్నా ఎక్కువ అంటే రెండు, మూడు వ్యాపార ఉదాసీనతా వక్రరేఖలుంటే వాటినన్నిటినీ కలిపి Trade Indifference Map అని పిలుస్తాము.

పటము 2.7లో A దేశపు వ్యాపార ఉదాసీనతా వక్రరేఖలను ఎట్లు పొందవచ్చునో వివరించాము. అదే విధంగా B దేశపు ఉదాసీనతా వక్రరేఖలను పొందవచ్చును. కాని అపుడు, ఉత్పత్తి బ్లాకు, సామాజిక ఉదాసీనతా వక్రరేఖలు XOY' వృత్త పాదము (Quadrant) లో ఉంటాయి. ఇది A వృత్త పాదము YOX' కు అభిముఖంగా ఉంటుంది. పైన వివరించిన పద్ధతిననుసరించి, B దేశపు వ్యాపార ఉదాసీనతా వక్రరేఖలను గూడా పై పటములో పొందవచ్చును.

## 2.7 ఆఫర్ రేఖలు (Offer Curves) :

మనము మొదటి పాఠములో మిల్ ప్రతిపాదించిన పరస్పర డిమాండ్ సూత్రమును పరిశీలించాము. యీ పరస్పర డిమాండ్ సూత్రాన్ని మార్షల్ ఆఫర్ రేఖల ద్వారా రేఖాత్మకంగా వివరించారు. ఈ ఆఫర్ రేఖలనే పరస్పర డిమాండ్ వక్రరేఖలని అంటారు. 20 వ శతాబ్దపు ప్రారంభంలో మార్షల్, ఎడ్జ్‌వర్త్ (Edgeworth) అనే ఇద్దరు బ్రిటిష్ ఆర్థికవేత్తలు యీ ఆఫర్ రేఖలను అంతర్జాతీయ అర్థశాస్త్రంలో ప్రవేశపెట్టారు. ఈ ఆఫర్ రేఖ తదనంతర కాలంలో చాలా విస్తృతంగా ఉపయోగించబడింది. యీ ఆఫర్ రేఖ లేదా పరస్పర డిమాండ్ వక్రరేఖ అంతర్జాతీయ అర్థశాస్త్రంలో ఒక ముఖ్యమైన విశ్లేషణాఉపకరణ.

ఒక దేశపు ఆఫర్ రేఖ ఒక వస్తువు యొక్క ఏ సాపేక్ష ధర వద్ద వ్యాపారం జరిగేదీ నిర్ణయిస్తుంది. వివిధ అంతర్జాతీయ ధరల వద్ద, ఒక దేశపు Exportables వస్తువును, ఇంకొక Importable వస్తువుతో మార్పిడి చేసుకొనే, వివిధ పరిమాణాలను తెలియజేస్తుంది. ఒక దేశపు

ఆఫర్ రేఖ, ఆ దేశపు ఉత్పత్తి అవకాశాల వక్రరేఖ, సామాజిక ఉదాసీనతా వక్రరేఖలు మరియు వివిధ అంతర్జాతీయ ధరలు ఇంకొక దేశంలో వ్యాపారములో పాల్గొనటం నుండి రాబట్ట వచ్చును.


ఈ పాఠములో మనము ఒక దేశపు ఉత్పత్తి అవకాశాల వక్ర రేఖను గూర్చి తెలుసుకొని యున్నాము. అదే విధంగా ఒక దేశపు సామాజిక ఉదాసీనతా వక్రరేఖల గూర్చి కూడా తెలుసుకొనియున్నాము.

ఈ రెండింటి నుండి, ఒక దేశపు వ్యాపార ఉదాసీనతా వక్రరేఖలను రాబట్టు పద్ధతిని గూడా తెలుసుకున్నాము. వీటి నుండి, ఒక దేశపు ఆఫర్ రేఖనేవిధంగా పొందవచ్చునో, మీడ్ రేఖాత్మకంగా వివరించారు. దీనిని తర్వాత వివరిస్తాము.

వివిధ ధర రేఖలు (Price Lines) వరుసగా ఉన్నతంగా ఉండే వ్యాపార ఉతాసీనతా వక్రరేఖలను స్పర్శరేఖలుగా ఉన్నపుడు, ఆ స్పర్శ బిందువులనన్నిటిని, కలుపగా వచ్చిన బిందు పథమునే, ఆఫర్ రేఖగా అభివర్ణిస్తాము. వ్యాపార ఉదాసీనతా వక్రరేఖ మ్యాపు నుండి, ఆఫర్ రేఖను ఎలా రాబట్టేదీ, యిపుడు పరిశీలిద్దాము. పటము 2.8లో యిది వివరించబడినది.

ఈ పటములో A దేశపు ఆఫర్ రేఖ నెలా రాబట్టాము వివరించబడింది. $TI_1$, $TI_2$, $TI_3$ దేశపు వ్యాపార ఉదాసీనతా వక్రరేఖల మ్యాప్ $TOT_1$ రేఖ దేశీయంగా A దేశపు వర్తక నిబంధనల రేఖ. ఇది $TI_1$ రేఖకు O వద్ద స్పర్శరేఖగా ఉంది. $TOT_2$, $TOT_3$, $TOT_4$ వివిధ వర్తక నిబంధనల రేఖలు. $TI_1$ వ్యాపారానికి ముందు, సమతౌల్య ధర నిష్పత్తిని తెలుపుతుంది. A - Exportables ధర క్రమంగా అంతర్జాతీయ మార్కెట్లలో పెరిగితే, వర్తక నిబంధనల రేఖ వాలు క్రమంగా పెరుగుతుంది. పటములో $TOT_2$, $TOT_3$, $TOT_4$ ల వాలును బట్టి దీనిని గ్రహించవచ్చు. ఇవి అంతర్జాతీయ వర్తక నిబంధనల రేఖలు. ఇవి, A దేశపు వ్యాపార ఉదాసీనతా వక్రరేఖలకు స్పర్శరేఖలుగా ఉన్నపుడే, A దేశము తన Expotables ను B దేశమునకు offer చేస్తుంది.

**పటము 2.8**




పటము 2.8లో $E_1$, $E_2$, $E_3$ అటువంటి స్పర్శ బిందువులు. ఈ స్పర్శ బిందువులన్నిటినీ కలిపితే వచ్చే $OE_1E_2E_3A$ రేఖను, A దేశపు ఆఫర్ రేఖ అని అంటాము. క్లుప్తముగా OA - A దేశపు ఆఫర్ రేఖ. A దేశపు Exportables కు (or B దేశపు Exportables) లో ఎక్కువ ధర వచ్చిన కొద్దీ, A దేశము ఉన్నత వ్యాపార ఉదాసీనతా వక్రరేఖకు అందుకునే వీలవుతుంది. ప్రారంభంలో ఎక్కువ పరిమాణములో A - Exportables, B - Exportables నకు యివ్వటానికి సిద్ధపడుతుంది. క్రమేణా, యీ పరిమాణాలను తగ్గిస్తుంది.

పై వివరణను బట్టి, ఆఫర్ రేఖ యొక్క రెండు ముఖ్య లక్షణాలను గ్రహించవచ్చు.

1. అది మూల బిందువు గుండా పోతుంది. వర్తక నిబంధనల రేఖకు ఎడమ వైపు ఎగువన ఉంటుంది.

2. $TOT_1$ రేఖ ఆఫర్‌రేఖకు మూల బిందువు వద్ద స్పర్శరేఖ అంటే, మూల బిందువు వద్ద, ఆఫర్ రేఖ వాలు, వ్యాపారానికి ముందు ఉండే ధర నిష్పత్తిని తెలియజేస్తుంది.


ఏ దేశపు ఆఫర్ రేఖ అయినా-ఉదాహరణలో A దేశపు ఆఫర్ రేఖ, B దేశము నుండి దిగుమతి చేసుకునే వస్తువునకు, డిమాండ్ తెలియజేస్తుంది. అయితే ఆఫర్ రేఖ డిమాండ్ రేఖ కాదు. సప్లయ్ రేఖ కాదు. కానీ, రెండూ మిళితమైన రేఖ.

ఈ ఆఫర్ రేఖల ద్వారా అంతర్జాతీయ సమతౌల్య నిర్ణయాన్ని వివరించవచ్చు.

## 2.8. ఆఫర్ రేఖలు, అంతర్జాతీయ సమతౌల్యము :

వ్యాపారం సంతులితంగా ఉండే విధంగా వర్తక నిబంధనలున్నపుడు, అంతర్జాతీయ సమతౌల్యము ఏర్పడుతుంది. ఈ సమతౌల్య బిందువు వద్ద, ప్రతి మార్కెటులోనూ, ప్రపంచ సప్లయ్, ప్రపంచ డిమాండ్‌నకు సమానంగా ఉంటుంది. ఉత్పత్తి దారులు, వారు అమ్ముదామనుకొన్న పరిమాణాన్ని అమ్ముతారు. వినియోగదారులు, వారు కొనుగోలు చేద్దామనుకొన్న పరిమాణాన్ని కొంటారు. అందరూ సంతృప్తి చెందుతారు. వారి ప్రవర్తనను మార్చుకోటానికి యిష్టపడరు. ఆఫర్ రేఖల ద్వారా యీ అంతర్జాతీయ సమతౌల్యాన్ని వివరించవచ్చు. పటము 2.9లో యిది వివరించబడినది. రెండు ఆఫర్ రేఖలు ఖండించుకొన్న బిందువు వద్ద, అంతర్జాతీయ సమతౌల్యము ఏర్పడుతుంది. ఈ బిందువు సూచించే వర్తక నిబంధనల వద్ద మాత్రమే, రెండు దేశాల వ్యాపార పరిమాణాలు సంతులితంగా ఉంటాయి.

పటము 2.9లో OA, A దేశపు ఆఫర్ రేఖ. OB, B దేశపు ఆఫర్ రేఖ. ఈ రెండూ K బిందువు వద్ద పరస్పరం ఖండించుకొంటున్నాయి. సమతౌల్య వర్తక నిబంధనలను $TOT_3$ రేఖ తెలియజేస్తుంది. A దేశము OL యూనిట్ల X వస్తువును ఎగుమతి చేసి, $OL^1$ యూనిట్ల Y వస్తువును దిగుమతి చేసుకుంటుంది. A దేశపు ఆఫర్ రేఖ పై గల K బిందువు దీనిని తెలియజేస్తుంది. B దేశపు ఆఫర్ K బిందువు తెలియజేస్తుంది. ఈ రెండు బిందువులు ఒకటే. కాబట్టి $TOT_3$ రేఖ సమతౌల్య వర్తక నిబంధనలను తెలియజేస్తుంది. వీటి వద్ద మార్కెట్లన్నీ Clear అయి, అంతర్జాతీయ సమతౌల్యము ఏర్పడుతుంది.




**పటము 2.9**

యీ సమతౌల్య వర్తక నిబంధనలు, రెండు దేశాల దేశీయ వర్తక నిబంధనలు (వ్యాపారం లేనపటి వర్తక నిబంధనల రేఖ) $TOT_1$ మరియు $TOT_1$ ల మధ్య ఉంటాయి.

KC లేదా K రెండు దేశాల ఆఫర్ రేఖలు ఖండించుకునే బిందువు వద్ద మాత్రమే, ప్రతి దేశము ఆశించిన దిగుమతులు, ఇంకొక దేశము ఆశించిన ఎగుమతులకు సరిగ్గా సమానమవుతాయి. ఉదాహరణకు, $TOT_2$ ను పరిశీలించండి. ఈ రేఖ సూచించే వర్తక నిబంధనల వద్ద, A దేశము, OS పరిమాణములో X వస్తువును, ఎగుమతి చెయ్యదలుస్తుంది. కానీ, A దేశముల V బిందువు సూచించే పరిమాణములో దిగుమతి చేసుకుందామనుకుంటుంది. A దేశము, ఎగుమతి చెయ్యదలిచే పరిమాణము, దానికన్నా చాలా తక్కువ. అప్పుడు, X వస్తువునకు డిమాండ్ పెరిగి, దాని ధర పెరుగుతుంది. అదే సమయంలో B దేశపు Y వస్తువు సప్లయి అధికంగా ఉండటం వలన, Y వస్తువు ధర తగ్గుతుంది. అందువలన X వస్తువు సాపేక్ష ధర పెరుగుతుంది. K బిందువు వద్ద, అంతర్జాతీయ సమతౌల్యము వచ్చే వరకు X వస్తువు ధర పెరుగుతుంది.

ఈ ఆఫర్ రేఖలు, అంతర్జాతీయ వ్యాపార సిద్ధాంతములో, ఒక ముఖ్యమైన రేఖాత్మక ఉపకరణ మార్షల్, ఎడ్జ్‌వర్త్ యీ భావనను మొదటగా ప్రవేశపెట్టినా, మిల్ పరస్పర డిమాండ్ సిద్ధాంతాన్ని వివరించటానికి, అంతర్జాతీయ వ్యాపారం వల్ల వచ్చే లాభాలను వివరించటానికి, మారకపు రేటు సిద్ధాంతాన్ని మరియు టారిఫ్‌లను వివరించటానికి ఉపయోగిస్తున్నారు. మీడ్ చెప్పినట్లు ఇది సమగ్ర సమతౌల్య భావన. ఉత్పత్తి వినియోగ పరిస్థితులను ఉమ్మడిగా నిర్ణయించే అంశము. యీ పరిస్థితులే ఒక దేశపు ఆఫర్ రేఖ అకారాన్ని నిర్ణయిస్తాయి. అవి వర్తక నిబంధనలను నిర్ణయిస్తాయి.


## 2.9. ఆఫర్ రేఖలు, అంతర్జాతీయ సమతౌల్యము : మీడ్ వివరణ :

అంతిమ ఉత్పత్తి, వినియోగము మరియు రెండు దేశాలకు వ్యాపార సమతౌల్యాన్ని మీడ్ యీ ఆఫర్ రేఖలను, ఉత్పత్తి అవకాశాల రేఖలను మరియు సామాజిక ఉదాసీనతా వక్రరేఖలకు మధ్యగల సంబంధం ద్వారా నిర్ణయించవచ్చునని, రేఖాత్మకంగా చూపించారు. ఈ మూడు రేఖల ద్వారా, మీడ్ ఉత్పత్తిని, వినియోగాన్ని, వ్యాపారాన్ని మూడింటినీ కలిపి పరిశీలించారు.

పటము 2.10 లో దీనిని వివరించాము. మొదటి వృత్త పాదము (Frist Quadrant) లో E బిందువు వద్ద, రెండు దేశాల ఆఫర్ రేఖలు పరస్పరం ఖండించుకుంటున్నాయి. అందువలన E బిందువు వద్ద, అంతర్జాతీయ సమతౌల్యం ఉంటుంది.

A దేశము OR యూనిట్ల A - Exportables B దేశానికి ఎగుమతి చేస్తుంది. B దేశము OS యూనిట్ల B - Exportables A దేశానికి ఎగుమతి చేస్తుంది. TOT రేఖ వాలు సమతౌల్య వర్తక నిబంధనలను తెలుపుతుంది. ఇది OS/OR కు సమానము. పైన చెప్పినట్లు, ఈ రేఖ రెండు దేశాల వర్తక నిబంధనల రేఖ రెండు దేశాల మధ్య వ్యాపారం లేనపుడు ఉండే వర్తక నిబంధనల రేఖల మధ్య ఉంటుంది.

పటము 2.10



A దేశము వినియోగము, $C_A$ బిందువు వద్ద ఉంటుంది. రెండవ వృత్త పాదములో అనగా OV యూనిట్ల A - Exportables మరియు $VC_A$ యూనిట్ల B - Exportables అదే విధంగా B దేశము వినియోగము, నాల్గవ వృత్త పాదములో $C_B$ బిందువు వద్ద ఉంటుంది. అంటే OD యూనిట్ల B - Exportables మరియు $DC_B$ యూనిట్ల A - Exportables. అంతిమంగా A దేశము EU యూనిట్ల A - Exportables ను, $UC_A$ యూనిట్ల B - Exportables ఉత్పత్తి చేస్తుంది. B దేశము EZ యూనిట్ల B - Exportables మరియు ZCB యూనిట్ల A-Exportables ను ఉత్పత్తి చేస్తుంది.

కాబట్టి, రెండు దేశాల A - Exportables యొక్క మొత్తము ఉత్పత్తి $EU + ZC_B = GZ + ZC_B = GC_B$. B - Exportables యొక్క మొత్తము ఉత్పత్తి $EZ + UC_A = GU + UC_A = GC_A$

$GC_B HC_A$ దీర్ఘచతురస్రాన్ని పరిశీలించండి. దీని భుజములు A - Exportables మరియు B - Exportables యొక్క ప్రపంచ (మొత్తము) ఉత్పత్తిని తెలియజేస్తాయి. ఇవి, A - Exportables యొక్క B - Exportables యొక్క ప్రపంచ మొత్తము వినియోగాన్ని కూడా తెలియజేస్తాయి. ఎందుకంటే $SU + DC_B = GD + DC_B = GC_B$

$$VC_A + RZ = VC_A + GV = GC_A$$

$GC_B HC_A$ దీర్ఘ చతురస్రాన్ని Production Box గా పరిగణించవచ్చు. E బిందువు యొక్క నిరూపకాలు (Coordinates) $C_A$ తో పోలిస్తే, A ఉత్పత్తి చేసే A - Exportables మరియు B - Exportables ను తెలియజేస్తుంది. E బిందువు యొక్క Co - ordinates $C_B$ బిందువుతో పోలిస్తే, B దేశపు A-Exportables మరియు B - Exportables ఉత్పత్తిని తెలియజేస్తుంది. అదే విధంగా O-Coordinates $C_A$ ($C_B$) తో పోలిస్తే A దేశపు (B దేశపు) A - Exportables B - Exportables యొక్క వినియోగాన్ని O-Cordinates With respect to E తో పోలిస్తే A దేశపు A - Exportables యొక్క ఎగుమతులను B-Exportables యొక్క దిగుమతులను తెలియజేస్తుంది.

TOT రేఖ, A దేశపు వ్యాపార ఉదాసీనతా వక్రరేఖలకు E బిందువు వద్ద స్పర్శరేఖగా ఉంది. A దేశపు వినియోగ అవకాశాల రేఖ $KC_AM$, A దేశపు సామాజిక ఉదాసీనతా వక్రరేఖకు $C_A$ బిందువు వద్ద స్పర్శ రేఖగా ఉంది. B దేశపు వినియోగ అవకాశాల రేఖ $NC_BF$, ఆ దేశపు సామాజిక ఉదాసీనతా వక్రరేఖకు $C_B$ బిందువు వద్ద స్పర్శరేఖగా ఉంది. కాబట్టి అన్ని సమతౌల్య నిబంధనలు సంతృప్తి పరచబడినాయి.

పటము 2.10 ఉత్పత్తి, వినియోగము మరియు వ్యాపారాన్ని మూడింటినీ కలిపి వాటి మధ్య గల అనేక సంబంధాలను తెలియజేస్తుంది. మిడ్ యొక్క నవ్య సాంప్రదాయ సిద్ధాంతం యిది అత్యంత ఉపయోగకరమైన విశ్లేషణ.

## 2.10. సారాంశము :

శ్రమ విలువ సిద్ధాంతముపై ఆధారపడి ప్రతిపాదించిన సాంప్రదాయక అంతర్జాతీయ వ్యాపార సిద్ధాంతం అనేక విమర్శలకు గురి అయినది. అవాస్తవిక ప్రమేయాలపై ఆధారపడిన ఆ సిద్ధాంతానికి ప్రత్యామ్నాయంగా నవ్య సాంప్రదాయ వ్యాపార సిద్ధాంతం ప్రతిపాదించబడినది. హాబర్లర్, లియోంటిఫ్, మార్షల్, ఎడ్జివర్త్, మీడ్ మున్నగు వారు యీ దిశగా కృషి చేసారు. హాబర్లర్ అవకాశ వ్యయ సిద్ధాంతం ద్వారా వ్యాపార విశ్లేషణ చేసారు. సాంప్రదాయ సిద్ధాంతం స్థిర వ్యయాల ప్రమేయాధారంగా వ్యాపార విశ్లేషణ చేసింది. అందుకు భిన్నంగా హాబర్లర్ అవకాశ వ్యయ సిద్ధాంతం, స్థిర వ్యయాలే గాకుండా, పెరిగే అవకాశ వ్యయాలు, తగ్గే అవకాశ వ్యయ పరిస్థితులను గూడా పరిగణించి వ్యాపార విశ్లేషణ చేసారు. దీనిపై కొన్ని విమర్శలు ఉన్నా, యీ సిద్ధాంతము చాలా ముఖ్యమైనదని శామ్యూల్‌సన్ వంటి ప్రముఖ ఆర్థిక వేత్తల అభిప్రాయము. సామాజిక ఉదాసీనతా వక్రరేఖ భావన ఉపయోగించి, వ్యాపార నమూనాలో, వ్యాపారానికి ఆధారం, వ్యాపారం వల్ల వచ్చే లాభాలను మరియొకసారి విశ్లేషణ చేయవచ్చు. వ్యాపారం వలన ఒక దేశము ఉన్నత సామాజిక ఉదాసీనతా వక్రరేఖవందు కోగలిగితే, ఆ దేశము వ్యాపారం వలన లాభపడుతుంది.

వ్యాపార ఉదాసీనతా వక్రరేఖలు, నవ్య సాంప్రదాయ సిద్ధాంతంలోని ముఖ్య విశ్లేషణ ఉపకరణ ఉత్పత్తి అవకాశాల వక్రరేఖ నుండి మరియు సామాజిక ఉదాసీనతా వక్రరేఖల నుండి, ఒక దేశపు వ్యాపార ఉదాసీనతా వక్రరేఖలను రాబట్టవచ్చును. మార్షల్ (మరియు ఎడ్జివర్త్) ప్రవేశపెట్టిన ఆఫర్ రేఖ, నవ్య సాంప్రదాయ అంతర్జాతీయ వ్యాపార సిద్ధాంతంలో మరొక ముఖ్య విశ్లేషణ ఉపకరణ. మిల్ ప్రతిపాదించిన పరస్పర డిమాండ్ సిద్ధాంతానికి యిది రేఖాత్మక వివరణ. వీటినుపయోగించి. అంతర్జాతీయ సమతౌల్యాన్ని విశ్లేషణ చేయవచ్చు. ఆఫర్ రేఖలను, ఉత్పత్తి అవకాశాల వక్రరేఖను, సామాజిక ఉదాసీనతా వక్రరేఖలను మరియు వ్యాపార ఉదాసీనతా వక్రరేఖలనుపయోగించి, అంతర్జాతీయ సమతౌల్యం ఏర్పడే తీరును మీడ్ వివరించారు. వీటి ద్వారా ఉత్పత్తిని, వినియోగాన్ని, వ్యాపారాన్నీ మూడింటినీ కలిపి మీడ్ పరిశీలించారు. నవ్య సాంప్రదాయ సిద్ధాంతంలో యిది ఒక ముఖ్యమైన విశ్లేషణ.

## 2.11. ముఖ్య పదాలు

అవకాశ వ్యయ సిద్ధాంతము

ఉత్పత్తి అవకాశాల వక్రరేఖ

స్థిర అవకాశ వ్యయాలు

పెరిగే అవకాశ వ్యయాలు

తగ్గే అవకాశ వ్యయాలు

సామాజిక ఉదాసీనతా వక్రరేఖలు

వ్యాపార ఉదాసీనతా వక్రరేఖలు

ఆఫర్ రేఖలు

## 2.12. స్వయం సమీక్షా ప్రశ్నలు :

1. హాబర్లర్ అవకాశ వ్యయ సిద్ధాంతాన్ని, విమర్శనాత్మకంగా పరిశీలింపుము
2. వ్యాపార ఉదాసీనతా వక్రరేఖలనగానేమి ? అంతర్జాతీయ వ్యాపార సిద్ధాంతములో వాటి ఉపయోగాలేవి ?
3. ఆఫర్ రేఖలనగానేమి ? వాటినుపయోగించి, వ్యాపార నిర్ణయ పద్ధతిని వివరింపుము.

## 2.13. చదువదగిన గ్రంథాలు


| | | | |
|---|---|---|---|
| 1. | P.T. Ellsworth | : | International Economics |
| 2. | C.P. Kindleberger | : | International Economics |
| 3. | Bo Sodersten | : | International Economics |
| 3. | G. Haserler | : | A Survey of International Trade Theory |


ఆచార్య. యం. జగదీశ్వరరావు

# నవ్య వ్యాపార సిద్ధాంతం - హెక్చర్ - ఓహ్లిన్ సిద్ధాంతం - ఉత్పత్తి కారకాల ధర సమానత్వ సిద్ధాంతము - ఉత్పత్తి కారకాల ధరలు - ఉత్పత్తి కారకాల సాంద్రతలో పరివర్తనలు

## 3.0 లక్ష్యం :-

ఈ పాఠ్య భాగం చదివిన తరువాత మీరు ఈ క్రింది అంశాలను తెలుసుకోగలరు.

* నవ్య వ్యాపారమైన హెక్చర్ - ఓహ్లిన్ సిద్ధాంతము, వ్యాపార తీరు పై దాని వివరణ.
* ఉత్పత్తి కారకాల ధర సమానత్వ సిద్ధాంతము.
* ఉత్పత్తి కారకాల సాంద్రతలో పరివర్తనలు, వాటి వలన పరిణామాలు.
* ఆదాయ పంపిణీ పై వ్యాపార ప్రభావము
* వ్యాపారము పై ఉత్పత్తి కారకాల సప్లయ్‌లలో పెరుగుదల ప్రభావము.

## విషయసూచిక :-


3.1 పరిచయము

3.2 నవ్య వ్యాపార సిద్ధాంతము - మూలము

3.3 హెక్చర్ - ఓహ్లిన్ సిద్ధాంతము - ప్రమేయాలు

3.3.1 ఉత్పత్తి కారకాల సమృద్ధి - నిర్వచనాలు

3.3.2 ఉత్పత్తి కారక సాంద్రత

3.3.3 ఉత్పత్తి కారక సమృద్ధి - ఉత్పత్తి అవకాశాల రేఖ

3.4 హెక్చర్ - ఓహ్లిన్ సిద్ధాంతము

3.5 హెక్చర్ - ఓహ్లిన్ సిద్ధాంతము - వివరణ

3.6 హెక్చర్ - ఓహ్లిన్ సిద్ధాంతము - మెరుగైన అంశాలు

3.7 హెక్చర్ - ఓహ్లిన్ సిద్ధాంతము - విమర్శలు

3.8 హెక్చర్ - ఓహ్లిన్ సిద్ధాంతము - సాంఖ్యక పరీక్షలు

3.9 లియోంటిఫ్ వైపరీత్యము - వివరణలు

3.10 ఉత్పత్తి కారకాల ధర సమానత్వ సిద్ధాంతము

3.11 స్టోల్పర్ - శామ్యూల్‌సన్ సిద్ధాంతము

3.12 ఉత్పత్తి కారక సాంద్రత పరివర్తన

3.13 రైబిన్ స్కీ సిద్ధాంతము

3.14 సారాంశము

3.15 ముఖ్యపదాలు

3.16 నమూనా ప్రశ్నలు

3.17 చదువదగిన గ్రంథాలు

## 3.1 పరిచయము :-

ఈ పాఠములో, మనము నవ్య వ్యాపార సిద్ధాంతాన్ని గూర్చి విపులంగా తెలుసుకొంటాము. దీనికి ముందు పాఠములో తులనాత్మక అనుకూలత సిద్ధాంతాన్ని గూర్చి తెలుసుకొన్నాము. కాని, ఈ తులనాత్మక అనుకూలత ఏ విధంగా ఏర్పడేదీ, దానికి గల కారణాలనూ ఆ సిద్ధాంతము వివరించలేదు. ఈ లోటును భర్తీ చేయడానికి, నవ్య వ్యాపార సిద్ధాంతము రూపొందింది. హెక్స్ర్ - ఓహ్లీన్ సిద్ధాంతము యీ అంశాన్ని వివరించింది. ఉత్పత్తి కారకాల సమృద్ధి, ఉత్పత్తి కారకాల సాంద్రత భావనల పై ఆధారపడి యీ సిద్ధాంతము ఒక దేశము తన సమృద్ధి ఉత్పత్తి కారకమును ఎక్కువగా ఉపయోగించే వస్తువునుత్పత్తి చేసి, ఎగుమతి చేస్తుందని సూత్రీకరించింది. ఈ సిద్ధాంతపు ప్రమేయాలు, వివరణను తెలుసుకొన్న తర్వాత, అది సాంప్రదాయక వ్యాపార సిద్ధాంతం కన్నా ఎంత వరకూ మెరుగైనదీ పరిశీలిస్తాము. ఈ సిద్ధాంతము పై వచ్చిన విమర్శలను కూడా పరిశీలిస్తాము. వాస్తవ ప్రపంచంలో, వ్యాపారానికి యీ సిద్ధాంతము వర్తిస్తుందా? అనే అంశం పై అనేక సాంఖ్యక పరీక్షలు జరిగాయి. వాటిలో చెప్పుకోదగ్గది - లియోంటిఫ్ అధ్యయనము. లియోంటిఫ్ అధ్యయనపు ఫలితాలు హెక్స్ర్ - ఓహ్లీన్ సిద్ధాంతానికి వ్యతిరేకంగా ఉండి, తత్ఫలితంగా లియోంటిఫ్ వైపరీత్యము అనే అంశము ఉత్పన్నమయినది. దీనికి వివరణలను గూడా పరిశీలిస్తాము. వ్యాపారం వలన, దేశాల మధ్య ఉత్పత్తి కారకాల ధరలు సమానమవుతాయనే సిద్ధాంతాన్ని పరిశీలిద్దాము. ఉత్పత్తి కారకాల సాంద్రతలో పరివర్తనల వలన ఉత్పన్నమయ్యే పరిణామాలను పరిశీలిస్తాము. ఒక వస్తువు ధర పెరిగితే, ఉత్పత్తి కారకాల ధరపై ప్రభావాన్ని వివరించే స్టోల్పర్ - శామ్యూల్సన్ సిద్ధాంతాన్ని, ఉత్పత్తి కారకాల సప్లయ్‌లలో మార్పుల వల్ల వ్యాపారంలో వచ్చే మార్పులను వివరించే, రైబిన్ స్కీ సిద్ధాంతాన్ని పరిశీలిస్తాము. స్థూలంగా, యీ పాఠములో మనము అధ్యయనము చేసే విషయాలు యివే.

## 3.2 నవ్య వ్యాపార సిద్ధాంతము - మూలము :-

రికార్డో తులనాత్మక అనుకూలత సూత్రము ప్రత్యేకీకరణ, వ్యాపారము వలన ఉత్పత్తిదారులకు, వినియోగదారులకు లాభాలు ఎలా వస్తాయో వివరించింది. కాని ఒక దేశానికి, ఒక వస్తువు కన్నా మరొక వస్తూత్పత్తిలో తులనాత్మక అనుకూలత ఉండటానికి గల కారణాలను వివరించలేకపోయింది. శ్రామిక ఉత్పాదకతలలో తేడాల పై తులనాత్మక అనుకూలత ఆధారపడుతుందని, రికార్డో భావించాడు. అనగా, సాంకేతికతలలో తేడాల వల్ల, శ్రామిక ఉత్పాదకతలలో తేడాలు వస్తాయి. అయితే, యీ తేడాలకు ఆధారము ఏమిటి అనేది రికార్డో వివరించలేదు. శ్రమ అనే ఒక ఉత్పత్తి కారకముంటుందనే ప్రమేయం వలన, ఒక దేశంలో వ్యాపారం వలన ఆదాయ పంపిణీ ఎలా ప్రభావితం అయ్యేదో వివరించలేదు. కొంతమంది స్వేచ్ఛా వ్యాపారాన్ని ఎందుకు సమర్థించేదీ, మరికొందరు ఎందుకు వ్యతిరేకించేదీ వివరించలేదు.

1920, 30 దశకాలలో ఇద్దరు స్వీడిష్ ఆర్థికవేత్తలు - Eli Heckscher మరియు Bertie Ohleine - రికార్డో వివరించకుండా వదిలివేసిన రెండు అంశాలకు వివరణనిచ్చి ఒక సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. (ఎ) తులనాత్మ అనుకూలతకు గల కారణాలు, (బి) ఆదాయ పంపిణీ పై వ్యాపార ప్రభావము. స్మిత్, రికార్డో మరియు మిల్ వంటి సాంప్రదాయక ఆర్థికవేత్తలు వీటిని పరిగణించలేదు.

1919లో Eli Heckscher ప్రచురించిన "The Effect of Foreign Trade on the Distribution of Income" అనే వ్యాసము 1933లో Bertie Ohlein ప్రచురించిన Inter Repusil and International trade అనే గ్రంథము నవ్య వ్యాపార సిద్ధాంతానికి ఆధారాలు. యీ సిద్ధాంతాన్ని వారిద్దరి పేర్లతోనే హెక్చర్ - ఓహ్లిన్ సిద్ధాంతమని వ్యవహరిస్తున్నారు. ఉత్పత్తి కారకాల సమృద్ధి తులనాత్మక అనుకూలతను నిర్ణయిస్తుందని వీరివాదన. అందువలన, యీ సిద్ధాంతాన్ని Factor Endowment Theory అని కూడా అంటారు. దీనికి మరొక పేరు Factor Proportion's Theory. ఓహ్లిన్ చేసిన కృషికి గుర్తింపుగా, 1977వ సంవత్సరంలో James Meare Commitee, ఓహ్లిన్‌కు ఆర్థికశాస్త్రములో నోబెల్ బహుమతిని ప్రధానం చేసారు. పైన చెప్పినట్లు, (ఎ) తులనాత్మక అనుకూలతలో ఆధారము, (బి) వ్యాపారం వలన, ఒక దేశములోని ఉత్పత్తి కారకపు ఆదాయాల పై ప్రభావము - యీ రెంటినీ నవ్య వ్యాపార సిద్ధాంతము పరిశీలించింది.

## 3.3 హెక్చర్ - ఓహ్లిన్ సిద్ధాంతము - ప్రమేయాలు :-

ఈ సిద్ధాంతము, అనేక సులభతరమైన ప్రమేయాల పై ఆధారపడినది. విశ్లేషణ సౌలభ్యం దృష్ట్యా, యీ ప్రమేయాలు చేయబడినవి. వారి విశ్లేషణకు, యీ ప్రమేయాలు ఎంతో కీలకమైనవి, ఉపయుక్తమైనవి.

1. రెండు దేశాలు - A మరియు B ; రెండు వస్తువులు - X మరియు Y ; మరియు రెండు ఉత్పత్తి కారకాలు - శ్రమ (L) మరియు మూలధనము (K) ఉంటాయి. $2\times2\times2$ నమూనా అన్నమాట.
2. రెండు దేశాలు, వస్తూత్పత్తిలో ఒకే సాంకేతిక పద్ధతిని ఉపయోగిస్తాయి.
3. రెండు దేశాలలోనూ, X వస్తువు శ్రమ సాంద్రత వస్తువు ; Y వస్తువు మూలధన సాంద్రత వస్తువు.
4. రెండు దేశాలలోనూ, X, Y ల ఉత్పత్తిలో, తరహానుసరించి వచ్చే ప్రతిఫలాలు స్థిరంగా ఉంటాయి.
5. రెండు దేశాలలోనూ, ప్రత్యేకీకరణ అసంపూర్ణంగా ఉంటుంది.
6. రెండు దేశాలలోనూ, అభిరుచులు ఒకే విధంగా ఉంటాయి.
7. రెండు దేశాలలోనూ, వస్తు మార్కెట్లలో, ఉత్పత్తి కారకాల మార్కెట్లలో, సంపూర్ణ పోటీ పరిస్థితులు ఉంటాయి.
8. ప్రతి దేశంలోనూ, అంతర్గతంగా ఉత్పత్తి కారకాల గమనశీలత పూర్తిగా ఉంటుంది. అంతర్జాతీయంగా గమనశీలత ఉండదు.
9. రవాణా వ్యయాలుండవు.
10. టారిఫ్‌ల వంటి, వ్యాపారం పై ఆంక్షలేవీ ఉండవు.
11. రెండు దేశాలలోనూ, సంపూర్ణ ఉద్యోగిత ఉంటుంది.
12. రెండు దేశాల మధ్య వ్యాపారం సంతులితం.

**3.3.1 ఉత్పత్తి కారకాల సమృద్ధి - నిర్వచనాలు (Factor Abundance - Definition) :-** ఈ సిద్ధాంతమును ఉత్పత్తి కారకాల సమృద్ధి, ఉత్పత్తి కారకాల సాంద్రత భావనల పై ఆధారపడి ప్రతిపాదించారు. అందువలన, యీ భావనలను నిర్వచించాలి. ముందుగా ఉత్పత్తి కారకాల సమృద్ధి (Factor Abundance) భావనను పరిశీలిద్దాము.

ఉత్పత్తి కారకాల సమృద్ధిని రెండు విధాలుగా నిర్వచించవచ్చు.

1. భౌతిక రూపంలో నిర్వచనము (Definition in terms of physical units)
2. ధరల రూపంలో నిర్వచనము (Definition in terms of Factor Prices)

భౌతిక రూపంలో నిర్వచనములో ప్రతి దేశానికి గల మొత్తము శ్రమ, మూలధనమును భౌతిక యూనిట్లలో చెప్పుతాము. ఉత్పత్తి కారకాల సాపేక్ష ధరల రూపంలో కూడా వాటి సమృద్ధిని నిర్వచించవచ్చును. వీటినే భౌతిక సమృద్ధి, ఆర్థిక సమృద్ధి అని కూడా పేర్కొంటారు.

భౌతిక రూపంలో నిర్వచనము ప్రకారము, B దేశమును మూలధన సమృద్ధి దేశముగా పరిగణించాలంటే, ఆ దేశము మూలధనము/శ్రమ నిష్పత్తి, A దేశపు మూలధనము/శ్రమ నిష్పత్తి కన్నా ఎక్కువగా ఉండాలి.

అంటే $$\left[\frac{\text{మూలధనము (K)}}{\text{శ్రమ (L)}}\right]_B > \left[\frac{\text{మూలధనము (K)}}{\text{శ్రమ (L)}}\right]_A$$

ఇక్కడ, B దేశానికి గల మూలధనము, శ్రమ పరిమాణాలు కాదు, వాటి నిష్పత్తి ముఖ్యం. ఉదాహరణకు, B దేశానికి తక్కువ పరిమాణములో (A దేశంతో పోలిస్తే), మూలధనము ఉండవచ్చు. కానీ, $\left(\frac{K}{L}\right)$ ననుసరించి, మూలధన సమృద్ధి దేశముగా పరిగణిస్తాము.

ధరల రూపంలో నిర్వచనము - ఆర్థిక సమృద్ధి నిర్వచనము ననుసరించి, మూలధనపు ధర (Rental Price), శ్రామిక వేతనాల నిష్పత్తి A దేశములో కన్నా B దేశములో తక్కువగా ఉంటే, B దేశాన్ని మూలధన సమృద్ధి దేశముగా పరిగణిస్తాము.

$$\left(\frac{P_K}{P_L}\right)_B < \left(\frac{P_K}{P_L}\right)_A \qquad \begin{array}{l} P_K = \text{Price of capital} \\ P_C = \text{Price of Labour} \end{array}$$

అనగా $$\left(\frac{r}{w}\right)_B < \left(\frac{r}{w}\right)_A \qquad \begin{array}{l} r = \text{rental price of capital} \\ w = \text{wage rate} \end{array}$$

ఈ రెండు నిర్వచనాల మధ్య తేడా ఏమిటి? భౌతిక నిర్వచనము కేవలము సప్లయ్ మీద ఆధారపడినది. ఇది డిమాండ్ ప్రభావాన్ని, పూర్తిగా విస్మరించింది. ఆర్థిక సమృద్ధి లేదా ధరల రూపంలో నిర్వచనము, సప్లయ్, డిమాండ్ ప్రభావాలు రెంటినీ పరిగణిస్తుంది. ఒక వస్తువు ధర కానీ, ఉత్పత్తి కారకపు ధర కానీ, వాటి వాటి సప్లయ్, డిమాండ్‌లను బట్టి నిర్ణయింపబడుతుందని మనకు తెలుసు. అదే విధంగా ఒక ఉత్పత్తి కారకానికి డిమాండ్, ఉత్పన్న డిమాండ్ (derived demand) అని కూడా తెలుసు.

రెండు దేశాలలోనూ రుచులు, అభిరుచులు ఒకే రకంగా ఉంటాయని ప్రమేయము. కాబట్టి, రెండు నిర్వచనాలు ఒకే ఫలితానికి దారి తీస్తాయి.

మన ఉదాహరణలో, $\left(\frac{K}{L}\right)_B > \left(\frac{K}{L}\right)_A - B$ మూలధన సమృద్ధి దేశము. డిమాండ్ పరిస్థితులు, రెండు దేశాలలోను, ఒకే రకంగా ఉంటే,

$$\left(\frac{P_K}{P_L}\right)_B < \left(\frac{P_K}{P_L}\right)_A$$

అంటే రెండు నిర్వచనాల ప్రకారము, B దేశము మూలధన సమృద్ధి దేశమని చెప్పవచ్చు.

కాబట్టి, రెండు దేశాలలోనూ, అభిరుచులు ఒకే విధంగా ఉంటాయనే ప్రమేయం వలన, యీ రెండు నిర్వచనాల మధ్య వైరుధ్యమేమీ లేదు.

అయితే, యీ సమృద్ధి భావన ఒక సాపేక్ష భావనగా గుర్తించాలి. B దేశము, A దేశముతో పోలిస్తే మూలధన సమృద్ధి దేశము, అదే విధంగా A దేశము, B దేశముతో పోలిస్తే శ్రమ సమృద్ధి దేశము.

**3.3.2 ఉత్పత్తి కారక సాంద్రత (Factor Intaxty) :-** ఉత్పత్తి కారక సాంద్రత భావన పై హెక్సర్ - ఓహ్లిన్ సిద్ధాంతము ఆధారపడినది కాబట్టి ఈ భావనను కూడా మనం తెలుసుకోవాలి.

రెండు వస్తువులు - X మరియు Y ; రెండు ఉత్పత్తి కారకాలు - మూలధనము (K), మరియు శ్రమ (L) అనుకొందాము.

$$\left[\frac{\text{మూలధనము (K)}}{\text{శ్రమ (L)}}\right]_Y > \left[\frac{\text{మూలధనము (K)}}{\text{శ్రమ (L)}}\right]_X \text{ అయితే}$$

Y వస్తువు మూలధన సాంద్రత వస్తువని అంటాము. అంటే Y వస్తూత్పత్తిలో $\left(\frac{K}{L}\right)$ నిష్పత్తి, X వస్తూత్పత్తిలో $\left(\frac{K}{L}\right)$ నిష్పత్తి కన్నా ఎక్కువ.

ఉదాహరణకు, 1 యూనిట్ Y వస్తూత్పత్తికి, 2 యూనిట్ల మూలధనము (K), 2 యూనిట్ల శ్రమ (L) అవసరమనుకుందాము.

అపుడు మూలధన / శ్రమ నిష్పత్తి $\left(\frac{K}{L}\right) = \frac{2}{2} = 1$

1 యూనిట్ X వస్తూత్పత్తికి, 1 యూనిట్ మూలధనము (K), 4 యూనిట్లు శ్రమ (L) అవసరమయితే,

మూలధన / శ్రమ నిష్పత్తి $\left(\frac{K}{L}\right) = \frac{1}{4}$

Y వస్తూత్పత్తిలో, $\left(\frac{K}{L}\right) = 1$

X వస్తూత్పత్తిలో $\left(\frac{K}{L}\right) = \frac{1}{4}$

కాబట్టి X వస్తువు శ్రమ సాంద్రత (Labour - intensive) వస్తువని, Y వస్తువు మూలధన సాంద్రత (capital - intensive) వస్తువని అంటాము.

ఇక్కడ, మూలధన, శ్రమ, పరిమాణాలను బట్టి ఉత్పత్తి కారక సాంద్రత చెప్పము. కాని వాటిని నిష్పత్తి - 1 యూనిట్ శ్రమకు, ఎన్ని యూనిట్ల మూలధనమును ఉపయోగించాలి? అనే దాన్నిబట్టి చెప్తాము.

ఉదాహరణకు, 1 యూనిట్ X వస్తూత్పత్తికి, 3 యూనిట్ల మూలధనము (K) మరియు 12 యూనిట్ల శ్రమ (L) అవసరమనుకొందాము. 1 యూనిట్ Y వస్తూత్పత్తికి, 2 యూనిట్ల మూలధనము (K) మరియు 2 యూనిట్ల శ్రమ అవసరమనుకొందాము. ఈ ఉదాహణలలో 1 యూనిట్ X వస్తూత్పత్తికి 3 యూనిట్ల మూలధనము అవసరము. 1 యూనిట్ Y వ వస్తూత్పత్తికి, 2 యూనిట్ల మూలధనము అవసరము. కాబట్టి X వస్తువు మూలధన సాంద్రత వస్తువు అని అనము.

మూలధన / శ్రమ నిష్పత్తిని పరిగణించాలి. అపుడు

$$\left(\frac{K}{L}\right)_Y = \frac{2}{2} = 1$$


$$\left(\frac{K}{L}\right)_X = \frac{3}{12} = \frac{1}{4}$$

$$\left(\frac{K}{L}\right)_Y > \left(\frac{K}{L}\right)_X$$

దీని ప్రకారము, Y వస్తువు మూలధన సాంద్రత వస్తువు కాని X వస్తువు కాదు. ఉత్పత్తి కారక సాంద్రత, తులనాత్మక అనుకూలత వలెనే ఒక సాపేక్ష భావన Y వస్తువు, X వస్తువుతో పోలిస్తే మూలధన సాంద్రత వస్తువు అని చెపితే, X వస్తువు, Y వస్తువుతో పోలిస్తే శ్రమ సాంద్రత వస్తువని చెప్పాలి.

**3.3.3 ఉత్పత్తి కారక సమృద్ధి - ఉత్పత్తి అవకాశాల రేఖ :-** పై ప్రమేయాలననుసరించి, B దేశము మూలధన సమృద్ధి దేశము, Y వస్తువు మూలధన సాంద్రత వస్తువు కాబట్టి, B దేశము, (A దేశముతో పోలిస్తే), Y వస్తువును ఎక్కువగా ఉత్పత్తి చెయ్యగలదు. A దేశము శ్రమ సమృద్ధి దేశము మరియు X వస్తువు శ్రమ సాంద్రత వస్తువు కాబట్టి A దేశము X వస్తువును ఎక్కువగా ఉత్పత్తి చెయ్యగలదు. వీటి దృష్ట్యా రెండు దేశాల ఉత్పత్తి అవకాశాల వక్రరేఖల ఆకారాలలో తేడా ఉంటుంది.

పటం - 3.1



పటము 3.1లో X అక్షము పై X వస్తువును, Y అక్షం పై వస్తువును చూపించాము. $AA^1 - A$ దేశపు ఉత్పత్తి అవకాశాల వక్రరేఖ. $BB^1 - B$ దేశపు ఉత్పత్తి అవకాశాల వక్రరేఖ.

A దేశము శ్రమ సమృద్ధి దేశము మరియు X వస్తువు శ్రమ సాంద్రత వస్తువు. కాబట్టి A దేశపు ఉత్పత్తి అవకాశాల వక్రరేఖ, X అక్షము వైపు ఎక్కువగా వంగి ఉంటుంది. (Skewed towards, the X - axis) .

B దేశము మూలధన సమృద్ధి దేశము మరియు Y వస్తువు మూలధన సాంద్రత వస్తువు కాబట్టి ఆ దేశపు ఉత్పత్తి అవకాశాల వక్రరేఖ, Y అక్షము వైపు ఎక్కువగా వంగి ఉంటుంది. ఈ రెండు రేఖలనూ ఒకే పటములో చూపించడం వలన, వాటి ఆకారాలలో తేడాలను స్పష్టంగా గమనించవచ్చు.

ఉత్పత్తి కారక సమృద్ధి, ఉత్పత్తి కారక సాంద్రత భావనలు, వాటి అర్థాలను తెలుసుకొన్నాము. కాబట్టి, హెక్స్చర్ - ఓహ్లిన్ సిద్ధాంతాన్ని పరిశీలిద్దాము.

## 3.4 హెక్స్చర్ - ఓహ్లిన్ సిద్ధాంతము :-

వాస్తవానికి, యీ సిద్ధాంతాన్ని రెండు రూపాల్లో వివరించవచ్చు.

1. హెక్స్చర్ - ఓహ్లిన్ సిద్ధాంతము - ఇది వ్యాపార తీరును (Pattern of Trade) వివరిస్తుంది.
2. ఉత్పత్తి కారకాల ధర సమానత్వ సిద్ధాంతము - ఇది ఉత్పత్తి కారకాల ధరల పై వ్యాపార ప్రభావాన్ని వివరిస్తుంది.

ముందుగా మనము, హెక్స్చర్ - ఓహ్లిన్ సిద్ధాంతాన్ని పరిశీలిద్దాము.

ఒక దేశము, ఆ దేశములో సమృద్ధిగా ఉన్న ఉత్పత్తి కారకాన్ని ఎక్కువగా (సాంద్రంగా) ఉపయోగించే వస్తువునుత్పత్తి చేసి, ఎగుమతి చేసి, కొరతగా ఉన్న ఉత్పత్తి కారకాన్ని సాంద్రంగా ఉపయోగించే వస్తువును దిగుమతి చేసుకుంటుంది. అంటే శ్రమసమృద్ధి దేశము, శ్రమ సాంద్రత వస్తువును ఎగుమతి చేసి, మూలధన సాంద్రత వస్తువును దిగుమతి చేసుకుంటుంది. ఇదే హెక్స్చర్ - ఓహ్లిన్ సిద్ధాంతము.

పై ఉదాహరణలో X వస్తువు శ్రమ సాంద్రత వస్తువు, మరియు A దేశము శ్రమ సమృద్ధి దేశము. కాబట్టి A దేశము X వస్తువునుత్పత్తి చేసి ఎగుమతి చేస్తుంది.

B దేశము మూలధన సమృద్ధి దేశము, Y వస్తువు మూలధన సాంద్రత వస్తువు. కాబట్టి, B దేశము Y వస్తువునుత్పత్తి చేసి, ఎగుమతి చేస్తుంది. ఈ సందర్భంగా, $\left(\frac{r}{w}\right)_B < \left(\frac{r}{w}\right)_A$ అని గమనించాలి.

వస్తువుల సాపేక్ష ధరలలో, తులనాత్మక అనుకూలతలలో, దేశాల మధ్య గల తేడాలకు గల కారణాలన్నింటిలోనూ ఉత్పత్తి కారకాల సమృద్ధిలో గల తేడాలే కారణమని, యీ సిద్ధాంతము గుర్తించింది. అందువలన, హెక్స్చర్ - ఓహ్లిన్ సిద్ధాంతాన్ని ఉత్పత్తి కారకాల సమృద్ధి (లేదా నిధి) (Factor Endowment Theory) అనీ, ఉత్పత్తి కారకాల అనుపాతాల సిద్ధాంతమనీ (Factor proportions Theory) కూడా పేర్కొంటారు. దీనినిబట్టి, ప్రతి దేశము, తన దేశములో సమృద్ధిగా ఉండి, చౌకగా లభ్యమయ్యే ఉత్పత్తి కారకాన్ని సాంద్రంగా ఉపయోగించే వస్తువుత్పత్తిలో ప్రత్యేకీకరణ సలిపి, ఆ వస్తువును ఎగుమతి చేస్తుంది. కొరతగా ఉండే ఉత్పత్తికారక సాంద్రత వస్తువును దిగుమతి చేసుకుంటుంది.

దీనిని బట్టి ఒక విషయం సుస్పష్టం. యీ సిద్ధాంతము తులనాత్మక అనుకూలతకు గల కారణాన్ని వివరిస్తుంది. సాంప్రదాయ ఆర్థికవేత్తల వలె, తులనాత్మక అనుకూలత ఉందని ప్రమేయం చేయదు. వ్యాపారానికి ముందు, రెండు దేశాలలో వస్తువుల సాపేక్ష ధరలలో తేడాలకు, రెండు దేశాలలోని ఉత్పత్తి కారకాల సమృద్ధి, వాటి ధరలలో (సాపేక్ష) తేడాలే కారణమని యీ సిద్ధాంతము వివరించింది.


ఇపుడు, యీ సిద్ధాంతాన్ని వివరంగా పరిశీలిద్దాము.

## 3.4 హెక్స్చర్ - ఓహ్లిన్ సిద్ధాంతము - వివరణ :-


పటము 3.2లో, యీ సిద్ధాంతము వివరింపబడినది. 3.2 (ఎ) పటమును పరిశీలించండి. ఇందులో, $AA^1$ - A దేశపు ఉత్పత్తి అవకాశాల వక్రరేఖ. $BB^1$ - B దేశపు ఉత్పత్తి అవకాశాల వక్రరేఖ. $AA^1$ ఆకారాన్ని బట్టి పైన చెప్పినట్లు, X వస్తువు శ్రమ సాంద్రత వస్తువు, మరియు A దేశము శ్రమ సమృద్ధి దేశము. Y వస్తువు మూలధన సాంద్రత వస్తువు మరియు B దేశము మూలధన సమృద్ధి దేశము. రెండు దేశాలు, ఒకే సాంకేతిక విజ్ఞానాన్ని ఉపయోగిస్తాయి. రెండు దేశాలలోనూ, రుచులు, అభిరుచులు ఒకే రకంగా ఉంటాయని ప్రమేయము. కాబట్టి రెండు దేశాలకు, ఉదాసీనతా వక్రరేఖ మ్యాపు (Indifference Map) ఒకటే. $CI_1$ రేఖ A దేశపు ఉత్పత్తి అవకాశాల వక్రరేఖ $AA^1$ కు E బిందువు వద్ద B దేశపు ఉత్పత్తి అవకాశాల వక్రరేఖ $BB^1$కు $E^1$ బిందువు వద్ద స్పర్శ రేఖగా ఉంది. వ్యాపారానికి ముందు (Before Trade) పరిస్థితి యిది. వ్యాపారం లేనపుడు, రెండు దేశాలు అందుకొనగలిగిన అత్యున్న ఉదాసీనతా వక్రరేఖ $CI_1$. A దేశము E బిందువు వద్ద, B దేశము $E^1$ బిందువు వద్ద సమతౌల్య స్థితిలో ఉంటాయి. వ్యాపారం లేనపుడు ఉత్పత్తి, వినియోగాలు, రెండు దేశాలలోనూ $E, E^1$ వద్ద ఉంటాయి.

$E, E^1$ బిందువుల వద్ద, $CI_1$ రేఖ $AA^1$కు, $BB^1$కు స్పర్శ రేఖగా ఉంది. MN - A దేశములో ధర రేఖ. $M^1N^1$ - B దేశములో ధర రేఖ. ఇవి $E, E^1$ బిందువుల వద్ద స్పర్శ రేఖలుగా ఉన్నాయి. MN A దేశములో, $M^1N^1$ B దేశములోను వ్యాపారం లేనపుడు, వస్తువుల సాపేక్ష ధరలను తెలియజేస్తాయి. MN రేఖవాలు, $M^1N^1$ రేఖవాలు కన్నా తక్కువగా ఉన్నది. అంటే, X వస్తూత్పత్తిలో A దేశానికి, Y వస్తూత్పత్తిలో B దేశానికి తులనాత్మక అనుకూలత ఉన్నది. ఇది వ్యాపారానికి ముందు పరిస్థితి.

పటము - 3.2(ఎ)




పటము - 3.2 (బి)



పటము 3.2(బి) వ్యాపారం తర్వాతి పరిస్థితిని తెలియజేస్తుంది. వ్యాపారం వలన, A దేశము X వస్తూత్పత్తిలో ప్రత్యేకీకరణ చేస్తుంది. B దేశము Y వస్తూత్పత్తిలో ప్రత్యేకీకరణ చేస్తుంది. A దేశము D బిందువు చేరే వరకూ, B దేశము $D^1$ బిందువు చేరే వరకు యీ ప్రత్యేకీకరణ కొనసాగుతుంది. ఈ బిందువుల వద్ద ఉమ్మడి సాపేక్ష ధర రేఖ - $PP^1$ - రెండు దేశాల ఉత్పత్తి అవకాశాల వక్రరేఖలకు స్పర్శరేఖగాఉంది. A దేశము ఇపుడు X వస్తువునెగుమతి చేసి, Y వస్తువును దిగుమతి చేసుకొని, $CI_2$ రేఖ పై E బిందువు వద్ద వినియోగము చేస్తుంది. ECD - వ్యాపార త్రిభుజము. B దేశము, Y వస్తువునెగుమతి చేసి, $E^1$ బిందువు వద్ద వినియోగము చేస్తుంది. (ఇది E బిందువుతో సమానము). $E^1C^1D^1$ - వ్యాపార త్రిభుజము.

A దేశపు X వస్తువు ఎగుమతులు, B దేశపు X వస్తువు దిగుమతులకు సమానమని గ్రహించాలి. అనగా $CD = C^1E^1$. అదే మాదిరి, B దేశపు Y వస్తువు ఎగుమతులు, A దేశపు Y వస్తువు దిగుమతులకు సమానము. అనగా $C^1D^1 = CE$. వస్తువుల ధర నిష్పత్తి $\frac{P_X}{P_Y} > PP^1$ అయితే, A దేశము, B దేశము ఇష్టపడే పరిమాణము కన్నా ఎక్కువగా X వస్తువుని ఎగుమతి చెయ్యాలనుకుంటుంది. అపుడు $\frac{P_X}{P_Y}$, $PP^1$ వాలుకు తగ్గుతుంది. $\frac{P_X}{P_Y} < PP^1$ అయితే, A దేశము, B దేశము యిష్టపడే పరిమాణము కన్నా తక్కువ దిగుమతి చేయాలనుకుంటుంది. అపుడు $\frac{P_X}{P_Y}$, $PP^1$ వాలుకు పెరుగుతుంది.

E బిందువు వద్ద R బిందువు వద్ద కన్నా ఎక్కువ Y తక్కువ X. కాని E బిందువు $CI_2$ రేఖ పై ఉంది. కాబట్టి A దేశము వ్యాపారం వలన లాభపడుతుంది. అదే విధంగా, $E^1$ బిందువు వద్ద, $R^1$ బిందువు వద్ద కన్నా ఎక్కువ X, తక్కువ Y. కాని $E^1$ బిందువు $CI_2$ రేఖ పై ఉంది కాబట్టి B దేశము కూడా వ్యాపారము వలన లాభపడుతుంది. ఏదైనా ఒక దేశంలో కాని, రెండు దేశాలలో కాని ఉత్పత్తి కారకాల మార్కెట్లలో కాని, ఉత్పత్తి మార్కెట్లలో కాని సప్లయ్ లేదా డిమాండ్ పరిస్థితులలో మార్పు రానంతవరకు యీ రకమైన ఉత్పత్తిలో ప్రత్యేకీకరణ, వ్యాపారము మరియు వినియోగము కొనసాగుతుంది.

ఈ వివరణను బట్టి, ఒక విషయం స్పష్టమవుతోంది. మూలధన సమృద్ధి దేశము, మూలధన సాంద్రత వస్తువును ఎగుమతి చేస్తుంది. శ్రమ సమృద్ధి దేశము, శ్రమ సాంద్రత వస్తువునెగుమతి చేస్తుంది. హెక్సర్ - ఓహ్లిన్ సిద్ధాంతము ఈ విషయాన్నే సూత్రీకరించింది. ఈ రకపు వ్యాపారం వలన, రెండు దేశాలు, గరిష్ఠ సంతృప్తి స్థాయిని పొందుతాయి. రెండు దేశాలు, సామాజిక ఉదాసీనతా వక్రరేఖ $CI_2$ పై ఉంటాయి. వ్యాపారానికి ముందు, అవి $CI_1$ రేఖ పైన ఉన్నాయి.

## 3.5 హెక్సర్ - ఓహ్లిన్ సిద్ధాంతము - మెరుగైన అంశాలు :-

హెక్సర్ - ఓహ్లిన్ సిద్ధాంతము, సాంప్రదాయ సిద్ధాంతము కన్నా ఎన్నో అంశాలలో మెరుగైనదని చెప్పవచ్చు.

1. హెక్సర్ - ఓహ్లిన్ సిద్ధాంతము, అవాస్తవికమైన శ్రమ విలువ సిద్ధాంతము నుండి, సాంప్రదాయ సిద్ధాంతాన్ని విముక్తి చేసింది.

2. సాంప్రదాయ సిద్ధాంతము, శ్రమ ఒక్కటినే పరిగణించింది. కాని యీ సిద్ధాంతము, రెండు ఉత్పత్తి కారకాలు - శ్రమ, మూలధనమును పరిగణించింది. అందువలన హెక్సర్ - ఓహ్లిన్ సిద్ధాంతము మెరుగైనది.

3. హెక్చర్ - ఓహ్లిన్ సిద్ధాంతము, రికార్డో సిద్ధాంతము కన్నా మెరుగైనది. ఉత్పత్తి కారకాల సప్లయిలలో తేడాలు, అంతర్జాతీయ వ్యాపార తీరు నిర్ణయములో కీలకమైనవని హెక్చర్ - ఓహ్లిన్ సిద్ధాంతము నిరూపించింది. కాని రికార్డో సిద్ధాంతము వీటిని పరిగణించలేదు.

4. ఈ సిద్ధాంతము, ఉత్పత్తి కారకాల సాపేక్ష ధరల పై ఆధారపడినది. ఇవి వస్తువుల సాపేక్ష ధరలను ప్రభావితం చేస్తాయని భావించింది. అందువలన యీ సిద్ధాంతము, ఎక్కువ వాస్తవికమైనది. రికార్డో సిద్ధాంతము, వస్తువుల సాపేక్ష ధరలను మాత్రమే పరిగణిస్తుంది.

5. హెక్చర్ - ఓహ్లిన్ సిద్ధాంతము, శ్రమ, మూలధన ఉత్పాదకతలలోని సాపేక్ష తేడాలు, అంతర్జాతీయ వ్యాపారానికి మూలమని భావించింది. కాని సాంప్రదాయిక సిద్ధాంతము, శ్రామిక ఉత్పాదకతలలోని తేడాలను మాత్రమే పరిగణించింది.

6. సాంప్రదాయ సిద్ధాంతము శ్రమ, ఉత్పత్తి కారకము యొక్క గుణాన్ని (quality) మాత్రమే పరిగణించింది. కాని నవ్య వ్యాపార సిద్ధాంతము, దేశాలలోని ఉత్పత్తి కారకాల సమృద్ధిలో తేడాల పై ఆధారపడినది. ఉత్పత్తి కారకాల గుణాల (Qualities) తో బాటు, వాటి పరిమాణాలు కూడా అంతర్జాతీయ విలువల నిర్ణయంలో కీలకమైనవని, హెక్చర్ - ఓహ్లిన్ సిద్ధాంతము అభిప్రాయము. అందువలన యీ సిద్ధాంతము, సాంప్రదాయిక సిద్ధాంతము కన్నా మెరుగైనది.

7. శామ్యూల్‌సన్ అభిప్రాయంలో, తులనాత్మక అనుకూలతలో తేడాలకు కారణాలను, రికార్డో సిద్ధాంతము వివరించలేదు. కాని హెక్చర్ - ఓహ్లిన్ సిద్ధాంతము యీ కారణాలను చెప్పగలిగింది. అందువలన, యిది మెరుగైనది.

8. హెక్చర్ - ఓహ్లిన్ సిద్ధాంతమునను సరించి, వ్యాపారం తర్వాత, వ్యాపారంలో పాల్గొనే దేశాలు, ఏదో ఒక వస్తూత్పత్తిలో సంపూర్ణ ప్రత్యేకీకరణ చేస్తాయి. కాని సాంప్రదాయ సిద్ధాంతమును బట్టి, రెండు దేశాల మధ్య వ్యాపారం వలన పూర్తి ప్రత్యేకీకరణ జరగవచ్చు, జరగకపోవచ్చు.

పైన వివరించిన వాటిని బట్టి హెక్చర్ - ఓహ్లిన్ సిద్ధాంతము, సాంప్రదాయిక సిద్ధాంతము కన్నా చాలా మెరుగైనది. రికార్డో తులనాత్మక వ్యయ సిద్ధాంతాన్ని మిల్ పరస్పర డిమాండ్ భావనను రెండింటినీ యీ సిద్ధాంతములో పొందు పరచడమే గాక వాటిని మెరుగుపరచారు. వ్యాపార తీరుకు దేశపు ఆర్థిక నిర్మితికి గల సంబంధమును నిర్ధారించింది. ఈ విధంగా వ్యాపారంలో మార్పుల వల్ల, దేశీయంగా ఆర్థిక నిర్మితిలో మరియు దేశంలో ఆర్థిక పంపిణీ పై ప్రభావాలను విశ్లేషణ చేసింది.

## 3.6 హెక్చర్ - ఓహ్లిన్ సిద్ధాంతము - విమర్శలు :-

పైన వివరించినట్లుగా, ఈ సిద్ధాంతము సాంప్రదాయక సిద్ధాంతము కన్నా అనేక అంశాలలో మెరుగైనది. అయినా, యీ సిద్ధాంతము కూడా అనేక విమర్శకులకు గురి అయినది. వాటిని యిప్పుడు పరిశీలిద్దాము.

1. ఈ సిద్ధాంతము $2 \times 2 \times 2$ నమూనా అని ఒక విమర్శ. చాలా సులభతరమైన ప్రమేయాల పై ఆధారపడినది. కాని యిది పలు దేశాలకు, పలు వస్తువులకు, పలు ఉత్పత్తికారకాలకు కూడా విస్తరింపవచ్చునని ఓహ్లిన్ తన పుస్తకము 'Mathematical Appendix' లో నిరూపించాడు.

2. సాంప్రదాయిక సిద్ధాంతము వలె, ఇది కూడా నిశ్చలన (static) సిద్ధాంతము. ఉత్పత్తి పరిస్థితులు మారితే, ఆర్థిక వ్యవస్థ ఎలా మారేదీ సూచించలేదు.

3. రెండు దేశాలలోనూ, ఉత్పత్తి కారకాలు సజాతీయాలని ప్రమేయము. అపుడే ఉత్పత్తి కారక సమృద్ధి, నిష్పత్తులను కనుగొనగలము. కాని, వాస్తవానికి ఏ రెండు ఉత్పత్తి కారకాలు, దేశాల మధ్య సజాతీయములుగా ఉండవు. ఒకే ఉత్పత్తి కారకము కూడా వివిధ రకాలుగా ఉండవచ్చు. ఉదాహరణకు, శ్రమ - నైపుణ్యాము గల, నైపుణ్యాము లేని

విధంగా ఉండవచ్చు. అలాగే, మూలధన వస్తువులు కూడా వివిధ రూపాలలో ఉండి, శ్రమ యొక్క విధులను కూడా నిర్వర్తించవచ్చు. అంటే శ్రమని పొదుపు చేయవచ్చు (labour saving).

4. ఈ సిద్ధాంతము, రెండు దేశాలలోనూ, ప్రతి వస్తువుకు ఒకే రకమైన ఉత్పత్తి పద్ధతులున్నాయని ప్రమేయము. కాని ఒకే వస్తువుకు ఉత్పత్తి పద్ధతులు రెండు దేశాలలోనూ ఒకే విధంగా ఉండవు. ఉదాహరణకు, వస్త్రాలు చేనేత మగ్గాల పై (ఎక్కువ పని వారితో) గానీ, మర మగ్గాల పై (తక్కువ పని వారితో) గానీ ఉత్పత్తి చెయ్యవచ్చు. అపుడు, వ్యాపార తీరు, యీ సిద్ధాంతానికనుగుణంగా ఉండకపోవచ్చు.

5. రెండు దేశాలలోనూ, వినియోగదారుల రుచులు, అభిరుచులు, డిమాండ్ తీరు ఒకే రకంగా ఉంటాయని యీ సిద్ధాంత ప్రమేయము. దీనిని బట్టి, వివిధ ఆదాయ వర్గాల వారి డిమాండ్ తీరు ఒకే రకంగా ఉంటుందని భావించాలి. నవకల్పనల వల్ల వినియోగ వస్తువులు క్రొత్తవి ప్రవేశించవచ్చు. వీటి వలన, అభివృద్ధి చెందిన దేశాలలో కూడా, వినియోగదారుల అభిరుచులలోనూ, వస్తు డిమాండ్ లోనూ మార్పులు రావచ్చు. అమెరికాలో వినియోగదారులు ఇష్టపడే వస్తువులు, జర్మనీలో వినియోగదారులు ఇష్టపడే వస్తువులు ఒకటి కాకపోవచ్చు. అందువలన వ్యాపారంలో పాల్గొనే దేశాలలో, అభిరుచులు ఒకే రకంగా ఉండవు.

6. తరహానుసరించి వచ్చే ప్రతిఫలాలు స్థిరంగా ఉంటాయనే ప్రమేయం అవాస్తవికమైనది. ఉత్పత్తికారక సమృద్ధి అధికంగా ఉన్నపుడు, తరహానుసరించి వచ్చే ఆదాలవల్ల, ఎక్కువ ఉత్పత్తి, ఎక్కువ ఎగుమతుల వలన ప్రయోజనం పొందవచ్చు. అందువలన, తరహానుసరించి పెరిగే ప్రతిఫలాలుండవచ్చు.

7. ఈ సిద్ధాంతము, రెండు దేశాల మధ్య రవాణా వ్యయాలుండవని భావించింది. ఇది అవాస్తవిక ప్రమేయము. రవాణా వ్యయాలతో పాటు, లోడింగ్, అన్ లోడింగ్ ఛార్జీలు, యితర రేవు ఛార్జీలు, రెండు దేశాలలోనూ, వస్తువుల ధరలను ప్రభావితం చేస్తాయి. రవాణా వ్యయాలను కూడా పరిగణిస్తే ఒకే వస్తువు ధరలలో తేడాలొచ్చి వ్యాపార సంబంధాలను ప్రభావితం చేయవచ్చు.

8. సంపూర్ణ పోటీ, సంపూర్ణ ఉద్యోగిత వంటి అవాస్తవిక ప్రమేయాల పై యీ సిద్ధాంతం ఆధారపడినది. ఏ దేశంలోనూ, యీ పరిస్థితులుండవు. అంతేకాక, దేశాల మధ్య స్వేచ్ఛా వ్యాపారం ఉండదు. వ్యాపారం పై అనేక ఆంక్షలుండవచ్చు.

9. ఓహ్లిన్ ఒక సమగ్ర సమతౌల్య భావనను అభివృద్ధి చేయలేదని హాబర్లర్ విమర్శ. ఓహ్లిన్‌ది చాలా వరకు పాక్షిక సమతౌల్య విశ్లేషణ అని హాబర్లర్ అభిప్రాయము.

10. ఈ సిద్ధాంతము అస్పష్టమైనది. అనేక నిబంధనలకు లోబడినదని (conditions) అని ఒక విమర్శ. అనేక ఉత్పత్తి కారకాలు, వివిధ దేశాలలో వాటిలో తేడాలు, వివిధ దేశాలలో వివిధ ఉత్పత్తి ఫలాలు - వీటన్నిటి వలన వ్యాపార తీరును నిర్దిష్టంగా చెప్పడం సాధ్యపడదని హాబర్లర్ అభిప్రాయము.

ఈ విమర్శలు ఉన్నా హెక్షర్ - ఓహ్లిన్ సిద్ధాంతము సాంప్రదాయిక సిద్ధాంతము కన్నా చాలా మెరుగైనదని చెప్పవచ్చు.

## 3.7 హెక్షర్ - ఓహ్లిన్ సిద్ధాంతము : సాంఖ్యక పరీక్షలు :-

ఒక సిద్ధాంతము కానీ, నమూనా కానీ, సాంఖ్యక పరీక్షలో విజయం సాధిస్తేనే దానిని ఆమోదించడం జరుగుతుంది. లేనపుడు, దానిని తిరస్కరించి, ప్రత్యామ్నాయ సిద్ధాంతాన్ని ప్రతిపాదించాలి. ఇపుడు మనము హెక్షర్ - ఓహ్లిన్ సిద్ధాంతాన్ని సాంఖ్యకంగా పరీక్షించిన అధ్యయనాలను పరిశీలిద్దాము.

వీటిలో ముఖ్యమైనది - 1951లో Wassily Leontief చేసిన అధ్యయనము. ఈ అధ్యయనము, అమెరికా దేశానికి సంబంధించి, 1947 సంవత్సరపు దత్తాంశమునాధారంగా చేసినది. అమెరికా ప్రపంచంలో అత్యంత మూలధన సమృద్ధి దేశము. కాబట్టి, ఆ దేశము మూలధన సాంద్రత వస్తువులనెగుమతి చేసి, శ్రమ సాంద్రత వస్తువులను దిగుమతి చేసుకుంటుందని నిరూపించవచ్చని లియోంటిఫ్ భావించాడు. కాని అతని అధ్యయన ఫలితాలు ఇందుకు పూర్తిగా వ్యతిరేకంగా వచ్చాయి. దీనినే 'లియోంటిఫ్ వైపరీత్యము' (Leontief Paradox) అని వ్యవహరిస్తారు. ఈ అధ్యయన వివరాలను యిపుడు మనము పరిశీలిద్దాము.

లియోంటిఫ్, యీ అధ్యయనానికి, 1947వ సంవత్సరపు అమెరికా దేశపు ఉత్పాదక - ఉత్పత్తుల మాత్రిక (Input - Output Matrix) నుపయోగించారు. ఈ మాత్రిక భావనను, విశ్లేషణను లియోంటిఫ్ అభివృద్ధి చేసారు. ఆయన కృషికి గాను, 1973లో ఆర్థిక శాస్త్రంలో నోబెల్ బహుమతి లభించినది.

సుమారు 200 పరిశ్రమలను, 50 రంగాలుగా (Sectors) విభజించాడు. వీటిలో 35 రంగాలు, ప్రత్యక్షంగా అంతర్జాతీయ మార్కెట్‌లో తమ ఉత్పత్తులను వ్యాపారం చేసాయి. ఉత్పత్తి కారకాలను రెండు రకాలుగా వర్గీకరించాడు. శ్రమ, మూలధనము. ఒక మిలియన్ డాలర్ల విలువ కలిగిన అమెరికన్ ఎగుమతుల సముదాయాన్ని, ఒక మిలియన్ డాలర్ల విలువ కలిగిన అమెరికన్ దిగుమతి ప్రత్యామ్నాయ వస్తువుల సముదాయాన్ని ఉత్పత్తి చేయడానికవసరమైన శ్రమ, మూలధన పరిమాణాలను అంచనా వేసాడు. ఈ అంచనాలు క్రింది పట్టికలో చూపించాము.

పట్టిక - 3.1

| | | దిగుమతి ప్రత్యామ్నాయ వస్తువులు | ఎగుమతులు | దిగుమతులు/ఎగుమతులు |
|---|---|---|---|---|
| 1. | మూలధనము (వేల డా॥లో) | 3091 | 2551 | 1.30 |
| 2. | శ్రమ (శ్రామిక సం॥లలో) | 170 | 182 | |
| 3. | మూలధన/శ్రమ నిష్పత్తి (శ్రామిక సం॥కి వేల డాలర్లలో) | 18.1 | 14.0 | |

పై పట్టికను పరిశీలిస్తే మూలధన/శ్రమ నిష్పత్తి, అమెరికన్ ఎగుమతి పరిశ్రమలలో తక్కువగా ఉంది. (శ్రామిక సంవత్సరానికి, సుమారు $ 14,000). కాని దిగుమతి ప్రత్యామ్నాయ పరిశ్రమలలో యీ నిష్పత్తి ఎక్కువగా ఉంది. (సుమారు $ 18,000). 30% ఎక్కువగా ఉంది. దీనిని బట్టి అమెరికన్ ఎగుమతుల మూలధన సాంద్రత, దిగుమతి ప్రత్యామ్నాయ వస్తువుల మూలధన సాంద్రత కన్నా తక్కువగా ఉంది. ఈ ఫలితాలు, హెక్సర్ - ఓహ్లిన్ సిద్ధాంతము చెప్పిన దానికి భిన్నంగా ఉన్నాయి. అంటే అమెరికా, మూలధన సమృద్ధి దేశమయినా, శ్రమ సాంద్రత వస్తువులను ఎగుమతి చేస్తోందని తేలింది. దీనినే 'లియోంటిఫ్ వైపరీత్యము'గా పేర్కొన్నారు. ఈ ఫలితాలు, లియోంటిఫ్‌నే గాక, పలు యితర ఆర్థికవేత్తలను కూడా ఆశ్చర్యపరచాయి.

లియోంటిఫ్ దత్తాంశము 1947 సంవత్సరమునకు సంబంధించినది. కాని 1947 సాధారణ సంవత్సరం (Normal Year) కాదని కొంతమంది ఆర్థికవేత్తల అభిప్రాయము. రెండవ ప్రపంచ యుద్ధము తర్వాత, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పునర్నిర్మాణము 1947 నాటికి యింకా పూర్తికాలేదు. అందువలన 1947 Normal Year కాదని విమర్శ. ఈ విమర్శకు బదులుగా, లియోంటిఫ్, 1951 సంవత్సరపు వ్యాపార దత్తాంశమునుపయోగించి, 1956లో మరల అధ్యయనం చేసాడు. ఈ అధ్యయనంలో 192 రంగాలను పరిశీలించాడు. ఈ అధ్యయనంలో కూడా, అమెరికా యొక్క దిగుమతి ప్రత్యామ్నాయ వస్తువుల మూలధన సాంద్రత, ఎగుమతుల కన్నా ఎక్కువగా ఉన్నట్లు తేలింది. మరల 'లియోంటిఫ్ వైపరీత్యము' ఉత్పన్నమయింది.

లియోంటిఫ్ వైపరీత్యము, అనేక సిద్ధాంతపరమైన సాంఖ్యక పరిశోధనలకు దారి తీసింది. ఇవన్నీ హెక్చర్ - ఓహ్లిన్ సిద్ధాంతము యొక్క బలాన్ని, బలహీనతలను గ్రహించడానికి తోడ్పడ్డాయి.

**లియోంటిఫ్ వైపరీత్యము - వివరణలు :-** లియోంటిఫ్ అధ్యయన ఫలితాలు 'లియోంటిఫ్ వైపరీత్యము' అనే దానికి దారి తీసినాయని మనము తెలుసుకున్నాము. అతని అధ్యయనము తర్వాత చేపట్టిన అనేక అధ్యయనాల ఫలితాలు కూడా 'లియోంటిఫ్ వైపరీత్యము' కనుగుణంగానే ఉన్నాయి.

భారతదేశానికి సంబంధించి, ఆచార్య భరద్వాజ్ చేసిన అధ్యయనము ప్రకారము, అమెరికాకు భారతదేశపు ఎగుమతులు మూలధన సాంద్రతగా ఉన్నవనీ, అమెరికా నుండి, భారతదేశపు దిగుమతులు శ్రమ సాంద్రతగా ఉన్నవనీ వెల్లడైంది.

అదే విధంగా, జపాన్ దేశానికి మిగతా ప్రపంచంతో వున్న వ్యాపారాన్ని పరిశీలిస్తే, ఒక అధ్యయనం లియోంటిఫ్ వైపరీత్యాన్ని బలపరచింది. జపాన్ శ్రమ సమృద్ధి దేశము. కాని శ్రమ సాంద్రత వస్తువులను దిగుమతి చేసుకొని, మూలధన సాంద్రత వస్తువులను ఎగుమతి చేసింది (ఈ అధ్యయనము ప్రకారము). ఇది కూడా హెక్చర్ - ఓహ్లిన్ సిద్ధాంతానికి వ్యతిరేక నిర్ధారణయే.

ఈ అధ్యయనాల దృష్ట్యా, హెక్చర్ - ఓహ్లిన్ సిద్ధాంతానికి లియోంటిఫ్ వైపరీత్యానికి మధ్యగల వైరుధ్యాన్ని ఎట్లు పరిష్కారము చెయ్యగలము? అర్థికవేత్తలు, కొన్ని వివరణల ద్వారా యీ రెంటి మధ్య వైరుధ్యమేమీలేదని నిరూపించడానికి ప్రయత్నించారు. వీటిని యిపుడు పరిశీలిద్దాము.

1. లియోంటిఫ్ తన ఫలితాలకు ఒక వివరణనిచ్చాడు. అమెరికా మూలధన సమృద్ధి దేశము అనే అభిప్రాయము ఒక భ్రమ మాత్రమే. వాస్తవానికి అమెరికా శ్రమ సమృద్ధి దేశమని చెప్పవచ్చని లియోంటిఫ్ వాదించాడు. అమెరికన్ శ్రామికుల సామర్థ్యము ఎక్కువ. అందువలన, విదేశీ శ్రామికుల కన్నా వారి ఉత్పాదకత ఎక్కువ. ఒక అమెరికన్ శ్రామిక సంవత్సరము, విదేశీ శ్రమ యొక్క 3 శ్రామిక సంవత్సరాలకు సమానము. ఈ అధిక ఉత్పాదకతకు అధిక మూలధన / శ్రమ నిష్పత్తి కారణము కాదు. మెరుగైన వ్యవస్థాపన, అనుకూల వాతావరణము కారణమని లియోంటిఫ్ వాదించాడు. ఈ వివరణను కొంతమంది అర్థికవేత్తలు అంగీకరించలేదు.

2. లియోంటిఫ్ తన గణనలో మానవ మూలధన విలువను చేర్చలేదు. అమెరికా ఎగుమతి పరిశ్రమలు, (దిగుమతి ప్రత్యామ్నాయ పరిశ్రమలతో పోలిస్తే) ఎక్కువ నైపుణ్యాత కలిగిన శ్రామికులను నియోగించాయి. చాలా మంది అర్థికవేత్తలు, మానవ మూలధనములో పెట్టుబడికి మరియు అమెరికా వ్యాపార తీరుకు మధ్య గల సంబంధాన్ని పరిశోధించారు. భౌతిక మూలధనము కన్నా, మానవ మూలధనమును పరిగణిస్తే, అమెరికా దేశపు ఎగుమతులు, (దిగుమతి ప్రత్యామ్నాయ వస్తువుల కంటే) ఎక్కువ మానవ మూలధన సాంద్రతగా ఉన్నవనీ, బాల్విన్ (Baldwin) అధ్యయనము నిర్ధారించింది. అందువలన మానవ మూలధనము, లియోంటిఫ్ వైపరీత్యాన్ని బలపరుస్తుంది.

3. లియోంటిఫ్, అమెరికా వ్యాపార తీరు నిర్ణయములో, సహజ వనరుల పాత్రను నిర్లక్ష్యం చేసాడు. J. VANEK, తన అధ్యయనములో, అమెరికాలో, కొన్ని సహజ వనరుల కొరత వున్నదని పేర్కొన్నాడు. ఉత్పత్తిలో సహజవనరులు, మూలధనము పూరకాలు. కాబట్టి అమెరికా వ్యాపార తీరు సహజవనరుల పరిరక్షణ కనుగుణంగా ఉంది. అమెరికా మూలధన సమృద్ధి దేశము కావచ్చు, కాని అమెరికన్ దిగుమతులు, దాని ఎగుమతుల కన్నా అధిక మూలధన సాంద్రతగలవిగా ఉన్నాయి. దీనికి కారణము, సమర్థవంతమైన ఉత్పత్తికి, మూలధన ఉపయోగము కొరతగా వున్న సహజవనరులనుపయోగించవలసి రావడం వలన అని వానెక్ వాదన. ఇది లియోంటిఫ్ వైపరీత్యాన్ని వివరిస్తుంది. వాస్తవానికి, అమెరికా సహజ వనరుల ఉత్పత్తులు - ఖనిజాలు, అటవీ సంబంధిత ఉత్పత్తులను దిగుమతి చేసుకొంటుంది. వీటి మూలధన/శ్రమ నిష్పత్తులు ఎక్కువగా ఉంటాయి. తక్కువ మూలధన/శ్రమ నిష్పత్తులుండే వ్యవసాయోత్పత్తులను

ఎగుమతి చేస్తుంది. కాబట్టి లియోంటిఫ్ వైపరీత్యాన్ని సరిగా మదింపు చేయాలంటే, అమెరికా ఎగుమతులు, దిగుమతులు సహజ వనరులను ఏ మేరకు ఉపయోగించేదీ నిర్ధారించవలసిన ఆవశ్యకత ఉంది.

4. ఈ సందర్భంగా ఉత్పత్తికారక సాంద్రత పరివర్తనలు అనే అంశాన్ని కూడా మనము గుర్తించాలి. వ్యాపారంలో పాల్గొనే దేశాలలో, ఉత్పత్తికారక సాంద్రతలో పరివర్తనలు ఉంటే, వ్యాపార తీరు (Pattern of Trade) హెక్చర్ - ఓహ్లిన్ సిద్ధాంతమునను సరించి ఉండదు. ఏదో ఒక దేశంలో, లియోంటిఫ్ వైపరీత్యము ఉత్పన్నమవుతుంది. మిన్హాస్ (Minhas) యీ పరివర్తనలను అధ్యయనం చేసారు. 19 దేశాలలో, 24 పరిశ్రమలను పరిశీలించగా, ఐదింటిలో ఉత్పత్తికారక సాంద్రత పరివర్తనలను కనుగొన్నారు. అమెరికా, జపాన్ దేశాలకు ఉమ్మడిగా ఉన్న 20 పరిశ్రమల మూలధన/శ్రమ నిష్పత్తులకు ర్యాంకులివ్వగా, ఎగుమతి, దిగుమతులలో ఉత్పత్తికారక సాంద్రత పరివర్తనలను కనుగొన్నారు. తర్వాత జరిగిన అధ్యయనాలు, మిన్హాస్ ఫలితాలను పూర్తిగా బలపరచలేదు. ఈ రకపు పరివర్తనలు ఉన్నాయని నిర్ధారించినా, అవి అమెరికన్ ఎగుమతులు ఎందువలన శ్రమ సాంద్రతగా ఉన్నదీ వివరించలేవు.

5. వ్యాపార ఆంక్షలు కూడా లియోంటిఫ్ వైపరీత్యానికి దారి తీయవచ్చు. ఉదాహరణకు, అమెరికా, వివిధ టారిఫ్, టారిఫేతర ఆంక్షలతో, శ్రమ సాంద్రత వస్తువుల దిగుమతిని నియంత్రిస్తుంది. దేశీయంగా ఉన్న శ్రమ సాంద్రత పరిశ్రమల (వస్త్రాలు, దుస్తులు)కు భారీగా రక్షణను కలుగజేస్తుంది. శ్రమ సాంద్రత వస్తువుల పై వ్యాపార ఆంక్షలను విధించడం ద్వారా, శ్రమ సాంద్రత వస్తువుల దిగుమతులను కట్టడి చేసి, అమెరికన్ మొత్తము దిగుమతుల శ్రమ సాంద్రత తగ్గిపోయింది. అయితే, లియోంటిఫ్ వైపరీత్యానికి, ఇవి ఏ పరిమాణములో దోహదం చేస్తాయో, పరిశోధనలు నిర్ధారించలేకపోయాయి.

6. అమెరికన్ ఎగుమతులు, దిగుమతుల పై వినియోగ తీరుల ప్రభావాన్ని లియోంటిఫ్ వైపరీత్యము పరిగణనలోకి తీసుకోలేదు. ఈ దిశగా చాలా అధ్యయనాలు జరిగాయి. తలసరి ఆదాయం పెరిగితే, వినియోగతీరులు శ్రమ సాంద్రత వస్తువుల వేపు మారుతాయి. A.J. Brown అధ్యయనము, అమెరికాలో వినియోగ తీరులు శ్రమ సాంద్రత వస్తువుల దిశగా ఉన్నాయని పేర్కొంది. ఈ ఫలితము, లియోంటిఫ్ వైపరీత్యమునకు వ్యతిరేకంగా ఉంది.

7. హెక్చర్ - ఓహ్లిన్ సిద్ధాంతము వలెనే, లియోంటిఫ్ వైపరీత్యము కూడా వ్యాపార తీరుల పై సాంకేతిక మార్పు ప్రభావాన్ని నిర్లక్ష్యం చేసింది. క్రొత్త ఉత్పత్తుల ప్రవేశం వలన, అమెరికన్ ఎగుమతుల తీరు ప్రభావితమయిందని, ఆర్థికవేత్తలు అభిప్రాయపడ్డారు. అమెరికన్ ఎగుమతులు, పరిశోధన, అభివృద్ధి (Research and Development) సాంద్రతగా ఉన్నవని నిరూపింపబడింది. ఒక పరిశ్రమలో R and D స్థాయి, సాంకేతిక స్థాయి యొక్క కొలమానము. అమెరికా దేశపు వ్యాపార తీరును, నిర్ణయించడంలో R and D కీలకపాత్ర నిర్వహించినదని నిర్ద్వంద్వంగా చెప్పవచ్చు.

## 3.9 ఉత్పత్తి కారకాల ధర సమానత్వ సిద్ధాంతము (Factor Price Equalisation Theory) :-

ఇపుడు మనము ఉత్పత్తి కారకాల ధర సమానత్వ సిద్ధాంతమును పరిశీలిద్దాము. ఇది హెక్చర్ - ఓహ్లిన్ సిద్ధాంతము నుండి ఉత్పన్నమయిన సిద్ధాంతము. హెక్చర్ - ఓహ్లిన్ సిద్ధాంతము వర్తించినపుడు, యీ సిద్ధాంతమూ వర్తిస్తుంది. ఆచార్య పాల్ శామ్యూల్సన్ (1970 సం॥పు అర్థశాస్త్రంలో నోబెల్ బహుమతి గ్రహీత) యీ సిద్ధాంతాన్ని శాస్త్రీయంగా నిరూపించారు. అందువలన దీనిని హెక్చర్ - ఓహ్లిన్ - శామ్యూల్సన్ సిద్ధాంతమని కూడా వ్యవహరిస్తారు.

హెక్చర్ - ఓహ్లిన్ సిద్ధాంతము, వ్యాపారానికి ముందు వస్తువుల సాపేక్ష ధరలలో తేడాలుంటాయని, వ్యాపారం తర్వాత అవి సమానమవుతాయని వివరించింది. యీ సందర్భంలో, యీ వస్తువుల ఉత్పత్తిలో వియోగింపబడిన ఉత్పత్తి కారకాల ధరలు, రెండు


దేశాలలోనూ సమానమవుతాయా? అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. ఈ సమానత్వము సంపూర్ణమా (Complete), పాక్షికమా (Partial) అనే విషయం కూడా ముఖ్యమైన అంశము.

హెక్సర్ - ఓహ్లిన్ సిద్ధాంతము, ఏ ప్రమేయాల పై ఆధారపడి ప్రతిపాదింపబడినదో, యీ సిద్ధాంతము కూడా వాటి పైనే ఆధారపడినది. అందువలన, వాటిని మరల యిక్కడ ప్రస్తావించడం లేదు. ఆ ప్రమేయాలననుసరించి, అంతర్జాతీయ వ్యాపారం, దేశాల మధ్య ఉత్పత్తికారకాల సాపేక్ష, నిరపేక్ష ధరలను సమానం చేస్తుంది. దీనినే ఉత్పత్తి కారకాల ధర సమానత్వ సిద్ధాంతమని అంటారు. ఉత్పత్తి కారకాలు సజాతీయాలని ప్రమేయం కాబట్టి ఈ ధరలు సజాతీయ ఉత్పత్తి కారకాలకు సంబంధించినవని గ్రహించాలి. అందువలన అంతర్జాతీయ వ్యాపారము, అంతర్జాతీయంగా ఉత్పత్తి కారకాల గమనశీలతకు ప్రత్యామ్నాయం.

దేశాల మధ్య ఉత్పత్తి కారకాల గమనశీలత లేకున్నా, స్వేచ్ఛా వ్యాపారం దేశాల మధ్య ఉత్పత్తి కారకాల నిజ ఆదాయాల సమానత్వానికి దారి తీస్తుంది. స్వేచ్ఛా వ్యాపారం వలన, రెండు దేశాలలోని శ్రామికులు అదే నిజ వేతనాన్ని, మూలధనము అదే నిజ బాడుగ రేటు (Rental Rate) ని పొందుతాయి. వస్తువుల స్వేచ్ఛా వ్యాపార ఫలితము యిదే. స్థూలంగా చూస్తే, హెక్సర్ - ఓహ్లిన్ సిద్ధాంతము, దేశాల మధ్య ఉత్పత్తి కారకాల పరోక్ష మార్పిడి జరుగుతుందని సూచిస్తుంది. మూలధన సాంద్రత వస్తువులకు బదులుగా, శ్రమ సాంద్రత వస్తువులనెగుమతి చెయ్యడం ద్వారా, శ్రమ సమృద్ధి దేశము, పరోక్షంగా శ్రమనెగుమతి చేసినట్లవుతుంది. ఈ పరోక్ష మార్పిడి వలన, శ్రమ సమృద్ధి దేశములో, శ్రమ యొక్క నిజ వేతనపు రేటు పెరిగి, మూలధన సమృద్ధి దేశములో తగ్గుతుంది. అదే విధంగా మూలధనపు Rental Rate శ్రమ సమృద్ధి దేశములో తగ్గి, మూలధన సమృద్ధి దేశములో పెరుగుతుంది. హెక్సర్ - ఓహ్లిన్ సిద్ధాంతములో అంతర్లీనంగా వున్న అంశం - ఉత్పత్తి కారకాలు దేశాల మధ్య ప్రత్యక్షంగా వలస పోకపోయినా, వస్తువుల ఎగుమతుల, దిగుమతుల కారణంగా పరోక్షంగా వలస పోయినట్లనిపిస్తుంది.

ఇపుడు మనము, యీ సిద్ధాంతాన్ని రేఖాత్మకంగా వివరిద్దాము.

పటము - 3.3




పటము 3.3లో శ్రమ సాపేక్ష వేతనము $\left(\frac{w}{r}\right)$, X అక్షము పైనా, X వస్తువు యక్క సాపేక్షధర $\left(\frac{P_X}{P_Y}\right)$ Y అక్షము పైనా చూపించాము. ప్రతి దేశములోనూ, సంపూర్ణమైన పోటీ పరిస్థితులుండటం వలననూ, ఒకే సాంకేతిక విజ్ఞానాన్ని రెండు దేశాలూ

ఉపయోగించడం వలననూ, $\left(\frac{w}{r}\right)$కు, $\left(\frac{P_X}{P_Y}\right)$నకు one - to - one సంబంధము (Relationship) ఉండాలి. అనగా ప్రతీ $\left(\frac{w}{r}\right)$ నిష్పత్తికి, సంబంధించిన $\left(\frac{P_X}{P_Y}\right)$ నిష్పత్తి ఒకటే ఉండాలి.

పటములో పైకి వాలుతున్న PW రేఖ యీ రెంటి మధ్య గల సంబంధాన్ని తెలియజేస్తుంది. వ్యాపారానికి ముందు, A దేశము యీ రేఖ పై A బిందువు వద్ద ఉంటుంది. $\left(\frac{w}{r}\right)$ విలువ OD. దీనికి సంబంధించిన వస్తు ధరల నిష్పత్తి $\left(\frac{P_X}{P_Y}\right)$ విలువ OR. B దేశము $A^1$ బిందువు వద్ద ఉంటుంది. $\left(\frac{w}{r}\right)$ విలువ OS. దీనికి సంబంధించిన వస్తు ధరల నిష్పత్తి OS. A దేశములో, $\left(\frac{w}{r}\right)$ విలువ, B దేశములో $\left(\frac{W}{r}\right)$ విలువ కన్నా తక్కువగా ఉంది. అందువలన A దేశములో $\left(\frac{P_X}{P_Y}\right)$ విలువ, B దేశములో $\left(\frac{P_X}{P_Y}\right)$ కన్నా తక్కువగా ఉంది. కాబట్టి A దేశానికి, X వస్తూత్పత్తిలో తులనాత్మక అనుకూలత ఉన్నది.

A దేశము, శ్రమ సమృద్ధి దేశము. కాబట్టి శ్రమ సాంద్ర వస్తువు - X ఉత్పత్తిలో ప్రత్యేకీకరణ చేసి, Y వస్తూత్పత్తిని తగ్గిస్తుంది. ఈ కారణంగా, శ్రమకు డిమాండ్ పెరుగుతుంది. అందువలన $\left(\frac{W}{r}\right)$ పెరుగుతుంది. దీని వలన A దేశములో $\left(\frac{P_X}{P_Y}\right)$ పెరుగుతుంది.

B దేశము - మూలధన సమృద్ధి దేశము - కాబట్టి మూలధన సాంద్రత వస్తువు - Y ఉత్పత్తిలో ప్రత్యేకీకరణ సలుపుతుంది. $\left(\frac{w}{r}\right)$ తగ్గుతుంది. లేదా $\left(\frac{r}{w}\right)$ పెరుగుతంది. దీనివలన $\frac{P_Y}{P_X}$ పెరుగుతంది లేదా $\left(\frac{P_X}{P_Y}\right)$ తగ్గుతుంది. B దేశములో యీ ప్రక్రియ $B = B^1$ వరకు కొనసాగుతుంది. $\frac{P_X}{P_Y}$, OM కు సమానమవుతుంది. దీనికి సంబంధించిన $\left(\frac{W}{r}\right)$, ON కి సమానము. యిది రెండు దేశాలకూ సమానము. M బిందువు వద్ద $\left(\frac{P_X}{P_Y}\right)$ రెండు దేశాలకు సమానము. కాని యిది, రెండు దేశాలలోనూ $\left(\frac{W}{r}\right)$ సమానమయినపుడే. OM ధరల నిష్పత్తి, OP మరియు OR ల మధ్య ఉన్నది. అలాగే $\left(\frac{W}{r}\right) = ON$, OS మరియు

OD ల మధ్య ఉన్నది. వ్యాపారం వలన $\left(\frac{P_X}{P_Y}\right)$ రెండు దేశాలలోనూ సమానమవుతుంది. కాని రెండు దేశాలలోనూ, $\left(\frac{w}{r}\right)$ నిష్పత్తి సమానమయినపుడే యిది జరుగుతుంది.

ఈ వివరణ, ఉత్పత్తి కారకాల సాపేక్ష ధరల సమానత్వము గూర్చి కాని నిరపేక్ష ధరల సమానత్వము గురించి కాదు. నిరపేక్ష ధరల సమానమంటే స్వేచ్ఛా వ్యాపారం, రెండు దేశాలలోని ఒకే రకపు శ్రమ నిజ వేతనాన్ని సమానం చేయడం మరియు రెండు దేశాలలోని మూలధనము యొక్క Real Rate of Interest ని సమానం చెయ్యడం. ఉత్పత్తి కారకాలు, వస్తు మార్కెట్లలో సంపూర్ణమైన పోటీ ఉన్నపుడు, రెండు దేశాలు ఒకే సాంకేతిక విజ్ఞానాన్ని ఉపయోగించినపుడు మరియు రెండు దేశాలలోనూ, రెండు వస్తువుల ఉత్పత్తిలో స్థిర ప్రతిఫలాలున్నపుడూ, వ్యాపారం వలన, సజాతీయ ఉత్పత్తి కారకాల నిరపేక్ష ధరలు కూడా సమానమవుతాయి.

దీనిని బట్టి, అంతర్జాతీయంగా ఉత్పత్తి కారకాల గమశీలతకు, అంతర్జాతీయ వ్యాపారము ప్రత్యామ్నాయం అని చెప్పవచ్చు. పూర్తి గమనశీలత ఉన్నపుడు, వేతనాలు తక్కువగా ఉన్న దేశాల నుండి, అధికంగా ఉన్న దేశాలకు శ్రమ తరలిపోతుంది. రెండు దేశాలలో, వేతనాలు సమానమయ్యే వరకూ ఇది కొనసాగుతుంది. అదే విధంగా, మూలధనము కూడా వడ్డీ రేటు తక్కువగా ఉన్న దేశాల నుండి ఎక్కువగా ఉన్న దేశాలకు తరలిపోతుంది. రెండు దేశాలలోనూ వడ్డీ రేటు సమానమయే వరకు యిది కొనసాగుతుంది. వ్యాపారము ఉత్పత్తి కారకాల డిమాండ్‌ను ప్రభావితం చేస్తుంది. ఉత్పత్తి కారకాల గమనశీలత వాటి సప్లయిని ప్రభావితం చేస్తుంది. ఏది ఏమైనా సజాతీయ ఉత్పత్తి కారకాల నిరపేక్ష ప్రతిఫలాలు పూర్తిగా సమానమవుతాయి. అంతర్జాతీయంగా, ఉత్పత్తి కారకాల గమనశీలత కొద్దిగా (పూర్తిగా లేకపోయినా) ఉంటే, రెండు దేశాలలోనూ వాటి ధరల సమానత్వానికి, కొద్దిపాటి వ్యాపార పరిమాణము సరిపోతుంది.

## 3.10 స్టోల్పర్ - శామ్యూల్‌సన్ సిద్ధాంతము (Stolper - Samuelson Theory) :-


1941 సం॥లో స్టోల్పర్ - శామ్యూల్‌సన్ ఆదాయ పంపిణీ పై వ్యాపార ప్రభావాన్ని గూర్చి ఒక సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. ఈ సిద్ధాంతము ప్రకారము, స్వేచ్ఛా వ్యాపారం వలన, (సాపేక్షంగా) సమృద్ధిగా ఉండే ఉత్పత్తి కారకము లాభం పొందుతుంది. (సాపేక్షంగా) కొరతగా ఉండే ఉత్పత్తి కారకము నష్టపోతుంది.

ప్రమేయాలు :-

1. దేశము, రెండు వస్తువులను ఉత్పత్తి చేస్తుంది. ఉదాహరణకు అవి ఉక్కు (steel), వస్త్రము (Clothing) అని అనుకొందాము. శ్రమ, మూలధనము ఉత్పత్తి కారకాల సహాయంతో యీ రెంటినీ ఉత్పత్తి చేస్తుంది.
2. ఉక్కు మూలధన సాంద్రత వస్తువు, వస్త్రము శ్రమ సాంద్రత వస్తువు. ఉత్పత్తి ఫలము ఏకమాత సజాతీయ ఉత్పత్తి ఫలము.
3. ఉత్పత్తి కారకాల సప్లయ్‌లు స్థిరంగా ఉంటాయి.
4. ఈ దేశము శ్రమ సమృద్ధి, మూలధన కొరత దేశము.
5. ఉత్పత్తి మార్కెట్లలోనూ, ఉత్పత్తికారకాల మార్కెట్లలోనూ సంపూర్ణ పోటీ పరిస్థితులుంటాయి.

ఎడ్జ్‌వర్త్ బాక్సు పటము ద్వారా, యీ సిద్ధాంతాన్ని వివరిద్దాము. పటము - 3.4లో ఎడ్జ్‌వర్త్ బాక్సు పటమును గమనించండి. ఈ పటపు కొలతలు, శ్రమ, మూలధనపు స్థిర సప్లయ్‌ల (పరిమాణాలను) తెలియజేస్తాయి.

పటము - 3.4




$OO^1$ - కాంట్రాక్టు రేఖ (contract curve)


$C_1C_1$ - వస్త్రము సమోత్పత్తి రేఖ

$S_1S_1$ - ఉక్కు సమోత్పత్తి రేఖ

$C_1C_1$ $S_1S_1$ - రెండూ M బిందువు వద్ద స్పర్శించుకుంటున్నాయి. వ్యాపారానికి ముందు, ఉత్పత్తి బిందువు M. M బిందువు వద్ద, PP స్పర్శ రేఖ వాలు, ఉత్పత్తి కారకాల ధర నిష్పత్తిని తెలుపుతుంది. వ్యాపారం ప్రారంభమయిన తర్వాత, అంతర్జాతీయ డిమాండ్ పరిస్థితుల వల్ల, ఉత్పత్తి బిందువు, కాంట్రాక్టు రేఖ వెంబడి, M బిందువు వద్ద నుండి, N బిందువునకు కదలుతుంది. శ్రమ సాంద్రత వస్తువు - వస్త్రపుత్పత్తి పెరుగుతుంది. మూలధన సాంద్రత వస్తువు - ఉక్కు ఉత్పత్తి తగ్గుతుంది. ఇపుడు ఉత్పత్తి N బిందువు వద్ద జరుగుతుంది. $C_2C_2$ వస్త్రపుత్పత్తి రేఖ - $C_1C_1$ కన్నా ఉన్నతంగా ఉంది. ఉక్కు ఉత్పత్తి రేఖ $S_2S_2$, $S_1S_1$ కన్నా దిగువున ఉంది. ఈ రెండూ $C_2C_2$ మరియు $S_2S_2$, N బిందువు వద్ద స్పర్శించుకుంటున్నాయి. $p^1p^1$ రేఖ - N బిందువు వద్ద ఉత్పత్తి కారకాల ధర నిష్పత్తిని తెలుపుతుంది. $p^1p^1$ వాలు, PP వాలు కన్నా ఎక్కువగా ఉందని గమనించాలి.

వ్యాపారం వలన, ఎగుమతి వస్తువు - వస్త్రపు ధర పెరగాలి. ఇది పటము 3.5లో వివరించబడినది.

పటము - 3.5



$AA^1$ - మనము పరిశీలిస్తున్న దేశపు ఉత్పత్తి అవకాశాల వక్రరేఖ. ఈ పటములోని M బిందువు, పటము 3.4లోని M బిందువే. PP రేఖ కూడా ఆ పటములోనిదే. M బిందువు, వ్యాపారానికి ముందు పరిస్థితిని తెలియజేస్తుంది. వ్యాపారం తర్వాతి పరిస్థితిని, N బిందువు తెలియజేస్తుంది. ఇది కూడా పటము 3.4లోని N బిందువే. $p^1p^1$ వాలు, PP వాలు కన్నా ఎక్కువగా ఉంది. అందువలన, వ్యాపారం తర్వాత, వస్త్రపు ధర, ఉక్కు ధరతో పోలిస్తే ఎక్కువగా ఉంది.

వస్త్రపు ధర పెరగటం వలన, వస్త్రపు ఉత్పత్తి పెరుగుతుంది. వస్త్రపుత్పత్తి పెరిగిన కొద్దీ, వనరులు ఉక్కు పరిశ్రమ నుండి, వస్త్ర పరిశ్రమకు బదలాయింపబడతాయి. కాని ఉక్కు పరిశ్రమ, వస్త్ర పరిశ్రమ absorb చేసుకోగల మూలధన పరిమాణాన్నే విడుదల చేస్తుంది. అందువలన, మూలధనమునకు లభించే ప్రతిఫలము తగ్గుతుంది. విస్తరించే వస్త్ర పరిశ్రమ, ఎక్కువ శ్రమను - ఉక్కు పరిశ్రమ విడుదల చేసిన దానికన్నా ఎక్కువ - నియోగింప ప్రయత్నిస్తుంది. అందువలన, శ్రమ ధర పెరుగుతుంది. ఇదే స్టోల్పర్ - శామ్యూల్‌సన్ సిద్ధాంతము. అంతర్జాతీయ వ్యాపారము, ఎగుమతి వస్తువు యొక్క ధరను పెంచి, ఆ వస్తూత్పత్తిలో ఉపయోగించే సమృద్ధి ఉత్పత్తి కారకపు ప్రతిఫలాన్ని పెంచుతుంది. అందువలన, సమృద్ధిగా ఉన్న ఉత్పత్తి కారకపు శ్రేయస్సు (Welfare) (స్థూల జాతీయోత్పత్తిలో శ్రమ వాటా), కొరతగా ఉండే ఉత్పత్తి కారకానికి వ్యతిరేకంగా (స్థూల జాతీయోత్పత్తిలో మూలధనపు వాటా) పెరుగుతుంది.

శ్రమ సమృద్ధిగా ఉండే అభివృద్ధి చెందుతున్న దేశాలకు, యీ సిద్ధాంతము వర్తించే అవకాశాలున్నాయి. విధానపరమైన అంశాలు దీనిలో యిమిడి వున్నాయి. ఈ సిద్ధాంతము ప్రకారము, స్వేచ్ఛా వ్యాపారము, ఆయా దేశాలలో మెరుగైన ఆదాయ పంపిణీని వృద్ధి చేస్తుంది. దిగుమతి ప్రత్యామ్నాయ వ్యూహము కన్నా, ఎగుమతి విస్తరణ, వ్యూహాన్ని యీ దేశాలు అవలంబించాలి. వృద్ధి, పంపిణీ - యీ రెండు లక్ష్యాలనూ సాధించాలంటే యిది చాలా అవసరము. టారిఫ్‌లు, యితర చర్యల వలన వృద్ధిపరంగా కానీ, సాంఘిక సంక్షేమ పరంగా కానీ, ప్రతికూల (అవాంఛనీయ) పరిణామాలు ఏర్పడే అవకాశం వుంది.

## 3.11 ఉత్పత్తి కారక సాంద్రత పరివర్తన (Factor Intensity Reversal) :-


హెక్సర్ - ఓహ్లిన్ సిద్ధాంతము, వివిధ వస్తువుల ఉత్పత్తి ఫలాలు వివిధముగా ఉంటాయనీ, కానీ ప్రతి వస్తువుకూ రెండు దేశాలలోనూ ఒకేవిధంగా ఉంటాయనే ప్రమేయం పై ఆధారపడినది. అనగా, ఒక వస్తువు మూలధన సాంద్రత వస్తువు (మూలధన / శ్రమ నిష్పత్తి ఎక్కువ) మరియు రెండవ వస్తువు (మూలధన / శ్రమ నిష్పత్తి తక్కువ) అని అర్థము. కానీ, ఒకే వస్తువు, ఒక దేశములో మూలధన సాంద్రత వస్తువు అయితే, రెండో దేశములో కూడ మూలధన సాంద్ర వస్తువు అయి తీరాలి. అదేవిధంగా శ్రమ సాంద్ర వస్తువు, రెండు దేశాలలోను శ్రమ సాంద్ర వస్తువే. ఈ రెండు వస్తువుల సమోత్పత్తి రేఖలు ఒకే ఒకసారి ఖండించుకొన్నప్పుడే, యీ ప్రమేయం నిజమవుతుంది. అపుడే, ఉత్పత్తికారక సాంద్రతలో, పరివర్తనలేదని అంటాము.

ఒక వస్తువు, శ్రమ సమృద్ధి దేశములో శ్రమ సాంద్ర వస్తువు గానూ, మూలధన సమృద్ధి దేశములో, మూలధన సాంద్ర వస్తువుగానూ ఉంటే, ఉత్పత్తికారక సాంద్రత పరివర్తన అని అంటాము. రెండు వస్తువుల ఉత్పత్తిలో, శ్రమకు ప్రతిస్థాపన వ్యాకోచము (మూలధనానికి బదులుగా)లో ఎక్కువ తేడాలుంటే, యిటువంటి పరివర్తన జరగటానికి అవకాశం ఉంది. X వస్తూత్పత్తిలో, శ్రమ ప్రతిస్థాపన వ్యాకోచము ఎక్కువగా ఉంటే, A దేశము శ్రమ సాంద్రత పద్ధతుల ద్వారా, X వస్తువునుత్పత్తి చేస్తుంది. వేతనాలు తక్కువగా ఉండటం వలన యిలా జరుగుతుంది. B దేశము, X వస్తువును మూలధన సాంద్రత పరిస్థితుల ద్వారా ఉత్పత్తి చేస్తుంది. వేతనాలు ఎక్కువగా ఉండటం వలన యిలా జరుగుతుంది. అదే సమయంలో Y వస్తూత్పత్తిలో శ్రమ ప్రతిస్థాపన వ్యాకోచము (మూలధనానికి బదులుగా) చాలా తక్కువగా ఉంటే, రెండు దేశాలలో ఉత్పత్తి కారకాల సాపేక్ష ధరలలో తేడాలు అధికంగా ఉన్నా, Y వస్తూత్పత్తిలో ఒకే రకపు పద్ధతులనవలంబించాల్సి వస్తుంది. ఫలితంగా, X వస్తువు; A దేశములో శ్రమ సాంద్ర వస్తువుగా, B దేశములో మూలధన సాంద్ర వస్తువుగా ఉంటుంది. ఇదీ ఉత్పత్తి కారక సాంద్రత పరివర్తన.

ఇటువంటి పరివర్తన ఉన్నపుడు, హెక్సర్ - ఓహ్లిన్ సిద్ధాంతము కానీ, ఉత్పత్తి కారకాల ధర సమానత్వ సిద్ధాంతము కానీ, చెల్లుబాటు కావు. హెక్సర్ - ఓహ్లిన్ సిద్ధాంతము ప్రకారము, A దేశము (శ్రమ సమృద్ధి దేశము), శ్రమ సాంద్ర వస్తువు X ఎగుమతి చెయ్యాలి. అదే విధంగా, B దేశము (మూలధన సమృద్ధి దేశము), మూలధన సాంద్ర వస్తువును ఎగుమతి చెయ్యాలి. కాని ఇటువంటి పరివర్తన వున్నపుడు, యీ విధంగా జరగదు. ఒకే సజాతీయ వస్తువును, రెండు దేశాలు ఒకదానికొకటి ఎగుమతి చెయ్యలేరు కాబట్టి, యీ సిద్ధాంతము, వ్యాపార తీరును గూర్చి నిర్దిష్టంగా చెప్పలేదు.

అలాగే, యిటువంటి పరివర్తన వున్నప్పుడు, ఉత్పత్తి కారకాల సమానత్వ సిద్ధాంతము కూడా చెల్లుబాటు కాదు. ఇందుకు కారణము - A దేశము X వస్తూత్పత్తిలో ప్రత్యేకీకరణ చేస్తుంది. అందువలన శ్రమకు డిమాండ్ పెరిగి, A దేశములో వేతనాల రేటు పెరుగుతుంది. కాని Y వస్తువు, B దేశములో శ్రమ సాంద్ర వస్తువు కాబట్టి, శ్రమకు డిమాండ్ పెరిగి, వేతనాల రేటు పెరుగుతుంది. ప్రతి దేశంలో, వేతనాలు ఎంత వేగముగా పెరుగుతాయనే అంశాన్ని బట్టి, రెండు దేశాల మధ్య నిరపేక్ష, సాపేక్ష వేతనాలలో తేడాలపై ప్రభావం వుంటుంది. అంతర్జాతీయ వ్యాపారం వలన, రెండు దేశాల మధ్య నిరపేక్ష, సాపేక్ష వేతనాలలో తేడాలు తగ్గవచ్చు, పెరగవచ్చు, లేదా స్థిరంగా ఉండవచ్చు. అందువలన, ఉత్పత్తి కారకాల ధర సమానత్వ సిద్ధాంతము చెల్లుబాటు కాదు.

పటము - 3.6




పటము 3.6లో, X వస్తువుకు సమోత్పాదక రేఖ XX. Y వస్తువుకు సమోత్పాదక రేఖ YY. ఏకఘాత సజాతీయ ఉత్పత్తి ఫల ప్రమేయం వలన, ఒక్క సమోత్పాదక రేఖ, ప్రతి వస్తువు యొక్క ఉత్పత్తి ఫలమును పూర్తిగా వర్ణిస్తుంది. రెండు దేశాలు, ఒకే సాంకేతిక విజ్ఞానాన్ని ఉపయోగిస్తాయి. కాబట్టి, X, Y సమోత్పత్తి రేఖలొక్కొక్కటినీ, రెండు దేశాలకు సంబంధించినవిగా పరిగణించవచ్చు.

$\left(\frac{w}{N}\right)$ రేఖ ఉత్పత్తి కారకాల ధర నిష్పత్తిని తెలుపుతుంది. ఈ ధరలతో, A బిందువు వద్ద, X వస్తూత్పత్తి జరుగుతుంది. A బిందువు వద్ద, $\left(\frac{W}{N}\right)$ రేఖ XX రేఖకు స్పర్శరేఖగా ఉంది. ఈ బిందువు వద్ద మూలధన / శ్రమ నిష్పత్తి $\left(\frac{K}{L}\right)=\frac{OQ}{OM}$. Y వస్తువు, B బిందువు వద్ద ఉత్పత్తి చెయ్యబడుతుంది. B బిందువు వద్ద, $\left(\frac{w}{N}\right)$ రేఖ, YY రేఖకు స్పర్శ రేఖగా ఉంది. ఇక్కడ మూలధన / శ్రమ నిష్పత్తి $\left(\frac{K}{L}\right)=\frac{OR}{ON}$.

$\left(\frac{W}{N}\right)$ వద్ద . $\frac{OR}{ON} > \frac{OQ}{OM}$

కాబట్టి, X వస్తువు, శ్రమ సాంద్ర వస్తువు.

$\left(\frac{W}{N}\right)$ రేఖ మారిందనుకుందాము. క్రొత్త $\left(\frac{W}{N}\right)$ రేఖ $\left(\frac{W}{N}\right)^1$. ఈ మారిన నిష్పత్తిననుసరించి, Y వస్తువు, C బిందువు వద్ద ఉత్పత్తి చెయ్యబడుతుంది. $\left(\frac{W}{N}\right)^1$ రేఖ, YY రేఖను C బిందువు వద్ద స్పర్శరేఖగా ఉంది. ఈ బిందువు వద్ద మూలధన/శ్రమ నిష్పత్తి $\left(\frac{K}{L}\right) = \frac{OQ^1}{OM^1}$. X వస్తూత్పత్తి D బిందువు వద్ద జరుగుతుంది. ఈ బిందువు వద్ద, మూలధన/శ్రమ నిష్పత్తి $\left(\frac{K}{L}\right) = \frac{OR^1}{ON^1}$.

$$\frac{OR^1}{ON^1} > \frac{OQ^1}{OM^1}$$

కాబట్టి, $\left(\frac{W}{N}\right)^1$ ధరల వద్ద, X వస్తువు మూలధన సాంద్ర వస్తువు. ఉత్పత్తి కారకాల ధర నిష్పత్తి $\left(\frac{W}{N}\right)$ వద్ద, X శ్రమ సాంద్ర వస్తువు. $\left(\frac{W}{N}\right)^1$ వద్ద, X మూలధన సాంద్ర వస్తువు. అంటే, ఉత్పత్తి కారక సాంద్రత పరివర్తన జరిగింది.

ఈ విధమైన పరివర్తన జరిగితే, హెక్చర్ - ఓహ్లిన్ సిద్ధాంతము, ఉత్పత్తి కారకాల ధర సమానత్వ సిద్ధాంతము - రెంటినీ తిరస్కరించవలసి వుంటుంది.

A దేశము, శ్రమ సమృద్ధి దేశమనుకుందాము. ఉత్పత్తి కారకాల ధర నిష్పత్తి $\left(\frac{W}{N}\right)$ వద్ద, A శ్రమ సమృద్ధి దేశము. అదే విధముగా, B దేశము $\left(\frac{W}{N}\right)^1$ వద్ద మూలధన సమృద్ధి దేశమనుకుందాము. $\left(\frac{W}{N}\right)$ వద్ద, A దేశము, X వస్తూత్పత్తిలో ప్రత్యేకీకరణ చేసి, X వస్తువును ఎగుమతి చెయ్యాలి. A దేశము శ్రమ సమృద్ధి దేశము మరియు X వస్తువు శ్రమ సాంద్ర వస్తువు కాబట్టి యీ రకంగా జరగాలి. $\left(\frac{W}{N}\right)^1$ నిష్పత్తి వద్ద, B దేశము X వస్తూత్పత్తిలో ప్రత్యేకీకరణ చేసి, ఎగుమతి చెయ్యాలి. B దేశము, మూలధన సమృద్ధి దేశము మరియు ఆ దేశములో X వస్తువు మూలధన సాంద్ర వస్తువు. కాబట్టి యీ రకంగా జరగాలి. ఇపుడు, రెండు దేశాలు - ఒకే సజాతీయ వస్తువు X ను ఉత్పత్తి చేస్తున్నాయి. కాబట్టి అదే వస్తువును, ఒక దేశము, మరొక దేశానికి ఎగుమతి చెయ్యలేదు. అందువలన, హెక్చర్ - ఓహ్లిన్ సిద్ధాంతము, వ్యాపార తీరును గూర్చి చెప్పలేదు.

హెక్సర్ - ఓహ్లిన్ సిద్ధాంతము వర్తించనపుడు, ఉత్పత్తి కారకాల ధర సమానత్వ సిద్ధాంతము కూడా వర్తించదు. A దేశము - వేతనము తక్కువగా ఉన్న దేశము. కాబట్టి శ్రమ సాంద్ర వస్తువు X వస్తూత్పత్తిలో ప్రత్యేకీకరణ చెయ్యడం వలన, A దేశములో శ్రమకు డిమాండ్ పెరిగి, వేతనాల రేటు పెరుగుతుంది. అంటే $\left(\frac{W}{N}\right)$ పెరుగుతుంది. A దేశము, X వస్తూత్పత్తిలో ప్రత్యేకీకరణ చేసి, B దేశానికి ఎగుమతి చెయ్యడం వలన, B దేశము Y వస్తూత్పత్తిలో ప్రత్యేకీకరణ చేసి, A దేశానికి ఎగుమతి చెయ్యాలి. (రెండు దేశాలు ఒకే వస్తువును ఒకదానికొకటి ఎగుమతి చెయ్యలేరని మనము పైన చెప్పాము) కాని Y వస్తువు, B దేశములో శ్రమ సాంద్ర వస్తువు కాబట్టి, శ్రమకు డిమాండ్ పెరిగి, వేతనాల రేటు మరియు $\left(\frac{W}{N}\right)$ పెరుగుతాయి. ఈ విధంగా రెండు దేశాలలోనూ, వేతనాలు పెరుగుతాయి.

A దేశములో వేతనాలు, B దేశములో కన్నా త్వరితగతిన పెరిగితే, రెండు దేశాలలోని వేతనాల మధ్య తేడా, ఉత్పత్తి కారకాల ధర సమానత్వ సిద్ధాంతము చెప్పినట్లు, తగ్గుతుంది. కాని A దేశములో వేతనాలు, B దేశములో కన్నా మందకొడిగా పెరిగితే, రెండు దేశాలలోను, వేతనాల పెరుగుదల రేటు ఒకే రకంగా ఉంటే, వేతనాల తేడాలలో మార్పేమీ ఉండదు. ఈ వివిధ పరిస్థితులలో ఉత్పత్తి కారకాల ధరలలో తేడాల పై అంతర్జాతీయ వ్యాపార ప్రభావం ఎట్లా ఉండేదీ నిర్ణయించే మార్గమేదీ లేదు. కాబట్టి, ఉత్పత్తి కారకాల ధర సమానత్వ సిద్ధాంతాన్ని తిరస్కరించవలసి వస్తుంది.

పటము 3.6లో, X సమోత్పత్తి రేఖ curvature, Y సమోత్పత్తి రేఖ curvature కన్నా తక్కువగా ఉంది కాబట్టి ఉత్పత్తి కారక సాంద్రత పరివర్తన ఉత్పన్నమవుతుంది. రెండు ఉత్పత్తి కారకాల ధరల వద్ద X, Y సమోత్పాదక రేఖలు రెండుసార్లు ఖండించుకొంటున్నాయి. అందువలన యీ పరివర్తన ఉత్పన్నమవుతోంది. రెండు సమోత్పత్తి రేఖల curvature ఒకే రకంగా ఉంటే, అవి ఒకసారి మాత్రమే ఖండించుకొంటాయి. అపుడు ఉత్పత్తికారక సాంద్రత పరివర్తన ఉత్పన్నమవదు.

## 3.12 రైబిన్ స్కీ సిద్ధాంతము (Rybezynski Theory) :-


హెక్సర్ - ఓహ్లిన్ సిద్ధాంతము మరియు ఉత్పత్తి కారకాలధర సమానత్వ సిద్ధాంతము, ఉత్పత్తి కారకాల సంపత్తి (Endowments) స్థిరంగా ఉంటాయనే ప్రమేయం పై ఆధారపడినాయి. రైబిన్ స్కీ, 1955లో ప్రచురించిన ఒక వ్యాసములో ఒక ఉత్పత్తికారక సంపత్తిలో మార్పు వలన, (రెండో ఉత్పత్తి కారకము స్థిరంగా ఉండి), వ్యాపారంలో పాల్గొనే రెండు వస్తువుల ఉత్పత్తిపై ప్రభావాన్ని విశ్లేషించారు. దీనినే రైబిన్ స్కీ సిద్ధాంతమంటారు. వ్యాపారం పై ఉత్పత్తి కారకాల సంపత్తిలో మార్పుల ప్రభావాన్ని యీ సిద్ధాంతం వివరిస్తుంది.

రెండు వస్తువుల, రెండు ఉత్పత్తి కారకాల నమూనాను పరిగణించండి. ఒక ఉత్పత్తి కారకపు సప్లయ్ పెరిగితే (రెండో ఉత్పత్తి కారకము స్థిరముగా ఉండి), ఆ ఉత్పత్తి కారకపు సాంద్ర వస్తువు యొక్క ఉత్పత్తి పెరిగి, రెండో వస్తువు యొక్క ఉత్పత్తి తగ్గుతుంది. ఉదాహరణకు, ఒక దేశములో శ్రమ సప్లయ్ పెరిగితే, శ్రమ సాంద్రత వస్తూత్పత్తి పెరిగి, మూలధన సాంద్ర వస్తూత్పత్తి తగ్గుతుంది. (వస్తువుల ధరలు స్థిరంగా ఉన్నపుడు) అదే విధంగా మూలధన సప్లయ్ పెరిగితే, మూలధన సాంద్ర వస్తువుత్పత్తి పెరిగి, శ్రమ సాంద్ర వస్తూత్పత్తి తగ్గుతుంది.

ఈ సిద్ధాంతాన్ని అవగాహన చేసుకోవటానికి, మనము ఒక దేశములో మూలధన సప్లయ్ స్థిరంగా ఉండి, శ్రమ సప్లయ్ పెరిగిందనుకొందాము. ఈ దేశము, X, Y వస్తువులను ఉత్పత్తి చేస్తుందనీ, X వస్తువు సాపేక్షంగా శ్రమ సాంద్ర వస్తువు అని అనుకొందాము. పెరిగిన ఉత్పత్తి కారకము శ్రమనుపయోగించడానికి. మూలధనము కూడా అవసరము. మూలధన సప్లయ్ స్థిరముగా ఉండటం వలన, Y వస్తూత్పత్తి నుండి, మూలధనమును X వస్తూత్పత్తికి మళ్ళించాలి. దీని వలన Y వస్తూత్పత్తి తగ్గుతుంది.

అందువలన, ఒక ఉత్పత్తి కారకపు సప్లయ్ పెరిగితే (ఇంకొక ఉత్పత్తి కారకము స్థిరంగా ఉండి), దానిని సాంద్రముగా ఉపయోగించే వస్తూత్పత్తి పెరిగి, ఇంకొక వస్తువు ఉత్పత్తి తగ్గుతుంది.

పటము - 3.7




పటము - 3.7 ఎడ్జ్‌వర్త్ బాక్సు పటము ద్వారా యీ సిద్ధాంతాన్ని వివరించవచ్చు.


$OLO^1C$ - బాక్సు పటమును పరిశీలించండి. మనము పరిగణిస్తున్న దేశానికి, OL పరిమాణములో శ్రమ, OC పరిమాణములో మూలధనము ఉన్నాయి. X శ్రమ సాంద్ర వస్తువు. X యొక్క సమోత్పత్తి రేఖలకు మూలబిందువు O. Y వస్తువు మూలధన సాంద్ర వస్తువు. Y యొక్క సమోత్పత్తి రేఖలలో మూల బిందువు 'O'.

ముందుగా, A ఉత్పత్తి బిందువు అనుకొందాము. $OAO^1$ - కాంట్రాక్టు రేఖ. OA వాలు, మూలధన/శ్రమ నిష్పత్తిని తెలుపుతుంది. దీని వాలును బట్టి, X వస్తువు, శ్రమ సాంద్ర వస్తువని గ్రహించవచ్చు. అదే విధంగా, $OA^1$ వాలు, Y వస్తువు మూలధన సాంద్ర వస్తువని తెలుపుతుంది. OA, X వస్తూత్పత్తిని, $O^1A$ Y వస్తూత్పత్తిని తెలుపుతాయి. OL - A దేశపు మొత్తము శ్రమ సప్లయ్, OC - మూలధనపు సప్లయ్.

ఇపుడు శ్రమ సప్లయ్, OL నుండి $OL^1$కు పెరిగిందనుకుందాము. అంటే $LL^1$ పరిమాణములో శ్రమ పెరిగిందన్నమాట. ఇపుడు క్రొత్త బాక్సు పటము $OL^1O^{11}C$. మూలధన/శ్రమ నిష్పత్తులలో (వస్తువుల ధరలు స్థిరంగా ఉన్నందువలన) మార్పేమీ లేదు. క్రొత్త ఉత్పత్తి బిందువు $A^1$. OA రేఖను పొడిగించగా వచ్చిన రేఖపై బిందువు - క్రొత్తరేఖ $O^{11}A^1$, $O^1A$కు సమాంతరంగా ఉంది. క్రొత్త ఉత్పత్తి బిందువు $OA^1O^{11}$ కాంట్రాక్టు రేఖ పై ఉంది. కాబట్టి XC (శ్రమ సాంద్ర వస్తువు) ఉత్పత్తి, OA నుండి $OA^1$కు పెరిగిందనీ, మూలధన సాంద్ర వస్తువు Y ఉత్పత్తి $O^1A$ నుండి. $O^{11}A^1$నకు తగ్గిందనీ తెలుస్తోంది. దీనినే ఉత్పత్తి అవకాశాల వక్రరేఖలు ప్రతిబింబిస్తాయి.

పటము 3.8ని పరిశీలించండి. X అక్షము పై శ్రమ సాంద్ర వస్తువు X ను, Y అక్షము పై మూలధన సాంద్ర వస్తువు Y ను చూపించాము. KL - ఉత్పత్తి అవకాశాల వక్రరేఖ పటము 3.7లోని $OLO^1C$ నుండి గ్రహించబడినది. X, Y ల మధ్య సమతౌల్య మారకపు రేటు, KL రేఖ పై A బిందువు వద్ద ఉన్నది.

**పటము - 3.8**




శ్రమ సప్లయ్ పెరిగినపుడు, క్రొత్త ఉత్పత్తి అవకాశాల వక్రరేఖ - $K^1L^1$. ఇది $OL^1O^{11}C$ బాక్సు నుండి గ్రహింపబడినది. క్రొత్త సమతౌల్య బిందువు $A^1$. $P^1P^1$ - ధర రేఖ ప్రారంభపు ధర రేఖ PP కు సమాంతరంగా ఉంది. అంటే వస్తువుల ధరలలో మార్పేమీ లేదు. కాని $A^1$ బిందువు, సమతౌల్య బిందువు కాకపోవచ్చు. Y హీనరకపు వస్తువు అయితే తప్ప. శ్రమ సప్లయిలో పెరుగుదల వల్ల $K^1L^1$ నూతన ఉత్పత్తి అవకాశాల వక్రరేఖ ఎక్కువ జాతీయాదాయాన్ని తెలుపుతుంది. తత్ఫలితంగా, రెండు వస్తువులలో డిమాండ్ పెరుగుతుంది. కాబట్టి క్రొత్త సమతౌల్య బిందువు - క్రొత్త ఉత్పత్తి అవకాశాల వక్రరేఖ $K^1L^1$ పైని QAR వృత్త పాదము (QUADRANT) లో ఉండాలి. ఉదాహరణకు, $K^1L^1$ రేఖ పై గల Q, B, R బిందువుల వద్ద - ఏ బిందువు వద్దనైనా, ధర రేఖ స్పర్శరేఖగా ఉంటే, దాని వాలు A వద్ద కన్నా Flatter గా ఉండాలి. అపుడు శ్రమ సాంద్ర వస్తువు X, (మూలధన సాంద్ర వస్తువు Y తో పోలిస్తే) యొక్క వర్తక నిబంధనలు క్షీణించినట్లు భావించాలి. అంటే పెరిగిన ఉత్పత్తి కారకాన్ని ఎక్కువగా ఉపయోగించే వస్తువు యొక్క వర్తక నిబంధనలు (Terms of Trade) క్షీణిస్తాయి.

మనము పరిగణిస్తున్న దేశము చిన్న దేశమయితే, అది ప్రపంచ ధరలను ప్రభావితం చెయ్యలేదు. అపుడు X వస్తూత్పత్తి పెరిగి, Y వస్తూత్పత్తి తగ్గి, సమతౌల్య స్థితి, $K^1L^1$ రేఖ పై A బిందువు వద్ద, అవే ధరల పై ఉంటుంది. కాబట్టి ఉత్పత్తి కారకపు సప్లయ్‌లో పెరుగుదల వలన, దానిని సాంద్రంగా ఉపయోగించే వస్తువు యొక్క వర్తక నిబంధనలు క్షీణిస్తాయి. మన వివరణలో, శ్రమ సప్లయ్ పెరగటం వలన, శ్రమ సాంద్ర వస్తువు X ఉత్పత్తి పెరిగి, ఎగుమతులు పెరుగుతాయి. అందువలన, X ధర తగ్గి, వర్తక నిబంధనలు, యీ దేశానికి వ్యతిరేకంగా మారతాయి. మనము పరిగణిస్తున్న X, Y లలో ఏదీ హీనరకపు వస్తువు కానపుడు, యిట్లా జరుగుతుంది.

## 3.13 సారాంశము :-

ఈ పాఠములో, హెక్సర్ - ఓహ్లిన్ సిద్ధాంతమును పరిశీలించాము. అనేక సులభతర ప్రమేయాల పై ఆధారపడి, ప్రతిపాదింపబడిన యీ సిద్ధాంతము, ఒక దేశము, ఆ దేశములో సమృద్ధిగా ఉండే ఉత్పత్తి కారకాన్ని సాంద్రంగా ఉపయోగించే వస్తువునుత్పత్తి చేసి, ఎగుమతి చేస్తుందని వివరించింది. సాంప్రదాయిక వ్యాపార సిద్ధాంతము కన్నా యీ సిద్ధాంతము అనేక విషయాలలో మెరుగైనది. యీ సిద్ధాంతము పై అనేక విమర్శలు వచ్చినప్పటికీ, తులనాత్మక అనుకూలతకు ఆధారాన్ని వివరించడంలో, యీ సిద్ధాంతము సఫలీకృతమయినది. వాస్తవ ప్రపంచంలో, వ్యాపార తీరు యీ సిద్ధాంతానికనుగుణంగా ఉందా? అనే అంశం పై అనేక సాంఖ్యక పరీక్షలు జరిగాయి. వాటిలో లియోంటిఫ్ పరిశీలన ముఖ్యమైనది. లియోంటిఫ్ పరిశీలన ఫలితాలు, అమెరికా దేశానికి సంబంధించి, హెక్సర్ - ఓహ్లిన్ సిద్ధాంతము చెప్పిన దానికి భిన్నంగా ఉన్నాయి. అమెరికా, మూలధన సమృద్ధి దేశమైనా, శ్రమ సాంద్ర వస్తువుల నెగుమతి చేస్తోందని అతని పరిశీలన తెలిపింది. దీనినే "లియోంటిఫ్ వైపరీత్యము"ని పేర్కొన్నారు. దీనికి గల కారణాలను కూడా పరిశీలించాము. హెక్సర్ - ఓహ్లిన్ సిద్ధాంతము ఆధారముగా ఉత్పత్తి కారకాల ధర సమానత్వ సిద్ధాంతము ప్రతిపాదింపబడినది. అంతర్జాతీయ వ్యాపారం వలన, దేశాల మధ్య ఉత్పత్తి కారకాల ధరలు సమానమవుతాయని యీ సిద్ధాంతము పేర్కొన్నది. వ్యాపారం వలన, ఆదాయ పంపిణీ పై ప్రభావాన్ని స్టోల్పర్ - శామ్యూల్‌సన్ సిద్ధాంతము విశ్లేషించింది. ఉత్పత్తి కారకాల సాంద్రతలో పరివర్తనలొస్తే, హెక్సర్ - ఓహ్లిన్ సిద్ధాంతము గాని, ఉత్పత్తి కారకాల ధర సమానత్వ సిద్ధాంతము కానీ చెల్లుబాటు కావని వివరించడం జరిగింది. ఉత్పత్తి కారకాల సప్లయ్‌లో మార్పులు వస్తే, వ్యాపార తీరును రైబిన్ స్కీ సిద్ధాంతము విశ్లేషించింది. స్థూలంగా, యీ పాఠములో మనము నవ్య వ్యాపార సిద్ధాంతము, దాని ఆధారంగా ప్రతిపాదింపబడిన యితర సిద్ధాంతాలను వివరంగా తెలుసుకొన్నాము.

## 3.14 ముఖ్య పదాలు:-

(1) నవ్య వ్యాపార సిద్ధాంతము
(2) హెక్సర్ - ఓహ్లిన్ సిద్ధాంతము
(3) ఉత్పత్తి కారకాల సమృద్ధి
(4) ఉత్పత్తి కారకాల సాంద్రత
(5) లియోంటిఫ్ వైపరీత్యము
(6) ఉత్పత్తి కారకాల ధర సమానత్వ సిద్ధాంతము
(7) స్టోల్పర్ - శామ్యూల్‌సన్ సిద్ధాంతము
(8) ఉత్పత్తి కారక సాంద్రత పరివర్తన
(9) రైబిన్ స్కీ సిద్ధాంతము

## 3.15 నమూనా ప్రశ్నలు :-

1. హెక్సర్ - ఓహ్లిన్ సిద్ధాంతాన్ని విమర్శనాత్మకముగా పరిశీలింపుము.
2. లియోంటిఫ్ వైపరీత్యమనగా నేమి? దానిని నీవు సమర్థించెదవా?
3. "అంతర్జాతీయ వస్తు వ్యాపారము, అంతర్జాతీయంగా ఉత్పత్తి కారకాల గమనశీలతకు ప్రత్యామ్నాయము" వివరించుము.
4. ఉత్పత్తి కారక సాంద్రత పరివర్తన అనగానేమి? దాని పరిణామాలను చర్చింపుము.
5. ఉత్పత్తి కారకాల సప్లయ్‌లో మార్పుల వల్ల అంతర్జాతీయ వ్యాపారము పై ప్రభావాన్ని విశ్లేషించుము.

## 3.16 చదువదగిన గ్రంథాలు :-


1. Bo. Soderston : International Economics
2. P.A. Samuelson : International Trade and Equalization of Factor Prices, Economic Journal, June 1948.
3. W.F. Stolper & P.A. Samuelson : Protection and Real Wages, Reveiw of Economic Study, November 1941.
4. T.M. Rybezynski : Factor Endowment and Relation Commdity Price, Economica, November, 1955.


- ఆచార్య యం. జగదీశ్వరరావు

పాఠం - 4

# విదేశీ వ్యాపారం - ఆర్థికాభివృద్ధి

## లక్ష్యం :

ఈ పాఠ్యభాగమునందు ఈ క్రింది అంశాలను మనం తెలుసుకోగలము.

- ☆ అభివృద్ధి చెందుతున్న, అల్పాభివృద్ధి దేశాల్లో అంతర్జాతీయ వ్యాపారం యొక్క ఆవశ్యకత
- ☆ ఆర్థికాభివృద్ధిపై విదేశీ వ్యాపార ప్రభావాలు
- ☆ విదేశీ వ్యాపారం ఆర్థిక వృద్ధికి దోహదపడే అంశాలు
- ☆ విదేశీ వ్యాపారంలో అదృశ్యమానవృద్ధి భావన
- ☆ విదేశీ వ్యాపారం గూర్చి జాన్సన్ నమూనా వివరణ
- ☆ విదేశీ వ్యాపారంపై రవాణా ఖర్చులు పాత్ర
- ☆ ఏకస్వామ్య ధర విచక్షణ అనునది విదేశీ వ్యాపారంలో ఎలా అనుసరించబడుతుంది - డంపింగ్
- ☆ పై అంశాలన్నీ ఈ పాఠము చదివినట్లయితే వివరంగా అర్థం చేసుకోగలము.

## ముఖ్యాంశాలు :


4.1 ఉపోద్ఘాతము

4.2 విదేశీ వ్యాపారం - ఆర్థికాభివృద్ధి

4.3 విదేశీ వ్యాపారం వల్ల వచ్చే లాభాలు

4.4 జాన్సన్ విదేశీ వ్యాపార నమూనా

4.5 విదేశీ వ్యాపారం - ఆర్థికాభివృద్ధి ప్రభావాలు

4.6 విదేశీ వ్యాపారం - అదృశ్య మానవృద్ధి భావన

4.7 విదేశీ వ్యాపారం - రవాణా ఖర్చులు

4.8 ఏకస్వామ్య ధర విచక్షణ - డంపింగ్

4.9 సారాంశము

4.10 ముఖ్య పదాలు

4.11 స్వయం సమీక్ష ప్రశ్నలు

4.12 చదువవలసిన గ్రంథాలు

## 4.1 ఉపోద్ఘాతము :

ప్రపంచదేశాల ఆర్థికాభివృద్ధి అనునది అనేక అంశాలతో కూడిన అంశము. విదేశీ వ్యాపారం కూడా అందులో ఒక భాగమే. అందుకనే విదేశీ వ్యాపారం ఆర్థికాభివృద్ధికి ఒక యంత్రము లాంటిదని ఆర్థికవేత్తలు పేర్కొనటం జరిగింది. విదేశీ వ్యాపారం - ఆర్థికాభివృద్ధి ఒకదానిపై ఒకటి పరస్పర ప్రభావాలు కలిగిన అంశాలు. ఎందువల్లననగా అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో సంభవించిన చారిత్రక పరిణామాలను పరిశీలించినచో ప్రపంచ యుద్ధాలు సంభవించుటకు పూర్వమున నెలకొన్న అనుకూల పరిస్థితుల నేపథ్యములో ఇప్పటి చాలా పారిశ్రామిక దేశాలు వాని అభివృద్ధి తొలిదశలో విదేశీ వ్యాపారం ద్వారా ఆర్థిక వ్యవస్థలో గణనీయమయిన అభివృద్ధిని సాధించాయి. ఈ నేపథ్యంలో ఆర్థికవేత్తలు విదేశీ వ్యాపారానికి ప్రాధాన్యత నివ్వటం జరిగింది. ఏదేశమయిననూ ఎగుమతుల రంగానికి ప్రాధాన్యమిచ్చి ఉత్పత్తి ప్రక్రియ కొనసాగించినచో అది ఒక ప్రక్క విదేశీ వ్యాపారమును వృద్ధి చేయుచూ మరో ప్రక్క దేశీయంగా ఇతర రంగాలపై దాని విస్తరణ ప్రభావాలను ప్రసరింపజేసి మొత్తం ఆర్థిక వ్యవస్థలో వృద్ధిని త్వరితగతిన తగలదని వారు భావించారు.

ప్రపంచ యుద్ధపు విషపు పరిణామాలు వల్ల విదేశీ వ్యాపారంపై నీలినీడలు పడ్డాయి. ఆయా దేశాలు రక్షణ విధానాన్ని అనుసరించాయి. తద్వారా దేశాల మధ్య అసమానతలు పెరిగాయి. ఈ పరిస్థితుల్లో నిరాశవాదనలు ప్రబలి దిగుమతి ప్రత్యామ్నాయ విధానాలు రూపొందించబడినాయి. వీటిని చాలా దేశాలు అనుసరించాయి.

తరువాత కాలంలో 1966-67 సం॥ నుండి మరల ఎగుమతి మార్గాన వృద్ధి భావనపై పునరాకర్షితులయినందున దానిని అనుసరించి ఆర్థిక వ్యవస్థలో శీఘ్ర ప్రగతిని సాధించి పారిశ్రామిక దేశాలుగా ఏర్పడి అంతర్జాతీయ వ్యవస్థ ఏర్పడుటకు మార్గం ఏర్పడింది. W.T.O. ఏర్పాటుతో ఎగుమతులు విస్తరణ, ఎగుమతి మార్గన వృద్ధి విధానాలను అంతర్జాతీయ వ్యవస్థలో పునరుజ్జీవింప జేయబడింది. అయితే ప్రతి దేశం ఆర్థికాభివృద్ధి ప్రభావం ఆ దేశ విదేశీ వ్యాపారంపై గల ప్రతికూల, అనుకూల ప్రభావాలు ఆదేశ ఉత్పత్తి, వినియోగం, ఉత్పత్తి కారకాల లభ్యత, సాంకేతిక పరిజ్ఞానం పై ఆధారపడి ఉంటుంది. వీటిని సరైన విధంగా మలచుకోవాలి. ఈ నేపథ్యంలో విదేశీ వ్యాపారం మరియు ఆర్థికాభివృద్ధి గురించి మరింత లోతుగా పరిశీలించుట ఎంతైనా అవసరం. ఈ అధ్యాయం కొంత వరకు ఈ విషయాల గురించి వివరిస్తుంది.

## 4.2 విదేశీ వ్యాపారము ద్వారా అభివృద్ధి

ఒక దేశ ఆర్థికాభివృద్ధిని నిర్ణయించు అంశాలు అనేకముగా ఉంటాయి. ఆర్థికాభివృద్ధి అనేక ప్రభావాలకు లోనగుతుంది. అభివృద్ధిని నిర్ణయించు వివిధ ప్రభావాల విషయంలో ఆర్థికవేత్తల మధ్య ఏకాభిప్రాయం లేదు. సంప్రదాయ, నవ్య సాంప్రదాయ ఆర్థికవేత్తలు విదేశీ వ్యాపారం ఆర్థికాభివృద్ధికి ఒక శక్తివంతమయిన వృద్ధి సాధనముగా పేర్కొనగా మరో వైపు వ్యవస్థావాదులు దీనిని ఖండించి విదేశీ వ్యాపారం ఆర్థికాభివృద్ధికి హానికరమయినదిగా ప్రతిపాదించారు. ఈ విధమయిన పరస్పర భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ ఆధునిక ఆర్థికవేత్తలు దేశీయంగా కొన్ని అనుకూల పరిస్థితులు కల్పించుకొన్నట్లయితే విదేశీ వ్యాపారం వృద్ధిని కలిగించునని వివరించారు. ఆర్థికవేత్తల మధ్యగల వివిధ భావనలను విపులంగా పరిశీలించే ముందు అల్పాభివృద్ధి దేశాల అభివృద్ధి తొలి దశలలో విదేశీ వ్యాపార ఆవశ్యకత ఉన్నదీ లేనిదీ పరిశీలిద్దాం.

**4.2.1. అల్పాభివృద్ధి దేశాలలో విదేశీ వ్యాపార ఆవశ్యకత :** విదేశీ వ్యాపారం ద్వారా వృద్ధిని సాధించుటకు సంబంధించిన వివిధ అంశాలను పరిశీలించే ముందు అల్పాభివృద్ధి గల దేశాల ఆర్థికాభివృద్ధి తొలి దశలలో విదేశీ వ్యాపార ఆవశ్యకతను గూర్చి తెలుసుకొనవలసి ఉంది. అల్పాభివృద్ధి గల దేశాలకు గల ఆర్థిక, సామాజిక పరిస్థితులు, వానిలోగల వైవిధ్యాలు, విభిన్నతలు అన్ని కలసి ఆ దేశ ఆర్థిక వ్యవస్థల వృద్ధికి ప్రతి బంధకాలుగా తయారవ్వడమే కాకుండా ఆదేశ మౌళిక లక్షణాలు కార్యకరణ ఫలితాలను కల్గి ఉండటంతో అవి ఆ దేశాలలో ఆర్థిక వలయాలను సృష్టించి అభివృద్ధి నిరోధకాలు కలుగజేస్తున్నాయి. అందువల్ల ఈ దేశాలు ఆర్థిక విష వలయాలను ఛేదించుకుంటూ ఆర్థిక కలాపాలను కొనసాగిస్తున్నాయి. ఆర్థిక వ్యవస్థలలో వృద్ధిని ప్రేరేపింప చేయుటకు ఆ దేశాలలో ఉన్న వనరులు సరిపోకపోవడం వల్ల విదేశీ వలనరులపై ఆధారపడక తప్పని పరిస్థితులును కలిగి ఉన్నాయి.

ఈ అంశాలను దృష్టిలో ఉంచుకొని హాలీస్, చెనెరి మొదలైన ఆర్థికవేత్తలు అల్పాభివృద్ధి దేశాల ఆర్థికాభివృద్ధిలో వైవిద్య అంతరాలను విశ్లేషణ చేసారు. వీరు గుర్తించిన అంశాలు ప్రధానంగా మొదటిది పొదుపు అంతరము కాగా రెండవది విదేశీ మారక ద్రవ్య అంతరము. ఈ దేశాల్లో నిర్ణయించిన ఆర్థికాభివృద్ధి రేటును సాధించుటకు అవసరమైన పొదుపు కన్నా వాస్తవ పొదుపు రేటు తక్కువ అయినట్లయితే పొదుపు అంతరం ఉత్పన్నమవుతుంది. ఈ అంతరాన్ని పూరించుకొనుటకు విదేశీ వనరులపై ఆధారపడవలసి వస్తుంది. అదే విధంగా నిర్ణయించిన ఆర్థికాభివృద్ధిని పొందుటకు కావలసిన విదేశీ మారక ద్రవ్యము మరియు నికర ఎగుమతులు ఆర్జనను బట్టి ఆ దేశమందున్న విదేశీ మారక ద్రవ్యముల మధ్యగల అంతరమును విదేశీ మారక ద్రవ్య అంతరముగా పేర్కొన్నారు. ఆర్థికవేత్తల అంచనా ప్రకారం దేశాల్లో పై రెండు అంశాల అంతరం కోసం విదేశీ వనరులపై ఆధారపడవలసి వస్తుంది. వీరి విశ్లేషణ కొన్ని అవాస్తవిక ప్రమేయాలపై ఆధారపడినప్పటికి అది అల్పాభివృద్ధి దేశాల అభివృద్ధికి విదేశీ వనరుల ప్రాధాన్యతను తెలియజేస్తుంది.

అభివృద్ధి చెందుతున్న మరియు వెనుకబడిన దేశాలలోగల అంతరాలను పూరించుటకు 3 ప్రత్యేక మరియు ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నాయి. వాటిలో మొదటిది విదేశీ సహాయము. అయితే విదేశీ సహాయము సమకూర్చుకొనుటలో ఈ దేశాలు ఆర్థిక, రాజకీయ వంటి అనేక ఒత్తిడిలను ఎదుర్కోవడం జరుగుతుంది. అందువల్ల విదేశీ సహాయమును కేవలం స్వల్ప కాల అత్యవసర పరిస్థితులకు మాత్రమే వినియోగించుకోగలుగుతున్నాయి. దీర్ఘకాల వృద్ధికి దీనిపై ఆధారపడుట వల్ల అనేక విషమ సమస్యలను కలుగజేయును. కావున ఈ దేశాలు విదేశీ సహాయంపై అంతగా ఆధారపడలేకపోవుచున్నవి. అదే విధంగా ఈ దేశాలు విదేశీ వనరులు సమకూర్చుకొనుటకు మరొక మార్గం విదేశీ ఋణ మూలధన పెట్టుబడులు. ఈ పెట్టుబడుల విషయంలో కూడా ఈ దేశాలు వడ్డీ రేటులు, విదేశీ ఋణ చెల్లింపులు సమస్యలకు ఎదుర్కొంటూ ఋణగ్రస్త దేశాలుగా మారటానికి అవకాశం ఉండుటవల్ల ఆ దేశాల దీర్ఘకాలిక నిరంతర వృద్ధికై విదేశీ ఋణ మూలధన పెట్టుబడులపై పూర్తిగా ఆధారపడటానికి అవకాశాలు లేవు. అందువల్ల ఈ దేశాలకున్న మూడవ ప్రత్యమ్నాయ మార్గం విదేశీ వ్యాపారం ద్వారా విదేశీ వనరుల సమీకరణ. ఇది అత్యంత ఆవశ్యకమైనది. ఈ దేశాలు దేశీయంగా తగిన పరిస్థితులను నెలకొల్పుకొని విదేశీ వ్యాపారము - ముఖ్యముగా ఎగుమతులను పెంపొందించుకొంటేనేగాని వృద్ధి ప్రారంభ దశలలో వానికి కావలసిన అత్యవసరమయిన పారిశ్రామిక దిగుమతులకు చెల్లించవలసిన విదేశీ మారక ద్రవ్యమును సమకూర్చు కొనలేరు. కావున దీర్ఘకాల వృద్ధికై విదేశీ వనరుల సేకరణకు దేశాలు విదేశీ వ్యాపారమును అనుసరించక తప్పని సరి అగుచున్నది. అల్పాభివృద్ధి గల దేశాలకు ఆర్థిక వృద్ధికై విదేశీ వ్యాపారం అత్యంత ఆవశ్యకం కావడంతో ఈ విషయమై ఆర్థికవేత్తలు దృష్టి సారించి కొన్ని భావనలను ప్రతిపాదనలను రూపొందించారు. కావున ఆర్థికాభివృద్ధిపై విదేశీ వ్యాపార ప్రభావాలను గూర్చి ప్రతిపాదించబడిన వివిధ భావనల గురించి పరిశీలిస్తే బాగుంటుంది.

**4.2.2. విదేశీ వ్యాపారము - వృద్ధి యంత్రముగా ప్రతిపాదన :** విదేశీ వ్యాపారం ఆర్థికవృద్ధి అంశాల ఎడల ప్రతిపాదింపబడిన వివిధ సిద్ధాంతాలను చారిత్రాత్మకంగా పరిశీలించినపుడు గోచరించునదేమంటే సంప్రదాయ ఆర్థికవేత్తల ఒరవడిలో మొదలైన సిద్ధాంతాలు తరువాత కాలంలో నవ్య సంప్రదాయ ఆర్థికవేత్తల భావాలతో విస్తరణ చెంది విదేశీ వ్యాపారం ప్రాధాన్యత మరియు ఆర్థిక వృద్ధిపై దాని విస్తరణ ప్రభావాలను నిర్మాణాత్మకంగా ప్రతిపాదించటం జరిగింది. అర్థశాస్త్ర పితామహుడుగా పేరొందిన ఆడం స్మిత్ మొదటిగా స్వేచ్ఛా విదేశీ వ్యాపారం అన్ని దేశాలకు ఉపయోగకరంగా ఉంటుందనే "మిగులుకు త్రోవ సిద్ధాంతాన్ని" ప్రతిపాదించటం జరిగింది. స్మిత్ భావాలను మరింతగా పటిష్టపరుస్తూ రికార్డో మహాశయుడు తులనాత్మక వ్యయాల్లో తేడాల వల్ల విదేశీ వ్యాపారం జరుగుతుందని "తులనాత్మక విదేశీ వ్యాపార సిద్ధాంతాన్ని" కొన్ని నిశ్చల ప్రమేయాలు ఆధారంగా వివరించాడు. ఈ సిద్ధాంతం కూడా వ్యాపార సిద్ధాంతాలలో ఎంతో ప్రాధాన్యతను సంతరించుకోవడం జరిగింది. తరువాత కాలంలో అదే సిద్ధాంతాన్ని నూతన ఒరవడితో హెబ్లర్, నర్క్స్, మెక్‌నైజ్, నాషక్ వంటి నవ్య సంప్రదాయ ఆర్థిక వేత్తలు రూపకల్పన చేసారు. రికార్డో సిద్ధాంతంలో ఉత్పత్తి వ్యయాలు ఎందుకు ఏర్పడతాయో వివరించలేదు. అయితే నవ్య సంప్రదాయ వాదులైన హెక్సర్ మరియు ఒహిలిన్ ఆర్థికవేత్తలు దేశాల ఉత్పత్తి కారకాల లభ్యతలో తేడాలు మరియు వివిధ వస్తువుల ఉత్పత్తి కారకాల సమేళనంలో తేడాల వల్ల ఉత్పత్తి వ్యయాలు ఏర్పడతాయని వివరిస్తూ "ఉత్పత్తి కారకాల లభ్యత సిద్ధాంతాన్ని" ప్రతిపాదించడం జరిగింది. అంతటితో ఈ సిద్ధాంతాభివృద్ధి ఆగకుండా మరింతగా పై సిద్ధాంతాన్ని బలపరుస్తూ శామ్యూసన్ మహాశయుడు "అంతర్జాతీయ ఉత్పత్తి కారకాల ధరల సిద్ధాంతాన్ని" రూపొందించగా నవ్య సంప్రదాయ వాదులయిన స్టాప్లర్, రిబ్‌జన్స్కి, ఫిన్‌డ్లే, లెర్నర్, మిడే, జాన్సన్, ముఖర్జీ వంటి ఆర్థికవేత్తలు ఈ సిద్ధాంతాన్ని బలపరుస్తూ వారి వారి సిద్ధాంతాలను రూపొందించటం జరిగింది. వీరు సంప్రదాయ నవ్య

సంప్రదాయ సిద్ధాంతాలను స్వేచ్ఛా విదేశీ వ్యాపార ప్రమేయం ఆధారంగా కలుగజేయు వివిధ ప్రభావాలను విశ్లేషణ చేయటం జరిగింది. వారు వ్యాపార ప్రతిఫలాలకు, వృద్ధి ప్రతిఫలాలకు ఎటువంటి ఘర్షణ ఉండదని వివరించారు. అంటే వీరి ఉద్దేశంలో విదేశీ వ్యాపారం వలన వచ్చు పరోక్ష లేదా చలన అంశాలు అంతగా చోటు చేసుకొనప్పటికీ నిశ్చల లేదా ప్రత్యక్ష ప్రయోజనాలు అంతర్జాతీయ ప్రత్యేకీకరణ వల్ల కలిగే అంశాలకు అధిక ప్రాధాన్యతను ఇచ్చి ఆ కోణంలో వారు వ్యాపార ప్రతిఫలాలకు, వృద్ధి ఫలాలకు చక్కని సామ్యముంటుందని భావించటం జరిగింది.

తరువాత కాలంలో 'Halamyint' అనే ఆర్థికవేత్త సంప్రదాయ, నవ్య సాంప్రదాయ సిద్ధాంతాలను సమీక్షించి ఆర్థికవృద్ధికి విదేశీ వ్యాపారం ముఖ్యమయినదిగా భావించి విదేశీ వ్యాపారం ఆర్థికవృద్ధి యెడల రూపొందించబడిన ముఖ్య సిద్ధాంతాలుగా "మిగులుకు త్రోవ సిద్ధాంతము, నిశ్చల తులనాత్మక వ్యయ సిద్ధాంతం మరియు చలన ఉత్పాదక సిద్ధాంతాలను" ప్రతిపాదించటం జరిగింది. వీటిలో ఉత్పాదకత సిద్ధాంతం విదేశీ వ్యాపారాన్ని ఒక చలనశక్తిగా ప్రతిపాదించడం జరిగింది. మొత్తం మీద విదేశీ వ్యాపారం వల్ల వచ్చు ప్రతిఫలాలు ప్రత్యక్షమయినవిగా సాంప్రదాయవాదులైన స్మిత్ మరియు రికార్డో భావించగా J.S. మిల్ మహాశయుడు పరోక్ష ప్రయోజనాలను కలిగించునదిగా పేర్కొనడం జరిగింది.

## 4.3 విదేశీ వ్యాపారం వల్ల కలుగు ప్రయోజనాలు

**4.3.1.** విశ్చల ప్రత్యక్ష ప్రయోజనాలు : విదేశీ వ్యాపారము వలన అల్పాభివృద్ధి దేశాలు తాము చవకగా ఉత్పత్తి చేయు వస్తువులలో ప్రత్యేకీకరణ చేసి వాటిని ఎగుమతి చేసి ఇతర దేశాలలో చౌకగా ఉన్న వస్తువులను దిగుమతి చేసుకోవడం జరిగింది. దీని వలన ఉత్పత్తి, జాతీయ ఆదాయం పెరుగుతుంది. పేదరికం, విషవలయాలు ఛేదించుటకు అవకాశం ఉంటుంది. అదే విధంగా అల్పాభివృద్ధి దేశాలలో దేశీయ మార్కెటు చాలా పరిమితంగా ఉంటుంది. అందుచేత ఉత్పత్తి పెట్టుబడి తక్కువ స్థాయిలో ఉంటాయి. మార్కెటు విస్తృతమై పెట్టుబడి పెరిగి వనరులు సమర్ధవంతంగా కేటాయించుటకు వీలుంటుంది. ఈ దేశాల యొక్క విదేశీ వ్యాపారమును కొలుచుటకు ఆచార్య MYINT ఆడం స్మిత్ సూచించిన మిగులు త్రోవ సిద్ధాంతమును ఉపయోగించారు. ఆయన ప్రకారం వెనుకబడిన దేశాలలో సంప్రదాయ జీవనాధార రంగంలో భూమి, శ్రామికులు పూర్తి ఉత్పాదక శక్తి వరకూ ఉపయోగింపబడి ఉండవు. అందువల్ల విదేశీ వ్యాపారం వల్ల ఎగుమతులను పెంచుటకు ప్రాథమిక వస్తువుల ఉత్పత్తులు పెరుగుతాయి. ఈ రంగంలో మిగులు ఉత్పత్తి ఏర్పడుతుంది. ఆ దేశాలు ఉత్పత్తి చేసుకొనుటకు వీలులేని పారిశ్రామిక వస్తువులను దిగుమతి చేసుకొనుటకు ఈ మిగులు దోహదం చేస్తుంది. అంతేకాకుండా విదేశీ వ్యాపారం వలన ఎగుమతులు పెరుగుతాయి. అల్పాభివృద్ధి గల దేశాలలో లభ్యమగు వనరులు ఎక్కువ ఉత్పాదకత వచ్చునట్లుగా ఉపయోగించుకోబడతాయి. వనరుల కేటాయింపు సమర్థవంతంగా జరుగుటకు వీలుంటుంది. తద్వారా ఉత్పత్తి ఫలంలో అనుకూల మార్పులు కలుగుతాయి. అంతేకాకుండా నిరుద్యోగిత అల్పోద్యోగిత పరిమాణం తగ్గుతుంది. దేశీయ పొదుపు మరియు పెట్టుబడులు పెరిగి ఎగుమతుల రంగమునకు ఉత్పాదకములు ఎక్కువ తరలింపబడి మార్కెట్లు విస్తృతి చెంది భారీ ఉత్పత్తి వల్ల అనేక అంతర్గత మరియు బహిర్గత ఆదాయం లభించి ఉత్పత్తి వ్యయాలు తగ్గుతాయి. ముఖ్యంగా ఈ దేశాల్లో వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతుల విస్తరణ ఆ దేశ వ్యవసాయ రంగ అభివృద్ధికి మరింత దోహదం చేస్తుంది. ఈ విధంగా విదేశీ వ్యాపారం వల్ల అనేక ప్రత్యక్ష ప్రయోజనాలు కలవు.

**4.3.2.** చలన మరియు పరోక్ష ప్రయోజనాలు : విదేశీ వ్యాపారం వల్ల పైన వివరించిన నిశ్చల ప్రయోజనాలతో పాటు విదేశీ వ్యాపారము వలన అనేక పరోక్ష ప్రయోజనలు కూడా కలవు. వాటిలో ప్రధానమయినవి క్రింద వివరించడమయినది.

ఆర్థికాభివృద్ధికి కావలసిన మూలధన వస్తువులు పారిశ్రామిక ముడి పదార్థములు మొదలయినవి వెనుకబడిన దేశాల్లో కొరతగా ఉంటాయి. ప్రాథమిక వస్తువుల ఎగుమతుల విస్తరణ ద్వారా ఈ దేశాలు విదేశీ చెల్లింపుల లోటు లేకుండా వీటిని దిగుమతి చేసుకోడానికి వీలుంటుంది. అనగా తక్కువ అభివృద్ధి సఖ్యత గల వస్తువులు దిగుమతి చేసుకోడానికి వీలుంటుంది. అంతేకాక విదేశీ వ్యాపారం వలన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యం, ఆధునిక భావనలును ఈ దేశ ప్రజల దృక్పధములను సామర్థ్యమును పెంచుతాయి. విదేశీ

సాంకేతిక పరిజ్ఞానమును ఆయా దేశముల ఉత్పాదక వనరుల లభ్యతకు అనుగుణంగా వర్తింపజేసుకోవచ్చు. అదే విధంగా విదేశీ వ్యాపారం వలన మూలధనం సంపన్న దేశాల నుండి అల్పాభివృద్ధి దేశాలకు ప్రవహిస్తుంది. ఈ విదేశీ మూలధనం వలన ఉద్యోగిత, ఉత్పత్తి ఆదాయాలు పెరుగుతాయి. విదేశీ వ్యాపార చెల్లింపులను, ద్రవ్యోల్బణ ఒత్తిడులను నివారించుటకు వీలగుతుంది. అంతేకాకుండా స్వేచ్ఛా విదేశీ వ్యాపారం వలన ఏకస్వామ్య విధానములు నివారించబడి పోటీ పరిస్థితులు నెలకొల్పబడుటకు అవకాసం ఉంటుంది.

**4.3.3. విదేశీ వ్యాపారము - ఎగుమతుల మార్గావవృద్ధి :** విదేశీ వ్యాపారం వలన కలుగు వివిధములయిన ప్రత్యక్ష పరోక్ష ప్రయోజనాల ఆధారంగా సంప్రదాయ నవ్య సాంప్రదాయ ఆర్థికవేత్తలు ఎగుమతుల మార్గాన వృద్ధి (Export - Led - Growth) ప్రతిపాదన చేసారు. ఆచార్య వాటికిన్స్ ఆర్థిక వేత్త తన గ్రంథంలో (Staple theory of Economic Growth) ఎగుమతుల విస్తరణ ఆర్థిక వ్యవస్థ మొత్తంపై ఎలా ప్రసరింపబడతాయో వివరించాడు. ఆయన ప్రకారం ఎగుమతుల విస్తరణ వలన పైన వివరించిన ప్రత్యక్ష మరియు అనుబంధ పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయి. ఎగుమతుల రంగానికి ప్రాధాన్యత నిచ్చినచో ఆ రంగము నందు సంభవించు వృద్ధి ప్రభావం ఆ దేశ వివిధ రంగములకు విస్తరిస్తుందని ఆయన వివరించాడు. అంతేకాక జీవనాధార రంగ ఉత్పత్తులకు మార్కెట్లను కలుగజేయుట వల్ల ఆ రంగంలో పనిచేయువారి ఆదాయములు పెరుగుటవల్ల ఆ దేశాలలోని జీవనాధార రంగం వ్యాపారీకరణ లేదా ద్రవీకరణ చెందుతుంది. ఇదే బాటలో రాస్టో, నర్క్సే వంటి ఆర్థికవేత్తలు ఎగుమతుల దృష్ట్యా ప్రాథమిక వస్తుత్పత్తి రంగమును విస్తరించుట ద్వారా దాని విస్తరణ ఫలితములను దేశంలోని వివిధ రంగములు పొందగలవని వివరించిరి. కార్డెన్ (Corden) మహాశయుడు మరో కోణమున వివరించునదేమనగా అంతర్జాతీయ మార్కెటు శక్తులు ప్రపంచ వ్యాపార రంగమున సంచరించు విధమును బట్టి విదేశీ వ్యాపారము ఎగుమతుల వృద్ధి ద్వారా వివిధ దేశాలు వాని వాని మూలధన సంచయనము, ఆదాయ పంపిణీ, ప్రత్యామ్నాయ వనరులు, ఉత్పత్తి కారకాల లభ్యత మున్నగు ప్రాముఖ్యమున్న విషయాల యెడల తీవ్ర ప్రభావం చెందగలవని ఈ వివిధ అంశాలపై కలిగే ప్రభావాన్ని కలిసి వివిధ వాణిజ్య దేశాల నిజ ఆదాయాలను పెంచుతాయని వివరించాడు.

మరో వైపు నవ్య సాంప్రదాయ వాదులు ప్రతిపాదించిన ఆధునిక ఉత్పాదక సిద్ధాంతం ఆధారంగా ఉత్పత్తి మార్గాన వృద్ధి భావన విదేశీ వ్యాపారము వలన కలుగు పరోక్ష ప్రయోజనాలను చలనాంశాలుగా పరిగణించి విదేశీ వ్యాపారమును ఒక అతి బలీయమైన చలన శక్తిగా భావిస్తుంది. ఎగుమతుల వృద్ధి ద్వారా కలుగు విదేశీ వ్యాపారం ఒక చలన శక్తిగా రూపొంది విదేశీయంగా ఒక చలన శక్తిగా రూపొంది దేశీయంగా మార్కెట్లను విస్తరింపజేసి శ్రమ విభజన పరిధిని పెంచి, యాంత్రీకరణకు విస్తరించి నవకల్పనలను ప్రేరేపించి, సాంకేతికంగా ఉన్న అవిభాజ్యతలను అధిగమింప జేసి శ్రామిక సామర్థ్యాన్ని పెంపొందింపజేసి విదేశీ వ్యాపారంలో పాల్గొను దేశాలకు వృద్ధి ప్రతిఫలాలను కలుగజేసి తద్వారా ఆర్థిక వృద్ధిని తీసుకువస్తుందని MYINT మహాశయుడు పేర్కొన్నాడు.

పైన వివరించినటువంటి వివిధ అంశాల ఆధారంగా సంప్రదాయ - నవ్య సాంప్రదాయ ఆర్థికవేత్తలు ప్రతిపాదించిన వృద్ధి యంత్రము మరియు ఎగుమతుల మార్గన వృద్ధి భావనలు కొన్ని అంశములను స్పష్టపరుస్తున్నాయి. వాటిలో ముఖ్యమయినవి విదేశీ వ్యాపారం ఆర్థికవృద్ధికి ఉత్ప్రేరకంగా పనిచేస్తుంది. అది వివిధ దేశాల్లో వినియోగ స్థాయిని పెంచి తద్వారా వస్తువులకు మార్కెట్లను విస్తరించుట ద్వారా వెనుకబడిన దేశాలు లాభపడతాయి. అంతేకాక విదేశీ వ్యాపారము అంతర్జాతీయంగా మరియు దేశీయంగా ఉత్పత్తి కారకాల రాబడుల యందు సమానతను తీసుకవచ్చి ఆ దేశాల నిజ ఆదాయాలను పెంచడాన్ని సహకరిస్తుంది. మరియు విదేశీ వ్యాపారము వివిధ దేశాలకు గల వావివాని ఉత్పత్తి కారక-ల యందు సామర్థ్యాన్ని, తులనాత్మక ప్రయోజనాలను దేశాలలోని అన్ని రంగాలలోను పెంపొందించుట ద్వారా వెనుకబడిన దేశాలకు సహకరిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా స్వేచ్ఛా వ్యాపార పరిస్థితులు నెలకొన్నచో అంతర్జాతీయ ధరలు, ఉత్పత్తి వ్యయాలు దేశం ఎంత ఉత్పత్తి చేయగలుగుతుందో నిర్ణయిస్తుంది. అందువల్ల ఆ రకమయిన వాణిజ్యం వివిధ దేశాల సంక్షేమానికి దారి తీస్తుంది. అనగా స్వేచ్ఛా అంతర్జాతీయ మార్కెటు శక్తులకు దేశీయ ఆర్థిక వ్యవస్థలు అనుగుణంగా మలచటం వలన ఆయా దేశాలు లాభాన్ని పొందుతాయి. ఈ అంశాల ఆధారంగా సంప్రదాయ - నవ్య సంప్రదాయ వేత్తలు ఎగుమతుల వృద్ధి విధానాలకు ఎక్కువ ప్రాముఖ్యతను ఇవ్వటం జరిగింది.

## 4.4. H.G. జాన్సన్ నమూనా

పలు ప్రపంచదేశాలు ప్రపంచ యుద్ధానంతర కాలంలో ఏర్పడిన డాలర్ల కొరత, అభివృద్ధి చెందుతున్న దేశాల సమస్యలు మరియు బ్రిటన్ దీర్ఘకాల అవకాశాల ఆలోచన దృక్పధాలు మొదలైనవి దృష్ట్యా విదేశీ వ్యాపారంపై ఆర్థికాభివృద్ధి ప్రభావాలు ఏ విధంగా ఉంటాయోనని చర్చనీయాంశంగా మారింది. ఈ సందర్భంలో జాన్సన్ మహాశయుడు ఆర్థిక విస్తరణకు సంబంధించి పలు సాంకేతిక అంశాలు ప్రాథమిక మరియు పారిశ్రామిక వస్తువుల ఉత్పత్తి దేశాల విదేశీ వ్యాపార మొత్తాలపైన మరియు వర్తక నిబంధనలపైన ఎలాంటి ప్రభావం చూపుతాయో తన గ్రంధము (ఇంటర్‌నేషనల్ ట్రేడ్ అండ్ ఎకనామిక్ గ్రోత్) నందు ఆర్థికాభివృద్ధి మరియు అంతర్జాతీయ వ్యాపారం మధ్యగల పరస్పర సంబంధాన్ని వివరించాడు. అంతేకాక ఆర్థిక విస్తరణ జనాభా వృద్ధి, డిమాండుల పెరుగుదల వలన సంభవించినపుడు లేదా మూలధన సంచయనము మరియు సాంకేతికాభివృద్ధి వలన ఆర్థిక విస్తరణ కల్గినపుడు విస్తరణ ప్రభావాలు విదేశీ వ్యాపారంపై ఎలా ఉంటాయో వివరించటం జరిగింది. ఈ వివరణలో వివిధ వ్యాపార దేశాలలో సంపూర్ణ ఉద్యోగిత కలిగి ఉండి వస్తు ఉత్పత్తి కారకాల మార్కెట్లలో పూర్తి పోటీ పరిస్థితులు నెలకొని ఉన్నట్లు ప్రమేయం చేయబడింది. వివరణ సౌలభ్యం కోసం పారిశ్రామిక వస్తువులను ఎక్కువగా ఉత్పత్తి చేయు దేశాన్ని 'మాన్యుకనియం' గాను వ్యవసాయ ప్రాథమిక వస్తువులు ఉత్పత్తి చేయు దేశాలను అగ్రేయ దేశంగాను ఈయన ఉదహరించాడు. పారిశ్రామిక వస్తువులు విలాస వస్తువులు కాగా, వ్యవసాయ వస్తువులు అత్యవసర వస్తువులుగా జాన్సన్ భావించాడు. అందువల్లనే పారిశ్రామిక వస్తువులకు ఆదాయ వ్యాకోచ డిమాండ్ ఒకటి కన్న ఎక్కువగాను వ్యవసాయ వస్తువులకు ఒకటికన్న తక్కువగా ఉంటుందని పేర్కొనడం జరిగింది. ఈ ప్రమేయాల నేపధ్యంలో తన నమూనాలను 3 ప్రధాన భాగాలుగా వివరించాడు.

ఒకటవ భాగంలో రెండు దేశాలు ఎగుమతి చేసే వస్తువుల ఉత్పత్తిలో సంపూర్ణ ప్రత్యేకీకరణ చేస్తాయని ఇతర వస్తువుల విషయమై పూర్తిగా దిగుమతులపైన ఆధారపడి ఉంటాయని, రెండవ భాగంలో రెండు వ్యాపార దేశాలు దిగుమతి చేసే వస్తువులను కూడా దేశీయంగా కొంత మేరకు ఉత్పత్తి చేస్తాయని వివరించడం జరిగింది. ఈ మొదటి రెండు భాగాల విశ్లేషణలో వ్యాపార దేశాల మధ్య కేవలము వస్తువులు మాత్రమే స్వేచ్ఛగా తరలించబడతాయని, ఉత్పత్తి కారకాలకు దేశాల మధ్య గమనశీలత ఉండదని ప్రమేయంగా తన నమూనాలో వివరించాడు. 3వ భాగంలో వివిధ వ్యాపార దేశాల మధ్య ఉత్పత్తి కారకాలకు కొంతమేరకు గమనశీలత ఉంటుందని ప్రమేయంగా తీసుకున్నాడు. విశ్లేషణ ప్రతి భాగములను ఆర్థిక విస్తరణ ప్రభావాలు ఉత్పత్తి, వినియోగం, వర్తక నిబంధనలు, నిజ ఆదాయాలు ఎగుమతి - దిగుమతి వ్యాకోచత్వాలపై ఏ విధంగా ఉంటుందో పరిశీలించాయి.

**4.4.1. సంపూర్ణ ప్రత్యేకీకరణతో కూడిన ఆర్థిక విస్తరణ :** రెండు దేశాలు సమతౌల్యంలో ఉన్నాయని భావిస్తే మొత్తం విదేశీ వాణిజ్యం వర్తక నిబంధనల పరిస్థితులు బాగుండుట వలన ఏ దేశ ఎగుమతులు ఆ దేశ దిగుమతులకు సమానమవుతుందని చెప్పవచ్చు. ఇటువంటి సమయాల్లో అగ్రేరియా ఆర్థిక వ్యవస్థ నిశ్చల స్థితిలో ఉండి మానిక్యుల ఆర్థిక వ్యవస్థ విస్తరణతో కూడి ఉన్నచో మానిక్యుల దిగుమతుల డిమాండు పెరుగును. అనగా మానిక్యులాలో జరిగిన ఆర్థిక విస్తరణ వల్ల అగ్రేరియా ఎగుమతులు పెరిగి వాని ఉత్పత్తులు పెరుగుటవల్ల ధరలు పెరిగి వర్తక నిబంధనలు అగ్రేరియాకు అనుకూలంగాను మానిక్యులకు ప్రతికూలంగాను మార్పు చెందవచ్చు. మానిక్యుల ఆర్థిక విస్తరణ వల్ల కలుగు లాభాలు రెండు దేశాల మధ్య ఎలా పంపిణీ కాబడతాయనేది ఆ దేశాల వర్తక నిబంధనలలో కలుగు మార్పులపై ఆధారపడి ఉంటుంది.

మానిక్యునాలో జరిగిన ఆర్థిక విస్తరణ ప్రభావాలు రెండు దేశాల ఎగుమతుల వ్యాకోచం పైన మరియు పారిశ్రామిక వస్తువులకు గల ప్రపంచ డిమాండులను బట్టి ఉంటాయి. అనగా మానిక్యులా ఆర్థిక వ్యవస్థ విస్తరణ ప్రభావాలు ఆ దేశ వర్తక నిబంధనలను ఏ మేరకు క్షీణింపచేయునో అను దానిపైన మరియు ఆ దేశ ప్రజల ఉపాంత వ్యయ ప్రవృత్తి పైన ఆధారపడి ఉంటుంది.

సంబంధిత దేశాల ప్రజలు ఆహార వస్తువులను ఎక్కువ డిమాండు చేసినచో వర్తక నిబంధనల క్షీణత ఎక్కువగా ఉంటుంది. అలా కాకుండా పారిశ్రామిక వస్తువులను వినియోగించినచో వారి వర్తక నిబంధనలలో అంతగా క్షీణత ఉండదు. ఏమైనప్పటికి పారిశ్రామిక లేదా మాన్యూనీయం గల ఆర్థిక వ్యవస్థలో విస్తరణ కొంత మేరకు తొలిదశలో అగ్రేలియంకు లభిస్తుందని వివరించాడు.

మానిక్యునాలోని ఆర్థిక విస్తరణ దాని జనాభాలోని పెరుగుదల వలన, డిమాండులో పెరుగుదల వలన కలిగినచో విదేశీ వ్యాపారం నుండి మానిక్యునా అంతగా లాభపడదు. అలా కాక మూలధన సంచయనం, సాంకేతిక రంగ అభివృద్ధి వల్ల మానిక్యునాకు విస్తరణ జరిగినచో ఆ విస్తరణ మానిక్యునాకు అంతర్జాతీయ వ్యాపారంలో ఎక్కువ ఉపయోగకారిగా ఉండును. అనగా వర్తక నిబంధనలు దానికి అనుకూలంగా మారి ప్రజల నిజ ఆదాయాలు మానిక్యునాలో పెరుగును.

ఈ విశ్లేషణను సిద్ధాంతపరంగా చూస్తే వెనుకబడిన దేశాల్లో పారిశ్రామికీకరణ ఆవశ్యకతను తెలుపుతూ ప్రాథమిక వస్తువులను ఉత్పత్తి చేయు దేశాలకు అనుకూలంగా విదేశీ వ్యాపారం ఉందని చెప్పవచ్చు. ఎందుకంటే ఈ రెండు రంగాల యందు ఉత్పత్తి ప్రక్రియలో గల వ్యయాల తేడాలు ఆర్థిక విస్తరణ జనాభా పెరుగుదల వల్ల వచ్చినట్లయితే తలసరి నిజ ఆదాయాలు పడిపోతాయి. అపుడు వ్యవసాయదారులకు వర్తక నిబంధనలు అనుకూలంగా ఉంటాయి. అలాకాక మూలధన సంచయనంలో పెరుగుదల సాంకేతికాభివృద్ధి వల్ల విస్తరణ వచ్చినచో పారిశ్రామిక దేశాలకు వర్తక నిబంధనలు అనుకూలంగా ఉంటాయి. ఈ మార్పులు ఆర్థిక వ్యవస్థలలో రావాలన్నచో ఆ దేశాలలో ఉత్పత్తి వాస్తవిక దిగుమతుల డిమాండు ధనాత్మకంగా ఉండవలెను.

ఈ విషయంపై మూడు రకాల మినహాయింపులను చెప్పవచ్చు. ఒక దేశ ఎగుమతులు ఇతర దేశాల్లో వినియోగానికి తగినవిగా లేకుంటే ఆ దేశ ఉత్పత్తి పెరిగితే ఎగుమతులు తగ్గుతాయి. వ్యవసాయక దేశాల్లో జనాభా వృద్ధి, క్షీణ ప్రతిఫలాల వల్ల తలసరి ఆదాయాలు తగ్గి పారిశ్రామిక వస్తువుల దిగుమతి డిమాండు తగ్గవచ్చు. అంతేకాక వ్యవసాయక దేశాలు పారిశ్రామిక రంగాలకవసరమయిన వస్తువులను ఉత్పత్తి చేస్తే ఆ దేశ ఎగుమతులు తగ్గవు. తద్వారా రెండు రంగాలు అభివృద్ధి చెందుతాయి. ఈ పరిస్థితులలో రెండు దేశాలలో వృద్ధి ఋణాత్మక ఉత్పత్తి వ్యాకోచ దిగుమతి డిమాండులతో కూడి ఉన్నచో అది ప్రపంచ ఆర్థిక వ్యవస్థలోనూ మొత్తం వ్యాపారాన్ని తగ్గించి వర్తక నిబంధనలను అనుకూలముగాను చేయును.

**4.4.2. అసంపూర్ణ ప్రత్యేకీకరణతో కూడిన ఆర్థిక విస్తరణ :** ప్రతి దేశం దిగుమతుల విషయంలో సాధారణంగా కొంతమేర దేశీయంగా ఉత్పత్తి చేసుకుంటాయి. దీని ఆధారంగా అసంపూర్ణ ప్రత్యేకీకరణతో కూడిన ఆర్థిక విస్తరణ ఆ దేశాల అంతర్జాతీయ వ్యాపారంలో ఎటువంటి ప్రభావాలు చూపుతాయో, రెండవ భాగంలో వివరించటం జరిగింది.

ప్రారంభంలో వివిధ వస్తువులకు వనరుల కేటాయింపులో వనరులు అభిలాషణీయంగా వినియోగం కావు. అంతేకాక తరహా ననుసరించి వచ్చే ఆదాలు కూడా ఆర్థిక వ్యవస్థ కోల్పోవలసి యుంటుంది. వీనిని పరిహరించుటకు ఆయా దేశాలు కారకాల లభ్యతను బట్టి ప్రత్యేకీకరణకు మొగ్గుచూపుతారు. వ్యవసాయక దేశాలు శ్రమ సాంద్రత గల వస్తువులను ఉత్పత్తి చేసి క్షీణ ప్రతిఫలాలు పొందితే పారిశ్రామిక దేశాలు మూలధన సాంద్రతతో కూడిన వస్తువులను ఉత్పత్తి చేసి స్థిర ప్రతి ఫలాలు పొందడం జరుగుతుంది. ఈ సందర్భంగా అసంపూర్ణ ప్రత్యేకీకరణ గల దేశాలలో దిగుమతి డిమాండు మొత్తం డిమాండు నుండి దేశీయ వస్తు సరఫరాను తీసివేయగా మిగిలినదని చెప్పవచ్చు. ఆర్థిక విస్తరణ మొత్తం డిమాండ్లను పెంచును. దానితో పాటుగా దేశీయ వస్తు సరఫరాను కూడా పెంచుతుంది. దిగుమతుల డిమాండ్లను తగ్గిస్తుంది. తద్వారా వర్తక నిబంధనలను అనుకూలంగా మార్చును.

ఇతర దేశాల పరిస్థితులు స్థిరంగా ఉండి ఒక దేశ దిగుమతి డిమాండు పెరిగినచో ఆ దేశానికి వర్తక నిబంధనలు ప్రతికూలంగా మారును అలా కాక ఆర్థిక విస్తరణ దిగుమతులను తగ్గించినచో వర్తక నిబంధనలు అనుకూలమగును. అదే విధంగా ఆర్థిక విస్తరణ దిగుమతులు తగ్గించినచో ఆ దేశంలో ప్రజల నిజ ఆదాయాలు ఏ మేరకు పెరుగుతాయనేది దిగుమతి డిమాండు వ్యాకోచత్వం పైన, వర్తక నిబంధనల స్వభావం పైన ఆధారపడియుండును.

ఆర్థిక విస్తరణ వల్ల ఒక దేశ దిగుమతులు ఉత్పత్తిలో వినియోగంలో మార్పులు ఏ రేటులో జరిగాయో అనేది ముఖ్యమయిన అంశం. విస్తరణ ప్రభావాలు ప్రధానంగా వినియోగ ఉత్పత్తులపై 3 రకాలుగా ఉంటాయని చెప్పవచ్చు. అవి అంతర్జాతీయ వ్యాపారానికి అనుకూలంగా

గాని, లేదా తటస్థంగా గాని, లేదా ప్రతికూలంగా గాని ఉండవచ్చు. ఆర్థిక విస్తరణ వలన పెరిగిన ఉత్పత్తి కన్న దిగుమతుల డిమాండు ఎక్కువ నిష్పత్తిలో పెరిగినచో అది అంతర్జాతీయ వ్యాపారంపై ప్రతికూల ప్రభావాన్ని చూపును. ఉత్పత్తితో సమానంగా దిగుమతి డిమాండు పెరిగినచో వ్యాపారంపై తటస్థ ప్రభావం చూపును. అదే విధంగా ఉత్పత్తి కన్నా దిగుమతి డిమాండు తక్కువ రేట్లో పెరిగినచో అది అంతర్జాతీయ వ్యాపారంపై అనుకూలమైన లేదా తటస్థమయిన లేక ప్రతికూల ప్రభావం చూపును. అది ఆ దేశాల ఎగుమతుల దిగుమతుల డిమాండ్ల మధ్యగల తేడా బట్టి నిర్ణయించబడుతుంది. ఆర్థిక విస్తరణ వలన మొత్తం మీద దేశీయంగా దిగుమతి వస్తువుల డిమాండు తగ్గితే అది అత్యధిక అనుకూల వ్యాపారంగా చెప్పవచ్చు. అలాకాక ఆర్థిక విస్తరణ దేశీయ ఎగుమతి వస్తువుల సరఫరా తగ్గించినచో అది అత్యధిక ప్రతికూల వ్యాపారమును కలుగజేయును. అనుకూల వ్యాపార మరియు ఋణాత్మక ఉత్పత్తి వ్యాకోచంగల ఎగుమతుల వలన అత్యధిక ప్రతికూల వ్యాపారం కలుగజేయును. ఈ విస్తరణ ప్రభావాలన్నింటిని ఈ దిగువన క్రోడీకరించడం జరిగింది.

ముందుగా సాంకేతిక ప్రగతి వలన కలుగు ఆర్థిక విస్తరణ సాంప్రదాయ వాదుల ప్రకారం పారిశ్రామిక దేశ వినియోగంపై ప్రభావాన్ని కల్గి ఉండి మొత్తం మీద వ్యాపార ప్రతికూలంగా గాని, లేక అనుకూలంగా గాని ఉండవచ్చు. అదే విధంగా సమానరేట్లు ఉన్నపుడు పారిశ్రామిక దేశాల వినియోగంపై ప్రతికూల వ్యాపార ప్రభావాన్ని ఉత్పత్తి పై తటస్థ వ్యాపార ప్రభావాన్ని కల్గి ఉండి మొత్తం మీద అత్యధిక అనుకూల వ్యాపార ప్రభావాలు ఉండవచ్చును. అదే విధంగా సాంకేతిక అభివృద్ధి ద్వారా కల్గు ఆర్థిక విస్తరణ సాంప్రదాయవాదుల ప్రకారం వ్యవసాయక దేశాల వినియోగంపై వ్యాపార అనుకూల ప్రభావం ఉత్పత్తిపై అత్యధిక ప్రతికూల వ్యాపార ప్రభావం కల్గి ఉండి మొత్తం మీద అత్యధిక ప్రతికూల వ్యాపార ప్రభావాలు కల్గుతాయి. అదే విధంగా సమానరేట్ల ప్రకారం సాంకేతిక పరిజ్ఞానం వల్ల కల్గు ఆర్థిక విస్తరణ వ్యవసాయ దేశాల వినియోగంపై అనుకూల వ్యాపార ప్రభావం, ఉత్పత్తిపై వ్యాపార తటస్థ స్థిర ప్రభావం కల్గి ఉండి మొత్తం మీద వ్యాపార అనుకూల ప్రభావం కలుగజేయును.

మూలధన సంచయనాలలో పెరుగుదల వల్ల కల్గు ఆర్థిక విస్తరణ పారిశ్రామిక దేశాల వినియోగంపై వ్యాపార ప్రతికూల ప్రభావాన్ని ఉత్పత్తి పై అత్యధిక అనుకూల వ్యాపార ప్రభావాన్ని కల్గి ఉండి మొత్తం మీద వ్యాపార అనుకూలంగా గాని లేదా ప్రతికూలంగా గాని ఈ ప్రభావాలు ఉండవచ్చు. అదే విధంగా మూలధనంలో పెరుగుదల వలన కల్గు ఆర్థిక విస్తరణ వ్యవసాయ దేశాల వినియోగంపై అనుకూల వ్యాపార ప్రభావాన్ని ఉత్పత్తిపై అత్యధిక ప్రతికూల వ్యాపార ప్రభావాన్ని కల్గి ఉండి మొత్తం మీద ఆ దేశాలకు అత్యధిక వ్యాపార ప్రతికూల పరిస్థితులను కలుగజేయును.

జనాభాలో పెరుగుదల కొద్దిమాత్రం క్షీణ ప్రతిఫలాలు కలుగజేయునపుడు కలుగు ఆర్థిక విస్తరణ పారిశ్రామిక దేశాల వినియోగంపై అనుకూల వ్యాపార ప్రభావాన్ని ఉత్పత్తిపై తీవ్ర ప్రతికూల వ్యాపార ప్రభావాన్ని కలుగజేసి మొత్తంమీద ఆ దేశాలకు ప్రతికూల వ్యాపార ప్రభావాలను కలుగజేస్తాయి. అదే విధంగా కొద్దిమాత్రం క్షీణ ప్రతిఫలాలతో కూడిన జనాభా విస్తరణ వలన కలుగు ఆర్థిక అభివృద్ధి వ్యవసాయ దేశాల వినియోగంపై ప్రతికూల వ్యాపార ప్రభావాన్ని ఉత్పత్తిపై అత్యధిక అనుకూల వ్యాపార ప్రభావాన్ని మొత్తం మీద అనుకూల లేదా ప్రతికూల వ్యాపార ప్రభావాలను కలుగజేస్తాయి. ఎక్కువ క్షీణ ప్రతిఫలాలతో కూడిన జనాభాలో వృద్ధి వలన కల్గిన ఆర్థిక విస్తరణ పారిశ్రామిక దేశాల వినియోగంపై అనుకూల వ్యాపార ప్రభావాన్ని ఉత్పత్తిపైన కూడా అనుకూల వ్యాపార ప్రభావాన్ని కలుగజేయును. అదే విధంగా ఎక్కువ క్షీణ ప్రతిఫలాలు కలిగిన జనాభా విస్తరణ వలన కలుగు ఆర్థిక విస్తరణ వినియోగంపై వ్యాపార ప్రతికూల ప్రభావాలను ఉత్పత్తి పై కూడా వ్యాపార ప్రతికూల ప్రభావాన్ని కలిగి ఉండి మొత్తం మీద తీవ్రమైన వ్యాపార వ్యతిరేక ప్రభావాలు కలుగజేయును.

**4.4.3. అంతర్జాతీయ ఉత్పత్తి శక్తుల మార్పిడితో కూడిన ఆర్థిక విస్తరణ :** కొంత మేరకే ఉత్పత్తి కారకాల వివిధ వ్యాపార దేశాల మధ్య గమనశీలత కలిగి ఉండుట అనే ప్రమేయం ఆధారంగా తీసుకొని నేపథ్యంలో ఆర్థిక విస్తరణలోను, అంతర్జాతీయ వ్యాపారంలో కలిగే మార్పులను జాన్సన్ ఇందు వివరించెను. అంతర్జాతీయంగా శ్రామికుల, మూలధనం, సాంకేతిక పరిజ్ఞానం మార్పిడి జరిగినపుడు స్వల్పకాలంలో కొన్ని దీర్ఘకాలంలో మరికొన్ని ప్రభావాలు ఉండును. స్వల్పకాలంలో కారకాల రవాణా, వలసకెళ్లిన శ్రామికులు మరొక చోటు స్థావరమేర్పరచుకొనుట, మూలధన పరికరాలు దేశాల మధ్య మార్పులు, సాంకేతిక పరిజ్ఞానం మార్పిడి కొన్ని ప్రత్యేక సమస్యలు కలుగజేయును.

కాని దీర్ఘకాలములో ఈ కారకాల మార్పిడి ఇరు దేశాలలోను క్రొత్త ఆదాయ ప్రవాహాలకు దారితీయును. స్వల్పకాలంలో కారకాల మార్పిడి వర్తక నిబంధనలను పూర్తిగా ప్రభావితం చేయనప్పటికీ పారిశ్రామిక దేశాల నుండి మూలధనం, సాంకేతిక పరిజ్ఞానం వ్యవసాయక దేశాల నుండి శ్రామికులు వలస వెళ్లుటవల్ల ఈ కారకాల మార్పిడి పారిశ్రామిక దేశాలకు అనుకూల వర్తక నిబంధనలను సమకూర్చవచ్చును. అలాగే శ్రామిక వలస కూడా కొంత ధనాత్మక ప్రభావాలు కనిపించవచ్చు. దేశాల మధ్య విదేశీ పెట్టుబడుల మార్పిడి కూడా వ్యవసాయక దేశాలలో కొన్ని ప్రభావాలను కలుగజేయును. అదే విధంగా పారిశ్రామిక దేశం నుండి సాంకేతిక పరిజ్ఞానం ఇతర దేశాల్లో, ఆ దేశాలలో కొన్ని ప్రభావాలు తీసుకొనవచ్చును. అలాగే శ్రామికులు తరలి వెళ్ళుటవల్ల అగ్రేరియన్‌కు వ్యాపార అనుకూలత ఏర్పడును. మానిక్యూనాకు కారకాల మార్పిడివల్ల ఉత్పత్తిపై అధిక అనుకూల వ్యాపార ప్రభావాలు వినియోగంపై అనుకూల వ్యాపార ప్రభావం ఏర్పడును. మొత్తం మీద వ్యాపార అనుకూలత ఏర్పడును. అందువలన మానిక్యూనా వర్తక నిబంధనలు మెరుగైదాని నిజాదాయాలు కూడా పెరుగుటకు అవకాశం కలదు. మానిక్యూనా నుండి దిగుమతి కాబడిన సాంకేతిక పరిజ్ఞానము అగ్రేరియాలో వ్యాపార అభివృద్ధికి తోడ్పడుట కొంతమేరకు అగ్రేరియకు వ్యాపార అనుకూల ప్రభావాలకు దారి తీయవచ్చు. మానిక్యూనాలో జరిగే వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించిన పరిశోధన అగ్రేరియాకు లాభం చేకూరును.

అదే విధముగా శ్రామికుల వలస ప్రపంచ దేశాలలోని పారిశ్రామిక ఉత్పత్తులు తగ్గించి, వ్యవసాయ ఉత్పత్తులు పెంపుదలకు దారి తీయును.

ఉత్పత్తి కారకాల మార్పిడి పూర్తి ప్రత్యేకీకరణ ఉన్నపుడు అంతర్జాతీయ వ్యాపారంపై అనుకూల ప్రభావాలు తీసుకువచ్చును. అసంపూర్ణ ప్రత్యేకీకరణ ఉన్న పరిస్థితులలో మరో రకమయిన ప్రభావాలు కలుగ జేయును. జనాభా విస్తరణ రెండు దేశాలలోనూ దిగుమతులు పెరుగుట ద్వారా వ్యతిరేక ప్రభావాలు కలుగజేయును. అదే విధంగా రెండు దేశాలలోని వ్యవసాయ రంగాలలో క్షీణ ప్రతిఫలాలు కలుగుటవలన కూడా వర్తక నిబంధనలలో మార్పులేర్పడును. ఈ కారకాల మార్పిడి వలన వర్తక నిబంధనలలో వచ్చు మార్పులను బట్టి ఈ ప్రభావాలు ఉండును. ప్రపంచ పారిశ్రామిక వస్తు డిమాండు పెరిగినమా లేదా ప్రపంచ పారిశ్రామిక వస్తువుల ఉత్పత్తి కన్నా తగ్గినమా వర్తక నిబంధనలు మానిక్యూనాకు అనుకూలముగా ఉండును. రెండు దేశాలలోని శ్రామిక ఉపాంత ఉత్పాదకతలో వచ్చు మార్పులు ఉపాంత పారిశ్రామిక వస్తువుల వినియోగ ప్రవృత్తి పై ఆధారపడి ఉంటుంది. మొత్తము మీద శ్రామికుల వలస దేశాల మధ్య వారి మార్పిడి ప్రపంచ ఉత్పత్తిని పెంచుటాయనుటలో సందేహము లేదు.

వ్యవసాయ క్షీణ ప్రతిఫలాలను స్థిర ప్రతిఫలాలను మూలధన శ్రామిక భూముల వినియోగ దశలలో

**4.4.4.** ముగింపు : రెండు దేశాల నమూనాలో వర్తక నిబంధనలు వాటి ఆదాయ, ఉత్పత్తి వినియోగాలపై వ్యాపార చక్రాల ప్రభావాలను వివిధ పరిస్థితులలో పరిశీలించిన మీదట తెలియునదేమనగా దేశాల మధ్య వివిధ పరిస్థితుల విషయాలలో తీసుకున్న ప్రమేయాలు చాలా ముఖ్యమయినవి. ప్రధానంగా రెండు పెద్ద రంగాలయిన వ్యవసాయము, పరిశ్రమలను మాత్రమే తీసుకొనుట జరిగింది. ఒక దేశ ఆర్థిక విస్తరణ అన్ని వ్యాపార దేశాల వర్తక నిబంధనలలో మార్పులు తీసుకువస్తాయని ప్రపంచ వ్యాపారంలో ఆ దేశాల వ్యాపార శాతములలో మార్పులు, దేశాల ఎగుమతుల డిమాండులలో వచ్చు మార్పులు అన్నీ పరిగణలోనికి తీసుకొనబడినవి. ఇరు దేశాలలోని వ్యాపార పరిస్థితులలో కలుగు మార్పులు వివరించబడినవి. ఒక దేశ ఆర్థిక విస్తరణ వల్ల కలుగు ప్రభావాలు ఇతర దేశాలపై ఎలా ఉంటాయో వివరణాత్మకముగా జాన్సన్ మహాశయుడు వివరించెను.

స్థిర ప్రతిఫలాలు వచ్చుచున్నచో మాక్యునాలో ఉత్పత్తి పెరిగి అగ్రేరియాలో తగ్గును. ఈ రెండింటిలో ఏది పెద్ద మొత్తంలో జరుగునో తెలుసుకొనవలెను. కొన్ని ప్రమేయాల ఆధారంగా అంతర్జాతీయ వ్యాపార సిద్ధాంతములలో రెండు దేశాలలో పారిశ్రామిక వస్తు ఉత్పత్తి ఫలాలు ఒకే రకంగా ఉన్నపుడు ఏ శ్రమ మూలధన కలయికలోనైనమా అగ్రేరియాలో వ్యవసాయ ఉత్పత్తి అధికంగా ఉండును. మానిక్యునాలో కాని శ్రామిక ఉపాంత ఉత్పాదకతలు అగ్రేరియాలో అధికంగా ఉండవచ్చును. అదే విధంగా మాక్యునా మూలధనాన్ని అగ్రేరియాలోకి

తరలింపజేసినపుడు కూడా ఇవే రకమయిన ధనాత్మక ప్రభావాలు కలుగును. వర్తక నిబంధనలు మాక్యునాకు అనుకూలముగా గాని ప్రతికూలంగా గాని ఉండవచ్చును మొత్తం మీద ఉత్పత్తి కారకాల మార్పిడి పారిశ్రామిక దేశాలకు లాభసాటిగా ఉండును.

## 4.5. విదేశీ వ్యాపారంపై ఆర్థికాభివృద్ధి ప్రభావాలు

విదేశీ వ్యాపారం ఆర్థికాభివృద్ధి పరస్పర సంబంధము గలవి. ఈ విభాగంలో ఒక దేశ ఆర్థిక వ్యవస్థ విదేశీ వ్యాపారంతో ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నపుడు ఆ వృద్ధి ప్రభావాలు ఆ దేశ అంతర్జాతీయ వ్యాపారంపై ఎలా ఉంటాయో వివరించడమైనది. ఆర్థికవేత్తల అభిప్రాయంలో ఆర్థికాభివృద్ధి ప్రభావం వివిధ దేశాల్లో ముఖ్యంగా ఆ దేశ సంక్షేమ స్థాయిపైన మరియు ఉత్పత్తి కారకాల మధ్య జరుగు ఆదాయ పునః పంపిణీ పైనా ఉంటాయని వివరించారు. ఈ విషయంలో వారు ఈ ప్రభావాలు చిన్న దేశాల్లో ఒక విధంగాను పెద్ద దేశాల్లో మరో విధంగాను ఉండే అవకాశాలున్నాయని వివరించారు.


ఆర్థికవృద్ధి - చిన్న దేశాలలో ఆ దేశ సంక్షేమాన్ని, ఉత్పత్తి సాధ్యరేఖను ఎగువకు మార్చుట ద్వారా అధిక స్థాయి సామాజిక ఉదాసీన రేఖను సాధించుట ద్వారా పెంచగలదు. కాని పెద్ద దేశాలలో కాలానుగుణంగా వచ్చు ఆర్థికవృద్ధి ఆ దేశ విదేశీ వ్యాపార పరిమాణంలోనూ తద్వారా ఆ దేశాలకు అంతర్జాతీయ మార్కెటులో గల వర్తక నిబంధనలను ప్రతికూలంగా లేదా అనుకూలముగాను మార్పులు తీసుకువచ్చును. అందువల్ల ఆ దేశాలకు వృద్ధి సంక్షేమాన్ని తప్పక తీసుకురాగలదని చెప్పవచ్చు. అయితే ఏ పెద్ద దేశాలు వాని వృద్ధి ద్వారా విదేశీ వ్యాపారాన్ని నియంత్రించుకోగలవో వాటికి మాత్రమే ఈ విషయం వర్తిస్తుంది. దీనితో పాటు వర్తక నిబంధనలను ప్రభావితం చేసుకొని అభిలాషణీయ సుంకాలను విధించినట్లయితే సంక్షేమం దృష్ట్యా అది ఆ దేశానికి ఉత్తమ విధానంగా చెప్పవచ్చును. ఈ విధంగా వ్యాపార విధానాలను దేశీయంగాను మరియు అంతర్జాతీయంగాను పటిష్టముగా వినియోగించుట ద్వారా సంక్షేమం విషయంలో ఉత్పన్నమగు సమస్యలను అధిగమించవచ్చును. అదే సమయంలో వివిధ దేశాలు సాధించిన ఆర్థిక వృద్ధి ప్రపంచ శ్రేయస్సును పెంపొందించును. అయితే కొన్ని దేశాలు కనుక వాటి దిగుమతి పోటీ రంగాలను పటిష్ట పరచుట ద్వారా కృత్రిమంగా వృద్ధి సాధించినచో అది ప్రపంచ శ్రేయస్సును ప్రతిఫలాన్ని తగ్గించుట ద్వారా నష్టపడును. ఈ అంశాలను ప్రతిదేశం ఆయా సందర్భాలలో పరిశీలించవలసి ఉంటుంది.

అదే విధంగా వృద్ధి ప్రభావం ఉత్పత్తి కారకాలయిన శ్రమ, మూలధనము మధ్య ఏ విధంగా పంపిణీ అవుచున్నది, ఆ వృద్ధి ఉత్పత్తి కారకాల నిల్వల వలన కలిగినదా లేక సాంకేతిక ప్రగతి ద్వారా సాధించబడినదా అనే అంశాన్ని బట్టి ఉంటుంది. ఎందువల్లనంటే మూలధన నిల్వలున్న చిన్న విదేశీ వ్యాపారం గల దేశాలలో వృద్ధి నిజవేతన రేట్లను పెంచుతుంది. కాని నిజ మూలధన ప్రతిఫలాలను తగ్గిస్తుంది. దీనికి వ్యతిరేకముగా శ్రమ శక్తి ఎక్కువగా ఉన్న దేశాలలో వృద్ధి నిజవేతన రేట్లను తగ్గించి మూలధనంపై రాబడిని పెంచుతుంది. అలాగే రెండు ఉత్పత్తి కారకాలు సమానంగా వున్న దేశాలలో సాధించబడు వృద్ధి ఉత్పత్తి కారకాల నిజరాబడులలో ఎటువంటి మార్పు తీసుకొని రాదని చెప్పవచ్చు. మూలధన సాంద్రత రంగములోని సాంకేతిక ప్రగతి ఎక్కువగా నిజవేతన రేట్లను తగ్గించి నిజమూలధన రాబడుమ పెంచుతుంది. అయితే సాంకేతిక ప్రగతి ప్రభావం ఉత్పత్తి కారకాల రాబడులపై ఏ విధంగా ఉంటుంది మరియు ఆ సాంకేతిక ప్రగతి ఏ కారణంగా వచ్చిందనే దానిపై ఆధారపడి ఉంటుంది. మరో వైపు దీనికి వ్యతిరేకంగా శ్రమ సాంద్రత రంగంలో నెలకొనిన సాంకేతిక ప్రగతి నిజవేతనాలను పెంచి మూలధన నిజరాబడులను తగ్గిస్తుంది. కాని సాధారణంగా సాంకేతిక ప్రగతి మూలధన సాంద్రత రంగంలో త్వరగా వచ్చుటకు అవకాశం ఉంది. కావున అది వేతనాలను పొందే వారి అవకాశాలను తగ్గించుటకు అవకాశం ఉంది.

**4.5.1. ఉత్పత్తి వినియోగ ప్రభావాలు :** ఏ రకయిన ఆర్థికవృద్ధి అయిననూ కొన్ని ప్రత్యేక పరిస్థితులలో ఆ దేశ విదేశీ వ్యాపార పరిమాణమును పెంచు ప్రభావమును కలిగి ఉంటుంది. విదేశీ వ్యాపారము పెరుగుదల లేక తరుగుదల అనునది ఉత్పత్తి సాధ్య రేఖలో వచ్చు మార్పు స్వభావాన్ని బట్టి ఆదాయాల మార్పు వల్ల కలుగు వినియోగ ధోరణులను బట్టి ఆధారపడుతుంది. అదే విధంగా ఆ దేశ విదేశీ వ్యాపారంలో వచ్చు మార్పు ఆ దేశ అంతర్జాతీయ వర్తక నిబంధనలను ఏ విధంగా ప్రభావితం చేస్తుందనే ప్రధాన విషయాన్ని

పరిగణించవలసి ఉంటుంది. ఒక దేశ ఉత్పత్తి సాధ్యరేఖను వర్తక విబంధవల రేఖ ఖండించు చోట ఆ దేశ ఉత్పత్తి నిర్ణయింపబడుతుంది. అదే విధముగా ఉత్పత్తి సాధ్యరేఖను సామాజిక ఉదాశీన వక్రరేఖ ఖండించిన చోట ఆ దేశ వినియోగస్థాయి నిర్ణయింపబడును. ఉత్పత్తి వినియోగస్థాయిల మధ్యగల అంతరమును బట్టి ఆ దేశ ఎగుమతుల దిగుమతుల పరిమాణము నిర్ణయింపబడుతుంది. దేశీయ వృద్ధి వలన సాధారణంగా ఉత్పత్తి సాధ్యరేఖ ఎగువకు మారును. అది వివిధ వస్తువుల యెడల ఒకే రకమయిన సమాంతరముగా మారినచో ఆ దేశ ఉత్పత్తి స్థాయి, వినియోగస్థాయిలో కలుగు మార్పు సమాంతరంగా ఉండుటవల్ల వృద్ధి అనంతరం ఆ దేశ ఎగుమతి దిగుమతుల పరిమాణము ఒకే మోతాదులో మార్పవచ్చును. ఈ పరిస్థితివి విదేశీ వ్యాపారముపై వృద్ధికి తటస్థ ప్రభావము కలదిగా చెప్పవచ్చును. అలాకాకుండా వృద్ధి వలన ఉత్పత్తి సాధ్యరేఖ ఎగువకు మారినపుడు ఒక వస్తువు ఎడల ఎక్కువ పరిమాణంలోనూ మరొక వస్తువు ఎడల తక్కువ రేటులో మారినచో ఉత్పత్తి వినియోగస్థాయిలు వివిధ రేట్లలో మారుటవల్ల ఆ రకమైన వృద్ధి అంతరము ఎగుమతుల దిగుమతుల పరిమాణంలో వచ్చు మార్పు వేరువేరుగా ఉండుటవల్ల వృద్ధి ప్రభావం విదేశీ వ్యాపారంపై అనుకూలంగా గాని, ప్రతికూలంగా గాని ఉండవచ్చు. ఈ విధమైన మార్పు వల్ల ఆ దేశ వృద్ధి దశలలో దిగుమతి ప్రత్యామ్నాయ ఉత్పత్తి పెరిగినచో అది విదేశీ వ్యాపారంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. అలాకాకుండా దిగుమతి ప్రత్యామ్నాయ వస్తు ఉత్పత్తి తగ్గినచో ఆ వృద్ధి ప్రభావం విదేశీ వ్యాపారంపై అనుకూలంగా ఉండును. ఉత్పత్తిలో వచ్చు పెరుగుదల ప్రభావం ఆ దేశ విదేశీ వ్యాపారంపై ఏ ఏ రకాలుగా ఉన్నదో ఈ క్రింది పటము తెలియజేస్తుంది.


పటము




పై పటము నందు 'p' బిందువు వద్ద వృద్ధి పూర్వపు ఉత్పత్తి స్థాయిని సూచించును. ఆ బిందువు అనంతరం ఉత్పత్తి సాధ్యరేఖ అదే దిశలో స్థిర సాపేక్ష ధరలలో ఎగువకు జరిగినచో విదేశీ వ్యాపారంపై దాని ప్రభావం తటస్థంగా ఉంటుంది. ఒకవేళ ఉత్పత్తి వృద్ధి 'p' బిందువు తటస్థ రేఖ దిగువకు కేంద్రీకరింపబడినచో ఎగుమతి వస్తువులు పెరుగుతాయి కాని వాటి పెరుగుదల రేటు దిగుమతి ప్రత్యామ్నాయ వస్తురేటు కన్నా తక్కువగా ఉండుటవల్ల అది విదేశీ వ్యాపార ప్రతికూల వృద్ధిని తీసుకువచ్చును. అదే విధంగా ఆ వృద్ధి ఉత్పత్తిలో 'x' అక్షమునకు సమాంతరంగా ఉన్న రేఖ దిగువకు కేంద్రీకరింపబడినచో అచ్చట ఎగుమతి వస్తూత్పత్తులు కూడా క్షీణించి ఆ ఉత్పత్తిలో వృద్ధి విదేశీ వ్యాపారంపై తీవ్ర ప్రతికూలతను చూపుతుంది. అదే విధంగా ఉత్పత్తిలో వృద్ధి తటస్థ రేఖ ఎగువకు కేంద్రీకరింపబడినచో అచ్చట ఎగుమతుల వృద్ధిరేటు దిగుమతుల ప్రత్యామ్నాయ వస్తు ఉత్పత్తి రేటు కన్నా ఎక్కువగా ఉంటుంది. కావున విదేశీ వ్యాపారమునకు ఆ వృద్ధి

అనుకూలముగా ఉంటుంది. అదే ఉత్పత్తిలో వృద్ధి 'Y' అక్షమునకు సమాంతరంగా ఉన్న రేఖకు ఎగువ కేంద్రీకరింపబడి ఉన్న యెడల ఆ వృద్ధి వలన దిగుమతి ప్రత్యామ్నాయ వస్తు ఉత్పత్తి రేటు తగ్గి అది విదేశీ వ్యాపారమునకు తీవ్ర అనుకూలతను చేకూర్చును.

అదే విధంగా ఈ దిగువ పటము వినియోగ వృద్ధి ప్రభావము ఆ దేశ విదేశీ వ్యాపారంపై ఏఏ రకాలుగా ఉంటుందో తెలుపుతుంది.




పటంలో 'C' బిందువు వృద్ధి పూర్వపు వినియోగస్థాయిని సూచిస్తుంది. వృద్ధి అనంతర వినియోగ బిందువులు 'C' బిందువును అనుసరించి అదే మార్గములో వెళ్ళినట్లయితే దాని ప్రభావం విదేశీ వ్యాపారంపై తటస్థంగా ఉంటుంది. వినియోగ బిందువు తటస్థ రేఖకు దిగువకు కేంద్రీకరింపబడి ఉన్నచో అది విదేశీ వ్యాపారంపై తటస్థ ప్రభావాన్ని చూపుతాయి. ఆ బిందువులు 'X' అక్షానికి సమాంతరముగా గల రేఖ దిగువకు కేంద్రీకరింపబడినచో విదేశీ వ్యాపారంపై తీవ్ర ప్రతికూలతను సూచిస్తుంది. అలాగే తటస్థ రేఖకు ఎగువకు కేంద్రీకరింపబడిన వినియోగ బిందువులు విదేశీ వ్యాపారంపై అనుకూలతను వివరిస్తుంది. ఆ బిందువులు 'Y' అక్షానికి సమాంతరంగా గల రేఖకు ఎగువకు వెళితే అవి విదేశీ వ్యాపారంపై తీవ్ర అనుకూలతను సూచిస్తుంది. సాధారణంగా రెండూ కలసి సంయుక్తంగా వృద్ధి ప్రభావం విదేశీ వ్యాపారంపై ఎలా ఉంటుందో తెలయజేస్తాయి. కాని దురదృష్టవశాత్తూ ఉత్పత్తి, వినియోగాలు రెండూ కలసి అవి ఏ విధంగా విదేశీ వ్యాపారంపై మొత్తము ప్రభావం చూపుతాయో తెలియజేయు సాధారణ సూత్రాలు ఏదీ రూపొందించలేదు. కాని పై అంశాల వల్ల తెలిసినదేమనగా ఉత్పత్తి వృద్ధి వల్ల వచ్చు వ్యాపార ప్రభావం ఒక దానితో మరొకటి ఉపసంహరింప చేసుకుంటాయి. వృద్ధి అనంతర ఉత్పత్తి, వినియోగ ప్రభావాలు విభిన్నంగా ఉన్నపుడే వాని మొత్తం ప్రభావం విదేశీ వ్యాపారంపై స్పష్టముగా ఉంటుంది.


**4.5.2. సాంకేతికాభివృద్ధి ప్రభావాలు :** వివిధ దేశాల యొక్క అభివృద్ధి దశల పరిణామ క్రమంలో ఆయా దేశాల వ్యవసాయ పారిశ్రామిక రంగాలలో కాలానుగుణంగా సాంకేతిక ప్రగతిలో కలుగు ప్రభావం విదేశీ వ్యాపారంపై ఏ విధంగా ఉంటుందనే అంశాన్ని ముఖ్యమయినదిగా ఆర్థికవేత్తలు భావించారు. వీరిలో నవ్య సాంప్రదాయవాదులు ముఖ్యులు. కాని వీరు ఒకే రకమయిన ఉత్పత్తి కారకాల వృద్ధి జనాభా పెరుగుదలను పరిగణించారేగాని ఆర్థిక ప్రగతికి సాంకేతికాభివృద్ధికి ప్రాధాన్యతను తెలియజేయుటలో విఫలమయ్యారని 'విక్సెల్' మహాశయుడు పేర్కొనడం జరిగింది. అయితే ప్రపంచ దేశాల్లో వివిధ రంగాల్లో కలుగు సాంకేతిక ప్రగతి ప్రభావం విదేశీ

వ్యాపారంపై ఏ విధంగా ఉంటుందో తెలియజేయుటకై 'హిక్స్' మహాశయుడు సాంకేతిక ప్రగతిని వివిధ రకాలుగా విభజన చేయడం జరిగింది. ఈయన ఉద్దేశంలో సాంకేతిక ప్రగతిని క్రింది విధంగా వివరించాడు. శ్రమ పొదుపు చేయు సాంకేతిక ప్రగతి మూలధన, పొదుపు చేయు సాంకేతిక ప్రగతి, మరియు తటస్థ సాంకేతిక ప్రగతిగా విభజించి ఒక్కొక్క రకపు సాంకేతిక ప్రగతి వివిధ ఉత్పత్తి కారకాలు ఉపయోగించు పరిశ్రమలపై ఏ విధంగా ఉంటుందో పరిశీలించారు. ముఖ్యంగా సాంకేతిక ప్రగతి ప్రభావం శ్రమ సాంద్రత రంగముపై మూలధన సాంద్రతపైన ఎలా ఉంటాయో వివరించి వాని ప్రభావం విదేశీ వ్యాపారముపై ఏ విధంగా ఉంటుందో తెలియజేసారు. సాంకేతిక ప్రగతిని మూలధన రంగంలోకి మార్చినట్లయితే వాస్తవ వేతన రేట్లను తగ్గించి మూలధన రాబడులను పెంచుటకు వీలు కలుగుతుంది. అటువంటి సందర్భాలలో దాని ప్రభావం విదేశీ వ్యాపారముపై ఒక రకంగా ఉంటుంది. అదే సాంకేతిక ప్రగతి శ్రమ సాంద్రత రంగంలో వచ్చినచో అది వాస్తవ వేతనాలను పెంచి మూలధన రాబడులను తగ్గిస్తుంది. అపుడు దాని ప్రభావం విదేశీ వ్యాపారంపై మరో రకంగా ఉంటుంది. అందువల్ల సాంకేతిక ప్రగతి ప్రభావం విదేశీ వ్యాపారముపై ఏ విధంగా ఉంటుందనేది ఆ దేశాలలో ఉత్పత్తి కారకాల లభ్యత మరియు ఆ దేశాలలో కలిగిన సాంకేతిక ప్రగతి స్వభావంపై ఆధారపడి ఉంటాయని చాలా మంది ఆర్థికవేత్తలు తమ అభిప్రాయాలను వెల్లడించారు.

పైన పేర్కొన్న విధంగా విదేశీ వ్యాపారముపై ఆర్థికాభివృద్ధి ప్రభావం ఏ విధంగా ఉంటుందో తెలుసుకోవాలనుకున్నపుడు అన్ని అంశాలను సంయుక్తంగా పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుంది. అనగా ఒక దేశ అభివృద్ధి పరిణామ క్రమంలో వివిధ దశల యందు కలుగు ఉత్పత్తి, వినియోగము, దాని విదేశీ వ్యాపార పరిణాము, అంతర్జాతీయ వర్తక నిబంధనలు ఉత్పత్తి కారకాల లభ్యత వివిధ రంగాల్లో కలుగు సాంకేతిక ప్రగతి మొదలైన అంశాలన్నిటిలో కలుగు సాంకేతిక ప్రగతి మున్నగు అంశాలన్నిటిలో కలుగు పరిణామాలన్నీ విశ్లేషించవలసి ఉంటుంది. ఈ అంశాలన్నీ కలసి సాధారణంగా ఆ దేశ వృద్ధి విదేశీ వ్యాపారమునకు అనుకూలముగా ఉన్నదా లేక ప్రతికూలముగా ఉన్నదా నిర్ణయించుట జరుగుతుంది. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొన్నట్లయితే ఆర్థిక వృద్ధి ప్రభావాలను తెలుసుకొనుట సులభతరం గాను, అనుకూలంగాను ఉంటుంది.

## 4.6. విదేశీ వ్యాపారము - అదృశ్యమగు వృద్ధి భావన :

ఇంతవరకు చర్చించిన విదేశీ వ్యాపారంపై వృద్ధి ప్రభావాలు సాపేక్ష ధరలలో ఎటువంటి మార్పు ఉండదను ప్రమేయంపై వివరించారు. ఈ ప్రమేయం చిన్న దేశాల విషయంలో వాస్తవం కావచ్చు. ఎందుకనగా ఈ దేశాల్లో ఏ రకమయిన వృద్ధి అయినా పెరుగుచున్న దేశానికి శ్రేయస్సును పెంచుతుంది. అదే వృద్ధి చెందుతున్న పెద్ద దేశమయినట్లయితే దాని వ్యాపార పరిమాణం తగ్గినచో లేదా సుంకాల వల్ల ఆ దేశ వర్తక నిబంధనలు అనుకూలంగా మారి శ్రేయస్సును పెంచుతాయి. ఆ దేశాలలో వృద్ధి పెరిగినచో వ్యాపార పరిమాణం పెరిగి వర్తక నిబంధనల ప్రతికూలత మారి అవి శ్రేయస్సు ప్రతిఫలాలను తగ్గిస్తాయి. కొన్ని పరిస్థితుల వల్ల వర్తక నిబంధనలు వృద్ధి చెందుతున్న దేశాలకు శ్రేయస్సు తగ్గటంతో ఈ వైపరీత్యాన్ని అదృశ్యమాన శక్తిగా 'భగవతి' అను ఆర్థికవేత్త 1955 లో వివరించాడు. (ఈయనకు ముందే 1894 లోనే ఎడ్జ్‌వర్త్ అను ఆర్థికవేత్త ఈ భావనను వివరించాడు). ఈ దిగువన గల పటము అదృశ్యమాన వైపరీత్యాన్ని సూచిస్తుంది.




పెద్ద దేశాలలో కలుగు అదృశ్యవృద్ధి

పై పటము నందు వృద్ధి పూర్వపు ఉత్పత్తి రేఖ (QQ) ను వర్తక నిబంధనల రేఖ (W W) P బిందువు వద్ద ఖండించిన చోట ఉత్పత్తి నిర్ణయింపబడింది. అలాగే ఉదాసీనతా వక్రరేఖ (I) వర్తక నిబంధనల రేఖ (W W) ను C బందువు వద్ద ఖండించిన దగ్గర వినియోగస్థాయి నిర్ణయింపబడింది. కాలానుగుణంగా వచ్చిన ఆర్థిక వృద్ధి ఉత్పత్తి సాధనరేఖ ($Q_1$ $Q_1$) ఎగువకు పయనించుట అనునది పెద్ద దేశాల విషయంగా జరుగగా ఆ దేశానికి ఎగుమతులు పెరిగి ప్రపంచ మార్కెటులో దాని ఎగుమతి వస్తు ధరలు తగ్గునని భావించాలి. అదే సమయంలో ఆ దేశ దిగుమతి ధరలు పెరుగుతాయి. అయితే మొత్తంమీద ఆ దేశ నిబంధవల రేఖ $W_1$ $W_1$ వాలు పడిపోవుటను పటంలో గమనించవచ్చు మారిన వర్తక నిబంధనల వల్ల ఆ దేశ ఉత్పత్తి $P_1$ వద్ద వినియోగం $I_0$ ఉదాసీనతా రేఖపై $C_1$ వద్ద నిర్ణయింపబడుతుంది. వృద్ధి అనంతరం ఆ దేశ విదేశీ వ్యాపారంలో కలిగిన పరిణామాల వల్ల అది కోల్పోయిన సంక్షేమమును ఉదాసీన వక్రరేఖ $I_1$ నుండి $I_0$ కు దిగువకు మారుటవల్ల ఉత్పత్తి సాధ్యరేఖ ఎగువకు మారిననూ సంక్షేమాన్ని కోల్పోవడం జరుగుతుంది. కావున ఈ రకమయిన పరిణామాన్ని అదృశ్యమగు వృద్ధిగా పరిగణిస్తారు.

దీన్ని బట్టి మనం ఒక విషయాన్ని గమనించగలం. విదేశీ వ్యాపారానికి ప్రతికూలము ఉన్న వృద్ధి కూడా స్థిర ధరలలో ఆ దేశ వ్యాపారమును పెంచును. కావున ఆ దేశమునకు వర్తక నిబంధనలు వ్యతిరేకంగా మారును. కేవలం విదేశీ వ్యాపార ప్రతికూల వృద్ధి మాత్రమే విదేశీ వ్యాపారమును తగ్గించును. కావున సంక్షేమం పెరుగుటయే కాక దాని వర్తక నిబంధనలు వృద్ధి చెందును. ఏమైనప్పటికీ మిత్ర విదేశీ వ్యాపార వృద్ధి తప్పనిసరిగా వర్తక నిబంధనలు ప్రతికూలము చేయునని చెప్పలేము కాని కొంతవరకూ సంక్షేమం ఈ అంశాలన్నీ దేశీయంగాను ప్రపంచదేశాలలో గల సప్లయి మరియు డిమాండు పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు ఏ దేశంలోనైనా ఎగుమతులకు అవ్యాకోచ సప్లయిగాని అవ్యాకోచ డిమాండుగాని ఉంటే ఆ దేశ వర్తక నిబంధనలను క్షీణింపజేస్తుంది. అయితే అదృశ్య వృద్ధికి గల ప్రధాన కారణం - ఆ దేశంలో వృద్ధి పెరుగుదల కాక ఆ దేశానికి ప్రపంచ మార్కెటులో ఏకస్వామ్య శక్తి ఉండుటగా గుర్తించుకోవాలి. ఎందుకంటే ఒక పెద్ద దేశం ఎల్లపుడూ వృద్ధి నుండి ప్రయోజనం పొందుతుంది. అందుకుగాను ఆ దేశం మారిన పరిస్థితులకు అనుగుణంగా దాని సుంకాల విధానాన్ని అభిలాషణీయంగా తీర్చిదిద్దుకోవలసి ఉంది.

ఈ సిద్ధాంతం ఆర్థిక విస్తరణ ద్వారా వచ్చు విదేశీ వ్యాపారం అల్పాభివృద్ధి దేశాలలో స్వల్పకాలంలో త్వరితంగా క్షీణించే వర్తక నిబంధనలు ఆ దేశాలకు నష్టాన్ని ఎలా కలుగజేస్తాయో ఆయా దేశాలలో వాస్తవ ఆదాయాల పెరుగుదలను ఏ విధముగా హరించివేస్తాయో తెలియచేయుచున్నది. 'భగవతి' మహాశయునిచే చెప్పబడిన ఈ సిద్ధాంతాన్ని 'హరీజాన్సన్' మరో కోణంలో ప్రతిపాదించడం జరిగింది. ఈయన ఉద్దేశంలో విదేశీ వ్యాపారమును శాశించు ఏకస్వామ్య శక్తిగల చిన్న అల్పాభివృద్ధి దేశాలలో కలుగు సాంకేతిక వృద్ధి వల్ల ఏర్పడు పరిస్థితుల వల్ల సామాజిక శ్రేయస్సు అభివృద్ధి మొదటి దశలో ఉన్నటువంటి స్థాయి కన్నా దిగువకు పడిపోతుంది. ఈ దేశాల దిగుమతులను నిలువరించి పరిశ్రమల స్థాపన వివిధ సుంకాల వలన రక్షణ పొందినపుడు సామాజిక శ్రేయస్సు దానిని వృద్ధి అనంతర విదేశీ వ్యాపారం వల్ల క్షీణించునని తెలియజేసెను.

ఏది ఏమైనప్పటికీ పైన వివరించిన సిద్ధాంతాలు కూడా కొన్ని అవకతవకల వలన ఏర్పడిన పరిస్థితులను మాత్రమే సూచిస్తాయి. కేవలం విధాన వైపరీత్యముల పరిస్థితులలో కలుగు ప్రతికూల పరిణామాలను మాత్రమే తెలియజేస్తున్నాయని విమర్శలకు లోనయినవి.

## 4.7. విదేశీ వ్యాపారము - రవాణా ఖర్చులు

ఒక దేశ విదేశీ వ్యాపార వృద్ధిలో పెరుగుదల లేదా తరుగుదల అనునది అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది. వివిధ సిద్ధాంతాలను మరియు వాస్తవంగా వివిధ దేశాల యొక్క విదేశీ వ్యాపార పరిస్థితులను గమనించినట్లయితే ఒక్క అంశం ఈ వ్యాపారాన్ని ప్రత్యేకంగా ప్రభావితం చూపుతుందని తెలుపుట కష్టం. ఉత్పత్తి కారకాలు దేశాల మధ్య గమనశీలతను కలిగి ఉంటాయి. ఉత్పత్తి కారకాలు మాత్రమే కాక విదేశీ వ్యాపారంలో ఉత్పత్తుల ఎగుమతులూ ఉంటాయి. ఉత్పత్తి కారకాలలో లభ్యత, ఉత్పత్తి పద్ధతులు, ఉత్పత్తి స్థాయి (సప్లయి), మరియు ఆ వస్తువుకు గల డిమాండు అంతర్జాతీయ మార్కెటును సృష్టిస్తాయి. వీటితో పాటుగా విదేశీ వ్యాపారాన్ని ప్రభావితం చేసే అంశం మరొకటి కలదు. అదే రవాణా ఖర్చులు. దేశాల మధ్య దూరం పెరిగే కొలదీ ఇతర దేశానికి వస్తు సేవలను రవాణా చేయుటకు అయ్యే ఖర్చులు పెరుగుతాయి. ఈ ఖర్చులు పెరిగే కొలదీ అంతర్జాతీయ వ్యాపారానికి ఆటంకంగా పరిణమిస్తాయి. అంతేకాక కొన్ని వస్తువులు రవాణా ఖర్చులు ఎక్కువ కావడం వల్ల వ్యాపారానికి పనికి రాకపోవచ్చు.

అభివృద్ధి చెందుతున్న దేశాలలో వస్తు ఉత్పత్తి అభివృద్ధి చెందిన దేశాలకన్నా భిన్నంగా దేశీయంగా చౌకగా లభించి ఉత్పత్తి కారకాలతో ఉత్పత్తిని తక్కువ వ్యయాలకు చేయగలిగినప్పటికీ రవాణా ఖర్చులు అధికంగా ఉంటే ఎగుమతులు సాధ్యం కాకపోవచ్చు. అంతేకాక దిగుమతి చేసుకునే వస్తువులపై కూడా రవాణా ఖర్చులు అధికంగా ఉంటే ఎగుమతులతో పాటు దిగుమతులు సాధ్యం కాక దేశీయ ఉత్పత్తులలో మార్పులు సంభవించి వస్తు విక్రమం మార్కెటునకే పరిమితమవుతుంది. రవాణా ఖర్చులు ఉండుటవల్ల ఎగుమతులు దిగుమతులు సాధ్యం కాక స్వదేశీ మార్కెటులో మాత్రమే ఉండటానికి వీలయ్యే వస్తువులు కూడా ఉంటాయి. అంటే ఉత్పత్తి వ్యయాల్లో తేడా రవాణా ఖర్చు కన్నా ఎక్కువగా ఉన్నపుడే ఆ వస్తువులు విదేశీ వ్యాపారంలో ప్రవేశిస్తాయి. రవాణా ఖర్చుల ఆధారంగా ఎగుమతి స్థానం, దిగుమతి స్థానాలకు నిర్ణయిస్తారు. అంతర్జాతీయంగా రవాణా విధానంలో వస్తున్న మార్పులు విదేశీ వ్యాపారంపై అనుకూల ప్రభావాలతో పాటుగా ప్రతికూల ప్రభావాలు ఉన్నాయి.

## 4.8. విదేశీ వ్యాపారంలో ఏకస్వామ్య ధర విచక్షణ - డంపింగ్ (మూల్యమ్యావీకరణ విక్రయం)


అంతర్జాతీయ స్వేచ్ఛా వ్యాపారం సంపూర్ణమైన పోటీ పరిస్థితుల్లో వస్తువునకు ఒకే ధర నిర్ణయింపబడుతుంది. ఈ ధరను మార్చే శక్తి ఏ ఒక దేశానికి లేదా ఉత్పత్తిదారునికి ఉండదు. అటువంటి సందర్భాలలో ఏర్పడిన పోటిలో నిలబడలేని దేశాలు ఆ వ్యాపారం నుంచి తొలగించడం జరుగుతుంది. అంతర్జాతీయ వ్యాపారంలో ఏకస్వామ్యదారుడు (వ్యక్తి / సంస్థ / దేశం) ప్రత్యేకమయిన విధానాన్ని అనుసరిస్తాడు. అంతర్జాతీయ పోటీని ఎదుర్కొనుటకు దేశీయ ఉత్పత్తిదారులందరూ ఏకస్వామ్యంగా ఏర్పడి ధర నిర్ణయంలో విచక్షణను పాటిస్తారు. దేశీయంగా ఉత్పత్తులకు ఎక్కువ ధరను నిర్ణయించి వినియోగదారులకు విక్రయించి విదేశీ వినియోగదారులకు తక్కువ ధరలకు వస్తువులను అమ్మడం జరుగుతుంది. అంతర్జాతీయ మార్కెటులో పోటీ నుంచి రక్షణకు డంపింగ్ విధానాన్ని అనుసరిస్తారు. అనగా విదేశాల్లో తక్కువ

ధరకు దేశీయంగా ఎక్కువ ధరకు వస్తు మూల్యన్యూనీకరణ ద్వారా విక్రయం జరుపుతారు. ఈ విధానంలో ఆ వస్తువుల ధరలలో వ్యత్యాసం చూపటం జరుగుతుంది. దీనివల్ల విదేశాల్లో వస్తు డిమాండు పెరుగుతుంది. విదేశీ డిమాండు వ్యాకోచత్వం ఎక్కువగా ఉండటం వల్ల తక్కువ ధరకు ఎక్కువ మొత్తం అమ్మటం దేశీయ డిమాండు వ్యాకోచత్వం తక్కువగా ఉండుటవల్ల దేశంలో ధర ఎక్కువగా ఉండి తక్కువ మొత్తంలో అమ్మడం వల్ల మొత్తం లాభాలు, సరాసరి ధర కూడా ఎక్కువ అవుతాయి. ఈ విధంగా ఏకస్వామ్య ధర విచక్షణను మూల్యన్యూనీకరణ (డంపింగ్) ద్వారా విదేశీ వ్యాపారంలో అనుసరించడం జరుగుతుంది.

విదేశీ వ్యాపారం దేశీయ మార్కెటు వ్యవస్థ స్వరూప స్వభావాలపై వివిధ ప్రభావాలు చూపుతాయి. ఉదాహరణకు ఒక వ్యాపార దేశంలో ఏకస్వామ్య పోటీ మార్కెటు ఉన్నట్లయితే విదేశీ వ్యాపారం అనుసరించిన తరువాత దేశీయ మార్కెటు పోటీ మార్కెటుగా పరిగణించవచ్చు. ముఖ్యంగా చిన్న, మధ్యతరగతి దేశాల మార్కెట్లపై ఈ విదేశీ వ్యాపార ప్రభావం చాలా ఎక్కువగా ఉంటుంది. విదేశీ వ్యాపారం వల్ల ఆ దేశాల్లో ఉన్న ఏకస్వామ్య పరిస్థితులు మారిపోవచ్చు. ముఖ్యంగా ఏకస్వామ్య పరిస్థితులు పరిమితస్వామ్య మార్కెటు కలిగి ఉన్న దేశాలు విదేశీ వ్యాపారం అనుసరించినపుడు ఒక్కొకసారి డంపింగ్ విధానాలను అనుసరించుట వల్ల అవి దేశీయ మార్కెట్లపై ప్రభావం చూపును.

మూల్యన్యూనీకరణ లేదా డంపింగ్ పరిస్థితులు ఏర్పడుటకు ప్రధానంగా 2 కారణాలను వివరిస్తారు. దేశీయ మార్కెటులో ఏకస్వామ్య పరిస్థితులకు తక్కువ వ్యాకోచ డిమాండు పరిస్థితులు కలిగి ఉండి విదేశీ డిమాండు విదేశీ మార్కెటులో ఎగుమతులకు అధిక వ్యాకోచ డిమాండు ఉన్నపుడు మరియు రక్షణాత్మక వ్యాపార విధానాల వల్ల దేశీయంగా ఏకస్వామ్య పరిస్థితులు ఏర్పడినపుడు

**పటము**




పై పటంలో ఎగుమతిదారునకు దేశీయంగా ఏకస్వామ్య పరిస్థితులుండుట వల్ల నెలకొని ఉన్న డిమాండు రేఖ $AD_H$ కాగా ఉపాంత రాబడి రేఖ $MR_H$ గా చూపబడింది. అంతర్జాతీయ మార్కెటులో ఈ ఎగుమతిదారునకు ధరను ప్రభావితం చేసే శక్తి లేదు కాబట్టి అక్కడ నెలకొని ఉన్న ధరనే ఇతను (ఎగుమతిదారుడు) పాటించాలి. అటువంటి సమయంలో అతని డిమాండు మరియు ఉపాంతరాబడి రేఖగా

X అక్షంనకు సమాంతరంగా ఉన్న $P_1D_1$ రేఖను పేర్కొనవచ్చును. ఉత్పత్తిదారునకు విదేశీ మార్కెటులో అంతగా లాభాలు లేనందున దేశీయ మార్కెటు నుండి ఎక్కువ లాభాలు పొందడానికి $OQ_3$ ఉత్పత్తిని అమ్మును. విదేశీ వ్యాపారం ఆరంభమయిన తరువాత రెండు మార్కెట్లను లాభాలను గరిష్టం చేసుకొనుటకు ఉపాంత వ్యయం మరియు ఉపాంత రాబడులను రెండు మార్కెట్లలో సమానంగా ఉండేటట్లు చేస్తాడు. మొత్తం ఉత్పత్తి $OQ_2$ ను దేశీయ మార్కెటులో $P_1$ కన్నా ఎక్కువ ధర $P_4$ ను అనుసరిస్తాడు. ఆ ధర వద్ద దేశీయ మార్కెటులో అతను $OQ_1$ ఉత్పత్తిని అమ్మి $Q_1Q_2$ ను విదేశీ మార్కెటుకు ఎగుమతి చేస్తాడు. దీనివల్ల డంపింగ్ వల్ల దేశీయ విదేశీయ ధరల మధ్య వ్యత్యాసాన్ని ఉత్పత్తిదారుడు లాభసాటిగా మలచుకోగలడని అర్థం చేసుకోవచ్చు. విదేశీ ధరలు పెరుగుచున్నంత కాలం డంపింగ్ లాభసాటిగా ఉండును. దేశీయంగా డంపింగ్ విధానం శుద్ధ ఏకస్వామ్య పరిస్థితులతో పాటు పరిమితస్వామ్య మరియు ఏకస్వామ్య పరిస్థితులలో కూడా అనుసరించుటకు అనువయిన విధానంగా చెప్పవచ్చు.

**పరిమితులు :**

డంపింగ్ వల్ల ఉద్రేక పూరితమైన పరిస్థితులను దేశీయ మార్కెట్లో ఏర్పడవచ్చు. దేశీయ వినియోగదారుడు అధిక ధర భరించుట వల్ల విదేశీ ధర తక్కువగా ఉండుట వల్ల కోపం రావచ్చు. 1960 దశకంలో జపాన్ దేశంలో దేశీయ సంస్థలు T.V. ధరల విషయంలో విచక్షణకు వినియోగదారులు నిరసన తెలిపారు. అంతేకాక ఒక్కొకసారి విదేశీ ప్రభుత్వాలు ఉత్పత్తిదారులు ప్రతిస్పందిస్తారు. విదేశీ ప్రభుత్వాలు, వినియోగదారులు డంపింగ్‌ను ఆహ్వానించినా దీనిని వారు ఒక అస్థిర పరిస్థితిగా ఊహిస్తారు. ఈ విధానాన్ని వస్తు విభిన్నత కలిగి ఉన్నపుడు వివిధ దేశాలు వివిధ రకాలుగా అనుసరిస్తాయి.

## 4.9. సారాంశము :

విదేశీ వ్యాపారం ఆర్థికాభివృద్ధి అనునవి పరస్పరం ఆధారపడి ఉంటాయని ఒక దాని వల్ల మరొకటి ప్రభావితమవుతాయని పైన చర్చించిన వివిధ అంశాలనుబట్టి తెలుస్తుంది. విదేశీ వ్యాపారంలో సంభవించు పరిణామాలు ఆ దేశ వివిధ రంగాలను దాని వృద్ధి రేటును పెంచుతుంది. అయితే వివిధ ఆర్థికవేత్తల అభిప్రాయంలో అనుకూల ప్రతికూల అంశాలు రెండూ వివరించినప్పటికీ సంప్రదాయ, నవ్య సాంప్రదాయ వాదులు విదేశీ వ్యాపారాన్ని దేశ ఆర్థిక వ్యవస్థకు సమర్థవంతమైన వృద్ధి యంత్రంగా పనిచేస్తుందని వివరించారు. అయితే వ్యవస్థావాదులు విదేశీ వ్యాపారం ఆర్థిక వ్యవస్థపై ముఖ్యంగా తృతీయ ప్రపంచదేశాల యెడల దుష్ప్రభావాలు కలుగజేస్తాయని, అభివృద్ధికి ఆటంకంగా మారుతుందని నిరాశావాదాన్ని ప్రకటించారు. సనాతన మరియు వ్యవస్థావాదుల విదేశీ వ్యాపార వాదనలకు మధ్యేమార్గంగా ఆధునిక ఆర్థికవేత్తలు విదేశీ వ్యాపారం ఆర్థికాభివృద్ధిపై అనుకూల పరిణామాలు తీసుకురావలెనన్నచో వివిధ దేశాలు దేశీయంగా ఉన్న అడంకులను తొలగించుకొని వాని ఆర్థిక వ్యవస్థలలో ఎగుమతుల మార్గాన వృద్ధి పొందుటకు అనుకూలంగా రూపుదిద్దు కొనినచో విదేశీ వ్యాపారం ద్వారా దేశాలు లాభపడగలవని తెలిపారు.

పారిశ్రామిక విప్లవం తరువాత ఎగుమతుల మార్గన వృద్ధిని విజయవంతంగా సాధించిన నూతన పారిశ్రామిక దేశాలు విదేశీ వ్యాపారం వల్లనే సాధ్యమయిందని చెప్పవచ్చు. ప్రచ్ఛన్న యుద్ధానంతర పరిణామాలు, పారిశ్రామిక దేశాల వస్తువును దేశీయ ధర విచక్షణ విధానమున దేశీయ మార్కెటులో ఎక్కువ ధరకు విదేశీ మార్కెటులో తక్కువ ధరకు అమ్ముటకు అవకాశం ఉంది ఈ విధంగా ఎగుమతుల నుండి వచ్చు రాబడిని కోల్పోకుండా విదేశీ పోటిని తట్టుకొనుటకు ఈ విధమయిన డంపింగ్ విధానాన్ని అనుసరిస్తాయి. ఉదాహరణకు ఒకే రకమయిన ఆహార వస్తువులను ఉత్పత్తి చేసి ఎగుమతి చేసే అధికంగా ఉన్న అభివృద్ధి చెందుతున్న దేశాలమధ్య తీవ్ర పోటీ పరిస్థితులు వస్తు ఎగుమతి మార్కెటులో కలిగిఉన్నాయి. ప్రత్యర్థుల నుండి ఆ తీవ్ర పోటీని తట్టుకొనుటకు వారి మార్కెటు పోకుండా రక్షించుటకు అభివృద్ధి చెందుతున్న దేశాలు ప్రాథమిక వస్తు ఎగుమతుల విషయంలో దేశీయ మార్కెటులో ఎక్కువ ధరకు అమ్మే వస్తువులను విదేశీ మార్కెటులో తక్కువ రేటుకు అమ్మవలసిన పరిస్థితులు ఏర్పడుటను అనుభవ పూర్వకంగా చూస్తున్నాము.

ఏకస్వామ్య పరిస్థితులు గల దేశాల్లో డంపింగ్ విధానం యొక్క వివిధ ప్రభావాలను క్రింది పటం ద్వారా వివరించవచ్చు. ఈ డంపింగ్ విధానమునే ధర విచక్షణకు ఉదాహరణగా అర్థశాస్త్రవేత్తలు పేర్కొందురు. ఎగుమతిదారునకు దేశీయంగా ఏకస్వామ్య పరిస్థితులుండి అంతర్జాతీయ మార్కెటులో సంపూర్ణ పోటీ మార్కెటు పరిస్థితులు ఉన్నపుడు డంపింగ్ విధానమును ఏ విధంగా అనుసరించునో ఈ పటం ద్వారా తెలుసుకోవచ్చు.

బహుళజాతి సంస్థల ప్రపంచవ్యాప్త విస్తరణ, నూతన ప్రపంచీకరణ ధోరణులు ప్రపంచ వాణిజ్య వ్యవస్థ ఆవిర్భావం తదనంతర పరిణామాలన్నీ కలసి విప్లవాత్మక మార్పులు తీసుకవచ్చి మరలా ప్రపంచ వ్యవస్థలో స్వేచ్ఛా వ్యాపార ధోరణులు నెలకొనుటకు సహకరించాయి. ఒకవైపు ప్రపంచ వాణిజ్య విస్తరణ, మరోవైపు వినియోగదారుల శ్రేయస్సు దృష్టిలో ఉంచుకొని ప్రపంచ వాణిజ్య సంస్థ పనిచేయుచున్నది. ఆయా దేశాలలో వృద్ధి ప్రక్రియ ఆ దేశ ఉత్పత్తిలో పెరుగుదల మరియు వినియోగంలో పెరుగుదల స్వభావాలు విదేశీ వ్యాపారంపై గణనీయమైన ప్రభావాన్ని చూపిస్తున్నాయి. వివిధ వాణిజ్య దేశాలలో కలుగు వృద్ధి పరిణామాలు విదేశీ వ్యాపార ధోరణులను ఎలా ప్రభావితం చేస్తాయో నిర్ణయించు వివిధ అంశాల విషయంలో నూతన విషయాలు రోజరోజుకీ వెలికితీస్తూ విదేశీ వ్యాపారంపై విశేషమైన పరిశోధనలను ఆర్థికవేత్తలు కొనసాగిస్తున్నారు. మొత్తం మీద ఒకదేశ విదేశీ వ్యాపారం ఆ దేశ వృద్ధి పై ప్రభావం చూపుతుందని నిస్సందేహంగా చెప్పవచ్చు.

## 4.10. ముఖ్య పదాలు

చలన ప్రయోజనాలు : కాలానుగుణంగా విదేశీ వ్యాపారంలో వచ్చే మార్పుల ద్వారా పొందే ప్రయోజనాలు

మిగులుకు త్రోవ సిద్ధాంతం : స్వేచ్ఛా విదేశీ వ్యాపారం అన్ని వ్యాపార భాగస్వామ్య దేశాలకు ప్రయోజనకరంగా ఉంటుందనే అంశాన్ని తెలుపుతుంది.

విస్తరణ ప్రభావాలు : ఎగుమతులు పెరుగుట వలన దేశీయంగా వివిధ రంగాలపై దీర్ఘకాలంలో కలుగు ధనాత్మక పరిణామాలు.

ప్రతికూల ప్రభావాలు : ఒక కాలంలో కలుగు ధనాత్మక పరిణామాలు విస్తరణ ప్రభావాలైతే విదేశీ వ్యాపారం వల్ల దేశీయంగా దీర్ఘకాలంలో వివిధ రంగాలపై కలుగు దుష్ప్రభావాలు చెడు ప్రభావాలు లేక ప్రతికూల ప్రభావాలు అంటారు.

రవాణా ఖర్చులు : ఎగుమతి మరియు దిగుమతుల ద్వారా వస్తువులను ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి చేరవేయుటకు అయ్యే ఖర్చులు.

అదృశ్యమాన వృద్ధి భావన : కొన్ని పరిస్థితుల వల్ల వర్తక నిబంధనలు అభివృద్ధి చెందుతున్న దేశాలకు శ్రేయస్సు తగ్గించుట జరుగుతుంది. ఈ భావనను అదృశ్యమాన వృద్ధిగా పేర్కొంటారు.

ధర విచక్షణ : వివిధ మార్కెట్లలో పరిస్థితులను బట్టి ఏకస్వామ్యదారుడు వివిధ ధరలను వస్తువుకు నిర్ణయించి విక్రయించుట

డంపింగ్ : విదేశీ వ్యాపారంలో భాగంగా దేశీయంగా ఎక్కువ ధరకు, విదేశాల్లో తక్కువ ధరకు ఒకే రకమయిన వస్తువును ధర నిర్ణయించుట

మూల్య న్యూనీకరణ : ద్రవ్య విలువ లేదా ఒక వస్తువుకు గల వాస్తవ ధరను తగ్గించుటను మూల్య న్యూనీకరణగా పేర్కొంటారు.

## 4.11. స్వయం సమీక్షా ప్రశ్నలు :

1. విదేశీ వ్యాపారం మరియు ఆర్థికాభివృద్ధి గురించి చర్చిస్తూ ఆర్థిక వృద్ధి ప్రభావాలు విదేశీ వ్యాపారం గురించి వ్రాయండి.

2. విదేశీ వ్యాపారం వల్ల కలుగు ప్రయోజనాలను వివరించండి.

3. విదేశీ వ్యాపారంపై వివరించిన జాన్సన్ నమూనాను వివరించుము

4. ఏకస్వామ్య ధర విచక్షణ ద్వారా విదేశీ వ్యాపార పోకడలను వివరించండి మరియు డంపింగ్ విధానం అంతర్జాతీయ వ్యాపారంలో లాభదాయకమా ? చర్చించండి.

## 4.12. చదువవలసిన గ్రంథాలు


1. G.M. Meiem : The International Economics of Development ; Theory and Policy
2. Bo Sodensten and Geoffrey Read : International Economics
3. M.T. Todaro : Economics for a developing world
4. C.P. Kindle Benger : International Economics
5. J.E. Meade : The Balance of Payments
6. David Young : International Economics.


ఆచార్య. యమ్. సుందరరావు

# వర్తక నిబంధనలు - సాంకేతిక ప్రగతి మరియు అంతర్జాతీయ వ్యాపారము - అంతర్జాతీయ మూలధన కదలికలు మరియు అభివృద్ధి

## 5.0 లక్ష్యం :-

అంతర్జాతీయ వర్తకములో వర్తక నిబంధనలు కీలకమైన పాత్ర పోషిస్తున్నాయి. వర్తక నిబంధనలు అభివృద్ధి చెందిన దేశాలకు అనుకూలంగాను, అభివృద్ధి చెందుతున్న దేశాలకు ప్రతికూలంగాను మారుతాయని కొంతమంది శాస్త్రవేత్తల వాదన. అందువలన ఈ పాఠ్యాంశములో వర్తక నిబంధనల యొక్క వివిధ రకాలు, వాటి ప్రయోజనాలు మరియు దీర్ఘకాలంలో వర్తక నిబంధవలలో వచ్చే మార్పులు తెలుసుకుంటాము.

సాంకేతిక ప్రగతి మరియు హిక్స్ యొక్క వర్గీకరణ, సాంకేతిక ప్రగతికి అంతర్జాతీయ వ్యాపారానికి గల సంబంధము కూడా తెలుసుకుంటాము. పై రెండు అంశాలతో పాటు అంతర్జాతీయ మూలధన కదలికలు - ఈ కదలికలను నిర్ణయించే అంశాలు మరియు ఆర్థికాభివృద్ధిలో మూలధన పాత్ర యీ పాఠ్యాంశములో ముఖ్యముగా తెలుసుకోవచ్చు.

## విషయసూచిక :-


5.1 వర్తక నిబంధనలు

- 5.1.1 ఉపోద్ఘాతము
- 5.1.2 వర్తక నిబంధనలు - రకాలు
- 5.1.3 వర్తక నిబంధనల కదలిక
- 5.1.4 దీర్ఘకాలంలో తగ్గుతున్న వర్తక నిబంధనల ఉపకల్పన
- 5.1.5 వర్తక నిబంధనలు - ప్రయోజనాలు

5.2 సాంకేతిక ప్రగతి

- 5.2.1 సాంకేతిక ప్రగతి - వర్గీకరణ
- 5.2.2 హిక్స్ వర్గీకరించిన సాంకేతిక ప్రగతి - రేఖా లేఖనం
- 5.2.3 సాంకేతిక ప్రగతి, అంతర్జాతీయ వ్యాపారము మరియు సంక్షేమము

5.3 అంతర్జాతీయ మూలధన కదలికలు

- 5.3.1 మూలధన కదలిక - రకాలు
- 5.3.2 అంతర్జాతీయ మూలధన కదలికలను నిర్ణయించే అంశాలు
- 5.3.3 ఆర్థికాభివృద్ధిలో అంతర్జాతీయ మూలధన పాత్ర

5.4 సారాంశము

5.5 సాంకేతిక పదాలు

5.6 నమూనా ప్రశ్నలు

5.7 చదువదగిన గ్రంథాలు

## 5.1 వర్తక నిబంధనలు (Terms of Trade):-

**5.1.1 ఉపోద్ఘాతము :-** వర్తక నిబంధనలు ఆర్థికాభివృద్ధి పై అతి ముఖ్యమైన పాత్రను వహిస్తాయి. అభివృద్ధి చెందిన దేశాలకు వర్తక నిబంధనలు అనుకూలముగా ఉండుట వలన విదేశ వ్యాపార చెల్లింపులు అనుకూలముగాను, జాతీయాదాయ పెరుగుదల రేటు ఎక్కువగాను కనిపిస్తుంది. కాని అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఈ వర్తక నిబంధనలు అనుకూలముగా ఉండవు. దీని ఫలితముగా విదేశ వ్యాపార చెల్లింపులు అసమతౌల్యము, జాతీయాదాయము తక్కువగాను ఉంటుంది. అందుచేత రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ఆర్థిక వ్యవస్థలో వచ్చిన కాలనుగుణ మార్పులు ఆర్థికవేత్తలు, విధాన నిర్ణయకర్తలు (Policy Makers) వర్తక నిబంధన ఆవశ్యకతను గుర్తించిరి.

ఒక దేశపు ఎగుమతుల ధరలకు, దిగుమతుల ధరలకున్న నిష్పత్తి విదేశ వ్యాపార వస్తు నిబంధనలు (Commodity terms of trade) తెలియజేస్తుంది. ఈ క్రింది ఉదాహరణ ద్వారా తెలపవచ్చును. 1991 సంవత్సరమును ప్రాతిపదికగా తీసుకొని ఎగుమతుల ధరల సూచిక, దిగుమతుల ధరల సూచిక 100 అనుకొనుము. 2001 సంవత్సరములో ఎగుమతుల ధరల సూచిక 90కి, దిగుమతుల ధరల సూచిక 110కి మారిన యెడల వ్యాపార నిబంధనలలో గల మార్పు

$$TC = \frac{\text{ఎగుమతుల ధరల సూచిక}}{\text{దిగుమతుల ధరల సూచిక}} \times 100$$

$$= \frac{90}{110} \times 100 = 81.82$$

అనగా ఆ దేశమునకు వ్యాపార నిబంధనలు 18 శాతం తగ్గినవి. విదేశ వ్యాపారపు వస్తు నిబంధనలు విదేశ వ్యాపారము నుండి లాభములు కొలుచుటకు ఉపయోగపడుతుంది.

**5.1.2 వర్తక నిబంధనలు - రకాలు :-** వర్తక నిబంధనలు అనగా అంతర్జాతీయ మార్పిడి నిష్పత్తి(International Exchange Ratio) వ్యయ మార్పుల పరిస్థితిని బట్టి, ఉత్పత్తి కారకాల గమనశీలతలో మార్పుల వలన గాని పై రెండు ఫలితాలలో మార్పు వలన వర్తక నిబంధనలు మారుతాయి అని మైర్ (Meier) అభిప్రాయం ప్రకారము వర్తక నిబంధనలు అనే భావనలను మూడు గ్రూపులుగా వర్గీకరించిరి. అవి -

1. వస్తు మార్పిడి నిష్పత్తి (Ratio of Exchange of Commodities) కి సంబంధించినవి. ఖచ్చితమైన వస్తుపరమైన వర్తక నిబంధనలు (Gross Barter) నికరమైన వస్తు వర్తక నిబంధనలు (Net Barter) మరియు ఆదాయ వర్తక నిబంధనలు (Income Terms of Trade) పై అంశాలు అన్ని ఈ గ్రూపు క్రిందకు వస్తాయి.

2. ఉత్పత్తి కారకాల మార్పిడికి సంబంధించినవి. ఒకే ఉత్పాదక వర్తక నిబంధనలు (Single Factoral Terms of Trade) ఉత్పత్తి కారకాల వర్తక నిబంధనలు (Double Factoral) ఈ కోవకు వస్తాయి.

3. ప్రయోజన విశ్లేషణ (Utility Analysis) ఆధారముగా వర్తక నిబంధనలు వలన అధిక వ్యాపార లాభాలు, ఇవి కాకుండా నిజ వ్యయం (Real Cost) ప్రయోజన వర్తక నిబంధనలు, ఒక్కొక్క రకపు వర్తక నిబంధనల భావనము ఒక దేశాన్ని దృష్టిలో ఉంచుకొని ఇంకా విశ్లేషణ చేయవచ్చును.

(A). **నికరమైన వస్తు వర్తక నిబంధనలు (Net Barter (or) Commodity Terms of Trade) :-** ఈ విషయమును ఈ క్రింది విధముగా చెప్పవచ్చును.

$$N = \frac{P_x}{P_m}$$

$N =$ నికరమైన వస్తు వర్తక నిబంధనలు

$P_x =$ ఎగుమతుల ధరల సూచీ సంఖ్య

$P_m =$ దిగుమతుల ధరల సూచీ సంఖ్య

దిగుమతుల పరిమాణము కంటే ఆ దేశము యొక్క ఎగుమతుల పరిమాణం ఎక్కువగా ఉంటే ఏ దేశానికైనా మంచిది. అయితే ధరల సూచిక ఆధారముగా వస్తు వినిమయ రేటు ఆధారపడి ఉంటుంది. కాబట్టి వ్యాపారంలోని వస్తువుల పరిమాణ మార్పిడిలోని వ్యత్యాసాలు ప్రతిబింబించవు.

ఉదా - ఖచ్చితమైన చెల్లింపులు ఖచ్చితమైన వస్తు వర్తక నిబంధనలను తెలియజేస్తుంది.

(B). **స్థూల వస్తు వర్తక నిబంధనలు (Gross Barter Terms of Trade) :-** దీనిలో ఎగుమతుల దిగుమతులలో వస్తు పరిమాణాన్ని మాత్రమే లెక్కిస్తారు.

$$G = \frac{Q_m}{Q_x}$$

$G =$ ఖచ్చితమైన వస్తు వర్తక నిబంధనలు

$Q_m =$ దిగుమతుల పరిమాణ సూచీ సంఖ్య

$Q_x =$ ఎగుమతుల పరిమాణ సూచీ సంఖ్య

ఎగుమతుల పరిమాణము కన్నా దిగుమతుల పరిమాణం తక్కువగా ఉంటే ఒక దేశానికి మాత్రమే వర్తక నిబంధనలు లాభదాయకము. కాని ఎగుమతుల విలువ, దిగుమతుల విలువ సమానము అయినపుడు ఖచ్చితమైన వర్తక నిబంధనలు నికరమైన వస్తు నిబంధనలకు సమానము.

(C) **ఆదాయ వర్తక నిబంధనలు (Income Terms of Trade) :-**

$$I = N \cdot Qx$$

$I =$ ఆదాయ వర్తక నిబంధనలు

$N =$ నికరమైన వర్తక నిబంధనలు

$Qx =$ ఎగుమతుల పరిమాణ సూచీ సంఖ్య

వర్తక నిబంధనలు లాభసాటిగా ఉన్నపుడు ఎక్కువ ఎగుమతులు పెరుగుదల వలన ఇంతకు ముందుకన్నా ఎక్కువ పరిమాణంలో దిగుమతి చేసుకోవచ్చును. దీనిని దిగుమతి సామర్థ్యంగా చెప్పవచ్చును. ఆదాయ వర్తక నిబంధనలు నికరమైన వస్తు వర్తన నిబంధనలు. పరస్పర వ్యతిరేకమైన మార్గములో పనిచేయును. దిగుమతుల ధరలు స్థిరముగా ఉండి ఎగుమతుల ధరలు తగ్గినచో నికర వర్తక నిబంధనలు తగ్గుతాయి. ఎగుమతుల పరిమాణం ఎగుమతుల ధరలోని తగ్గుదల కన్నా ఎక్కువగా పెరిగితే ఆదాయ వర్తక నిబంధనలు పెరుగుతాయి.

(D). **ఉత్పాదకతలోని మార్పులు వర్తక నిబంధనల పై ప్రభావం :-** ఇవి రెండు రకాలు. అవి -

1. ఒకే ఉత్పాదక వర్తక నిబంధనలు
2. ద్వంద్వ ఉత్పత్తి కారకాల వర్తక నిబంధనలు

1. **ఒకే ఉత్పాదక వర్తక నిబంధనలు** (Single Factoral Terms of Trade) :-

$S = NZx$

$S =$ ఒకే ఉత్పాదక వర్తక నిబంధనలు

$N =$ నికరమైన వర్తక నిబంధనలు

$Zx =$ ఎగుమతుల ఉత్పాదక సూచీ సంఖ్య

ఉత్పాదక పెరుగుదల ఆర్థికవ్యవస్థకు లాభదాయకం ఎందుచేతనంటే ఎగుమతుల ఉత్పత్తిలో ఉపయోగించే ఒక యూనిట్ ఉత్పత్తి కారకానికి బదులు ఇంతకు ముందుకంటే ఎక్కువ పరిమాణములో దిగుమతులు పొందవచ్చును.

2. **ద్వంద్వ ఉత్పత్తి కారకాల వర్తక నిబంధనలు** (Double Factoral Terms of Trade) :-

$D = N \cdot Zx / Zm$

$D =$ ద్వంద్వ ఉత్పత్తి కారకాల వర్తక నిబంధనలు

$Zx =$ ఎగుమతులలో ఉత్పాదక సూచీ సంఖ్య

$Zm =$ దిగుమతులలో ఉత్పాదక సూచీ సంఖ్య

$N =$ నికరమైన వస్తు వర్తక నిబంధనలు

పై సమీకరణము ఆధారముగా 'D' కనుక పెరిగినట్లయితే ఎగుమతులలో ఇమిడి ఉన్న ఒక యూనిట్ స్వదేశీయ ఉత్పత్తి కారకాలు దిగుమతులలో ఇంతకు ముందుకన్నా ఎక్కువ యూనిట్ల ఉత్పత్తి కారకాలు మార్పిడి జరుగుతుంది. ప్రతిఫలాలు ఉత్పత్తిలో ఉన్నట్లయితే ద్వంద్వ ఉత్పత్తి కారకాల వ్యాపార నిబంధనలు, నికర వస్తు వర్తక నిబంధనలు ఒకటే అవుతాయి. కాని ఉత్పాదకతలో కలిగిన మార్పులను లెక్కించటం చాలా కష్టం.

**5.1.3 వర్తక నిబంధనల కదలిక (Movement) :- (అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాలు)**

వర్తక నిబంధనల కదలిక అభివృద్ధి చెందిన దేశాలకు అనుకూలంగా ఉన్నదా అనే అంశం పై వివాదం రెండు రకాలుగా ఉన్నది. "బ్రిటిష్ స్కూలు"కి చెందిన సంప్రదాయ ఆర్థికవేత్తలు వర్తక నిబంధనల కదలిక దీర్ఘకాలంలో అభివృద్ధి చెందుతున్న దేశాలకు అనుకూలంగా ఉంటుంది.

ఉదాహరణకు రెండు దేశాలు (అభివృద్ధి చెందిన, చెందుతున్న) ఒక దేశము పారిశ్రామిక వస్తువుల ఉత్పత్తి, మరొక దేశం ఆహారధాన్యాలను ఉత్పత్తిని చేస్తున్నాయి అనుకొందాం.

జనాభా వృద్ధి రేటు పెరిగే కొలది తక్కువ సారవంతమైన భూములను సాగుచేసే కొలది ఉత్పత్తి వ్యయం పెరిగి దీని ఫలితముగా వ్యవసాయ రంగంలో క్షీణ ప్రతిఫలాలు ఏర్పడతాయి. దీని వలన ఉత్పత్తి వ్యయం పెరిగి వస్తు ధరలు కూడా పెరుగుతాయి. కాబట్టి ఎగుమతుల విలువ పెరిగి వర్తక నిబంధనల పెరుగుదల కనిపిస్తుంది. సాధారణముగా అభివృద్ధి చెందుతున్న దేశాలు ఆహారధాన్యాన్ని ఉత్పత్తి చేస్తాయి.

పారిశ్రామిక వస్తువులు వృద్ధి ప్రతిఫలాలు ప్రాతిపదికగా స్థిర ప్రతిఫలాలు ఆధారముగా ఉత్పత్తి జరుగుతుంది అనుకొంటే, వాటి వ్యయాలు తగ్గి వస్తువుల ధరలు తగ్గుతాయి. సర్వసాధారణముగా అభివృద్ధి చెందిన దేశము పారిశ్రామిక వస్తువులు ఉత్పత్తి చేస్తుంది. కాబట్టి దీర్ఘ కాలంలో వర్తక నిబంధనల కదలిక అభివృద్ధి చెందిన దేశాలకు వ్యతిరేకంగా ఉంటుంది అని కీన్స్ యొక్క అభిప్రాయము.

పై చెప్పిన సిద్ధాంతము వాస్తవానికి దూరమైన ప్రమేయాల పై ఆధారపడి ఉన్నదని ఆధునిక ఆర్థికవేత్తలు గమనించిరి.

ఆధునిక ఆర్థికవేత్తలు అయిన ప్రెబిష్ (Prebish), సింగర్ (singer), మిర్థాల్ (Myrdal) వర్తక నిబంధనలు అభివృద్ధి చెందిన దేశాలకు అనుకూలంగా, అభివృద్ధి చెందుతున్న దేశాలకు వ్యతిరేకంగా ఉన్నాయి అని నిరూపించారు.

**5.1.4 దీర్ఘ కాలంలో తగ్గుతున్న వర్తక నిబంధనల ఉపకల్పన (Secular Deterioration Hypothesis) :-** ఆధునిక ఆర్థికవేత్తలు అయిన ప్రెబిష్, సింగర్, మిర్థాల్ మొదలగు ఆర్థికవేత్తల అభిప్రాయం ప్రకారం వర్తక నిబంధనల కదలిక అనేది మార్కెట్ శక్తుల పైన, ఎగుమతుల, దిగుమతుల విధానముల పైన, కార్మిక సంఘాల బేరమాడే శక్తి పైన ఆధారపడి ఉంటుంది.

ఇంగ్లాండ్ దేశాన్ని దృష్టిలో ఉంచుకొని 20వ శతాబ్దం మొదటి భాగంలో ప్రాథమిక వస్తువుల ధరలు పారిశ్రామిక వస్తువుల ధరలతో పోల్చి చూచినపుడు పారిశ్రామిక వస్తువుల ధరలు తగ్గిపోయినవి. వాస్తవానికి ఈ కాలంలో ప్రాథమిక ఎగుమతుల కొనుగోలు సామర్థ్యం 60% పడిపోయినదని ప్రెబిష్ (Prebish) అభిప్రాయము. కాని సాంప్రదాయ ఆర్థికవేత్తలు అనుకొన్నట్లుగా పెరుగుతున్న ప్రతిఫలాల మూలముగా పారిశ్రామిక వస్తువుల ధరలు నిజానికి తగ్గలేదు. పెరిగిన ఉత్పాదకత వలన కలిగే లాభాలు ఎక్కువ వేతనాలు గాను, అధిక లాభాలుగా మారాయి తప్ప ధరలు తగ్గలేదు.

ప్రాథమిక రంగంలో ఉత్పాదకత తక్కువ అయినప్పటికి ఏ కొద్దిగా ఉన్నా కూడా ధరలు తగ్గటానికి ఉపయోగపడింది. దీనికి కారణము వ్యాపార చక్రాల కదలిక, పారిశ్రామిక రంగంలోని ఏకస్వామ్యము, కార్మిక సంఘాల బేరమాడే సామర్థ్యం మొదలగునవి.

వ్యాపార చక్రాల ఊర్ధ్వ దిశలో ప్రాథమిక వస్తువుల ధరలు త్వరగా పెరుగుతాయి. వ్యాపార చక్రాల అథో రిచల్ అతి త్వరగాను ధరలు తగ్గిపోతాయి. కాని పారిశ్రామిక వస్తువుల ధరలు తగ్గవు.

అభివృద్ధి చెందిన దేశాలలో ఉండే శ్రామికుల బేరమాడే శక్తి వల్ల ఉత్పాదకతలోని పెరుగుదల అభివృద్ధి చెందుతున్న దేశాలలో అయితే పెరిగిన వేతనాల రూపంలో కలుగుతుంది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో అయితే శ్రామికుల సరఫరా అధికముగా ఉంటుంది కాబట్టి బేరమాడే శక్తి లోపిస్తుంది. దీనివల్ల వేతనరేటు స్థిరంగా ఉండి సాంకేతికాభివృద్ధి వలన కలిగే లాభాలు ప్రాథమిక వస్తువుల తక్కువ ధరల రూపంలో అభివృద్ధి చెందిన దేశాలు కాజేస్తాయి.

డిమాండ్ ఆదాయ వ్యాకోచత్వము ప్రాథమిక వస్తువులకు తక్కువగాను తయారీ వస్తువులకు ఎక్కువగాను ఉంటుంది. ఏంజెల్స్ సూత్రం (Engel's Law) ప్రభావం దీనికి కారణం. అందువల్ల ఆదాయము పెరిగినకొలది ప్రాథమిక వస్తువు కొనుగోలు తగ్గుతుంది.. అదే పారిశ్రామిక వస్తువులయితే ఆదాయం పెరిగినకొలది వాటి కొనుగోలు పరిమాణం పెరుగుతుంది. సాంకేతిక నవ కల్పనల వల్ల కూడా యూనిట్ ఉత్పత్తికి అవసరమయ్యే ముడిసరుకుల సంఖ్య కూడా తగ్గుతుంది. ఈ విధముగా డిమాండ్, సరఫరా కలిసి వర్తక నిబంధనల కదలిక అభివృద్ధి చెందుతున్న దేశాలకు వ్యతిరేకంగా ఉండటానికి తోడ్పడతాయి.

కిండల్ బర్గర్ చెప్పినట్లు అభివృద్ధి చెందుతున్న దేశాలలో డిమాండ్, సరఫరా శక్తుల ఆధారంగా చెప్పుట కష్టం. డిమాండ్ తగ్గుతున్న వస్తువుల నుంచి ఉత్పత్తి కారకాలను తొలగించి డిమాండ్ పెరుగుతున్న వస్తువులకు ఉత్పత్తి కారకాలను సేకరించినట్లయితే ఈ సమస్య కొంతవరకు తగ్గుతుంది. ఇటువంటి సమన్వయం అభివృద్ధి చెందుతున్న దేశాలలో జరగటం కష్టం. ఈ దేశాలు ప్రాథమిక వస్తువులను ఉత్పత్తి చేస్తాయి. కాబట్టి వాటి ఉత్పత్తిని తగ్గించడం గాని, నిషేధించడం గాని సంస్థలకు కష్ట సాధ్యం. ఇదే అభివృద్ధి చెందిన దేశాలల్లో అయితే సరఫరా సవరించడం సాధ్యపడుతుంది. దీని ఫలితంగా ధరలు కూడా మారుతాయి.

విమర్శ :- ప్రెబిష్ అనే ఆర్థికవేత్త అభివృద్ధి చెందిన ఇంగ్లాండ్‌ను ఆధారముగా చేసుకొని వర్తక నిబంధనలు అన్ని దేశాలకు నిదర్శనంగా చెప్పినారు. కాని దేశాల మధ్య ఎగుమతుల మిశ్రమము వేరు వేరుగా ఉంటుంది. ఇంగ్లాండ్ దేశంలో ప్రాథమిక వస్తువుల దిగుమతుల సూచీ సంఖ్య అభివృద్ధి చెందుతున్న దేశాల సూచీ సంఖ్యగా తీసుకొన్నందున ఇది సరిఅయిన పోలిక కాదని విమర్శకుల వాదన. వాస్తవానికి మిగిలిన అభివృద్ధి చెందిన దేశాల వర్తక నిబంధనల కదలిక వేరు వేరుగా ఉంటుంది అని పేర్కొన్నారు. దీర్ఘకాలంలో వర్తక నిబంధనల కదలిక అభివృద్ధి చెందుతున్న దేశాలకు వ్యతిరేకంగా ఉంటుంది. అని ఎక్కువ మంది ఆర్థికవేత్తల అభిప్రాయము.

స్వల్ప కాలంలో వ్యాపార విధానములో మార్పు వల్ల గాని మారకపు రేట్ల మార్పు వల్ల గాని, వ్యాపార చక్రాల మార్పు వల్ల కాని వర్తక నిబంధనలు మారచ్చు. రెండు దేశాలు ఉన్నప్పుడు వాటిలో ఏ దేశము చిన్నదిగా ఉంటే ఆ దేశమునకు వర్తక నిబంధనలు అనుకూలంగా ఉంటాయి.

సాంప్రదాయ ఆర్థికవేత్తలు చెప్పిన వర్తక నిబంధనలు సిద్ధాంతాన్ని నవ్య సాంప్రదాయ ఆర్థికవేత్త అయిన జె.ఆర్. హిక్స్ (J.R. Hickes) కొన్ని మార్పులతో వర్తక నిబంధన కదలిక సిద్ధాంతాన్ని వివరించినాడు. సాంప్రదాయ ఆర్థికవేత్తలు చెప్పిన, స్థిర ప్రతిఫలాల ప్రమేయాన్ని తొలగించి ఆర్థికవృద్ధి వలన వర్తక నిబంధనలు ఏ విధముగా మారతాయో వివరించినాడు. దీర్ఘకాలంలో ఉత్పత్తి వినియోగాలల్లో నిర్మాణాత్మకమైన మార్పుల వల్ల వర్తక నిబంధనల్లో మార్పులు కలుగుతాయి అని వాదన.

ఉదాహరణకు A,B అను రెండు దేశాలు ఉన్నవి అనుకొనుము. ఆఫర్ రేఖల (offer curves) విశ్లేషణ ద్వారా ఈ సిద్ధాంతాన్ని వివరించినాడు. 'A' దేశంలో వృద్ధి ఉంటే 'B' దేశం ఆఫర్ రేఖ కదలిక ఏ విధముగా ఉంటుందో చెప్పవచ్చును. ఈ వృద్ధి పాక్షికత మీద ఆధారపడి ఉంటుంది. వృద్ధి కనుక తటస్థ పాక్షికత కల్గినా, ఎగుమతి పాక్షికత అయినా, దిగుమతి పాక్షికత అయినా 'A' దేశం వస్తు వర్తక నిబంధనలు క్షీణిస్తాయి. కాని వృద్ధి ఎక్కువ దిగుమతి పాక్షికత కల్గి ఉంటే 'A' దేశం వర్తక నిబంధనలు ఆ దేశానికి అనుకూలంగా మారుతాయి. A దేశం వర్తక నిబంధనల క్షీణత గరిష్ఠ స్థాయిలో ఉన్నప్పుడు

1. వృద్ధి పాక్షికత ఎగుమతులలో గరిష్ఠ స్థాయిలో ఉన్నప్పుడు
2. 'A' దేశంలో మొత్తం ఉత్పత్తి ఎక్కువగా ఉన్నప్పుడు

3. 'B' దేశం వస్తువులకు 'A' దేశంలో డిమాండ్ వ్యాకోచత్వం తక్కువగా ఉన్నప్పుడు, వృద్ధి కమక రెండు దేశాలలో ఉన్నట్లయితే వర్తక నిబంధనల కదలిక వేరే విధంగా ఉంటుంది.

వృద్ధి పాక్షికత తటస్థంగా ఉంటే ఎక్కువ వృద్ధి కల్గిన దేశం వర్తక నిబంధనలు క్షీణిస్తాయి. వృద్ధి ఎగుమతుల పాక్షికతతో కాని, రెండు దేశాలలో ఉన్నట్లయితే వర్తక నిబంధనల కదలిక రెండు దేశాలకు స్థిరంగా ఉంటుంది. అయితే దిగుమతులకు డిమాండ్ వృద్ధి సమానంగా ఉండాలి. అలా కాకుండా తేడా వుంటే దిగుమతుల డిమాండ్ ఎక్కువగా ఉన్న దేశపు వర్తక నిబంధనలు క్షీణిస్తాయి. వృద్ధి ఫలాలు 'A' దేశంలో ఎగుమతుల పాక్షికతతోను 'B' దేశంలో ఎగుమతుల పాక్షికతలోను ఉండి, వృద్ధి రేటు రెండు దేశాలలో సమానంగా ఉంటే వర్తక నిబంధనలు 'A' దేశానికి క్షీణిస్తాయి. అయితే వృద్ధి రేటు 'B' దేశం కన్నా 'A' దేశానికి అనుకూలంగా ఉంటుంది. వృద్ధి మిక్కిలి దిగుమతుల పాక్షికతతో ఏదో ఒక దేశంలో ఉంటే ఆ దేశం వస్తు వర్తక నిబంధనలు పెరుగుతాయి. నవ్య సాంప్రదాయక అర్థికవేత్తల సిద్ధాంతము ప్రకారము వృద్ధిలో కదలిక, వర్తక నిబంధనల కదలిక ఒకే రకమైన సారూప్యం లేదు.

వృద్ధి పాక్షికతను బట్టి వృద్ధి రేటును బట్టి రెండు దేశాలలో తేడాలను బట్టి వర్తక నిబంధనల కదలిక అనుకూలంగాను, ప్రతికూలంగాను ఉండవచ్చును. అంతేకాని అభివృద్ధి చెందిన దేశాలకు అనుకూలంగాను, అభివృద్ధి చెందుతున్న దేశాలకు ప్రతికూలంగాను ఉంటాయని ఖచ్చితంగా చెప్పటానికి వీలు ఉండదు.

**5.1.5 వర్తక నిబంధనలు - ప్రయోజనాలు :-** వర్తక నిబంధనలు మార్పు చేయుట వలన లాభం కాని, దేశ శ్రేయస్సును గాని అధ్యయనము చేయుట కష్టము. ఎందుకంటే వర్తక నిబంధనలు మార్పులకు కారణమైన కొన్ని శక్తుల పై ఇది ఆధారపడి ఉన్నది. వర్తక నిబంధనలు కొద్దిగా సడలించినందు వలన ఇంతకు ముందుకన్నా దిగుమతులు పెరిగి ఎగుమతులను కూడా మార్పు కలుగుతుంది. అయితే ఈ తగ్గుదల ఈ దేశపు ఎగుమతులకు విదేశీ డిమాండ్ తగ్గుదల కనుక కారణమయితే ఆ దేశ పరిస్థితి మరీ హీనముగా ఉంటుంది. కాని వర్తక నిబంధనల వెనులుబాటు సాంకేతిక మార్పులకు కారణమైతే దీని ఫలితముగా ఉత్పత్తి వ్యయాలు తగ్గి ఎగుమతి ధరలు తగ్గినట్లయితే, ఈ వ్యయాల తగ్గుదల వర్తక నిబంధనల తగ్గుదల కన్నా ఎక్కువగా ఉంటే ఆ దేశమునకు మంచిది.

ఎందుకంటే ఎగుమతులకు ఉపయోగించే ఒక యూనిట్ ఉత్పత్తి కారకాలకు ఇంతకు ముందుకన్నా ఎక్కువ దిగుమతులను పొందవచ్చు. కాబట్టి నికర లేక వస్తు వర్తక నిబంధనలు తగ్గినప్పటికి ఒకే ఉత్పత్తి కారకాల వర్తక నిబంధనలు అనుకూలంగా ఉంటాయి.

ఒక్కొక్కసారి దేశం ఆదాయ వర్తక నిబంధనలు పెరిగినప్పటికి నికర వర్తక నిబంధనలు తగ్గవచ్చు. ఎగుమతుల ధరలు తగ్గినప్పటికి ఎగుమతుల పరిమాణం అంతకన్నా పెరిగినట్లయితే ఆదాయవర్తక నిబంధనలు పెరుగుతాయి. ఈ పెరుగుదల దిగుమతుల సామర్థ్యాన్ని తెలుపుతుంది. కాబట్టి దేశ ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తూ తద్వారా కాలక్రమంలో దేశ శ్రేయస్సును పెంచుతుంది. నికర వర్తక నిబంధనలు తగ్గినప్పటికి దేశ శ్రేయస్సు పెరగవచ్చు. ఎందుకంటే వ్యాపార సంతులనంలో వస్తు వ్యాపారాన్ని మాత్రమే తెలుపుతుంది. అదృశ్య అంశాలు అనుకూలంగా ఉంటే వర్తక నిబంధనలు తగ్గినప్పటికి దేశ శ్రేయస్సుకు మంచిది. ఏమైనప్పటికి దేశ శ్రేయస్సు దృష్ట్యా నికర వర్తక నిబంధనల్లోను ఒకే ఉత్పత్తి కారకాల వర్తక నిబంధనల్లోను కూడా అనుకూలముగా ఉంటే మంచిది.

## 5.2 సాంకేతిక ప్రగతి (Technical Progress):-

సాంకేతిక ప్రగతి అనగా నూతన ఉత్పత్తి పద్ధతులు కనుగొనుట, నూతన ఉత్పత్తులను అభివృద్ధిపరుచుట, మరియు నూతన మార్కెటింగ్, మేనేజ్‌మెంట్ పద్ధతులను ప్రవేశపెట్టుట. ఉత్పత్తి ఫలములో మార్పును కూడా సాంకేతిక ప్రగతి అనవచ్చును.

**5.2.1 సాంకేతిక ప్రగతి - వర్గీకరణ :-** ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్త మరియు నోబెల్ బహుమతి గ్రహీత జె.ఆర్. హిక్స్ సాంకేతిక ప్రగతిని మూడు రకాలుగా వర్గీకరించిరి. అవి -

1. **తటస్థ సాంకేతిక ప్రగతి** (Neutral Technical Progress) :- సాంకేతిక ప్రగతి ద్వారా శ్రమ మరియు మూలధనముల యొక్క ఉపాంత ఉత్పాదకత ఒకే అనుపాతములో పెరిగితే దానిని తటస్థ సాంకేతిక ప్రగతి అందురు. (It increases the productivity of L and K in the same proportion so that K/L remains the same after the neutral technical progress as it was before at changed relative factor prices (w/r). There is no substitution of L for K or vice versa in production).

2. **శ్రమ ఆదా చేయు సాంకేతిక ప్రగతి** (Labour - Saving Technical Progress) :- మూలధనము యొక్క ఉపాంత ఉత్పాదకత సామర్థ్యము సాపేక్షముగా శ్రమ యొక్క ఉపాంత ఉత్పాదకత కన్నా అధికముగా ఉన్నచో దానిని శ్రమ ఆదా చేయు సాంకేతిక ప్రగతి అందురు. (It increases the productivity of K proportionately more than the productivity of L. As a result K is substituted for L in production and K/L rises at unchanged w/r. Since more K is used per unit of L, this type of techinical progress is called Labour Saving).


   K = Capital, L = Labour, W = Wage Rate and r = Rate of Return on Capital

3. **మూలధనము ఆదా చేయు సాంకేతిక ప్రగతి** (Capital - Saving Technical Progress) :- ఉత్పత్తి రంగములోసాంకేతిక ప్రగతి ద్వారా శ్రమ యొక్క ఉపాంత ఉత్పాదకత మూలధనము యొక్క ఉపాంత ఉత్పాదకత కంటే సాపేక్షకముగా అధికముగా ఉన్న యెడల దానిని మూలధనం ఆదా చేయు సాంకేతిక ప్రగతి అందురు. (It increases the productivity of L proportionately more than the productivity of K. As a result, L is substituted for K in production and K/L falls at unchanged W/r. Since more L is used per unit of K, this type of technical progress is called Capital - Saving).

**5.2.2 హిక్స్ వర్గీకరించిన సాంకేతిక ప్రగతి - రేఖాలేఖనం :-** హిక్స్ వర్గీకరించిన మూడు విధముల సాంకేతిక ప్రగతిని యీ క్రింది పటము ద్వారా తెలుసుకోవచ్చు. పటము 5.1లో తటస్థ శ్రమ ఆదాచేయు మరియు మూలధనము ఆదాచేయు సాంకేతిక ప్రగతి మూడు భాగములలో చూపబడినది. మొదటి భాగములో 100 యూనిట్లు 'X' వస్తువు 4 యూనిట్లు శ్రమ (L) మరియు 4 యూనిట్ల మూలధనము (K) తో సాంకేతిక ప్రగతి జరుగకముందు ఉత్పత్తి అయినది. అదే ఉత్పత్తి (100 యూనిట్ల X వస్తువు) తటస్థ సాంకేతిక ప్రగతి తరువాత 2 యూనిట్ల L మరియు 2 యూనిట్ల K తో ఉత్పత్తి చేయగలము. ఇది $A_2$ పాయింటు దగ్గర చూపబడినది.

పటములోని రెండవ భాగములో 100 యూనిట్ల X వస్తువు సాంకేతిక ప్రగతికి ముందు $A_1$ పాయింట్ దగ్గర 4 యూనిట్ల L మరియు 4 యూనిట్ల K ను ఉపయోగించి తయారు చేయబడినది. అయితే శ్రమ ఆదా చేయు (L - saving) సాంకేతిక ప్రగతి తరువాత అదే వస్తువును (100 యూనిట్ల X ను) 1 యూనిట్ L మరియు 3 యూనిట్ల K తో తయారు చేయగలము. ఇది $A_3$ పాయింట్ దగ్గర చూపబడినది.

## Graphical Analysis of Hicksian Technical Progress :





పటము 5.1 హిక్స్ యొక్క తటస్థ శ్రమ ఆదా చేయు మరియు మూలధనము ఆదా చేయు సాంకేతిక ప్రగతి


పటములోని మూడవ భాగములో మూలధనము (K) ఆదా చేయు సాంకేతిక ప్రగతి చూపబడినది. ఇందులో సాంకేతిక ప్రగతికి ముందు 100 యూనిట్ల X వస్తువు, 4 యూనిట్ల L మరియు 4 యూనిట్ల K తో చేయబడినది. అయితే మూలధనం ఆదా చేయు సాంకేతిక ప్రగతి జరిగిన తరువాత అదే వస్తు సముదాయమును (100 యూనిట్ల X ను) 3 యూనిట్ల L మరియు 1 యూనిట్ K తో ఉత్పత్తి చేయబడినది. ఇది $A_3$ బిందువు వద్ద చూపబడినది. పై మూడు భాగములలో సాంకేతిక ప్రగతి వలన ఉత్పత్తి కారకాల నిష్పత్తిలో మార్పును తెలుసుకోగలిగాము. అయితే యీ పటములో ఉత్పత్తి కారకాల సాపేక్ష ధరలో (w/r) మార్పు ఉండదని అనుకోవడం జరిగింది.

**5.2.3 సాంకేతిక ప్రగతి, అంతర్జాతీయ వ్యాపారము మరియు సంక్షేమము :-** తటస్థ సాంకేతిక ప్రగతి వస్తూత్పత్తి పెరుగుదలకు దోహదపడుతుందని మనకు తెలుసు. అయితే వస్తూత్పత్తితో బాటు వస్తు వినియోగము కూడా పెరుగుతుంది. అంటే అంతర్జాతీయ వ్యాపారము కూడా పెరుగుతుంది.

తటస్థ సాంకేతిక ప్రగతి ద్వారా వస్తూత్పత్తిలోని పెరుగుదల మరియు వస్తు వినియోగములోని మార్పు యీ క్రింది పటములో (5.2) చూపబడినది. పటములోని క్రింది భాగములో (Bottom Panel) చూపిన విధముగా ఒక దేశములో స్వేచ్ఛా వ్యాపారము జరుగక ముందు 60 యూనిట్ల 'X' వస్తువు 60 యూనిట్ల 'Y' వస్తువుతో మార్పిడి చేయబడినది. $\left(at\ {}^{P_X}/_{P_Y} = P_B = 1\right)$. అయితే స్వేచ్ఛా వాణిజ్యము జరిగిన తరువాత (after trade) ఆ దేశములో వస్తూత్పత్తులు పెరిగి 150 యూనిట్ల 'X' వస్తువు 150 యూనిట్ల 'Y' వస్తువుతో మార్పిడి చేయబడినది $\left(at\ {}^{P_X}/_{P_Y} = P_B = 1\right)$.

<u>Technical Progress, Trade and Welfare</u>






పటము 5.2 సాంకేతిక ప్రగతి, అంతర్జాతీయ వ్యాపారము మరియు సంక్షేమము

అయితే పటములోని పై భాగములో (top panel) చూపిన విధముగా సాంకేతిక ప్రగతి కారణముగా ఉత్పత్తి పెరిగి, వినియోగము పెరిగి, అంతర్జాతీయ వ్యాపారము పెరిగి ప్రజల సంక్షేమము పెరుగుతుంది. ఒక దేశములో జనాభా మరియు వర్తక నిబంధనలు నిలకడగా ఉన్నాయనుకుందాము. అంతర్జాతీయ వ్యాపారముకు ముందు X వస్తువు మరియు Y వస్తువును 'B' బిందువు దగ్గర ఉత్పత్తి చేసి 'E' దగ్గర కొనుగోలు చేస్తుండటము జరుగుతుంది. అయితే ఎగుమతి చేయు 'X' వస్తువు ఉత్పత్తి పెంచుటకే శ్రామికులను అధికం చేసి ఉత్పత్తిని 'M' బిందువుకు పెంచి, 150 యూనిట్ల 'X' వస్తువును 150 యూనిట్ల 'Y' వస్తువును ఆదేశము మార్పు చేసుకోగలుగుతుంది. $(at\, P_M = P_B = 1)$. దీనితో తన ప్రజలకు అధిక సంక్షేమము చేకూర్చగలుగుతుంది. అంతర్జాతీయ వాణిజ్యము ద్వారా ఎగువ గల ఉదాసీనతా వక్రరేఖ (VII) ను అందుకోవడానికి వీలు కలుగుతుంది. పై రెండు భాగములలో చూపినట్లు సాంకేతిక ప్రగతికి, ఉత్పత్తుల పెరుగుదలకు మరియు సంక్షేమమునకు దగ్గర సంబంధము ఉన్నది.

## 5.3 అంతర్జాతీయ మూలధన కదలికలు (International Capital Movements) :-

ఒక దేశం నుండి మరొక దేశానికి మూలధనము ప్రవాహమును అంతర్జాతీయ మూలధన కదలికగా చెప్పవచ్చును. 19వ శతాబ్దపు కాలము నుండి అభివృద్ధి చెందిన దేశాలు అంతర్జాతీయ మూలధన కదలికకు ప్రాధాన్యత కల్పించినందు వలన తమ దేశము యొక్క పొదుపు మొత్తము పెరుగుటకు దోహదం చేస్తుంది. ఆధునిక కాలంలో వ్యవసాయక, అభివృద్ధి చెందుతున్న దేశాలు, పారిశ్రామికంగా, సాంకేతికంగా అభివృద్ధి చెందిన దేశాల నుంచి వచ్చిన మూలధనము, సాంకేతిక పరిజ్ఞానం ఎగుమతుల వల్ల అభివృద్ధి చెందుతాయి.

### 5.3.1 మూలధన కదలిక - రకాలు (Types of Capital Movements) :-

1. **స్వల్పకాలిక మూలధన కదలికలు (Short-Term Capital Movements) :-** ఒక అప్పు - లేక ఋణపత్రం ద్వారా ఒక దేశం నుండి మరొక దేశానికి ఒక సంవత్సరపు లోపు మూలధనాన్ని బదిలీ చేస్తే స్వల్పకాలిక మూలధన కదలిక అవుతుంది. ఆ ఋణపత్రం 3 నుండి 4 సంవత్సరాలకు లేదా ఆపైన ఉంటే మధ్య కాలిక మరియు దీర్ఘకాలిక మూలధన కదలికగా పేర్కొందురు.

Hawtrey మరియు కొంత మంది ప్రాచీన ఆర్థికవేత్తల అభిప్రాయం ప్రకారం డిస్కౌంట్ రేటు బంగారము ప్రమాణం క్రింద పనిచేయునప్పుడు ఋణాలు, ధరల మార్పిడిలోను, ఎగుమతుల దిగుమతుల పైన ప్రభావం చూపినవి. హాట్రే టోకు వర్తకులను లండన్ మార్కెట్‌లో ఋణాలను పొందిన నిధుల ద్వారా పని చేయాల్సిందని సలహా ఇచ్చారు. డిస్కౌంట్ రేటులో తగ్గుదల తమ ఇన్వెంటరీల పెంపుదల, ధరలు పెంచడం ద్వారా దోహదము చేస్తుంది. ఎగుమతులు తగ్గడం దిగుమతులు పెరగడం జరుగుతుంది. ఈ విధంగా డిస్కౌంట్ రేటు బంగారపు ప్రమాణం కింద చెల్లింపుల శేషంలో తన ప్రభావాన్ని తెలియజేస్తుంది.

వడ్డీరేట్లలో మార్పులు దేశీయ ద్రవ్య అవసరాలను కొంతవరకు సమకూర్చుటకు ఉపయోగపడుతుంది. వడ్డీరేటులో పెరుగుదల, తరుగుదల దేశీయంగా చూస్తే స్వల్పకాలిక మూలధన కదలికల్లో మార్పుల ద్వారా చెల్లింపుల శేషంలో తగిన సర్దుబాటు కలుగుతుంది.

స్వల్పకాలిక మూలధన కదలికలు ప్రపంచంలో స్థిరంగా ఉంటాయని అంచనాలు తెలియజేస్తున్నవి.

4. **మూలధన కదలికలో అస్థిరత (Destabiling Movements of Capital) :-** అంచనా వ్యాపారులు తనకు ఇష్టపూర్వకంగా మారకపు రిస్కులను భరిస్తున్నప్పుడు స్వల్పకాలిక కదలికలో స్థిరత్వము లేక అస్థిరత ఏర్పడును. ఈ పరిస్థితి ఏర్పడుటకు గల కారణము డిస్కౌంటు రేటులో పెరుగుదల వలన - మూలధనము బయటికి పోవును. డిస్కౌంట్ రేటులో తరుగుదల వలన మూలధనము లోపలికి వచ్చును. మూలధన out flow చెల్లింపుల శేషం పరిష్కరించవచ్చును. కాని కొన్ని సమయాలలో ఈ చర్యల ఫలితముగా మూల్యన్యూనీకరణకు దారి తీస్తుంది.

5. **దీర్ఘకాలిక మూలధన కదలికలు (Long Term Capital Movements) :-** వివిధ దేశాల మధ్య బాండ్లు, ఇతర సెక్యూరిటీలు కొనుగోలు, రవాణా రూపములో ఉండవచ్చును. ఒక దేశంలో ప్రయివేటు కంపెనీలు, కార్పోరేషన్‌లు, లేదా వ్యక్తులు విదేశాలలో నెలకొల్పిన పారిశ్రామిక సంస్థల ఈక్విటీలు బాండ్లు కొనుగోలు చేస్తారు. ఈ రెండు దేశాలలోని సంస్థలు ముడి సరుకులు, యంత్ర సామాగ్రి, ఇతర వస్తువులు ఎగుమతి దిగుమతి చేసుకొనుటకు దీర్ఘకాలిక ప్రాతిపదిక మీద ఒక పత్రం ద్వారా ఒప్పందము కుదుర్చుకొంటాయి.

6. **విదేశీయ, దేశీయ పెట్టుబడి (Foreign and Domestic Investment) :-** ఒక దేశం నుండి వేరొక దేశానికి ఎక్కువ పరిమాణములో ఎగుమతుల వలన ఆ దేశమునకు ఎగుమతులు మిగులు వలన మూలధనం పెరిగినందు వలన ఆ దేశములో ఆదాయము, ఉద్యోగిత పెరుగుతుంది. విదేశీయ పెట్టుబడుల వలన పెరిగిన ఆదాయము, దేశీయ పెట్టుబడులచే పెరిగిన ఆదాయానికి తేడా ఉండదు. విదేశీ మూలధనం పెరిగినందున దేశం యొక్క జాతీయాదాయం పెరుగుతుంది.

7. **స్థిరీకరణ ఋణాలు :-** ప్రభుత్వపరంగా సాధారణంగా ఋణాలు పొందడం రెండు రకాలు. అవి 1. స్థిరీకరణ ఋణాలు, 2. అవసరమైన వస్తువుల దిగుమతి కొరకు ఋణదాతకు ద్రవ్య సహాయం కొరకు లేక ఋణగ్రస్థుల దిగుమతులకు ద్రవ్య సహాయం కొరకు ఋణాలు పొందుట.

8. **దిగుమతుల కొరకై ఋణ సహాయం చేయుటకు (Borrowing to Finance Imports) :-** మొదటి ప్రపంచ యుద్ధానికి పూర్వం విదేశీ ఋణాలు స్వేచ్ఛగా లభించేవి. అంతేగాక స్వదేశంలో కంటే విదేశాలలో వడ్డీరేట్లు తక్కువగా ఉండేవి. విదేశీ పెట్టుబడిదారులు నష్టభయాన్ని భరించే శక్తి తక్కువగా ఉన్నప్పుడు ఆ దేశం లోటు బడ్జెట్ చూపిస్తూ ఇతర దేశముల నుండి ఋణాలు సేకరించేవి. తరువాత ఆర్థిక మాంద్య కాలములో నష్ట భయము పెరగడం వలన, అభివృద్ధి చెందుతున్న దేశాలు చౌక ఆర్థిక విధానాలను అనుసరించినందున ద్రవ్య మార్కెట్‌లో వడ్డీరేట్లు తగ్గినవి.

స్వల్పకాలిక మూలధన పత్రం సాధారణంగా వాణిజ్య బ్యాంక్‌ల డిపాజిట్ రూపేణా గాని, బిల్లులు, ఓవర్ డ్రాఫ్ట్‌లు, ఓపెన్ లుక్ క్రెడిట్ రూపేణా ఉంటుంది. ఒక దేశం బంగారపు ప్రమాణాన్ని అనుసరిస్తున్నట్లయితే స్వల్పకాలిక మూలధన కదలికలు చెల్లింపుల శేషమనే పత్ర రూపేణా ఉండును. కొన్ని సందర్భాల్లో కేంద్ర బాంకు విదేశ మారకపు నిధులను బంగారంలోనికి మార్పిడి చేయవచ్చు. ఈ విధంగా స్వల్పకాలిక మూలధనం గురించి మాట్లాడే అప్పు ఋణాలు, బాంకు డిపాజిట్లు గురించి పరిశీలిస్తాం. ఒక దేశం ఇతర దేశాల నుంచి స్వల్పకాలిక ఋణం ఎక్కువగా పొందితే, విదేశాలు ఒకేసారి తిరిగి చెల్లించమని ఒత్తిడి ఉంటే ఆ దేశ కేంద్ర బ్యాంకుకు అవసరమైన బంగారు నిల్వలు లేక కొంత ఇబ్బంది కలగవచ్చును.

2. **స్వల్పకాలిక మూలధన కదలికలు - ద్రవ్య మార్పులు (Short - Term Capital Movements and Changes in Money Supply) :-** కేంద్ర బాంకు వద్ద ఉన్న ఆస్తులు, అప్పులలో ఏ విధంగా మార్పులు ఉంటాయో స్వల్పకాలిక మూలధన కదలికలో మార్పుల వలన ద్రవ్య సప్లయిలో కొన్ని ముఖ్యమైన మార్పులు ఏర్పడతాయి. వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగముల యొక్క ఎగుమతులు దిగుమతుల కన్నా పెరిగితే ఎగుమతిదారుల చేతుల్లో ద్రవ్యం పెరుగుతుంది. దీనికి వ్యతిరేకంగా దిగుమతులు, ఎగుమతుల కన్నా ఎక్కువగా ఉంటే దిగుమతిదారుల చేతిలో ద్రవ్యం ఎక్కువగా ఉంటుంది. ఈ ద్రవ్య సప్లయిలు పెరగటం, తగ్గటం అనేవి వ్యాపార చెల్లింపుల శేషం మీద ఆధారపడి ఉంటుంది. చెల్లింపుల శేషంలో మార్పు కలిగినపుడు ద్రవ్య సప్లయిలో మార్పు వచ్చును. స్వల్పకాలిక మూలధన కదలిక వలన ఆ దేశ కేంద్ర బాంకు ద్రవ్య నిధులలో మార్పువచ్చును. ఎగుమతులు కంటే దిగుమతులు తక్కువగా ఉన్నప్పుడు విదేశంలో ద్రవ్య సంస్థలలో ద్రవ్య నిల్వలు తగ్గుతాయి. ఎగుమతి చేసే దేశానికి ఆ దేశంలో కేంద్ర బాంకులో ద్రవ్య నిల్వలు పెరుగుతాయి. దీని ఫలితంగా కొత్త ఋణాలు పొందుటకు అవకాశం ఉంటుంది. దీనికి వ్యతిరేక పరిస్థితులు ఏర్పడినపుడు కేంద్ర బాంకులో ద్రవ్య సప్లయి తగ్గుతుంది. ఋణ వసతులు (సౌకర్యాలు) తగ్గుతాయి.

దేశంలో ఉన్న కేంద్ర బాంకు ద్వారా కాకుండా, మార్కెట్‌లో స్వల్పకాలిక మూలధన కదలికలు ద్రవ్య సరఫరాలో వచ్చిన మార్పు పైన కాకుండా వ్యతిరేకంగా ఉంటుంది. ఈ అంశమును క్రింది ఉదాహరణ ద్వారా చెప్పవచ్చును. అమెరికన్ అంచనాదారులు (స్పెక్యులేటర్లు) పౌండు మారకపు విలువ చౌకగా ఉన్నపుడు వాటిని ఎక్కువగా కొని, వాటి ధర పెరిగినపుడు తిరిగి అమ్ముతారు. దీని ఫలితంగా మూలధన కదలిక జరుగుతుంది.

స్వల్పకాలిక మూలధన కదలికలు బంగారపు నిల్వల మొత్తంలో మార్పును తెస్తాయి. చెల్లింపుల శేషం, కరెంటు ఖాతాకు సమానంగా ఉన్నప్పుడు స్వల్పకాలిక మూలధనము బయటకు వెలుతుంది. దీని వలన ద్రవ్య సప్లయి తగ్గుతుంది.

3. **స్పెక్యులేటివ్, స్వల్పకాలిక మూలధన కదలికలు, వడ్డీరేటు (Speculative, Short-Term Capital Movements and Rate of Interest) :-** 19వ శతాబ్ద కాలంలో బంగారము ప్రమాణం కింద వడ్డీరేటులో మార్పులు, స్వల్పకాలిక మూలధన కదలికలు చెప్పుకోదగ్గ మార్పులు తీసుకువచ్చాయి. దీనితోపాటు వడ్డీ రేట్లు చెల్లింపుల శేషంలో సర్దుబాటు కోసం కూడా తమ పాత్రను నిర్వహించాయి. వీటి ఫలితముగా డీలర్లు, బాంకర్లు, కేంద్ర బాంకులు, ద్రవ్య మార్కెట్‌లో ఉన్న ఇతర సంబంధిత సంస్థలు స్పెక్యులేషన్ చేయడానికి ఇష్టత చూపించినారు. స్వల్పకాలిక మూలధన చెల్లింపులు, విదేశీ కరెన్సీలో చూపిన ఋణాల మధ్య అసమతౌల్యం ఉండటం. దీనికి కారణం వడ్డీరేట్లలో మార్పు. వడ్డీరేట్లలో మార్పు వలన మూలధనము ముందుకు పోవునప్పుడు ముందుకు వెలుతున్న మార్కెట్‌లో రక్షణ కల్పిస్తూ మారకపు రిస్కును తొలగించడం జరుగుతుంది.

Hawtrey మరియు కొంత మంది ప్రాచీన ఆర్థికవేత్తల అభిప్రాయం ప్రకారం డిస్కౌంట్ రేటు బంగారము ప్రమాణం క్రింద పనిచేయునప్పుడు ఋణాలు, ధరల మార్పిడిలోను, ఎగుమతుల దిగుమతుల పైన ప్రభావం చూపినవి. హాట్రే టోకు వర్తకులను లండన్ మార్కెట్‌లో ఋణాలను పొందిన నిధుల ద్వారా పని చేయాల్సిందని సలహా ఇచ్చారు. డిస్కౌంట్ రేటులో తగ్గుదల తమ ఇన్వెంటరీల పెంపుదల, ధరలు పెంచడం ద్వారా దోహదము చేస్తుంది. ఎగుమతులు తగ్గడం దిగుమతులు పెరగడం జరుగుతుంది. ఈ విధంగా డిస్కౌంట్ రేటు బంగారపు ప్రమాణం కింద చెల్లింపుల శేషంలో తన ప్రభావాన్ని తెలియజేస్తుంది.

వడ్డీరేట్లలో మార్పులు దేశీయ ద్రవ్య అవసరాలను కొంతవరకు సమకూర్చుటకు ఉపయోగపడుతుంది. వడ్డీరేటులో పెరుగుదల, తరుగుదల దేశీయంగా చూస్తే స్వల్పకాలిక మూలధన కదలికల్లో మార్పుల ద్వారా చెల్లింపుల శేషంలో తగిన సర్దుబాటు కలుగుతుంది.

స్వల్పకాలిక మూలధన కదలికలు ప్రపంచంలో స్థిరంగా ఉంటాయని అంచనాలు తెలియజేస్తున్నవి.

4. **మూలధన కదలికలో అస్థిరత (Destabiling Movements of Capital) :-** అంచనా వ్యాపారులు తనకు ఇష్టపూర్వకంగా మారకపు రిస్కులను భరిస్తున్నప్పుడు స్వల్పకాలిక కదలికలో స్థిరత్వము లేక అస్థిరత ఏర్పడును. ఈ పరిస్థితి ఏర్పడుటకు గల కారణము డిస్కౌంటు రేటులో పెరుగుదల వలన - మూలధనము బయటికి పోవును. డిస్కౌంట్ రేటులో తరుగుదల వలన మూలధనము లోపలికి వచ్చును. మూలధన out flow చెల్లింపుల శేషం పరిష్కరించవచ్చును. కాని కొన్ని సమయాలలో ఈ చర్యల ఫలితముగా మూల్యన్యూనీకరణకు దారి తీస్తుంది.

5. **దీర్ఘకాలిక మూలధన కదలికలు (Long Term Capital Movements) :-** వివిధ దేశాల మధ్య బాండ్లు, ఇతర సెక్యూరిటీలు కొనుగోలు, రవాణా రూపములో ఉండవచ్చును. ఒక దేశంలో ప్రయివేటు కంపెనీలు, కార్పోరేషన్‌లు, లేదా వ్యక్తులు విదేశాలలో నెలకొల్పిన పారిశ్రామిక సంస్థల ఈక్విటీలు బాండ్లు కొనుగోలు చేస్తారు. ఈ రెండు దేశాలలోని సంస్థలు ముడి సరుకులు, యంత్ర సామాగ్రి, ఇతర వస్తువులు ఎగుమతి దిగుమతి చేసుకొనుటకు దీర్ఘకాలిక ప్రాతిపదిక మీద ఒక పత్రం ద్వారా ఒప్పందము కుదుర్చుకొంటాయి.

6. **విదేశీయ, దేశీయ పెట్టుబడి (Foreign and Domestic Investment) :-** ఒక దేశం నుండి వేరొక దేశానికి ఎక్కువ పరిమాణములో ఎగుమతుల వలన ఆ దేశమునకు ఎగుమతులు మిగులు వలన మూలధనం పెరిగినందు వలన ఆ దేశములో ఆదాయము, ఉద్యోగిత పెరుగుతుంది. విదేశీయ పెట్టుబడుల వలన పెరిగిన ఆదాయము, దేశీయ పెట్టుబడులచే పెరిగిన ఆదాయానికి తేడా ఉండదు. విదేశీ మూలధనం పెరిగినందున దేశం యొక్క జాతీయాదాయం పెరుగుతుంది.

7. **స్థిరీకరణ ఋణాలు :-** ప్రభుత్వపరంగా సాధారణంగా ఋణాలు పొందడం రెండు రకాలు. అవి 1. స్థిరీకరణ ఋణాలు, 2. అవసరమైన వస్తువుల దిగుమతి కొరకు ఋణదాతకు ద్రవ్య సహాయం కొరకు లేక ఋణగ్రస్థుల దిగుమతులకు ద్రవ్య సహాయం కొరకు ఋణాలు పొందుట.

8. **దిగుమతుల కొరకై ఋణ సహాయం చేయుటకు (Borrowing to Finance Imports) :-** మొదటి ప్రపంచ యుద్ధానికి పూర్వం విదేశీ ఋణాలు స్వేచ్ఛగా లభించేవి. అంతేగాక స్వదేశంలో కంటే విదేశాలలో వడ్డీరేట్లు తక్కువగా ఉండేవి. విదేశీ పెట్టుబడిదారులు నష్టభయాన్ని భరించే శక్తి తక్కువగా ఉన్నప్పుడు ఆ దేశం లోటు బడ్జెట్ చూపిస్తూ ఇతర దేశముల నుండి ఋణాలు సేకరించేవి. తరువాత ఆర్థిక మాంద్య కాలములో నష్ట భయము పెరగడం వలన, అభివృద్ధి చెందుతున్న దేశాలు చౌక ఆర్థిక విధానాలను అనుసరించినందున ద్రవ్య మార్కెట్‌లో వడ్డీరేట్లు తగ్గినవి.

కాని దేశములో సాధారణ కొనుగోలు శక్తి పెంచడం జరుగుతుంది. కాని విదేశీ చెల్లింపుల శేషంలో లోటును పరిష్కరించుటకు విదేశీ ఋణాలు కోరడం జరుగుతుంది.

ఆధునిక కాలంలో తమ ఎగుమతులకు వ్యాకోచ డిమాండ్ ఉన్న విదేశాల నుండి ఋణాలు పొందుట వల్ల తమ దేశీయంగా ఉన్న పొదుపు లోటును భర్తీ చేయకలిగేవి. ఈ విధంగా పెట్టుబడులు పెంచడం ద్వారా తమ దేశీయ వనరులను దిగుమతులుగా మార్పిడి చేస్తారు. కాని దిగుమతి చేసుకొనే వస్తువుల మధ్య సామీప్యత లోపించింది.

ఉదాహరణకు ఆటోమోబైల్స్, ట్రక్కులు ఒక దేశంలో అధిక మొత్తములో ఉత్పత్తి అయితే వాటినన్నింటిని పని చేయించాలంటే పెట్రోలియం వస్తువులను చాలినంత ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి ఉంటుంది. దేశంలో ఉన్న వనరులను ప్రస్తుతమున్న ఉత్పత్తి స్థానం వద్ద అన్ని రంగాలకు పంపిణీ చేయడంలో కొన్ని సమస్యలు ఉన్నా, ఎగుమతి వస్తువులకు అవ్యాకోచమైన డిమాండ్ ఉన్నప్పుడు గాని దేశీయ వనరులు దిగుమతులకు సరిపడ లేకపోవచ్చు. అప్పుడు దిగుమతులను అభివృద్ధి చేయుటకు విదేశాల నుంచి ఋణాలు చేయాల్సి ఉంటుంది.

**5.3.2 అంతర్జాతీయ మూలధన కదలికలను నిర్ణయించే అంశాలు (Factors Affecting International Capital Movements) :-** అంతర్జాతీయ మూలధన కదలికలను ఈ క్రింది అంశాలు నిర్ణయిస్తాయి.

1. **వడ్డీరేటు :-** వివిధ దేశాల మధ్య వడ్డీరేట్లలో తేడా అంతర్జాతీయ మూలధన కదలికలను నిర్దేశిస్తుంది. వడ్డీరేటు తక్కువగా యున్న దేశము నుండి వడ్డీరేటు అధికముగా యున్న దేశమునకు మూలధనము కదులుతుంది.

2. **అంచనా వ్యాపారము :-** స్వల్పకాలిక మూలధనము వడ్డీరేట్లలో మరియు విదేశీ మారకపు ద్రవ్య విలువలో వచ్చు మార్పుల అంచనాలను బట్టి ఒక దేశము నుండి మరియొక దేశమునకు ప్రవహిస్తుంది.

3. **వ్యాపార లాభాలు :-** పెట్టుబడుల పై వచ్చే లాభాలను బట్టి ముఖ్యముగా ప్రైవేటు అంతర్జాతీయ మూలధన కదలికలు (Private Foreign Capital Movements) జరుగుతాయి.

4. **ఉత్పత్తి వ్యయాలు :-** ఏ దేశములోనైతే ఉత్పత్తి వ్యయాలు తక్కువగా ఉంటాయో ఆ దేశానికి మూలధనము అధికంగా చేరుతుంది.

5. **దేశ ఆర్థిక పరిస్థితులు :-** ఒక దేశములో జనాభా ఆధారిత మార్కెట్ సైజు మరియు మౌళిక సదుపాయాలు అధికముగా యున్నచో ఆ దేశానికి ప్రైవేటు పెట్టుబడులు ఎక్కువగా చేరుతాయి.

6. **ప్రభుత్వ విధానాలు :-** దేశపు ద్రవ్య మరియు కోశ విధానాలు, సుంకాలు, రాయితీలు మొ॥ విదేశీ మూలధన కదలికలను నిర్ణయిస్తాయి.

7. **రాజకీయ పరిస్థితులు :-** ఒక దేశపు రాజకీయ సుస్థిరత, ఇతర దేశాలతో సంబంధాలు, రాజకీయ పార్టీల విధానాలు అంతర్జాతీయ మూలధన కదలికలను నిర్దేశిస్తాయి.

**5.3.3 ఆర్థికాభివృద్ధిలో అంతర్జాతీయ మూలధన పాత్ర (Role of Foreign Capital in Economic Growth) :-** అంతర్జాతీయ మూలధనము అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థికాభివృద్ధికి ఎంతో దోహదపడుతుంది. అంతర్జాతీయ పెట్టుబడుల ద్వారా పారిశ్రామిక అభివృద్ధి జరుగుతుంది. పరిశ్రమలలో ఉపాధి (Employment) అవకాశాలు పెరుగుతాయి. మార్కెట్ విస్తరిస్తుంది. ఉత్పత్తి కారకాల ఆదాయాలు పెరుగుతాయి. బహిర్గత ఆదాలు పెరిగి ఉత్పత్తి సామర్థ్యము పెరుగుతుంది. జాతీయాదాయము

పెరుగుతుంది. దేశములో వినియోగదారులకు వస్తువులు తక్కువ ధరలకు అందుబాటులోకి వస్తాయి. మూలధన సంచయము జరిగి ఆర్థికాభివృద్ధి జరుగుతుంది. ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్తలైన పాల్ స్ట్రీటన్, జి. మెయర్ మాటలలో అంతర్జాతీయ మూలధనము ద్వారా దేశంలో ఉత్పాదకత పెరిగి, నిజ ఆదాయాలు పెరుగుతాయి. ప్రైవేటు లాభాల కంటే సామాజిక పరమైన లాభాలు అధికముగా ఉంటాయి.

## 5.4 సారాంశము :-

అంతర్జాతీయ వర్తకములో వర్తక నిబంధనలు ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి. వర్తక నిబంధనలు అంతర్జాతీయ వస్తు మార్పిడి నిష్పత్తిని తెలియజేస్తాయి. వర్తక నిబంధనలు వివిధ రకాలుగా వర్గీకరించినప్పటికీ అంతర్జాతీయ వ్యాపారములో నిజమైన (లేక) నికరమైన వస్తు వర్తక నిబంధనలు (Net Barter Terms of Trade) అధికముగా చలామణీ అవుచున్నాయి.

దీర్ఘకాలంలో వర్తక నిబంధనలు అభివృద్ధి చెందుచున్న దేశాలలో క్షీణిస్తాయని మిర్డల్, ప్రెబిష్, సింగర్ అను శాస్త్రవేత్తలు వాదించారు. వర్తక నిబంధనలలో వచ్చే మార్పులు ఆ దేశపు జాతీయాదాయం పైన విదేశీ వ్యాపార చెల్లింపుల పైన ప్రభావం చూపుతాయి.

సాంకేతిక ప్రగతి మూడు రకాలుగా ఉంటుందని హిక్స్ అభిప్రాయము. అవి 1. తటస్థ సాంకేతిక ప్రగతి, 2. శ్రమ ఆదా చేయు సాంకేతిక ప్రగతి మరియు 3. మూలధనము ఆదా చేయు సాంకేతిక ప్రగతి. సాంకేతిక ప్రగతి అంతర్జాతీయ వ్యాపారాభివృద్ధికి మరియు వివిధ వర్గాల సంక్షేమానికి దోహదపడుతుంది.

అంతర్జాతీయార్థికాభివృద్ధిలో మూలధన కదలికలు కీలకమైనవి. వాటి ప్రభావము స్వల్ప కాలములో మరియు దీర్ఘ కాలములో కూడా చూడగలము. వివిధ దేశాలలో, ఉత్పాదకత, ఉద్యోగిత, ఆదాయము పెంపొందించుటలో మూలధన కదలికలు ముఖ్యమైనవి.

## 5.5 ముఖ్యమైన సాంకేతిక పదాలు :-

| | |
|---|---|
| విదేశీ వ్యాపార సరుకుల నిబంధనలు | (Commodity Terms of Trade) |
| అంతర్జాతీయ మార్పిడి నిష్పత్తి | (International Exchange Ratio) |
| తటస్థ సాంకేతిక ప్రగతి | (Neutral Technical Progress) |
| శ్రమ ఆదా చేయు సాంకేతిక ప్రగతి | (Labour Saving Technical Progress) |
| మూలధనము ఆదా చేయు సాంకేతిక ప్రగతి | (Capital Saving Technical Progress) |
| అంతర్జాతీయ మూలధన కదలికలు | (International Capital Movements) |

## 5.6 నమూనా ప్రశ్నలు :-

1. వర్తక నిబంధనలు అనగానేమి? వర్తక నిబంధనలలో గల రకాలు నిర్వచించుము?
2. వర్తక నిబంధనలు నిర్ణయించే అంశాలను తెలుపుము.
3. దీర్ఘ కాలములో తగ్గుతున్న వర్తక నిబంధనల ఉపకల్పన సిద్ధాంతమును విశ్లేషించుము?
4. సాంకేతిక ప్రగతి అనగానేమి? హిక్స్ వర్గీకరించిన సాంకేతిక ప్రగతి రకాలు వివరింపుము?

5. సాంకేతిక ప్రగతి అంతర్జాతీయ వ్యాపారానికి ఎట్లు దోహదపడును. తెలుపుము?

6. అంతర్జాతీయ మూలధన కదలికలు ఆర్థికాభివృద్ధిలో ఎటువంటి పాత్రను నిర్వహించునో తెలుపుము?

7. అంతర్జాతీయ మూలధన కదలికలను నిర్ణయించే అంశాలను పేర్కొనుము?

## 5.7 చదువదగిన గ్రంథాలు :-


1. Dominick Salvatore (2001) : International Economics
2. Bo Sodersten & Geoffrey Reed (1994) : International Economics
3. Francis Cheuenilam (2001) : International Economics
4. M.L. Jhingan (2002) : International Economics
5. K.C. Reddy et al (1992) : Antharjaatiya Artha Saastram (Telugu)


- ఆచార్య కె. శ్రీరామమూర్తి

# స్వేచ్ఛా వ్యాపారము - రక్షణ విధానము - రక్షణ వ్యాపార విధానము కొరకు వాదనలు - సుంకాలు -కోటాలు

## 6.0 లక్ష్యం :-

ఈ పాఠ్య భాగం చదివి యీ క్రింది అంశాలను తెలుసుకోగలరు.

* అంతర్జాతీయ వ్యాపార విధానాలు
* స్వేచ్ఛా వ్యాపార విధానము
* రక్షణ విధానము
* రక్షణ విధానము కొరకు వాదనలు
* సుంకాలు - వాటి ప్రభావాలు
* కోటాలు - వాటి ప్రభావాలు

## విషయసూచిక :-


6.1 పరిచయము

6.2 స్వేచ్ఛా వ్యాపారము

6.3 రక్షణ విధానము

6.3.1 శైశవ పరిశ్రమల దశల వాదన

6.3.2 ఆర్థిక వ్యవస్థలో వైవిధ్యం - రక్షణ విధానము

6.3.3 కీలక పరిశ్రమల వాదన

6.3.4 ఉద్యోగిత వాదన

6.3.5 విదేశ వ్యాపార చెల్లింపుల శేషం రక్షణ విధానం

6.3.6 ఆర్థికేతర వాదనలు

6.3.7 రక్షణ విధానము - వెనుకబడిన దేశాలలో పారిశ్రామికీకరణ

6.4 సుంకములు

6.4.1 సుంకాలు - రకాలు

6.4.2 సుంకాల ప్రభావాలు

6.4.3 అభిలషణీయ దిగుమతి సుంకము

6.4.4 టారిఫ్ ఏతర అడ్డంకులు

6.5 కోటాలు

6.5.1 కోటాలు - ప్రభావాలు

6.5.2 దిగుమతి సుంకాలకు - కోటాలకు మధ్యగల పోలికలు

6.6 సారాంశము

6.7 సాంకేతిక పదములు

6.8 నమూనా ప్రశ్నలు

6.9 చదువదగిన గ్రంథాలు

## 6.1 పరిచయము :-

అంతర్జాతీయ వ్యాపార విధానాలు ముఖ్యముగా రెండు రకాలు. అవి - 1. స్వేచ్ఛా వ్యాపార విధానము (Free Trade Policy), 2. రక్షణ విధానము (Protection Policy).

సాంప్రదాయ అర్థశాస్త్రవేత్తలు స్వేచ్ఛా వ్యాపార విధానాన్ని ప్రవేశ పెట్టారు. ఇంగ్లాండ్‌లోని పారిశ్రామిక విప్లవము అనంతరము స్వేచ్ఛా వ్యాపార విధానము అంతర్జాతీయముగా ఊపు అందుకొంది. స్వేచ్ఛా వ్యాపార విధానములో మార్కెట్ శక్తులు అయిన డిమాండ్, సప్లైల అనుసంధానము ద్వారా అంతర్జాతీయముగా ధర నిర్ణయింపబడుతుంది. ఎటువంటి ఆంక్షలు లేకుండా స్వేచ్ఛా వ్యాపారము 17 మరియు 18 వ శతాబ్దాలలో జరిగినది. అయితే 1930లో ప్రపంచ ఆర్థికవ్యవస్థలో వచ్చిన ఆర్థిక మాంద్యం (Economic Depresstion) వలన స్వేచ్ఛా వ్యాపారమునకు ప్రత్యామ్నాయ విధానపు ఆవశ్యకత ఏర్పడినది. దీనితోపాటు మొదటి ప్రపంచ యుద్ధ కాలమందు (1914 - 1918) మరియు యుద్ధ అనంతరము జర్మనీ వంటి ఐరోపా దేశాలు రక్షణ వ్యాపార విధానాన్ని అవలంబించాయి. మరికొన్ని దేశాలు ఎంపిక చేసిన రంగాలలో రక్షణ వ్యాపార విధానాన్ని అమలు చేసినవి. రెండవ ప్రపంచ యుద్ధానంతరము (1939 - 45) ప్రపంచ వ్యాప్తముగా చాలా దేశములకు స్వాతంత్ర్యము లభించినది. ఈ దేశాలలో శైశవ పరిశ్రమల రక్షణ కోసం, రక్షణ వ్యాపార విధానము ప్రాముఖ్యతను సంతరించుకొన్నది.

## 6.2 స్వేచ్ఛా వ్యాపారము :-

స్వేచ్ఛా వ్యాపారము అనగా ఏ విధమైన ఆంక్షలు నిర్బంధాలు, చెల్లింపులు లేకుండా స్వచ్ఛందముగా వివిధ దేశాల మధ్య జరిగే వ్యాపారము. ఆచార్య జగదీష్ భగవతి మాటలలో స్వేచ్ఛా వ్యాపార విధానం అనగా "ఏ విధమైన సుంకాలు, కోటాలు, మారకపు రేటు నియమాలు, పన్నులు, సబ్సిడీలు, ఉత్పత్తి రంగములోనే కాకుండా వినిమయ రంగములో కూడా లేకుండా ఉండుట".

స్వేచ్ఛా వ్యాపారము వలన ఈ క్రింది లాభాలను పొందవచ్చు. అవి -

1. స్వేచ్ఛా వ్యాపారము వలన అంతర్జాతీయ శ్రమ విభజన జరిగి, వివిధ దేశాల మధ్య ఉత్పత్తుల ప్రత్యేకీకరణకు దోహదపడుతుంది.

2. దేశములో ఉండే వనరుల లభ్యతననుసరించి ఉత్పత్తి ప్రత్యేకీకరణ జరుగుతుంది. వనరులు సమర్థవంతముగా వినియోగించబడతాయి.

3. వివిధ వస్తువుల ఉత్పత్తిలో అధికముగా పాల్గొనడము వలన అనుభవం పెరిగి సాంకేతిక నైపుణ్యము మెరుగుపడుతుంది. అంతర్జాతీయముగా మార్కెట్ విస్తరణ జరిగి ఉత్పత్తి వ్యయం తగ్గుతుంది.

4. భారీ ఉత్పత్తులు జరిగి, భారీ ఉత్పత్తి ఆదాలు (Economy's of Scale) లభిస్తాయి. స్వేచ్ఛా వాణిజ్యము ఏ విధమైన ఏకస్వామ్య విధానాలను వృద్ధి చెందకుండా చూస్తుంది.

5. అంతర్జాతీయముగా ఆర్థిక, సాంకేతిక, సహకారాన్ని వృద్ధి చేస్తుంది.

స్వేచ్ఛా వ్యాపారము వలన కొన్ని నష్టాలు కూడా ఉన్నాయి. అవి -

1. స్వేచ్ఛా వ్యాపారము ఒక దేశ ఆర్థికవ్యవస్థలో కొన్ని రంగాల అభివృద్ధికే దోహదం చేస్తుంది. ముఖ్యముగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో వ్యవసాయ రంగానికి సరి అయిన ప్రాముఖ్యత లభించదు.

2. స్వేచ్ఛా వ్యాపారము వలన నాసిరకమైన, నిరుపయోగమైన, ప్రమాదకరమైన వస్తువులు ఎక్కువగా ఉత్పత్తి జరుగుతుంది.

3. బహుల జాతి సంస్థల అభివృద్ధికి ఈ విధానం దోహదపడుతుంది.

4. వ్యాపార చక్రాలు అభివృద్ధి చెందిన దేశాల నుండి, అభివృద్ధి చెందుతున్న దేశాలకు స్వేచ్ఛా వ్యాపారము ద్వారా సరఫరా అవుతాయి.

5. పరిపూర్ణమైన పోటీ, వాస్తవ పరిస్థితిలో ఏ దేశములో కూడా సాధ్యపడదు. దీని మూలముగా అభివృద్ధి చెందిన దేశాలు మరియు బహుళ జాతి సంస్థలు, అభివృద్ధి చెందుతున్న దేశాల వనరులను దోపిడీ చేసే అవకాశం ఉంటుంది.

## 6.3 రక్షణ విధానం :-

ప్రభుత్వం విదేశీయ వస్తువుల దిగుమతుల పై సుంకాలు విధించి మరియు దేశీయ వస్తువుల ఉత్పత్తిలో సబ్సిడీలు మరియు ఇతర ప్రోత్సాహకాలు కల్పించి దేశీయ పరిశ్రమలకు రక్షణ కల్పించడం రక్షణ విధానం ద్వారా దేశీయ ఉత్పత్తులు పెరగడం ద్వారా కాకుండా విదేశీయ వస్తువులకు ధీటుగా పరిశ్రమలు అభివృద్ధి చెందడానికి దోహదపడతాయి.

రక్షణ విధానంకు అనుకూలమైన ఎన్నో వాదనలు గలవు. హెబర్‌లర్ వీటిని రెండు విధములుగా విభజించినారు. అవి - 1. ఆర్థిక వాదనలు, 2. ఆర్థికేతర వాదనలు. ఆర్థిక వాదనలలో ముఖ్యమైనది శైశవ దశ పరిశ్రమల రక్షణ వాదము.

6.3.1 శైశవ దశ పరిశ్రమల వాదన (Infant Industry Argument) :- శైశవ దశ పరిశ్రమలు అనగా అభివృద్ధి తొలి దశలో ఉన్న పరిశ్రమలు. అభివృద్ధి చెందుతున్న దేశాలలో శైశవ పరిశ్రమలను విదేశీయ పరిశ్రమల పోటీ నుంచి రక్షించడానికి దిగుమతి సుంకాలను (Tariffs) విధించడం చాలా అవసరం అనే వాదనను అలెగ్జాండర్ హెమిల్టన్ 1790లో ప్రవేశ పెట్టినాడు. ఈ వాదనను ఫెడరిక్ లిస్ట్ 1885లో బలపరిచిరి. ఒక దేశంలో క్రొత్తగా స్థాపించబడిన పరిశ్రమలు అదే రకమైన వస్తువులను ఉత్పత్తి చేసే అభివృద్ధి చెందిన, విదేశీ పరిశ్రమలతో పోటీకి నిలబడలేక క్రమంగా అదృశ్యమైపోవటానికి అవకాశం ఉంటుంది. అలా కాకుండా కొంతకాలంపాటు విదేశీ దిగుమతుల పై సుంకాలు విధించి దేశంలోని పరిశ్రమలకు రక్షణ కల్పించినట్లయితే ఆ పరిశ్రమలు అంతర్జాతీయ పోటిని తట్టుకొంటాయి. క్రమంగా అభివృద్ధి చెందుతాయి అని సూచించటం జరుగుతుంది. అంతేకాకుండా ఈ విధంగా అభివృద్ధి సాధించటం జరుగుతుంది. అభివృద్ధి పూర్తిగా సాధించిన తరువాత ప్రభుత్వం ఏ విధమైన రక్షణ కల్పించకపోయినా విదేశీ పరిశ్రమలతో పోటీ చేయగల సమర్థత స్వదేశీయ పరిశ్రమలకు కూడా ఉంటుంది.

శైశవ పరిశ్రమలకు రక్షణ కలిపించడం ద్వారా ఆ పరిశ్రమలలో భారీ ఉత్పత్తి ఆదాలు జరిగి ఉత్పత్తి వ్యయాలు తగ్గి దీర్ఘకాలంలో విదేశీయ పరిశ్రమలతో పోటీని తట్టుకోగలుగుతాయి. అయితే రక్షణ విధానం వలన దేశంలో వస్తువుల ధర పెరిగి వినియోగదారులకు కొంత ఇబ్బంది స్వల్పకాలంలో జరుగుతుంది. ఇది దేశంలో ఆర్థికాభివృద్ధి దిశగా లభించే

సాంఘిక సంక్షేమము చూచినట్లయితే వినియోగదారులపై పడే భారం స్వల్పకాలిక త్యాగంగా గుర్తించవలసి ఉంటుంది. ప్రముఖ ఆర్థికశాస్త్రవేత్తలు అయిన J.S. Mill మరియు బాస్టెబుల్ ఈ రక్షణ విధానాన్ని తాత్కాలికంగా దేశీయ పరిశ్రమలు విదేశీయ పోటీని తట్టుకొనేంత వరకు మరియు ఉత్పత్తి వ్యయాలను బాగా తగ్గించుకొనేంత వరకు అనుసరిస్తే చాలా మంచిది అని భావించిరి.

రక్షణ విధానం అనుసరించడంలో కొన్ని ఇబ్బందులు ఎదురవుతాయి. అవి -

1. ఏ పరిశ్రమకు ఎంతకాలం రక్షణ ఇవ్వవలసి ఉంటుందీ అన్నది ముందుగా తెలుసుకోవడం సాధ్యపడదు.
2. రక్షణ విధానాన్ని ఒక పరిశ్రమకు వర్తింపజేసి తరువాత దానిని ఏ తరుణములో నిల్పివేయాలన్నది నిర్ధారించడం కష్టం.
3. రక్షణ విధానం వలన కొన్ని పరిశ్రమలు అధిక లాభాలను ఆర్జించి ఏకస్వామ్యముగా ఆవిర్భవించే అవకాశం ఉన్నది.
4. ఆర్థిక శాస్త్రవేత్త అయిన హెబర్లలన్ శైశవ పరిశ్రమ వాదన అంతర్గత, బహిర్గత ఉత్పత్తి ఆదాలకు దారి తీస్తుంది అనే వాదనను తోసిపుచ్చిరి.

పైన పేర్కొనిన కొన్ని ఇబ్బందులు ఉన్నప్పటికి రక్షణ విధానం అభివృద్ధి చెందుతున్న దేశాలలో చాలా వరకు అమలులో ఉన్నది.

**6.3.2 ఆర్థికవ్యవస్థలో వైవిధ్యం - రక్షణ విధానం :-** రక్షణ విధానం అనుసరించి ఆర్థికవ్యవస్థలో వైవిధ్యం తీసుకురావడం అవసరం అని కొంతమంది ఆర్థికవేత్తల వాదన. ఆర్థికవ్యవస్థలో వైవిధ్యం ఏర్పడితే దాని ద్వారా వివిధ రంగాలు అభివృద్ధి చెందడానికి వీలు కలుగుతుంది. ముఖ్యముగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు మరియు వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు సమతౌల్యముగా అభివృద్ధి చెందవలసి ఉంది. సమతౌల్య ఆర్థికాభివృద్ధి కొరకు మరియు అంతర్జాతీయ ఒడిదుడుకుల నుండి దేశ ఆర్థికవ్యవస్థను కాపాడుట కొరకు దిగుమతుల పై సుంకం విధించి దేశీయ పరిశ్రమలకు రక్షణ కలిపించవలసి ఉంది.

**6.3.3 కీలక పరిశ్రమల వాదన :-** సాంఘీకపరముగా అత్యంత కీలక పరిశ్రమలు అయిన ఇనుము, ఉక్కు, భారీ రసాయనాలు యంత్ర సామాగ్రి, భారీ విద్యుత్ పరికరాలు మొదలగు పరిశ్రమల అభివృద్ధి కొరకు రక్షణ విధానము ఎంతో దోహదపడుతుంది. అభివృద్ధి చెందుతున్న దేశాలలో పై వస్తువుల దిగుమతుల పై సుంకాలు విధించుట ద్వారా స్వదేశీయ పరిశ్రమలకు రక్షణ కలుగుతుంది.

**6.3.4 ఉద్యోగితా వాదము :-** అభివృద్ధి చెందుతున్న దేశాలలో నిరుద్యోగము అతి పెద్ద సమస్య. రక్షణ విధానము వలన దిగుమతులు తగ్గించడము ద్వారా దేశీయ పరిశ్రమలలో పెట్టుబడులు పెరిగి, ఉద్యోగిత, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. ఒక భారీ పరిశ్రమలో ఉద్యోగిత అవకాశాలు పెరిగితే దాని అనుబంధ పరిశ్రమలలో కూడా అదే విధానం కొనసాగుతుంది. ఈ దృష్ట్యా ఉద్యోగిత అవకాశాలు పెంపొందించుటలో రక్షణ విధానం పేద దేశాలకు ఎంతో ఉపకరిస్తుంది.

సాధారణముగా అభివృద్ధి చెందిన దేశాలు మరియు బహుళ జాతీయ సంస్థలు, అంతర్జాతీయ మార్కెట్‌లో పట్టు సాధించడం కోసం డంపింగ్ విధానాన్ని అనుసరిస్తాయి. ఈ డంపింగ్ విధానములో ఒక వస్తువు స్వదేశీయ మార్కెట్‌లోకంటే విదేశీయ మార్కెట్‌లో ధర తగ్గించి అమ్మడం. అభివృద్ధి చెందుతున్న దేశాలు ఈ డంపింగ్ విధానము నుండి తమ పరిశ్రమలను రక్షించి కొనే విధానంగా ప్రతి డపింగ్ సుంకాలను విధిస్తాయి. ఈ దేశాల పారిశ్రామికాభివృద్ధికి ప్రతి డంపింగ్ విధానం చాలా ముఖ్యమైనది.

**6.3.5 విదేశీయ వ్యాపార చెల్లింపు శేషం - రక్షణ విధానం :-** అభివృద్ధి చెందుతున్న దేశాలు సర్వసాధారణముగా విదేశీయ వ్యాపార చెల్లింపు శేషంలో లోటు ఎక్కువగా ఉంటుంది. విదేశీయ వ్యాపార చెల్లింపు శేషాల సమతౌల్యంగా ఉండాలంటే ఈ దేశాలలో దిగుమతులు తగ్గి, ఎగుమతులు పెంచవలసి ఉంది. దీని కొరకు దిగుమతుల పై సుంకాలను, ఎగుమతుల పై సిబ్సిడీలు మరియు రాయితీలు ఇచ్చి విదేశీయ వ్యాపార చెల్లింపు శేషంలో సమతౌల్య స్థితిని సాధించడానికి వీలు పడుతుంది. ఇది ఈ దేశాలలో వ్యాపార నిబంధనల పై బేరమాడు శక్తిని కూడా పెంపొందిస్తుంది.

**6.3.6 ఆర్థికేతర వాదనలు :-** ఈ క్రింది మూడు వాదనలు అతి ముఖ్యమైనవి. అవి -

1. **రక్షణ విధానము :-** దేశ రక్షణ దృష్ట్యా రక్షణ పరిశ్రమలను అభివృద్ధి పరుచుకోవలసిన ఆవశ్యకత ప్రతి దేశానికి ఉంది. "అర్థశాస్త్ర పితామహుడైన" ఆడమ్‌స్మిత్ కూడా దేశ రక్షణ, దేశ సంపద కంటే ముఖ్యమైనది అని పేర్కొన్నాడు. రక్షణ పరిశ్రమలు అభివృద్ధి చెందాలంటే రక్షణ సామాగ్రికై విదేశాల మీద ఆధారపడరాదు. రక్షణ సామాగ్రి దిగుమతుల పై భారీగా సుంకాలు విధించి వాటిని దేశీయంగా ఉత్పత్తి చేయుటకు ప్రోత్సాహకాలు కలిపించవలసి ఉంది. దేశ రక్షణ దృష్ట్యా రక్షణ పరికరాల ఉత్పత్తిలో సమృద్ధి సాధించుట అతికీలకమైన అంశము.

2. **ఆచార విచారాలు పరిరక్షించే విధానము :-** ప్రతి దేశములో కొన్ని ప్రత్యేక ఆచారాలు విచారాలు ఉంటాయి. వ్యవసాయము, చేతి వృత్తులు, కొన్ని దేశములకు జీవన విధానముగా ఉంటుంది. వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతుల పై మరియు చేతి వృత్తుల ద్వారా ఉత్పత్తి అయిన వస్తువుల దిగుమతుల పై సుంకాలు విధించడం ద్వారా దేశీయంగా ఈ రంగాలలో పని చేస్తున్న వారి ఆచార, విచారాలను పరిరక్షించుకోగలవు. హెబర్లోల్ వాదన ప్రకారము వ్యవసాయం, మానవ జాతి మనుగడకు మరియు పునరుద్ధరణకు ఒక నిరంతర జలపాతం వంటిది. అందుచేత వ్యవసాయ రంగాన్ని ప్రతి దేశం జీవనాధార రంగముగా భావించి రక్షించుకోవలసి ఉంది.

3. దేశభక్తి మరియు జాతీయత దృక్పథం పెంపొందే వాదన :- భారతదేశం వంటి దేశాలలో స్వదేశీ పరిశ్రమలు అయిన ఖాదీ మరియు అద్దకం, బొమ్మల తయారీ, కళా ఖండాల తయారీ మొదలగు పరిశ్రమలు దేశభక్తిని, జాతీయత భావాన్ని పెంపొందించే పరిశ్రమలు. మహాత్మాగాంధీ స్వదేశీ విధానం అవలంబించడం ద్వారా జాతికి స్వాతంత్ర్యం సాధించుటలో సఫలీకృతుడు అయినాడు.

   స్వదేశీయ విధానము ద్వారా దేశభక్తిని, జాతీయతా భావాన్ని పెంపొందించగలమని మహాత్మాగాంధీ రుజువు చేసిరి. అందుచేత ఏ దేశములోనైనా దేశభక్తిని ప్రజలలో పెంపొందించుటకు స్వదేశీయ పరిశ్రమలకు రక్షణ కలిపించటం ఎంతో అవసరం.

**6.3.7 రక్షణ విధానం - వెనుకబడిన దేశాలలో పారిశ్రామికీకరణ :-** వెనుకబడిన దేశాలలో పారిశ్రామికీకరణ చాలా ప్రముఖ పాత్ర పోషిస్తుంది. ఈ దేశాలు త్వరితగతిన ఆర్థికాభివృద్ధి సాధించాలంటే పారిశ్రామికీకరణ జరగవలసి ఉంది. దీని కొరకు రక్షణ విధానం ఎంతో అవసరం. వెనుకబడిన దేశాలు రక్షణ విధానం అనుసరించడం ద్వారా ఆ దేశాలలో శైశవ పరిశ్రమల అభివృద్ధి మరియు ఆర్థికవ్యవస్థలో వైవిధ్యం జరుగుతుంది. అంతేకాకుండా విదేశీయ చెల్లింపుల శేషంలో సమతౌల్యం, మూలధన సంచయనము, విదేశీయ పెట్టుబడులు, భారీ ఉత్పత్తి, ఆదాల సాధన, ఆర్థికవ్యవస్థలో స్వయం సమృద్ధి మరియు త్వరితగతిన ఆర్థికాభివృద్ధి సాధించుటకు రక్షణ విధానం వెనుకబడిన దేశాలకు చాలా అవసరం.

## 6.4 సుంకములు (Traiffs):-

వస్తువులు ఒక దేశపు సరిహద్దు దాటి మరి ఒక దేశములో ప్రవేశించినపుడు విధించే పన్ను (లేదా) సుంకాన్ని 'tariffs' అందురు. ఇవి దేశపు దిగుమతి పై విధిస్తే దిగుమతి సుంకాలుగాను, ఎగుమతుల పై విధిస్తే ఎగుమతుల సుంకాలుగాను పరిగణించబడతాయి. సాధారణముగా అంతర్జాతీయ వ్యాపారములో సుంకాలు దిగుమతి సుంకాలుగా, పరిగణలోనికి వచ్చాయి. ఇవి అంతర్జాతీయ వ్యాపార రక్షణలో ప్రముఖ పాత్ర వహిస్తున్నాయి.

**6.4.1 సుంకాలు - రకాలు :-** సుంకాలు అనేక రకములు. వాటిని ఈ క్రింది నాలుగు విధములుగా వర్గీకరించవచ్చు.

**I వస్తువుల మూలము మరియు గమ్యము (Origin and Destination) ఆధారంగా విధించే సుంకాలు :-**

1. **ఎగుమతి సుంకాలు (Export Duties) :-** వస్తువులు ఎగుమతి చేసే దేశంలోనే ఆ దేశపు ఎగుమతుల పై సుంకాలను విధించిన యెడల వాటిని ఎగుమతి సుంకాలుగా పిలుస్తారు.

2. **దిగుమతి సుంకాలు (Import Duties) :-** ఒక దేశము దిగుమతి చేసుకున్న వస్తువుల పై సుంకాలను విధించిన యెడల అవి దిగుమతి సుంకాలుగా పిలువబడతాయి. ఇవి వస్తు గమ్యము ఆధారముగా విధింపబడిన సుంకాలు.

3. **రవాణా సుంకాలు (Transit Duties) :-** ఒక వస్తువు ఉత్పత్తి చేయబడిన దేశం నుండి వేరొక దేశం గుండా రవాణా చేయబడి దిగుమతి చేసుకొన్న దేశాలకు చేరే లోపు విధించే సుంకాలను రవాణా సుంకాలుగా పేర్కొనవచ్చు. ఉదాహరణకు ఒక వస్తువు బంగ్లాదేశ్ నుండి భారత భూభాగం ద్వారా నేపాల్‌కు రవాణా జరిగినపుడు భారతదేశం విధించే సుంకాన్ని రవాణా సుంకంగా పిలుస్తారు.

**II. పరిమాణాత్మక విభజన (Quantification) ఆధారంగా విధించే సుంకాలు :-**

1. **దిగుమతి వస్తువు విలువ ప్రాతిపదికగా విధించే సుంకాలు (Advalorem Duties) :-** దిగుమతి చేయు వస్తువుల విలువ ఆధారంగా కొంత శాతం సుంకాన్ని విధిస్తే అది విలువ ప్రాతిపదికగా విధించే సుంకంగా పిలువబడుతుంది.

2. **దిగుమతి వస్తువు పరిమాణం ప్రాతిపదికగా విధించే సుంకాలు (Specific Duties) :-** దిగుమతుల పరిమాణాన్ని ఆధారంగా తీసుకొని ఒక నిర్ణీత రేటులో సుంకాలను విధించిన యెడల అవి పరిమాణ ఆధారిత సుంకాలుగా పిలువబడతాయి.

3. **విలువ మరియు పరిమాణం ఆధారిత సుంకాలు (Compound Duties) :-** దిగుమతి చేయు వస్తువుల యొక్క విలువ మరియు పరిమాణము పరిగణనలోకి తీసుకొని సుంకాలను విధిస్తే అవి విలువ మరియు పరిమాణం ఆధారిత మిశ్రమ సుంకాలు.

**III. వివిధ దేశాల మధ్య విచక్షణతో విధించే సుంకాలు :-**

1. **సింగిల్ కాలమ్ సుంకం (Single - Column Tariff) :-** వివిధ దేశాల నుండి దిగుమతి చేయు వస్తువుల పై ఎటువంటి విచక్షణ లేకుండా ఒకే రేటు సుంకాన్ని విధిస్తే అది సింగిల్ కాలమ్ సుంకంగా పిలువబడుతుంది.

2. **డబుల్ కాలమ్ సుంక్ (Double - Column Tariff) :-** దిగుమతుల పై రెండు విధములైన రేట్లు విధించి వివిధ దేశాల మధ్య విచక్షణ చూపిన యెడల అవి డబుల్ కాలం సుంకాలుగా పిలువబడతాయి.

3. **ట్రిపుల్ కాలమ్ సుంకాలు (Triple - Column Tariff) :-** వివిధ దిగుమతి వస్తువుల పై సాధ రణ, మధ్యస్థ మరియు ప్రాధాన్య రేట్లుగా మూడు రకాల సుంకాల రేట్లు విధించిన యెడల ఆ విధానాన్ని ట్రిపుల్ కాలమ్ సుంకాలుగా పిలుస్తారు.

**IV. ప్రయోజనం (Purpose) ఆధారంగా విధించే సుంకాలు :-**

1. **ఆదాయ సుంకాలు (Revenue Tariffs) :-** దేశపు ఆదాయాన్ని దృష్టిలో పెట్టుకొని దిగుమతుల పై విధించే సుంకాన్ని ఆదాయ సుంకంగా పిలుస్తారు. ఈ సుంకాలు దేశపు దిగుమతులను నిరోధించుట కంటే దేశపు ఆదాయాన్ని పెంచుటయే ప్రధాన లక్ష్యంగా విధించబడతాయి.

2. **రక్షక సుంకాలు (Protective Tariffs) :-** విదేశీ పరిశ్రమల పోటీ నుండి స్వదేశీ పరిశ్రమలను కాపాడుటకై అత్యధిక రేటులో విధించే సుంకాలను రక్షక సుంకాలుగా పిలుస్తారు.

3. **ప్రతి డంపింగ్ సుంకాలు (Anti - Dumping Duties) :-** సాధారణముగా దిగుమతుల పై విధించే సుంకాలతో బాటు, ఒక దేశపు మార్కెట్‌లో అతి తక్కువ ధరలో డంపింగ్ చేయబడుచున్న విదేశీ వస్తువుల పై ప్రత్యేకంగా విధించే సుంకాలను ప్రతి డంపింగ్ సుంకాలందురు.

**6.4.2 సుంకాల ప్రభావాలు (Effects of Tariffs) :-** ఒక ఆర్థిక వ్యవస్థ పై సుంకాల యొక్క ప్రభావము అనేక విధములుగా ఉంటుంది. ప్రొఫెసర్ కిండిల్ బర్జర్ సుంకాల ప్రభావాన్ని ఎనిమిది రకములుగా వర్ణించాడు. అవి -

1. రక్షణ ప్రభావము (Protective Effect)
2. వినియోగ ప్రభావము (Consumption Effect)
3. రాబడి ప్రభావము (Revenue Effect)
4. పునః పంపిణీ ప్రభావము (Redistributive Effect)
5. విదేశీ వ్యాపార నిబంధనల ప్రభావము (Terms of Trade Effect)
6. పోటీ ప్రభావము (Competitive Effect)
7. ఆదాయ ప్రభావము (Income Effect) మరియు
8. విదేశీ చెల్లింపుల ప్రభావము (Balance of Payments Effect)

1. **రక్షణ ప్రభావము :-** దిగుమతి వస్తువుల పై సుంకం విధించడం వలన వాటి ధర పెరుగుతుంది. దిగుమతి వస్తువుల ధర పెరగడం వలన వాటి డిమాండ్ తగ్గి దేశీయ వస్తువులకు డిమాండ్ పెరుగుతుంది. స్వదేశీయ పరిశ్రమలకు ఉత్పత్తి పెరిగి భారీ ఉత్పత్తి ఆదాలు లభిస్తాయి.

2. **వినియోగ ప్రభావము :-** దిగుమతుల పై సుంకం విధించినపుడు వాటి ధర పెరిగి, వాటి వినియోగం తగ్గుతుంది. ఈ కారణముగా వినియోగదారుల మిగులు క్షీణిస్తుంది. అందుచేత సుంకాలు వినియోగదారుల సంక్షేమానికి అవరోధాలని కొంతమంది వాదన.

3. **రాబడి ప్రభావము :-** దిగుమతి సుంకాలు ప్రభుత్వానికి అతి విలువైన ఆదాయాలను సమకూర్చుతాయి. దిగుమతి సుంకాలు, దిగుమతులను పూర్తిగా నిరోధించే సుంకాలు (Prohibitive Tariffs) గా మారనంతవరకు ప్రభుత్వానికి ఆదాయాన్ని చేకూరుస్తాయి.

4. **పునః పంపిణీ ప్రభావము :-** దిగుమతి సుంకాలు, దిగుమతులను నిరోధించడంతో పాటు స్వదేశీ వస్తువులకు అధిక గిరాకీ ధరను చేకూరుస్తాయి. ఈ కారణముగా స్వదేశీ ఉత్పత్తులు పెరిగి వినియోగదారుల మధ్య మరియు ఉత్పత్తిదారుల మధ్య ఆదాయాలు పునః పంపిణీ జరుగుతుంది.

5. **విదేశీయ వ్యాపార నిబంధనలు ప్రభావము :-** దిగుమతి సుంకాలు విధించడం ద్వారా ఆ వస్తువుల డిమాండ్ తగ్గి, ఆ వస్తువులను ఉత్పత్తి చేసే దేశాలు వాటి ధరను తగ్గించేటట్లు ప్రభావితం చేస్తాయి. ఈ కారణముగా దిగుమతి చేసుకొంటున్న దేశానికి సరళమైన వ్యాపార నిబంధనలు అనుకూలంగా లభిస్తాయి.


6. **పోటీ ప్రభావము :-** దేశీయ పరిశ్రమలను అభివృద్ధి చెందిన విదేశీయ పరిశ్రమల పోటి నుండి కాపాడడంలో దిగుమతి సుంకాలు ప్రముఖ పాత్ర వహిస్తాయి. అయితే ఈ రక్షణ దీర్ఘకాలముగా ఉండకూడదు. ఇది దీర్ఘకాలంగా ఉంటే స్వదేశములో ఏకస్వామ్యం ఏర్పడే ప్రమాదం ఉంది.

7. **జాతీయ ఆదాయ ప్రభావము :-** దిగుమతి సుంకాలు విధించడం వలన ఆ దేశ ప్రజలు దిగుమతి వస్తువులు కొనుగోలు చేయడానికి బదులు స్వదేశీయ వస్తువులను కొనుగోలు చేస్తారు. దీని కారణముగా స్వదేశీయ పరిశ్రమలలో ఉద్యోగితా మరియు ఆదాయాలు మెరుగుపడతాయి. పొదుపు పెట్టుబడులు కూడా పెరుగుతాయి. ఈ విధముగా దిగుమతి సుంకాలు జాతీయ ఆదాయాన్ని, ఉద్యోగితను పెంచుతాయి.

8. **విదేశీయ చెల్లింపుల ప్రభావము :-** దిగుమతి సుంకాలను విధించడం ద్వారా దిగుమతులను తగ్గించి, విదేశీయ చెల్లింపు లోటును భర్తీ చేయడం వీలుపడుతుంది. అంతేకాకుండా విదేశీయ చెల్లింపుల సమతౌల్యాన్ని సాధించుటకు ఇవి దోహదపడతాయి.

పైన పేర్కొన్న వివిధ దిగుమతి సుంకాల ఫలితాన్ని ఈ క్రింది రేఖా పటము ద్వారా తెలుసుకోవచ్చును.

**పటము - 6.1**




**రేఖా పట వివరణ :-** పై పటములో వస్తువు ధర పెరగటం టారిఫ్ (Tariff) ఫలితం మాత్రమే. టారిఫ్‌కు ముందు ధర 'OP' అయితే '$OQ_5$' పరిమాణంలో వస్తు వినియోగం జరిగింది. దీనిలో "$OQ_1$" పరిమాణాన్ని స్వదేశంలో ఉత్పత్తి చేస్తే "$Q_1Q_5$" వస్తు పరిమాణం దిగుమతి అయింది. ఇప్పుడు "$t_1$" టారిఫ్ విధించినందు వల్ల ధర "$P+t_1$"కు పెరిగింది. ధర

పెరిగినందు వల్ల వినియోగం '$OQ_4$'కు తగ్గింది. అందులో దేశీయ ఉత్పత్తి "$OQ_2$" కు పెరిగి దిగుమతులు "$Q_2Q_4$"కి పడిపోయాయి. ఇంకా ఎక్కువ మొత్తంలో అంటే "$t_2$" టారిఫ్ విధిస్తే, వస్తువు ధర "$P+t_2$"కు పెరిగి దేశీయ ఉత్పత్తిని '$OQ_3$'కు పెంచుతుంది. వినియోగం '$OQ_3$'కు పడిపోతుంది.

ఇక్కడ దిగుమతులు పూర్తిగా పడిపోయి దేశీయ వస్తు ఉత్పత్తి వస్తు వినియోగానికి సమానంగా ఉంటుంది. ఇటువంటి టారిఫ్‌ను నిషేధపు టారిఫ్ అందురు. కాబట్టి టారిఫ్ వస్తువు ధరను, వినియోగాన్ని, ఉత్పత్తిని, దిగుమతులను మారుస్తుంది. ఈ టారిఫ్ వ్యయం ఎంతో పరిశీలింపవచ్చు.

పై రేఖా పటంలో "FKDG" వినియోగదారుల మిగులులో నష్టం

"JHKL" ప్రభుత్వ ఆదాయం

"GIHF" ఉత్పత్తిదారుల మిగులు

"IJH" రక్షణ వల్ల ఉత్పత్తి వ్యయం


అంటే టారిఫ్ వల్ల వనరుల కేటాయింపు సక్రమంగా జరగలేదన్న మాట. అదే వస్తువును దిగుమతి చేసుకుంటే ఇంకా తక్కువ ధరకు వచ్చుండేది కదా! "KLD" రక్షణ వల్ల వినియోగ వ్యయాన్ని కొలుస్తుంది.

అంటే టారిఫ్ వేయడం వల్ల ఒక యూనిట్ వస్తు విలువ అంతర్జాతీయ ఉత్పత్తిదారుని కన్నా దేశీయ వినియోగదారునికి ఎక్కువ.

టారిఫ్ (Tariff) వేసినందువల్ల వర్తక నిబంధనలు మారవని చెప్పటానికి వీలులేదు. టారిఫ్ వల్ల దిగుమతులు పడిపోతాయి. కాబట్టి ఇతర దేశాలు ఎగుమతి వస్తు ధరలను తగ్గించి అమ్మటానికి ప్రయత్నిస్తారు. అందువల్ల వర్తక నిబంధనలు ఈ దేశానికి అనుకూలంగా ఉంటాయి. తద్వారా దేశపు నికర ఆదాయం పెరుగుతుంది. కాని ఆదాయ పంపిణీ మారవచ్చు. Stolpher, Samuelson అనే ఆర్థికవేత్తలు టారిఫ్ వల్ల దిగుమతి ప్రత్యామ్నాయ రంగంలో ఎక్కువ ఉపయోగించే ఉత్పత్తి కారకం ప్రతిఫలం పెరుగుతుందని చెప్పారు.

**6.4.3 అభిలషణీయ దిగుమతి సుంకము (Optimum Tariff) :-** ఒక దేశము యొక్క వ్యాపార ఉదాసీనతా రేఖ విదేశము యొక్క బదులు ఇచ్చు రేఖ అనగా సప్లయి రేఖకు స్పర్శ రేఖగా నున్నప్పుడు అభిలషణీయ దిగుమతి సుంకము ఏర్పడుతుంది. ఎగుమతులు, దిగుమతుల మధ్య ఉన్న వివిధ సమాన తృప్తి రేఖలు ఆ దేశము యొక్క వ్యాపార ఉదాసీనతా రేఖలు. గత వ్యాపార ఉదాసీనత కన్నా ఎగువ వున్నది ఎక్కువ వ్యాపారమును దిగువనున్నది తక్కువ వ్యాపారమును సూచిస్తుంది. దిగుమతుల పై సుంకములు విధించినపుడు దిగుమతులు తగ్గినందున విదేశ వ్యాపార నిబంధనలు అనుకూలమవుతాయి. అందుచేత వ్యాపార ఉదాసీనతా రేఖ ఎగువ స్థాయికి కదులుతుంది. ఇలా దిగుమతి సుంకముల వలన విదేశ వ్యాపార నిబంధనలు అనుకూలమగుకొలది వ్యాపార ఉదాసీనత రేఖ ఎగువ స్థాయికి కదులుతుంటుంది. అయితే ఇది నిరవధికంగా ఎగువ స్థాయికి కదులుటకు వీలుండదు. ఎంత మేరకు వ్యాపార ఉదాసీనత రేఖ ఎగువస్థాయికి చేరగలదు అన్నది ఆ వస్తువు ఎగుమతి చేయు దేశపు offer curve పై ఆధారపడి ఉంటుంది. దిగుమతి చేసుకొను దేశపు వ్యాపార ఉదాసీనతా రేఖ ఎగుమతి చేయు దేశపు ఆఫర్ రేఖకు ఏ బిందువు దగ్గర స్పర్శరేఖ అవుతుందో అది సమతౌల్యపు అభిలషణీయ సుంకము తెలిపే స్థాయి. దీనిని మించి సుంకము విధించిన యెడల అది రెండు దేశాలకు లాభదాయకము కాదు. అభిలషణీయ టారిఫ్ ఈ క్రింది రేఖా పటములో చూడగలము.

పటము - 6.2 అభిలషణీయ సుంకము




పై రేఖా పటములో OH మరియు OF రేఖలు స్వదేశము యొక్క మరియు విదేశము యొక్క ఆఫర్ రేఖలు. స్వేచ్ఛా వాణిజ్యము ద్వారా ఆ రెండు రేఖలు "E" అను బిందువు వద్ద ఖండించుకొని "OT" సమతౌల్య వర్తక నిబంధనలతో అంతర్జాతీయ వర్తకము జరుపుచుండెను. IC రేఖ స్వదేశము యొక్క వాణిజ్య ఉదాసీనతా రేఖ.

అయితే స్వదేశము, విదేశముల నుండి దిగుమతి చేయు వస్తువు పై సుంకము విధించిన యెడల ఆ దేశపు వ్యాపార ఆఫర్‌రేఖ విదేశ ఆఫర్ రేఖను 'E' మరియు 'S' బిందువుల మధ్య ఖండించుకొనెను. ఈ రెండు బిందువుల మధ్య '$E_1$' బిందువు వద్ద దిగుమతి చేసుకొనుచున్న దేశపు వ్యాపార ఉదాసీనత రేఖ "$C_1I_1$" రేఖ విదేశపు ఆఫర్ రేఖకు స్పర్శరేఖగా ఉన్నది. ఇది స్వదేశము విధించగల అత్యధిక సుంకపు స్థాయిని తెలియజేయుచున్నది. అంతే కాకుండా స్వదేశపు సంక్షేమము గరిష్టముగా ఉన్నట్లు తెలియుచున్నది. $(C_1I_1)$ ఉదాసీనతా రేఖ CI ఉదాసీనత రేఖకు పై స్థాయిలో ఉన్నది. ఈ రేఖా పటము ద్వారా ఎంత మేరకు ఒక దేశము తన యొక్క దిగుమతుల పై గరిష్టముగా సుంకాలను విధించగలదో తెలుపుచున్నది.

**6.4.4 టారిఫ్ ఏతర వ్యాపార అడ్డంకులు (Non-Tariff Barriers to Trade) :-** 1980 దశాబ్దం నుండి అంతర్జాతీయ వ్యాపారములో కొన్ని టారిఫ్ ఏతర వ్యాపార నిరోధకాలు అమలు జరుగుచున్నవి. ప్రపంచ బ్యాంక్ అంచనా ప్రకారం సుమారు 1/3 వంతు పారిశ్రామిక దేశపు దిగుమతులు ఈ అవరోధాలు ద్వారా అభివృద్ధి చెందిన దేశాలు నుండి ప్రవేశించలేకపోతున్నాయి. ఈ అవరోధాలు రెండు రకాలు. అవి

1. సాంప్రదాయక టారిఫ్ యేతర అవరోధాలు, ఉదా - దిగుమతి లైసెన్సింగ్, కోటాలు, విదేశీయ మారకపు నియమాలు మొదలగునవి.

2. నూతన టారిఫ్‌యేతర అవరోధాలు, ఉదా - స్వచ్ఛంధ ఎగుమతి అవరోధాలు (Volentary Export Restraint), పర్యావరణ సంబంధిత నియమాలు మొదలగునవి.

ఈ టారిఫ్ యేతర అవరోధాలు అభివృద్ధి చెందిన దేశాలు, అభివృద్ధి చెందుతున్న దేశాల నుండి వచ్చే దిగుమతుల పై ఎక్కువగా విధించడం జరుగుతుంది.

## 6.5 కోటాలు (Quota) :-

దేశీయ పరిశ్రమల రక్షణ నిమిత్తమై దిగుమతి సుంకాలకు ప్రత్యామ్నాయంగా దిగుమతి కోటాలు అమలులోనికి వచ్చాయి. దిగుమతి కోటా అనగా "ఒక దేశము దిగుమతి చేసుకొనే వస్తు పరిమాణమును నిర్ణయించుట". ఇవి ఐదు విధములుగా ఉంటాయి. అవి -

1. **సుంకముల కోటా** (Tariff Quota) :- ఒక దేశము నిర్ణయించిన పరిమాణములో దిగుమతులను సుంకము లేకుండా మరియు ఆపైన సుంకములతో దిగుమతులను అనుమతించిన యెడల అది సుంకముల మరియు కోటా యొక్క లక్షణాలు కలిగి ఉంటుంది.

2. **ఏకపక్ష కోటా** (Unilateral Quota) :- ఇతర దేశాల అంగీకారముతో నిమిత్తము లేకుండా ఒక నిర్ణీత పరిమాణములో దిగుమతులను అనుమతిస్తే అది ఏక పక్ష కోటాగా పిలువబడుతుంది.

3. **ద్వి పక్ష కోటా** (Bilateral Quota) :- దిగుమతి చేసుకొన్న దేశము ఎగుమతి చేసుకొన్న దేశము ఒక అంగీకారముతో దిగుమతుల పరిమాణం నిర్ణయిస్తే దానిని ద్వి పక్ష కోటా అందురు.

4. **ముడి పదార్థాల కోటా** (Mixing Quota) :- వస్తు ఉత్పత్తిలో దేశీయ ఉత్పత్తిదారులు దేశీయ ముడి పదార్థాలను ఒక నిర్ణీత నిష్పత్తిలో వాడి మిగిలిన ముడి పదార్థాలు దిగుమతి చేసుకొనుటను ముడి పదార్థాల కోట అందురు.

5. **దిగుమతి లైసెన్స్‌లు** :- కోటాలు దిగుమతి లైసెన్స్‌ల ద్వారా అమలు చేయబడతాయి. ప్రభుత్వము దిగుమతిదారులకు వస్తు దిగుమతి పరిమాణమును తెలియజేస్తూ కొంత ఫీజు వసూలు చేస్తూ దిగుమతి లైసెన్సులను జారీ చేస్తుంది.

**6.5.1 కోటాలు - ప్రభావాలు** :- సుంకాల వలె, దిగుమతి కోటాలు కూడా ఆర్థికవ్యవస్థ పై అనేక విధములుగా ప్రభావం చూపుతాయి.

1. **ధరల పై ప్రభావము** :- దిగుమతి కోటాల వలన వస్తు పరిమాణపు సప్లై తగ్గి ధర పెరుగుతుంది. దిగుమతి చేయు వస్తువుకు డిమాండ్ అధికముగా ఉండి కోటా మూలంగా సప్లయి తగ్గడం వలన దాని ధర ఎక్కువగా పెరుగుతుంది.

2. **వినియోగ ప్రభావము** :- దిగుమతి కోటాల కారణముగా వినియోగదారులు ఆ వస్తువుల వినియోగం తగ్గించుకోవలసిన ఆవశ్యకత ఏర్పడుతుంది. దీనికి దిగుమతుల వస్తువుల ధర పెరగడం ముఖ్య కారణం.


3. **రక్షణ ప్రభావం** :- దిగుమతి కోటాల మూలముగా స్వదేశీయ పరిశ్రమలకు రక్షణ ఏర్పడి, స్వదేశీయ పరిశ్రమల పెరుగుదలకు దోహదపడుతుంది.

4. **పునః పంపిణీ ప్రభావము** (Redistribution Effect) :- కోటాలు విధించడం వలన దిగుమతి చేయు వస్తువుల ధర పెరుగుతుంది. ఈ కారణముగా దిగుమతి చేయు వస్తువులకు ప్రత్యామ్నాయ వస్తువులయిన స్వదేశీ వస్తువుల ధర పెరుగుతుంది. స్వదేశీ ఉత్పత్తులు పెరిగి ఆదాయాలు కూడా పెరుగుతాయి. ఇది ఆదాయాలు వినియోగదారుని నుండి ఉత్పత్తిదారులకు పునః పంపిణీ అవడానికి దోహదం చేస్తుంది.

5. **ఆదాయ ప్రభావం** (Revenue Effect) :- కోటాలు అమలు చేయడానికి ప్రభుత్వం దిగుమతి లైసెన్స్‌లు మంజూరు చేస్తుంది. లైసెన్స్‌లు జారీ చేయునప్పుడు ప్రభుత్వానికి ఫీజు రూపంలో చాలా ఆదాయం వస్తుంది.

దిగుమతి కోటాల ప్రభావం ఈ క్రింది రేఖా పటములో తెలుపగలము.

పటము - 6.3 కోటా ప్రభావములు




పై రేఖా పటములో 'DD' ఒక వస్తువు యొక్క స్వదేశీ డిమాండ్‌ను, 'SS' ఒక వస్తువు యొక్క స్వదేశీ సప్లయిని తెలియజేస్తాయి. ఆ వస్తువు విదేశపు సప్లయి పూర్తి వ్యాకోచత్వము కలిగి ఉంటుంది. ఆ వస్తువు యొక్క ధర 'OP' గా ఉన్నప్పుడు దాని డిమాండ్ $OQ_1$. అయితే $OQ_1$ వస్తు పరిమాణంలో $OQ$ పరిమాణం స్వదేశములో లభ్యము కాగా $QQ_1$ పరిమాణం దిగుమతి చేయబడినది. అయితే ఆ వస్తు దిగుమతి పరిమాణం పై ప్రభుత్వము '$Q_3Q_2$'గా నిర్ణయించింది అనుకొందాము. దీని కారణముగా ఆ దేశములో ఆ వస్తు లభ్యత తగ్గిపోయి దాని ధర $P$ నుండి $P_1$కు పెరుగును. ఈ నూతన ధర వద్ద ఆ వస్తు డిమాండ్ $OQ_2$కి తగ్గును. దాని స్వదేశీయ ఉత్పత్తి $OQ_3$ పెరుగుతుంది. ఈ రేఖా పటములో '$PEAP_1$' భాగము పునః పంపిణీ ప్రభావాన్ని, "$ABE$" రక్షణ ప్రభావాన్ని మరియు "$CFF_1$" భాగం వినియోగ ప్రభావాన్ని తెలియజేస్తాయి. దిగుమతి లైసెన్స్‌లు జారీ ద్వారా ప్రభుత్వానికి '$ABCF$' భాగము ఆదాయముగా లభిస్తుంది.

### 6.5.2 దిగుమతి సుంకాలకు మరియు కోటాలకు మధ్య గల తేడాలు :-

1. దిగుమతి సుంకాల వలె, దిగుమతి కోటాలు కూడా దిగుమతులను నియంత్రణ చేసి వాటి ధర పెరిగేందుకు దోహదం చేస్తాయి. అంతే కాకుండా దేశీయముగా ఆ వస్తువుల ఉత్పత్తికి ఆదాయ పునః పంపిణీకి ఉపయోగపడతాయి. అయితే ఈ రెండింటికి మధ్య కొన్ని తేడాలు ఉన్నవి.
2. దిగుమతుల పరిమాణం తగ్గించుటలో సుంకాల కంటే దిగుమతి కోటాలు పటిష్టముగా పని చేసి వెంటనే ఫలితాన్ని ఇస్తాయి.
3. దిగుమతి కోటాలు ప్రవేశ పెట్టడం, ఉపసంహరించడం జరిగినంత అనువుగా సుంకాలను ప్రవేశ పెట్టడం, తొలగించడం సాధ్యపడదు.
4. దిగుమతి సుంకాల వలన ప్రభుత్వానికి అధికముగా ఆదాయం వస్తున్నప్పటికి, దిగుమతులను నియంత్రణ చేసే శక్తి కోటాల వలె ఉండదు.

5. కోటాలు అంతర్జాతీయ వ్యాపారము స్వేచ్ఛగా జరగడానికి చాలా ముఖ్యమైన అవరోధంగా అంతర్జాతీయ వాణిజ్య సంస్థ అభిప్రాయం. WTO ప్రకారం దిగుమతి సుంకాలు దిగుమతి కోటాల కంటే మేలు అయినవి.

## 6.6 సారాంశము :-

అంతర్జాతీయ వ్యాపార విధానాలు రెండు రకాలు. అవి 1. స్వేచ్ఛా వ్యాపార విధానము మరియు 2. రక్షణ విధానము. పారిశ్రామిక విప్లవము జరిగిన నాటి నుండి స్వేచ్ఛా వ్యాపార విధానము అమలులో ఉన్నప్పటికీ 1930లో వచ్చిన ఆర్థిక మాంద్యము కారణంగా కొన్ని దేశాలలో రక్షణ విధానము అవసరమైంది. రెండు ప్రపంచ యుద్ధాలు కూడా రక్షణ విధానానికి పునాదులు వేశాయి. అయితే అభివృద్ధి చెందుతున్న దేశాలలో శైశవ పరిశ్రమల పరిరక్షణకు విదేశీ వ్యాపార చెల్లింపు శేషములో లోటును భర్తీ చేసేందుకు కీలక పరిశ్రమల స్థాపనకు రక్షణ విధానము అవసరమైంది.

రక్షణ విధానము సుంకాల ద్వారా, కోటాల ద్వారా మరియు సుంకాలేతర వ్యాపార నిరోధకాల ద్వారా అమలు చేయగలము. అయితే వీని ప్రభావము ఆర్థిక వ్యవస్థలో ధర, వినియోగము, ఆదాయ పంపిణీ మొ॥ వాని పై ఉన్నట్లు తేలింది. సుంకాలు, కోటాల మధ్య కొన్ని తేడాలు మరియు పోలికలు ఉన్నాయి. సుంకాలతో పోల్చి చూస్తే కోటాలు అంతర్జాతీయ వర్తకములో ముఖ్యమైన అవరోధాలుగా ప్రపంచ వాణిజ్య సంస్థ (W.T.O.) పేర్కొంది.

## 6.7 సాంకేతిక పదములు :-

| | | |
|---|---|---|
| స్వేచ్ఛా వ్యాపార విధానము | - | (Free Trade) |
| రక్షణ విధానము | - | (Policy of Protection) |
| సుంకాలు | - | (Tariffes) |
| శైశవ దశ పరిశ్రమలు | - | (Infant Industries) |
| దిగుమతులను పూర్తిగా నిరోధించే సుంకాలు | - | (Prohibitive Tariffs) |
| అభిలషణీయ సుంకము | - | (Optimum Tariff) |
| టారిఫ్ ఏతర అడ్డంకులు | - | (NonTariff Barriers Tariff) |
| కోటాలు | - | (Quotas) |

## 6.8 నమూనా ప్రశ్నలు :-

1. స్వేచ్ఛా వాణిజ్యము యొక్క లాభాలను, నష్టాలను తెలుపుము?
2. శైశవ దశ పరిశ్రమల అభివృద్ధిలో రక్షణ విధానము ఎట్లు ఉపకరిస్తుందో చర్చించుము?
3. సుంకాలు అనగానేమి? సుంకాల రకాలను తెలుపుము?
4. సుంకాల వలన ఆదాయ పంపిణీలో ఎటువంటి ప్రభావము ఏర్పడునో తెలుపుము?
5. అభిలషణీయ టారిఫ్ అనగానేమి?
6. దిగుమతి కోటాల వలన ఆర్థిక వ్యవస్థల పై ఎటువంటి ప్రభావము చూపును?

## 6.9 చదువదగిన గ్రంథాలు :-


1. Bo Sodersten & Geoffrey Reed (1994) : International Economics
2. Dominick Salvatore (2001) : International Economics
3. Francis Cherunilam (2001) : International Economics
4. P.T. Ellsworth & Clark J. Leith : The International Economy


- ఆచార్య కె. శ్రీరామమూర్తి

పాఠం - 7

# ఆర్థిక సమైక్యతా సిద్ధాంతము - కస్టమ్స్ యూనియన్ సిద్ధాంతము - స్వేచ్ఛా వ్యాపార ప్రాంతము - ఉమ్మడి మార్కెట్ - యూరోపియన్ యూనియన్

## 7.0 లక్ష్యం :-

ఈ పాఠము చదివిన ఈ క్రింది అంశాలను తెలుసుకోగలము.

* ఆర్థిక సమైక్యత సిద్ధాంతము - సమైక్యతా రకాలు
* కస్టమ్స్ యూనియన్ సిద్ధాంతము
* స్వేచ్ఛా వ్యాపార ప్రాంతము
* ఉమ్మడి మార్కెట్
* యూరోపియన్ ఆర్థిక సమాఖ్య

## విషయసూచిక :-


7.1 పరిచయము
7.2 ఆర్థిక సమైక్యతా సిద్ధాంతము
7.2.1 ఆర్థిక సమైక్యత నిర్వచనము
7.2.2 ఆర్థిక సమైక్యత రకాలు
7.3 కస్టమ్స్ యూనియన్ సిద్ధాంతము
7.3.1 కస్టమ్స్ యూనియన్ లక్షణాలు
7.3.2 కస్టమ్స్ యూనియన్ ప్రమేయాలు
7.3.3 నిశ్చల ఫలితాలు
7.3.4 కస్టమ్స్ యూనియన్ చలన ఫలితాలు
7.4 స్వేచ్ఛా వ్యాపార ప్రాంతము
7.4.1 ఐరోపా స్వేచ్ఛా వ్యాపార ప్రాంతము
7.4.2 ఉత్తర అమెరికా స్వేచ్ఛా వ్యాపార ప్రాంతము
7.5 ఉమ్మడి మార్కెట్
7.6 యూరోపియన్ ఆర్థిక సమాఖ్య
7.6.1 సమాఖ్య లక్ష్యాలు
7.6.2 సమాఖ్య నిర్వాహణ

7.6.3 యూరోపియన్ ఆర్థిక సమాఖ్య పనితీరు

7.6.4 యూరోపియన్ ఆర్థిక సమాఖ్య మరియు భారతదేశము

7.7 సారాంశము

7.8 సాంకేతిక పదాలు

7.9 నమూనా ప్రశ్నలు

7.10 చదువదగిన గ్రంథాలు

## 7.1 పరిచయము :-

ఈ పాఠములో అంతర్జాతీయ ఆర్థిక సమైక్యత ప్రపంచ దేశాలలో ఎట్లు మొదలైందని తెలుసుకుంటాము. ఆర్థిక సమైక్యత సాధించుటలో గల వివిధ దశలను తెలుసుకుంటాము. సుంకాల సమాఖ్య (కస్టమ్స్ యూనియన్) ఏర్పాటు సిద్ధాంతాన్ని దాని వలన కలిగే నిశ్చల మరియు చలన ఫలితాలను తెలుసుకుంటాము. ఉమ్మడి మార్కెట్ ఏర్పాటు మరియు ఉమ్మడి మార్కెట్ నుండి ఐరోపా ఆర్థిక సమాఖ్య ఆవిర్భావము తెలుసుకుంటాము. ఉత్తర అమెరికా స్వేచ్ఛా వ్యాపార ఒడంబడికను తెలుసుకుంటాము. పైన తెలిపిన వివిధ అంశాల ద్వారా అంతర్జాతీయ ఆర్థిక సమైక్యత ప్రపంచ దేశాలలో ఎట్లు విస్తరిస్తుందో తెలుసుకుంటాము.

## 7.2 ఆర్థిక సమైక్యతా సిద్ధాంతము (Theory of Economic Integration) :-

సభ్య దేశాలలో ఎటువంటి వాణిజ్య అవరోధాలు లేకుండా స్వేచ్ఛాయుత అంతర్జాతీయ వాణిజ్యము జరుపుటకై ఏర్పాటు చేసుకున్న వ్యవస్థలను అంతర్జాతీయ సమైక్యతా సిద్ధాంతములో తెలుసుకోగలము.

**7.2.1 ఆర్థిక సమైక్యత (Economic Integration) నిర్వచనము :-** ప్రముఖ ఆర్థికవేత్త అయిన, నోబుల్ బహుమతి గ్రహీయిత అయిన "టిన్‌బర్జన్" మాటలలో "అంతర్జాతీయ ఆర్థిక సమాఖ్య అనగా ఎటువంటి కృత్రిమమైన అడ్డంకులు లేకుండా సహకారముతో కూడిన సంఘటిత అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ".

"According to Tinbergen, A Nobel Laureate in economics, international economic integration is the creation of most desirable structure of international economy, removing artifical hindrances to the optimum operation and introducing dileberately all desirable elements of coordination or unifications."

సూక్ష్మంగా చెప్పాలంటే అంతర్జాతీయ ఆర్థిక సమాఖ్య సభ్యదేశాల మధ్య ఎటువంటి వ్యాపార అడ్డంకులు లేకుండా ఆర్థికంగా సంఘటితపరిచే వ్యవస్థ.

**7.2.2 ఆర్థిక సమైక్యత రకాలు (Types of Economic Integration) :-**

1. **ప్రాధాన్యతతో కూడిన వాణిజ్య ఏర్పాటు (Preferentional Trading Arrangement) :-** రెండు కాని అంతకన్నా ఎక్కువ దేశాలు అంతర్జాతీయంగా వాటి మధ్య జరుగు వాణిజ్యము కోసం ప్రాధాన్యతతో కూడుకున్న వాణిజ్య ఏర్పాటు అంతర్జాతీయ ఆర్థిక సమాఖ్యతలో తొలిమెట్టు వంటిది. ఈ ఒప్పందం కుదుర్చుకొన్న దేశాలు ఏదైనా వస్తువు దిగుమతి చేసుకొన్నప్పుడు సభ్యదేశాలకు ప్రాధాన్యత ఇస్తాయి. అయితే అవి ఇతర దేశాలతో వాణిజ్యం చేసినపుడు వివిధ విధానాలు స్వేచ్ఛగా అమలు చేసుకుంటాయి.

ఉదా - సార్క్ సభ్య దేశాలు కుదుర్చుకొన్న సాప్త (SAPTA - సౌత్ ఏసియన్ ప్రిఫరెన్షియల్ ట్రేడ్ ఏరేంజ్‌మెంట్) పేర్కొనవచ్చు.

2. **స్వేచ్ఛా వ్యాపార ప్రాంతము (Free Trade Area) :-** ఇందులో రెండుగాని అంతకన్నా ఎక్కువ దేశాలు, ఒక కూటమిగా ఏర్పడి వాటి మధ్య స్వేచ్ఛా వ్యాపారము జరుపుకుంటాయి. అయితే ఇవి ఈ కూటమిలో సభ్యులు కాని దేశాలతో వారికి ఇష్టమైన రీతిలో వ్యాపార అడ్డంకులను ఏర్పరచుకుంటాయి.

3. **సుంకముల సమాఖ్య (Customs Union) :-** దీనిలో కొన్ని దేశాలు కూటమిగా ఏర్పడి వాటి మధ్య స్వేచ్ఛా వ్యాపారము జరుపుకోవడంతో పాటు అవి ఇతర దేశాలతో వాణిజ్యము జరిపేటప్పుడు ఒకే విధమైన సుంకాలను విధిస్తాయి.

4. **ఉమ్మడి మార్కెట్ (Common Markets) :-** కొన్ని దేశాలు ఒక సమూహముగా ఏర్పడి వాటి మధ్య స్వేచ్ఛా వ్యాపారము జరుపుకొంటూ బయటి దేశాలతో ఒకే విధమైన సుంకాలను విధిస్తూ ఆ దేశాల మధ్య ఉత్పత్తి కారకాల గమనశీలత కలిగి ఉంటాయి.

5. **ఆర్థిక సమాఖ్య (Economic Union) :-** ఉమ్మడి మార్కెట్‌లో ఉన్న పరిస్థితులతో పాటు కూటమి దేశాల మధ్య పరస్పర సహకారముతో కూడిన ఒకే విధమైన ద్రవ్య, కోశ విధానాలు అమలు జరుపుకొంటాయి. ఈ సభ్య దేశాలలో ఒకే ద్రవ్యాన్ని కూడా ఉపయోగించే వీలు ఉంటుంది.

## 7.3 కస్టమ్స్ యూనియన్ సిద్ధాంతము :-

కస్టమ్స్ యూనియన్ సిద్ధాంతము 1950లో జాకబ్ వైనర్ అను శాస్త్రవేత్త అభివృద్ధిపరచాడు. దానిని మీడ్, లిప్సే, జాన్సన్, కూపర్ మరియు మాసెల్, వానెక్ మరియు జగదీష్ భగవతి అభివృద్ధిపరచారు.

**7.3.1 కస్టమ్స్ యూనియన్ సిద్ధాంతము - లక్షణాలు :-** కొన్ని దేశాలు ఒక సమాఖ్యగా ఏర్పడి వాటి మధ్య ఎటువంటి వ్యాపార అడ్డంకులు లేకుండా స్వేచ్ఛా వ్యాపారము జరుపుతూ సమాఖ్య సభ్యులు కాని ఇతర దేశాల పై ఒకే విధమైన సుంకాలను అమలు చేస్తాయి. ఈ విధమైన సమాఖ్య ఏర్పాటు చేయడం వలన సభ్య దేశాల మార్కెట్లలో వస్తు ధరలలో, ఉత్పత్తిలో మార్పులు వస్తాయి. జాకబ్ వైనర్ యీ సమాఖ్య ఏర్పాటు ఫలితాలను నిశ్చల ఫలితాలు (static effects) గా విశదీకరించాడు. అయితే కస్టమ్స్ యూనియన్ ఏర్పాటు భారీ ఉత్పత్తి ఆదాలు, సాంకేతికాభివృద్ధి, మూలధన పెట్టుబడులలో మార్పు మరియు ఆర్థిక వ్యవస్థలో పోటీ మొ॥ చలన ఫలితాలను (dynamic effects) చూపుతుందని ఆర్థిక శాస్త్రవేత్తలు తెలియజేసారు.

**7.3.2 కస్టమ్స్ యూనియన్ సిద్ధాంతము - ప్రమేయాలు :-** కస్టమ్స్ యూనియన్ సిద్ధాంతము పాక్షిక సమతౌల్య విశ్లేషణ పై ఆధారపడి యీ దిగువ ప్రమేయాలను కలిగి ఉంటుంది.

1. రెండు దేశాలు ఉంటాయి. ఒకటి స్వదేశము, రెండు సభ్య దేశము.
2. ఇతర దేశాలు సమాఖ్య సభ్యులు కాదు.
3. సమాఖ్య సభ్యులు కాని దేశాల పై ఒకే విధమైన దిగుమతి సుంకాన్ని విధిస్తారు.
4. మరి ఏ ఇతరమైన వ్యాపార అడ్డంకులు ఉండవు.

5. వస్తు ఉత్పత్తి స్థిర వ్యయాలతో చేయబడుతుంది.

6. పరిపూర్ణ పోటీ వస్తువుల మార్కెట్‌లో మరియు ఉత్పత్తి కారకాల మార్కెట్‌లో ఉంటుంది.

7. ఉత్పత్తి కారకాల గమనశీలత ఒక దేశానికి పరిమితమై ఉంటుంది.

8. రవాణా వ్యయాలు ఉండవు.

9. వనరుల పూర్తి వినియోగిత ఉంటుంది.

10. సాంకేతిక మార్పు ఉండదు.

11. సమాఖ్య సభ్య దేశాల మధ్య స్వేచ్ఛా వ్యాపారము ఉంటుంది.

12. సమాఖ్య సభ్య దేశాలలో ఒకే విధమైన రీతిలో ఒక వస్తువు ఉత్పత్తి జరుగుతుంది.

13. ఒక దేశము యొక్క ఎగుమతి దిగుమతుల మధ్య సమతౌల్యము ఉంటుంది.

**7.3.3 కస్టమ్స్ యూనియన్ - నిశ్చల ఫలితాలు (Static Effects) :-** కస్టమ్స్ యూనియన్ ఏర్పడడం వల్ల ఉత్పత్తి వ్యాపారం పై కలిగే నిశ్చల ఫలితాలను "జాకబ్ వైనర్" (Jacob Viner) రెండు రకాలు, అవి 1. వ్యాపారం కల్గించే ఫలితాలు (Trade Creation Effects), 2. వ్యాపారం తరలించే ఫలితాలు (Trade diversion effects). ఈ రెండు ఫలితాలను నిశ్చల ఫలితాలు (static effects) గా పేర్కొన్నారు.

కస్టమ్స్ సంఘం వల్ల సభ్య దేశాలలో వ్యాపారం కల్పించవచ్చు. ఉదాహరణకు A, B, C అను మూడు దేశాలున్నట్లయితే A, B లు కస్టమ్స్ సంఘంగా ఏర్పడిందనుకుందాం. 'X' అనే ఒక వస్తువు ఉత్పత్తి 'B' దేశంలో అతి తక్కువ ధరకు ఉత్పత్తి చేయవచ్చు అనుకుందాం. కాని ఈ దేశాలలో ప్రత్యేకీకరణ అసంపూర్ణమని భావించవచ్చు. సంఘంగా ఏర్పడక ముందు రక్షణ విధానం ఉండటం వల్ల 'A' దేశంలో 'X' వస్తువు డిమాండ్‌ను అక్కడ ఉత్పత్తితో సరిపెట్టేవారు. కాని ఇప్పుడు 'A, B' లు కస్టమ్స్ సంఘంగా ఏర్పడటం వల్ల 'X' వస్తువు 'B' దేశంలో తక్కువ ధరకు ఉత్పత్తి అవుతుంది. కాబట్టి 'X' వస్తువు 'B' నుంచి 'A' కి ఎగుమతి చేయబడి 'A' లోని డిమాండ్‌ను భర్తీ చేస్తుంది. కాబట్టి 'X' వస్తువు సరఫరాకు మూలం 'A' నుంచి 'B' కి మారటం వల్ల వ్యాపారాన్ని కల్పించటం జరిగింది. అందువల్ల ఉత్పత్తి వనరులు సద్వినియోగపడటానికి దోహదపడతాయి

సంఘంగా ఏర్పడక ముందు 'r' వస్తువును 'C' దేశం నుంచి 'A' దేశం దిగుమతి చేసికొనేదనుకుందాం. రక్షణ విధానమున్నప్పటికి 'C' దేశం 'r' వస్తువును అతి తక్కువ ధరకు ఉత్పత్తి చేస్తుంది. కాబట్టి వస్తువును ఎగుమతి చేసేది. ఇప్పుడు 'AB' లు సంఘంగా ఏర్పడటంవల్ల సుంకాలు తొలిగాయి. కాబట్టి 'B' దేశంలో 'r' వస్తువు ధర 'C' దేశంలో ధర (ధర + సుంకము) కన్నా తక్కువగా ఉంటుంది. అందువల్ల 'A' దేశం 'B' దేశం నుంచి 'r' వస్తువును దిగుమతి చేసుకొంటుంది. అంటే తక్కువ ధర గల దేశం నుంచి ఎక్కువ ధర గల సభ్య దేశానికి వ్యాపారం తరలించడం జరిగిందన్నమాట.

వ్యాపార కల్పన, వ్యాపార తరలింపు కన్నా ఎక్కువగా ఉన్నట్లయితే కస్టమ్స్ సంఘం లాభదాయకమని 'జాకబ్ వైనర్' చెప్పారు. అట్లాకాక వ్యాపార తరలింపు వ్యాపార కల్పన కంటే ఎక్కువ ఉన్నట్లయితే నష్టమని చెప్పారు. కొన్ని సందర్భాలలో వ్యాపార తరలింపు ఎక్కువగా వున్నా కస్టమ్స్ సంఘం లాభదాయకమవ్వవచ్చునని నిరూపించబడింది.

కస్టమ్స్ సంఘం విజయవంతమవ్వాలంటే ఈ క్రింది ప్రమేయాలవసరమని ఆర్థికవేత్తలు చెప్పారు.

1. సంఘటితమయ్యే దేశాల ఆర్థిక వ్యవస్థ పరస్పర పోటీ కల్గి వుండాలని కొందరు, పూరకముండాలని మరికొందరు చెప్పారు.

2. సంఘపు పరిమాణం పెద్దదిగా ఉంటే ఎక్కువ విజయవంతమవటానికి ఆస్కారముంది.

3. సంఘటిత దేశాల మధ్య ఆర్థిక అంతరం తక్కువ ఉంటే మంచిది.

4. సంఘం ఏర్పడక ముందు ఈ దేశాల మధ్య టారిఫ్ పరిమాణం ఎక్కువగా ఉంటే సంఘం ఏర్పడిన తరువాత ఎక్కువ లాభం వుంటుంది.

5. సంఘం ఏర్పడక ముందు ఈ దేశాల మధ్య వస్తు ఉత్పత్తి వ్యయంలో ఎక్కువ తేడాలుంటే సంఘం ఏర్పడిన తరువాత ఎక్కువ లాభం వుంటుంది.

6. సంఘం ఏర్పడక ముందు ఈ దేశాల మధ్య ఎక్కువ ఆర్థిక సంబంధాలు ఉంటే సంఘం ఏర్పడిన తరువాత అంత ఎక్కువ లాభం ఉంటుంది.

పై ప్రమేయాల నుండి మొత్తం మీద వ్యాపార కల్పన ఎక్కువైనను ఈ రకమైన సిద్ధాంతము అభివృద్ధి చెందుతున్న దేశాలకు అంత ఉపయోగం కాదని కొందరు చెప్పారు.

**7.3.4 కస్టమ్స్ యూనియన్ వలన ఫలితాలు (Dynamic Effects) :-** సుంకముల సమాఖ్య ఏర్పడుట వలన అనేక చలన ఫలితాలు కలుగుతాయి అని ఎల్స్‌వర్త్, లీన్ మరియు బేలా బలాసా అభిప్రాయపడిరి. చలన ఫలితాలలో అతి ముఖ్యమైనవి అవి -

1. అంతర్జాతీయ మార్కెట్‌లో పోటి, 2. భారీ ఉత్పత్తి ఆదాలు,
3. సాంకేతిక ప్రగతి, 4. అంతర్జాతీయ పెట్టుబడులలో పెరుగుదల,
5. అంతర్జాతీయ వ్యాపారములో నష్ట భయాన్ని తగ్గించుట

1. **అంతర్జాతీయ మార్కెట్‌లో పోటి :-** సుంకముల సమాఖ్య దేశాల మధ్య సుంకములు తొలగించుట వలన ఆ దేశాల మధ్య మార్కెట్‌లో విస్తరణ జరిగి పోటీ జరుగుతుంది. ఈ కారణముగా ఉత్పత్తి వ్యయాల ధరలు తగ్గుతాయి. ఏకస్వామ్యాలు అదృశ్యమవుతాయి వినియోగదారులకు ఎంతో లాభం చేకూరుతుంది.

2. **భారీ ఉత్పత్తి ఆదాలు :-** మార్కెట్ విస్తరణ జరగడం వలన సమాఖ్య దేశాలలో ఉత్పత్తులు పెరిగి భారీగా అంతర్గత మరియు బహిర్గత ఆదాలు ఏర్పడతాయి. ఇది ఆయా దేశాల ఆర్థికాభివృద్ధికి దోహదపడతాయి.

3. **సాంకేతిక ప్రగతి :-** సుంకముల సమాఖ్య ఏర్పడటం వల్ల మార్కెట్‌కు విస్తరణ జరిగి, పోటి పెరిగి నూతన వస్తువులను కనుగొనుట మరియు నూతన ఉత్పత్తి పద్ధతులను ప్రవేశపెట్టుట జరుగుతుంది. సభ్య దేశాలలో పరిశోధనా మరియు అభివృద్ధి అధికంగా జరిగి ఆ దేశాలలో సాంకేతికాభివృద్ధి జరుగుతుంది.

4. **అంతర్జాతీయ పెట్టుబడులలో పెరుగుదల :-** మార్కెట్ విస్తరణ మరియు ప్రత్యేకీకరణ సమాఖ్య దేశాలలో పెట్టుబడులు పెరుగుటకు దోహదపడతాయి. దేశీయ పెట్టుబడులు కాక, విదేశీయ పెట్టుబడులు కూడా అధికముగా జరుగుటకు వీలు కలుగుతుంది.

5. **అంతర్జాతీయ వ్యాపారములో నష్టభయాన్ని తగ్గించుట :-** 'బేలాబలాస' అను శాస్త్రవేత్త సుంకముల సమాఖ్య సభ్య దేశాలలో ఉత్పత్తి రంగములో నష్ట భయాన్ని తగ్గిస్తుందని అభిప్రాయపడిరి. సభ్యదేశాల మధ్య ఎటువంటి అవరోధాలు లేనందున వ్యాపారపరమైన అనిశ్చితి ఉండదు. పోటీ సహజముగా ఉన్నందు వలన ఉత్పత్తి ఆదాలు పెరిగి ఉత్పత్తిదారులకు లాభాలు కలిగిస్తుంది.

## 7.4 స్వేచ్ఛా వ్యాపార ప్రాంతము (Free Trade Area) :-

కొన్ని దేశాలు ఒక కూటమిగా ఏర్పడి వాటి మధ్య ఎటువంటి వ్యాపార నిరోధకాలు లేకుండా స్వేచ్ఛా వ్యాపారాన్ని జరుపుకుంటాయి. ఈ కూటమిలో సభ్యత్వం లేని దేశాలతో వివిధ సుంకాల రేట్లను ఆయా దేశాలు విధిస్తాయి. ఈ స్వేచ్ఛా వ్యాపార ప్రాంతము అంతర్జాతీయ ఆర్థిక సమాఖ్యత సాధించుటలో ఒక ముఖ్యమైన దశగా అభివర్ణించవచ్చును.

**7.4.1 . ఐరోపా స్వేచ్ఛా వ్యాపార ప్రాంతము (The Europen Free Trade Area):-** ఐరోపా స్వేచ్ఛా వ్యాపార ప్రాంతము 1960లో జరిగిన stock home సమావేశము ద్వారా ఏర్పడినది. దీనిలో ఆస్ట్రియా, డెన్మార్క్, నార్వే, పోర్చ్‌గల్, స్వీడన్, స్విజ్జర్లాండ్, UK, సభ్యులుగా చేరినారు. అయితే 1961లో ఫిన్‌లాండ్ మరియు 1970లో ఇస్‌లాండ్, దీని సభ్యత్వాన్ని పొందినది. ఈ స్వేచ్ఛా వ్యాపార ప్రాంతము ప్రపంచములో అతి ముఖ్యమైనది మరియు పురాతనమైనదిగా చెప్పవచ్చును. ఇటీవల కాలంలో ఐరోపా సమాఖ్యలో చేరుటకై UK, డెన్మార్క్, పోర్చుగల్ వంటి దేశాలు దీని నుండి విడిపోయినవి.

**7.4.2 ఉత్తర అమెరికా స్వేచ్ఛా వ్యాపార ప్రాంతము (North American Free Trade Agreement) :-** ఉత్తర అమెరికా స్వేచ్ఛా వ్యాపార ఒడంబడిక 1988లో అమలులోనికి వచ్చినది. ఈ ఒడంబడిక ప్రకారం అమెరికా మరియు కెనడా దేశాలు వాటి మధ్య ఎటువంటి దిగుమతి సుంకాలు లేకుండా వ్యాపారము జరుపుటకు అంగీకరించినవి. అయితే అప్పటికే వాటి మధ్య 75% వ్యాపారము స్వేచ్ఛాయుతమైనది. సుమారు 150 బిలియన్‌ల అంతర్జాతీయ వాణిజ్యము జరుపుకుంటూ కెనడా, అమెరికా యొక్క అతి పెద్ద వాణిజ్య భాగస్వామి అయినది. అయితే 1993లో అమెరికా, కెనడా మరియు మెక్సికో దేశాలు ఉత్తర అమెరికా స్వేచ్ఛా వ్యాపార ఒడంబడికను కుదుర్చుకొన్నాయి. ఈ ఒడంబడిక జనవరి 1994 నుండి అమలులోనికి వచ్చినది. ఈ ఒడంబడిక ద్వారా అమెరికా కెనడా మరియు మెక్సికో చాలా వరకు లాభం పొందుతున్నాయి. అభివృద్ధి చెందుతున్న దేశమైన మెక్సికో ఈ ఒడంబడిక ద్వారా తన విదేశీయ మార్కెట్‌ను విస్తరణ చేయగలిగినది. అంతే కాకుండా ద్రవ్యోల్బణం 14.5 నుండి ఇటీవల కాలంలో 9.7 శాతమునకు తగ్గించగలిగినది. స్థూల జాతీయోత్పత్తిలో వృద్ధి రేటును 3.8 శాతము నుండి 5.2 శాతమునకు పెంచుకోగలిగినది. అంతర్జాతీయ పెట్టుబడులు కూడా 1995 లో ఉన్న 10.6 బిలియన్ డాలర్‌ల నుండి 2005 నాటికి 14.7 బిలియన్ డాలర్లకు పెంచుకోగలదని అంచనా.

ఉత్తర అమెరికా స్వేచ్ఛా వ్యాపార ఒడంబడిక ద్వారా అభివృద్ధి చెందిన దేశాలు అయిన అమెరికా, కెనడాలు కూడా ఎన్నో లాభాలను పొందగలవని వాదనలు ఉన్నాయి. ఈ దేశాలకు అవసరమైన ముడి సరుకులు, శ్రమ సాంద్రత కలిగిన వస్తువులు మెక్సికో నుండి అతి చౌకగా పొందుతున్నాయి. ఒక అంచనా ప్రకారము ఉత్తర అమెరికా స్వేచ్ఛా వ్యాపార ఒడంబడిక ద్వారా మెక్సికోలో ఆరు మిలియన్‌ల మందికి ఉపాధి అవకాశాలు 2000లు సంవత్సరము నాటికి కల్పించబడినవి. అమెరికాకు కూడా 90 వేల నుండి 1 లక్ష 60 వేల మధ్య సాంకేతికపరమైన ఉద్యోగాలు లభించినట్లు ఆఫర్ మరియు స్కాట్‌ల అంచనా.

## 7.5 ఉమ్మడి మార్కెట్ (Common Market) :-

కొన్ని దేశాలు ఒక అంతర్జాతీయ స్వేచ్ఛా వాణిజ్యము జరుపుకొనుటకు ఉమ్మడి మార్కెట్‌గా ఏర్పడితే దానిని ఉమ్మడి మార్కెట్ అందురు. ఈ ఉమ్మడి మార్కెట్‌లో అంతర్జాతీయ వాణిజ్యములో ఎటువంటి అవరోధాలు, సుంకాలు మరియు ఇతర వ్యాపార నిరోధకాలు ఉండవు. దీనికి తోడు ఈ ఉమ్మడి మార్కెట్ దేశాల మధ్య శ్రమ, మూలధనము మొదలగు ఉత్పత్తి కారకాల గమనశీలత కలిగి ఉంటాయి. సభ్య దేశాలు అన్నీ ఒకే విధమైన అంతర్జాతీయ వాణిజ్య విధానాన్ని అనుసరిస్తాయి.

ఐరోపా ఉమ్మడి మార్కెట్ 1957లో రోమ్ ఒప్పందము ద్వారా ఏర్పడినది. ఈ ఉమ్మడి మార్కెట్‌లో పశ్చిమ జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ, బెల్జియమ్, నెదర్లాండ్స్, లగ్జిమ్‌బర్గ్ సభ్య దేశాలు. ఇది జనవరి 1958లో అమలులోనికి వచ్చినది. ఈ ఉమ్మడి మార్కెట్‌లో సభ్యులుగా UK, డెన్‌మార్క్, ఐర్లాండ్, గ్రీస్, స్పెయిన్ మరియు పోర్చుగల్ చేరడం ద్వారా బలమైన అంతర్జాతీయ ఉమ్మడి మార్కెట్‌గా ఏర్పడినది. అయితే జనవరి 1, 1993 నుండి దీనిని ఐరోపా ఆర్థిక సమాఖ్య (Europen Union) గా పిలుస్తున్నారు. ఈ సమాఖ్యలో ఆస్ట్రియా, ఫిన్‌లాండ్, స్వీడన్ 1995లో సభ్య దేశాలుగా చేరినవి. మొత్తము సభ్య దేశాల సంఖ్య 15కు చేరినవి. ఈ ఉమ్మడి మార్కెట్‌లో స్వేచ్ఛాయుత వాణిజ్యముతోపాటు ఆర్థిక వ్యవస్థలోని వ్యవసాయ పారిశ్రామిక మరియు ద్రవ్య కోశ విధానాలు సభ్య దేశాలు అన్నింటికి ఒకే విధముగా అమలు చేయబడుతున్నవి.

## 7.6 యూరోపియన్ ఆర్థిక సమాఖ్య (European Union) :-

యూరోపియన్ ఆర్థిక సమాఖ్య 1957లో రోమ్ ఒడంబడిక (treaty of rome) ద్వారా స్థాపించబడిన ఉమ్మడి మార్కెట్ యొక్క రూపాంతరము. దీనిలో ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, బెల్జియమ్, లగ్జమ్‌బర్గ్ మరియు నెదర్లాండ్స్ సభ్యదేశాలు (inner six) ఉండేవి. ఐరోపా దేశాలు అయిన ఐర్లాండ్, డెన్మార్క్, UK, గ్రీస్, పోర్చుగల్, స్పెయిన్, ఆస్ట్రియా, ఫిన్‌లాండ్ మరియు స్వీడన్‌లు చేరి 1995 నాటికి 15 దేశాలు కూటమిగా మారింది. ఇటీవల కాలంలో ఈ సమాఖ్యలో మరికొన్ని దేశాలు చేరాయి. అవి హంగేరీ, పోలాండ్, లితులేనియా, లాత్వియా, స్లొలేక్, రూమేనియా, బల్గేరియా, క్రోషియా, ఎస్తోనియా మరియు చెక్ రిపబ్లిక్. ఈ సమాఖ్యలో సభ్యత్వం పొందం ద్వారా ఈ సమాఖ్య సభ్యదేశాల సంఖ్య '25'కు చేరి ప్రపంచములో అతి పెద్ద ఆర్థిక సమాఖ్యగా అవతరించింది.

### 7.6.1 సమాఖ్య లక్ష్యాలు :-

1. సభ్య దేశాల మధ్య ఎటువంటి సుంకములు పరిమాణ నియంత్రణలు లేకుండా అంతర్జాతీయ వాణిజ్యం జరుపుట.
2. ఒకే విధమైన వాణిజ్య విధానం, సుంకముల రేటు సమాఖ్యేతర సభ్యదేశాలతో ఏర్పరచుట.
3. సభ్య దేశాల మధ్య వ్యక్తులు, సేవలు, మూలధనం మొదలగు ఉత్పత్తి కారకాలు గమనశీలత కలిగి ఉండుట.
4. సభ్య దేశాల మధ్య ఏకైక వ్యవసాయ విధానం అమలు జరుపుట.
5. సభ్య దేశాల ఆర్థిక విధానమును సమాఖ్యపరిచి విదేశీ చెల్లింపులలో అసమతౌల్యంను నివారించుట.
6. సభ్య దేశాల రవాణా విధానములో మరియు బ్యాంకింగ్ విధానములో ఏకత్వం సాధించుట.
7. సమాఖ్యేతర దేశాలతో స్నేహ సంబంధమును పెంపొందించుకొంటూ విదేశీయ వ్యాపారమును మరియు ఉమ్మడి ఆర్థిక, సామాజిక అభివృద్ధిని పెంపొందించుకొనుట.

**7.6.2 సమాఖ్య నిర్వాహణ :-** యూరోపియన్ ఆర్థిక సమాఖ్య నిర్వహణకు అనేక సంస్థలు నెలకొల్పబడినవి.

1. **యూరోపియన్ కౌన్సిల్ :-** ఇది యూరోపియన్ సమాఖ్య యొక్క కార్యనిర్వాహక సంస్థ. దీనిలో సభ్య దేశాలు నుండి ఒక్కొక్క కార్యనిర్వాహక సభ్యుడు ఉంటాడు. సమాఖ్యకు సంబంధించి నిర్ణయాలు, చట్టాలు, నిబంధనలు ఇది అమలుపరుచును.

2. **యూరోపియన్ కమీషన్ :-** దీనిలో సభ్య దేశాల ప్రతినిధులు, వివిధ రంగాలకు నియమింపబడతారు. కమీషన్‌కు ఒక అధ్యక్షుడు, ఒక ఉపాధ్యక్షుడు, వ్యవసాయక, పారిశ్రామిక, వాణిజ్య, రవాణా మొదలగు రంగాల కమీషనర్లు ఒక నియమిత కాలంనకు సభ్య దేశాల మధ్య రోపేషన్ పద్ధతిలో పని చేస్తారు.

3. **యూరోపియన్ పార్లమెంట్ :-** ఒక స్వతంత్ర దేశపు పార్లమెంటు వలె యూరోపియన్ సమాఖ్య యొక్క పార్లమెంట్ పని చేస్తుంది. దీనిని బెల్జియమ్ రాజధాని అయిన "బ్రెసెల్స్"లో స్థాపించినారు.

4. **సమాఖ్య న్యాయ కోర్టు :-** ఇది సభ్య దేశాల మధ్య తగాదాలను పరిష్కరిస్తుంది.

5. **సమాఖ్య సలహా సంఘాలు :-** యూరోపియన్ సమాఖ్య సరైన ఫలితాలను సాధించుట కొరకు ఆర్థిక, సామాజిక, ద్రవ్య మొదలగు రంగాలలో కమిటీలను నియమించి వాటి సలహాలను కౌన్సిల్ ద్వారా అమలు జరుపుతుంది.

**7.6.3 యూరోపియన్ ఆర్థిక సమాఖ్య పని తీరు :-** యూరోపియన్ ఆర్థిక సమాఖ్య గడిచిన 4 దశాబ్దాల కాలంలో ఎన్నో విజయాలను సాధించింది. సభ్య దేశాల మధ్య స్వేచ్ఛాయుత వాణిజ్యము జరుపుటతో పాటు ఆ దేశాలలో సమాఖ్య వ్యవసాయ విధానం, ద్రవ్య విధానం, మత్స్య విధానం, రవాణా విధానం, సాంఘిక విధానం, పన్నుల విధానం మరియు బ్యాంకింగ్ విధానము అమలు జరిపి ఎన్నో విజయాలను సాధించినది. ఉదాహరణకు 1992 ఫిబ్రవరిలో మెస్ స్టిచ్ పట్టణంలోని ఒడంబడిక చాలా ముఖ్యమైనది. ఈ ఒడంబడిక ప్రకారం ఈ సమాఖ్య దేశాలలో "యూరో" అనబడు ఒక నూతన కరెన్సీని ప్రవేశ పెట్టినవి. జనవరి 1, 1999 నాటి నుండి ఈ నూతన ద్రవ్యం 11 సభ్య దేశాలలో అమలులోనికి వచ్చినది. యూరోపియన్ ఆర్థిక సమాఖ్య ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అతి ముఖ్యమైన పాత్రను వహిస్తుంది.

**7.6.4 యూరోపియన్ ఆర్థిక సమాఖ్య మరియు భారతదేశము :-** యూరోపియన్ ఆర్థిక సమాఖ్య భారతదేశపు అతి పెద్ద వాణిజ్య భాగస్వామి. భారతదేశము నూతన ఆర్థిక విధానము ప్రవేశపెట్టిన నాటి నుండి యీ రెంటి మధ్య వాణిజ్య సంబంధాలు చాలా మెరుగుపడ్డాయి. 1992లో యూరోపియన్ ఆర్థిక సమాఖ్య భారతదేశాల మధ్య సహకార ఒప్పందము కుదిరింది. దీని ప్రకారము భారతదేశము ఈ సమాఖ్య యొక్క అతి విశిష్ట ఆర్థిక భాగస్వామి (Most Favoured Nation) అయింది. భారతదేశపు ముఖ్య ఎగుమతులైన జౌళి వస్త్రాలు, తోలు వస్త్రాలు, వజ్రాలు, రబ్బరు, అల్యూమినియమ్, యంత్రాలు యూరోపియన్ దేశాలకు అధికముగా ఎగుమతి చేయబడుతున్నాయి. యీ సభ్యదేశాల నుండి పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానము, ఆర్థిక సహకారము భారతదేశం పొందుచున్నది. సోవియట్ సమాఖ్య విచ్ఛిన్నమైన తరువాత యూరోపియన్ ఆర్థిక సమాఖ్యతో వాణిజ్యము భారతదేశానికి అతి ముఖ్యమైనదిగా రూపొందింది.

## 7.7 సారాంశము :-

అంతర్జాతీయ ఆర్థిక అభివృద్ధికి దోహదపడే విధంగా స్వేచ్ఛాయుత వ్యాపారాన్ని అభివృద్ధి పరుచుటకై ఆర్థిక సమైక్యత అవసరము అని నోబెల్ బహుమతి గ్రహీత అయిన టిన్‌బర్జన్ అభిప్రాయపడెను. ఆర్థిక సమైక్యతలో అనేక రకాలు గలవు. అవి -

1. ప్రాధాన్యతతో కూడిన వాణిజ్య ఏర్పాటు, 2. స్వేచ్ఛా వ్యాపార ప్రాంతము, 3. సుంకముల సమాఖ్య ఉమ్మడి మార్కెట్, 5. ఆర్థిక సమాఖ్య.

కస్టమ్స్ యూనియన్ సిద్ధాంతము ద్వారా జాకబ్ వైనర్ నిశ్చల మరియు చలన ఫలితాలను తెలియజేసినారు. కస్టమ్స్ యూనియన్ (సుంకముల సమాఖ్య) సభ్య దేశాల మధ్య స్వేచ్ఛాయుత వాణిజ్యము ద్వారా ఆర్థికాభివృద్ధికి అన్ని విధాల దోహదపడుతుంది అని తెలియపరిచిరి. అంతర్జాతీయ సమాఖ్యతా సాధనలో భాగముగా యూరోప్ స్వేచ్ఛా వ్యాపార ప్రాంతము, ఉత్తర అమెరికా వ్యాపార ఒడంబడిక మరియు ఉమ్మడి మార్కెట్‌లను ప్రముఖముగా చెప్పుకోవచ్చును. యూరోపియన్ యూనియన్ ప్రపంచ దేశాలలో అతి పెద్ద అంతర్జాతీయ వాణిజ్య సమాఖ్యగా రూపుదిద్దుకొన్నది. ఈ సమాఖ్యతతో భారతదేశము ప్రముఖ అంతర్జాతీయ వ్యాపార భాగస్వామి అయినది.

## 7.8 సాంకేతిక పదాలు (Technical Words):-

| | | |
|---|---|---|
| ఆర్థిక సమాఖ్య సిద్ధాంతం | - | Theory of Economic integration |
| సుంకముల సమాఖ్య | - | Customs Union |
| ఉమ్మడి మార్కెట్ | - | Common Market |
| ఆర్థిక సమాఖ్య | - | Economic Union |
| నిశ్చల ఫలితాలు | - | Static Effects |
| చలన ఫలితాలు | - | Dynamic Effects |
| వ్యాపారము కలిగించే ఫలితాలు | - | Trade Creation Effects |
| వ్యాపారము తరలించే ఫలితాలు | - | Trade Divertion Effects |

## 7.9 నమూనా ప్రశ్నలు :-

1. అంతర్జాతీయ ఆర్థిక సమైక్యత అనగానేమి?
2. ఆర్థిక సమైక్యత రకాలను తెలుపుము?
3. కస్టమ్స్ యూనియన్ సిద్ధాంతము విశ్లేషించుము?
4. ఉత్తర అమెరికా స్వేచ్ఛా వ్యాపార ఒడంబడిక పనిచేయు విధానము తెలుపుము?
5. యూరప్ ఆర్థిక సమాఖ్య (యూరోపియన్ యూనియన్) లక్ష్యాలను, విధులను మరియు పనిచేయు విధానమును తెలుపుము?

## 7.10 చదువదగిన గ్రంథాలు :-


1. Dominick Salvatore (2001) : International Economics
2. Bela Balassa (1969) : The Theory of Economic Integration
3. J. Bhagwati (1971) : "Customs Union and Welfare Improvement" Economic Journal September, 1971
4. Bo. Sodersten (1194) : International Economics


- ఆచార్య కె. శ్రీరామమూర్తి

**పాఠం - 8**

# అభివృద్ధి చెందుతున్న దేశాల వాణిజ్య సమస్యలు - నూతన అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ - ఐక్యరాజ్య సమితి యొక్క వ్యాపారము మరియు అభివృద్ధి అంతర్జాతీయ సమావేశము - వ్యాపార సుంకాల సాధారణ ఒడంబడిక - ప్రపంచ వాణిజ్య సంస్థ

## 8.0 లక్ష్యం :-

ఈ పాఠములో ఈ క్రింది అంశాలను పొందుపరచడం జరిగింది. ఈ అంశాలను చదివి తెలుసుకొనగలరు.

* అభివృద్ధి చెందుతున్న దేశాల యొక్క వాణిజ్య సమస్యలు
* నూతన అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ
* ఐక్యరాజ్య సమితి యొక్క వ్యాపారము మరియు అభివృద్ధి సమావేశము - లక్ష్యాలు మరియు విధులు
* వ్యాపార సుంకాల సాధారణ ఒడంబడిక - సాధించిన ఫలితాలు - విమర్శ
* అంతర్జాతీయ వాణిజ్య సంస్థ - లక్ష్యాలు - నిర్మాణము మరియు విధులు
* అంతర్జాతీయ వాణిజ్య సంస్థ - భారతదేశం

## విషయసూచిక :-


8.1 పరిచయము

8.2 అభివృద్ధి చెందుతున్న దేశాల వాణిజ్య సమస్యలు

8.3 నూతన అంతర్జాతీయ ఆర్థికవ్యవస్థ

8.4 ఐక్యరాజ్య సమితి యొక్క వ్యాపారము మరియు అభివృద్ధి సమావేశము

8.4.1 UNCTAD ముఖ్య సూత్రాలు

8.4.2 UNCTAD లక్ష్యాలు

8.4.3 UNCTAD సాధించిన ప్రగతి

8.5 వ్యాపార సుంకాల సాధారణ ఒడంబడిక

8.5.1 గాట్ లక్ష్యాలు

8.5.2 గాట్ నియమాలు

8.5.3 గాట్ నియమాలను నిర్దేశించే అంశాలు

8.5.4 గాట్ యొక్క ప్రతిబంధకాలు

8.5.5 గాట్ జరిపిన వ్యాపార సంప్రదింపులు

8.5.6 గాట్ ఉరుగ్వే రౌండ్‌లో ప్రధాన అంశాలు

8.5.7 గాట్ సాధించిన విజయాలు

8.5.8 గాట్ పై విమర్శ

8.6 ప్రపంచ వాణిజ్య సంస్థ

8.6.1 W.T.O. లక్ష్యాలు

8.6.2 W.T.O. నిర్మాణము

8.6.3 W.T.O. విధులు

8.6.4 ప్రపంచ వాణిజ్య సంస్థ - భారతదేశము

8.7 సారాంశము

8.8 సాంకేతిక పదాలు

8.9 నమూనా ప్రశ్నలు

8.10 చదువదగిన గ్రంథాలు

## 8.1 పరిచయము :-

ఈ పాఠములో మనము అభివృద్ధి చెందుతున్న దేశాల వాణిజ్య సమస్యలను తెలుసుకొంటాము. అభివృద్ధి చెందుతున్న దేశాలు అంతర్జాతీయ వర్తక రంగములో అనేక సమస్యలను ఎదుర్కొంటున్నాయి. అంతర్జాతీయ వర్తకము ద్వారా అభివృద్ధి చెందిన మరియు అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య ఆర్థిక వ్యత్యాసాలు పెరుగుతున్నాయి.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో పేద దేశాలకు జరుగుతున్న నష్టాలను తొలగించుట కొరకు ఐక్యరాజ్య సమితి కృషితో నూతన అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ ఏర్పాటు కొరకు ప్రయత్నాలు జరిగినవి. అయితే 1980వ దశకము నుండి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వృద్ధిరేటు తగ్గుదల, అభివృద్ధి చెందుతున్న దేశాలలో నిరుద్యోగిత కారణముగా నూతన అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ ఏర్పాటు జరగలేదు. ప్రపంచ దేశాలలో ఆర్థిక సహకారము పెంపొందించుటకై ఐక్యరాజ్య సమితి యొక్క వ్యాపారము మరియు అభివృద్ధి సమావేశము 1964లో ఏర్పాటు చేయబడినది. దీనిని అంగ్‌టాడ్ అందురు. స్వేచ్ఛాయుత వాణిజ్యాన్ని అభివృద్ధిపరుచుటకై వ్యాపార సుంకాల సాధారణ ఒడంబడిక ఏర్పడినది. గాట్ జరిపిన వ్యాపార సంప్రదింపుల మేరకు ప్రపంచ వాణిజ్యములో చాలా మేరకు సుంకాలు తగ్గినవి అయితే పూర్తి స్వేచ్ఛతో కూడిన అంతర్జాతీయ వాణిజ్యాన్ని సాధించుటకై 1995లో ప్రపంచ వాణిజ్య సంస్థ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సంస్థలో అభివృద్ధి చెందిన మరియు అభివృద్ధి చెందుతున్న దేశాలకు సమాన ప్రాతినిధ్యం కలిపించబడినది. స్వేచ్ఛతో కూడిన వాణిజ్యాన్ని జరుపుట ద్వారా భారతదేశము లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలకు విదేశీయ వ్యాపారములో చాలా పెరుగుదల ఉంటుంది అని పలువురి అభిప్రాయము పై విషయమును పాఠములో విపులముగా తెలుసుకొనవచ్చును.

## 8.2 అభివృద్ధి చెందుతున్న దేశాల వాణిజ్య సమస్యలు (Trade Problems of Developing Countries) :-

అభివృద్ధి చెందుచున్న దేశాలు స్వాభావికముగా అధిక జనాభా, పేదరికము, మూలధన లోపము, విదేశీ ఋణ భారము, నిరుద్యోగిత మొ॥ సమస్యలతో నిరంతరము పోరాడుచున్నవి. అయితే ఈ సమస్యల పరిష్కారానికి త్వరితగతిని ఆర్థికాభివృద్ధి

సాధించుట అవసరము. కిండెల్ బర్గరు (kindle berger) వంటి ఆర్థిక శాస్త్రవేత్తల అభిప్రాయము ప్రకారము స్వేచ్ఛాయుత విదేశీ వాణిజ్యము ఈ దేశాల ఆర్థికాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుంది. నిజానికి అంతర్జాతీయ వర్తకము దేశ ఆర్థికాభివృద్ధికి యంత్రము వంటిది (Trade is an Engine of Economic Growth).

అయితే అభివృద్ధి చెందుతున్న దేశాలు అంతర్జాతీయ వర్తక రంగంలో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నాయి.

1. అభివృద్ధి చెందుచున్న దేశాల ఎగుమతులకు తీవ్ర పోటీ ఉన్నందున, అంతర్జాతీయంగా వాటి ఎగుమతులకు సరియైన ధర పలుకకపోవడం.

2. అంతర్జాతీయ వర్తక నిబంధనలు అభివృద్ధి చెందుతున్న దేశాలలో క్షీణించడం.

3. అభివృద్ధి చెందిన దేశాలు కోటాలు మరియు సుంకాలేతర నిబంధనలతో కూడిన రక్షణ విధానం పాటించడం వలన అభివృద్ధి చెందుతున్న దేశాల ఎగుమతులకు సరియైన ఆదరణ మరియు ధర పలుకకపోవడం.

4. అభివృద్ధి చెందుతున్న దేశాలకు సాపేక్ష ప్రయోజనం (comparative advantage) ఉన్న రెడీమేడ్ దుస్తులు, నూలు వస్త్రములు, తోలు వస్తువులు, స్టీలు, కెమికల్స్ విద్యుత్ పరికరాలు, ముడి సరుకులు మొదలగు ఎగుమతుల పై అభివృద్ధి చెందిన దేశాలు ఆర్థికేతర నిబంధనలు అమలుజేయడం.

5. 1980వ దశకం నుండి అభివృద్ధి చెందిన దేశాల వృద్ధి రేటు క్షీణించడం మరియు ఆ దేశాలలో నిరుద్యోగిత పెరగడం మూలంగా వారి దిగుమతులు తగ్గించుకొనడం.

6. పర్యావరణ శ్రేణి తగ్గింపును (Environmental Degradation) మరియు బాల కార్మికుల (child labour) వ్యవస్థను కారణాలుగా చూపి అభివృద్ధి చెందుతున్న దేశాల నుండి దిగుమతులను నిరోధించడం.

7. డబ్లు.టి.ఓ. సభ్యత్వము కారణంగా అభివృద్ధి చెందుతున్న దేశాల మార్కెట్లు విదేశీ బహుళ జాతీయ సంస్థల పోటీని ఎదుర్కొంటున్నాయి. యీ పోటీలో శైశవ దశ పరిశ్రమలు నిలువలేక మూతపడటం.

8. వ్యవసాయరంగంలో సబ్సిడీలు తగ్గించడం ద్వారా ఈ దేశాల వ్యవసాయ ఉత్పత్తుల ధర పెరిగి వాటి ఎగుమతులు క్షీణించడం.

9. అభివృద్ధి చెందుతున్న దేశాల విదేశీ చెల్లింపుల శేషము (Balance of Payments) లో నిరంతర లోటు కారణంగా వారి యొక్క అంతర్జాతీయ ఋణ భారము నిరంతరం పెరగడం.

10. అంతర్జాతీయ వర్తకము ద్వారా అభివృద్ధి చెందిన మరియు అభివృద్ధి చెందుచున్న దేశాల మధ్య ఆర్థిక వ్యత్యాసాలు పెరగడం.

## 8.3 నూతన అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ (New International Economic Order) :-

ప్రపంచ ఆర్థికవ్యవస్థలో పేద దేశాలకు జరుగుతున్న నష్టాలను తొలగించుటకు మరియు ఆ దేశాలలో పెరుగుతున్న బీదరికాన్ని నిర్మూలించుటకు నూతన అంతర్జాతీయ ఆర్థికవ్యవస్థ (New International Economic Order) ఏర్పాటు చేయాలని ఐక్యరాజ్య సమితి యొక్క సాధారణ సభ (General Assembly) జూన్ 1974లో తీర్మానించింది. ఈ తీర్మానములోని అంశాలు చాలా వరకు United Nations Conference on Trade and Development యొక్క సమావేశాలలో పొందుపరచడం జరిగింది. నూతన అంతర్జాతీయ ఆర్థికవ్యవస్థ ఏర్పాటు ద్వారా అభివృద్ధి చెందుతున్న దేశాలు యీ క్రింది కోరికలు తెలియజేసాయి.

1. అభివృద్ధి చెందుతున్న దేశాల యొక్క ఋణాలను సంప్రదింపుల ద్వారా సరళీకృతం చేసి వాటి పై వడ్డీరేట్లు తగ్గించడం.

2. అభివృద్ధి చెందుతున్న దేశాల ఎగుమతులు నిలకడగా పెరుగుట కొరకు అంతర్జాతీయ సరుకుల ఒప్పందాలను (International Commodity Agreements) కుదుర్చుకోవడం.

3. అభివృద్ధి చెందుచున్న దేశాల పారిశ్రామిక వస్తువుల ఎగుమతులకు అభివృద్ధి చెందిన దేశాలు ప్రాధాన్యత కల్పించడం (Preferential Trade Arrangement).

4. అభివృద్ధి చెందిన దేశాలు వ్యవసాయ దిగుమతుల పై వ్యాపార నిరోధకాలను తొలగించడం.

5. బహుళ జాతీయ సంస్థలను (multinational corporations) నియంత్రించి అభివృద్ధి చెందుతున్న దేశాలకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడం.

6. అంతర్జాతీయ సహాయాన్ని (Foreign Aid) అభివృద్ధి చెందుతున్న దేశాలకు అధికంగా అందించడం.

7. అంతర్జాతీయ సలహా సంప్రదింపులలో అభివృద్ధి చెందుచున్న దేశాలకు అధికంగా ప్రాతినిధ్యాన్ని కల్పించడం.

అయితే 1980వ దశకం నుండి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వృద్ధిరేటు తగ్గుదల మరియు అభివృద్ధి చెందిన దేశాలలో పెరుగుతున్న నిరుద్యోగితల కారణముగా నూతన అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ ఏర్పాటు దాదాపు కనుమరుగైనది. ఉదాహరణకు అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో పొందుపరచినట్లు అభివృద్ధి చెందిన దేశాలు వారి యొక్క జాతీయాదాయంలో 0.70 శాతము అంతర్జాతీయ సహాయంగా పేద దేశాలకు అందించవలసి ఉండగా, 1998లో ఆ సహాయము కేవలం 0.22 శాతం మాత్రమే అందింది.

## 8.4 ఐక్యరాజ్య సమితి యొక్క వ్యాపారము మరియు అభివృద్ధి సమావేశము (UNCTAD - United Nations Conference on Trade and Development) :-

అభివృద్ధి చెందిన మరియు అభివృద్ధి చెందుతున్న దేశముల మధ్య వ్యాపార నిబంధనలు పెద్ద అంతరమును కలిగిస్తున్నాయి. ఈ అంతరమును వర్తకపు సుంకాల సాధారణ ఒడంబడిక (GATT) వీటి మధ్య ప్రత్యేక వ్యాపారము మరియు ఆర్థికాభివృద్ధి సమస్యలను సముచితముగా పరిష్కరించ లేకపోయినది. ఈ సమస్యలను పరిష్కరించే ఉద్దేశముతో 1964 సం॥లో ఐక్యరాజ్య సమితి యొక్క వ్యాపార మరియు అభివృద్ధి సమావేశము (UNCTAD) జెనీవాలో జరిగినది. దీనిలో సభ్య దేశాలకు, ప్రతి నాలుగు సంవత్సరములకొకసారి సమావేశము జరుగుతుంది. ప్రపంచములో చాలా దేశాలు సభ్యత్వాన్ని కలిగి ఉన్నవి.

అంతర్జాతీయముగా అంటే సభ్యదేశాల మధ్య కలిగిన సమస్యలను, భేదాభిప్రాయాలను మరియు వ్యాపార అభివృద్ధికి సంబంధించిన నియమాలు, నిబంధనలు తయారుచేసి వాటిని అమలు చేస్తుంది.

**విధులు :-**

1. అంతర్జాతీయ వ్యాపారము ద్వారా త్వరితగతిన ఆర్థికాభివృద్ధిని సాధించడం

2. అంతర్జాతీయ వ్యాపారమునకు సంబంధించి తలెత్తిన సమస్యలను నిర్దేశక సూత్రాలను తయారు చేసి ఆర్థికాభివృద్ధిని సాధించడము.

3. నిర్ణయించబడిన అంతర్జాతీయ వ్యాపారము మరియు వృద్ధి విధానములను వ్యాపార ఒడంబడిక సూత్రములను రూపొందించుట.

4. సభ్యదేశాలు నిర్ణయించిన నిర్ణయాలు, సూత్రాలను సమర్థవంతంగా అమలుచేయుట.

5. అతి ముఖ్యమైన విధి అభివృద్ధి చెందుతున్న సభ్యదేశాలకు, పరిశోధన రంగములో, వ్యాపార ఒడంబడికలో, సాంకేతిక పరిజ్ఞానం సహాయం, నూతన వ్యాపార విధానాలు మరియు మూలధన సహాయం అధిక మొత్తంలో అందిస్తాయి.

8.4.1 **UNCTAD ముఖ్య సూత్రాలు :-** వ్యాపార మరియు అభివృద్ధి అంతర్జాతీయ మొదటి సమావేశము (UNCTAD) 1964లో కొన్ని ముఖ్య సూత్రాలను ఈ క్రింది విధముగా పేర్కొన్నది. అవి -

1. ప్రతి దేశము తమ యొక్క సార్వభౌమాధికారానికి భంగము కలగకుండా ఆ దేశములో ఉన్న సహజ వనరులన్నింటిని సమర్థవంతముగా వినియోగించుకొని దేశములో ఉన్న ప్రజల యొక్క శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని విదేశాలతో వ్యాపార నిబంధనలు తయారు చేయుట.

2. సభ్య దేశాల మధ్య కుదుర్చుకున్న ఒడంబడికలు ఆధారంగా చేసుకొని అంతర్గత సార్వభౌమాధికారంలో గాని, ఆ దేశములో వ్యక్తుల యొక్క ఆంతరంగిక విషయాలలో గాని ఇతర దేశాలు తలదూర్చకూడదు.

3. సాంఘిక - ఆర్థిక పరిస్థితులను ఆధారముగా చేసుకొని వివక్షత చూపకూడదు. అంతే కాకుండా వేరు వేరు వర్తక విధానాలు మరియు నూతన వ్యాపార విధానాలు అమలు చేయకూడదు.

8.4.2 **UNCTAD లక్ష్యములు :-**

1. **ప్రాథమిక వస్తువుల వ్యాపార మార్కెట్ అభివృద్ధి :-** అభివృద్ధి చెందిన దేశములకు అభివృద్ధి చెందుతున్న దేశముల నుండి ప్రాథమిక ఉత్పత్తుల దిగుమతుల పై సుంకములు మరియు ప్రత్యేక విధింపులు వలన వ్యాపార అడ్డంకులు కలుగుచున్నవి. అందువలన ప్రాథమిక వస్తువులకు మార్కెట్‌లో విస్తృతి తక్కువగా ఉంటుంది. అందుచేత విదేశ వ్యాపార నిబంధనలు ప్రతికూలముగా ఉన్నవి. ఈ సమస్యలను పరిష్కరించుటకు UNCTAD, సమైఖ్య వస్తువుల ఒడంబడికను ప్రారంభించినది. దీనిలో సుమారుగా 18 ప్రాథమిక వస్తువులలో స్థిరత్వము సాధించుటకు ఒక అంగీకారమునకు వచ్చినవి. వీటితోపాటు ప్రాథమిక వస్తువుల అంతర్జాతీయ సరుకు నిల్వలు చేయుటకు ద్రవ్య, సాంకేతిక మరియు పరిశోధన విభాగాలకు అన్ని దేశాలు సమూహికముగా సమైఖ్య నిధిని స్థాపించడం జరిగినది.

2. **పారిశ్రామిక వస్తువులలో వ్యాపారాభివృద్ధి :-** ఈ మధ్య కాలం నుండి అభివృద్ధి చెందుతున్న దేశములు పారిశ్రామిక వస్తువుల ఎగుమతులు పెంచుటకు UNCTAD తన వంతు కృషి చేయుచున్నది. 1968 సం॥లో సాధారణ ఎంపిక వ్యవస్థ GSP (Generalised System of Preference) అను దానిని నెలకొల్పినది. దీనిలో అభివృద్ధి చెందిన దేశాలు, అభివృద్ధి చెందుతున్న దేశములు పారిశ్రామిక వస్తువుల దిగుమతులకు సుంకములు తగ్గించుటకు అంగీకరించినవి. UNTCAD లోని సభ్య దేశములు విచక్షణా రహితముగా వ్యాపారమునకు స్వస్థపలికినవి. దీని ఫలితముగా అభివృద్ధి చెందుతున్న దేశముల ఎగుమతుల ఆర్జన పెరుగుటకు, పారిశ్రామికీకరణకు, ఆర్థికాభివృద్ధి రేటు పెరుగుదలకు అవకాశము ఏర్పడినది.

3. **అభివృద్ధి విత్తము :-** అభివృద్ధి చెందుతున్న దేశములకు UNCTAD ప్రత్యేకముగా అభివృద్ధి విత్త సంస్థను ఏర్పాటు చేసి, దీనితోపాటు IMF సభ్య దేశాలకు ఇచ్చు ప్రత్యేకమైన పత్ర బంగారము (SDR) పరిమాణమును పెంచుట, Extended Facility నిబంధనలు సరళం చేయుట, నష్ట భయాన్ని తొలగించే సౌకర్యం కల్పించుట, వడ్డీలు తగ్గించుట, మరియు సబ్సిడీలు, ఋణాలను సహాయక గ్రాంటులుగా మార్చుట, ఋణ కాలపరిమితి పెంచుట, ODA (Overseas Development Assistance) ద్వారా సహాయం చేయటంతోపాటు, అభివృద్ధి చెందుతున్న దేశాలకు అనుకూల పరిస్థితులు ఉన్నట్లుగా ప్రపంచ ద్రవ్యనిధి మరియు ప్రపంచ బ్యాంక్ వాటి యొక్క నిబంధనలు కొన్ని సూత్రాలు

సరళం చేయుట ద్వారా అభివృద్ధి చెందుతున్న దేశాలకు మూలధన సంచయనము, పెట్టుబడుల ప్రవాహము వలన ఆర్థికాభివృద్ధిని సాధించగలవు. కొన్ని విషయాలలో UNCTAD ఆచరణలోనికి తీసుకొనిరాలేకపోయినది.

4. **సాంకేతిక పరిజ్ఞాన మార్పులు :-** అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య సాంకేతిక పరిజ్ఞాన అంతరము చాలా ఉన్నది. దీనిని నివారణ చేయుటకు UNCTAD ఎంతో కృషి చేయుచున్నది. దీనిని అమలు చేయుటకు ఒక ప్రత్యేకమైన కమటీని నియమించినది.

5. **అభివృద్ధి చెందుతున్న దేశముల మధ్య సహకారము :-**

   1. అభివృద్ధి చెందుతున్న దేశములకు సుంకములు, కోటాలు తగ్గింపు ప్రపంచ వ్యవస్థను నెలకొల్పుట
   2. పరిశోధన మరియు అభివృద్ధి విభాగాన్ని, సాంకేతిక పరిజ్ఞానం, ప్రత్యేకీకరణ, ప్రత్యేక శిక్షణ, నిపుణుల మార్పు మొదలగు వాటిలో పరస్పర సహకారము పెంచుట
   3. సమాఖ్య చెల్లింపుల పరిష్కార పద్ధతి
   4. అభివృద్ధి చెందుతున్న దేశములు సాంఘీక - ఆర్థిక సహకారము పరస్పరము అందించుకొనుట

**8.4.3 UNCTAD సాధించిన ప్రగతి :-**

1. ప్రపంచ దేశముల మధ్య సంప్రదింపులు ఉమ్మడి దృక్పధమును కలిగి ఉన్నవి. UNCTAD నాలుగు గ్రూపులుగా ఉన్నవి. అవి -

   1. అభివృద్ధి చెందిన దేశముల గ్రూప్ - Group A
   2. అభివృద్ధి చెందుతున్న 77 దేశముల గ్రూప్ - Group B ($G_{77}$)
   3. ప్రత్యేకముగా చైనా
   4. తూర్పు ఐరోపా దేశాలతో పాటు రష్యా.

   పై నాలుగు గ్రూప్‌ల వలన సభ్య దేశాల మధ్య పరస్పర సహకారము కలిగి ఉన్నవి. దీని ఫలితంగా ప్రపంచ శాంతిని పొందవచ్చును.

2. ఆర్థికాభివృద్ధికి అవసరమైన సాంకేతిక, వస్తు సేవలు, అంతర్జాతీయ వ్యాపారము ఉమ్మడిగా నిర్వహించినందువల్ల సభ్య దేశాల మధ్య ఏకాభిప్రాయం సాధించవచ్చును.

## 8.5 వ్యాపార సుంకాల సాధారణ ఒడంబడిక (GATT - General Agreement on Traiffs and Trade) :-

రెండవ ప్రపంచ యుద్ధానంతరం బ్రిటన్ ఉడ్స్ సమావేశంలో అంతర్జాతీయ ద్రవ్య సహకారానికి అంతర్జాతీయ ద్రవ్య సంస్థను (IMF), యుద్ధంలో దెబ్బతిన్న దేశాల పునర్నిర్మాణానికి అభివృద్ధికి అంతర్జాతీయ పునర్నిర్మాణ అభివృద్ధి బాంకును (IBRD), అంతర్జాతీయ వ్యాపారాన్ని విస్తరించడానికి అంతర్జాతీయ వ్యాపార సంస్థను (ITO) స్థాపించడానికి ప్రయత్నం జరిగింది. స్వేచ్ఛా వ్యాపారానికి అడ్డంకులను తొలగించి, అంతర్జాతీయ వర్తకాభివృద్ధికి దోహదం చేసేందుకు ఒక అంతర్జాతీయ వర్తక వ్యవస్థను స్థాపించవలెననే ఉద్దేశం అమెరికాకు కలిగింది. 1945 సం॥లో అమెరికా బ్రిటన్‌తో సంప్రదించి అంతర్జాతీయ వర్తకము, ఉద్యోగ

అవకాశాల విస్తరణకు ప్రతిపాదనలు అనే ఒక పత్రాన్ని వివిధ ప్రభుత్వాలకు పంపింది. అయితే చాలా విషయాల్లో అంగీకారం కుదరలేదు. అందుచేత అంతర్జాతీయ వర్తక వ్యవస్థను స్థాపించడంలో జాప్యం జరగటం సంభవించింది. అందువలన ఈ లోపుగా వర్తక ఆటంకాలను తగ్గించుటకు వ్యాపార సుంకాల సాధారణ ఒడంబడికనొకదానిని కుదుర్చుకోవడం జరిగింది. భారతదేశంతో సహా 23 దేశాలు GATT ఒప్పందం పై సంతకాలు చేశాయి.

**8.5.1 గాట్ లక్ష్యాలు :-** అంతర్జాతీయ వ్యాపారంలోని వివక్షతను, నియంత్రణను అవరోధాలను తొలగించి అంతర్జాతీయ వ్యాపారాన్ని విస్తరింప చేయటమే గాట్ ప్రధాన ఆశయం. గాట్ ముఖ్య లక్ష్యాలు, అవి -

1. ప్రపంచ వనరులను పూర్తిగా వినియోగించడం, అభివృద్ధిపరచడం
2. పక్షపాతం లేని అంతర్జాతీయ స్వేచ్ఛా వర్తకాన్ని ప్రోత్సహించి అభివృద్ధిపరచటం
3. ప్రపంచ దేశాల ఉత్పత్తిని, అంతర్జాతీయ వ్యాపారాన్ని విస్తరింప చేయడం
4. సభ్యదేశాల మధ్య పరస్పర సహకారాన్ని పెంపొందించే ఒడంబడికలను ప్రోత్సహించడం
5. ప్రజల జీవన ప్రమాణాలను పెంచడం

**8.5.2 గాట్ నియమాలు :-**

1. అమిత ఆదరణ పొందిన దేశం క్లాజు అన్ని దేశాలకు వర్తింపజేయడం.
2. గాట్ అనేది ఒక న్యాయస్థానం (లేదా) ఒక సంస్థ కాదు. 80% వరకు విస్తరించిన అంతర్జాతీయ వ్యాపారంలోని వస్తువుల పై విధించిన సుంకాలకు సంబంధించి పరస్పరం ఆమోదించిన ఒక బహుళ పక్ష ఒప్పందం.
3. పరిమాణాత్మక ఆంక్షలు తొలగించుట.
4. వస్తువులతో అంతర్జాతీయ వ్యాపారాన్ని నడపడానికి ప్రత్యేక నియమావళి గల నిర్ణయాధికారిక సంస్థ. గాట్ అంతర్జాతీయ వ్యాపారాన్ని సరళీకృతం చేసే యంత్రాంగాన్ని రూపొందిస్తుంది.
5. డంపింగ్ వ్యతిరేక చర్యలు.
6. సబ్సిడీలు నిరోధించుట.
7. ప్రభుత్వ రంగ వర్తకాన్ని పరిమితం చేయుట.
8. సభ్యదేశాల మధ్య వ్యాపార వివాదాల పరిష్కారానికి గాట్ నియమాలు సంప్రదింపులను కోరుతాయి.

**8.5.3 గాట్ నియమాలను నిర్దేశించే అంశాలు :-**

1. **విచక్షణారహిత వ్యాపారం :-** ప్రపంచ వ్యాపారాన్ని నిర్వహించేటపుడు సభ్యదేశాల మధ్య ఏ ఒక్క గాట్ సభ్యదేశం విచక్షణ చూపరాదు. ఈ సూత్రం "అత్యంత అభిమాన దేశం" అనే క్లాజులో ఇమిడి ఉంది. ఒక దేశం మరియొక దేశానికి ఏదైనా ప్రయోజనాన్ని కలుగజేస్తే అలాంటి ప్రయోజనాన్నే ఎలాంటి నిబంధనలు లేకుండా ఇతర సభ్య దేశాలన్నిటికి కల్పించాలి. అంటే ద్విపక్ష వ్యాపార ఏర్పాట్లు బహు పక్ష ఒప్పందాలుగా మారుతాయి.
2. **పరిమాణాత్మక ఆంక్షల నిషేధం :-** సభ్యదేశాలు సాధ్యమైనంత వరకు అంతర్జాతీయ వ్యాపారం మీద పరిమాణాత్మక ఆంక్షలు విధించరాదు. సాధ్యమైనంతలో కనీస స్థాయి సుంకాలు విధించాలి. వ్యాపార అవరోధాలను పరిమితం చేయాలి. అంతర్జాతీయ వ్యాపారానికి అవరోధాలుగా ఉన్న దిగుమతి కోటాలు తగ్గించాలి. అయితే కొన్ని పరిమితులకు

లోబడి విదేశీ వ్యాపారం లోని విత్త సామర్థ్యాన్ని కాపాడుకునేందుకు పరిమాణాత్మక ఆంక్షలు సభ్యదేశాల మధ్య విధించవచ్చు.

3. **సంప్రదింపులు :-** ఒప్పందం కుదరని విషయాలను సభ్యదేశాలు పరిష్కరించుకోవడానికి గాట్ నిరంతర చర్చా వేదికను కల్పించడం వల్ల సంప్రదింపుల ద్వారా ఒప్పందాలకు అవకాశం ఏర్పడింది.

4. **సుంకపు రాయితీలు :-** సభ్యదేశాలు, పరస్పర అంగీకారయోగ్యమైన సుంకాలు విధిస్తాయి. అయితే అదనపు సుంకాలు గాట్ పేర్కొన్న నియమిత స్థాయిని మించరాదు.

5. **నేషనల్ ట్రీట్‌మెంట్ :-** దిగుమతులుగా స్వదేశంలోనికి ప్రవేశించిన వస్తువులను స్వదేశీ వస్తువుల లాగానే పరిగణించాలి. అంతేకాకుండా గాట్ డంపింగ్‌ను నిరోధిస్తుంది. కస్టమ్స్ యూనియన్లు స్వేచ్ఛా వ్యాపార ప్రాంతాల ఏర్పాటును అనుమతిస్తుంది. గాట్‌లోని ఒక ముఖ్య విషయం ఏమిటంటే పరస్పర సుంకాల తగ్గింపులు ఒప్పంద పార్టీల సంప్రదింపుల ఫలితం. సుంకాలు తగ్గింపులు ఇచ్చి పుచ్చుకునే విధంగా ఇరుపక్షాలకు ప్రయోజనకరంగా ఉండాలి.

**8.5.4 గాట్ యొక్క ప్రతి బంధకాలు :-**

1. వెనుకబడిన దేశాలకు అభివృద్ధి చెందిన దేశాలతో సరిసమానంగా బేరమాడే శక్తి లేదు. అందుచేత గాట్ నుండి వెనుకబడిన దేశాలు లాభం పొందలేకపోతున్నాయి.
2. అభివృద్ధి చెందుతున్న దేశాలు ఎదుర్కొనుచున్న సమస్యలను పరిష్కరించుటలో గాట్ కృతకృత్యం కాలేకపోయింది.
3. అభివృద్ధి చెందిన దేశాలు, అభివృద్ధి చెందుతున్న దేశాల పట్ల సానుభూతిని చూపించలేకపోయినాయి.

**8.5.5 గాట్ జరిపిన వ్యాపార సంప్రదింపులు :-** గాట్ ఆవిర్భవించిన నాటి నుండి డబ్ల్యు.టి.ఓ. గా రూపాంతరము చెందిన నాటికి **(1947 నుండి 1994 వరకు) 8** బహు పక్ష వ్యాపార సంప్రదింపులు **(Multilateral Trade Negotiations)** జరిగాయి. యీ సంప్రదింపు సమావేశాలను గాట్ రౌండ్స్‌గా పిలుస్తారు. గాట్ రౌండ్స్ వివరాలను యీ క్రింది పట్టికలో చూడగలము.

**పట్టిక - గాట్ రౌండ్ల వివరాలు**

| సమావేశం | రౌండ్లు | సంవత్సరము | జరిగిన దేశము |
|---|---|---|---|
| 1. | జెనీవా రౌండు | 1947 | స్విట్జర్లాండ్ |
| 2. | ఎన్సెసీ రౌండు | 1949 | ఫ్రాన్సు |
| 3. | టారుక్వే రౌండు | 1950 - 51 | యునైటెడ్ కింగ్‌డమ్ |
| 4. | జెనీవా రౌండు | 1955 - 56 | స్విట్జర్లాండు |
| 5. | ధిల్లాన్ రౌండు | 1960 - 61 | స్విట్జర్లాండు |
| 6. | కెనెడీ రౌండు | 1963 - 67 | స్విట్జర్లాండు |
| 7. | టోక్యో రౌండు | 1978 - 79 | జపాన్ |
| 8. | ఉరుగ్వే రౌండు | 1986 - 94 | ఉరుగ్వే |

పై 8 రౌండ్లలో మొదటి ఆరు రౌండ్లు కేవలం దిగుమతి సుంకాల తగ్గింపునకు సంబంధించినవి. ఏడవ రౌండు సుంకాలేతర వ్యాపార అవరోధాలను గురించి చర్చించింది. అయితే ఎనిమిదవ రౌండు (ఉరుగ్వే రౌండు) ఇంతకమునుపెన్నడూ చర్చించని నూతన విషయాలను చర్చించింది. సేవల వ్యాపారం, మేథోసంపత్తి హక్కుల గురించి, పెట్టుబడుల గురించి, సబ్సిడీల గురించి మరియు అంతర్జాతీయ వాణిజ్య సంస్థ (WTO) ఏర్పాటు గురించి చర్చించింది.

**8.5.6 గాట్ ఉరుగ్వే రౌండులోని ప్రధాన అంశాలు :-**

1. టారిఫ్ లేదా సుంకాల తగ్గింపు - అమలులో ఉన్న సుంకాలను పూర్తిగా రద్దు చేయడం, మరింత తగ్గించడం ఉరుగ్వే రౌండులోని టారిఫ్ రాయితీల ముఖ్యోద్దేశం.
2. ప్రపంచ వ్యాపారాన్ని 50 శాతం దాకా సుంకాలేతర అవరోధాలు ప్రభావితం చేస్తున్నాయని ఉరుగ్వే రౌండు నందు గుర్తించడం జరిగింది.
3. మొదటిసారిగా వ్యవసాయాన్ని కూడా గాట్‌లోకి తీసుకొనిరావడం జరిగింది. వ్యవసాయ మద్దతు కార్యకలాపాలు, సుంకాలు, కోటాలు, సబ్సిడీలు కారణంగా వినియోగదారునికి వ్యవసాయ వస్తువుల మీద అధిక వ్యయం అవుతుంది. అంతేగాక వీటి వలన అల్పాభివృద్ధి దేశాలలో ఆహార కొరత ఏర్పడుతుంది అని ఉరుగ్వే రౌండు ఒప్పందం వ్యవసాయ వస్తువుల పై సబ్సిడీలు లేకుండా స్వేచ్ఛా వ్యాపారాన్ని ప్రోత్సహించాలని పేర్కొంది.
4. కొత్త ఒడంబడిక మల్టీ ఫైబర్ (MFA) ఏర్పాట్లను దశల వారీగా తొలగిస్తుంది.
5. డంపింగ్‌ను నిరోధించడానికి - స్వదేశీ వస్తువులకు హాని కలిగించే విధంగా దిగుమతి వస్తువులు స్వదేశంలో ముంచెత్తినపుడు డంపింగ్ నిరోధక చర్యలను అమలుపరచాలి.

1995 జనవరి 1 నాటికి గాట్ స్థానే WTO ఆవిర్భవించింది. గాట్ చరిత్ర పుటలలోకి వెళ్ళిపోయింది. అయితే సవరించిన వ్యాపార ఒప్పందంగా WTO క్రింద గాట్ కొనసాగుతూనే ఉందని చెప్పవచ్చు.

**8.5.7 గాట్ సాధించిన విజయాలు :-**

1. సుంకాల తగ్గింపు విషయంలో చెప్పుకోదగిన విజయాన్ని సాధించింది. అమెరికా దిగుమతి సుంకాలలో 50% వరకు గాట్ ఒత్తిడి వల్లనే సంభవించినట్లు చెప్తారు. ఇతర సభ్య దేశాలలో దిగుమతి సుంకాలను 1/3వ వంతుకు తగ్గించ కలిగింది.
2. అంతర్జాతీయ వ్యాపారములో సభ్యదేశాలు నడుచుకునే తీరులో చాలా వరకు మార్పులు తెచ్చింది.
3. వెనుకబడిన దేశాల ఆర్థికాభివృద్ధికి ఇతోధికంగా సహాయం చేస్తుంది.

**8.5.8 గాట్ పై విమర్శ :-**

1. ఎగుమతులు దిగుమతుల పరిమాణం పై ఆంక్షలు తగ్గించే విషయంలో గాట్ ఎక్కువ కృతకృత్యం కాలేకపోయింది.
2. సభ్యదేశాలు గాట్ ఒప్పందాలను ఉల్లంఘించే సందర్భాలు చాలా ఉన్నాయి.
3. నిర్ణయాలు తీసుకోవడంలో చాలా జాప్యం జరిగేది.
4. అభివృద్ధి చెందుతున్న దేశాల సమస్యల పై నిరాదరణ. అభివృద్ధి చెందిన దేశాలకి ఆసక్తి గల వస్తువుల వ్యాపారము ఎక్కువగా సరళీకృతమైనది.

## 8.6 ప్రపంచ వాణిజ్య సంస్థ (WTO - World Trade Organisation):-

ప్రపంచ వాణిజ్య సంస్థ గాట్ స్థానే జనవరి 1, 1995లో అమలులోనికి వచ్చినది. ఇది అంతర్జాతీయ వ్యాపారములో ఒక మైలు రాయి అని చెప్పవచ్చును. గాట్ ఉరుగ్వే ఒప్పందము ప్రకారము అంతర్జాతీయ వాణిజ్య సంస్థగా మార్పు చెందిన నాటికి 128 సభ్య దేశాలు కలిగి ఉన్నది. ఈ సంఖ్య 2002 ఏప్రిల్ నాటికి 144 దేశాలు చైనాతో సహా సభ్యులుగా ఉన్నారు. అయితే తైవాన్, నేపాల్, అల్జీరియా, కాంబోడియా దేశాలు చేరడంతో 2004 నాటికి ఈ సభ్య దేశాల సంఖ్య 148కి చేరినది. అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు అయిన IMF, IBRD ల తరువాత WTO అతి ముఖ్య సంస్థగా రూపుదిద్దుకున్నది.

### 8.6.1 W.T.O. లక్ష్యాలు :-

1. అంతర్జాతీయ వ్యాపారములో అవరోధాలుగా ఉన్న సుంకాలను తొలగించి అంతర్జాతీయ వాణిజ్యాన్ని సరళీకృతం చేయుటం.
2. అంతర్జాతీయ వ్యాపార సంబంధాలలో ఉన్న వివక్షతను తొలగించి మరియు అన్ని రకాల రక్షణను నివారించి అంతర్జాతీయ వ్యాపారాన్ని స్వేచ్ఛాయుతం చేయటం.
3. ఇప్పటికీ అమలులో ఉన్న పరిమాణాత్మక ఆంక్షలను రద్దుపరచటం.
4. అంతర్జాతీయ వ్యాపారములో తలెత్తిన వివాదాలను పరిష్కరించుట.
5. వ్యాపార విధానాల మరియు పర్యావరణ విధానాల సమన్వయం సాధించి నిరంతర ఆర్థికాభివృద్ధికి కృషి చేయుట.
6. వివిధ సభ్య దేశాల మధ్య ఆర్థిక మరియు సామాజిక సమన్వయము సాధనకై కృషి చేయుట.

### 8.6.2 W.T.O. నిర్మాణము :-


ప్రపంచ వాణిజ్య సంస్థ అయిన WTO లో అన్ని సభ్య దేశాల వాణిజ్య మంత్రులు ప్రతినిధులుగా ఉంటారు. దీనిని మంత్రి వర్గ మహా సభ (Ministral Conference) అంటారు. బహుళపక్ష వ్యాపార సంప్రదింపులకు సంబంధించిన విధానాలు, నిర్ణయాలు చేసే ముఖ్యమైన శిఖరాగ్ర సభగా దీనిని పేర్కొంటారు. రెండు సంవత్సరాలకు ఒకసారి ఈ మంత్రి వర్గ మహా సభ సమావేశం అవుతుంది. దీనికి అనుబంధముగా సభ్యదేశాల మధ్య సంప్రదింపులను, చర్చలను నిర్వహించి పర్యవేక్షించడానికి ఒక సాధారణ పరిషత్‌ను స్థాపించింది.

1. సాధారణ పరిషత్ క్రింద మూడు మండలిలు ఉంటాయి. అవి (ఎ) వస్తు వ్యాపారానికి సంబంధించిన మండలి,
(బి) సేవల వ్యాపారానికి సంబంధించిన మండలి,
(సి) మేధా సంపత్తి హక్కులకు సంబంధించిన మండలి.

ఈ మండలిలకు అనుబంధముగా తమ తమ విధులను నిర్వహించడానికి అనువుగా కొన్ని కమిటీలు ఉన్నాయి. ఇవేకాకుండా సభ్యదేశాల మధ్య తలెత్తే వివాదాలను పరిష్కరించడానికి వివాద పరిష్కార మండలి (Dispute Settlement Board), వాణిజ్య విధానాన్ని సమీక్షించడానికి వాణిజ్య విధాన సమీక్ష యంత్రాంగము ఉంటుంది. WTO యొక్క సెక్రటేరియట్‌కు డైరెక్టర్ జనరల్ ఆధిపత్యము వహిస్తాడు. ఇతనిని మంత్రివర్గ మహాసభ నాలుగు సంవత్సరముల కాలపరిమితితో నియమిస్తుంది. డైరెక్టర్ జనరల్ ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ ఆర్థిక విషయాల కమిటీ ఆమోదముతో సాధారణ పరిషత్‌లో ప్రవేశపెట్టబడుతుంది. సాధారణ పరిషత్తులో 2/3వ వంతు సభ్యుల ఆమోదముతో అమలులోకి వస్తుంది. గాట్‌లో వలె కాకుండా ప్రతి సభ్యదేశానికి

ఒక ఓటు మాత్రమే ఉంటుంది. అయితే WTO సాధారణ పరిపాలన విషయాలలో మార్పులు తీసుకురావటానికి సర్వసభ్య అంగీకారము అవసరము. సంక్షిప్తముగా ప్రపంచ వాణిజ్య సంస్థ యొక్క నిర్మాణము యీ క్రింది పట్టికలో చూడగలము.

**పట్టిక 8.1 - W.T.O. నిర్మాణము**




WTO ఏర్పడిన నాటి నుండి నేటి వరకు జెనీవా, సింగపూరు, సియాటిల్, దోహా మరియు కాన్‌కున్‌లలో ఐదు మంత్రివర్గ మహాసభలు జరిగాయి.

**8.6.3 ప్రపంచ వాణిజ్య సంస్థ (WTO) విధులు :-** ప్రపంచ వ్యాపారాన్ని సముచిత (fair), న్యాయోచిత (evuitable), నియమబద్ధ (rule based), పారదర్శక (Transparent) మరియు బహుళ పక్ష (Multi based) రీతిలో జరిపించడానికి ఏర్పడిన సంస్థ W.T.O. ఈ సంస్థ ముఖ్యమైన 6 విధులను నెరవేర్చుతుంది.

1. ఉరుగ్వే రౌండులో చర్చించిన ఒప్పందాల అమలు, పాలన
2. బహుపక్ష వ్యాపార సంప్రదింపులకు వేదికనందించడం
3. వివాద పరిష్కార యంత్రాంగముగా పనిచేయడం
4. వాణిజ్య సమీక్షా యంత్రాంగంగా పనిచేయడం
5. అంతర్జాతీయ విత్త సంస్థ (Intemational Monetary Fund) మరియు ప్రపంచ బాంకు (World Bank) లతో సహకరిస్తూ ప్రపంచ ఆర్థిక ప్రగతిలో పాలుపంచుకోవడం
6. అనేక పక్షాల ఒప్పందాల (Plurilatral Agreements) అమలు, పాలన నిర్వాహణలకై ప్రణాళికలు తయారు చేయడం

పై విధుల నిర్వాహణలో భాగంగా W.T.O. వ్యవసాయం, పారిశుద్ధ్యం, ఫైటో పారిశుద్య చర్యలు, వస్త్రాల ఎగుమతులు, అంతర్జాతీయ పెట్టుబడులు, డంపింగ్ నిరోధం, సరిహద్దు సుంకాల విలువ మదింపు, సబ్సిడీలు, ప్రతి విరోధక చర్యలు (counter veiliy measures) మొదలగు అంశాల పై వివిధ మంత్రి వర్గ మహాసభలలో చర్చించినది. వివాద పరిష్కార మండలి ద్వారా నూటికి పైగా వివాదాలను పరిష్కరించినది. అయితే సంతులితమైన ప్రపంచ ఆర్థిక వ్యవస్థను రూపొందించుటకై W.T.O. ఎంతో కృషి చేయవలసి ఉంది.

**8.6.4 ప్రపంచ వాణిజ్య సంస్థ - భారతదేశము :-** ప్రపంచ వాణిజ్య సంస్థ ఏర్పాటులో భారతదేశము కీలక పాత్ర వహించింది. అభివృద్ధి చెందుతున్న దేశాల సరళీకరణ క్రమములో మెరుగైన ఎగుమతి అవకాశాలను కలిపించుటకు W.T.O. యొక్క సభ్యత్వం అన్ని దేశాలకు అవసరము. ఈ సభ్యత్వము వలన భారతదేశానికి కొన్ని ప్రయోజనాలు సమకూరే అవకాశము ఉన్నది. తన సభ్యత్వాన్ని ఆధారముగా తీసుకొని ఇతర W.T.O. సభ్యదేశాల నుండి అత్యంత అభిమాన దేశం (Most Favoured Nation) హోదాను వినియోగించుకోవచ్చు. అయితే కొంతమంది అంచనాల ప్రకారము W.T.O. ఏర్పాటు భారతదేశము వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలకు అంత లాభదాయకం కాదు అని మరియు అభివృద్ధి చెందిన అమెరికా వంటి దేశాలకు అత్యంత లాభదాయకం అనే వాదనలు ఉన్నాయి. ఈ దృష్ట్యా W.T.O. ఏర్పాటు మరియు దానిలో సభ్యత్వం భారతదేశానికి ఎంతవరకు ఉపయోగకరమో తెలుసుకొనుట అవసరము.

1. **వ్యవసాయ రంగము :-** భారతదేశానికి వ్యవసాయ ఉత్పత్తులలో తులనాత్మక ప్రయోజనం కలదు. ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకొంటే వ్యవసాయ ఉత్పత్తులు అయిన బియ్యం, పండ్లు, ప్రత్తి, పూలు, తేయాకు, కాఫీ, పాల ఉత్పత్తులు, ప్రక్రియ చేసిన ఆహార పదార్థాలు వంటి ఎగుమతులను పెంచుకోవచ్చు. సరి అయిన జాతీయ వ్యవసాయ విధానము మరియు వ్యవసాయ పరిశోధనలు అనుసరించవలసి ఉన్నది.

   W.T.O. లక్ష్యాల ప్రకారము వ్యవసాయ సబ్సిడీలు తగ్గించవలసి ఉన్నది. అయితే భారతదేశపు వ్యవసాయ సబ్సిడీలు వ్యవసాయ స్థూల ఉత్పత్తులలో కనీసము 10% కూడా లేవు. అదే జపాన్ దేశములో 72%, ఐరోపా సమాఖ్యలో 37%, అమెరికాలో 26% వ్యవసాయ సబ్సిడీలు వివిధ రూపాలలో ఉన్నాయి. ఈ కారణముగా కాన్‌కూన్‌లో జరిగిన మంత్రుల మహాసభ యొక్క మంతనాలు అభివృద్ధి చెందిన మరియు అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య ప్రతిష్ఠంబనగా నిలిచిపోయినవి. అయితే దీర్ఘకాల ప్రయోజనాల దృష్ట్యా W.T.O. సభ్యత్వము వ్యవసాయ రంగ అభివృద్ధికి, వ్యవసాయ ఎగుమతుల పెరుగుదలకు అవసరము అని చెప్పవచ్చును.

2. **పారిశ్రామిక రంగము :-** ప్రస్తుత పరిస్థితులలో భారతదేశ పారిశ్రామిక ఉత్పత్తులు అభివృద్ధి చెందిన దేశాల పారిశ్రామిక ఉత్పత్తులతో పోటీపడలేదు. అయితే పారిశ్రామిక రంగములో మనము పోటీ సామర్థ్యాన్ని పెంచడం ద్వారా పారిశ్రామిక ఉత్పత్తులను అధికముగా ఎగుమతి చేసుకొనుటకు వీలు ఉన్నది. భారతదేశం ఇప్పటికీ ప్రపంచ మార్కెట్‌లో స్టీలు, రసాయన ఎరువులు, ఆభరణాలు, చేతి వస్తువులు, రెడీమేడ్ దుస్తులు, కెమికల్స్ మరియు తివాచీలు మొదలగునవి అధికముగా అమ్ముకోగలుగుతుంది. అయితే అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాలు భారతదేశం పర్యావరణ శ్రేణి తగ్గింపును మరియు బాల కార్మికుల వినియోగంను కారకాలుగా చూపి సుంకాలేతర వ్యాపార అవరోధాలను కల్పించుచున్నది. ఇవి W.T.O. లక్ష్యాలు దృష్ట్యా ఆమోదయోగ్యము కావు.

3. **వస్త్రాలు, నేత పరిశ్రమలు - ఎగుమతులు :-** ప్రపంచ వాణిజ్య సంస్థ ఒప్పందం ప్రకారము 2005 నాటికి ఎమ్.ఎఫ్.ఎ. (M.F.A.) దశల వారీ ఎత్తివేత వలన వస్త్రాల ఎగుమతులు పెరగడానికి దారితీసి భారతదేశానికి లాభిస్తుంది. అయితే భారతదేశం నూతన వ్యాపార విధానాలలో కొన్ని సమస్యలు కూడా ఎదుర్కోవలసి వస్తుంది. కాని భారతదేశ వస్త్ర రంగంలో మంచి పోటీ ఇవ్వగల శక్తి ఉన్నది.

4. **సేవలు - ఎగుమతులు :-** బాంకింగ్, ఇన్సూరెన్స్, టెలీకమ్యూనికేషన్ వంటి సేవలు వ్యాపారానికి సంబంధించి సభ్యదేశాల మధ్య చాలా అభిప్రాయ భేదాలు ఉన్నాయి. కాని ఈ సేవలను ఎగుమతి చేసే సామర్థ్యము భారతదేశానికి ఉన్నది. అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చుకొంటే భారతదేశము పొందే మేలు బహు తక్కువ (అతి స్వల్పము).

5. ట్రిప్స్ :- మేధో సంపత్తి హక్కులు, పేటెంట్లు, కాపీరైట్లు, ట్రేడ్ మార్కులు మొదలైన అంశాలను కఠినతరం చేయడం జరిగింది. అభివృద్ధి చెందిన దేశాలకు, బహుళజాతి సంస్థలకి రక్షణ కల్పించే నిమిత్తం ఈ విధంగా నిబంధనలు కఠినతరం చేయడం జరిగింది. మేధో సంపత్తి హక్కుల రక్షణే అంతర్జాతీయ వ్యాపారానికి పెద్ద అవరోధం. మేథా సంపత్తి హక్కుల రక్షణని వ్యవసాయానికి విస్తరించడం వలన భారతదేశమును భారీ మొత్తములో నష్టానికి గురిచేస్తుంది. జీవమున్న ఆర్గానిజమ్స్ మీద పేటెంట్ హక్కులు కల్పించడం అనేది ఈ రంగంలోని భారతదేశ కృషిని, ప్రగతిని అడ్డుకుంటుంది. దేశములో ఉత్పత్తి చేస్తున్న ఔషదాలు, జీవ ప్రత్యామ్నాయాలు (Bio-Substitutes) వంటి దేశీయ తయారీకి ఇది పెద్ద అవరోధం.

ప్రపంచ వాణిజ్య సంస్థతో భారతదేశం సభ్యత్వం కలిగి ఉన్నందువలన అంతర్జాతీయ వ్యాపారములో కలుగు కొన్ని సమస్యలను సులువుగా పరిష్కరించుకోగలుగుతుంది. దీని వలన ఎగుమతుల పెరుగుదల ఎక్కువగా ఉన్నందువలన విదేశీయ మారకద్రవ్యం ఎక్కువగా భారతదేశం ఆర్జన చేయుగలుగుతుంది.

## 8.7 సారాంశము :-

అభివృద్ధి చెందుతున్న దేశాలు త్వరితగతిన అభివృద్ధి సాధించుటకు విదేశీ వాణిజ్యము దోహదపడుతుందని ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్త కిండెల్ బర్గర్ అభిప్రాయపడ్డారు. అయితే అభివృద్ధి చెందుతున్న దేశాలు అంతర్జాతీయ వర్తకములో చాలా సమస్యలు ఎదుర్కొంటున్నాయి. పేద దేశాలకు జరుగుతున్న నష్టాలను తొలగించుటకై నూతన అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ (New International Economic Order) ఏర్పాటుకు ప్రయత్నాలు జరిగాయి. ఐక్యరాజ్య సమితి వ్యాపారము మరియు అభివృద్ధి సమావేశములను ఏర్పరచి అంతర్జాతీయ వ్యాపారము వృద్ధి చెందుటకు దోహదపడింది. స్వేచ్ఛా వాణిజ్యము ద్వారా అంతర్జాతీయంగా అభివృద్ధి సాధించుటకే గాట్ ఒప్పందము కుదుర్చుకోవడం జరిగింది. 1995లో గాట్ స్థానే W.T.O. ఏర్పడింది. దీని ద్వారా అభివృద్ధి చెందిన మరియు చెందుతున్న దేశాలకు సమాన నిష్పత్తిలో లాభం చేకూరుతుందని అంచనా.

## 8.8 సాంకేతిక పదములు :-

| | |
|---|---|
| పర్యావరణ శ్రేణి తగ్గింపు | - Environmental Degradation |
| విదేశీ చెల్లింపుల శేషము | - Balance of Payments |
| నూతన అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ | - New International Economic Order |
| అంతర్జాతీయ సరుకుల ఒప్పందాలు | - International Commodity Agreements |
| బహుళ జాతీయ సంస్థలు | - Multinational Corporations |
| ఐక్యరాజ్య సమితి యొక్క వ్యాపారము మరియు అభివృద్ధి సమావేశము | - United Nations Conference on Trade and Development |
| వ్యాపార సుంకాల సాధారణ ఒడంబడిక | - General Agreement on Tariffs and Trade |
| ప్రపంచ వాణిజ్య సంస్థ | - World Trade Organisation |

## 8.9 నమూనా ప్రశ్నలు :-

1. అభివృద్ధి చెందుతున్న దేశాల అంతర్జాతీయ వాణిజ్య సమస్యలు తెలుపుము?
2. UNCTAD సాధించిన ప్రగతిని సూక్ష్మముగా వివరింపుము?
3. భారతదేశ ఆర్థికాభివృద్ధిలో ప్రపంచ వాణిజ్య సంస్థ పాత్రను తెలుపుము?
4. నూతన అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలోని సమస్యలను తెలుపుము?

## 8.10 చదువదగిన గ్రంథాలు :-


1. Dominick Salvatore (2001) - International Economics
2. Bo Sodersten & Geoffrey Reed (1994) - International Economics
3. Francis Cheriunitam (2001) - International Economics


- ఆచార్య కె. శ్రీరామమూర్తి

# ఎగుమతుల పెంపుదల మరియు దిగుమతుల ప్రత్యామ్నాయీకరణ - విదేశీ సహాయము

## 9.0 లక్ష్యం :-

ఈ పాఠం చదివి ఈ క్రింది అంశాలను తెలుసుకుంటారు.

* ఎగుమతుల పెంపుదల మరియు దిగుమతుల ప్రత్యామ్నాయీకరణ
* విదేశీ సహాయము
* విదేశీ సహాయము - భారతదేశ ఆర్థికాభివృద్ధిలో దాని పాత్ర

## విషయసూచిక :-


9.1 పరిచయము

9.2 ఎగుమతుల పెంపుదల మరియు దిగుమతుల ప్రత్యామ్నాయీకరణ

9.2.1 ఎగుమతుల పెంపుదల విధానము

9.2.2 ఎగుమతుల పెంపుదల - ప్రయోజనాలు

9.2.3 ఎగుమతుల పెంపుదల - సమస్యలు

9.3 దిగుమతుల ప్రత్యామ్నాయీకరణ

9.3.1 దిగుమతుల ప్రత్యామ్నాయీకరణ ఆవశ్యకత

9.3.2 దిగుమతుల ప్రత్యామ్నాయీకరణ ప్రయోజనాలు

9.3.3 దిగుమతుల ప్రత్యామ్నాయీకరణకు వ్యతిరేక వాదనలు

9.4 విదేశీ సహాయము

9.4.1 విదేశీ సహాయము - రకాలు

9.4.2 ప్రభుత్వ మూలధన సహాయము

9.4.3 ప్రవేటు మూలధన సహాయము

9.4.4 విదేశీ సహాయాన్ని నిర్ణయించే అంశాలు

9.4.5 భారతదేశ ఆర్థికాభివృద్ధిలో విదేశీ సహాయము పాత్ర

9.4.6 విదేశీ సహాయము - సమస్యలు

9.5 సారాంశము

9.6 సాంకేతిక పదములు

9.7 నమూనా ప్రశ్నలు

9.8 చదువదగిన గ్రంథాలు

## 9.1 పరిచయము :-

అంతర్జాతీయ వ్యాపారము ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించవచ్చు అని ఆర్థికవేత్తల వాదన. అయితే అంతర్జాతీయ వ్యాపారములో అభివృద్ధి చెందుతున్న దేశాలు సరి అయిన వ్యాపార సరళిని అవలంబించవలసి ఉంటుంది. ఎగుమతుల పెంపుదల విధానము మరియు దిగుమతుల ప్రత్యామ్నాయీకరణ విధానము ఆ దేశాలకు ఎంతో అవసరము. అయితే ఎగుమతి పెంపుదల యందు మరియు దిగుమతుల ప్రత్యామ్నాయీకరణ యందు కొన్ని ప్రయోజనాలు మరియు నష్టాలు ఉన్నాయి. ఈ దృష్ట్యా అభివృద్ధి చెందుతున్న దేశాలు ఈ రెండు విధానాలను సరి అయిన మేళవింపుతో అమలు జరుపవలసి ఉంటుంది.

భారతదేశము వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో విదేశీ సహాయము ఎంతగానో అవసరము. త్వరితగతిన అభివృద్ధి సాధించుటలో అతి ముఖ్యమైన మరియు విలువైన విదేశీ పెట్టుబడుల సహాయము అభివృద్ధి చెందుతున్న దేశాలకు అతి కీలకమైనది. పైన ఉదహరించిన విషయాలు ఈ పాఠములో విపులముగా తెలుసుకొంటాము.

## 9.2 ఎగుమతుల పెంపుదల - దిగుమతుల ప్రత్యామ్నాయీకరణ (Export Promotion - Import Substitution) :-

అభివృద్ధి చెందుతున్న దేశాలలో ప్రజల జీవన ప్రమాణాన్ని మెరుగుపరచాలంటే వివిధ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయాలి. వాటిలో అతి ముఖ్యమైనవి, ఎగుమతుల పెంపుదల మరియు దిగుమతుల ప్రత్యామ్నాయీకరణ. దేశములో ప్రజల సంక్షేమాన్ని సాధించడానికి పారిశ్రామికీకరణతో పాటు వ్యవసాయ రంగము, సేవా రంగముల అభివృద్ధి ద్వారా ప్రజల జీవనోపాధిని వృద్ధిపర్చాలి. పారిశ్రామికీకరణ సాధించడానికి అవసరమైన యంత్రాలు, పనిముట్లు, ముడి సరుకులు, సాంకేతిక పరిజ్ఞానం మొదలైన ఉత్పత్తి సాధనాలను అభివృద్ధి చెందిన దేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి ఉంటుంది. ఈ విధముగా చేయాలంటే అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఆర్థిక వనరులు, విదేశీ మారక ద్రవ్యం ఉండాలి. కాని తగినంత విదేశీ మారకద్రవ్యం ఉండదు. దీనికి కారణం వ్యవసాయ (ప్రాథమిక) వస్తువుల ఎగుమతులు, పారిశ్రామిక వస్తువుల దిగుమతులు ఎక్కువగా ఉన్నందు వలన లోటు ద్రవ్య విధానం అమలులో ఉంటుంది. ఈ సమస్యను పరిష్కరించుటకు అభివృద్ధి చెందుతున్న దేశాలు ఎగుమతుల ప్రోత్సాహం, దిగుమతుల ప్రత్యామ్నాయీకరణ అమలుపరచుచున్నవి.

**9.2.1 ఎగుమతుల పెంపుదల విధానము (Export Promotion Policy) :-** ఆర్థికాభివృద్ధి సాధించడంలో విదేశీయ వ్యాపారం ప్రముఖ పాత్ర వహిస్తుందని ఆర్థికవేత్తల అభిప్రాయం. విదేశీ వ్యాపారంలో అభివృద్ధి చెందుతున్న దేశాలు తమ ప్రాథమిక ఉత్పత్తులను ప్రోత్సహిస్తూ, వినియోగంలో లేని వనరులను వినియోగంలోనికి తెస్తూ, విదేశీ మారకద్రవ్యాన్ని ఆర్జించినవి. అభివృద్ధి చెందుతున్న దేశాలలో చెల్లింపుల శేషం లోటును భర్తీ చేయుటకు, ప్రగతి మార్గములో నడిపించుటకు ఎగుమతుల విస్తరణ విధానము శక్తివంతముగా పని చేస్తుంది.

అభివృద్ధి చెందిన దేశాలలో సాంప్రదాయేతర వస్తువుల వినియోగం ఎక్కువగా ఉన్నందున అభివృద్ధి చెందుతున్న దేశాలు సాంప్రదాయక వస్తువులే కాక, సాంప్రదాయేతర వస్తువులు కూడా తయారు చేసి ఎగుమతులను ప్రోత్సహించవలెను. ఎగుమతుల విస్తరణ కొరకు దేశీయ పరిశ్రమల అభివృద్ధికి ఎగుమతి సుంకములు తగ్గించవలెను. వీటితోపాటు కొన్ని వస్తువులను ఉత్పత్తి చేసే పరిశ్రమలకు సబ్సిడీలు అందించవలెను మరియు వాటికి కావలసిన మూలధన వనరులను సమకూర్చవలెను. దీని ఫలితంగా ఎగుమతుల విస్తరణ జరుగుతుంది.

**9.2.2 ఎగుమతుల పెంపుదల - ప్రయోజనములు :-**

1. **విదేశీ మారకద్రవ్య ఆర్జన :-** అభివృద్ధి చెందుతున్న దేశాలలో అభివృద్ధి ప్రథమ దశలో పారిశ్రామికీకరణకు అవసరమైన యంత్రములు, సాంకేతిక పరిజ్ఞానం, పారిశ్రామిక ముడిపదార్థములతోపాటు మూలధనము విదేశముల నుండి దిగుమతి చేసుకొనవలసి వస్తుంది. ఈ దిగుమతులకు కావలసిన విదేశీ మారకద్రవ్యమును, ఎగుమతులు పెంచుట ద్వారా మాత్రమే సాధించగలము. కాని ఎగుమతులు తగినంతగా లేనందు వలన విదేశాల నుండి పెద్ద మొత్తంలో అప్పులు (ఋణము) అవసరం అవుతుంది. దీనిని తిరిగి చెల్లించుటకు విదేశీయ మారక ద్రవ్యమును ఎగుమతుల ద్వారా ఆర్జించవలెను. దీని ఫలితంగా ఆర్థికాభివృద్ధి సాధ్యపడుతుంది.

2. **మార్కెట్ల విస్తరణ :-** అభివృద్ధి చెందుతున్న దేశములో ఉత్పత్తి చేసిన వస్తువులకు దేశీయ డిమాండ్ తక్కువగా ఉన్నప్పుడు ఆ వస్తువులకు ఎగుమతులు పెంచడం ద్వారా ఆ పరిశ్రమల ఉత్పాదక శక్తిని పూర్తిగా ఉపయోగించుట సాధ్యపడుతుంది. దీనికోసం నూతన మార్కెట్‌లను అన్వేషణ చేయాలి. దీని ఫలితముగా ఎగుమతుల ప్రోత్సాహం జరుగుతుంది.

3. **వనరుల అభిలషణీయ కేటాయింపు :-** అభివృద్ధి చెందుతున్న దేశాలలో పరిమితముగా ఉన్న సహజ వనరులను సమర్థవంతముగా వినియోగించవలెను. అంతర్జాతీయ సిద్ధాంతము ప్రకారము దేశముల మధ్య తులనాత్మక వ్యయాలలో వ్యత్యాసం ఉంటుంది. ఉత్పత్తి పద్ధతులలో ప్రత్యేకీకరణ సాధించి, ఎగుమతులను పెంచడం ద్వారా వనరుల కేటాయింపు సమర్థవంతముగా ఉంటుంది. వనరులను అభిలషణీయంగా ఉపయోగించినందు వలన వనరుల కొరత ఏర్పడదు.

4. **ఆహార దిగుమతులకు విదేశీ మారకద్రవ్య ఆర్జన :-** అభివృద్ధి చెందుతున్న దేశాలలో జనాభా పెరుగుదల రేటుఎక్కువగా ఉంటుంది. కాని ఆహార ఉత్పత్తి పెరుగుదల రేటు జనాభా పెరుగుదల రేటు కన్నా తక్కువ. అందుచేత ఆహార దిగుమతులు ఎక్కువగా ఉంటాయి. ఈ విదేశీమారక చెల్లింపులకు, ఎగుమతి విస్తరణ చేయవలసి ఉంటుంది.

5. **కీలక రంగం :-** భారీ యంత్రాలు, సాంకేతిక పరిజ్ఞానం, యుద్ధ సామాగ్రి మొదలగు వస్తువులను అధిక మొత్తంలో ఎగుమతులు చేసినందు వలన విదేశీయ మారకపు నిల్వలు పెరుగుతాయి.

6. **దేశీయ - విదేశీయ పెట్టుబడులను పెంచుట :-** ఎగుమతులు స్వేచ్ఛాయుతంగా ఉండుట వలన దేశీయ, విదేశీయ పెట్టుబడులు పెరిగి ఉత్పత్తితో పాటు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి. దీని ఫలితముగా పొదుపు, పెట్టుబడులు పెరుగును. ఈ విధముగా జరగవలెను అంటే ఎగుమతుల ప్రోత్సాహం అవసరం.

**9.2.3 ఎగుమతుల పెంపుదల - సమస్యలు :-** ఎగుమతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అన్ని పరిశ్రమలకు విచక్షణ లేకుండా రక్షణ కల్పించింది. దీనితో సమర్థవంతముగా పనిచేయని పరిశ్రమలు అనేకం స్థాపించబడినాయి. ఉత్పత్తి వ్యయం ఈ పరిశ్రమలలో పెరిగి తక్కువ ప్రమాణంలో ఉత్పత్తులు పెరిగినాయి.

1. వాస్తవానికి ఎగుమతులు ఆశాజనకంగా లేవు. దీనికి కారణము ఎగుమతి వస్తువుల స్వభావాన్ని వాటి సామర్థ్యాన్ని ముందుగా పరిశీలించి ఆ తరువాత ఎగుమతి ప్రోత్సాహం అనుసరించాలి. కూరగాయలు, నిత్యావసర వినియోగ వస్తువులు, ప్రాథమిక వస్తువులు ఎక్కువ మొత్తంలో ఎగుమతులు ప్రోత్సహించినందు వలన వీటికి సాధారణంగా అంతర్జాతీయంగా వస్తు డిమాండ్ అవ్యాకోచంగా ఉంటుంది. విదేశాలలో ఆ వస్తువు ధర తగ్గిపోవును. కాని ఎగుమతులు ఎక్కువగా ప్రోత్సహించినందు వలన స్వదేశంలో వస్తువుల కొరత ఏర్పడి స్వదేశంలో వస్తువుల యొక్క ధర పెరుగును.

2. ఎగుమతి ప్రోత్సాహానికి ప్రాకులాడే అనేక పరిశ్రమలు అత్యధిక మూలధన సాంద్రత గల సాంకేతిక పరిజ్ఞానాన్ని దిగుమతి చేసుకొన్నవి. తద్వారా శ్రామికులలో నిరుద్యోగిత అధికమై పేదరికానికి ఆ దేశం గురి అవుతుంది.

3. ఆర్థికాభివృద్ధికి కావలసిన దిగుమతులను చేసుకొనుట వలన ఎగుమతులు పెంచవలెనను వాదన కూడా సరియయినది కాదని పలువురి ఆర్థికవేత్తల అభిప్రాయము. విదేశీ పెట్టుబడులు, విదేశీ సాంకేతిక పరిజ్ఞానం, ఆ దేశముల ఆర్థికాభివృద్ధికి తోడ్పడుటకు బదులు ఆర్థికాభివృద్ధిని కుంటుపరుస్తుంది. విదేశీ చెల్లింపుల లోటు పెరిగి ద్రవ్యోల్బణ పరిస్థితికి దారితీయును.

4. అభివృద్ధి చెందిన దేశముల దిగుమతి సుంకములు అభివృద్ధి చెందుతున్న దేశముల ఎగుమతుల విస్తరణకు అవరోధం కలిగించును.

5. ఎగుమతులు ప్రోత్సహించే ఉద్దేశముతో కొన్ని స్వదేశీ పరిశ్రమలకు ఎక్కువ మొత్తంలో సుంకాల తగ్గింపు, సబ్సిడీలు ఇచ్చినందు వలన విదేశీయ ఋణభారం పెరుగును.

## 9.3 ఎగుమతుల ప్రత్యామ్నాయీకరణ (Import - Substitution) :-

అభివృద్ధి చెందుతున్న దేశాలను శీఘ్రగతిన అభివృద్ధి పరచడానికి అనుసరించవలసిన వర్తక (లేదా) వ్యాపార విధానంలో ఎగుమతులను పెంచడంతో పాటు, దిగుమతుల ప్రత్యామ్నాయీకరణ కూడా ప్రముఖ స్థానాన్ని ఆక్రమిస్తుంది.

1964 సం॥లో వ్యాపార మరియు అభివృద్ధి అంతర్జాతీయ సమావేశము (UNCTAD) సమావేశమునకు పూర్వం నుంచి లాటిన్ అమెరికా, ఆసియా ప్రాంతాలు ఎగుమతుల అభివృద్ధికన్నా దిగుమతుల ప్రత్యామ్నాయీకరణకే ఎక్కువ ప్రాముఖ్యమిచ్చాయి. విదేశాల నుంచి దిగుమతి చేసుకొనే వస్తువులను తగ్గిస్తూ, ఇక ముందు ఆయా వస్తువులను దిగుమతి చేసుకోకుండా వాటిని ఆ దేశములోనే ఉత్పత్తి చేసే విధానాన్ని దిగుమతి ప్రత్యామ్నాయీకరణ అంటారు. దిగుమతి వస్తువులకు ఏ వస్తువులు ప్రత్యామ్నాయంగా ఉంటాయో వాటిని ప్రభుత్వం గుర్తించి కావలసిన ప్రోత్సాహాన్ని కల్పించాలి.

### 9.3.1 దిగుమతుల ప్రత్యామ్నాయీకరణ ఆవశ్యకత :-

అభివృద్ధి చెందుతున్న దేశములు దిగుమతుల ప్రత్యామ్నాయీకరణ విధానమును అవలంబించవలెను అని పలువురు ఆర్థికవేత్తల అభిప్రాయం. ఈ క్రింది కారణముల వలన సమర్థించబడుచున్నది. అవి -

1. **విదేశ మారకద్రవ్య పొదుపు :-** అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఎగుమతుల పెరుగుదల కన్నా దిగుమతుల పెరుగుదల ఎక్కువగా ఉంటుంది. ఈ దేశాలలో ఎగుమతులు ప్రధానంగా ప్రాథమిక ఉత్పత్తులు కాబట్టి వీటి ఎగుమతుల వలన దిగుమతులకు కావలసినంత విదేశీ మారకద్రవ్యం లభించదు. అందుచేత పారిశ్రామిక వస్తువులను దిగుమతి చేసుకొనుటకు బదులు దేశంలో ప్రత్యామ్నాయ ఉత్పత్తి చేసుకొనవలెను. దీని వలన విదేశీ మారకద్రవ్య పొదుపు జరుగుతుంది.

2. **ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన లభ్యత :-** దిగుమతుల ప్రత్యామ్నాయీకరణ సాధించడానికి విదేశ పెట్టుబడులు, నూతన ఉత్పత్తి పద్ధతులు మరియు సాంకేతిక పరిజ్ఞానం సహకారంతో సాధించినయెడల విదేశ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానము లభ్యమవుతుంది. దీని ఫలితముగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో కూడా ఆర్థికాభివృద్ధికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం దోహదం చేస్తుంది.

3. దిగుమతుల ప్రత్యామ్నాయీకరణ దిగుమతులలో నున్న అనిశ్చితత్వమును తొలగిస్తుంది.

4. దిగుమతి ప్రత్యామ్నాయీకరణ వలన దేశములో లభ్యమగు వనరులను పూర్తిగా ఉపయోగించవచ్చును.

5. దిగుమతుల ప్రత్యామ్నాయీకరణ ఫలితముగా దేశీయ పొదుపు మరియు పెట్టుబడులను పెంచుతుంది.

6. దిగుమతుల ప్రత్యామ్నాయీకరణ వలన దేశంలో పరిశ్రమల అభివృద్ధి వలన ఉద్యోగ అవకాశములు పెరుగుతాయి.

7. దిగుమతుల ప్రత్యామ్నాయీకరణ విధానం వలన దీర్ఘకాలంలో స్వయం సమృద్ధిని సాధించవచ్చును.

8. దిగుమతుల ప్రత్యామ్నాయీకరణ వలన దీర్ఘకాలంలో ఎగుమతులను కూడా పెంచవచ్చు.

9. దిగుమతుల ప్రత్యామ్నాయీకరణ వలన అవసరమైన వస్తువుల కొరతను నివారించి ధరల స్థాయిని అదుపులో నుంచుటకు సాధ్యమవుతుంది.

**9.3.2 దిగుమతి ప్రత్యామ్నాయీకరణ - ప్రయోజనాలు :-**

1. దిగుమతులు తగ్గిస్తూ విదేశీ వ్యాపారములో లోటును తగ్గించవచ్చును.

2. దేశంలో దీర్ఘకాలిక పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహిస్తుంది. తద్వారా స్వయం సమృద్ధికి దారి తీస్తుంది.

3. నూతన విదేశీ పెట్టుబడులు జరిగి నూతనంగా పరిశ్రమల స్థాపనకు కొత్త మార్గం ఏర్పడుతుంది. దీని వలన మార్కెట్ విస్తరణ జరుగుతుంది.

4. పారిశ్రామికీకరణ జరగడం వలన, దేశీయ పొదుపు, పెట్టుబడి రేటు పెరుగుతుంది.

5. మిగులు జనాభా ఉన్న అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి.

కాని దిగుమతి ప్రత్యామ్నాయీకరణ వాస్తవ పరిస్థితులకు ఎంతో దూరంగా ఉన్నది. కావలసినమేరకు దిగుమతులను తగ్గించలేకపోయాము. ఆహారధాన్యాల ఉత్పత్తులలో స్వయంసమృద్ధిని సాధించి, వాటి దిగుమతులు అల్పస్థాయికి తగ్గినప్పటికి, రసాయనిక ఎరువులు, వాటి ఉత్పాదకత అధికముగా పెరిగి, ఈ విధానం వల్ల ప్రత్యామ్నాయ పరిశ్రమలన్నింటికి రక్షణ లభించింది. ఉత్పత్తి వైవిధ్యంలో పోటీ దేశాల నుంచి పోటీ లేకపోవడంతో వాటి సామర్థ్యం తగ్గి వీటి ఉత్పత్తి వ్యయం పెరిగింది. అదీకాక ఏకస్వామ్య పరిస్థితి ఏర్పడి, అధిక ధరలకు వీలు ఏర్పడినది. ఈ వస్తు ఉత్పత్తులు అల్ప నాణ్యత, అధిక వ్యయంతో జరిగినందున, ప్రపంచ మార్కెట్‌లో ఇతర దేశాల వస్తువుల ధాటికి తట్టుకోలేవు. కాబట్టి దేశీయ వినియోగదార్లు నష్టపడ్డారు.

ఈ విధానం పాకిస్థాన్, లాటిన్ అమెరికా వంటి దేశాలు అనుసరించినప్పటికి ఏ మాత్రం ప్రయోజనం కన్పించలేదని ప్రముఖ ఆర్థికవేత్తలు అయిన గున్నార్ మిర్డాల్, ఫీనరీ, సింగర్ అభిప్రాయపడ్డారు.

### 9.3.3 దిగుమతుల ప్రత్యామ్నాయీకరణకు వ్యతిరేక వాదనలు :-

1. దిగుమతుల ప్రత్యామ్నాయీకరణ విధానం వల్ల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి జరుగుతుందనే వాదన ఉన్నది కాని, వనరుల కేటాయింపులో తప్పులు జరిగినందు వల్ల పరిశ్రమలో అల్ప సామర్థ్యపు ఉత్పత్తులకు దారి తీస్తుంది.

2. ఈ విధానంలో అభివృద్ధి చెందుతున్న దేశాలు వినియోగ వస్తూత్పత్తికి కావలసిన వస్తువులను విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటాయి. ఈ దేశాలకు ఉన్న స్వల్ప సాంకేతిక పరిజ్ఞానంతో పరిశ్రమలను స్థాపించవచ్చును. ఈ కారణముగా విదేశీ వస్తువులకు డిమాండ్ పెరుగుతుంది. కాని స్వదేశీ వస్తువులకు డిమాండ్ పెరుగదని హర్ష్‌మాన్ వివరించాడు. ఈ విధానం ద్వారా దిగుమతుల పై ఆధారపడటం తగ్గడానికి బదులు భారం మరింత పెరుగుతుంది. కావలసినంత విదేశీ మారక ద్రవ్యం లేనందువల్ల ముడి పదార్థాలు, మూలధనం విడి భాగాలు దిగుమతి చేసుకోవడం కష్టమవుతుంది. దీనితో పరిశ్రమల ఉత్పత్తి సామర్థ్యం పడిపోయి, నిరుద్యోగిత పెరిగి, ఆదాయాలు పడిపోతాయి.

3. దిగుమతుల ప్రత్యామ్నాయీకరణ విధానంలో పరిశ్రమల స్థాపన వల్ల పారిశ్రామికీకరణ జరిగి మిగులు జనాభాకు ఉపాధి కల్పన జరుగుతుందనే వాదన ఉన్నది. కాని ఈ విధానాన్ని అన్వయించిన ఫిలప్పైన్స్‌లో ఉత్పత్తి పెరిగింది కాని ఉద్యోగిత అదనంగా ఏ మాత్రం పెరగలేదు అని రుజువయినది.

4. అభివృద్ధి చెందుతున్న దేశాలు దీర్ఘకాలంగా సరిపడిన ముడిపదార్థాలు లేకపోవడం, మూలధన, మాధ్యమిక వస్తువుల విషయంలో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నాయి. ఈ పరిస్థితులలో ఆయా పరిశ్రమలను స్థాపించే దానికన్నా ఆ వస్తువులను దిగుమతి చేసుకోవడంతో ఖర్చు తగ్గి, విదేశీమారకం ఆదా అవుతుంది.

5. దిగుమతుల ప్రత్యామ్నాయీకరణ విధానం పట్టణ ప్రజల మరియు అధిక ఆదాయ వర్గముల ఆదాయాలను పెంచుతుంది. వీరి వినియోగము అభివృద్ధి చెందిన దేశములో ఉన్న ప్రజల యొక్క వినియోగపు అలవాట్లు అనుకరణ వలన విదేశీయ వస్తు డిమాండ్ పెరిగి దిగుమతులు పెరగవచ్చును.

6. తయారయిన వినియోగ వస్తువులను దిగుమతి ప్రత్యామ్నాయీకరణ చేసి వాటి దేశీయ ఉత్పత్తులను పెంచిన యెడల వినియోగ వ్యయం పెరుగుతుంది. ఎగుమతులు తగ్గుతాయి. పొదుపు, పెట్టుబడులు తగ్గుతాయి. దీని వలన ఆదాయాలు తగ్గుతాయి. దీని వలన ఆర్థిక సాంకేతిక సామర్థ్యం తగ్గుతుందని ఆచార్య జాన్ పవర్ అభిప్రాయం.

7. ఆర్థికంగా అభిలషణీయ పరిస్థితిని మించి మరియు విచక్షణారహితంగా దిగుమతుల ప్రత్యామ్నాయీకరణ చేసినందున ఆర్థికవ్యవస్థలో "క్రమ భంగములు" ఏర్పడతాయని లాటిన్ అమెరికా దేశముల చరిత్ర తెలియజేస్తుంది.

8. దిగుమతుల ప్రత్యామ్నాయీకరణను ప్రోత్సహించుటకు అనుసరించు "రక్షణ విధానము" విదేశీ పోటీని తొలగిస్తుంది. దీని వలన వస్తు నాణ్యతను పెంచుటకు, ఉత్పత్తి వ్యయాలను తగ్గించుటకు దేశీయ పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహకములు నశిస్తాయి. ఉత్పత్తి వ్యయాల పెరుగుదల పారిశ్రామిక మరియు ఇతర రంగముల ధరలను పెంచుతుంది. ఎగుమతులు తగ్గుతాయి. కాబట్టి దిగుమతుల ప్రత్యామ్నాయీకరణ అభివృద్ధి చెందుతున్న దేశముల ఎగుమతులను పెంచుటలో విఫలమయినదని ఆచార్య 'prebisch' అభిప్రాయము.

9. అభివృద్ధి చెందుతున్న దేశములలో పెరుగుచున్న జనాభాకు తగినంత ఉద్యోగిత దిగుమతుల ప్రత్యామ్నాయీకరణ కల్పించలేకపోయినది. జనాభా పెరుగుదల రేటు కన్నా పారిశ్రామికీకరణ పెరుగుదల రేటు తక్కువగా ఉంటుంది.

## 9.4 విదేశీ సహాయము (Foreign Aid):-

విదేశీ సహాయముగా అభివృద్ధి చెందుతున్న దేశాలకు అభివృద్ధి చెందిన దేశాల నుండి ప్రభుత్వపరముగా లేక ప్రైవేటు సంస్థలపరముగా లేదా ప్రపంచ ఆర్థిక సంస్థలైన ఐ.ఎమ్.ఎఫ్, వరల్డ్ బాంకు మొదలగు వాటి నుండి ఉదారముగా లభించే మూలధన సహాయము.

**9.4.1 విదేశీ సహాయము - రకాలు** (types of Foreign Aid) :- విదేశీ మూలధన సహాయము రెండు రకాలు. అవి -

1. ప్రభుత్వ మూలధన సహాయము (Public Foreign Capital)
2. ప్రైవేటు మూలధన సహాయము (Private Foreign Capital)

**9.4.2 ప్రభుత్వ మూలధన సహాయము** :- ప్రభుత్వ మూలధన సహాయము ఖచ్చితమైన మరియు సులభమైన షరతులతో ఒక దేశము మరియొక దేశమునకు అందించే గ్రాంటు. ఇది వస్తు రూపేణా లేదా ద్రవ్య రూపేణా ఉంటుంది. ఈ సహాయము అనేక విధములుగా ఉంటుంది. అవి -

1. **ఉభయపక్ష హామీలతో కూడిన ఖచ్చితమైన ఋణాలు** (Bilateral Hard Loans) : ఉదా - భారతదేశానికి బ్రిటీష్ ప్రభుత్వము ఇచ్చిన పౌండ్ స్టెర్లింగ్ ఋణము.

2. **ఉభయపక్ష హామీలతో కూడిన సులభమైన ఋణాలు** (Bilateral soft laons) : ఉదా - పి.ఎల్. - 480 క్రింద అమెరికా భారతదేశానికి అందించిన ఆహార ధాన్యాలు మరియు ఇతర వ్యవసాయ ఉత్పత్తులు.

3. **అంతర్జాతీయ సంస్థలు అందించే బహుళ పక్ష ఋణాలు** (Multilateral Loans) : ఉదాహరణకు ఐక్యరాజ్య సమితి సంస్థలైన వరల్డ్ బాంకు, అంతర్జాతీయ అభివృద్ధి సమాఖ్య (International Development Agency), ఎయిడ్ ఇండియా క్లబ్ మొ॥ సంస్థల ద్వారా అందించే ఆర్థిక సహకారము.

**9.4.3 ప్రైవేటు మూలధన సహాయము** (Private Foregin Capital) :- ప్రైవేటు మూలధన సహాయం మూడు విధమలు అవి -

1. **ప్రత్యక్ష మూలధన పెట్టుబడులు** :- అభివృద్ధి చెందిన దేశాల నుండి పరిశ్రమలు తరలి వచ్చి అభివృద్ధి చెందుతున్న దేశాలలో తమ యొక్క పారిశ్రామిక విభాగాలు నెలకొల్పి లేదా ఆయా దేశాలలో అభివృద్ధికి దోహదపడు పెట్టుబడులను పెట్టుట. ఉదా॥ బహుళ జాతీయ సంస్థలు (MNCs) ఈ తరహాకు చెందుతాయి.

2. **పరోక్ష మూలధన పెట్టుబడులు** (Indirect Investments) :- అభివృద్ధి చెందిన దేశాలలో ప్రజలు గాని, సంస్థలు గాని అభివృద్ధి చెందుతున్న దేశాలలో నిర్మింపబడు (స్థాపించబడు) ప్రాజక్టుల షేర్లు, డిబెంచర్‌లు, కొనుగోలు ద్వారా పెట్టుబడులు పెట్టుట, ఉదా॥ ప్రపంచ బ్యాంకు సహాయముతో నిర్మింపబడు ప్రాజక్టులలో బాండ్‌లు, షేర్‌లు కొనుగోలు చేయటం మొదలగునవి.

3. **నిర్దిష్ట సహాయము మరియు సాధారణ సహాయము** (Tied Aid - Un Tied Aid) :- అభివృద్ధి చెందిన దేశాల నుండి అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఒక ప్రత్యేక పథకము అమలు చేయుటకై అందించే సహాయము. ఉదా॥కు జాన్ కెనడీ ప్రభుత్వము భారతదేశమునకు ఆహార ధాన్యాల కొనుగోలు నిమిత్తము PL-480 క్రింద 1960వ దశకములో అందించిన ఆర్థిక సహాయము సాధారణ దేశీయ సహాయము ఎటువంటి ఆంక్షలు లేకుండా మరియు పరిమిత వినియోగమునకు కట్టుబడకుండా అభివృద్ధి చెందుతున్న దేశాలకు అందించే సహాయము. దీనినే Non project aid అందురు. భారతదేశమునకు UK నుండి, జర్మనీ నుండి అందుతున్న విదేశీ సహాయమును ఉదాహరణగా చెప్పవచ్చును.

**9.4.4 విదేశీయ సహాయాన్ని నిర్ణయించే అంశాలు :-** అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఏ మేరకు విదేశీయ సహాయము అందుతుందో అన్నది కొన్ని ముఖ్యమైన అంశాల పై ఆధారపడి ఉన్నది. అవి -

1. అభివృద్ధి చెందిన దేశాలలో లభ్యమైన మిగులు మూలధనము (Availability of Capital)
2. అభివృద్ధి చెందుతున్న దేశాల యొక్క పెట్టుబడుల ఉపయోగితా సామర్థ్యము (Capacity to Absorb Capital)
3. అభివృద్ధి చెందుతున్న దేశాలలో మానవ వనరుల మరియు ఆర్థిక వనరుల లభ్యత (Availability of human resources and natural resources)
4. అభివృద్ధి చెందుతున్న దేశాల యొక్క ఋణ చెల్లింపుల సామర్థ్యము (Capacity to repay loans)
5. అభివృద్ధి చెందుతున్న దేశాల యొక్క కృషి, పట్టుదల, (The will and effort to develop) ప్రముఖ ఆర్థికవేత్త అయిన నర్క్సే మాటలలో అభివృద్ధి చెందాలనే ఆకాంక్షయే ఆ దేశాలలో నిజమైన మూలధనం (capital is made at home)

**9.4.5 భారతదేశ ఆర్థికాభివృద్ధిలో విదేశ సహాయము పాత్ర :-** భారతదేశమునకు ప్రవహించిన విదేశ మూలధనములో విదేశ సహాయము ప్రముఖ పాత్ర వహిస్తుంది. విదేశ సహాయము అనేది ఆర్థికాభివృద్ధికి ఒక మార్గముగా, అభివృద్ధి సహాయకారిగా పని చేస్తుంది. విదేశీ సహాయము, గ్రాంటులు, ఋణము, P.L. - 480 / 665 క్రింద సహాయము క్రింద ఇప్పటి వరకు విదేశముల నుండి సహాయము పొందినది.

భారత విదేశ సహాయములో "భారత సహాయ బృందము" (Aid - India Consortium) ప్రధాన పాత్ర వహించినది. Aid - India consortium లో ప్రపంచ బాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి, ఐ.డి.ఏ., సంస్థలతో పాటు ఆస్ట్రేలియా, బెల్జియమ్, కెనడా, డెన్‌మార్క్, ఫ్రాన్స్, ఇటలీ, జర్మనీ, నెదర్‌లాండ్స్, స్వీడన్, ఇంగ్లండ్, అమెరికా, జపాన్ మొదలగు దేశముల నుండి పెద్ద మొత్తములో భారతదేశం విదేశ సహాయము పొందుచున్నది. ఈ సహాయము వలన ఒక వృద్ధి యంత్రముగా (engine of growth) పని చేస్తుంది.

భారతదేశ ఆర్థికాభివృద్ధిలో విదేశీ సహాయము ఎన్నో విధములుగా తోడ్పడుతూ ఉన్నది. అవి -

1. **పెట్టుబడి స్థాయి పెంచుటకు తోడ్పడినది :-** ప్రతి పంచవర్ష ప్రణాళికలలో విదేశ సహాయము ప్రముఖ పాత్రను పోషిస్తుంది. ప్రభుత్వము వనరుల సేకరణ మార్గాలైన పన్నులు, ప్రత్యేక విధింపులు, సుంకాలు ఏ విధముగా ఆదాయాన్ని సమకూర్చుతాయో విదేశీ సహాయము కూడా అదే విధముగా ఆదాయముగా భావించి ఈ సహాయాన్ని ప్రణాళికా వ్యయములో ప్రముఖ పాత్ర వహిస్తుంది. దీని వలన పెట్టుబడి పరిమాణం పెరుగును.
2. **ఆర్థికాభివృద్ధి - వ్యవస్థా మూలధన నిర్మాణము :-** ఆర్థికాభివృద్ధిలో సాంఘిక మూలధనము ప్రముఖ పాత్ర వహిస్తుంది. అవి రవాణా, సమాచార వనరులు, విద్యుత్ ప్రాజెక్టులు మొదలగు సాంఘీక కార్యకలాపాలు పెద్ద మొత్తంలో నిర్మించవలెనంటే పెట్టుబడులు కావలసి ఉంటుంది. మన దేశములో కొరతగా ఉన్నందువలన విదేశ సహాయము పై ఆధారపడుచున్నాము. ఇది ఆర్థికాభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతుంది.
3. **పారిశ్రామిక రంగం - అభివృద్ధి :-** కీలక పరిశ్రమలు అయిన ఇనుము, ఉక్కు, రసాయనములు, ఎలక్ట్రానిక్ పరిశ్రమలు నిర్మించుటకు స్వదేశంలో పెట్టుబడులు కొరతగా ఉన్నందువలన విదేశీ సహాయము ఎంతగానో తోడ్పడుతుంది. మొత్తము విదేశ సహాయములో పారిశ్రామిక రంగం 18 నుండి 26 శాతం వరకు ఉపయోగించుకొన్నది.

4. **వ్యవసాయ రంగము - అభివృద్ధి :-** భారతదేశము హరిత విప్లవము ప్రారంభము నుండి నేటి నీటి పారుదల ప్రాజెక్టుల అభివృద్ధి కొరకు పెద్ద మొత్తములో విదేశ సహాయము వాటి యొక్క అభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతుంది.

5. **వ్యవసాయ, పారిశ్రామిక వస్తువుల ధరల స్థిరీకరణ :-** ఆహార ధాన్యము రూపములో, ముడి పదార్థముల రూపంలో, యంత్ర పరికరాల దిగుమతులకు విదేశాల నుండి పెద్ద మొత్తములో సహాయము పొందడం వలన వీటి యొక్క ధరల స్థిరత్వాన్ని కొంత వరకు సాధించగలుగుతున్నాము.

6. **చెల్లింపుల శేషం లోటు :-** భారతదేశంలో ఎగుమతుల కన్నా దిగుమతులు పరిమాణం ఎక్కువగా ఉన్నందు వలన విదేశ మారకపు చెల్లింపులో లోటు ఏర్పడుతుంది. దీనిని భర్తీ చేయుటకు విదేశ సహాయము ద్వారా వచ్చిన మారకము లోటును కొంత వరకు భర్తీ చేస్తుంది. ఈ మధ్య కాలములో ఏర్పడిన విదేశ చెల్లింపుల లోటులో సుమారుగా 30% విదేశ సహాయము ద్వారా లోటును భర్తీ చేస్తున్నాము.

**9.4.6 విదేశ సహాయము - సమస్యలు :-**

1. **ఋణ చెల్లింపు భారము :-** విదేశ సహాయంలో సుమారు 55% విదేశీ ఋణము సేవలు ఉపయోగించినందు వలన అసలు మరియు వడ్డీ చెల్లింపులకు ఎగుమతులలో సుమారు 30% విదేశ ఋణ సేవలకు చెల్లించవలసి ఉంటుంది.

2. **విదేశ సహాయము తగ్గుదల :-** కొంత కాలం నుండి పరిశీలించినట్లయితే విదేశ సహాయము తిరిగి చెల్లించనవసరం లేదు. కాబట్టి ఈ సహాయ గ్రాంటులు ప్రతి సంవత్సరము తగ్గిపోవుచున్నవి.

3. **ఋణ వలయము :-** విదేశ ఋణము తిరిగి చెల్లించుటకు అసలు మరియు వడ్డీ భారతదేశము చెల్లించలేక తిరిగి విదేశముల నుండి ఋణము తీసుకోవలసి వస్తుంది. దీని ఫలితముగా ఋణ వలయములో చిక్కుకొని పోతుంది.

4. **విదేశ సహాయ నిబంధనలు :-** విదేశ సహాయము చేసినపుడు కొన్ని ప్రకటిత లేదా అప్రకటిత నిబంధనలతో కూడి ఉంటుంది. ఈ నిబంధనలు భారతదేశమునకు అనుకూలముగా ఉండుట లేదు.

ఉదా॥ రూపాయి విలువ మూల్యహీనీకరణ చేయవలయునని, విదేశముల పై ఉన్న ఆంక్షలు, సుంకాలు తొలగించవలెనని, ఆర్థికవ్యవస్థ సరళీకృతము చేయవలెనని అభివృద్ధి చెందిన దేశాలు ఒత్తిడి చేస్తాయి. అందువలన భారతదేశానికి ఈ నిబంధనలు ఆర్థికాభివృద్ధికి అనుకూలముగా ఉండవు.

5. **భారతదేశ పరిశ్రమలు - విదేశ పరిశ్రమలతో పోటీ లేకపోవుట :-** పారిశ్రామిక రంగములో విదేశ పెట్టుబడులు, సంస్థల స్థాపన వలన స్వదేశములో ఉన్న పరిశ్రమలు విదేశ పోటీని తట్టుకొనలేకపోవుచున్నవి. దీనికి కారణము మన దేశములో ఉన్న సాంకేతిక పరిజ్ఞానం విదేశ పరిశ్రమలలో ఉన్న సాంకేతిక పరిజ్ఞానంతో పోల్చినట్లయితే పురాతన సాంకేతిక ఉత్పత్తి పద్ధతులు. దీని వలన పోటీని ఎదుర్కొనలేకపోవుచున్నవి.

6. **అనిశ్చియత :-** ఒక నిర్ణీత కాల వ్యవధిలో లభించు విదేశ సహాయ పరిమాణము మరియు స్వభావములో అనిశ్చియత ఏర్పడుతున్నది. అందుచేత భవిష్యత్ ప్రణాళికలు రూపొందించుట, వాటిని అమలుచేయుట కష్టము.

7. **రాజకీయ ఒత్తిడులు :-** విదేశ సహాయము నిచ్చు దేశములు అయిన అమెరికా, బ్రిటన్ లాంటి దేశములు భారత ప్రభుత్వ విధానములో, చట్టములలో మార్పు తెచ్చుటకు ఒత్తిడి తెచ్చుచున్నవి. దీని వలన భారత సార్వభౌమాధికారానికి భంగము కలుగును.

8. **సాంకేతిక డంపింగ్ :-** విదేశ సహాయము సాంకేతిక పరిజ్ఞానము మరియు యంత్రాలు కాలము చెల్లిన వాటిని అభివృద్ధి చెందిన దేశములు, అభివృద్ధి చెందుతున్న దేశములకు విదేశ సహాయము రూపంలో అందిస్తాయి.

9. **మూలధన కదలిక :-** విదేశ సహాయము చేసినందు వలన ఆ దేశాలకు లభించు లాభములు, డివిడెండ్లు మొదలగునవి ఆయా దేశములకు తరలించుట వలన భారతదేశ విదేశ చెల్లింపుల పై భారము కలుగుతుంది.

## 9.5 సారాంశము :-

అభివృద్ధి చెందుతున్న దేశాలలో ప్రజల జీవన ప్రమాణాన్ని మెరుగు పరచాలంటే త్వరితగతిన ఆర్థికాభివృద్ధి సాధించవలసి ఉంది. ఆర్థికాభివృద్ధికి అవసరమైన వివిధ విధానాలను చేపట్టవలసి ఉన్నది. వీటిలో ఎగుమతుల పెంపుదల, దిగుమతుల ప్రత్యామ్నాయీకరణ ముఖ్యమైనవి. ఈ దేశాలలో మార్కెట్ విస్తరణ జరగవలెనన్న వనరుల అభిలషణీయ కేటాయింపు చేయాలన్నా భారీ పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నా మరియు ఉత్పాదకత పెంచాలన్నా పైన ఉదహరించిన రెండు విధానాలను సరిఅయిన రీతిలో మేళవింపు చేసుకోవడం అవసరము. ఆర్థికాభివృద్ధిలో విదేశీ సహాయము ప్రముఖ పాత్ర వహిస్తున్నది అన్నది అతిశయోక్తి కాదు. అయితే విదేశీ సహాయము కొన్ని నిర్ధిష్టమైన ప్రాజెక్టులకే పరిమితం కాకుండా ప్రజా సంక్షేమానికి ఉపయోగపడే రీతిలో ఉండాలి. అటువంటప్పుడు అభివృద్ధి చెందుతున్న మరియు పేద దేశాల ఆర్థికాభివృద్ధికి విదేశీ సహాయము ఎంతో ఉపకరిస్తుంది.

## 9.6 సాంకేతిక పదాలు :-

| | |
|---|---|
| ఎగుమతుల పెంపుదల | Export Promotion |
| దిగుమతుల ప్రత్యామ్నాయీకరణ | Import Substitution |
| వనరుల అభిలషణీయ కేటాయింపు | Optimum Allocation of Resources |
| విదేశీ సహాయము | Foregin Aid |
| ప్రభుత్వ మూలధన సహాయము | Public Foregin Capital |
| ప్రైవేటు మూలధన సహాయము | Private Foregin Capital |
| బహుళ పక్ష ఋణాలు | Multilateral Loans |
| నిర్ధిష్ట సహాయము | Tied Aid |
| సాధారణ సహాయము | Un Tied Aid |
| భారత సహాయ బృందము | Aid India Consortium |
| అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ | International Developemnt Agency |
| ప్రపంచ బ్యాంకు | World Bank |
| అంతర్జాతీయ ద్రవ్యనిధి | International Monetary Fund |

## 9.7 నమూనా ప్రశ్నలు :-

1. ఎగుమతుల పెంపుదల మరియు దిగుమతుల ప్రత్యామ్నాయీకరణ గూర్చి వివరింపుము?
2. అభివృద్ధి చెందుతున్న దేశాలకు విదేశీ సహాయము పాత్ర వివరింపుము?
3. అంతర్జాతీయ వ్యాపారము మరియు విదేశీ సహాయములలో దేనిని నీవు సమర్థిస్తావు? వివరింపుము.
4. నిర్దిష్ట సహాయము మరియు సాధారణ సహాయము గూర్చి వివరింపుము?

## 9.8 చదువదగిన గ్రంథాలు :-


1. Gerald M. Meier (1999) - "Benefits and Costs of Private Foreign Investment" in Leading Issues in Economic Development
2. M.L. Jhingan (2002) - International Economics
3. Francis Cherunilam (2001) - International Economics
4. Dominick Salvatore (2001) - International Economics


- ఆచార్య కె. శ్రీరామమూర్తి

పాఠం - 10

# విదేశీ మారకపు మార్కెట్ - స్థిర విదేశీ మారకపు రేట్లు - అస్థిర (లేక) సరళ విదేశీ మారకపు రేట్లు - కొనుగోలు శక్తి సామ్య సిద్ధాంతము

## 10.0 లక్ష్యం :-

ఈ పాఠం చదివిన తరువాత ఈ క్రింది విషయాలను తెలుసుకుంటారు.

* విదేశీ మారకపు మార్కెట్
* స్థిర విదేశీ మారకపు రేట్లు
* అస్థిర (లేక) సరళ విదేశీ మారకపు రేట్లు
* కొనుగోలు శక్తి సామ్య సిద్ధాంతం

## విషయసూచిక :-


10.1 పరిచయము

10.2 విదేశీయ మారకపు మార్కెట్

10.2.1 విదేశీయ మారకపు మార్కెట్ విధులు

10.2.2 సమతౌల్య విదేశీయ మారకపు రేటు నిర్ణయము

10.3 స్థిర మరియు సరళ విదేశీయ మారకపు రేట్లు

10.3.1 స్థిర విదేశీ మారకపు రేట్లు

10.3.2 సరళ విదేశీ మారకపు రేట్లు

10.3.3 స్థిర విదేశీ మారకపు రేట్లు ప్రయోజనాలు

10.3.4 స్థిర విదేశీ మారకపు రేట్లు లోపాలు

10.3.5 సరళ విదేశీ మారకపు రేట్లు ప్రయోజనాలు

10.3.6 సరళ విదేశీ మారకపు రేట్లు లోపాలు

10.4 కొనుగోలు శక్తి సామ్య సిద్ధాంతము

10.4.1 నిరపేక్ష సిద్ధాంతము

10.4.2 సాపేక్ష సిద్ధాంతము

10.4.3 కొనుగోలు శక్తి సామ్య సిద్ధాంతము - విమర్శ

10.5 సారాంశము

10.6 సాంకేతిక పదాలు

10.7 నమూనా ప్రశ్నలు

10.8 చదువదగిన గ్రంథాలు

## 10.1 పరిచయము :-

విదేశీ మారకపు మార్కెట్‌లో వివిధ దేశాల లావాదేవీలు తమ కరెన్సీ ద్వారా జరుపుతాయి. వివిధ దేశాలు చేసే ఎగుమతి, దిగుమతుల అభివృద్ధి విదేశ మారకపు రేటు పై ఆధారపడుతుంది. విదేశ మారకపు రేటు సాధారణముగా రెండు రకాలుగా ఉంటుంది. అవి 1. స్థిర మారకపు రేట్లు, 2. అస్థిర మారకపు రేట్లు (సరళ మారకపు రేట్లు).

ఈ పాఠములో స్థిర మరియు సరళ మారకపు రేట్ల యొక్క ప్రయోజనాలు, నష్టాలను వివరించడం జరిగింది. గుస్తావ్ కాజిల్ ప్రతిపాదించిన కొనుగోలు శక్తి సామ్య సిద్ధాంతము విపులముగా తెలియజేయడం జరిగింది.

## 10.2 విదేశ మారకపు మార్కెట్ (Foreign Exchange Market) :-

వివిధ దేశాల కరెన్సీల లావాదేవీలు జరుగు మార్కెట్‌ను విదేశ మారకపు మార్కెట్ అందురు. ఈ మార్కెట్‌లో వ్యక్తులు, సంస్థలు మరియు బ్యాంకులు వివిధ దేశాల కరెన్సీలలో లావాదేవీలు జరుపుతాయి. ప్రతి దేశములో విదేశీ మారకపు మార్కెట్ పని చేస్తుంది.

**10.2.1 విదేశ మారకపు మార్కెట్ యొక్క విధులు :-** విదేశీ మారకపు మార్కెట్ ముఖ్యముగా మూడు విధులను నిర్వహిస్తుంది.

1. **కొనుగోలు శక్తి బదిలీ** (Transfer of Purchasing Power) :- వస్తు కొనుగోలు శక్తి ఒక దేశము నుండి మరియొక దేశానికి మరియు ఒక కరెన్సీ నుండి మరియొక కరెన్సీకి బదలీ చేయుటంలో విదేశ మారకపు మార్కెట్ ముఖ్యపాత్ర వహిస్తుంది. దీనికి తోడు అంతర్జాతీయ వాణిజ్యములో మరియు అంతర్జాతీయ పెట్టుబడుల కదలికలో విదేశీ మారకపు మార్కెట్ కీలకపాత్ర వహిస్తుంది.

2. **వివిధ దేశాలకు వాణిజ్య పరపతిని అందించుట** (Provision of Credit) :- ఎగుమతిదారులకు మరియు దిగుమతిదారులకు అవసరమైన పరపతిని (విదేశీ ద్రవ్యరూపంలో) అందించి, అంతర్జాతీయ వ్యాపార అభివృద్ధికి తోడ్పడుతుంది. ఉదాహరణకు యూరో డాలర్ మార్కెట్ అతి ముఖ్య అంతర్జాతీయ పరపతి మార్కెట్‌గా చెప్పవచ్చును.

3. **నిలువ సరుకు వినిమయ పరిరక్షణ** (Provision of Hedging Facilities) :- విదేశీ మారకపు మార్కెట్‌లో ఎదురయ్యే నష్ట భయము నుండి కాపాడుటకై నిల్వ సరుకు వినిమయ పరిరక్షణను అందిస్తుంది. దీని వలన ఎగుమతిదారులను దిగుమతిదారులను అస్థిర విదేశీ మారకపు రేట్లు వలన కలిగే నష్టాల నుండి పరిరక్షించుట జరుగుతుంది.

**10.2.2 సమతౌల్య విదేశీ మారకపు రేటు నిర్ణయము :-** స్వేచ్ఛా మార్కెట్‌లో (Free Market) విదేశీ మారకపు రేటు విదేశీ మారకపు ద్రవ్యము యొక్క డిమాండ్ మరియు సప్లయిలపై ఆధారపడుతుంది. ఏ రేటు వద్ద విదేశీ మారకపు ద్రవ్యపు సప్లయి మరియు డిమాండ్ సమానముగా ఉండునో ఆ రేటును సమతౌల్య విదేశ మారకపు రేటుగా చెప్పవచ్చు. (It is the rate at which the demand for foreign exchange equals to supply of foreign exchange).


ఉదాహరణకు రెండు దేశాలు తీసుకుందాము. అవి భారతదేశము మరియు అమెరికా. ఈ రెండింటి మధ్య విదేశీ మారకపు రేటు ఈ క్రింది విధముగా నిర్ణయింపబడుతుంది. డాలరు మరియు రూపాయిల మధ్య విదేశీ మారకపు రేటు, ఒక డాలర్‌ను కొనుగోలు చేయుటకు ఎన్ని రూపాయలు అవసరము తెలుపుతుంది. అది

$$\left[\therefore R = {Rs}/_{\$}\right]$$

$R =$ రూపాయి / డాలర్

ఉదాహరణకు 100 రూపాయలకు రెండు డాలర్‌లు విదేశీ ద్రవ్యము లభించినట్లయితే విదేశీ మారకపు రేటు $R = {100}/_{2} = Rs. 50$. అంటే ఒక డాలర్ = 50 రూపాయలుగా చెప్పవచ్చును. దీనిని ఈ క్రింది రేఖా పటము ద్వారా చెప్పవచ్చును.

**పటము 10.1 - సమతౌల్య విదేశీ మారకపు రేటు**




ఈ రేఖా పటములో OY అక్షము పై మారకపు రేటు, OX అక్షము పై విదేశ మారకపు పరిమాణము తీసుకొన్నాము. DD రేఖ విదేశీ మారకపు డిమాండ్‌ను, SS రేఖ విదేశీ మారకపు సప్లయిని తెలియజేస్తాయి. ఈ రెండు రేఖలు ఖండించుకొన్న "E" బిందువు వద్ద సమతౌల్య విదేశీ మారకపు రేటు నిర్ణయించబడుతుంది.

E బిందువు వద్ద సమతౌల్య మారకపు రేటు OR గాను విదేశీ మారకపు సప్లయి మరియు డిమాండ్ OQ గాను ఉన్నవి.

## 10.3 స్థిర మరియు సరళ విదేశీ మారకపు రేట్లు (Fixed and Flexible Exchange Rates) :-

విదేశ మారకపు రేట్లు నిర్ణయించుటలో మార్కెట్ వ్యక్తులతో పాటు అంతర్జాతీయ ద్రవ్యనిధి, వివిధ దేశాల ప్రభుత్వాలు మరియు ద్రవ్య అధికారులు ప్రముఖ పాత్ర నిర్వహిస్తారు. సాధారణముగా విదేశ మారకపు రేట్లను రెండు రకాలుగా చెప్పవచ్చును. అవి 1. స్థిర మారకపు రేట్లు, 2. అస్థిర (లేదా) సరళ మారకపు రేట్లు.

10.3.1 స్థిర విదేశ మారకపు రేట్లు :- స్థిర విదేశ మారకపు రేట్లు నిర్ణయించుటలో ప్రభుత్వము మరియు ద్రవ్య అధికారులు ప్రముఖ పాత్ర నిర్వహిస్తారు. జాతీయ ద్రవ్యమును పరిగణనలోనికి తీసుకొని విదేశీ మారకపు రేట్లు నిర్ణయిస్తారు.

జాతీయ ద్రవ్య మార్కెట్, అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌కు అనుగుణముగా విదేశ మారకపు రేట్లను స్థిరీకరిస్తారు. విదేశీ మారకపు రేట్లు సమతౌల్యముగా ఉంచుటకై తమ దేశాల కరెన్సీని శ్రేణి తగ్గింపు గాని శ్రేణి పెంపు గాని అవసరాన్నిబట్టి (depreciation) (Appreciation) చేస్తారు. ఈ విధానము అమలుచేయుటలో కేంద్ర బ్యాంక్ ప్రముఖ పాత్ర వహిస్తుంది.

10.3.2 **సరళ విదేశ మారకపు రేట్లు :-** సరళ విదేశ మారకపు రేట్లు మార్కెట్ శక్తులచే నిర్ణయింపబడతాయి. ప్రభుత్వ జోక్యము ఉండదు. దేశములో ద్రవ్య సప్లయి పరిమాణము ఎక్కువగా ఉన్నప్పుడు అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో ద్రవ్యం విలువ తగ్గిపోవును. అంటే విదేశ మారకపు రేటు తగ్గిపోతుంది. అయితే మార్కెట్ శక్తుల ద్వారా విదేశపు మారకపు సప్లయి పెరిగి మరల విదేశ మారకపు రేటు సమతౌల్యాన్ని చేరుతుంది. పై విధముగా దేశీయ ద్రవ్య సప్లయి అధికముగా ఉన్నప్పుడు విదేశీ మారకపు రేటు పెరిగి మరియు దేశీయ ద్రవ్య సప్లయి తక్కువగా విదేశీయ మారకపు రేటు తరిగి సమతౌల్య రేటు మార్కెట్ శక్తుల ద్వారా నిర్ణయించబడుతుంది.

10.3.3 **స్థిర విదేశీ మారకపు రేట్లు - ప్రయోజనాలు :-**

1. **ఒకే విధమైన కరెన్సీ పై ఆధారపడుట (Based on Common Currency) :-** వివిధ దేశాల మధ్య ఒకే రకమైన కరెన్సీ అమలులో ఉన్నందున, విదేశ మారకపు రేటు కూడా స్థిరముగా ఉంటుంది. దీని వలన విదేశ వ్యాపారములో అనిశ్చితకు అవకాశం ఉండదు. విదేశ మారకపు రేటు మార్పు చెందుట వలన విదేశ చెల్లింపులలో భారము పెరుగుతుంది అను భయము ఉండదు. దీని వలన విదేశ వ్యాపారము అభివృద్ధి జరుగుతుంది. మారకపు రేటు స్థిరముగా ఉన్నందున అంతర్జాతీయ వ్యాపారములో వస్తువు యొక్క ధరలు కూడా స్థిరముగా ఉంటాయి. ఈ విధముగా కొనసాగాలంటే దేశముల మధ్య ఒకే కరెన్సీ అమలులో ఉండాలి.

   "Johnson" జాన్‌సన్ అభిప్రాయం ప్రకారం దేశముల మధ్య ఒకే రకమైన స్థిర మారకపు రేటు అనుసరించినందున మరియు జాతీయ ఆర్థిక విధానాలు ఒకే రకముగా ఉన్నందున ప్రపంచ ఆర్థిక సమాఖ్యత ఏర్పడును.

2. **దీర్ఘకాల మూలధన ప్రవాహములను ప్రోత్సహిస్తుంది (Encourage Long Term Capital Flows) :-** స్థిర మారకపు రేటు అనుసరించినందు వల్ల దీర్ఘకాలములో మూలధన ప్రవాహములో ఏ విధమైన ఒడిదుడుకులు ఉండవు. అందుచేత మారకపు రేటులోఉన్న అనిశ్చిత మరియు నష్టభయము పూర్తిగా తొలగిపోయి దీర్ఘకాలిక మూలధన ప్రవాహము ప్రోత్సహించబడుతుంది.

3. **కరెన్సీలో అస్థిరత ఉండదు (No Fear of Currency Fluctuations) :-** స్థిర మారకపు రేటు అమలులో ఉన్నప్పుడు కరెన్సీ విలువలో పెరుగుదల కాని లేదా తరుగుదల గాని ఉండదు. పెద్ద పెద్ద మొత్తములో విదేశీయ కరెన్సీని నిల్వ ఉంచుకొన్నప్పుడు కూడా దాని యొక్క మారకపు విలువ తగ్గుతుంది అనే భయము ఉండదు. దీని వలన దేశీయ కరెన్సీ విలువలో కూడా ఎటువంటి మార్పు ఉండదు.

4. **అంచనా వ్యాపారము దుష్ఫలితము ఉండవు (No adverse effect of speculation) :-** అంచనా వ్యాపారములో ఉన్న అస్థిరతను పూర్తిగా స్థిర మారకపు రేటు తొలగిస్తుంది. అంచనా వ్యాపారము కొనసాగకుండా ఉండుటకు ద్రవ్య అధికారులు తన పరిధిలోనికి 'కరెన్సీ'లో హెచ్చుతగ్గులు లేకుండా చూస్తారు. దీని వలన అంతర్జాతీయ మారకపు రేటు స్థిరంగా ఉంటుంది. అందువలన అంతర్జాతీయ వ్యాపారములో అంచనా వ్యాపారము కొనసాగుటకు అవకాశము ఉండదు.

5. **క్రమశిక్షణ ఆవశ్యకత :-** స్థిర మారకపు రేటు అనుసరించినందు వలన కలిగే అతి ముఖ్యమైన ప్రయోజనము. స్థిర మారకపు రేటు కొనసాగించాలంటే దేశములో ప్రభుత్వము, ద్రవ్య అధికారులు తమ యొక్క విధానములను బాధ్యతాయుతముగా ప్రవర్తించవలెను. అంతర్గత ఉద్యోగిత పెరుగుదలకు ద్రవ్యోల్బణ విధానము అనుసరించినందున విదేశ చెల్లింపుల లోటు ఏర్పడుతుంది. ఈ అంతర్గత విధానము విదేశ చెల్లింపుల పై కాకుండా విదేశ మారకపు రేటుకు అస్థిరత కలుగజేస్తుంది.

6. **చిన్న దేశాలకు మంచిది (Best for Small Countries) :-** జాన్సన్ అభిప్రాయము ప్రకారము స్థిర మారకపు రేటు అనుసరించినందు వలన చిన్న దేశాలకు ఎంతో ప్రయోజనముగా ఉంటుంది.

దేశములో ఉన్న ద్రవ్యోల్బణము, ఆర్థికమాంద్య పరిస్థితుల ప్రభావము నుండి బయటపడుటకు స్థిర మారకపు రేటు ఎంతగానో దోహదపడుతుంది.

7. **అనిశ్చిత తొలగించుట :-** స్థిర మారకపు రేటు అమలులో ఉన్నందున అంతర్జాతీయ వ్యాపారములో అనిశ్చిత తొలగిపోవును. దేశంలో ఎగుమతులు, దిగుమతులు జరిగినపుడు వస్తు రూపంలోగాని, విదేశీయ మారకం గాని చెల్లించవలెను. మారకపు విలువ స్థిరముగా ఉన్నప్పుడు ఎటువంటి ఇబ్బందులు ఉండవు.

8. **ఒకే విధమైన ద్రవ్యము గల దేశాలకు బాగుగా ఉపయోగపడుట** (Suitable for Common Currency Area) :- ఒకే ద్రవ్యము, ఒకే ప్రాంతమునకు అనుసరించినందు వలన ఇక్కడ స్థిర మారకపు రేటును అనుసరించుటకు వీలు ఉంటుంది. దీని వలన ప్రపంచ వాణిజ్యములో వృద్ధిని సాధించుటకు అవకాశం ఉంటుంది.

ఉదాహరణకు ఐరోపా దేశ సమాఖ్య యూరో ద్రవ్యం, డాలర్ అంతర్జాతీయ చెల్లింపులో ప్రముఖ పాత్రను వహిస్తుంది.

9. అంతర్జాతీయ ద్రవ్య సహాయమును అంతర్జాతీయ ద్రవ్యనిధి, ప్రపంచ బ్యాంకు, యూరో మార్కెట్, సభ్య దేశాలకు సహకారమును ద్రవ్య రూపంలోను అందజేస్తుంది. దీని వలన మారకపు రేటులో హెచ్చు తగ్గులు లేకుండా స్థిరముగా ఉండేటట్లు చూస్తుంది.

10.3.4 స్థిర విదేశీ మారకపు రేట్లు - లోపాలు :-

1. **లక్ష్యాల త్యాగము (Sacrifice of Objectives) :-** స్థిర మారకపు రేటు మాత్రము అనుసరించుటకు కొన్ని త్యాగములు చేయవలెను. ఆర్థికవ్యవస్థలో సంపూర్ణ ఉద్యోగిత కొనసాగినపుడు ధరలు కూడా స్థిరముగా ఉంటాయి. అప్పుడు మాత్రమే స్థిర మారకపు రేటు ఉంటుంది. దీని ఫలితముగా విదేశీ చెల్లింపులలో లోటు ఏర్పడుతుంది. అంతేకాకుండా ధరల పెరుగుదలను తొలగించుటకు ద్రవ్య సప్లయిని, ప్రభుత్వ వ్యయము తగ్గించవలెను. దీని వలన విదేశ చెల్లింపుల మిగులు ఏర్పడుతుంది. దీని వలన విదేశ చెల్లింపుల అసమతౌల్యమును సృష్టిస్తాయి. కాబట్టి స్థిర విదేశ మారకపు రేటు విధానము అంతర్గత సముచిత విధానములకు అవరోధంగా ఉంటుంది.

2. **అనుకోని ఒడుదుడుకులు :-** ఒక దేశములో ఏర్పడిన ఆర్థిక మాంద్య ప్రభావము మరియొక దేశమునకు ప్రభావము చూపగలదు. అందువలన దిగుమతులకు ఉన్న డిమాండ్ తగ్గి ఇతర దేశములకు ఎగుమతులు కూడా తగ్గుతాయి. ఎగుమతులు పెంచుటకు విదేశ మారకపు రేటు మూల్యహీనీకరణ చేయవలసి ఉంటుంది. దీని ప్రభావము వలన ఆర్థిక ఒడుదుడుకులు ఒక దేశం నుండి మరియొక దేశమునకు తరలిపోవును.

3. **ఆర్థిక ఒత్తిడి :-** విదేశీయ వ్యాపారములో చెల్లింపుల శేషంలో వచ్చిన లోటును భర్తీ చేయుటకు ప్రతి దేశము అధిక మొత్తంలో విదేశీయ కరెన్సీని అవసరమునకు మించి తన దగ్గర నిల్వ చేస్తుంది. దీని వలన స్వదేశీయ కరెన్సీ తగ్గి విదేశీయ కరెన్సీ పెరిగినందు వలన దేశములో మూల్యహీనీకరణ విధానాన్ని ప్రవేశపెట్టవలసి ఉంటుంది.

4. **క్లిష్టమయిన విదేశ మారక నియంత్రణ :-** విదేశ మారక నియంత్రణను తప్పనిసరిగా పాటించవలెను. లేనిచో దేశములో ఉన్న వనరుల కేటాయింపు సరిగా జరగదు. దీని వలన వనరులు దుర్వినియోగము జరగవచ్చును. అందువలన క్లిష్టమయిన విదేశమారక నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేయవలెను.

5. **Complex System :-** స్థిర మారకపు రేటు విధానమును అమలుచేయుట కష్టము. దీనిని అనుసరించినందు వలన కాలం వృధా అవుతుంది. ఈ విధానాలు తయారు చేయుటలో కొన్ని లోపాలు ఉన్నవి. అంతేకాకుండా దీనిని అమలుపరుచుటకు ఉన్నత విద్యావంతులు, నైపుణ్యము గల పర్యవేక్షణా అధికారులు ఉండవలెను.

6. **చెల్లింపుల శేషములో అసమతౌల్యము :-** స్థిర మారకపు రేటు సిద్ధాంతము చెల్లింపుల శేషములో అసమతౌల్యమును పరిష్కరించలేకపోయినది. దీనిని పరిష్కరించుటకు శాశ్వత విధానములు అయిన ద్రవ్య, కోశ విధానములను ప్రవేశ పెట్టవలెను.

7. **అంతర్జాతీయ ద్రవ్య సంస్థల పై ఆధారపడుట :-** స్థిర మారకపు రేటు విధానము అనుసరించినందు వలన చెల్లింపుల లోటును భర్తీ చేయుటకు అంతర్జాతీయ ద్రవ్య సంస్థలు అయిన అంతర్జాతీయ ద్రవ్యనిధి, ప్రపంచ బ్యాంక్, యూరో మార్కెట్ మొదలగు సంస్థలపై ప్రతి దేశము ఆధారపడవలసి ఉంటుంది.

### 10.3.5 సరళ విదేశీ మారకపు రేట్లు - ప్రయోజనాలు :-

1. **సులభముగా పని చేయు విధానము :-** సరళ విదేశ మారకపు రేట్లు పని చేయు విధానము సులభముగా ఉంటుంది. మారకపు రేటులో మార్పు స్వేచ్ఛాయుతముగా జరిగి విదేశీ మారకపు డిమాండ్ మరియు సప్లయి సమానము అవుతాయి. విదేశ మార్కెట్‌లో లోటు లేదా విదేశ కరెన్సీల మిగులు ద్వారా నిర్మాణ కార్యకలాపాలు, వనరుల కొరత మొదలగు సమస్యలను సులభముగా సరళ విదేశ మారకపు రేటు పరిష్కరిస్తుంది. అంతేకాకుండా చెల్లింపుల శేషములో ఏర్పడిన సమస్యల వలన ధరలు, ఆదాయంలో ఏవిధమైన మార్పులు కలిగినప్పటికి మరల తిరిగి సమతౌల్య స్థితికి చేరుకోవడం జరుగుతుంది.

2. **మృదువుగా సవరింపు చేయుట :-** విదేశీయ చెల్లింపుల శేషములో వచ్చు హెచ్చు తగ్గులను ఎటువంటి ఇబ్బందులు లేకుండా సరళ విదేశ మారకపు రేటు విధానము మృదువుగా పరిష్కరిస్తుంది. స్థిర మారకపు రేటు చెల్లింపుల శేషములో వచ్చిన సమతౌల్యమును పరిష్కరించుటలో విఫలము అయినది. కాని ఈ సమస్యను మృదువుగా సవరింపు చేయుటలో సరళ మారకపు రేట్లు సఫలీకృతమైనవి.

3. **స్వతంత్ర ఆర్థిక విధానములు :-** ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని కొన్ని లక్ష్యాలను నెరవేర్చుతుంది. అవి ఆధునిక ప్రభుత్వాలు సంపూర్ణ ఉద్యోగిత మరియు నిలకడ కలిగిన వృద్ధిరేటు సాధించుటను తమ బాధ్యతగా గుర్తిస్తుంది. ఆర్థిక వ్యవస్థలో సంపూర్ణ ఉద్యోగిత, ధరలు స్థిరత్వమును సాధించుటకు చేసిన ప్రయత్నం విఫలము అయినపుడు చెల్లింపుల శేషములో ఏర్పడిన లోటును సరళ మారకపు రేట్లు పరిష్కరిస్తాయి. ఆర్థిక విధానములు స్వతంత్రముగా అమలు చేయవచ్చు.

4. **చెల్లింపుల శేషములో ఏర్పడిన అసమతౌల్యమును సరి చేయుట :-** సరళ మారకపు రేటు అనుసరించినందున విదేశ చెల్లింపుల శేషములో ఏర్పడిన (లోటును) అసమతౌల్యమును సవరించుటకు దేశములో ఉన్న బంగారము మరియు మూలధన ప్రవాహము విదేశాలకు తరలించవవసరము లేదు. సరళ మారకపు రేటు అనుసరించినపుడు చెల్లింపుల శేషములో ఏర్పడిన అసమతౌల్యమును ఆటోమేటిక్‌గా పరిష్కరించవచ్చును.

5. **విదేశ మారకపు నిల్వలు ఉంచవలసిన అవసరము ఉండదు :-** విదేశ చెల్లింపుల అవసరము నిమిత్తము పెద్ద మొత్తములో విదేశ మారకపు నిల్వలు ఉంచవలసిన అవసరము ఎంత మాత్రము ఉండదు. దీనికి కారణము విదేశ చెల్లింపులలో అసమతౌల్యము (లోటు) ఏర్పడినపుడు మారకపు రేటులో సరళత అనుసరించినట్లు అయితే అసమతౌల్యమును (లోటు) పరిష్కరించవచ్చును. విదేశీ చెల్లింపుల లోటు ఏర్పడిన దేశము కొంత మేరకు మూల్యహీనీకరణ చేస్తే సమతౌల్యము సాధించవచ్చు.

6. **అంతర్జాతీయ ద్రవ్యత్వము సమస్యల తొలగింపు :-** సరళ మారకపు రేటు విధానము అంతర్జాతీయ ద్రవ్యత్వములో ఉన్న సమస్యలను పరిష్కరిస్తుంది.

7. **స్వల్పకాలిక అవసరాలు :-** చెల్లింపుల శేషములో ఏర్పడిన లోటును చెల్లించుటకు స్వల్పకాలిక అవసరాల నిమిత్తము అంతర్జాతీయ ద్రవ్యనిధి, ప్రపంచ బ్యాంకు నుండి, అప్పులు, ఋణాలు చేయవలసిన అవసరము ఉండదు.

8. **సమస్య నుండి తప్పించుకొనుట :-** ద్రవ్య విధానము లోను, కోశ విధానములోను మరియు పరిపాలనకు సంబంధించిన విధానములో లోపములు ఉన్నప్పటికి చెల్లింపుల శేషములో ఏర్పడిన లోటు తనకు తానే పరిష్కరించుకోగలుగుతుంది.

9. **ఆదాలు :-** ఆర్థిక సమతౌల్యము సాధించుటకు ముందుగా విదేశీయ కరెన్సీగాని మరియు ఇతర ద్రవ్య నిధులు తన దగ్గర ఉంచవలసిన అవసరము ఉండదు. ఏవైనా సమస్యలు ఏర్పడినప్పుడు తనకు తానుగా పరిష్కరించుకొంటుంది.

10. **తులనాత్మక లాభం :-** మారకపు రేట్లు సమతౌల్యముగా ఉండటము వలన ప్రతి దేశము ఏదో ఒక వస్తువును ఉత్పత్తి చేయుటలో తులనాత్మక లాభం సాధిస్తుంది.

10.3.6 సరళ విదేశీ మారకపురేట్లు - లోపాలు :-

1. **వనరుల దుర్వినియోగము :-** సరళ విదేశ మారకపు రేట్లు విధానములు మార్కెట్ శక్తులను తప్పు త్రోవ పట్టిస్తుంది. విదేశ చెల్లింపుల నిమిత్తము సమతౌల్యము సాధించుటకు మారకపు రేట్లను మార్పు చేయుట వలన దేశానికి శ్రేయస్సుకరము కాదు. దీని ఫలితముగా వనరుల దుర్వినియోగము జరుగుతుంది.

2. **ప్రభుత్వ జోక్యం ఉండదు :-** స్వేచ్ఛగా సరళ మారకపు రేట్లు అనుసరించినందు వలన ప్రతి దేశము విదేశ మార్కెట్‌లో తన యొక్క పాత్రను పోషించుటకు ప్రయత్నం చేస్తుంది. అందువలన కోశ, ద్రవ్య విధానాలు తమ దేశానికి అనుకూలముగా మలచుటకు ప్రయత్నం చేస్తుంది. దీని వలన అభివృద్ధి చెందుతున్న దేశాలు అధికముగా నష్టపోతాయి.

3. **న్యాయము ఉండదు :-** అంతర్జాతీయ మార్కెట్ శక్తులు స్వేచ్ఛగా తమకు నచ్చిన విధముగా పని చేయడము వలన అంతర్జాతీయ మార్కెట్‌లో హెచ్చు తగ్గుల వలన ధరలు, వడ్డీ, వేతనాలు, వడ్డీరేట్లు ఎప్పటికప్పుడు మారుతాయి. ప్రభుత్వానికి నియంత్రించే శక్తి ఉండదు. ఈ కారణంగా సరియైన న్యాయం జరుగదు.

4. **మారకములో నష్టభయము - అనిశ్చిత :-** ప్రతి దేశము తనకు నచ్చిన విధముగా మారకపు రేట్లు సరళము చేసినందు వలన అనిశ్చిత ఏర్పడును. దీని ఫలితముగా నష్ట భయము ఏర్పడుతుంది.

5. **అంచనా వ్యాపారము :-** దీనిలో విదేశ మారకపు డిమాండ్ మరియు విదేశ మారకపు సప్లయిలు ఆధారము చేసుకొని విదేశీయ చెల్లింపులు జరుగుతాయి. విదేశీయ చెల్లింపులలో హెచ్చు తగ్గులు వచ్చుటకు అతిప్రధానమైన కారణము అంచనా వ్యాపారము ప్రభావితం చేస్తుంది. ఒక దేశంలో కరెన్సీ విలువ తగ్గుతుందని అంచనా వేసి అంచనా వ్యాపారస్తులు ఆ కరెన్సీని విదేశ మార్కెట్‌లో విక్రయించవచ్చును. దీని వలన ఆ కరెన్సీ సప్లయి పెరుగుతుంది. దీని ఫలితముగా విదేశ మారకపు రేట్లు మారుతుంటాయి. అదే విధముగా కరెన్సీ పెరిగినప్పుడు కొనుగోలు చేయవచ్చును. దీని వలన అంచనా వ్యాపారులు సహజముగా మారకపు రేట్లను మార్పు చేస్తారు.

6. **ద్రవ్యోల్బణ ప్రోత్సాహం (Encourage Inflation) :-** అంచనా వ్యాపారము ఫలితముగా మారకపు డిమాండ్ మరియు మారకపు సప్లయిలను ప్రభావితం చేసి విదేశీయ చెల్లింపుల పై ప్రభావం కలుగజేస్తుంది. విదేశ మారకపు రేటు తగ్గుదల ద్రవ్యోల్బణ విష వలయమును సృష్టిస్తుంది. దీని వలన వస్తువు ధరలు, ఉత్పత్తి కారకాల ధరలు, ఉత్పత్తి వ్యయాలు పెరుగుతాయి. ఇది ద్రవ్యోల్బణ పరిస్థితులను కలుగజేస్తుంది.

7. **ప్రపంచ మార్కెట్ విచ్ఛిన్నము చేయుట :-** సరళ మారకపు రేట్లు అనుసరించినందు వలన వినిమయ రేటులో మార్పు ద్రవ్యములో విలువ తగ్గిపోవడం వలన చెల్లింపులలో మార్పు వస్తుంది. మూలధన మార్కెటు, వస్తు మార్కెట్‌లు విభజించినందు వలన వనరుల కేటాయింపులో హెచ్చు తగ్గుల వలన అంతర్జాతీయ మార్కెట్‌లో విచ్ఛిన్నత కలుగుతుంది.

8. అభివృద్ధి చెందుతున్న దేశాలకు సరళ మారక రేట్లు అనుకూలముగా ఉండవు. దీని వలన చెల్లింపుల శేషములోలోటు విధానం అనుసరిస్తున్నాయి. దీనికి కారణం అభివృద్ధి చెందిన దేశముల నుండి అతి ముఖ్యమైన ముడిపదార్థములు, యంత్రాలు, పరికరాలు, మూలధన సామాగ్రి మొదలగునవి దిగుమతులు. కాని ఈ దేశాలలో ప్రాథమిక వస్తువుల ఎగుమతుల వలన విదేశ చెల్లింపుల లోటు ఏర్పడుతుంది. దీనిని పరిష్కరించుటకు దేశములో ఉన్న ద్రవ్యాన్ని (కరెన్సీ) మూల్యహీనీకరణ అనుసరిస్తుంది.

## 10.4 కొనుగోలు శక్తి సామ్య సిద్ధాంతము (Purchasing Power Parity Theory) :-

కొనుగోలు శక్తి సామ్య సిద్ధాంతమును గుస్టావ్ కాసెల్ (Gustav Cassel), 1920వ సంవత్సరములో అభివృద్ధి పరిచినాడు. కాగిత ద్రవ్యమున్న దేశముల మధ్య విదేశ మారకపు రేటు వాటి యొక్క కొనుగోలు శక్తి సమానతను బట్టి నిర్ణయించబడుతుంది. అనగా ఆ దేశము యొక్క సాపేక్ష ధరల స్థాయిని బట్టి (Relative Price Level) నిర్ణయించబడుతుంది. అంటే రెండు దేశాల మధ్య విదేశీ మారకపు రేటు, ఆ దేశాల యొక్క సాపేక్ష ధరలు నిర్ణయిస్తాయి. ఉదాహరణకు రెండు దేశములు తీసుకొందాము. అవి భారతదేశము మరియు రష్యా. భారతదేశములో 10 రూపాయలకు కొనుగోలు చేయగల వస్తు సముదాయము రష్యాలో 20 రూబల్స్‌కు కొనుగోలు చేయగలము అనుకొందాము. అప్పుడు రూపాయి మరియు రూబుల్ మధ్య మారకపు రేటు 1:2 (ఒక రూపాయి = రెండు రూబుల్స్‌గా) నిర్ణయించబడుతుంది. విదేశీయ మారకపు రేటు ఆ కరెన్సీల కొనుగోలు శక్తికి సమానముగా ఉంటుంది.

ఈ సిద్ధాంతము రెండు విధములుగా చెప్పబడినది. అవి 1. నిరపేక్ష సిద్ధాంతము, 2. సాపేక్ష సిద్ధాంతము.

**10.4.1 నిరపేక్ష సిద్ధాంతము :-** నిరపేక్ష కొనుగోలు శక్తి సామ్య సిద్ధాంతము ప్రకారము రెండు దేశాల కరెన్సీల మధ్య మారకపు రేటు ఆ దేశాల ధర సూచీల నిష్పత్తికి సమానముగా ఉంటుంది. (The exchange rate between two currencies should be equal to the ratio of price indexes in the two countries). దీనిని ఈ దిగువ సూత్రం ద్వారా తెలుపవచ్చు.

$$R_{AB} = \frac{P_A}{P_B}$$

$R_{AB}$ అనగా A మరియు B దేశాల మధ్య మారకపు రేటు

$P_A$ అనగా A దేశములో ధర సూచి

$P_B$ అనగా B దేశములో ధర సూచి

అయితే ఈ నిరపేక్ష సిద్ధాంతము రవాణా వ్యయాలు ఇతర ఉత్పత్తి కారకాలు ప్రమేయాన్ని పరిగణనలోకి తీసుకోనందున ఇది వాస్తవ కొనుగోలు శక్తిని (Real Purchasing Power) తెలుసుకొనుటకు వీలుగా లేదు. ఈ కారణముగా ఆర్థిక శాస్త్రవేత్తలు సాపేక్ష సిద్ధాంతము వైపు మొగ్గు చూపడం జరుగుతుంది.

**10.4.2 సాపేక్ష సిద్ధాంతము :-** ఈ సిద్ధాంతము ప్రకారము రెండు దేశాల కరెన్సీల కొనుగోలు శక్తి సమానమైన చోట రెండు దేశాల మధ్య మారకపు రేటు నిర్ణయింపబడుతుంది. ఈ కొనుగోలు శక్తి సామ్యము కదలిక కలిగి యుంటుంది. ధరలలో వచ్చిన మార్పు వలన విదేశీ మారకపు రేటు కూడా మారుతుంది. యీ సిద్ధాంతము ప్రకారము సమతౌల్య మారకపు రేటు యీ క్రింది సూత్రము ద్వారా తెలుసుకోగలము.

$$R = \frac{\text{విదేశీ కరెన్సీ ధర} \times \text{దేశీయ ధర సూచిక}}{\text{విదేశీ ధర సూచిక}}$$

$$\left(R = \frac{\text{Domestic price of foreign currency} \times \text{Domestic price index}}{\text{Foreign price index}}\right)$$

ఉదాహరణకు ధరల స్థాయి మార్పులకు ముందు రూ॥ 40 = 1 డాలరుగా ఉన్నదనుకొందాము. భారతదేశ ధరల సూచిక 300కు అమెరికా ధరల సూచిక 200కు పెరిగినదనుకొందాము. ఇప్పుడు నూతన కొనుగోలు శక్తి సామ్య విదేశీ మారక రేటు


$$R = \frac{Rs.\ 40 \times 300}{200} = 60$$

అనగా రూ॥ 60 = 1 డాలరు అవుతుంది.

పై విధముగా సమతౌల్య మారకపు రేటు రెండు దేశాల మధ్య ఎలా నిర్ణయింపబడుతుందో తెలుసుకోగలము. అయితే వస్తు ఎగుమతులకు, దిగుమతులకయ్యే రవాణా వ్యయాలు, పన్నులు, భీమా మరియు బాంకింగ్ ఖర్చుల కారణంగా విదేశీ మారకపు రేటు కొనుగోలు సక్తి సామ్యయము కంటే కొంత భిన్నముగా ఉంటుంది. విదేశీ కరెన్సీకి గల డిమాండు, సప్లయిల ఆధారంగా విదేశీ మారకపు రేటు మారుతుంది. అయితే విదేశీ మారకపు రేటులోని మార్పులు పైనుదహరించిన వ్యాపార ఖర్చుల పరిధికి లోబడి ఉంటాయి.

కొనుగోలు శక్తి సామ్య సిద్ధాంతాన్ని యీ క్రింది పటము ద్వారా తెలుసుకోవచ్చు.

**పటము 10.2 - కొనుగోలు శక్తి సామ్య సిద్ధాంతం ద్వారా సమతౌల్య విదేశీ మారకపు రేటు నిర్ణయం**




పై పటములో DD రేఖ మరియు SS రేఖలు విదేశీ కరెన్సీ యొక్క (ఉదాహరణకు భారతదేశములో డాలర్ యొక్క) డిమాండు మరియు సప్లయి రేఖలు. OR విదేశీ మారకపు రేటు డిమాండు సప్లయిల కలయిక (E బిందువు వద్ద) వలన నిర్ణయించబడినది. అయితే భారతదేశములో ధరలు పెరిగి, అమెరికాలో ధరలు నిలకడగా ఉన్నాయనుకొందాము. అప్పుడు అమెరికాలో భారతదేశపు ఎగుమతులు ధర పెరుగుతాయి. భారతదేశంలో అమెరికా నుండి వచ్చే దిగుమతుల ధరలు తగ్గుతాయి. యీ కారణంగా విదేశీ కరెన్సీ డిమాండు రేఖ DD పైకి కదిలి $D_1D_1$ గాను, విదేశీ కరెన్సీ సప్లయి రేఖ SS ఎడమ వైపు కదలి $S_1S_1$ గాను మారుతాయి. ఈ రెండు రేఖలు ఖండించుకొన్న చోట ($E_1$ బిందువు వద్ద) నూతన సమతౌల్య విదేశీ మారకపు రేటు ఏర్పడుతుంది.

### 10.4.3 కొనుగోలు శక్తి సామ్య సిద్ధాంతము - విమర్శ :-

1. **ధరల స్థాయి సూచిక :-** ధరల సూచిక లెక్కించుటలో దేశముల మధ్య కొంత వ్యత్యాసము ఉంటుంది. ధరల సూచికగా చెప్పిన వస్తువులు, ఆధారముగా చేసుకొని లెక్కించే పద్ధతి మొదలగు విషయములలో దేశముల మధ్య వ్యత్యాసము ఉంటుంది. దీనివి బట్టి ధర సూచిక కొనుగోలు శక్తిని సరాసరిగా తెలియజేస్తుంది. కాని ఖచ్చితముగా చెప్పదు.

2. **ధరల సూచికలో అంతర్జాతీయ వ్యాపారములోనున్న వస్తువులు ఇమిడి ఉండవచ్చు :-** ఆ విధముగా అంతర్జాతీయ వ్యాపారములో ఉన్న వస్తువుల ధరలు స్థిరముగా ఉండవు. ఉదాహరణకు అంతర్జాతీయ వ్యాపారములో వస్తువుల యొక్క ధరలు పెరిగితే దేశీయ వ్యాపార వస్తువుల ధరలు కూడా తగ్గవచ్చు. ఇటువంటి పరిస్థితులలో ధరల సూచిక కొనుగోలు శక్తిని ఖచ్చితముగా లెక్కించుట విఫలము అవుతుంది.

3. **విదేశ చెల్లింపుల కాపిటల్ అకౌంటు :-** విదేశ మారక చెల్లింపుల విషయములో వస్తు సేవలు కాక మూలధన ప్రవాహము అయిన యెడల విదేశ మారకపు రేటు కాపిటల్ అకౌంటును ప్రభావితం చేయవచ్చును. కాని వస్తు సేవలను కాదు. అందువలన ఈ సిద్ధాంతములో శూన్య కాపిటల్ అకౌంట్ అనే ప్రమేయము వాస్తవము కాదు.

4. సమతౌల్య విదేశ మారకపు రేటు - ఆధార సంవత్సర నిర్ణయ సమస్య :- కొనుగోలు శక్తిలో మార్పుల వలన ఏర్పడిన కొత్త విదేశ మారక రేటు నిర్ణయించుటకు ఒక సమతౌల్య విదేశ మారక రేటున్న ఆధార సంవత్సరమును ఎంపిక చేయవలెను. ఆ విధముగా ఎంపిక చేసిన ఆధార సంవత్సరము ఖచ్చితము అని చెప్పుట కష్టం.

5. నిర్మాణ మార్పులు :- ఈ సిద్ధాంతములో సాంకేతిక పరిజ్ఞానము, సహజ వనరులు, అభిరుచులు, అలవాట్లు స్థిరముగా ఉన్నవి అనే ప్రమేయము పై ఆధారపడుతుంది. కాని ఆధునిక కాలంలో నిర్మాణ మార్పులు జరుగుతాయి. పై మార్పులు విదేశ మారకపు రేటును ప్రభావితం చేస్తాయి.

6. విదేశ మారకపు రేటు మార్పులు ధరల స్థాయిని ప్రభావితం చేస్తాయి :- ముఖ్యముగా ఈ సిద్ధాంతములో ధరల స్థాయి మార్పు వలన విదేశ మారకపు రేటును నిర్ణయించగలము. అయితే కొన్ని సమయాలలో వ్యతిరేకము (భిన్నము)గా విదేశ మారకపు రేటులో మార్పు ధరల స్థాయిని ప్రభావితం చేయగలదు.

ఉదాహరణకు రూపాయి బహిర్గత విలువ భారతదేశములో 1 డాలరుకు సమానముగా 47 రూపాయలు నుండి ఒక డాలరు 50 రూపాయలుగా మార్పు చెందినప్పుడు విదేశాలలో భారతదేశ వస్తువులు తక్కువ ధరకు లభ్యమవుతాయి. దీని ఫలితముగా ఎగుమతులు పెరుగుతాయి. అంతే కాకుండా ఉత్పత్తి వ్యయము, ధరల స్థాయి పెరుగుతుంది. ఈ సందర్భములో విదేశీ మారకపు రేటు మార్పు కూడా ధరల స్థాయిని పెంచుతుంది. ధరల స్థాయిలో కలిగిన మార్పు వలన విదేశ మారకపు రేటును ప్రభావితం చేయలేదు.

విదేశ మారకపు రేటు, ధరల స్థాయి పరస్పరం ఒకదానికొకటి ప్రభావితం చేస్తుంటాయి. అందువలన ఏది కారణము ఏది ఫలితము అని ఖచ్చితముగా చెప్పుట కష్టం.

7. స్వేచ్ఛా విదేశ వ్యాపారము :- ఈ సిద్ధాంతములో స్వేచ్ఛా విదేశ వ్యాపారము అనునది ముఖ్యమైన ప్రమేయము. కాని వాస్తవిక ప్రపంచములో విదేశ వ్యాపారమును ప్రభుత్వము సుంకములు, కోటాలు విధించి నియంత్రణ చేస్తుంది. అంతర్జాతీయ వ్యాపారములో ఎగుమతులు, దిగుమతులు స్వేచ్ఛగా అనుమతించుట లేదు. ఈ ఫలితముగా విదేశీ మారకపు రేటు సమతౌల్యము కొనుగోలు శక్తిని బట్టి నిర్ణయించుట కష్టము.

8. డిమాండ్ వ్యాకోచత్వము :- ఈ సిద్ధాంతము ప్రకారము దేశముల మధ్య డిమాండ్ వ్యాకోచత్వమును దృష్టిలో ఉంచుకోదు.

ఉదాహరణకు విదేశీ మారకపు రేటు తగ్గినందు వలన భారతదేశ వస్తువులు ధర తగ్గినప్పటికి వాటికి ఇతర దేశములలో గిరాకీ (demand) అవ్యాకోచమయిన యెడల ఎగుమతుల పెరుగుదల అతి తక్కువగా ఉండవచ్చును (లేదా) పూర్తిగా పెరగకపోవచ్చును. అట్టి సందర్భములలో కొనుగోలు శక్తికి భిన్నముగ విదేశ మారకపు రేటు ఉన్నప్పటికి అది కొనసాగుతుంది.

9. ఏక పక్షమయినది :- ఈ సిద్ధాంతము ఏకపక్షమయినది అని ప్రముఖ ఆర్థికవేత్త అయిన రాగ్నర్ నర్క్స్ విమర్శించినాడు.

విదేశ మారకమునకు డిమాండ్ అనేక అంశముల పై ఆధారపడి ఉంటుంది. కాని ఈ సిద్ధాంతము విదేశ మారకమునకు డిమాండ్ ధరల వలనే ఏర్పడుతుందను ప్రమేయము ఉన్నది. కాని ఇది వాస్తవము కాదు. ధరల స్థాయిలో మార్పు లేనప్పుడు కూడా ఇతరమైన అనేక అంశముల వలన విదేశ మారకపు రేటు మారుతుంది. విదేశ మారకపు డిమాండ్ మరియు సప్లయిలు సమతౌల్య విదేశ మారకపు రేటును నిర్ణయిస్తాయి. కాని కొనుగోలు శక్తి ఒక అంశము కాదు.

విదేశ మారకపు రేటు సిద్ధాంతము కొంత విమర్శ ఉన్నప్పటికి Haberler మిగిలిన కొంత మంది ఆర్థికవేత్తల అభిప్రాయం ప్రకారము ఈ సిద్ధాంతమునకు ప్రయోజనమున్నది అని పేర్కొన్నారు.

ప్రపంచ దేశములలోని ధరల స్థాయి, మారకపు రేటు పరస్పరం ప్రభావితం చూపుతాయి. మరియు ఆధారములను అంశము తెలియజేయుచున్నవి.

## 10.5 సారాంశము :-

వివిధ దేశాల కరెన్సీల లావాదేవీలు జరుగు మార్కెట్‌ను విదేశీయ మారకపు మార్కెట్ అందురు. విదేశీ మారకపు మార్కెట్ వివిధ దేశాలలో అంతర్జాతీయ పెట్టుబడుల కదలికలకు దోహదపడుతుంది. విదేశీ మారకపు రేట్లు రెండు రకాలు. అవి 1. స్థిర మారకపు రేట్లు, 2. సరళ మారకపు రేట్లు. పై రెండు విదేశీయ మారకపు రేట్లు ఆయా దేశాలలో ప్రయోజనాలను, నష్టాలను కలిగిస్తాయి. గుస్తాలాకాజెల్ అభివృద్ధిపరిచిన కొనుగోలు శక్తి సామ్య సిద్ధాంతము ద్వారా విదేశ మారకపు రేట్లు నిర్ణయించుట మంచిదని చాలా మంది వాదన. వివిధ దేశాల అభివృద్ధిలో అతికీలకమైన పెట్టుబడులు వివిధ దేశాల కరెన్సీ మారకపు రేట్లు ఆధారముగా జరుగుతాయి. దీనికి తోడు విదేశీయ మారకపు రేట్లు అంతర్జాతీయ వ్యాపార అభివృద్ధికి దోహదపడతాయి.

## 10.6 సాంకేతిక పదాలు :-

| | |
|---|---|
| విదేశ మారకపు మార్కెట్ | Foregin Exchange |
| కొనుగోలు శక్తి బదిలి | Transfer from Purchasing Power |
| స్థిర మరియు సరళ మారకపు రేట్లు | Fixed and Flexialde Exchange Rates |
| కొనుగోలు శక్తి సామ్య సిద్ధాంతము | Purchasing Power Parity Theory |
| విదేశీ కరెన్సీ ధర | Domestic Price of Foregin Currency |
| దేశీయ ధర సూచిక | Domestic Price Index |
| విదేశీ ధర సూచిక | Foregin Price Index |

## 10.7 నమూనా ప్రశ్నలు :-

1. విదేశీయ మారకపు మార్కెట్ అనగానేమి? దాని యొక్క విధులు?
2. స్థిర మరియు సరళ విదేశీయ మారకపు రేట్లు ప్రయోజనాలను మరియు నష్టాలను తెలుపుము?
3. కొనుగోలు శక్తి సామ్య సిద్ధాంతమును విశదీకరించుము?
4. విదేశీ మారకపు రేటు నిర్ణయించుటలో ద్రవ్య మార్కెట్ యొక్క పాత్రను తెలుపుము?

## 10.8 చదువదగిన గ్రంథాలు :-


1. Dominick Salvatore (2001) - Intemational Economics
2. Bo Sodersten (1994) - Intemational Economics
3. Francis Cherunilam (2001) - Intemational Economics
4. M.L. Jhingan (2002) - Intemational Economics


- ఆచార్య కె. శ్రీరామమూర్తి

పాఠం - 11

# చెల్లింపుల శేషము

**లక్ష్యము :**

ఈ భాగంలో విదేశీ వ్యాపార చెల్లింపులకు సంబంధించిన వివిధ అంశాలను ప్రధానంగా వివరిస్తుంది. ఈ భాగాన్ని చదివాక క్రింది అంశాలు అర్థం చేసుకోగలము

విదేశీ వ్యాపార చెల్లింపుల శేషం, నిర్వచన స్వభావాలు

విదేశీ వ్యాపార చెల్లింపుల పట్టికలోని అంశాలు

చెల్లింపుల శేషంలో సమతౌల్య, అసమతౌల్య భావనలు

చెల్లింపుల అసమతౌల్యాన్ని నిర్ధారించు అంశాలు మరియు అసమతౌల్యాన్ని సరిదిద్దే పద్ధతులు.

**ముఖ్యాంశాలు :**


11.1 ఉపోద్ఘాతము

11.2 చెల్లింపుల శేషం - నిర్వచనాలు, స్వభావాలు

11.3 చెల్లింపుల శేషంలో పొందుపరచిన వివిధ అంశాలు

11.4 చెల్లింపుల శేషం ఖాతా - మిగులు - లోటు మరియు సమతౌల్య వివరణ

11.5 విదేశీ చెల్లింపుల ఖాతా వాస్తవ అసమతౌల్య భావనలు

11.6 విదేశీ చెల్లింపుల శేషంలోని అసమతౌల్యంలో గల వివిధ రకాలు

11.7 చెల్లింపుల శేషంలో అసమతౌల్యాన్ని నివారించు చర్యలు / పద్ధతులు

11.8 సారాంశము

11.9 ముఖ్య పదాలు

11.10 స్వయం సమీక్షా ప్రశ్నలు

11.11 చదువవలసిన గ్రంథాలు

## 11.1 పరిచయం / ఉపోద్ఘాతము :

ఆధునిక ప్రపంచదేశాల ఆర్థిక వ్యవస్థలో వస్తున్న మార్పుల వల్ల ఏ ఒక్క దేశం కూడా నియమిత ఆర్థిక వ్యవస్థగా, లేదా మూయబడిన ఆర్థిక వ్యవస్థ (Closed Economy) గా మన జాలలేని స్థితిలో ఉండి విదేశీ వ్యాపార వ్యవహారాలలో పాల్గొనే విస్తృత ఆర్థిక వ్యవస్థగా కొనసాగిస్తున్నాయి. వివిధ ప్రపంచ దేశాలు తమ తమ దేశాలలో తక్కువ వ్యయంతో, సామర్థ్యంతో తయారు చేయగల వస్తుసేవల ఉత్పత్తిపై దృష్టి కేంద్రీకరించి వాటిని ఇతర దేశాలకు ఎగుమతి చేసి ఆ దేశాలకు అవసరమయిన ఇతర వస్తువులను ఇతర దేశాల నుండి దిగుమతి చేసుకుంటాయి. ఈ రకమయిన అంతర్జాతీయ వ్యాపారాన్ని కొంత నిర్ణీత కాలంలో రెండు దేశాల మధ్య జరిగే ఆర్థిక వ్యవహారాలను ఒక క్రమ పద్ధతిలో నమోదు చేస్తారు. ఎగుమతి మరియు దిగుమతి వ్యవహారాలు జరిగేటప్పుడు విదేశీయులకు ఇవ్వవలసిన మొత్తాలను, విదేశస్థుల నుండి రావలసిన మొత్తాలను చూపించే ఖాతాను విదేశీ చెల్లింపుల ఖాతాగా పేర్కొంటారు. దీనిలో ఆ దేశ అంతర్జాతీయ ఆర్థిక వ్యవహారాలన్నీ సూక్ష్మీకరిస్తుంది. అంతర్జాతీయ వ్యాపారంతో పాటు ఆ దేశాభివృద్ధికి అవసరమయిన విదేశీ సహాయం, విదేశీ మూలధనం, పెట్టుబడుల ప్రవాహాలు వంటి అంశాలను కూడా ఈ ఖాతాలో వివరిస్తారు. వీటన్నిటిని సూక్ష్మీకరించి చెప్పిన అంతర్జాతీయ ఆర్థిక వ్యవహారాల పట్టికను దేశీయ జాతీయాదాయాల ఖాతాకు అనుసంధానం చేసినపుడు విస్తృత ఆర్థిక వ్యవస్థలో వివిధ దేశాల నికర మొత్తం జాతీయాదాయం లెక్కకడతారు. విదేశీ చెల్లింపులు జాతీయాదాయాల మధ్య గల పరస్పర సంబంధాల దృష్ట్యా, అంతర్జాతీయ చెల్లింపుల శేషం ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. కాబట్టి దానికి సంబంధించిన వివిధ అంశాలను తెలుసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

## 11.2 చెల్లింపుల శేషం - నిర్వచన స్వభావాలు

చెల్లింపుల శేషం అనునది అంతర్జాతీయ ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన ఆ దేశ ఆదాయ వ్యయాలను తెలిపే ప్రకటనగా పేర్కొనవచ్చు. అంతర్జాతీయ చెల్లింపుల శేషం ఒక దేశం ఇతర దేశాలకు చెల్లించిన మొత్తం చెల్లింపులను, ఇతర దేశాల నుండి ఆ దేశంలోకి తరలి వచ్చిన మొత్తాలను తెలియజేస్తుంది. అంటే ఒక నిర్ణీత కాలంలో ఒక దేశ పౌరులు, కంపెనీలు, సంస్థలు, ప్రభుత్వాలు, ఇతర దేశాల పౌరులు, కంపెనీలు, సంస్థలతోను, అంతర్జాతీయ సంస్థలతోను జరిపే అన్ని కార్యకలాపాలను ఒక పట్టికగా క్రమపద్ధతిలో సాధారణంగా విదేశీ చెల్లింపుల శేషంగా పరిగణిస్తారు. ఇవే అంశాలను వివిధ ఆర్థిక వేత్తలు వివిధ రూపాల్లో రూపొందించి వివరించడం జరిగింది. "ఒక దేశం వారు ఇతర దేశాలతో ఒక నిర్ణీత కాలంలో జరిపే అన్ని రకాల ఆర్థిక వ్యవహారాలను ప్రతిబింబించే ఒక క్రమబద్ధమయిన పట్టికగా వ్యాపార చెల్లింపుల (ఖాతా) శేషాన్ని W. W. స్కామోల్ నిర్వచించడం జరిగింది. విదేశీ చెల్లింపుల శేషాన్ని రూపొందించే సమయంలో చాలా అంశాలను పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుంది. ప్రధానంగా ఎవరిని దేశవాసులుగాను, విదేశీవాసులుగాను పరిగణించాలో తెలుసుకోవలసి ఉంటుంది. అదే విధంగా దేశీయ, విదేశీయ వ్యాపార సంస్థలను వర్గీకరించే సమయంలో కూడా జాగ్రత్తగా వ్యవహరించవలసి ఉంటుంది. ఈ విధంగా అంతర్జాతీయ వ్యవహారాలన్నిటిని వర్గీకరించిన తరువాత వాటిని జంట పద్దుల విధానంలో అంతర్జాతీయ చెల్లింపుల శేషంగా తయారు చేస్తారు. ఇలా తయారు చేయబడిన చెల్లింపుల శేషం ఖాతా ఆయా సిద్ధాంతాల లేదా నిర్వచనాల స్వభావాలకు సాధారణ పోలికలు ఉంటాయి. ఈ ఖాతాలో గల సర్దుబాటు విషయంలో కాలానుగుణంగా మార్పులు జరుగుతూ వివిధ రూపాలలో సిద్ధాంతపరంగా వాస్తవ అంశాలను క్రోడీకరించి వివరణ ఇవ్వడం జరుగుచున్నది. ఈ పాటంలో ముందు ముందు ఆయా అంశాలను చర్చించడం జరిగింది.

## 11.3 విదేశీ చెల్లింపుల శేషంలో పొందు పరచే వివిధ అంశాలు

పైన తెలిపిన విధంగా ఒక దేశం యొక్క అంతర్జాతీయ వ్యవహారాలన్నిటిని చెల్లింపుల శేషంగా రూపొందించి వాటిని జంట పద్దుల విధానంలో అంతర్జాతీయ చెల్లింపుల శేషాన్ని తయారుచేస్తారు. జంట పద్దుల విధానమంటే ప్రతి ఆర్థిక వ్యవహారాలన్నీ ఒకసారి రాబడిగాను మరో మారు చెల్లింపులుగాను చేస్తారు. అంటే ప్రతి వ్యవహార ఖాతాలో రెండు వైపులా (రాబడి, చెల్లింపు) చూపడం జరుగుతుంది. వ్యాపార ఖాతాలో మాదిరిగానే విదేశీ చెల్లింపుల శేషాన్ని కూడా ఒక దేశ సంపదను పెంచేదిగాను వ్యాపారాన్ని పెంచే వ్యాపారాన్ని రాబడిగాను, తగ్గించే వ్యాపారాన్ని చెల్లింపులుగాను సూచిస్తుంది. ఈ ఖాతాలో జమ మరియు ఖర్చులు ఎల్లప్పుడు సమానంగా సదా సమతౌల్యంగా ఉంటుంది. క్రింది పట్టిక ఈ విషయాలను ధృవ పరుస్తుంది.

పట్టిక : విదేశీ చెల్లింపుల శేషం ఖాతా నమూనా పట్టిక (కోట్ల రూపాయలలో)

| క్రమ సంఖ్య | రాబడులు (జమ) | | క్రమ సంఖ్య | చెల్లింపులు | |
|---|---|---|---|---|---|
| 1. | వస్తు / దృశ్య ఎగుమతులు | 800 | 6. | వస్తు / దృశ్య దిగుమతులు | 900 |
| 2. | విదేశీయులకు మనం అందించిన | | 7. | విదేశీయులు మనకు అందించిన | |
| | సేవలు (అదృశ్య అంశాలు) | 90 | | సేవలు (అదృశ్య అంశాలు) | 60 |
| | | బదిలీలు / మూలధన ఖాతా | | | |
| 3. | ప్రతిఫలహీన రాబడులు | 20 | 8. | ప్రతిఫలహీన చెల్లింపులు | 10 |
| 4. | మూలధన రాబడులు | 90 | 9. | మూలధన చెల్లింపులు | 30 |
| 5. | తప్పులు మినహాయింపులు | -- | 10. | తప్పులు, మినహాయింపులు | -- |
| | మొత్తం రాబడులు | 1000 | | మొత్తం చెల్లింపులు | 1000 |

పైన చూపిన పట్టిక ఒక దేశం ఏ విధంగా విదేశీ ద్రవ్యాన్ని కొనుగోలు శక్తిని సంపాదిస్తుందో తెలియజేస్తుంది. ఈ విధంగా సమకూరిన శక్తిని విదేశీ మార్కెటులో ఏ రకంగా ఉపయోగించుకోవాలో తెలుపుతుంది. పట్టిక ఆధారంగా విదేశీ వ్యాపార చెల్లింపుల శేషంను పరిశీలిస్తే విదేశీ చెల్లింపు శేషం రెండు భాగాలుగా విభజింపబడి ఎడమవైపున ఆ దేశానికి వివిధ రూపాల్లో వచ్చే అన్ని రకాల రాబడులను కుడివైపున వివిధ రూపాల్లో ఇతర దేశాలకు చెల్లింపులను వివరిస్తుంది. అదే విధంగా ఈ ఖాతాను రెండు రకాలుగా విభజింపబడుతుంది. అవి. 1. కరెంటు ఖాతా మరియు 2. మూలధన ఖాతా. సంప్రదాయ బద్ధంగా విదేశీ చెల్లింపు శేషంలోని వివిధ అంశాలను వాటి వాటి స్వభావాన్ని బట్టి ఈ విధంగా విభజింపబడుతుంది. ముఖ్యంగా ఒక దేశం వివిధ రకాలయిన వస్తువులను, సేవలను ఎగుమతి చేయడం ద్వారా ఆ దేశం విదేశీ ద్రవ్యాన్ని సంపాదిస్తుంది. పట్టికలో ఎడమ వైపున రాబడి (జమ) ఖాతాగా చూపడమయినది. అదే సమయంలో దిగుమతుల మీద చెల్లించిన ద్రవ్యాన్ని చెల్లింపు పద్దులో చూపించి దిగుమతులు చేసుకున్న వస్తువులను వస్తుఖాతాలో రాబడిగా చూపబడుతుంది. ఈ విధంగా వివిధ దేశాలమధ్య జరిగే ప్రతి ఆర్థిక వ్యవహారానికి ఉన్న రెండు లక్షణములు లేదా రూపాలను పరిగణనలోకి తీసుకోడాన్ని జంటు పద్దు పద్ధతిగా వ్యవహరిస్తారు. ఈ జంట పద్దుల అంశాల్లో గల కరెంటు ఖాతా మరియు మూలధన ఖాతాల్లో అనేక అంశాలు కలిగి ఉంటాయి. వాటిని క్రింద ఇవ్వడం జరిగింది.

**11.3.1. కరెంటు ఖాతాలోని అంశాలు :** ఒక దేశం నుండి మరొక దేశానికి వస్తు సేవలు వాస్తవంగా బదిలీ అయ్యే వ్యవహారాలను వాస్తవిక వ్యవహారాలు అంటారు. ఇవి ఆదాయాన్ని సృష్టించేవి. అందువల్ల ఈ అంశాలను కరెంటుఖాతాలో ఉంచుతారు. అంటే కరెంటు ఖాతాలో ఆ దేశ ఉన్నత దేశీయ ఆదాయ వ్యయాలకు సంబంధించిన అన్ని అంతర్జాతీయ ఆర్థిక వ్యవహారాలను చూపిస్తాయి. నియమిత కాలంలో జరిగే ప్రవాహ వ్యవహారాలన్నీ ఈ ఖాతాలో ఉంటాయి. కరెంటు ఖాతాలోని వ్యాపారాంశాలను దృశ్యాంశాలు మరియు అదృశ్యాంశాలుగా పునర్విభజన చేస్తారు. వస్తు ఎగుమతి దిగుమతులను దృశ్యాంశాలు అంటారు. అలాగే సేవలు ఎగుమతి మరియు దిగుమతులను అదృశ్య అంశాలు అంటారు. ఈ అంశాలను పట్టికలో వివరంగా వివరించటం జరిగింది. పట్టికలో గల 1,6 అంశాలుగా వస్తు దృశ్యాంశాలుగాను 2 మరియు 7 అంశాలు అదృశ్య అంశాలుగాను ఇవ్వడం జరిగింది. అదృశ్యాలలో ముఖ్యమయినవి అంతర్జాతీయంగా

బదిలీ అయిన వివిధ రకాల సేవలు ఉంటాయి. అదృశ్య ఎగుమతుల విషయంలో విదేశీయులకు మనం అందించిన భీమా, బ్యాంకు సేవలు, రవాణా సేవలు, పర్యటనలు, రుణాలపై వడ్డీ, డివిడెండ్ల రూపంలో విదేశీయుల నుంచి ఈ సేవలకు ప్రతిఫలంగా వచ్చిన రాబడులు ఉంటాయి. అలాగే వివిధ అదృశ్య దిగుమతులలో విదేశీయులు మనకు అందించిన భీమా, బ్యాంకులు, రవాణా, పర్యాటనలు, రుణాలపై వడ్డీ, డివిడెండ్లు, సేవలకు ప్రతిఫలంగా మనం విదేశీయులకు చేసిన చెల్లింపులు ఇవ్వటం జరుగుతుంది.

**11.3.2. మూలధన ఖాతాలోని అంశాలు :** మూలధన ఖాతాలో ఆయా దేశాల ఆదాయ స్థాయిని ప్రత్యక్షంగా ప్రభావితం చేయని ద్రవ్య పరమయిన వ్యవహారాలను పొందుపరుస్తారు. అంటే మూలధన ఖాతాలో ఒక దేశపు ద్రవ్య పరమయిన ఆస్తులలో లేదా సంపద రాశులలో కలిగే మార్పులను లేదా దేశపు ప్రస్తుత ఆదాయానికి సంబంధం లేకుండా భవిష్యత్‌లో మార్పులు కలిగించే వ్యవహారాలను పొందు పరుస్తారు. ఉదాహరణకు మన దేశీయులెవరైనా, ఇతర దేశాల కంపెనీల షేర్లు కొని లేదా విదేశీయులకు రుణాలు ఇస్తే అవి భవిష్యత్‌లో విదేశాల నుంచి మన దేశానికి వచ్చే రాబడిని మారుస్తుంది. ప్రస్తుత కాలంలో ఈ వ్యవహారాలు ఆ దేశ ఆదాయాలలో ఎటువంటి మార్పులు కలిగించదు. అందువల్ల అట్లాంటి వ్యాపార వ్యవహారాలను ఈ ఖాతాలో పొందుపర్చుతారు. ఒక నియమిత కాలానికి నియమించబడని నిల్వలకు సంబంధించిన ఆర్థిక వ్యవహారాలన్నీ ఈ ఖాతాలో చోటు చేసుకుంటాయి. అలాగే మన దేశస్తులు ఇతర దేశాల నుండి అంతర్జాతీయ సంస్థలతో చేసే దీర్ఘకాలిక ఆర్థిక వ్యవహారాలు కూడా మూలధన ఖాతాలో చేర్చబడతాయి. పైన ఇచ్చిన పట్టికలో మూలధన ఖాతాలో మొదటిగా ఇరువైపులా 3 మరియు 8 అంశాలుగా ప్రతిఫలహీన రాబడులు, చెల్లింపులు ఇవ్వడం జరిగింది.

విదేశాల నుండి మనదేశానికి వచ్చేవి మరియు తిరిగి చెల్లించనవసరం లేని బహుమతులు అలాగే విదేశాలలో ఉన్న మన పౌరులు ఈ దేశాలలో ఉన్న వారి కుటుంబాలకు పంపే వారి ఆదాయాలు, విపరీత పరిస్థితులలో వివిధ దేశాలు, అంతర్జాతీయ సంస్థలు చేసే విరాళాలు రూపాలలో వచ్చే రాబడులను తిరిగి చెల్లించనవసరంలేని రాబడులుగా చూపిస్తారు. ఏమైనప్పటికి ఈ రాబడులు, చెల్లింపుల మధ్య పెద్దగా వ్యత్యాసం ఉండకపోవడంవల్ల చెల్లింపుల ఖాతాలోని ఇతర అంశాలతో పోల్చినపుడు ఇవి తక్కువగా ఉండటం వల్ల అప్రధాన్యతా అంశాలుగా వీటిని పరిగణించడం మూలంగా వీటిని కరెంటు లేదా మూలధన ఖాతాలోనైనా చూపించవచ్చు. ప్రాధాన్యతా అంశాలుగా మూలధన ఖాతాలో పట్టిక నమూనాలో రెండువైపులా ఇచ్చిన 4, 9, అంశాలుగా గల మూలధన రాబడులు, చెల్లింపులను తెలుపుతారు. ఒక దేశం ఇతర దేశాల నుంచి పొందిన రుణాలు, విదేశీయులకు దేశీయ ఆస్తులు అమ్మగా వచ్చిన రాబడులు మొదలయినవి మూలధన రాబడులుగా పేర్కొంటారు. వీటిలో దీర్ఘకాల, స్వల్పకాల రుణాలు, బంగారం, విదేశీ మారక నిల్వల అధికారిక మార్పులు కూడా చూపబడతాయి. ఒక దేశీయులు ఇతర దేశాలలో పెట్టిన ప్రత్యక్షమైన లేదా పోర్టుఫోలియో పెట్టుబడులను ఇందులో జమ చేస్తారు.

చెల్లింపుల శేషంలో తెలుసుకోవలసిన మరో అంశం ఏమంటే కరెంటు మరియు మూలధన ఖాతాలతో పాటు చివరిగా పద్దులను సమానం చేసే అంశాలుగా తప్పులు, మినహాయింపులను కూడా పొందుపరచడం గురించి నమూనా పట్టిక 1. లో 5 మరియు 10 వ అంశాలు వీటి గురించి వివరిస్తాయి. రాబడి చెల్లింపులకు మధ్య ఉన్న తేడాను బట్టి ఈ అంశాన్ని అవసరానుగుణంగా అటు రాబడి వైపుగాని, ఇటు చెల్లింపుల వైపుగాని చూపించి అకౌంటింగ్ పరంగా విదేశీ చెల్లింపు శేషంలో రాబడి, చెల్లింపులను సమానం చేస్తే సమతౌల్యం ఉండేలా చేస్తాయి. ఈ తప్పులు, మినహాయింపు అంశం ఎక్కువ మోతాదులో ఉంటే అంచనాలలో చాలా పొరపాట్లు జరిగి ఉంటుంది. అందువల్ల జాగ్రత్త వహించవలసి ఉంటుంది. వీటిని సమతౌల్యం ఇచ్చే అంశాలుగా కూడా పరిగణిస్తారు.

**11.3.3. కరెంటు మరియు మూలధన ఖాతాల పరస్పర సంబంధం :** విదేశీ చెల్లింపుల ఖాతాలలో కరెంటు మరియు మూలధన ఖాతాలలో పాటుగా చివరగా పద్దులను సమానం చేసే అంశాలుగా తప్పులు, మినహాయింపులను కూడా పొందు పరుస్తారని చదివాం. ఈ ఖాతాలో అన్ని అంశాలు పరస్పరం సంబంధం కలిగినవే. సాధారణంగా వ్యక్తులు, సంస్థలు, కంపెనీలు, విదేశీ చెల్లింపు శేషంలోని ఇతర అంశాలతో సంబంధం లేకుండా వారికి వారు నియమిత కాలానికి లోబడి చేసే ప్రవాహక అంశాలన్నీ కరెంటు ఖాతాలో పొందుపరుస్తారని మనకు తెలుసు. ఈ అంశాలు ఎవరికి వారుగా చేసేవి కాబట్టి కరెంటు ఖాతాలో రాబడి చెల్లింపుల వ్యవహారాల మధ్య పొంతన లేకుండటం మిగులు లేదా లోటు ఉండటం సర్వసాధారణం. ఇందువల్ల విదేశీ చెల్లింపుల శేషాన్ని అకౌంటింగ్ విధానంలో

సమతౌల్యంలో ఉంచడానికి కరెంటు ఖాతా మిగులు లేదా లోటుని బట్టి మూలధన ఖాతాలోని అంశాలను మార్పుచేయాల్సి ఉంటుంది. ఎందువల్లనంటే మూలధన ఖాతాలోని అంశాలు ఒక నియమిత కాలానికి లోబడని నిల్వలకు సంబంధించినవిగా ఉంటాయి. కాబట్టి కరెంటు ఖాతాలో లోటు నిల్వలను ఉపయోగిస్తారు. అలాగే కరెంటు ఖాతాలో మిగులు ఏర్పడినపుడు ఈ నిల్వలకు అదనంగా చేరుస్తారు. కాబట్టి కరెంటు ఖాతాను స్వయం ప్రతిపత్తి గల ఖాతాగాను దానిలో ఏర్పడే పరిణామాలను అనుసరించి వాటిని సర్దుబాటు చేసే ఖాతాలుగా మూలధన ఖాతాను పేర్కొంటారు. ఈ విధంగా కరెంటు, కేపిటల్ ఖాతాలకు ఒకదానికి ఒకటి సంబంధం ఉండటం వల్లనే జంటపద్దు పద్ధతిలో రూపొందించబడి అంతర్జాతీయ చెల్లింపుల శేషంలోని మొత్తం రాబడులకు, మొత్తం చెల్లింపులకు సమానమైన చెల్లింపుల శేషం సమతౌల్యంగా ఉంటుంది. ఈ విధానంలో ఈ రెండు ఖాతాలకు గల సంబంధాన్ని విడదీయలేము.

## 11.4. చెల్లింపుల శేషం ఖాతా - మిగులు - లోటు - సమతౌల్య వివరణ :

జంటు పద్దు పద్ధతిలో ఈ చెల్లింపుల ఖాతాను తయరు చేయుటవల్ల జమ, ఖర్చు అంశాలు సమానంగా ఉంటాయి. ఆదాయ విభాగాన్ని పరిగణనలోకి తీసుకొని చెల్లింపుల ఖాతాలో మిగులు ఉన్నదా లేదా లోటు ఉందా అనే అంశం సాంప్రదాయకంగా వస్తుంది. వస్తువుల, సేవలు, బదిలీ చెల్లింపులు, వీటివల్ల రావలసిన వసూళ్ళు కంటే చెల్లింపులు ఎక్కువగా ఉంటే లోటు ఉన్నదని, చెల్లింపుల కన్నా వసూళ్ళు ఎక్కువగా ఉంటే మిగులున్నదని అంటారు. అయితే ఇటీవల కాలంలో ఆదాయ విభాగాన్నే కాక కొన్ని మూలధన చలాంకాలను కూడా కలిపి చెల్లింపుల శేషాన్ని అంచనా వేస్తున్నారు. ఆదాయ విభాగంలోని మిగులు నుంచి మూలధన చెల్లింపులు తీసుకోవడం, ఆదాయ విభాగంలో లోటు ఉంటే దీర్ఘకాల మూలధన వసూళ్ళను కలపడం వల్ల మరియు అంతర్జాతీయ చెల్లింపులోని మొత్తం డెబెట్, క్రెడిట్ అంశాల మొత్తాన్ని పరిగణనలోకి తీసుకొని చెల్లింపుల ఖాతాను తయారుచేస్తున్నారు. గుర్తుంచుకోవలసిన విషయమేమంటే చెల్లింపుల ఖాతాలో లోటు ఉంటే ప్రమాదంగాను మిగులుంటే మంచిదిగాను భావించనవసరం లేదు. ఏదైనా ఒక దేశం విదేశాలనుంచి మూలధనాన్ని రుణం ద్వారా తెచ్చుకొన్నపుడు లోటు ఉండి తీరుతుంది. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఈ పరిస్థితి కొనసాగుతుంది. క్రమేపీ లోటు తగ్గు ముఖం పడుతుంది.

క్లుప్తంగా చెప్పాలంటే చెల్లింపుల శేషం ఎల్లపుడు సమతౌల్యంలో ఉంటుంది. ఉదాహరణకు ఒక దేశం కరెంటు ఖాతాలో 1000 కోట్ల లోటు ఉందనుకొనుము. మూలధన ఖాతాలో ఏ వ్యవహారం లేనపుడు ఆ దేశం కనీసం 1000 రూ. సరిపోయినటు వంటి మూలధనాన్ని దిగుమతి చేసుకోవాలి. అనగా ఇతర దేశాల నుంచి రుణాలు తీసుకోవందువల్ల విదేశీ ద్రవ్య నిధులలో తరుగుదల గోచరిస్తుంది. అలా కాకుండా ఆ దేశం కరెంటు ఖాతాలో మిగులు ఉన్నట్లయితే దాని అర్థం ఆ దేశం దిగుమతుల కంటే ఎగుమతులు ఎక్కువ చేసిందని భావించాలి. మూలధన ఖాతాలో ఏ వ్యవహారాలు లేనపుడు ఆ దేశంలో నమోదైన మిగులుకు సరిపోవు మూలధనాన్ని ఎగుమతి చేయవలసి ఉంది. ఇది విదేశాలకు అప్పుల రూపంలో ఇవ్వవచ్చు. ఇతర అంశాలలో ఎలాంటి మార్పు లేనప్పటికీ ఇలాంటి అవిశిష్ట వ్యవహారం చెల్లింపు శేషంలో సమతౌల్యం వచ్చుటకు సహకరిస్తుంది. అయితే ఈ సమతౌల్యం వాస్తవమైనదా లేదా అని చర్చించాల్సి ఉంటుంది. ఈ విషయాన్ని చర్చించే ముందు చెల్లింపుల శేషంలోని వివిధ అంశాల మధ్యగల సమతులను పరిశీలించవలసి ఉంటుంది.

## 11.5. విదేశీ చెల్లింపుల ఖాతాలోని సమతౌల్య మరియు - అసమతౌల్య భావనలు

చెల్లింపుల శేషం సమతౌల్యం గురించి తెలుసుకునే ముందు ముందుగా తెలుసుకోవలసిన అంశం ఒకటి ఉంది. ఆ అంశమేమిటంటే విదేశీ వ్యాపారం, విదేశీ చెల్లింపుల శేషం ఒకటి కాదని వాటి మధ్య తేడా ఉందని గమనించాలి. వ్యాపార శేషమనగా అంతర్జాతీయంగా రెండు దేశాల మధ్య దృశ్యాంశాల కోసం జరిగే ఎగుమతులు, దిగుమతుల తేడా. అదే విధంగా దిగుమతుల కంటే ఎగుమతులు ఎక్కువగా ఉంటే ఆ దేశానికి వ్యాపార శేషం అనుకూలంగా ఉందని అలాగే దిగుమతులు ఆ దేశం ఎగుమతుల కంటే ఎక్కువగా ఉన్నట్లయితే ప్రతికూల శేషం ఉందని అర్థం. అలాకాక అంతర్జాతీయ చెల్లింపుల శేషం ఒక నిర్ణీత కాల వ్యవధిలో ఒక దేశానికి ప్రపంచంలోని ఇతర దేశాలకు మధ్య వ్రాసిపెట్టి అన్ని రకాల చెల్లింపులు, పుచ్చుకొనే వాటిని విదేశీ వ్యాపార చెల్లింపుల శేషం అంటారు. పట్టిక 1 లో వస్తు ఎగుమతులు, దిగుమతుల మధ్య గల తేడా (800 - 900 = 100) దృశ్యాంశాల మధ్య గల శేషాన్ని తెలపగా సేవల ఎగుమతులు,

దిగుమతుల మధ్య గల తేడా (90-60 = 30) అదృశ్యాంశాల శేషాన్ని తెలియజేస్తుంది. ఈ దృశ్య, అదృశ్యాంశాల మొత్తం మధ్య గల తేడా కరెంటు ఖాతా మొత్తం రాబడులు, చెల్లింపులను సూచిస్తాయి. కరెంటు ఖాతా శేషం కూడా పట్టిక నుండి రాబట్టవచ్చు. ఈ ఖాతాలో గల తేడాను మూలధన ఖాతాలో సర్దుబాటు చేస్తారు. ఈ విధంగా విదేశీ చెల్లింపుల శేషంలో మొత్తం రాబడులు మొత్తం చెల్లింపులకు సమానమయిన చోటు (1000 = 1000) సమానాసై అకౌంటింగ్ విధానంలో సమతౌల్యం ఏర్పడతాయి. అయినప్పటికీ ఈ అకౌంటింగ్ సమతౌల్య స్థితిని ఏ మాత్రం ఆ దేశ విదేశీ చెల్లింపుల వాస్తవ పరిస్థితిని తెలపలేదు. కారణం సర్దుబాట్లు చేయడం. కాబట్టి వాస్తవ పరిస్థితిని తెలుసుకోవలసి ఉంటుంది. సాధారణంగా, వాస్తవంగా ఏ దేశమైన ఎప్పుడోగాని సమతౌల్య స్థితిలో ఉండలేదు. వాస్తవంగా వాటికి మొత్తం మీద లోటు గాని, మిగులుగాని ఉంటుంది. కాబట్టి నిజానికి విదేశీ చెల్లింపుల శేషంలో ఉండేవి అసమతౌల్య స్థితే గాని సమతౌల్య స్థితి కాదని చెప్పవచ్చు. అందువల్ల విదేశీ చెల్లింపుల ఖాతాలో వాస్తవంగా ఎంత అసమతౌల్యం ఉందో తెలుసుకోవడం కష్టంగా ఉంటుంది.

**11.5.1. చెల్లింపుల శేషంలోని వాస్తవ అసమతౌల్య స్థితిని మద్దించు పద్ధతులు :** చెల్లింపుల శేషంలో సమతౌల్యం అను భావనను వివరించడం ఇప్పుడున్నటువంటి అంతర్జాతీయంగా వస్తున్న మార్పులు, ఆయా దేశాల పరిస్థితుల దృష్ట్యా చాలా కష్టసాధ్యమయినదిగా చెప్పవచ్చు. అయినప్పటికీ వివిధ దేశాల చెల్లింపుల శేషంలో సర్వసాధారణంగా ఉండే అసమతౌల్య స్థితిని అది ఎంత వరకు ఉందో మదింపు చేయడానికి వివిధ పద్ధతులను ఆర్థికవేత్తలు తెలిపారు. అందులో ప్రధానమయినవిగా అంతర్జాతీయ ఖాతాలోని అంశాలను ప్రేరిత, నిర్దేశిక వ్యాపార అంశాలుగా విభజించి పరిశీలించటం జరుగుతుంది. స్వయం ప్రేరిత వ్యవహారాల స్వరూప స్వభావాలు వాటి మధ్య గల తేడాలను క్రింద తెలిపిన విధంగా చెప్పుకోవచ్చు.

ఏదైనా ఒక దేశంలోని వ్యక్తులు, సంస్థలు, కార్పొరేషన్లు, ప్రభుత్వం వారికి ఎటువంటి సంబంధం లేకుండా స్వయం సిద్ధంగా జరిపే అన్ని రకాల ఆర్థిక వ్యవహారాలను స్వయం ప్రేరిత వ్యవహారాలుగా వ్యవహరిస్తారు. అలా కాకుండా సంస్థలు, ప్రభుత్వం స్వయం ప్రేరిత వ్యవహారాల మధ్య గల తేడాను సరిదిద్దడానికి నిర్దేశించి జరిపే అన్ని రకాల కరెంటు మూలధన ఖాతాల అంశాలన్నీ నిర్దేశించిన వ్యవహారాలుగా తెలుపుతారు. దీనిని బట్టి ఒక దేశ సంస్థలు, ప్రభుత్వం ఎంత మేరకు నిర్దేశించిన వ్యవహారాలను జరుపుతాయో అవి ఆ దేశ అంతర్జాతీయ చెల్లింపుల శేషంలోని వాస్తవ అసమతౌల్యాన్ని తెలియజేస్తాయి. ఈ వివరణ ఆధారంగా చెల్లింపుల శేషంలో గల అసమతౌల్యాన్ని "విదేశీ చెల్లింపులకు అవసరమయిన స్వయం ప్రేరిత వ్యాపారాల విలువ విదేశాల నుంచి రాబడులను రప్పించే స్వయం ప్రేరిత వ్యాపారాల విలువ అధికమైనపుడు ఆ దేశానికి అంతర్జాతీయ చెల్లింపుల శేషంలో లోటు కనిపిస్తుంది. అదే విధంగా రాబడులను రప్పించే స్వయంప్రేరిత వ్యాపార విలువ చెల్లింపులను కలిగించే స్వయం సర్దుబాటు వ్యాపారాల కంటే అధికమైతే ఆ దేశ అంతర్జాతీయ ఖాతాలో రాబడి, చెల్లింపుల అంశాలకున్న తేడానే లోటు లేదు మిగులు లేదా "వాస్తవ అసమతౌల్యం" గా వివరించవచ్చు.

**11.5.2. చెల్లింపు శేషంలోని అసమతౌల్య స్థితిని మద్దించు పద్ధతులు పట్టిక సహాయంతో వివరణ :** ఒక దేశ అంతర్జాతీయ చెల్లింపులలోని అంశాలను స్వయం ప్రేరిత, సర్దుబాటు వ్యవహారాలుగా విభజించడం జరుగుతుందని మనకు తెలుసును. వాస్తవ అసమతౌల్యాన్ని ఎదుర్కొను సందర్భంలో ఈ విధమయిన అంశాలను పరిగణనలోనికి తీసుకోవడం జరుగుతుంది. చెల్లింపులు మరియు రాబడులు పట్టిక మాదిరిగానే అసమతౌల్య సర్దుబాటు అంశాలను పట్టిక ద్వారా తెలుసుకోవచ్చు. వాస్తవ అసమతౌల్య అంశాన్ని వివరంగా తెలుసుకోవడాన్ని దిగువ నమూనా పట్టిక 2.2 సహాయిస్తుంది.

పట్టిక 2.2. స్వయం ప్రేరిత, సర్దుబాటు వ్యవహారాల విభజన (కోట్ల రూపాయల విలువ)

| రాబడులు | | చెల్లింపులు | |
|---|---|---|---|
| 1. స్వయం ప్రేరిత రాబడులు | | 3. స్వయం ప్రేరిత చెల్లింపులు | |
| (ఎ) స్వయం ప్రేరిత వస్తు సేవల ఎగుమతులు | 960 | (ఎ) స్వయం ప్రేరిత వస్తు సేవల దిగుమతులు | 1080 |

| | | | |
|---|---|---|---|
| (బి) స్వయం ప్రేరిత తిరిగి చెల్లించనవసరం లేని రాబడులు | 20 | (బి) స్వయం ప్రేరిత తిరగి చెల్లించనవసరం లేని చెల్లింపులు | |
| (సి) స్వయం ప్రేరిత మూలధన రాబడులు | 40 | (సి) స్వయం ప్రేరిత మూలధన చెల్లింపులు | 40 |
| మొత్తం స్వయం ప్రేరిత రాబడులు | 1020 | మొత్తం స్వయం ప్రేరిత చెల్లింపులు (ఎ+బి+సి) | 1145 |
| 2. సర్దుబాటు | | సర్దుబాటు | |
| (ఎ) సర్దుబాటు వస్తు సేవల ఎగుమతులు | 30 | (ఎ) సర్దుబాటు వస్తు సేవల దిగుమతులు | --- |
| (బి) సర్దుబాటు చెల్లించనవసరం లేని రాబడులు | 50 | (బి) సర్దుబాటు చెల్లించనవసరం లేని చెల్లింపులు | 15 |
| (సి) సర్దుబాటు మూలధనం | 100 | (సి) సర్దుబాటు మూలధన చెల్లింపులు | 40 |
| మొత్తం నిర్దేశిత రాబడులు | 180 | మొత్తం నిర్దేశిత చెల్లింపులు | 55 |
| మొత్తం రాబడులు (1+2) | 1200 | మొత్తం చెల్లింపులు | 1200 |

పై పట్టికలో స్వయంప్రేరిత వ్యాపారాంశాల శేషం 960-1080 = 120 కోట్ల రూపాయలుగాను స్వయం ప్రేరిత బదిలీ అంశాల శేషం 20-25 40=5 కోట్లుగాను వెరసి మొత్తం స్వయం ప్రేరిత వ్యాపారాంశాలలోని లోటు 125 కోట్లుగాను గుర్తించవచ్చు. స్వయంప్రేరిత వ్యవహారాల మధ్య గల లోటును నిర్దేశిత వ్యాపారాంశాలను వినియోగించి వాటిని సర్దుబాటు చేసి 125 కోట్లు మిగులును నిర్దేశిత వ్యాపారాంశాల శేషంగా తీసుకొని వచ్చి స్వయం ప్రేరిత వ్యవహారాలలోని లోటు చక్కదిద్ది విదేశీ చెల్లింపు శేషంలోని మొత్తం రాబడులు, మొత్తం చెల్లింపులకు సమానంగా చేయడం జరుగుతుంది. అందువల్ల ఇందులో విదేశీ చెల్లింపుల శేషంలోని వాస్తవ సమతౌల్యాన్ని స్వయంప్రేరిత వ్యవహారాల శేషం బట్టి లేదా నిర్దేశిత వ్యాపారాంశాలను బట్టి మొత్తం మీద 125 కోట్లు లోటుగా చెప్పవచ్చు. ఈ స్వయంప్రేరిత నిర్దేశిత వ్యవహారాల విభజనను అనుసరించి కనుక్కొని వాస్తవ అసమతౌల్య విషయంలో కొన్ని లోటుపాట్లున్నాయి. ముఖ్యంగా విదేశీ వ్యాపారానికి సంబంధించిన అంశాలను స్పష్టంగా ఇవి నిర్దేశిక అంశాలను నిర్ధారణ చేయడం కష్టం. ఈ కారణంగా వాస్తవ అసమతౌల్యాన్ని కనుగొనడానికి ఆర్థికవేత్తలు ప్రభుత్వ సెటిల్‌మెంటు పద్ధతి, మౌళిక వ్యవహారాల భావన, ద్రవ్యత్వ భావన వంటి వాస్తవ అసమతౌల్యాన్ని మదింపు చేసే పద్ధతులను సూచించారు. వివిధ దేశాలలో ఈ పద్ధతులు మదింపు చేయుటలో అమలు పరుస్తున్నారు.

## 11.6. విదేశీ చెల్లింపుల శేషంలో అసమతౌల్యంలో గల వివిధ రకాలు

చెల్లింపుల శేషంలో ఒకే రకమయిన అసమతౌల్యం ఏర్పడదు. అనేక రకాలుగా ఇవి ఏర్పడతాయి. అసమతౌల్యాన్ని గురించి చర్చించేటపుడు, కరెంటు ఖాతాలోని వ్యవహారాలుగా మాత్రమే గుర్తించుకోవాలి. చెల్లింపు శేషంలో మిగులు లేదా లోటుగాని ఉన్నట్లయితే ఆ దేశం విదేశీ మూలధన పెట్టుబడుల స్థాయి ఏ విధంగా ఉందో తెలుపుతుంది. అంతే కాక ఆ దేశం ఆర్థిక స్థోమత లేదా దాని బలహీనత తెలుపుతుంది. ఏమయినప్పటికీ చెల్లింపుల శేషంలో అసమతౌల్యం ప్రధానంగా 5 రకాలుగా గుర్తించారు. అవి క్రింది విధంగా ఉన్నాయి.

1. చక్రీయ అసమతౌల్యం **(Cyclical disequilibrium)** : ఈ రకమయిన అసమతౌల్యం దేశీయ అంతర్గత కారణాల వల్ల కాకుండా అంతర్జాతీయ వ్యాపార చక్రాల ప్రభావం వల్ల ఏర్పడుతాయి. ఒక దేశంలో ఆదాయం, ఉత్పత్తి పెరుగుదల రేటు నిర్ణయించడం కష్టంతో కూడిన పనిగా చెప్పవచ్చు. దీర్ఘకాలంలో ఆదాయాలలో మార్పు స్వల్పకాలిక వ్యాపార విజృంభణలు, మాంద్యం వల్ల వస్తాయి. ఈ

చక్రీయ అసమతౌల్యం వివిధ దేశాల్లో వ్యాపార చక్రాల ప్రభావం వల్ల, దిగుమతులలో డిమాండు ఆదాయ వ్యాకోచత్వాలు తేడాగా ఉండటం వల్ల సంభవిస్తాయి. అంటే ఒక దేశంలో అంతర్జాతీయ వ్యాపారంలో పాల్గొనే వివిధ వ్యాపార భాగస్వామ్య దేశాలు ఏ దేశం వ్యాపార చక్రాల ప్రభావానికి లోనైనా వాటివల్ల ఆ దేశ ఎగుమతి, దిగుమతులలో వచ్చే మార్పు దాని వ్యాపార భాగస్వామ్య దేశాల చెల్లింపుల శేషాలను ప్రభావితం చేసి ఎంతో కొంత అసమతౌల్యాన్ని కలుగజేస్తుంది. ఈ రకంగా ఏర్పడిన అసమతౌల్యాన్ని చక్రీయ అసమతౌల్యంగా పేర్కొంటారు.

**2. తాత్కాలిక మరియు ప్రాథమిక అసమతౌల్యం :** సాధారణంగా స్వల్పకాలంలో తాత్కాలికంగా చెల్లింపుల శేషంలో ఏర్పడే అసమతౌల్యం అన్ని దేశాలలోను సర్వసాధారణ అంశం. ఏ రకమైన ప్రత్యేక విధానాలు, ప్రయత్నాలు లేకుండానే ఇది సర్దుబాటు అవుతుంది. కాని దీర్ఘకాలంలో కాలపరిణామ క్రమంలో సంచయనం అయి పెరిగే అసమతౌల్యాన్ని శాశ్వత అసమతౌల్యం లేదా ప్రాథమిక అసమతౌల్యంగా పేర్కొనడం జరుగును. ఈ రకమయిన అసమతౌల్యాన్ని సర్దుబాటు చేయుటకు ప్రభుత్వ పరమయిన విధానాల అమలు ఎంతో అవసరం. అభివృద్ధి చెందిన దేశాలు శేషంలో ఈ రకమయిన అసమతౌల్యాన్ని ఎదుర్కొంటాయి. వివిధ దేశీయ అంతర్జాతీయ కారణాల వల్ల చాలా కాలంగా చెల్లింపు శేషంలో పేరుకుపోతున్న లోట్లు ఈ రకమయిన శాశ్వత అసమతౌల్యాన్ని కలగజేస్తాయి. దీని వల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు హాని కలుగుతుంది / హానికరమయినది.

ప్రాథమిక అసమతౌల్యం ఏర్పడడానికి అనేక కారణాలు దోహదం చేస్తాయి. అందులో ప్రధానమయినవి :

1. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఆర్థిక కార్యకలాపాల కోసం అధిక మొత్తంలో వివిధ రకాల మూలధన వస్తువులను దిగుమతి చేసుకోవడం వల్ల ఎగుమతులు కన్నా దిగుమతులు పెరిగి అసమతౌల్యం ఏర్పడుతుంది.
2. ఆదాయ మరియు ధరల ప్రకారం ఆర్థికాభివృద్ధి వల్ల ఒక దేశంలో తలసరి ఆదాయాలు పెరగడం వల్ల దిగుమతులు పెరిగి ఉపాంత దిగుమతి ప్రవృత్తి ఎక్కువగా ఉంటుంది. అదే విధంగా దేశీయంగా ఉపాంత వినియోగ ప్రవృత్తి ఎక్కువ కావడం వల్ల ధరలలో పెరుగుదల కనిపించడం వల్ల ఎగుమతులు తగ్గడం వల్ల చెల్లింపుల శేషం లోటు ఏర్పడుతుంది.
3. ఎగుమతి దిగుమతి వ్యాకోచం విషయంలో సాధారణంగా అభివృద్ధి చెందని దేశాలు వ్యవసాయం ఉత్పత్తులను ఎగుమతి చేస్తాయి. వాటి ఆదాయ, డిమాండు వ్యాకోచత్వం తక్కువగా ఉంటుంది. పారిశ్రామిక దేశాల ఎగుమతులు పారిశ్రామిక వస్తువులు అవ్వడం వల్ల వెనుకబడిన దేశాల ఆదాయ, వస్తు డిమాండుల కన్నా భిన్నంగా ఉండి చెల్లింపుల శేషంలో అసమతౌల్యం తక్కువగా ఉంటుంది.
4. జనాభా పెరుగుదల ఎక్కువగా ఉండి పారిశ్రామిక దేశాలు కాని దేశాల్లో దిగుమతుల పెరుగుదల ఎక్కువగా ఉండి లోటుకు దారి తీస్తుంది.
5. ఎగుమతి వస్తువులకు పోటీ ఏర్పడినా, ద్రవ్యోల్బణం లేదా ప్రభుత్వం అమిత వ్యయం వల్ల ఎగుమతులు తగ్గిపోవచ్చు.
6. పై అంశాలతోపాటు మరికొన్ని ఆర్థికేతర అంశాలయిన రాజకీయ పరిస్థితులు, సాంఘిక పరిస్థితులలో మార్పులు, సాంస్కృతిక, మతపరమయిన పరిణామాలు దేశాల అంతర్జాతీయ ఆర్థిక వ్యవహారాలను ప్రభావితం చేస్తాయి. అనిశ్చిత స్థితి గల ప్రభుత్వం వల్ల అంతర్జాతీయ వ్యవహారాలపై దుష్ప్రభావం కలుగుతుంది. అలాగే కమ్యునిస్టు దేశాల్లో నియమిత ఆర్థిక విధానాల వల్ల ఎగుమతి, దిగుమతుల్లో ప్రభావాలు చెల్లింపుల శేషంలో అసమతౌల్యాన్ని కలగజేస్తాయి.

**3. దీర్ఘకాలిక అసమతౌల్యం (Secular disequilibrium) :** ఒక దేశంలో ఆర్థికాభివృద్ధి జరుగుచున్నపుడు కొంత కాలంలో వివిధ రంగాలలో మార్పు ఒక దశ నుంచి మరొక దశకు పెరుగుచున్నపుడు ఈ రకమయిన అసమతౌల్యం సంభవిస్తుంది. మూలధన కల్పన, సాంకేతిక పరమయిన మార్పులు, జనాభా పెరుగుదల, మార్కెటు పెరుగుదల, వనరులలో మార్పులు మొదలైన ఇతర కారణాలు దీనికి దోహదం చేస్తాయి. ఈ విధంగా కాకుండా ఒక దేశం పూర్తి అభివృద్ధి దశలను చేరుకున్నట్లయితే దేశంలోని పొదుపు మొత్తాలు చాలా ఎక్కువగా ఉండటం వల్ల లాభదాయకమైన పెట్టుబడులలో అవకాశం ఉంటుంది. దీని ద్వారా ఎగుమతులు దిగుమతుల కన్నా

పెరిగి మిగులు పెరుగుతుంది. జనాభా పెరుగుదల ఉండే వస్తు డిమాండు పెరిగి దిగుమతులు పెరిగి చెల్లింపుల శేషంలో దీర్ఘకాలిక అసమతౌల్యం ఏర్పడవచ్చు.

**4. నిర్మితీయ అసమతౌల్యం (Structural disequilibrium)** : ఒక దేశం ఎగుమతులు మరొక దేశ వస్తువుల డిమాండుపై ఆధారపడి ఉంటాయి. ఎగుమతి, దిగుమతులు డిమాండు, సప్లయి పరిస్థితులలో మార్పులు వచ్చినపుడు నిర్మాణ పరమయిన అసమతౌల్యం ఏర్పడుతుంది. పంటలు నష్టాల వల్ల ఎగుమతి శక్తి తగ్గుతుంది. ఇతర దేశాలకు ఎగుమతికి అవకాశం లేనపుడు దేశీయంగా ఆయా ఉత్పత్తులు తగ్గి ఎగుమతులు తగ్గుతాయి. అలాగే దేశీయంగా సమ్మెలు రాజకీయ అస్థిరత మొదలైన కారణాలు కూడా ఎగుమతి, దిగుమతి డిమాండు సప్లయి పరిస్థితులలో మార్పులు కలిగి నిర్మితమయిన అసమతౌల్యానికి దారి తీస్తుంది.

## 11.7. చెల్లింపుల శేషంలో అసమతౌల్యాన్ని నివారించు మార్గాలు :

విదేశీ చెల్లింపుల శేషంలో ఏర్పడే అసమతౌల్యాన్ని నివారించుటకు అనేక పద్ధతులను ఆర్థికవేత్తలు రూపొందించుట జరిగింది. అసమతౌల్య పరిష్కారమార్గంలో అనేక అంశాలు చోటుచేసుకున్నప్పటికీ వీరు రూపొందించిన పద్ధతులను ప్రధానంగా స్వయం సిద్ధంగా జరిగే సర్దుబాటు చర్యలు మరియు ప్రభుత్వపరంగా జరిగే సర్దుబాటు చర్యలుగా విభజించడం వల్ల అవగాహన సులభతరం అవుతుంది. ఈ అంశాలు క్రింద వివరించబడినవి.

### అసమతౌల్యాన్ని పరిదిద్దు చర్యలు :

**11.7.1. ధరల యంత్రాంగం లేదా స్వయంసిద్ధంగా జరిగే సర్దుబాటు పద్ధతులు** : ఈ అంశాలను ప్రతిపాదించిన వారుగా ప్రధానంగా సాంప్రదాయ ఆర్థికవేత్తలుగా పేర్కొనవచ్చు. స్వేచ్ఛా వ్యాపార విధానం ద్వారా ప్రభుత్వం జోక్యం లేకుంటే విదేశీ చెల్లింపుల శేషంలో అసమతౌల్యం దానంతట అదే సహజంగా సర్దుబాటు జరుగుతుందని వారు భావించారు అంతర్జాతీయ స్వర్ణ ప్రమాణ సూత్రాల ఆధారంగా దేశాల మధ్య జరిపే బంగారు నిల్వల మార్పిడులు ఆయాదేశాలలో దేశీయంగా ద్రవ్య సరఫరాకు తద్వారా ధరలలోను మార్పులు తీసుకువచ్చి వస్తు సేవల ధరలు అంతర్జాతీయ వ్యవస్థలో దేశాల మధ్య మార్పు చెందటం ద్వారా ఆయా దేశాల అంతర్జాతీయ చెల్లింపుల శేషాలలోని అసమతౌల్యం సర్దుబాటు అవుతుందని అంతర్జాతీయ వస్తుసేవల ధరలు ఒక స్థాయికి వచ్చిన స్థితిలో అన్ని దేశాలు వాటి వాటి చెల్లింపుల శేషాలలో సమతౌల్యాన్ని సహజంగా పొందుతాయిని సంప్రదాయులు భావించారు. అంతేకాక పేపరు కరెన్సీ వ్యవస్థలో కూడా స్వేచ్ఛా వ్యాపారం కొనసాగుతున్నపుడు అంతర్జాతీయ వ్యవస్థలోని ప్రధాన మార్కెటు శక్తులు స్వేచ్ఛగా ఉండటం వల్ల దీర్ఘకాలంలో ఆయా దేశాలు వాటి వాటి అంతర్జాతీయ చెల్లింపుల శేషాలలో సహజంగా సమతౌల్యాన్ని పొందుతాయని వారు అభిప్రాయపడ్డారు. ఈ విధంగా ధరల యంత్రాంగంలో సర్దుబాట్లు ప్రధాన పాత్ర వహిస్తాయి. అంటే విదేశీ మారక, సప్లయి డిమాండు బట్టి మారకపు విలువలో వచ్చే మార్పులు ఎగుమతి, దిగుమతి, డిమాండుల విషయంలో మార్పులు తీసుకువచ్చి తద్వారా చెల్లింపుల శేషంలో అసమతౌల్యాన్ని సరిదిద్దుతాయి. అసమతౌల్యం తాత్కాలికమైతే వర్తకపు పద్ధతిలో మార్పు ద్వారా సమస్యను పరిష్కరించవచ్చు. అసమతౌల్యం ప్రాథమికంగా ఉంటే కరెన్సీ విలువను పునర్ మూల్యాంకనం ద్వారా లేదా మూల్య హీనీకరణ ద్వారా పరిష్కరించవచ్చు. ఈ విధంగా మార్కెటు ధరల యంత్రాంగాలు, మారకపు రేట్ల వల్ల జరిగే సవరింపు చర్యలును స్వేచ్ఛా విదేశీ వ్యాపార పరిస్థితులలోనూ, మారక నియంత్రణ గల దేశాల్లో ప్రభుత్వ చర్యల వల్ల ఈ అసమతౌల్యాన్ని నివారించవచ్చు.

**11.7.2. ప్రభుత్వ చర్యల ద్వారా అసమతౌల్య నివారణా చర్యలు** : విదేశీ చెల్లింపుల శేషంలో లోటును సరిదిద్దుటకు విదేశీ మారకపు నియంత్రణను అనుసరించే దేశాల ప్రభుత్వాలు వివిధ రకాల విధానాలను అమలు పరుస్తాయి. వాటిని ద్రవ్య పర చర్యలుగాను ద్రవ్యేతర చర్యలుగా విభజిస్తారు.

**1. ద్రవ్యపర చర్యలు** : ద్రవ్యపర చర్యలలో ప్రధానంగా ప్రతి ద్రవ్యోల్బణం మారకపురేటు తరుగుదల, మూల్యహీనీకరణ, మారక నియంత్రణ వంటి చర్యలు కలిగి ఉంటాయి.

**(ఎ) ప్రతి ద్రవ్యోల్బణం :** చలామణిలో ఉన్న ద్రవ్యాన్ని బ్యాంకులు ఇచ్చే పరపతిని తగ్గించి మరియు ద్రవ్య సప్లయిని తగ్గించి విదేశీ వ్యాపార చెల్లింపులలో లోటును తొలగించవచ్చు. తద్వారా దేశీయంగా వస్తు ధరలు తగ్గి ఎగుమతులు పెరుగుతాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలలో దీని వల్ల తక్కువ ఫలితాలు ఉన్నప్పటికీ చెల్లింపుల శేషం సమతౌల్యానికి ప్రతి ద్రవ్యోల్బణ విధానాన్ని అనుసరిస్తుంటారు.

**(బి) మూల్యహీనీకరణ :** ప్రభుత్వం అధికారికంగా కరెన్సీ బహిర్గత విలువను తగ్గించడాన్ని మూల్యహీనీకరణ అంటారు. ఇలా జరగడం వల్ల ఆదేశ ఎగుమతులు చౌకగాను, దిగుమతులు హెచ్చు ధరలలోను లభించడం వల్ల ఎగుమతులు పెరిగి దిగుమతులు తగ్గి ఫలితంగా చెల్లింపుల శేషంలోని లోటు సర్దుబాటవుతుంది. అయితే దీనివల్ల ఆ దేశం ఎగుమతులు దిగుమతులకున్న ధర డిమాండ్ వ్యాకోచత్వం అత్యధికంగా ఉండటం వల్ల ప్రతికూల శేషం సర్దుబాటు అవుతుందని చెప్పలేం. మూల్యహీనీకరణ సమయంలో ఉత్పత్తి వ్యయాలు, ధరలు పెరగకూడదు. అలా పెరిగితే ఎగుమతులు పెరగవు. అదే సమయంలో ఇతర దేశాలు కూడా మూల్యహీనీకరణ చేయకూడదు. అలా చేస్తే వ్యాపార ఫలితాలుండవు.

**(సి) మారకం రేటు తరుగుదల :** అంతర్జాతీయ ద్రవ్య మార్కెటులో ఒక దేశపు కరెన్సి బహిర్గత విలువ మార్కెటు శక్తుల వల్ల తగ్గింపు జరగడాన్ని మారకపు రేటు తరుగుదల అంటారు. ఇలా జరిగినపుడు ఆ దేశ ఎగుమతుల ధరలు తగ్గటం వల్ల ఎగుమతి, డిమాండు పెరుగుతుంది. ఇతర దేశాల కరెన్సీ ధరలు ఈ దేశ కరెన్సీ ధరలతో పోల్చినపుడు ఎక్కువగా ఉండటం వల్ల ఆ దేశ దిగుమతి డిమాండు తగ్గి తద్వారా చెల్లింపుల శేషంలోని లోటు సర్దుబాటు అవుతుంది. అయితే చెల్లింపు శేషం సర్దుబాటుకు ఇది సరైన పద్ధతి కాదు. మారకం రేటులో తరచుగా వచ్చే మార్పులు విదేశీ వ్యాపారంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయి.

**(డి) విదేశీ మారక నియంత్రణ :** ఈ విధానంలో వ్యాపార విధానం ప్రభుత్వ నియంత్రణలో ఉంటుంది. ఎగుమతి దిగుమతులన్నీ ప్రభుత్వ అనుమతి ద్వారా జరుగుతాయి. ప్రతికూల పరిస్థితుల్లో దిగుమతులను తగ్గించి ఎగుమతులను ప్రోత్సహించడం జరుగుతుంది.. అయితే దీనివల్ల సహజమయిన రీతిలో వ్యాపారం జరగకపోవచ్చు. అందువల్ల కొన్ని సందర్భాలలో నష్టదాయకంగాను, కృత్రిమంగాను విదేశీ వ్యాపారం గోచరిస్తుంది. ఏమైనప్పటికీ విదేశీ వ్యాపార నియంత్రణ వల్ల వ్యాపార చెల్లింపులలో ఏర్పడిన అసమతౌల్యాన్ని అసలు కారణాలు సరిదిద్దలేదు.

**2. ద్రవ్యేతర చర్యలు :** ద్రవ్యేతర చర్యల్లో ప్రధానంగా దిగుమతి సుంకాలు, ఎగుమతుల ప్రోత్సాహం వంటి చర్యలు తీసుకోబడతాయి.

దిగుమతి సుంకాలను విధించడం వల్ల లేదా దిగుమతి సుంకాలను పెంచడం వల్ల వాటి ధరలు పెరిగి దిగుమతులు తగ్గుతాయి. అలాగే దిగుమతి కోటాలు నిర్ణయించడం వల్ల కూడా దిగుమతులు తగ్గి విదేశీ పోటీ నుండి దేశీయ పరిశ్రమలకు రక్షణ లభించుటయే కాక చెల్లింపు శేషం సర్దుబాటు వీలుంటుంది. మరోవైపు ప్రతికూల చెల్లింపుల శేషాన్ని తగ్గించుటకు ఎగుమతులు పెంచుటకు సబ్సిడీలను, బేంటీలను దేశీయ ఉత్పత్తిదారులకు వ్యాపారులకు కల్పించి ప్రోత్సహించాలి. ఎందుకంటే అంతర్జాతీయ వ్యాపారాన్ని పెంపొందించుటకు ఎగుమతులే ప్రాముఖ్యమయినవి. ఇటీవల కాలంలో ప్రపంచీకరణ ధోరణుల ప్రభావం వల్ల దిగుమతుల నియంత్రణ కంటే ఎగుమతుల పెంపుదలకే ప్రాధాన్యతనిస్తున్నారు.

ఈ విధంగా అసమతౌల్య నివారణకు అనేక చర్యలు / పద్ధతులు అవలంబిస్తున్నప్పటికీ వీటికి అనేక పరిమితులున్నాయి. కాబట్టి ఏ ఒక్క పద్ధతిపైనా ఆధారపడటం కంటే వివిధ పద్ధతులను పరిస్థితులకు అనుగుణంగా మిళితం చేసి ఉపయోగించినట్లయితే అనుకూల ఫలితాలు వస్తాయి. తద్వారా చెల్లింపుల శేషంలోని అసమతౌల్యతను నివారించవచ్చు.

## 11.8. సారాంశము :

ఏ దేశ ఆర్థికాభివృద్ధైనా ఆ దేశం ఇతర దేశాలతో చేసే విదేశీ వ్యాపారం పై ప్రభావితం చెందుతుంది. ఒక దేశపు విదేశీ వ్యాపార చెల్లింపుల శేషం ఆ దేశపు ఆర్థిక స్థితి సూచిక అని చెప్పవచ్చు. చెల్లింపుల శేషాన్ని ఎగుమతి, దిగుమతులు పరిమాణాన్ని ఇతర దేశాల నుంచి తీసుకునే రుణాలను, బంగార నిల్వల స్థితిని మొదలగు విషయాలను వివరిస్తుంది. దానిని బట్టి అంతర్జాతీయ ద్రవ్య మార్కెటులో ఒక దేశ కరెన్సీకి ఉన్న డిమాండు ఆ దేశం విదేశీ కరెన్సీని చేసుకుంటున్న సప్లయి, పరిస్థితులను తెలియజేయడం ద్వారా ఆ దేశ కరెన్సీ

మారక విలువ చెల్లింపుల శేషంలోని అంశాలను బట్టి నిర్ణయించడం జరుగుతుంది. ఈ కారణాల వల్ల విదేశీ వ్యాపార చెల్లింపుల శేషం ఎన్నో విధాలుగా ప్రాధాన్యతను సంతరించుకుంది. అందువల్ల చెల్లింపుల శేషానికి సంబంధించిన వివిధ అంశాలను ఈ అధ్యాయంలో విపులంగా వివరించడం జరిగింది.

## 11.9. ముఖ్య పదాలు

1. విదేశీ చెల్లింపుల శేషం పట్టిక : ఒక నిర్ణీత కాలంలో ఒక దేశం వివిధ ప్రపంచ దేశాలతో జరిపిన ఆర్థిక కార్యకలాపాలను పొందుపరచబడే అంశాలను సూచించే పట్టిక

2. విదేశీ చెల్లింపుల శేషం : ఒక దేశం ఇతర దేశాలకు చెల్లించిన మొత్తాలను, ఇతర దేశాల నుంచి ఆ దేశానికి తరలి వచ్చిన మొత్తం రాబడుల మధ్య తేడాను వివరించునది.

3. కరెంటు ఖాతా : నిర్దిష్ట కాలంలో వ్యక్తులు, సంస్థలు వారికి వారుగా నిర్వహించు విదేశీ ఆర్థిక కార్యకలాపాలు. ప్రస్తుత ఆదాయ వ్యయాలకు సంబంధించిన అన్ని అంతర్జాతీయ ఆర్థిక వ్యవహారాలను ఇందులో చూపుతారు.

4. మూలధన ఖాతా : ఒక దేశ ఆదాయ స్థాయిని ప్రత్యక్షంగా ప్రభావితం చేయని ద్రవ్య రూపమైన ఆస్తులు, సంపద రాశులలో కలిగే మార్పులు గురించి వివరించునది. ఒక నియమిత కాలానికి లోబడని నిల్వలకు సంబంధించిన ఆర్థిక వ్యవహారాలన్నీ ఈ ఖాతాలో చోటు చేసుకుంటాయి.

5. స్వయం ప్రేరిత అంశాలు : వ్యక్తులు, సంస్థలు వారికి వారు స్వతహాగా నిర్వహించే ఆర్థిక కార్యకలాపాలు

6. నిర్దేశిత వ్యవహారాలు : విదేశీ చెల్లింపుల శేషంలోని అంశాల దృష్ట్యా వానిని సర్దుబాటు చేయుటకు నిర్దేశించబడిన ఆర్థికాంశాలు

7. చక్రీయ అసమతౌల్యం : అంతర్జాతీయ వ్యాపార చక్రాల ప్రభావాల వలన వివిధ దేశాల అంతర్జాతీయ చెల్లింపుల ఖాతాలలో ఏర్పడే అసమతౌల్యం

8. మూల్యహీనీకరణ : ఒక దేశ కరెన్సీ విలువను ఇతర దేశాల కరెన్సీల దృష్ట్యా అధికారికంగా తగ్గించడం

9. దృశ్యాంశాలు : అంతర్జాతీయ వ్యాపారంలో గల ఎగుమతి మరియు దిగుమతి వస్తువులను దృశ్యాంశాలు అంటారు.

10. అదృశ్యాంశాలు : సేవల ఎగుమతి మరి దిగుమతులు

## 11.10. స్వయం సమీక్షా ప్రశ్నలు :

1. చెల్లింపుల శేషంలో గల వివిధ అంశాల గురించి వివరించుము
2. సమతౌల్యం, అసమతౌల్యం మధ్య గల తేడాను వివరిస్తూ అసమతౌల్యానికి గల కారణాలు విశదీకరించండి.
3. చెల్లింపుల శేషంలోని అసమతౌల్యాన్ని నివారించు చర్యలు వివరించండి.

## 11.11. చదువవలసిన గ్రంధాలు


1. B.O. Sodesten : International Economy
2. J.E. Meade : The balance of payments
3. Peter. B. Kenen : The International Economy
4. David Young : International Economics
5. Waltes, Ingo : International Economics.

పాఠం - 12

# మూల్యన్యూనీకరణ - మారకపు నియంత్రణ

**లక్ష్యం :**

ఈ పాఠ్య భాగము నందు విదేశీ వ్యాపారం విషయంలో మూల్యన్యూనీకరణ ప్రభావాన్ని వివరించటం జరిగింది. మూల్యన్యూనీకరణ పరిస్థితిని సూత్ర విధానంగా వ్యాకోచత్వాన్ని కొలుచుట మరియు తద్వారా విదేశీ వ్యాపారంలో కలుగు మార్పులు కూడా చర్చించబడ్డాయి. కుప్తంగా చెప్పాలంటే ఈ భాగమునందు క్రింది అంశాలు వివరించబడినవి. వీటిని చదువుట ద్వారా మూల్యన్యూనీకరణ, మారకపు నియంత్రణ ప్రభావాలు విదేశీ వ్యాపారంపై ఏ విధంగా ఉన్నవో తెలుసుకోవచ్చు.

విదేశీ వ్యాపారం పై మూల్యన్యూనీకరణ ప్రభావాలు

విదేశీ వ్యాపారంపై మూల్యన్యూనీకరణ వ్యాకోచపద్ధతి విశ్లేషణ

ఎగుమతి దిగుమతులపై మూల్యన్యూనీకరణ ప్రభావాలు మార్షల్, లెర్నర్ వివరణలు

విదేశీ వ్యాపారంపై ఆదాయం మరియు ద్రవ్యశక్తి పద్ధతుల వివరణ

ద్రవ్య పద్ధతి, నగదు నిలువల పెరుగుదల మరియు తగ్గుదల అంశాలు విదేశీ వ్యాపారంపై కలుగు ప్రభావాలు మొదలైనవి

**విషయ సూచిక :**


12.1 ఉపోద్ఘాతము

12.2 మూల్యన్యూనీకరణ - వ్యాకోచ పద్ధతులు

12.3 ఎగుమతి దిగుమతులపై మూల్యన్యూనీకరణ ప్రభావాలు మరియు మార్షల్, లెర్నర్ పరిస్థితి నిబంధన వివరణ

12.4 ఆదాయ మరియు వ్యయ శక్తి పద్ధతి

12.5 ఆదాయంపై మూల్యన్యూనీకరణ ప్రభావాలు

12.6 ద్రవ్య పద్ధతి - నగదు నిలువల పెరుగుదల, తగ్గుదల మరియు మూల్యన్యూనీకరణ

12.7 మారకపు నియంత్రణ

12.8 సారాంశము

12.9 ముఖ్య పదాలు

12.10 స్వయం సమీక్షా ప్రశ్నలు

12.11 చదవవలసిన గ్రంథాలు

## 12.1 ఉపోద్ఘాతము

విదేశీ చెల్లింపుల ఖాతాలో సాధారణంగా ఏర్పడే ప్రతికూలమయిన అసమతౌల్యాన్ని నివారించుటకు ఆర్థికవేత్తలు వివిధ పద్ధతులను వివరించారు. ప్రధానంగా అభివృద్ధి చెందుతున్న దేశాలు ఎదుర్కొనే ప్రాథమిక అసమతౌల్యాన్ని చక్కదిద్దుటకు ఒక ముఖ్యమయిన అంశంగా మూల్యన్యూనీకరణ విధానాన్ని సంప్రదాయ, నవ్య సంప్రదాయ ఆర్థికవేత్తలతో పాటు ఆధునిక ఆర్థికవేత్తలు కూడా ప్రతిపాదించారు. సంప్రదాయ ఆర్థికవేత్తలు ప్రధానంగా విదేశీ మారకరేటులో మార్కెటు శక్తుల ప్రభావం వల్ల కలిగే మార్కెటు తగ్గుదలను (Depriciation) విశ్లేషించి చెప్పగా - మిగిలనవారు అధికారికంగా ఒక దేశ ప్రభుత్వం అధికారికంగా విదేశీ మారకపు రేటును తగ్గించే విధానం (మూల్యన్యూనీకరణ) పై కేంద్రీకరించారు. అంతేకాక ప్రపంచయుద్ధానంతర కాలంలో ఆవిర్భవించిన మారకపు నియంత్రణలు పాటించుచున్న ఆర్థిక వ్యవస్థలో మారకపు రేటు మార్కెటు శక్తులు ప్రకారం తగ్గిననూ అధికారికంగా మారకపు రేటును మార్చకపోవుటవల్ల ఈ రెండింటికి తేడా సహజంగా ఉంటుంది. ఈ తేడాలను తగ్గించుటకు అంతర్జాతీయ ద్రవ్య నిధి (IMF) తన సభ్య దేశాలను అధికారిక మరియు మార్కెటు రేట్ల మధ్యగల వ్యత్యాసాన్ని తగ్గించాలని ఆదేశించుచున్నది అనగా ద్వంద్వ మార్కెటు వ్యవస్థల నుండి ఏకీకృత మార్కెటు వ్యవస్థకు (IMF) కృషి చేస్తుంది. ఈ నేపధ్యంలో ఈ పాఠ్య భాగమందు ఈ విషయాలపై విశ్లేషించబడినది.


మూల్యన్యూనీకరణ - మారకపు నియంత్రణలు సనాతనంగా సంప్రదాయ వాదులు మూల్యన్యూనీకరణ యొక్క ప్రభావాలు ఎగుమతి దిగుమతులపై ఏ విధంగా ఉంటాయో తెలుపుటకు అనేక పద్ధతులను ప్రవచించారు. వారిలో ప్రథములుగా మార్షల్ మహనీయుణ్ణి పేర్కొనవచ్చు విదేశీ వ్యాపారంలో అవలంబించే ప్రభుత్వ పరచర్యల్లో మూల్యన్యూనీకరణ మరియు మారక నియంత్రణలు ప్రధానమయినవి. మూల్యన్యూనీకరణ ఎగుమతులపైన మరియు దిగుమతులపైనా ప్రభావం చూపుతాయి. ఈ ప్రభావాలను సంఖ్యా రూపంలో వివరించే పద్ధతులలో వ్యాకోచ పద్ధతి సర్వసాధారణమయినదిగా చెప్పబడుచున్నది సాంప్రదాయవాదులు ఈ పద్ధతిని ఉపయోగించి మూల్యన్యూనీకరణ ప్రభావం ఎగుమతి దిగుమతులపై ఏ విధంగా ఉంటుందో తెలిపారు ఈ పద్ధతిలో వచ్చిన విలువలు ఆధారంగా మూల్యన్యూనీకరణ విదేశీ వ్యాపార శేషంపై దాని ప్రభావాన్ని సులభంగా అర్థం చేసుకోవచ్చు

## 12.2 ఎగుమతులపై మూల్యన్యూనీకరణ ప్రభావాన్ని తెలుపు వ్యాకోచ పద్ధతి

ఈ విశ్లేషణలో మార్షల్ ప్రతిపాదించిన 'మొత్తం అవుట్‌లే' పద్ధతి ప్రధానమయినది. ఈ పద్ధతి ప్రకారం దిగువ తెలిపిన మూడు రకాల వ్యాకోచ పద్ధతుల ద్వారా మూల్యన్యూనీకరణ ప్రభావం ఏ విధంగా ఆయా దేశాల ఎగుమతి దిగుమతులపై ఉందో చెప్పవచ్చును.

**12.2.1. వ్యాకోచం ఒకటి కన్నా ఎక్కువగా ఉన్నపుడు :** ఎగుమతుల ధర మరియు డిమాండుల వ్యాకోచత్వం ఒకటి కన్న ఎక్కువయినట్లయితే మూల్యన్యూనీకరణ మొత్తం ఎగుమతులను పెంచుతుంది. అనగా వ్యాకోచం ఒకటి కన్నా ఎక్కువగా ఉన్నపుడు మూల్యన్యూనీకరణ వల్ల ధర తగ్గుదల శాతం కన్నా మొత్తం ఎగుమతుల దిగుమతులలో వచ్చు పెరుగుదల శాతం ఎక్కువగా ఉండును క్రింది పటంలో ఈ ప్రభావాన్ని చూపడమయినది.

పటము - 1





ఎగుమతులపై మూల్యన్యూనీకరణ ప్రభావం

పై పటంలో మూల్యన్యూనీకరణకు ముందు OP మారకపు రేటు వద్ద OM ఎగుమతుల గలవు. OP మారకపు రేటు $OP_1$ కు తగ్గిన తరువాత ఎగుమతులలో పెరుగుదల OM నుండి $OM_1$ కు పెరిగింది. మారకం రేటు తగ్గుదల $PP_1$ RS కన్నా ఎగుమతులలో పెరుగుదల శాతం $MM_1$, TS ఎక్కువగా ఉండుట 1 కన్నా ఎక్కువ డిమాండు వ్యాకోచత్వం ఎగుమతులకుండుటను సూచించును.

**12.2.2.** వ్యాకోచత్వం ఒకటి కన్నా తక్కువగా ఉండుట : మూల్యన్యూనీకరణ చేసాక ఎగుమతుల ధర వ్యాకోచ డిమాండు ఒకటి కాన్న తక్కువగా ఉన్నచో మూల్యన్యూనీకరణ తరువాత మారకపురేటులో తగ్గుదల శాతం కన్నా ఎగుమతులలో పెరుగుదల శాతం తక్కువగా ఉంటుంది. ఈ విషయాన్ని క్రింది పటంలో గమనించండి :


పటము - 2



పై పటంలో మూల్యన్యూనీకరణ చేసిన దేశం యొక్క మారకపు రేటులోని తగ్గుదల P నుండి $P_1$ కాగా ఎగుమతులలోని పెరుగుదల శాతం M నుంచి $M_1$ గా చూపడమయింది. డిమాండు వ్యాకోచత్వం 1 కన్నా తక్కువగా ఉండటం వల్ల మారకపు రేటులోని తగ్గుదల $PP_1$ RS కన్నా ఎగుమతుల పెరుగుదల $MM_1$ ST తక్కువగా ఉన్నది.

**12.2.3. వ్యాకోచత్వం ఒకటికి సమానం :** మూల్యన్యూనీకరణ చేసిన దేశం యొక్క ఎగుమతుల ధర డిమాండు వ్యాకోచత్వం 1 కి సమానమైనపుడు మూల్యన్యూనీకరణ చేసిన తరువాత మారకపు రేటులోని తగ్గుదల శాతము ఎగుమతుల పెరుగుదల శాతమునకు సమానంగా ఉంటుంది.


**పటము - 3**




పై పటంలో మూల్యన్యూనీకరణ తరువాత మారకపు రేటులోని తగ్గుదల $P_1$RS ఎంత గలదో ఆ దేశ ఎగుమతులలోనూ పెరుగదల $MM_1$, TS కూడా అంతేకలదు. దీనికి కారణం మూల్యన్యూనీకరణ చేసిన దేశం యొక్క ధర డిమాండు వ్యాకోచత్వం ఒకటికి సమానంగా ఉండుటయే


## 12.3 ఎగుమతి దిగుమతులపై మూల్యన్యూనీకరణ ప్రభావాలు

మూల్యన్యూనీకరణ అనంతరం దిగుమతుల ధరలు పెరుగును. దానికి కారణం దేశీయ కరెన్సీ కరెన్సీతో పోల్చినపుడు విదేశీ కరెన్సీల ధర పెరుగట మూల్యన్యూనీకరణ దిగుమతుల ధరల పెరుగుదల వలన తీసికొని వచ్చినచో దిగుమతులకు డిమాండు తగ్గి దిగుమతులు తగ్గును. డిమాండు వ్యాకోచం 0 కన్నా ఎక్కువ ఉన్నచో ఈ విధంగా జరుగుతుంది. దిగుమతులు తగ్గినపుడు కొంతమేరకు విదేశీ మారక ద్రవ్యంలో పొదుపు ఏర్పడును. మూల్యన్యూనీకరణ తరువాత దిగుమతులలోని తగ్గుదల మరియు విదేశీ మారక ద్రవ్యం పొదుపులో పెరుగుదల ఆ దేశ దిగుమతి డిమాండులపై ఆధారపడి ఉంటుంది. క్రింది పట్టికలో ఈ అంశాన్ని గమనించుము.





మూల్యన్యూనీకరణ తరువాత విదేశీ కరెన్సీ ధర OP నుండి $P_1$ కి పెరిగింది. మూల్యన్యూనీకరణ ముందు దిగుమతుల పరిమాణము OQ గా చూపబడింది. మూల్యన్యూనీకరణ చేసిన దేశం యొక్క దిగుమతి డిమాండు వ్యాకోచత్వ శూన్యంగా ఉన్నపుడు మూల్యన్యూనీకరణ చేసిన తరువాత కూడా దిగుమతుల పరిమాణంలో ఎటువంటి మార్పు ఉండదు.

దిగుమతి డిమాండుల వ్యాకోచం '0' కన్నా ఎక్కువ ఉన్నపుడు మూల్యన్యూనీకరణ తరువాత దిగుమతులలో వచ్చు మార్పు ఈ దిగువ పటంలో చూపడమయింది.




పై పటమందు ధరలలోని మార్పు శాతం P నుండి $P_1$ కన్నా దిగుమతులలోని తగ్గుదల శాతము Q నుండి $Q_1$ తక్కువగా కన్పించుచున్నది. దీనికి కారణం ఎగుమతుల ధర వ్యాకోచత్వం డిమాండు శూన్యం కన్నా ఎక్కువ, 1 కన్నా తక్కువగా ఉండుట వలనగా చెప్పవచ్చు.

మూల్యన్యూనీకరణ చేసిన దేశం యొక్క దిగుమతుల డిమాండు వ్యాకోచత్వం ఒకటి కన్నా ఎక్కువ ఉన్నపుడు లేదా అధిక వ్యాకోచత్వం కల్గు పరిస్థితి ఈ దిగువ పటంలో చూపబడింది.




పై పటంలో దిగుమతుల ధరలలోని పెరుగుదల $PP_1$ శాతం కాగా దిగుమతులలోని పెరుగుదల $QQ_2$ శాతము ఎక్కువగా కనిపించుచున్నది దీనికి కారణం దిగుమతుల డిమాండు వ్యాకోచత్వం అధికంగా లేదా 1 కన్నా ఎక్కువగా ఉండుట దీనికి కారణముగా చెప్పవచ్చు.

**మార్షల్, లెర్నర్ పరిస్థితి నిబంధన వివరణ :** ఎగుమతి దిగుమతి డిమాండు వ్యాకోచం వివిధ పరిస్థితులను మూల్యన్యూనీకరణ తర్వాత ఎగుమతుల దిగుమతులపై మార్షల్, లెర్నర్ ప్రభావాలను పరిశీలించాక మూల్యన్యూనీకరణ చేసిన దేశం దాని నుండి ఎగుమతుల దిగుమతులపై ఎక్కువ ధనాత్మక ప్రభావాన్ని పొందవలెనన్నచో మూల్యన్యూనీకరణ చేసిన దేశం యొక్క ఎగుమతి - దిగుమతి వ్యాకోచత్వాలు ఏ విధంగా ఉండాలో క్రింది నిబంధన ద్వారా తెలిపారు.

$$ex + em > 1$$

పై సమీకరణ యందు ex ఎగుమతుల ధరల డిమాండుల వ్యాకోచత్వమును, దిగుమతుల ధర డిమాండు వ్యాకోచత్వమును చూపును. మూల్యన్యూనీకరణ చేయు దేశం యొక్క ఎగుమతి దిగుమతుల వ్యాకోచత్వాలు రెండూ కల్పి 1 కన్నా ఎక్కువగా ఉన్నపుడు మాత్రమే మూల్యన్యూనీకరణ అనంతర ఎగుమతులు ఎక్కువ పెరిగి దిగుమతులు ఎక్కువగా తగ్గి విదేశీ వ్యాపార శేషం పై మూల్యన్యూనీకరణ ఎక్కువ ధనాత్మక ప్రభావమును చూపును.

అలాకాక ex + em > 1 అయినచో మూల్యన్యూనీకరణ తరువాత ఆ దేశ ఎగుమతులు తగ్గి దిగుమతులు పెరిగి విదేశీ వ్యాపార శేషంపై మూల్యన్యూనీకరణ ఎక్కువ ఋణాత్మక ప్రభావాలను చూపును. అదే విధంగా ex + em = 1 అయినచో మూల్యన్యూనీకరణ వ్యాపార శేషంపై ప్రత్యక్ష ప్రభావాలను చూపలేదు. కావున మూల్యన్యూనీకరణ స్పష్టమైన ధనాత్మక లేదా ఋణాత్మక ప్రభావాలు చూపలేదు. కావున మార్షల్, మరియు లెర్నర్‌లు మూల్యన్యూనీకరణ చేయుటకు ముందు దేశంలో తప్పనిసరిగా ఎగుమతి దిగుమతి డిమాండు వ్యాకోచత్వాలు రెండూ కలసి 1 కన్నా ఎక్కువగా ఉన్నపుడు మాత్రమే మూల్యన్యూనీకరణ చేయుట మంచిదని తెలిపారు. అనగా ఒక దేశ డిమాండు వ్యాకోచత్వం శూన్యం అయినప్పటికీ డిమాండు దిగుమతులతో కలసినపుడు ఒకటికన్నా ఎక్కువ వ్యాకోచత్వ. ఉన్నచో శూన్య

ఎగుమతి వ్యాకోచత్వం వద్ద కూడా ఆ దేశం మూల్యన్యూనీకరణ వల్ల సత్ఫలితాలను పొందవచ్చు. అదే విధంగా దిగుమతి డిమాండులు శూన్యమయినప్పటికీ ఎగుమతి డిమాండు వ్యాకోచత్వం కలిసినపుడు 1 కన్నా ఎక్కువ ఉన్నచో శూన్య వ్యాకోచ స్థితి వద్ద కూడా మూల్యన్యూనీకరణ సత్ఫలితాలను ఇస్తుందని మార్షల్, లెర్నర్‌లు అభిప్రాయపడ్డారు.

## 12.4. ఆదాయ మరియు వ్యయ శక్తి పద్ధతి

ఈ భావనలు మూల్యన్యూనీకరణ ప్రభావాలను తెలుసుకొనుటకై సిడ్నీ యస్. అలెగ్జాండర్ 1952 సంవత్సరములో ప్రవేశపెట్టెను. ఈ భావన సనాతన వ్యాకోచత్వ పద్ధతికి ఒక పరిపూరకంగా చెప్పవచ్చు. ఆదాయ వినియోగ సామర్థ్య భావన స్థూల ఆర్థిక వ్యవస్థ చలాంకాల గూర్చి వివరిస్తుంది. ముఖ్యంగా ఈ భావనలో విదేశీ వ్యాపార శేషమును ఆర్థిక వ్యవస్థలోని మొత్తం వస్తు సేవల ఉత్పత్తిని మరియు ఆ దేశ మొత్తం వినియోగ సామర్థ్యానికి మధ్య గల తేడాగా నిర్వచించారు. అనగా ఈ భావనలో దేశ వినియోగ సామర్థ్యం దేశీయ మార్కెటులోని మొత్తం వస్తు సేవల వినియోగాన్ని మరియు విదేశీ వస్తు సేవల వినియోగాన్ని కూడా పరిగణనలోకి తీసుకొంటారు. అలాగే వినియోగ సామర్థ్యం మొత్తము వినియోగం మరియు పెట్టుబడుల వస్తువులను తీసుకొనుట జరుగుతుంది.

ఒక దేశంలో వ్యాపార శేషము ఆ దేశ ప్రజలు దేశంలోని ఉత్పత్తి కన్నా అధికంగా వినియోగం చేసినపుడు కలుగుతుంది. అనగా ఒక దేశంలో మొత్తం వినియోగము మరియు పెట్టుబడుల వస్తువుల ఉత్పత్తి పెట్టుబడి వస్తువుల వినియోగం దేశ జాతీయ ఉత్పత్తి కన్నా ఎక్కువగా ఉన్నపుడు వ్యాపార శేషం ఋణాత్మకంగా ఉండును. అదే విధంగా వినియోగస్థాయి జాతీయ ఉత్పత్తి కన్నా తక్కువగా ఉన్నపుడు వ్యాపార శేషం ధనాత్మకంగా ఉంటుంది ఈ విశ్లేషణను ఇలా వ్రాస్తారు.

$$B = Y - A$$

ఇందులో 'B' అనగా విదేశీ వ్యాపార శేషము. Y- ఆ దేశ జాతీయ ఉత్పత్తిని సూచిస్తుంది. A- ఆ దేశ మొత్తం వస్తు సేవల వినియోగ సామర్థ్యం శక్తిని తెల్పును.

ఈ సమీకరణ ప్రకారం మూల్యన్యూనీకరణ విదేశీ వ్యాపార శేషాలను, రెండు మార్గముల ద్వారా ప్రభావితం చేయును. మొదటిగా ఆ దేశ మొత్తం వస్తు సేవల ఉత్పత్తిలో మార్పు తీసుకొని వచ్చుట ద్వారాను అదే విధంగా ఆ దేశ మొత్తపు వినియోగ సామర్థ్యంలో మార్పు తీసుకు వచ్చుట ద్వారా గాని వ్యాపార శేషమును ప్రభావితం చేయును. పై సమీకరణంలో B, Y మరియు A లలో వచ్చు మార్పులను ఈ క్రింది సమీకరణంలో చూపవచ్చును.

$$b = y - a$$

ఈ సమీకరణం విదేశీ వ్యాపార శేషంలో వచ్చు మార్పులను దేశ జాతీయ ఉత్పత్తి మరియు వినియోగ స్థాయిలలో వచ్చు మార్పుల మధ్య గల సంబంధమును తెలుపును. అనగా మూల్యన్యూనీకరణ ప్రభావం ఆ దేశ వినియోగ స్థాయిపై ఏ విధంగా ఉండునో తెలుపుటకు ) y a లపై మూల్యన్యూనీకరణ ప్రభావం ఏ విధంగా ఉండునో తెల్పును. అలెగ్జాండర్ పేర్కొనినదేమనగా మూల్యన్యూనీకరణ అనంతరం దేశం మొత్తం వినియోగ సామర్థ్యంలో వచ్చు మార్పు ఈ క్రింది రెండు కారణముల వలన ఎలా కలుగునో తెలుపును. 1) దేశ నిజ వినియోగము మరియు పెట్టుబడులలో కల్గు మార్పు ఆ దేశ నిజ ఆదాయంలోని మార్పు మూల్యన్యూనీకరణ వల్ల ఎలా కల్గునో తెల్పును. 2) ఆదాయ ప్రభావం ద్వారా దేశ వినియోగ సామర్థ్యంలో వచ్చు మార్పులు. దీనిని క్రింది సమీకరణం ద్వారా తెల్పవచ్చును.

$$a = cy - d$$

ఇందులో C వినియోగ సామర్థ్యపు ప్రవృత్తి, అనగా ఇది వినియోగ మరియు పెట్టుబడి ప్రవృత్తుల మొత్తమునకు సమానము. అదే విధముగా d ని మూల్యన్యూనీకరణ వినియోగ శక్తిపై చూపు ప్రత్యక్ష ప్రభావముగా చెప్పవచ్చు. అనగా మూల్యన్యూనీకరణ వలన కలుగు నిజ ఆదాయాలలో కల్గు మార్పులు వినియోగశక్తిని ఏ విధముగా ప్రభావితం చేస్తుందో తెల్పును.

పై రెండు సమీకరణాలలో ఉన్న వివిధ చలాంకాల మధ్యగల సంబంధం అనగా a = cy - d కి సమానంతరంగా d = y - a లను సంయుక్తం చేసినా క్రింది సమీకరణం వచ్చును.

$$b = (1 - c)\, y + d$$

ఈ సమీకరణము మూల్యన్యూనీకరణ ఆ దేశ వ్యాపారాన్ని ఎన్ని విధాల ద్వారా ప్రభావితం చేస్తుందో తెలియజేయుననగా .....

1. మూల్యన్యూనీకరణ ఆదాయాలను ఏ విధంగా ప్రభావితం చేయును ?
2. ఆదాయ స్థాయిలో వచ్చు మార్పు వినియోగ శక్తిని ఏ రకంగా ప్రభావితం చేస్తుంది.
3. మూల్యన్యూనీకరణ ప్రత్యక్షంగా వినియోగస్థాయిపై వివిధ ఆదాయ స్థాయిల వద్ద ఏ రకంగా ప్రభావితం చేస్తుంది. ఈ అంశాలన్నీ మూల్యన్యూనీకరణ వల్ల దేశీయంగా ప్రభావం కల్గుతాయి.

## 12.5. ఆదాయంపై మూల్యన్యూనీకరణ ప్రభావాలు

మూల్యన్యూనీకరణ ప్రధానంగా ఈ క్రింది 2 మార్గాల ద్వారా ఆదాయాలలో మార్పులను తీసుకువస్తుంది.

**12.5.1. మిగులు వనరుల ప్రభావం :** మూల్యన్యూనీకరణ చేసిన దేశంలో మిగులు వనరులు అనగా అనుపయోగ వనరులు ఉన్నచో ఆ వనరులు అనగా అనుపయోగ వనరులు ఉన్నచో ఆ వనరుల వినియోగం ద్వారా ఉత్పత్తిని పెంచి తద్వారా ఎగుమతులను పెంచుటకు అవకాశం కలదు. ఇలా వనరులు ఉపయోగంలోకి వచ్చి ఆ దేశంలో పెట్టుబడులు పెరుగును. పెట్టుబడి గుణక ప్రభావం వల్ల పెట్టుబడి కన్నా కొన్ని రెట్లు ఉత్పత్తి, ఎగుమతులు, ఆదాయాలు పెరుగుటకు అవకాశం కలదు. ఈ దేశంలో ఉత్పత్తి ఎంత పెరుగునో అన్నది గుణాత్మక పరిణామం మీద మరియు ధర స్థాయిలలో వచ్చు మార్పులు మీద ఇతర దేశాలలో ఈ దేశ వస్తువులకు గల డిమాండుల మీద ఆధారపడును. అనుపయోగ వనరులు ఉన్న దేశాలలో మూల్యన్యూనీకరణ జరుగునపుడు ఆ దేశ ఆదాయంలోని పెరుగుదల వలన విదేశీ వ్యాపార శేషంపై కల్గు నికర ప్రభావాలను మదింపు చేయుటగాను, పెరిగిన మొత్తం ఉత్పత్తిని మాత్రమే పరిగణలోకి తీసుకొనరాదు. అనగా నిజ ఉత్పత్తి ఆదాయాలకు వస్తు సేవల వ్యయమునకు మధ్యగల తేడాను నిజ పొదుపు నిల్వలుగా చెప్పవచ్చు. విదేశీ శేషము మొత్తం ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన నిజ పొదుపు నిల్వలకు సమాంతరంగా ఉండును. ఆదాయం వలన వ్యాపారశేషంలో వచ్చు మార్పు సాధారణంగా ఆదాయం వలన నిజ పొదుపు నిల్వలలో వచ్చు మార్పునకు సమానంగా ఉండును. అనగా నిజ ఆదాయాలను మార్పును పొదుపు నిల్వల ప్రవృత్తిలో గుణించ వలసి ఉంటుంది. సాధారణంగా దేశాలలో ఏర్పడు వ్యాపార చక్రాలు వినియోగ ప్రవృత్తిలో మార్పు తీసుకువచ్చి దానిని ఒకటికన్న ఎక్కువగా చేయవచ్చును. అదే విధముగా పెరిగిన ఆదాయాలు పొదుపు మరియు పెట్టుబడి వస్తువు వినియోగ స్థాయిని ప్రభావితం చేయును. వినియోగ ప్రవృత్తిలోని మార్పు ఒకటి కన్నా ఎక్కువగా ఉన్నపుడు విదేశీ వ్యాపార స్థితి ఉత్పత్తిలో పెరుగుదల ఉన్నప్పటికిని పెద్దగా మార్పులను తీసుకురాదు.

అలెగ్జాండర్ ముగింపులో తెలిపినదేమనగా ఒక మూల్యన్యూనీకరణ చేసిన దేశంలో అనుపయోగ వనరులు ఉన్నపుడు అవి ఉపయోగాలకు వచ్చుట వలన ఆ దేశ పెట్టుబడి, ఉత్పత్తి ఆదాయంలో అనుకూలమైన మార్పులు వచ్చుట వలన వ్యాపార శేషంలో వారి ప్రభావం ధనాత్మకంగా ఉంటుందని భావించును. ఈ సందర్భాలలో వినియోగ ప్రవృత్తి ప్రధాన పాత్ర వహించును. వినియోగ ప్రవృత్తి ఒకటి కన్నా తక్కువ ఉన్నచో మూల్యన్యూనీకరణ ప్రభావాలు వ్యాపార శేషంపై ఎక్కువ ధనాత్మకంగా ఉండును.

మూల్యన్యూనీకరణ చేసిన దేశంలో వనరుల సంపూర్ణ ఉద్యోగితా స్థితి ఉన్నచో మూల్యన్యూనీకరణ ప్రభావాలు వ్యాపార శేషంపై తక్కువగా ఉంటుంది. అనగా మూల్యన్యూనీకరణ ప్రభావాలు ఆ దేశ వినియోగ శక్తి యొక్క ప్రత్యక్ష ప్రభావాలపై ఆధారపడి ఉండునని అలెగ్జాండర్ పేర్కొనెను.

**12.5.2. వ్యాపార నిబంధనల ప్రభావాలు :** సాధారణంగా మూల్యన్యూనీకరణ ఆ దేశం యొక్క అంతర్జాతీయ వర్తక నిబంధనలపై ప్రతికూల ప్రభావాలను కల్గి ఉంటాయని అర్థశాస్త్రవేత్తల అభిప్రాయం. ప్రతికూల వర్తక నిబంధనల వలన నిజ ఆదాయాలు పడిపోయినచో వినియోగ స్థాయి పడుటవలన లేదా తగ్గుట వలన వ్యాపార శేషంపై అనుకూల ప్రభావము ఉండును. వర్తక నిబంధనలు క్షీణించుటవల్ల నిజ ఆదాయంలో వచ్చు తగ్గుదలను 't' గా పేర్కొనవచ్చు. అపుడు ఆ దేశ వినియోగ స్థాయిలో వచ్చు తగ్గుదల ct కు సమానం అగును. ఇది వ్యాపార శేషములను ధనాత్మక ప్రభావమును పరిగణలోనికి తీసుకొనరాదు. అయినప్పటికి వర్తక నిబంధనలలోని క్షీణిత మొదటిగా వ్యాపార శేషంను కూడా ఋణాత్మకం ద్వారా చేయవచ్చును. కావున వ్యాపార శేషంపై వర్తక నిబంధనల క్షీణిత ప్రభావాలను t - ct లేదా (1 - c) t గా గాని తెల్పవచ్చును. అనగా వర్తక నిబంధనలలోని క్షీణిత సాధారణంగా వ్యాపార శేషంలో కూడా క్షీణింప చేయును. 'c' ఒకటి కన్నా ఎక్కువగా ఉన్నపుడు మాత్రమే క్షీణ వర్తక నిబంధనలు వ్యాపార శేషంపై ధనాత్మక ప్రభావంను చూపునని అలెగ్జాండర్ తెల్పెను.

**12.5.3. వినియోగస్థాయిపై ప్రత్యక్ష ప్రభావాలు :** మూల్యన్యూనీకరణ చేసిన దేశంలో తొలి దశలోనే వనరులు సంపూర్ణ ఉద్యోగిత ఉన్నను లేదా వినియోగశక్తి ప్రవృతి 'c' ఒకటికి సమానం లేదా ఒకటి కన్నా ఎక్కువ ఉన్నచో మూల్యన్యూనీకరణ ప్రభావం విదేశీ వ్యాపార శేషంపై మూల్యన్యూనీకరణ యొక్క ప్రత్యక్ష ప్రభావాలు వినియోగశక్తిపై ఏ విధంగా ఉండునో దానిపై ఆధారపడి యుండును. అనగా వినియోగ శక్తిపై మూల్యన్యూనీకరణ ప్రత్యక్ష ప్రభావాలు వ్యాపార శేషము నిర్ణయించును. వినియోగశక్తిపై మూల్యన్యూనీకరణ ప్రత్యక్ష ప్రభావాలు ఆ దేశంలో ధరల స్థాయి పెరుగుదలకు ప్రధానంగా ఒక ఆదాయ స్థాయి వద్ద వినియోగ పెట్టుబడులను తగ్గించుటకు ధరల స్థాయి పెంచవలసి రావచ్చును. అందువల్ల వినియోగశక్తిపై మూల్యన్యూనీకరణ ప్రత్యక్ష ప్రభావాలను ఈ అంశాలన్నిటిపై ఆధారపడును. అలెగ్జాండర్ తెలిపినదేమనగా వినియోగశక్తిపై ప్రత్యక్ష ప్రభావాలు నిజ వినియోగాలను తగ్గించుటకు ద్రవ్య రూపంలోని ఆదాయాలు, ధరలు పెరుగుటకు దారి తీయును. అనగా మూల్యన్యూనీకరణ యొక్క ప్రత్యక్ష ప్రభావాలు వినియోగ స్థాయిని ఈ రకంగా ధరల రూపంలో ఆదాయాలు, ధరలు పెరుగుదలకు నిజ వ్యయాలు తగ్గుటకు దారితీయును.

పై అంశాల ఆధారంగా మూల్యన్యూనీకరణ యొక్క వినియోగశక్తిపై ప్రత్యక్ష ప్రభావాలు ఈ రకములుగా ఉండవచ్చును.

**(1) నగదు శేషముల ప్రభావం :** ద్రవ్య సరఫరాలో వచ్చు తగ్గుదలలను మరియు ద్రవ్యం కల్గి ఉన్నవారు ఒక నిజ విలువ వద్ద ద్రవ్య నిధులను కల్గి ఉండుటకు ప్రయత్నం చేయుదురు. ఇందుకొరకు వారు నిజ ఆదాయాలతో పోల్చునపుడు నిజ వ్యయాలను తగ్గించుటకు ప్రయత్నం చేయుదురు. అందువల్ల వినియోగశక్తి తగ్గుటకు అవకాశం కలదు.

**(2) ఆదాయ పునఃపంపిణి :** ధరల పెరుగుదల కాలంలో వేతనాలు, లాభాలు వినియోగంలో వేతనాలు పెరిగినప్పటికి లాభాలు ఇంతకన్నా పెరుగుటవలన ఆదాయాలు వివిధ గ్రూపుల మధ్య మారుట వలన వినియోగశక్తి ప్రవృత్తి అధికంగా ఉండే గ్రూపు నుంచి తక్కువగా ఉండే గ్రూపుకు బదిలీ కాబడుతుంది.

**(3) ద్రవ్య భ్రాంతి :** ద్రవ్య భ్రాంతి మూల్యన్యూనీకరణ విషయంలో అనుకూల ప్రభావం చూపుతుంది. ఎందువల్లననగా ప్రజలు ద్రవ్య రూప ధరల కన్నా ద్రవ్య రూప ఆదాయాలకు ఎక్కువ ఆకర్షితులవుతారు. అధిక ధరల వద్ద ప్రజలు తక్కువ కాని తక్కువ వినియోగించుకొనుటకు ప్రయత్నిస్తారు. వారి ద్రవ్య ఆదాయాలలో పెరుగుదల నిష్పత్తి కన్నా వినియోగం తక్కువ ఉంటుంది. అప్పుడు ఆ రెండింటి మధ్య ద్రవ్య శేష ప్రభావాన్ని కల్గి ఉంటుంది. అందువల్ల ద్రవ్య ధరలలో పెరుగుదల విదేశీ వ్యాపార శేషంపై అనుకూలంగా ఉంటుంది.

**12.5.4. ఇతర ప్రభావాలు :** ఇతర ప్రత్యక్ష వినియోగశక్తి ప్రభావాలలో కొన్ని అనుకూలంగాను మరికొన్ని ప్రతికూలంగాను వ్యాపార శేషంపై ఉంటాయి. ఉదాహరణకు ధరల పెరుగుదలపై ఏర్పడు అంచనాలు ఒక్కొక్కసారి వినియోగశక్తిని పెంచవచ్చు. తద్వారా విదేశీ వ్యాపార శేషంపై ఋణాత్మక ప్రభావం స్వల్పకాలంలో చూపును.

అలెగ్జాండర్ పేర్కొనినది ఏమనగా, ఈ ప్రత్యక్ష వినియోగశక్తి ప్రభావాలు కొద్ది కాలమే ఉండవచ్చు. కావున, ద్రవ్య సరఫరా నగదు శేషాలకు ఉన్న డిమాండును బట్టి మారుచుండును. అపుడు నగదు నిల్వల ప్రభావం క్రమంగా అదృశ్యం కావచ్చు. అదే విధంగా ఆదాయ పంపిణీ ప్రభావాలు కూడా ఆదాయాలతో పూర్వాదాయాల పెరుగుదల వలన తగ్గుముఖం పట్టవచ్చు. కొన్ని ప్రభావాలు నిష్పత్తికంగాను ఉండవక పోవచ్చును. ఉదాహరణకు చిన్నపాటి మూల్యన్యూనీకరణ ద్రవ్య భ్రాంతి వలన లాభం పొందవచ్చును. పెద్ద ఎత్తున జరుగు మూల్యన్యూనీకరణ దానిని పొందలేకపోవచ్చును.

**12.5.5. 'J' రేఖ ప్రభావము :** ఈ ప్రభావము మూల్యన్యూనీకరణ వలన కలుగు ప్రత్యేక ప్రభావంగా చెప్పవచ్చు. మూల్యన్యూనీకరణ సాధారణంగా వర్తక నిబంధనలను తొలిదశలలో క్షీణింపజేయును. కొద్దికాలం తర్వాత వర్తక నిబంధనలలో పెరుగుదల వచ్చుటకు అవకాశం కలదు. ఇలా జరుగుటకు గణాంక రూపాలను పరిశీలించినచో వ్యాపార శేషములో వచ్చు మార్పులను రేఖాత్మకముగా పొందుపరచిన మనకు 'J' రూపంలో రేఖ తొలుత క్షీణతను వెనువెంట వర్తక నిబంధనలోని పెరుగుదలను ఈ రేఖ చూపును. ఈ అంశమును 'SP. మాజీ' అను మహాశయుడు 'J' రేఖ ప్రభావంగా విశదీకరించెను. విదేశీ వ్యాపారంలో ఎగుమతి, దిగుమతి కాంట్రాక్టులు ముందుగానే కుదుర్చుకొనుచుందురు. ఆ తరువాత మూల్యన్యూనీకరణ జరుగునపుడు ఎగుమతి కాంట్రాక్ట్ దేశీకరణ రూపంలో ఉన్నచో ఎగుమతులకు తక్కువ విదేశీ ద్రవ్యము వచ్చును. అపుడు వ్యాపార శేషం విదేశీ ద్రవ్య రూపంలో క్షీణించును. ఈ అంశం దిగుమతుల కాంట్రాక్టుల బట్టి కూడా ఉండును. దిగుమతులు విదేశీ ద్రవ్యమారక ద్రవ్య రూపంలో కుదుర్చుకున్నచో మూల్యన్యూనీకరణ తరువాత వ్యాపార శేషంలో క్షీణత వచ్చును. మూల్యన్యూనీకరణ అనంతరం ఏర్పాటు చేసుకొను కొత్త ఎగుమతుల దిగుమతుల కాంట్రాక్టుల ద్వారా తరువాత కాలంలో వ్యాపార శేషములో పెరుగుదల కల్గును.

## 12.6. ద్రవ్య పద్ధతి :

వ్యాకోచత్వ దృక్పధము మరియు ఆదాయ వినియోగ సామర్థ్యం పద్ధతులలో పోల్చినపుడు ద్రవ్య పద్ధతి నూతనమయినదిగా చెప్పవచ్చు. ఎందువలననగా ఇటీవల కాలంలో అంతర్జాతీయ అర్థశాస్త్రంలో ద్రవ్యపరమైన అంశాలు ఎక్కువ ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ముఖ్యంగా విదేశీ చెల్లింపుల శేషం విషయంలో ద్రవ్య పరమయిన అంశాలు ప్రముఖపాత్ర వహిస్తాయి. ఒక దేశ విదేశీ మారకద్రవ్య పరిస్థితికి దేశీయ ద్రవ్య సరఫరా, డిమాండు ముఖ్య నిర్ణాయక అంశాలుగా రూపొందాయి. ద్రవ్య డిమాండులో సాధారణంగా కల్గే మార్పు వ్యాపార శేషంలో మిగులును పెంచుతుంది. అదే విధంగా ద్రవ్య సరఫరాలో పెరుగుదల విదేశీ చెల్లింపుల ఖాతాలో లోటును పెంచుతుంది. అందువలన దేశీయ ద్రవ్య సరఫరాలోని మార్పులు విదేశీ కరెన్సీ నిల్వలపై ప్రభావం చూపుతుంది. అంతర్జాతీయ ద్రవ్య ఆర్థిక అంశాలు ఆస్తుల మార్కెట్లు మరింక ప్రాముఖ్యము కాబోతున్నాయి. ఈ కొత్త సిద్ధాంతము చూపించునదేమనగా ఆస్తులకు గల డిమాండు, సరఫరాలు మరియు ఆస్తుల గురించిన అంచనాలు విదేశీ మారక రేటును నిర్ణయించే అంశాలలో ప్రధానంగా రూపొందాయి.

ఈ ద్రవ్య పద్ధతిలో ద్రవ్యము ప్రధాన భూమిక వహిస్తుంది. విదేశీ చెల్లింపుల ఖాతాను వివరించేటపుడు దానిని వివిధ రకాల ఖాతాలుగా వర్గీకరిస్తారు. అందులో వ్యాపార శేషం, కరెంటు ఖాతా శేషం, కాపిటల్ ఖాతా శేషము ముఖ్యమయినవి. జంట పద్దు విధానంలో ఖాతాలు ఏర్పాటు చేసినపుడు ఆ ఖాతాలో తప్పనిసరిగా సమతౌల్యంలో ఉంచబడుతుంది. ఆ సమతౌల్యం కేపిటల్ ఖాతాలోని సర్దుబాట్ల ద్వారా ఏర్పడుతుంది. విదేశీ చెల్లింపుల ఖాతాలోని మూలధన ఖాతా చివరి భాగంగా ద్రవ్య ఖాతాను పేర్కొంటారు. ఇందు ఆ దేశ విదేశీ మారక నిల్వలు ఉంచబడతాయి. విదేశీ చెల్లింపుల ఖాతాలో మిగులున్నచో విదేశీ నిల్వలు పెరుగుతాయి. అలాకాక లోటు ఉన్నచో విదేశీ మారక నిల్వలు తగ్గుతాయి. అనగా విదేశీ వ్యాపార శేషంలోని మిగులు, లోటు లేదా కరెంటు ఖాతా శేషమును ఆ దేశ ఆస్తుల పరిస్థితిలో

మార్పు తీసుకువచ్చుట ద్వారా కరెంటు ఖాతా శేషమును ఆ దేశ ఆస్తుల పరిస్థితిలో మార్పు తీసుకొనివచ్చుట ద్వారా, మూలధన ఖాతాలో వచ్చు మార్పుల ద్వారా సర్దుబాట్లు జరుగుతాయి. ఈ విధంగా మూలధనఖాతాలో ఆస్తుల అమ్మకాలు కొనుగోలు ప్రధాన పాత్ర పోషించుట ద్వారా అవి మొత్తం విదేశీ చెల్లింపుల ఖాతాపై ప్రభావాన్ని చూపుతున్నాయి. అందువల్ల ఆస్తుల మార్కెటు పరిస్థితి రాను రాను ఎక్కువ ప్రాధాన్యత పొందుతుంది.

విదేశీ చెల్లింపుల ఖాతాలోని మార్పులు దేశీయ ద్రవ్య డిమాండుల ద్వారా నిర్ధారించబడుతున్నాయి. ద్రవ్య సరఫరా పెరిగినచో దేశీయ సంపతి పెరిగి అది విదేశీ చెల్లింపుల ఖాతాలో లోటును సృష్టిస్తుంది. అదే విధంగా ద్రవ్య డిమాండ్లలోని మార్పు చెల్లింపుల ఖాతాలో మిగులును సృష్టిస్తుంది. అందువలన విదేశీ చెల్లింపు ఖాతా సమతౌల్యమునకు ద్రవ్య సరఫరా డిమాండ్లు స్థిరంగా ఉండవలసింది.

మూల్యన్యూనీకరణ విదేశీ చర్యల ప్రభావం కూడా ఆ దేశంలో ద్రవ్య డిమాండు మార్పులు తెచ్చుట ద్వారా ప్రభావితం చేయును. ఈ ద్రవ్య పద్ధతిలో పొదుపు నిలువల పెరుగుదల తగ్గుదల చాలా ప్రధానమైన అంశాలు.

### నగదు నిలువల పెరుగుదల - తగ్గుదల మరియు మూల్యన్యూనీకరణ :

ద్రవ్య పద్ధతిలోని ముఖ్యాంశాలు ఏమనగా మూల్యన్యూనీకరణ ప్రభావం ద్రవ్య డిమాండుపై ఎక్కువగా ఉండును. అందువలన మూల్యహీనీకరణ ఆ దేశంలో దేశీయ ధరలలో వస్తు సేవల ధరలలో పెరుగుదలను తీసుకువచ్చుట ద్వారా ద్రవ్యోల్బణ పరిస్థితులను నెలకొల్పును. అందువల్ల దేశీయ ధరల స్థాయిలో పెరుగుదల వచ్చును. ఈ పెరుగుదల వలన గృహస్థులు, సంస్థలు వారి వారి ద్రవ్య శేషాలను నామినల్ టర్మ్స్ లోపం (సాధారణ స్థాయిలో) వలన నిజ శేషాల ప్రభావం ఎక్కువ అగును. వారు వస్తువులను ద్రవ్యమునకు మారకం చేయుట వలన ద్రవ్య శేషాలను తద్వారా నిజ శేషాలను పెంచుటకు ప్రయత్నం చేయును. దీని వలన వస్తువుల అధిక సరఫరా మరియు విదేశీ చెల్లింపుల ఖాతాలో మిగులు ఏర్పడును.

విదేశీ చెల్లింపుల ఖాతాలోని మిగులు కొద్దికాలం మాత్రమే ఉంటుంది. నగదు నిల్వలు అభిలాషణీయ పరిమాణంలో చేరుకున్న తర్వాత చెల్లింపుల ఖాతాలోని మిగులు అంతరించిపోవును. ద్రవ్య సరఫరాలు వివిధ దేశాల మధ్య పునఃసంపిణీ జరిగినపుడు కొత్త సమతౌల్య స్థితి దీర్ఘకాలంలో ఏర్పడును. దీర్ఘకాలంలో మార్కెట్లు క్రొత్త రూపు సంతరించుకొనును. నగదు నిల్వలు సమతౌల్యమునకు వచ్చును. విదేశీ చెల్లింపుల ఖాతాలు కూడా సమతౌల్యం పొందును. మూల్యన్యూనీకరణ యొక్క దీర్ఘకాల ప్రభావంగా నామినల్ ధరల స్థాయిలో వచ్చు మార్పుగా చెప్పవచ్చు. అదే విధంగా ఆస్తులకు గల డిమాండు, సరఫరాలో వచ్చు మార్పులు విదేశీ మారక రేటును ప్రభావం చేయును. విదేశీ పెట్టుబడిదారులు ఈ దేశపు మారకపు రేటులో తగ్గుదల వస్తుందని అంచనావేసి వారి కార్యకలాపాలు కొనసాగించినపుడు దేశ కరెన్సీ విలువ తగ్గును. ఈ మారక రేట్లలోని మార్పులు వినియోగ స్థాయిని ప్రభావితం చేయును. విదేశీ మారకపు రేట్లలో తరచూ జరుగు మార్పు దేశీయంగా ఎన్నో మార్పులను తీసుకొనివచ్చును. అందువల్లనే వివిధ దేశాలు విదేశీ మారక నియంత్రణను ద్వంద్వ మారకపు రేట్లను అనుసరించుట జరుగుతుంది.

## 12.7. మారకపు నియంత్రణ

విదేశీ వ్యాపారంలో ఆయా దేశాల వర్తక నిబంధనలలో ఏర్పడు అస్థిర పరిస్థితులను నివారించుటకు దేశీయంగా తీసుకునే ప్రధాన చర్య మారకపు నియంత్రణలు. అస్థిరమయిన మారకపు రేట్లు విదేశీ వర్తకంలో పెట్టుబడులలో ఒక్కొక్కపుడు అనిశ్చయత ప్రభావం కల్గించవచ్చు మరోవైపు మారకపు రేట్లలో కదలికలు (Movements in exchange rates) ఆర్థిక కార్యకలాపాలలో కొన్ని మార్పులకు దోహదం చేస్తూ ఎగుమతిదారులు, దిగుమతిదారులకు వారి వ్యాపార కార్యకలాపాల అభివృద్ధి కొరకు కొన్ని సరైన సంకేతాలను అందజేస్తుంది. మారకపు రేట్లను స్థిరీకరించడం ఒక దేశం అవసరాలకు కావలసిన రిజర్వుల కొరకు ఉపయోగించవచ్చు. ఈ రిజర్వులలో కొంత భాగం దేశీయ పెట్టుబడి కొరకు ఉపయోగించవచ్చు. ఈ రకమయిన పెట్టుబడుల క్రింద అంతర్జాతీయ నిల్వల క్రింద వచ్చే ఆదాయాల మధ్య

తేడాలను ఉపయోగించి రిజర్వుల సమయోచిత వ్యయాన్ని కొలుచుటకు అవకాశముంటుంది. మొత్తం మీద మారకపు నియంత్రణలు దేశ విదేశీ వ్యాపారంపై ప్రభావాన్ని చూపుతాయి. మారకపు నియంత్రణలు అనునది ఆ దేశ కరెన్సీ విలువను తగ్గించుట లేదా పెంచుటకు సంబంధించిన అంశాలు. కాబట్టి మారకపు నియంత్రణ తీరు మరియు విధానాలను తెలుసుకొనుట అవసరం ఉంది. ఏ దేశ కరెన్సీ అయినా సరే యితర దేశాల కరెన్సీలతో పోల్చుకుంటే విలువ తగ్గినపుడు ఆ దేశం కరెన్సీ తరుగుదలగాను విలువ పెరిగినపుడు ఆ దేశ కరెన్సీ పెంపుదలగా భావిస్తారు. ఈ తరుగుదల మరియు పెంపుదలలు, కరెన్సీ మారకపు నియంత్రణలపై ఆధారపడి ఉంటాయి. తరుగుదలకు బదులుగా మూల్యన్యూనీకరణను తరచుగా ఉపయోగిస్తుంటారు. పెరుగుదలకు బదులుగా పునర్మూల్యాంకనాన్ని ఉపయోగిస్తారు. మూల్యన్యూనీకరణ అనగా బంగారు ధరకు పోల్చుకుంటే ఒక కరెన్సీ విలువను తగ్గించడం అయితే అన్ని కరెన్సీలు బంగారంతో అనుబంధంగా ఒకే శాతం రేటులో తమ కరెన్సీ విలువలను తగ్గించినపుడు ప్రపంచ వ్యాప్తంగా మూల్యన్యూనీకరణ జరిగిందని చెప్పవచ్చు. కాని అన్ని సందర్భాలలో ఇది సాధ్యం కాకపోవచ్చు. అందువల్ల ఏదో ఒక దేశ మూల్యన్యూనీకరణను తెలుసుకుంటే మారకపు నియంత్రణ తెలుసుకోవచ్చు.

ఒక దేశం కరెన్సీ మారకపు రేటు, ఒక స్వేచ్ఛా విదేశీ మారకపు మార్కెటులో డిమాండు, సరఫరా అంశాలమీద ఆధారపడి ఉంటుంది. అయినప్పటికీ డిమాండు, సరఫరా పరిస్థితుల్లో మార్పువల్ల విదేశీ మారకపు రేట్లలో కూడా తరచుగా మార్పులు ఏర్పడుతుంటాయి. ఈ మార్పులు రెండు దేశాల మధ్య అంతర్జాతీయ వ్యాపారంలో, మూలధన మార్పిడిలో కొన్ని అసౌకర్యాలు కలిగిస్తాయి. ఈ విధమయిన మార్పుల వల్ల అంతర్జాతీయ చెల్లింపుల్లో అనిశ్చయత, రిస్కు ఇమిడి ఉన్నాయి. ఈ కారణాల వల్ల పెట్టుబడి దేశాల్లో కూడా మారకపు రేట్లో హెచ్చుతగ్గులు నియంత్రించే ప్రయత్నం చేసారు. ప్రణాళికాబద్ధమైన ఆర్థిక వ్యవస్థలో ఆ విధమయిన నిబంధనలు స్పష్టంగాను ప్రత్యక్షంగాను ఉంటాయి.

ప్రముఖ ఆర్థికవేత్త పాల్ ఇన్‌జిగ్ (Paul Einzig) మారకపు కంట్రోల్ నిబంధనలు / నియంత్రణలు అనగా ఒక దేశంలో కేంద్ర బ్యాంకు అమలు పరచేటటువంటి అన్ని విధానాలు, మారకపు రేట్లను, మార్కెట్లను ఇతర అంశాలను ప్రభావితం చేయడం. మరోలా చెప్పాలంటే ప్రభుత్వ అధిపత్యంలో విదేశీ మారకపు మార్కెటు కొన్ని నిబంధనలకు లోబడి పనిచేయడం. ఒక దేశ ప్రభుత్వం విదేశీ మార్కెటులోని వ్యవహారాలను నియంత్రించుటకు అనేక విధానాలను ఉపయోగించవచ్చు. మారకపు నిబంధనల యొక్క ముఖ్య లక్షణాలు క్రింది విధంగా ఉన్నాయి.

విదేశీ మారకపు మార్కెటు మీద ప్రభుత్వానికి పూర్తి ఆధీనం ఉంటుంది. ప్రత్యేకంగా లైసెన్సు పొందిన ఒక వ్యక్తి గాని లేక సంస్థగాని విదేశీ మారకపు వ్యాపారం చేయబడుతుంది. సరియైన లైసెన్సులతో కొందరు వ్యక్తులుగాని విదేశీ వ్యాపారం చేయడం (ఎగుమతి దిగుమతులు) జరుగుతుంది. ప్రభుత్వం దిగుమతులను నియంత్రించవచ్చు. ఒక్కొక్క తరగతి దిగుమతి వస్తువుల ప్రాధాన్యతను బట్టి అనేక మంది దిగుమతిదారులకు విదేశీ మారక ద్రవ్యాన్ని కేటాయించుటకు వీలుకలదు. మూలధనం ఎగుమతి పూర్తిగా ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఉంటుంది. విదేశీ మారకపు రేటు ప్రభుత్వం చేత నిర్ణయింపబడుతుంది. అనగా మార్కెటు శక్తులైన విదేశీ మారక డిమాండు, సప్లయి పరిస్థితులు విదేశీ మారకపు రేటును నిర్ణయించడానికి అనుమతించడం జరుగదు.

వీటితో పాటుగా మారకపు నిబంధనల ముఖ్య ఉద్దేశాలు ప్రధానంగా ఇలా ఉన్నాయి. చెల్లింపుల శేషంలో ప్రతికూలతను సరిదిద్దుట, చెప్పిన ప్రకారం దిగుమతులను తగ్గించడం ద్వారా చెల్లింపుల శేషంలో ప్రతికూలతను సరిదిద్దుట కొరకు మారకపు నిబంధనలను ఉపయోగించవచ్చు. మారకపు రేటును అధికం చేయడం ద్వారా లేదా వర్తకపు షరతుల్లో ఎగుమతి దిగుమతుల్లో అవసరమైన ఫలితాలను పొందవచ్చు. మూలధన ఫ్లోస్ నియంత్రించడం, ఒక్కొక్కప్పుడు అక్రమమైన ఎక్కువ మొత్తంలో ఒక దేశం నుంచి మూలధనం ఇంకోదేశానికి తరలిపోవడం ఆర్థిక స్థిరత్వానికి చెల్లింపుల శేషంలో సమతౌల్య పరిస్థితికి ఒక పెద్ద సమస్యగా ఉంటుంది. అట్టి పరిస్థితుల్లో మారకపు నిబంధనలు ఒక దేశం నుంచి మరొక దేశానికి మూలధన ఫ్లోని సమర్ధవంతంగా నియంత్రించవచ్చు. అంతర్జాతీయ ద్రవ్య సంస్థ కూడా ఈ సమస్యను క్రమబద్ధంలో ఉంచుటకు మారకపు నిబంధనలను ఉపయోగించ వీలుంటుంది.

చాలా దేశాల్లో విదేశీ మారకపు నిల్వల రక్షణ కొరకు దీనిని అమలు పరుస్తారు. పరిమితంగా ఉన్నటువంటి విదేశీ మారక ద్రవ్యం వల్ల ఆర్థికాభివృద్ధి మందకొడిగా ఉంటుంది. ప్రస్తుతమున్న రిజర్వులు పెరుగుతున్న దిగుమతి అవసరమున్న ఖాళీ అయిపోవడం జరుగుతుంది. ఈ దేశ ప్రభుత్వాలు సాధారణంగా తమ వద్ద ఉన్న రిజర్వులను జాగ్రత్తగా ఉపయోగించుట కొరకు విదేశీ మారకపు నిబంధనలను అమలు చేస్తున్నాయి. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో విదేశీ మారక నిల్వల రక్షణ అనేది మారకపు నిబంధనల ముఖ్య ఉద్దేశమయింది. విదేశీ మారకపు రేట్లలో స్థిరత్వం కొరకు కూడా మారకపు నియంత్రణలను అమలుపరుస్తారు. ఒక దేశం ఉత్పత్తులను విదేశీ పోటీల నుంచి రక్షించుటకు కొన్ని ఉత్పత్తులను దిగుమతి చేసుకోకుండా నియంత్రించడం లేక దేశంలో ఉత్పత్తి అవుచున్న వస్తూత్పత్తిని ప్రోత్సహించుటకు దిగుమతులను పూర్తిగా ఆపివేయవచ్చు. సమర్థవంతమైన ఆర్థిక ప్రణాళిక కొరకు కూడా మారకపు నిబంధనలను పాటించవచ్చు. ప్రభుత్వ పథకాలు విజయవంతమగుటకు విదేశీ వర్తకం, కాపిటల్ ఫ్లో ను నియంత్రించుట అవసరంగా భావిస్తారు. యుద్ధ పరికరాల కొనుగోలు తగ్గించుటకు మారకపు నియంత్రణను ఉపయోగిస్తారు. ఒక దేశానికి అధిక మొత్తంలో బహిర్గత రుణం ఉన్నపుడు ఈ రుణభారాన్ని దీని వల్ల తగ్గించుటకు అవకాశముంటుంది.

మారకపు నిబంధనలు వివిధ రూపాల్లో ఉంటాయి. మారకపు నిబంధనలు ఏకపక్షంగా ఇతర దేశాల ప్రమేయం లేకుండా జరిగినట్లయితే దానిని ఏకపక్ష పద్ధతులని పేర్కొంటారు. దీనిలో ప్రధానమయినది బ్యాంకురేటు, విదేశీ వర్తకాన్ని క్రమబద్ధం చేయడం, మారకపు రేట్లను స్థిరీకరించడం, విదేశీ మారకపు ద్రవ్య రేషనింగ్ వంటివి విదేశీ ప్రభుత్వం ప్రమేయం లేకుండా అమలుజేస్తారు. అలా కాకుండా రెండు లేదా అంతకంటె ఎక్కువ దేశాలు మారక వ్యవహారంలో ఉంటే దానిని ఉభయ పక్షయ లేదా బహు పక్షయ పద్ధతని అంటారు. కాలనుగుణంగా రేట్లలో మరిన్ని మార్పులు సంభవించును. ఒకే విధమయిన, సంబద్ధీకరించిన తరుగుదల విధానం ఒక ప్రక్క ప్రవేశపెట్టుట వల్ల పోటీదార్ల మీద ఆర్థిక వ్యవస్థలో భిన్నంగా ఉంటుంది. ఈ భిన్నత్వం తరుగుదల వ్యవస్థ ఆమోదించే వరకు ఉంటుంది.

మొదటి ప్రపంచయుద్ధం అయిన తరువాత మారకపు నిబంధనల నివారణోపాయాలు మొదటిగా ఫాసిస్టు ప్రభుత్వాలు అయిన ఇటలీ, జర్మనీ దేశాలలో అమలుచేసారు. తరువాత కాలంలో ముఖ్యంగా మాంద్య కాలంలో చాలా ప్రభుత్వాలు విదేశీ మారకరేట్లను చక్కదిద్దుటకు కొన్ని నిబంధనలను అమలు పరిచాయి. మారకపు నిబంధనలు ఈనాటి పరిస్థితులలో ప్రణాళికాబద్ధమయిన దేశాల్లోనే కాకుండా సామ్యవాద, పశ్చిమ దేశాల్లో తమ జాతీయ ఆర్థిక విధానాల్లో ఒక ముఖ్యమైన భాగంగా ప్రాముఖ్యత సంతరించుకుంది.

## 12.8. సారాంశము :

విదేశీ వ్యాపారంలో వచ్చు ప్రతికూల ప్రభావాలు గాని, లోటునుగాని తగ్గించి ఎగుమతుల వృద్ధిని పెంచు ప్రక్రియలో భాగమే మూల్యన్యూనీకరణ. మూల్యన్యూనీకరణ వల్ల ఎగుమతి మరియు దిగుమతులలో వచ్చు ప్రభావాలు దేశీయ ఆర్థిక పరిస్థితులకు ప్రయోజనకారిగా ఉండేలా జాగ్రత్త వహించాలి. ఎగుమతులలో మార్పులు మూల్యన్యూనీకరణ వల్ల ఎగుమతి ధర మరియు డిమాండు వ్యాకోచత్వ విలువలను పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుంది. అలాగే దిగుమతుల విషయంలో కూడా మూల్యన్యూనీకరణ వల్ల సంభవించే ఫలితాలను దేశీయ ఆర్థికాభివృద్ధికి లాభం చేకూరేదిగా ఉండాలి. మార్షల్ మరియు లెర్నర్ అవ్యాకోచత్వ భావాలు మూల్యన్యూనీకరణ విధానాలను మరింతగా అర్థమయ్యేరీతిలో కొనసాగినవి. దిగుమతి డిమాండుల వ్యాకోచత్వం శూన్యమయినప్పటికీ ఎగుమతి డిమాండు వ్యాకోచత్వం 1 కన్నా ఎక్కువగా ఉన్నచో శూన్య (0) దిగుమతి వ్యాకోచ స్థితి వద్ద కూడా మూల్యన్యూనీకరణ సత్ఫలితాలను ఇస్తుందని పేర్కొనడం విదేశీ వ్యాపార విధానాలకు మరింత ప్రోత్సాహకాన్ని ఇవ్వడం జరిగింది. దీనితో పాటుగా మూల్యన్యూనీకరణ విధానం వల్ల ఆదాయ మరియు వ్యయశక్తి పద్ధతి ద్వారా వివిధ సిద్ధాంతాల విశ్లేషణ అంతర్జాతీయ వ్యాపారంలో మరో ముఖ్యాంశం. అలెగ్జాండర్ మహాశయుని ప్రకారం మూల్యన్యూనీకరణ వల్ల దేశీయంగా గల అనుపయోగ వనరులను వినియోగించి వ్యాపార శేషంలో ధనాత్మక ప్రభావాలను పొందవచ్చుని చెప్పవచ్చు. వీటితో పాటుగా విదేశీ వ్యాపారంలో వర్తక నిబంధనలలో ఏర్పడ్డ అస్థిర చర్యలను ద్రవ్య మారకపు రేటు నియంత్రణల ద్వారా సమతౌల్య స్థాయిని చేరుకొను అవకాశం ఉన్నట్లు ప్రపంచ దేశాల గత ఆర్థిక వ్యవస్థల నడవడికల అనుభవ పూర్వకంగా చెప్పవచ్చే.

## 12.9. ముఖ్య పదాలు

1. మూల్యన్యూనీకరణ : ద్రవ్య విలువను అధికారికంగా ఆయా దేశాలు తగ్గించుట

2. మిగులు వనరులు : అనుపయోగ వనరులను మిగులు వనరులుగా పేర్కొంటారు. వీటి ద్వారా ఎగుమతులను పెంచుటకు వీలుంటుంది

3. నగదు నిల్వల శేషము :

4. మారకపు నియంత్రణ : విదేశీ వ్యాపార వ్యవహారాలలో ఎగుమతి దిగుమతులను నియంత్రించుటకు ద్రవ్య విలువను ఇతర దేశాల కరెన్సీ మార్పు చేయుటలో నియంత్రించుట

5. స్థిర మారకపు రేట్లు : ఇతర దేశాల కరెన్సీతో పోల్చినపుడు స్థిరమయిన విలువను ఎక్కువ కాలం పాటు స్థిరంగా ఉంచుట

6. అభిలాషణీయ మారకపు రేటు : దేశాల పరిస్థితులను బట్టి ఆయా దేశాల కరెన్సీ విలువ మార్పులుకు లోను కాకుండా ఉంటుంది. కొన్ని సందర్భాలలో మార్కెటు పరిస్థితులను బట్టి స్థిరంగాను కొన్ని సందర్భాలలో ధృడత్వాన్ని కలిగి ఉంటుంది.

## 12.10. స్వయం సమీక్షా ప్రశ్నలు :

1. మూల్యన్యూనీకరణ అనగానేమి ? దానిని మదించు లేదా కొలుచు పద్ధతులను వివరించండి

2. ఎగుమతి దిగుమతులపై మూల్యన్యూనీకరణ ప్రభావాలు మరయు మార్షల్, లెర్నర్ పరిస్థితి నిబంధనలను వ్రాయండి

3. ఆదాయంపై మూల్యన్యూనీకరణ వల్ల కలిగే వివిధ ప్రభావాలను వ్రాయండి

4. J రేఖపై వివరణ ఇవ్వండి

5. ద్రవ్య పద్ధతి - నగదు విలువల తగ్గుదల పెరుగుదలపై మూల్యన్యూనీకరణ విధానాన్ని వివరించుము

6. మారకపు నియంత్రణలు విదేశీ వ్యాపారంపై గల విధానాలను చర్చించండి

## 12.11. చదువవలసిన పుస్తకములు


1. B.O. Sodesten and Geoffrey Read : International Economics
2. J.E. Meade : The Balance of Payments
3. Mannur H.G. : International Economics
4. Chacholiades M. : International Economics
5. Francis Cherunilam : International Economics.
6. Kindleberger : International Economics

పాఠం - 13

# విదేశీ వ్యాపారము మరియు జాతీయాదాయం విదేశీ వ్యాపార గుణకము.

**లక్ష్యం :**

ఈ పాఠ్యభాగమునందు ఈ క్రింది అంశాలను వివరించాము. వీటిని చదువుట ద్వారా విదేశీ వ్యాపార చెల్లింపులు మరియు క్రింది అంశాలు చర్చించడమైనది.

☆ నియమిత ఆర్థిక వ్యవస్థ, మరియు సమతౌల్య ఆదాయ పరిస్థితులు

☆ బహిర్గత ఆర్థిక వ్యవస్థలో విదేశీ వ్యాపారం మరియు జాతీయాదాయ సమతౌల్య స్థితి

☆ విదేశీ వ్యాపారం మరియు విదేశీ వ్యాపార గుణక ప్రభావం

☆ చెల్లింపుల శేషము మరియు జాతీయాదాయంలో మార్పులు

☆ గుణక ప్రభావం ఎగుమతి దిగుమతులపై ఏ విధంగా ఉంటుంది మొదలైన అంశాలు వివరించాము.

**విషయసూచిక :**


13.1 పరిచయము

13.2 నియమిత ఆర్థిక వ్యవస్థలో జాతీయాదాయ (సమతౌల్య) నిర్ణయం

13.3 జాతీయాదాయంపై పెట్టుబడుల పెరుగుదల వల్ల కలిగే ప్రభావాలు

13.4 బహిర్గత ఆర్థిక వ్యవస్థలో జాతీయాదాయ నిర్ణయం

13.4.1. దిగుమతి ఫలము (ఇంపోర్టు ఫంక్షను)

13.4.2. దిగుమతుల ఆదాయ డిమాండు వ్యాకోచత్వం

13.5 బహిర్గత ఆర్థిక వ్యవస్థలో జాతీయాదాయ నిర్ణయం - విదేశీ వర్తక గుణకము

13.5.1. విదేశీ వర్తక గుణకము

13.5.2. దిగుమతి మరియు ఎగుమతుల విదేశీ వ్యాపార గుణకము

13.5.3 ఎగుమతుల్లో స్వయం ప్రతిపత్తి - జాతీయాదాయంలో మార్పు.

13.6 జాతీయాదాయం మరియు చెల్లింపుల శేషం సమతౌల్యం

13.7 సారాంశము

13.8 ముఖ్య పదాలు

13.9 నమూనా ప్రశ్నలు

13.10 చదువదగిన గ్రంథాలు

## 13.1 పరిచయము :

విదేశీ వ్యాపారంలో పాల్గొనని నియమిత ఆర్థిక వ్యవస్థలో (Closed Economy) జాతీయాదాయం దేశీయంగా ఉత్పత్తి అయిన వస్తుసేవల విలువలను బట్టి నిర్ణయింపబడును. విదేశీ వ్యాపారంలో పాలుపంచుకునే బహిర్గత ఆర్థిక వ్యవస్థలలో (Open Economy) జాతీయాదాయము ఖాతాకు అనుబంధము చేయవలసి యుండును. అనగా విదేశీ చెల్లింపుల ఖాతాలోని వికర పరిస్థితులను బట్టి బహిర్గత ఆర్థిక వ్యవస్థలలో జాతీయాదాయము నిర్ణయింపబడును. అనగా ఒక దేశం చెల్లింపుల శేషంలో మిగులుగాని లోటుగాని ఉండుట అంత శ్రేయస్కకరం కాదు. మిగులు ఉన్నట్లయితే దేశంలోని వనరులకు అధిక డిమాండు వల్ల వత్తిడి ఏర్పడుతుంది. దీని వలన దేశంలో వేతనాలు, ధరలు పెరుగుతాయి. అయినప్పటికీ చెల్లింపుల శేషంలో మిగులు ఎగుమతుల పెరుగుదల వలన కలుగుట వలన ఎగుమతి వస్తు పరిశ్రమలలో డిమాండు పెరిగి మొత్తం ఉత్పత్తి, ఉద్యోగిత, ఆదాయాలపై అనుకూల ప్రభావం చూపును. తద్వారా ఎగుమతులలో పెరుగుదల కొన్ని రెట్లు దేశీయ ఆదాయమును పెంచుట ద్వారా దేశీయాభివృద్ధికి సహకరించును. అదే విధంగా చెల్లింపుల శేషంలోని లోటు దేశీయ ఆర్థిక వ్యవస్థలపై ఋణాత్మక ఫలితాలను ప్రసరింపజేయును. ఈ అంశాలను విశదీకరించుటకుగాను కీన్సు మహాశయుడు చెప్పిన సిద్ధాంతాలలో జాతీయాదాయంలో సమతౌల్య స్థితి ఏ విధంగా ఏర్పడుతుందనేది ప్రధానమైన అంశమైనది. ఈ నేపధ్యంలో ఈ పాఠంలో మనము విదేశీ చెల్లింపుల శేషము లేదా విదేశీ వ్యాపారం జాతీయాదాయంపై చూపు ప్రభావాలను కీన్సు మహాశయుని విదేశీ వ్యాపార గుణకం భావన ఆధారంగా చర్చిద్దాము.

ఒక దేశం యొక్క ఆర్థికాభివృద్ధిని నిర్ధారించే అంశాల్లో ప్రధానమయినదిగా ఆ దేశం యొక్క జాతీయాదాయాన్ని పేర్కొంటారు. జాతీయాదాయం అనునది వివిధ రంగాల నుండి పొందిన మొత్తం ఆదాయాలు. ఆయా దేశాల యొక్క ఆర్థిక విధానాలు మరియు ఆర్థిక వ్యవస్థ స్వరూపాలు జాతీయాదాయంపై ప్రభావం చూపుతాయి. జాతీయాదాయం సమతౌల్య స్థితిలో ఉండుటలో ఆర్థిక వ్యవస్థలో స్వరూపం మరియు స్వభావాల యొక్క ప్రభావాలే ఎక్కువ. ఆర్థిక వ్యవస్థ స్వరూపాన్ని సాధారణంగా నియమిత ఆర్థిక వ్యవస్థ (Closed Economy) గాను అనగా విదేశీ వర్తకంలేని ఆర్థిక వ్యవస్థగాను మరియు బహిర్గత ఆర్థిక వ్యవస్థగాను అనగా విదేశీ వర్తకం కలిగిన (Open Economy) ఆర్థిక వ్యవస్థగాను పేర్కొంటారు. జాతీయాదాయ సమతౌల్య విశ్లేషణలో సాంప్రదాయ మరియు ఆధునిక ఆర్థిక వేత్తల మధ్య వ్యత్యాసాలున్నాయి. వీటి గురించి క్లుప్తంగా తెలుసుకుందాం.

## 13.2 నియమిత ఆర్థిక వ్యవస్థలో జాతీయాదాయ (సమతౌల్యము) నిర్ణయం

నియమిత ఆర్థిక వ్యవస్థలు అనగా ఇతర దేశాలతో ఎటువంటి విదేశీ వ్యాపార సంబంధాలు లేని దేశాల ఆర్థిక వ్యవస్థలు. ఒక దేశంలో ఉత్పత్తి అయిన వస్తువుల మరియు సేవలు మొత్తాన్ని ఆర్థిక పరిభాషలో జాతీయోత్పత్తిగా పేర్కొంటారు. దేశంలో కొనసాగించే ప్రతి ఉత్పాదకత సేవ ఆదాయాన్ని సమకూర్చుతుంది. ఇలా అన్ని విధాలా ఆర్జించిన ఆదాయాలను కలిపితే జాతీయాదాయం వస్తుంది. నియమిత ఆర్థిక వ్యవస్థలో జాతీయాదాయ ఉత్పత్తి మరియు జాతీయాదాయం అనే అంశాలు విడదీయలేనివి మరియు ఒక నాణానికి గల రెండు ప్రక్కలుగా పేర్కొనడం సాధారణంగా జరుగుచున్నది. నిర్వచనాల రుపేణా కూడా జాతీయోత్పత్తి జాతీయాదాయానికి సమానం. ఉత్పత్తిని చలామణిలో ఉన్న ద్రవ్య కొలమానంలో చూచినట్లయితే జాతీయాదాయ తీరుతెన్నులు తెలుస్తాయి.

జాతీయాదాయాన్ని అనేక రూపాల్లో వివరించవచ్చు. ప్రజలు మరియు ఇతర సంస్థలు జాతీయ ఉత్పత్తిని కలిగి ఉంటారు. అంటే జాతీయ ఉత్పత్తిని కలిగిన (దేశం) ప్రజలు జాతీయ ఉత్పత్తిని వినియోగానికి మరియు పెట్టుబడికి వినియోగిస్తారు. మరోలా చెప్పాలంటే జాతీయాదాయం వినియోగానికి మరియు పెట్టుబడికి దారి తీస్తుంది. అంతేకాక వినియోగంతో పాటుగా పొదుపు చేయుటకు కూడా ఉపయోగిస్తారు. ఇలా జాతీయాదాయం వివిధ ఉపయోగాలకు ఉపయోగించినప్పటికీ వాటి మొత్తాలు జాతీయోత్పత్తికి సమానమవుతాయి. ఈ విషయాలను క్రింది (సిద్ధాంతం) సూత్రము ద్వారా తెలుసుకోవచ్చు.

$Y = C + 1$

లేదా


∴ Y = C + S

లేదా

Y = (C+1) = (C+S) ఈ సమీకరణలో Y జాతీయాదాన్ని సూచించగా 'C' వినియోగించబడిన స్థాయి లేదా చేయబడిన వస్తువుగా పేర్కొనవచ్చు. I (Investment) పెట్టుబడిని, S పొదుపు మొత్తాలను తెలుపుతాయి.

సమీకరణను పరిశీలించినట్లయితే క్రింది అంశాలు గోచరిస్తాయి. జాతీయాదాయాల మొత్తము వినియోగం మరియు పొదుపులు, లేదా వినియోగం మరియు పొదుపులు పెట్టుబడిగా పెట్టబడిన దానికి సమానమని చెప్పవచ్చు. పొదుపు మొత్తాలు పెట్టుబడి మొత్తాలకు సమానంగా ఉంటాయి. కనుక I = S సమానమని చెప్పవచ్చు. ఈ రెండింటి మొత్తం జాతీయాదాయానికి సమానము. ఈ విషయాన్ని క్రింది పటంలో గమనించవచ్చు.

**పటము 1**




జాతీయాదాయంలో వినియోగానికిపోగా మిగిలిన ఆదాయాన్ని పొదుపు చేస్తారని భావించినట్లయితే సాంప్రదాయవాదులు భావించినట్లుగా ఆ పొదుపు పెట్టుబడిగా ప్రవహిస్తుంది. జాతీయాదాయంలో వినియోగానికి పోగా (పటంలో O నుండి $Y_0$ వరకు గల భాగం) మిగిలిన ఆదాయం పొదుపు చేయబడి E బిందువు వద్ద పెట్టుబడికి సమానమయింది. ఈ విధంగా జాతీయాదాయం సమతౌల్యానికి చేరుకుంటుంది. గమనించవలసిన విషయమేమనగా, వినియోగదారులు ఎంత మొత్తంలో పొదుపు చేస్తారో అదే మొత్తంలో ఉత్పత్తిదారులు పెట్టుబడి పెట్టుటకు సంసిద్ధత తెలియజేసినపుడే జాతీయాదాయం సమతౌల్య స్థితిలో ఉంటుంది. అదే విధంగా పెట్టుబడులలో పెరుగుదల జాతీయాదాయంపై ప్రభావం చూపుతుంది. అందువల్ల పెట్టుబడులలో పెరుగుదల జాతీయాదాయంపై దాని ప్రభావాన్ని పరిశీలించుట అవసరము.

## 13.3. జాతీయాదాయంపై పెట్టుబడుల పెరుగుదల వల్ల కలిగే ప్రభావం

పైన తెలిపిన విధంగా వినియోగదారులు ఎంత మొత్తంలో పొదుపు చేస్తారో అదే మొత్తంలో ఉత్పత్తిదారులు పెట్టుబడి పెట్టుటకు సంసిద్ధత తెలియజేసినచో అపుడు జాతీయాదాయం సమతౌల్య స్థితిలో ఉంటుంది. ఇక్కడ సమతౌల్యమనగా ఇచ్చినటువంటి జాతీయాదాయంలో మార్పుకు అవకాశం లేనిదిగా భావించాలి. ఉత్పత్తి కాబడిన వస్తురాశి విలువ మొత్తం ప్రణాళికాబద్ధంగా నిర్ధారించుకొన్న

వినియోగానికి సమానంగా ఉంటుంది. మరలా చెప్పాలంటే వినియోగదారులు తమకు వచ్చే ఆదాయాన్ని రెండు విధాలుగా ఖర్చుపెడతారు. అవి.


1. వినియోగంపైన ఖర్చు

2. పొదుపు కేటాయింపులు

పొదుపు అనేది ఆదాయంలో భాగం. అందువల్ల దీనిని S = F (Y) గా వ్రాస్తారు (గణితీయ అంశాల్లో). పొదుపు పెరుగుదల వల్ల జాతీయాదాయం మీద ప్రభావం కనిపిస్తుంది. ఆదాయాలు పెరిగితే పొదుపు పెరుగుతుంది. అంతేగాని తక్కువ ఆదాయ స్థాయి వద్ద పొదుపు ఉండక పోవచ్చు. రేఖా పటంలో 'X' అక్షానికి పొదుపురేఖ ఖండించిన చోట దీనిని గుర్తించవచ్చు. పొదుపు తగ్గుదల వినియోగ స్థాయిలో పెరుగుదలను, మరియు మూలధన సంచయనం భాగం తగ్గుదలను వివరిస్తుంది.

పెట్టుబడి అంశాన్ని ఆదాయంతో పోల్చుకుంటే స్వతంత్ర ప్రతిపత్తి కలిగి ఉన్నపుడు జాతీయాదాయంలో హెచ్చుతగ్గులు ఉన్ననూ, ఒక స్థిరమైన మొత్తం పెట్టుబడిగా ఉంటుంది. పెట్టుబడి షెడ్యూలు రేఖ ప్రణాళికా బద్ధమయిన పెట్టుబడి మొత్తాలను తెలుపుతుంది. ఈ విధంగా ప్రణాళికా బద్ధమయిన పొదుపు మరియు క్రింది పటంలో ఈ అంశాలను గమనించవచ్చు.


**పటము 2**




పొదుపు షెడ్యూలు S రేఖాపటంలో చూపిన విధంగా సమాంతర అక్షాన్ని ఖండించిన చోట పొదుపు Zero కు సమానం. ఈ పాయింట్ వద్ద జాతీయాదాయాన్ని తెలియజేస్తుంది. ఇది $Y_0$ పాయింట్ వద్ద ఉంది. జాతీయాదాయం ఈ పాయింట్ కంటే క్రిందకు పడిపోయినచో పొదుపు మొత్తాలు ప్రతికూలమవుతాయి. పెట్టుబడి అంశాన్ని ఆదాయంతో పోల్చుకుంటే స్వతంత్ర ప్రతిపత్తి కలిగి ఉన్నపుడు జాతీయాదాయంలో హెచ్చుతగ్గులు ఉన్నప్పటికీ ఒక స్థిరమయిన మొత్తం పెట్టుబడిగా ఉంటుంది. ఇది గణితీయంగా $I_0$ = స్థిరంగా చెబుతారు. పొదుపు పెట్టుబడులు $Y_1$ పాయింటు వద్ద జాతీయాదాయంలో సమతౌల్యతను తెలియజేస్తుంది.

వినియోగదారుల నడవడికలో మార్పులున్నాయని భావిస్తే, తద్వారా పెట్టుబడిదారుల ఊహల్లో మార్పులు వచ్చి పెట్టుబడి పథకాల్లో మార్పులు సంభవిస్తాయి. ఉత్పత్తిదారులు ఎక్కువ పెట్టుబడి పెట్టుటకు నిర్ణయిస్తే పెట్టుబడి రేఖ పైకి పోయే ధోరణిలో ఉంటుంది. క్రింది పటం చూడండి.

పటము 3




పెట్టుబడిలో పెరుగుదల ($\Delta I$) తెలియజేస్తే కొత్త పెట్టుబడి షెడ్యూలు $I_0 + \Delta_1$ అవుతుంది. దీని ఫలితంగా జాతీయాదాయం $Y_1$ నుండి $Y_1 + \Delta Y$ కు పెరుగుతుంది. పెట్టుబడుల ద్వారా ఆదాయాలు పెరుగుతాయని భావిస్తే, ఉత్పత్తి ప్రక్రియలో అవసరమయిన మెటీరియల్స్ కావలసి ఉంటుంది. అపుడు యంత్ర సామాగ్రి, ఇతర వస్తువులకు ఆర్డర్లు పెట్టవలసి వస్తుంది. అంతేకాక శ్రామికులకు డిమాండు ఏర్పడుతుంది. దీని వల్ల అనగా స్వయం ప్రతిపత్తిగల పెట్టుబడిలో పెరుగుదల జాతీయాదాయంపై ప్రభావం చూపి పెట్టుబడిలో పెరుగుదల కన్నా జాతీయాదాయంలో పెరుగుదల ఎక్కువగా ఉంటుంది. పై పటంలో పెట్టుబడిలో పెరుగుదల ($I_0$ నుండి $\Delta I$) కన్నా జాతీయాదాయంలో పెరుగుదల ($Y_1$ నుండి $\Delta Y$) ఎక్కువగా ఉండుట ఈ విషయాన్ని సూచిస్తుంది.

జాతీయాదాయంలో పెరుగుదల ఎంత మొత్తంలో లేదా ఎంత పరిమాణంలో ఉందో తెలుసుకోవాలంటే గుణకం గురించి తెలుసుకోవాలి. దీనిలో ప్రధానంగా ప్రస్తావించే అంశం వినియోగ ప్రవృత్తి. వినియోగ ప్రవృత్తి అనునది వినియోగదారుని యొక్క వినియోగ పరిస్థితులను వివరిస్తుంది. ఆదాయంలో పెరుగుదల వల్ల వినియోగంలో పెరుగుదల ఉంటుంది. దీనిని ఉపాంత వినియోగంగా పేర్కొంటాము. వినియోగం పెరిగితే ఉపాంత వినియోగం తగ్గుతుంది. ఉపాంత వినియోగ ప్రవృత్తి (MPC) అనునది వినియోగదారుని మానసిక భావనలను బట్టి మారుతుంది. ఏది ఏమయినప్పటికి వినియోగంలో పెరుగుదల ఒకటికి తక్కువగా ఉండినప్పటికీ పెట్టుబడుల విషయంలో పాత్ర కలిగి ఉంటుంది. తద్వారా గుణకం పనిచేసి ఆదాయాల పెరుగుదలకు దారి తీస్తుంది. గుణాకాన్ని క్రింది విధంగా తెలుపుతారు.

1) $K = \frac{I}{I - MPC}$ లేదా 2) $K = \frac{I}{MPS}$

రెండవ సమీకరణం ఆధారంగా గుణకం తద్వారా జాతీయాదాయ పెరుగుదలను తెలుసుకుందాం. ఉదాహరణకు ఆదాయం పెరుగుదల లేదా జాతీయాదాయం 1000 కోట్ల రూపాయలు నుండి 1100 కోట్లకు పెరిగిందనుకోండి. రూ॥ 100లలో రూ. 20 పొదుపు చేస్తే ఉపాంత ప్రవృత్తి 0.2 అవుతుంది. ఉపాంత పొదుపు ప్రవృత్తిని ఉపాంత వినియోగ ప్రవృత్తిని కలిపితే 1 కి సమానమవుతుంది. పెట్టుబడి పెరుగుదల వల్ల జాతీయాదాయంలో పెరుగుదల గుణకం రెట్లు పెరుగుతుంది. ఉదాహరణకు ప్రారంభ పెట్టుబడి 100 అనుకుంటే గుణకం విలువ 2 అయినట్లయితే ఆదాయాలు ($2 \times 100 = 200$) రెండు వందలకు పెరుగుతాయి. ఇలా పెట్టుబడిలో మార్పులు జాతీయాదాయం కొత్త సమతౌల్యానికి చేరుకుంటుంది.

పెట్టుబడిలో పెరుగుదల బదులు పొదుపు మొత్తాల్లో పెరుగుదల ఉందని భావిద్దాం. ఆ పరిస్థితులలో జాతీయ ఆదాయం ఏ విధంగా ఉంటుందో పటం 14.2 లో చూడవచ్చు. పొదుపు షెడ్యూల్లో మార్పు యధాస్థానమైన S నుండి కొత్త స్థానానికి అనగా '$S_1$' కు చేరుకుంటుంది. దీని ద్వారా వినియోగదారులు అన్ని సందర్భాలలో జాతీయాదాయంలో పూర్వం కంటే ఎక్కువ పొదుపు చేస్తారని భావం. పొదుపు చేయడానికి చాలా కారణాలుండవచ్చు. వినియోగంలో పూర్ణ స్థాయికి చేరుకున్నపుడు, వృద్ధాప్యం గురించి బాధ ఉన్నపుడు మొదలగునవి పొదుపుకు దారి తీస్తాయి. పొదుపు షెడ్యూలు పైకి జరగడం వల్ల జాతీయాదాయంలో తగ్గుదల ఉంటుంది. కాగా క్రొత్త పొదుపు షెడ్యూలు పెట్టుబడి షెడ్యూలును నిలువుగా $Y_2$ పైన ఖండిస్తుంది. జాతీయాదాయం ఒక క్రొత్త సమతౌల్యానికి చేరుకుంటుందని తెలుస్తుంది. జాతీయాదాయం $Y_1$ నుండి $Y_2$ కు తగ్గడానికి కారణం ఈ క్రింది విధంగా పేర్కొనవచ్చు.


వినియోగదారులు ఎక్కువ పొదుపు చేస్తూ, తక్కువ వినియోగం చేస్తున్నపుడు, వినియోగం పడిపోవడం వల్ల ఉత్పత్తిదారులు పూర్వంకంటే తమ వస్తువులను ఎక్కువ అమ్మలేకపోవడం జరుగుతుంది. ఉత్పత్తి మొత్తం తగ్గడం వల్ల శ్రామికులను తీసివేయడం జరుగుతుంది. నిరుద్యోగులైన శ్రామికులు ఆదాయం తగ్గి, వినియోగస్థాయి మరింత తగ్గుతుంది. చివరకు తక్కువ జాతీయాదాయం వద్ద ఒక కొత్త సమతౌల్య స్థితి $Y_2$ వద్ద ఏర్పడుతుంది. ఆ బిందువు వద్ద ప్రణాళికా బద్ధమయిన పొదుపులు పెట్టుబడులు సమానమవుతాయి. పొదుపును ఎక్కువ చేయాలనే నిర్ణయం ప్రారంభమై క్రమేణ తగ్గుతూ చివరకు పొదుపులో తగ్గుదల, $Y_1$ ఆదాయం కన్నా పొదుపు, పెట్టుబడులు $Y_2$ ఆదాయం వద్ద తక్కువగా ఉంటాయి. దానినే పొదుపు వైపరీత్యం అంటారు. నియమిత ఆర్థిక వ్యవస్థలో ఆదాయ నిర్ణయ ప్రాథమిక సిద్ధాంతం మరల చెప్పినట్లుగా ఉంది. బహిర్గత ఆర్థిక వ్యవస్థలో ఈ పరిస్థితులు మరోలా ఉంటాయి.

## 13.4. బహిర్గత ఆర్థిక వ్యవస్థలో జాతీయాదాయ నిర్ణయం :

బహిర్గత ఆర్థిక వ్యవస్థలో ప్రధానంగా విదేశీ వర్తక సంబంధాలు కలిగి ఉంటాయి. అందువల్ల నియమిత ఆర్థిక వ్యవస్థలో జాతీయాదాయ సమతౌల్యము లేదా జాతీయాదాయ నిర్ణయాలు కన్నా భిన్నంగా ఈ వ్యవస్థలో ఉంటాయి. ఇందులో భాగంగా ముందుగా దిగుమతి ఫలాన్ని (Import Function) గురించి తెలుసుకుందాం.

**13.4.1. దిగుమతి ఫలము (ఇంపోర్టు ఫంక్షను) :** నియమిత ఆర్థిక వ్యవస్థలో వినియోగదారులు తమ ఆదాయాలను వినియోగంపై గాని పొదుపు కొరకు గాని వినియోగిస్తారని ముందే తెలుసుకున్నాము. మొత్తం వినియోగం జాతీయ ఆదాయం ముఖ్య భాగంగా పరిగణించవచ్చు. దీనిని C = C (Y) గా వ్రాయవచ్చు. పొదుపు మొత్తాలు మరియు వినియోగం జాతీయాదాయంలో పెరుగుదలతో పాటు పెరుగుతూ ఉంటాయి. అనగా జాతీయాదాయంలో పెరుగుదలతో పాటు వినియోగం పొదుపులు పెరుగుతాయి. బహిర్గత ఆర్థిక వ్యవస్థలో గల వినియోగదారులు నియమిత ఆర్థిక వ్యవస్థలో గల వారిలా కాకుండా వినియోగంలో దిగుమతి వస్తువులను ఉపయోగించుటకు ఇష్టపడతారు. విదేశీ వస్తు నాణ్యత, ధరలు వీరిని ఆకర్షిస్తాయి. అందువల్ల వీరి వినియోగంలో దిగుమతి వస్తువులు ఒక భాగం ఉంటాయి. అందువల్ల దిగుమతులు కూడా జాతీయాదాయంలో ఒక భాగంగాను లేదా జాతీయాదాయం దిగుమతులపై ఫలితాన్ని ఇస్తుందని చెప్పవచ్చు. ఈ విషయాన్ని M = M (y) వ్రాయవచ్చును. దిగుమతులు కూడా ఆదాయాల్లో భాగమని చెప్పవచ్చు. ఆదాయాల్లో పెరుగుదల ఉంటే దిగుమతులు పెరుగుటకు అవకాశాలుంటాయి. దేశీయంగా దిగుమతి ప్రత్యమ్నాయ వస్తువులను ఉత్పత్తి చేయుటకు కావలసిన పరిస్థితులు అనుకూలంగా లేకపోతే దిగుమతులు పెరుగుతాయి. అయితే కొన్ని పరిస్థితుల్లో ఆదాయాల్లో పెరుగుదల లేకున్ననూ అనగా జీరో (Zero) జాతీయాదాయం వద్ద కూడా కొన్ని వస్తువులను దేశాలు దిగుమతి చేసుకోవచ్చు. ఎలాగంటే దేశీయంగా లభించే మూలధనాన్ని ఎగుమతి చేసి తద్వారా ఆర్జించిన ఆదాయాలతో గాని లేక విదేశాల్లో ఆయా దేశాలు పెట్టుబడి పెట్టి తద్వారా ఆర్జనల ద్వారా గాని ఎగుమతులను చేసుకోవడం జరుగుతుంది. క్రింది పటం ద్వారా ఆదాయాల పెరుగుదల వల్ల దిగుమతల పెరుగుదలను గమనించవచ్చు.

పటము 4




జాతీయాదాయంలో పెరుగుదల లేకున్ననూ దిగుమతులు (పై కారణాల వల్ల) OM (భాగం పటంలో) వరకు ఉంటాయి. అనంతరం ఆదాయం పెరుగుదలతో దిగుమతులు పెరుగుతాయి. సగటు దిగుమతి ప్రవృత్తి దేశాల మధ్య తేడాలుగా ఉండవచ్చు. అభివృద్ధి చెందిన దేశాల్లో ఈ ప్రవృత్తి అభివృద్ధి చెందుతున్న దేశాలలో కన్నా భిన్నంగా ఉంటుంది. చిన్న దేశాలు ఎక్కువగా విదేశీ వ్యాపారంపై ఆధారపడి ఉంటాయి. అభివృద్ధి చెందిన అమెరికా దేశంలో వనరుల లభ్యత ఎక్కువగా ఉండటం వల్ల విదేశీ వ్యాపారంపై ఆధారపడే శాతం తక్కువగా ఉంది. సగటు దిగుమతి ప్రవృత్తి ఈ దేశంలో చాలా కనిష్టంగా 0.03 అనగా సుమారు 3 శాతంగా మాత్రమే దిగుమతులు ఉంటున్నాయి. తరువాత కాలాల్లో ఈ దేశం యొక్క దిగుమతులు సగటున క్రమేపీ తగ్గుమన్నవి. యుద్ధ కాల అనంతరం ఈ దిగుమతుల తగ్గుదల మరీ తక్కువగా ఉంది. చివరికి 19 వ శతాబ్ది ప్రథమానికి ప్రస్తుతానికి ఎన్నో మార్పులు ఈ దేశంలో వలే ఇతర అభివృద్ధి చెందిన దేశాల్లోనూ సంభవించాయి. గమనించవలసిన విషయమేమంటే ఏ దేశమయినప్పటికీ ఒక స్థాయి దాటాక మరింతగా దిగుమతులను తగ్గించలేవు. ఎందుకంటే దేశీయంగా వనరుల కొరత ఏర్పడితే కొన్ని వస్తువులను దిగుమతి చేసుకోవడం ఆయా దేశాలకు శ్రేయస్కరం. అందువల్ల అమెరికా లాంటి దేశాలు కూడా దిగుమతులను క్రమేపీ తగ్గించజాలవు. నియమిత ఆర్థిక వ్యవస్థ నుండి బయటపడిన రష్యాలో దిగుమతుల సగటు ప్రవృత్తి అమెరికా కన్నా తక్కువగా ఉంది. ఇక మనదేశాన్ని (భారతదేశం) పరిగణలోకి తీసుకుంటే జాతీయాదాయంలో పెద్ద దేశం కాకపోయినప్పటికీ సగటు దిగుమతి ప్రవృత్తి అధికంగానే ఉంది. (సగటు దిగుమతి ప్రవృత్తిని M/Y = దిగుమతులు / ఆదాయాలు ద్వారా కనుగొనవచ్చు). దేశీయ ఉత్పత్తిలో దిగుమతి ప్రత్యామ్నాయ ఉత్పత్తి విధానాలను ప్రవేశపెట్టవలసిన ఆవశ్యకతను ఈ గరిష్ట సగటు దిగుమతి ప్రవృత్తి సూచిస్తుందని చెప్పవచ్చు. దీనికి కారణం పైన చెప్పినట్లుగా చిన్న దేశాలు ముఖ్యంగా విదేశీ వర్తకంపై ఆధారపడుటయే.

సగటు దిగుమతి ప్రవృత్తి వలే ఉపాంత దిగుమతి ప్రవృత్తి విధానం ద్వారా ఆయా దేశాల దిగుమతి ఫలాన్ని అంచనా వేయవచ్చు. ఉపాంత దిగుమతి ప్రవృత్తి జాతీయాదాయంలో మార్పు వల్ల ఎంత మొత్తం దిగుమతులకు ఖర్చు పెడుతుందో తెలుపుతుంది. అనగా జాతీయాదాయం సంభవించే ఉపాంత మార్పు లేదా అదనపు మార్పు దిగుమతుల్లో జరిగే అదనపు మార్పును తెలుపుతుంది. దీనిని బీజగణిత రూపంలో $\Delta M / \Delta Y$ గా వివరించవచ్చు. $\Delta$ అనునది మార్పును సూచిస్తుంది. ఈ సమీకరణలో $\Delta M$ అనగా దిగుమతుల్లో మార్పు అలాగే $\Delta Y$ అనగా ఆదాయాల్లో మార్పు. వీటి ఫలితమే ఉపాంత దిగుమతి ప్రవృత్తి. ఉదాహరణకు దిగుమతులు 20 యూనిట్లు పెరిగితే, జాతీయాదాయంలో 200 యూనిట్ల పెరిగినట్లయితే ఉపాంత దిగుమతి ప్రవృత్తి $20/200 = 0.1$ అవుతుంది.

13.4.2. దిగుమతుల ఆదాయ డిమాండు వ్యాకోచత్వం : ఉపాంత దిగుమతి ప్రవృత్తిని సగటు దిగుమతి ప్రవృత్తి చేత భాగించినట్లయితే దిగుమతుల ఆదాయ డిమాండు వ్యాకోచత్వం వస్తుంది. అనగా ఆదాయాల్లో వచ్చిన అనుపాతపు మార్పు మరియు దిగుమతుల్లో వచ్చిన అనుపాతపు మార్పు ద్వారా దిగుమతుల ఆదాయ డిమాండు వ్యాకోచత్వం వస్తుంది. దీనిని $(\Delta M/\Delta Y) = M/Y$

గా బీజీయ రూపంలో వ్రాయుట సమంజసం. దిగుమతుల ఆదాయ వ్యాకోచం ఇతర అంశాల్లో మార్పులేనపుడు అనే భావన ద్వారా నిర్వచించబడుతుంది. అనగా ఉదాహరణకు ధరల్లో మార్పులేనపుడు అనే భావన ఈ అంశంలో ఉపయోగించబడుతుంది. ఈ విషయాన్ని క్రింది ఉదాహరణ ద్వారా విపులంగా తెలుసుకోవచ్చు.

దిగుమతుల డిమాండు 5 శాతం పెరిగినపుడు, ఆదాయంలో పెరుగుదల 10 శాతం ఉన్నచో, దిగుమతుల ఆదాయ వ్యాకోచత్వం 0.5కు సమానం. ఒక దేశం సగటు మరియు ఉపాంత దిగుమతుల ప్రవృత్తులు సమానమయితే ఆ దేశం దిగుమతుల ఆదాయ డిమాండు వ్యాకోచత్వం అవుతుంది. అనగా ఒక దేశం ఆదాయం పెరిగితే స్థిరమయిన నిష్పత్తిలో పెరిగిన ఆదాయం దిగుమతుల మీద ఖర్చు చేయడం జరుగుతుంది. అపుడు జాతీయోత్పత్తిలో దీని భాగం స్థిరంగా ఉంటుంది. అలాగే ఒక దేశం సగటు దిగుమతి ప్రవృత్తి కంటే ఉపాంత దిగుమతి ప్రవృత్తి ఎక్కువయితే ఆ దేశం విదేశీ వర్తకం మీద ఆధారపడటం ఎక్కువగా ఉంటుంది. దీనికి వ్యతిరేక పరిస్థితుల్లో ఉపాంత దిగుమతి ప్రవృత్తి కంటే వర్తకపు కోటా తగ్గుతుందని తెలపవచ్చు. ఈ విధంగా దిగుమతి ప్రవృత్తులను, వ్యాకోచత్వాలను వివరించడం వల్ల ఈ అంశాలు స్థిరంగా ఉంటాయని చెప్పలేం. ఒక దేశం ఉపాంత దిగుమతి ప్రవృత్తి చాలా ఆర్థికాంశాల మీద ఆధారపడటమే దీనికి కారణం. అంతేకాక ఇది ప్రతి సంవత్సరము మార్పు చెందుటకు అవకాశం కలదు కూడా.

## 13.5. బహిర్గత ఆర్థిక వ్యవస్థలో జాతీయాదాయ నిర్ణయం - విదేశీ వర్తక గుణకం

విదేశీ వర్తకం గల ఆర్థిక వ్యవస్థలో జాతీయాదాయ నిర్ణయంలో విదేశీ వ్యాపార లావా దేవీలను పరిగణనలోకి తీసుకుంటారు. అనగా ఎగుమతులు దిగుమతుల మధ్య గల మిగులు లేదా తగులులను కూడా కలపవలసి ఉంటుంది. కావున బహిర్గత ఆర్థిక వ్యవస్థలో జాతీయాదాయం క్రింది విధంగా ఉంటుంది.

$(Y + M) = (C) + (1) + (X)$

పై సమీకరణలో ఎడమవైపున గల Y + M అంశం మొత్తం దేశీయ సప్లయిని అనగా మొత్తం జాతీయ సప్లయి (Y) దిగుమతులు (M) లను తెలుపుతుంది. దేశీయ సప్లయిలో జాతీయ సప్లయికి దిగుమతుల ద్వారా వచ్చిన సప్లయిని కలపవలసి ఉంటుంది. C + I + X అంశం మొత్తం ఉత్పత్తి. వీటిలో వినియోగం (C) పెట్టుబడి (I), ఎగుమతులు X కలిగి ఉంటాయి. అయితే విదేశీ వ్యాపార అంశాలను పరిగణనలోకి తీసుకుంటే నికర జాతీయాదాయాన్ని $Y = C + 1 + X - M$ గా వ్రాయవచ్చును. మరొక విషయమేమనగా నియమిత ఆర్థిక వ్యవస్థలో సమతౌల్య పరిస్థితులలో పొదుపు మొత్తాలు పెట్టుబడి మొత్తాలకు సమానమని గతంలో తెలిపాం. కాని బహిర్గత ఆర్థిక వ్యవస్థలో దేశంలోకి ప్రవహించే మూలధనాన్ని (Capital Inflow) మరియు ఇతర దేశాలకు తరలి వెళ్ళే మూలధనాన్ని (Capital out flow) పరిగణనలోకి తీసుకోవలసి ఉంది. అటువంటి సందర్భాలలో జాతీయాదాయ సమతౌల్య స్థితి మరో విధంగా ఉంటుంది. కారణం పొదుపు మొత్తాలను పరిగణనలోనికి తీసుకోవడమే. ఈ సమీకరణ క్రింది విధంగా ఉంటుంది.

$S = 1 + X - M$ లేదా $S + M = I + X$

S = పొదుపు (Saving), I = పెట్టుబడి (Investment)

X = ఎగుమతులు (Exports), M = దిగుమతులు (Imports)

ఈ అంశాలలో దేనిలోనైనా మార్పు వచ్చినట్లయితే, సూత్రంలోని ఎడమవైపు అంశంలోని మార్పు వల్ల కుడివైపు అంశంలోని మార్పుకు సమానంగా ఉంటుంది. ఈ మార్పు జాతీయాదాయంలో నూతన సమతౌల్యానికి కారణమవుతుంది. దీని ఆధారంగా పై అంశాల్లో మార్పుల స్థితులను ఈ క్రింది విధంగా వ్రాయవచ్చు.

$\Delta S + \Delta M = \Delta I + \Delta X$

పై సమీకరణలో $\Delta$ (డెల్టా) మార్పును సూచిస్తుంది. వీటిని మరో విధంగా ఉపాంత పొదుపు ప్రవృత్తి (S) మరియు ఉపాంత దిగుమతి ప్రవృత్తి (M) ల నిర్వచనాలను ఉపయోగించి కూడా వ్రాయవచ్చు.

$\Delta S = S\Delta Y$, $\Delta M = m\Delta y$, ఈ సమీకరణ $(s+m)\Delta y = \Delta I + \Delta X$ అవుతుంది. దీని ద్వారా మనకు క్రింది సమీకరణ వస్తుంది.

$$\Delta y = \frac{1}{S} + m(\Delta I + \Delta X)$$

పెట్టుబడి, ఎగుమతి అంశాల్లో మార్పులను గమనించినట్లయితే వాటికి స్వయం ప్రతిపత్తి ఉందని చెప్పవచ్చు. ఎగుమతుల్లో మార్పులను 1/(S + M) అనే సమీకరణంతో గుణించితే ఎగుమతుల్లో మార్పువల్ల జాతీయాదాయం ఫలితానికి సమానం. దీని ప్రకారం వచ్చు అంశాన్ని విదేశీ వర్తక గుణకంగా పిలుస్తారు.

**13.5.1. విదేశీ వర్తక గుణకం :** జాతీయాదాయ సమతౌల్యం నిర్ణయించుటలో విదేశీ వ్యాపార పాత్రను అనేకమంది అర్థికవేత్తలు ప్రస్తావించారు. జాతీయాదాయ ఉద్యోగితా స్థాయి సమిష్టి డిమాండుపై ఆధారపడి ఉంటుందనేది కీన్సు మహాశయుని సిద్ధాంతంలో ప్రధానాంశం. ఎగుమతులు సమిష్టి డిమాండులో ఒక భాగం. వినియోగ వ్యయం, పెట్టుబడి వ్యయం, ప్రభుత్వ వ్యయం ఈ మూడు గాక ఎగుమతులు కూడా సమిష్టి డిమాండులో అంతర్భాగాలే. ఎగుమతి వస్తువులను తయారు చేయటం వల్ల పరిశ్రమలోనున్న ఉత్పత్తి కారకాలకు ఆదాయం వస్తుంది. ఎగుమతి పెరిగితే ప్రజల ఆదాయం పెరుగుతుంది. వినియోగ వ్యయం పెరుగుతుంది. గుణక ప్రభావం వల్ల జాతీయాదాయం పెరుగుదల ఎగుమతుల పెరుగుదల కన్నా కొన్ని రెట్లు అధికంగా ఉంటుంది. ఎగుమతులు పెరుగుటకు జాతీయాదాయం పెరుగుదలకు ఉన్న నిష్పత్తి విదేశీ వ్యాపార గుణకం అంటారు. దీనిని క్రింది విధంగా వ్రాస్తారు.

$$K_F = \frac{\Delta Y}{\Delta Y}$$

$K_F$ = విదేశీ వ్యాపార గుణకం

$\Delta Y$ = జాతీయాదాయంలో పెరుగుదల

$\Delta X$ = ఎగుమతుల పెరుగుదల

**13.5.2. దిగుమతుల మరియు ఎగుమతుల విదేశీ వ్యాపార గుణకం :** దిగుమతుల మీద చెల్లించిన ఆదాయం ఇతర దేశాలకు వెళ్ళిపోతుంది. దిగుమతుల మీద ఎంత వెచ్చించామో అంతమేరకు దేశంలో ఉత్పత్తి అయిన వస్తువులకు డిమాండు తగ్గుతుంది. దిగుమతుల వలన వ్యయర్హ ఆదాయం తగ్గుతుందని చెప్పవచ్చు. అందువల్ల వినియోగ ప్రవృత్తి తగ్గుతుంది. పొదుపు చేస్తే లేక పన్నులు ల్లిస్తే వినియోగ వ్యయం తగ్గుతుంది. ఆదాయ ప్రవాహంలో పొదుపు, పన్నులు, దిగుమతులు చిద్రాల లాంటివి (Leakages). అందువల్ల గుమతులు విదేశీ వ్యాపార గుణకం విలువను తగ్గిస్తాయి. దిగుమతుల విలువ పెరిగితే గుణకం విలువ తగ్గుతుంది. కాబట్టి ఉపాంత దుపు ప్రవృత్తిలో దిగుమతులను కలపాలి. పొదుపు ప్రవృత్తి = పొదుపు (S) + పన్నులు (t) + దిగుమతులు (m) దీనిని $\frac{1}{MPS} = \frac{1}{s+t+m}$ గా తెల్పవచ్చు.


జాతీయాదాయంలో కొంత భాగం దిగుమతులపై వెచ్చిస్తారు. కాబట్టి దిగుమతుల స్థాయి జాతీయాదాయంపై ఆధారపడి ఉంటుంది. జాతీయాదాయ స్థాయి పెరిగితే దిగుమతులు పెరగవచ్చు. జాతీయాదాయ స్థాయి తగ్గితే దిగుమతులు తగ్గవచ్చు. దిగుమతులు జాతీయాదాయ స్థాయి ఫలితంగా చెప్పవచ్చు. దిగుమతులు Mf = Yగా చెప్పవచ్చు. ఆదాయంలోని మార్పుకు దిగుమతులలోని మార్పుకు గల నిష్పత్తిని ఉపాంత దిగుమతి ప్రవృత్తి అంటారు. దీనిని $\Delta M / \Delta Y$ గా వ్రాస్తారు. ఎగుమతుల వలన ఉత్పన్నమయిన ఆదాయానికి సమానమయిన దిగుమతులు జరిగితే ఎగుమతులు (X) = దిగుమతులు (m) అవుతుంది. అపుడు సమతౌల్య స్థితి ఏర్పడుతుంది.

ఈ అంశాలను మరింత లోతుగా పరిశీలిద్దాం. పెట్టుబడిలో మార్పులేదనుకుంటే, దిగుమతులు పెరగటం వల్ల జాతీయాదాయంలో మార్పులు సంభవిస్తాయని తెలిపాం. ఉపాంత వినియోగ ప్రవృత్తి అనుకూల ధోరణిలో ఉందనుకుంటే Kt ఎల్లపుడు ఒకటి కంటే ఎక్కువగా

ఉంటుంది. కనుక ఎగుమతుల్లో పెరుగుదల తప్పకుండా జాతీయాదాయం మీద కొంత ఫలితాన్ని చూపిస్తుంది. తద్వారా మొదట పెరిగిన ఎగుమతుల కంటే జాతీయాదాయంలో పెరుగుదల అధికంగా ఉంటుంది.

ఎగుమతుల పెరుగుదల ప్రారంభంలో పెరగడానికి అనేక కారణాలుండవచ్చు. అవి ప్రధానంగా విదేశీ వినియోగదారుల యొక్క అభిరుచులు మరియు అలవాట్లలో మార్పు ఒకటిగా చెప్పవచ్చు. విదేశీ వినియోగదారుల అభిరుచుల్లో మార్పు వల్ల దిగుమతి వస్తువుల పట్ల తమ ధోరణి అనుకూలంగా ఉండటమన్న మాట. దీని వల్ల ఎగుమతి వస్తువులు తయారుచేసే ఉత్పత్తిదారులకు ఆర్డర్లు పెరుగుతాయి. ప్రథమంగా ఎగుమతిదారులు వారి స్టాకును అమ్మడం ద్వారా ఆదాయాలను పెంచుకుంటారు. క్రమంగా తమ ఉత్పత్తి స్థాయిని పెంచి ఎక్కువ మంది పనివారలను నియమిస్తారు. దీనివల్ల ఆహార వస్తువుల ఉత్పత్తిదారులకు వస్త్ర ఉత్పత్తిదారులకు ఆదాయం పెరుగడాన్ని దోహదం చేస్తుంది. ఈ విధంగా కొనసాగినచో ప్రథమంలో ఎగుమతుల పెరుగుదలతో పోల్చుకుంటే జాతీయాదాయంలో పెరుగుదల హెచ్చుస్థాయిలో ఉంటుంది. ఎంత మేరకు పెరిగిందో ఎగుమతి గుణకం విలువ మీద ఆధారపడి ఉంటుంది. ఈ విషయాలను క్రింది రేఖాపటంలో చూడవచ్చు.


**పటం 5.**




నికర పెట్టుబడి లేకుండా ఎగుమతులు స్వతంత్ర ప్రతిపత్తి గల లక్షణంతో ఉంటాయి. ప్రారంభంలో జాతీయాదాయం సమతౌల్యం ($Y_0$) వద్ద పొదుపు మొత్తాలు + దిగుమతులు = ఎగుమతులుగా ఉంటాయి. ఎగుమతుల్లో పెరుగుదల వల్ల ఎగుమతుల షెడ్యూలు X నుండి X' కు పెరిగింది. దీని ఫలితంగా జాతీయాదాయంలో చెప్పుకోదగ్గ హెచ్చుదల $Y_0$ నుండి $Y_1$ కు పెరిగింది. క్రమంగా సమతౌల్య స్థితి వచ్చుటకు పొదుపు + దిగుమతులు = ఎగుమతులకు సమానమవుతుంది. ఎగుమతుల్లో పెరుగుదల ప్రభావం జాతీయాదాయంలో చెప్పుకోదగినంత పెరుగుదల అనేది పొదుపు మరియు దిగుమతి షెడ్యూలు రేఖ ఏటవాలుపై ఆధారపడి ఉంటుంది. ఈ వాలు (slope) పొదుపు, దిగుమతి ప్రవృత్తుల మీద ఆధారపడి ఉంటుంది. ఈ ప్రవృత్తులు తక్కువగా ఉంటే ఈ రేఖ వాలు తక్కువగా ఉంటుంది. ఎగుమతుల్లో పెరుగుదల జాతీయాదాయంపై ప్రభావాన్ని ఎక్కువగా చూపుతుంది. అదే విధంగా ఎగుమతుల్లో స్వయం ప్రతిపత్తి పెరుగుదల గురించి చర్చిద్దాం.

**13.5.3. ఎగుమతుల్లో స్వయం ప్రతిపత్తి - జాతీయాదాయంలో మార్పు :** ఎగుమతుల్లో స్వయం ప్రతిపత్తి పెరుగుదల జాతీయాదాయంలో పెరుగుదలకు దారితీస్తుంది. కాని దిగుమతుల్లో పెరుగుదల దీనికి వ్యతిరేకంగా అనగా, జాతీయాదాయం తగ్గుతూ సంభవిస్తుంది. ఈ విషయాన్ని క్రింది పటం వివరిస్తుంది.

పటం - 6





పై పటంలో X అక్షము మీద జాతీయాదాయాన్ని 'Y' అక్షము మీద ఎగుమతి దిగుమతులను సూచించడం జరిగింది. ఎగమతుల్లో పెరుగుదల జాతీయాదాయంలో పెరుగుదలకు దారితీసినా, దిగుమతులు పెరుగుటవల్ల (పటంలో n నుండి $n_1$ జాతీయాదాయం $Y_0$ నుండి $Y_1$ కు తగ్గుట పటంలో చూడవచ్చు. దిగుమతుల్లో పెరుగుదలకు అనేక కారణాలుంటాయి. వినియోగదారుల ధోరణి అనగా దేశీయ తయారీ వస్తువులను తక్కువ మోతాదులో వినియోగించడం. తద్వారా దిగుమతులు పెరుగుతాయి. దీని వల్ల దేశీయ ఉత్పత్తి తగ్గి శ్రామికులను తగ్గించుట తద్వారా ఆదాయం తగ్గడం వల్ల గుణక ప్రభావం చేత మొత్తం ఆదాయం తగ్గుతుంది. ఈ తగ్గుదల తక్కువ జాతీయాదాయం వద్ద ఒక క్రొత్త సమతౌల్య స్థితికి చేరేవరకు కొనసాగుతుంది. పటంలో $Y_0$ నుండి $Y_1$ వరకు చేరడం ద్వారా ఈ విషయాన్ని తెలుసుకోవచ్చు. దిగుమతుల నివారణకు పెట్టుబడుల్లో మార్పులు తీసుకురావలసి ఉంటుంది.

బహిర్గత ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడి రెండు రకాలుగా విభజించవచ్చు. 1. దేశీయ పెట్టుబడి 2. విదేశీ పెట్టుబడి. దీని యందు సమతౌల్యం Id + If = S గా వివరించవచ్చును.

Id అనగా (Domestic Investment) దేశీయ పెట్టుబడి

If అనగా (Foreign Investment) విదేశీ పెట్టుబడి.

S = సమతౌల్యాన్ని తెలిపే పొదుపు స్థాయి (S = I) ఇందులో వస్తు సేవల ఎగుమతులు, వస్తు సేవల దిగుమతులకు మధ్య తేడాను విదేశీ పెట్టుబడిగా పిలుస్తారు. కనుక If = X - M గా భావించవచ్చు. వీటికి ప్రత్యామ్నాయంగా Id + X = S + M సమీకరణాన్ని వివరించవచ్చు. ఈ అంశాలను క్రింది పటంలో గమనించండి.




పై పటము ఎగుమతుల్లో మార్పులు జాతీయాదాయం మీద ప్రభావాన్ని వివరిస్తుంది. పొదుపు షెడ్యూలు రేఖ M + S రేఖ పెరిగిన దిగుమతి, పొదుపు షెడ్యూలు రేఖ అవుతుంది. Id రేఖ దేశీయ పెట్టుబడి షెడ్యూలు, X + Idఎగుమతులకు దేశీయ పెట్టుబడికి సంబంధించిన షెడ్యూలు రేఖను సూచిస్తుంది. ఇది డిమాండు షెడ్యూలు రేఖను $Y_0$ పైన ఖండించడం ద్వారా జాతీయాదాయం సమతౌల్యంలో ఉంటుంది. ఎందువలననగా దేశీయ పెట్టుబడి పొదుపు మొత్తాలకు మరియు ఎగుమతులు దిగుమతుల మొత్తానికి సమానం కావడమే. ఎగుమతులకు స్వతంత్ర ప్రతిపత్తి గల పెరుగుదల ఉన్నట్లయితే సమన్వయ ఎగుమతి, పెట్టుబడి షెడ్యూలు రేఖ పైకి జరిగి X + Id గా ఉంటుంది. ఇది జాతీయాదాయంపై చెప్పుకోదగిన ప్రభావాన్ని చూపుతుంది. తద్వారా జాతీయాదాయం $Y_1$ కు పెరుగుతుంది. ఈ బిందువు వద్ద ఎగుమతులు + దేశీయ పెట్టుబడి = పొదుపు + దిగుమతులకు సమానంగా ఉంటాయి. జాతీయాదాయంలో ఇది క్రొత్త సమతౌల్య స్థాయి లేదా స్థానంగా చెప్పవచ్చు. కాని మొత్తము పొదుపు మొత్తాలు, దేశీయ పెట్టుబడి మొత్తం కంటే అధికంగా ఉండటము వల్ల కరెంటు ఖాతా శేషంలో సమతౌల్యం రాదు. పెట్టుబడులు మధ్య తేడా పాయింటు $Y_1$ వద్ద a-b మధ్య దూరంగా చూపబడింది. అనగా అదే మొత్తానికి దిగుమతుల కంటే ఎగుమతులు ఎక్కువని చెప్పవచ్చు. దేశం మూలధనాన్ని ఇతర దేశాలకు ఎగుమతి చేస్తుంది. ఎగుమతులు తగ్గినచో, ఎగుమతులు + పెట్టుబడులు కలిపి షెడ్యూలు X" + Id కు పడిపోతుంది. దీని ఫలితంగా జాతీయాదాయం తగ్గే సూచనలు ఉన్నాయి. ఇది $Y_0$ నుండి $Y_2$ పాయింటుకు తగ్గుతుంది. ఈ ఆదాయం వద్ద దేశీయ పెట్టుబడులు, పొదుపు మొత్తాలు కంటే ఎక్కువగా ఉంటాయి. దీని అర్థం, దిగుమతులు ఎగుమతులు కంటే అదే మొత్తంలో ఎక్కువ ఉంటాయి. దేశం కరెంటు ఖాతా శేషంలో లోటు ఉంటుంది. అంతేకాక మూలధనాన్ని దిగుమతి చేసుకోవాల్సిన అవసరముంటుంది. తద్వారా దేశీయ పెట్టుబడి అభివృద్ధి చెందు అవకాశముంటుంది.

## 13.6. జాతీయాదాయం మరియు చెల్లింపుల శేషం సమతౌల్యం :

జాతీయాదాయంలో అంతర్గతముగా సమతౌల్యం ఉండవచ్చు. పై పటంలో చూపిన మాదిరిగా సాధ్యమవుతుంది. అయితే జాతీయాదాయంలో సమతౌల్యం చెల్లింపుల శేషంలో సమతౌల్యం ఉండకపోవచ్చు. అందువల్ల ఆదాయంలో మార్పులు చెల్లింపుల శేషం మీద చూపే ప్రభావాన్ని తెలుసుకోవడం ముఖ్యం.

గతంలో తెలిపిన విధంగా జాతీయాదాయంలో సమతౌల్యస్థితికి ప్రణాళికమయిన పొదుపు పెట్టుబడి మొత్తాలు సమానమవుట జరుగును. ఈ విషయంలో వినియోగదారులు తమ పథకాలను, ఉద్దేశాలను దృష్టిలో ఉంచుకొని వారు వినియోగాన్ని మరియు పొదుపులను

తమ ఆదాయాలను వాటిపై కొనసాగిస్తారు. ఉత్పత్తిదారుల వినియోగ వస్తువుల ఉత్పత్తికి వినియోగం సమానంగా ఉండాలి. ఇలా పొదుపు మొత్తాలు పెట్టుబడి మొత్తాలకు సమానమయితే సమతౌల్య విలువ వద్ద జాతీయాదాయంలో మార్పు ఉండదు. అయితే బహిర్గత ఆర్థిక వ్యవస్థలో సమతౌల్య పరిస్థితిని వివిధ రూపాల్లో వివరించవలసి ఉంటుంది. దేశంలోకి వచ్చు మొత్తాలలో దేశీయ పొదుపులే కాకుండా విదేశాల్లో పొదుపులు కొంత మేర ఎగుమతులు చేయుటద్వారా కూడా ఉంటుంది. కొన్ని సందర్భాలలో ఇతర దేశాల మూలధనంతోనే పెట్టుబడులు కొనసాగుతాయి. అందువల్ల బహిర్గత ఆర్థిక వ్యవస్థలో సమతౌల్య స్థితులు, పెట్టుబడులు మారుతాయి. ఇవన్నీ ఆ దేశ ఆర్థిక వ్యవస్థ ముఖ్య ఉద్దేశాల ఆధారంగా జరుగుతాయి. దేశీయంగా అన్ని వనరులకు పూర్తి ఉద్యోగిత కల్పించడం మరియు బహిర్గత శేషాన్ని అనుకూలంగా మరల్చుకోవడం వీటిలో ప్రధానమయినవి. సంపూర్ణ ఉద్యోగిత విషయంలో ఆర్థికవేత్తల మధ్య ఏకాభిప్రాయం లేదని చెప్పవచ్చు. సాంప్రదాయ ఆర్థిక వేత్తలు సంపూర్ణ ఉద్యోగిత ఆర్థిక వ్యవస్థలో సాధారణ విషయమని భావించగా కీన్సు మహాశయుడు దానికి వ్యతిరేక భావాన్ని వివరించాడు. ప్రపంచ వ్యాప్తంగా 1929 - 32 మధ్య కాలంలో ఏర్పడిన ఆర్థిక మాంద్యం సాంప్రదాయ ఆర్థికవేత్తల అభిప్రాయాలకు తిలోదకాలిచ్చిందని కీన్సు విమర్శించాడు. అందువల్ల ఆర్థిక వ్యవస్థలో సంపూర్ణ ఉద్యోగిత ఉండకపోవచ్చు. అంతేకాక ఒక దేశం జాతీయాదాయం సమతౌల్య స్థితి పొందుటకు పూర్తి ఉద్యోగిత ఉండాలనే నియమం లేదు. కీన్సు ప్రకారం మొత్తం డిమాండు మొత్తం ఉత్పత్తికి సమతౌల్య పరిస్థితిలో ఉంటుంది. అయితే ఈ సమతౌల్యం ఏ స్థాయిలోనయినా ఉండవచ్చు. అనగా అల్ప ఉద్యోగితా స్థాయిలోనైనా ఉండవచ్చు. ఒక వేళ నూరు శాతం స్థాయి వద్ద మొత్తం డిమాండు మొత్తం ఉత్పత్తికి సమానంగా ఉంటే ఆ సందర్భాలలో ఆర్థిక వ్యవస్థ పూర్తి ఉద్యోగిత కల్గి ఉంటుంది. అలా కాకుండా తక్కువ సామర్థ్యస్థాయి (నూరు శాతం కంటే తక్కువ) వద్ద ఉంటే అల్ప ఉద్యోగిత ఉంటుంది. మరొక విషయమేమంటే ఒకవేళ కెపాసిటి స్థాయి నూరుశాతం మించి ఉన్నట్లయితే చెల్లింపుల శేషంలో కొన్ని చిక్కులు ఉండి తీరుతాయి. అందువల్ల సమతౌల్యస్థాయి నిర్ధారణ మార్పుకు గురౌతుంది. మరోవైపు పెట్టుబడి పొదుపు మొత్తాల కంటే అధికంగా ఉన్నా లేదా మొత్తం ఉత్పత్తి కంటే మొత్తం ప్రణాళికా బద్ధమైన డిమాండు ఎక్కువగా ఉన్నా ద్రవ్యోల్బణం ఏర్పడుతుంది. అందువల్ల సరైన సర్దుబాటులు అవసరం ఉంటుంది.

ఒక దేశంలో గత కాలంలో అంతర్గతంగా పూర్తి ఉద్యోగిత స్థాయిలో చెల్లింపుల శేషంలో సమతౌల్యం ఉందని భావిద్దాం. అలాంటి సమయాల్లో డిమాండులో పెరుగుదల ఉంటుంది. ఎందువలననగా వినియోగదారులు తమ ఆదాయాలను తక్కువ స్థాయిలో పొదుపు చేస్తూ ఎక్కువ మొత్తం వినియోగంపై ఖర్చు పెట్టవచ్చు. అంతేకాక వడ్డీరేట్లు తగ్గినపుడు పెట్టుబడి మొత్తాలు పెరుగుట వంటి విధాన పరమయిన అంశాల్లో మార్పుల వల్ల కూడా జరగవచ్చు. ఇటువంటి సందర్భాలలో కూడా ద్రవ్యోల్బణం ఏర్పడుతుంది. బహిర్గత ఆర్థిక వ్యవస్థలో ఆ రకమయిన ఒత్తిడి గల పెరుగుదలకు దోహదం చేయనవసరం లేదు. కాని చెల్లింపుల శేషం లోటుకు దారి తీస్తుంది. వినియోగదారులు ఇదివరకటి కంటే ఎక్కువగా వినియోగిస్తారు. ఉత్పత్తిదారులు మాత్రం ఇదివరకటి వలనే పెట్టుబడులు పెడతారు. ఆర్థిక వ్యవస్థలో సంపూర్ణ ఉద్యోగిత ఉన్నందున స్వల్పకాలంలో దేశీయ ఉత్పత్తిలో పెంపుదల చేయుటకు అవకాశం లేదు. దానితోపాటుగా ఎగుమతుల్లో మార్పు ఉండదు. కాని వినియోగ వస్తువుల డిమాండు పెరుగుదల వల్ల ఎగుమతులు పెరుగుతాయి. నిర్ణీతమైన కాలం చివరన దేశం చెల్లింపుల లోటు సంభవిస్తుంది. దీనికి ముఖ్య కారణం దేశంలోని పెట్టుబడిలో కొంత భాగం దిగుమతి చేసుకొన్న మూలధనంలో కలిసి ఉంటుంది. ఈ వ్యవహారంలో అంతర్గత ఉత్పత్తి పద్ధతి ఏ విధంగా ప్రభావితం అయిందీ అంత ముఖ్య విషయం కాదు. ఎగుమతుల్లో దేశంలో ఉత్పన్నమయిన పెట్టుబడి వస్తువుల్లో మార్పు ఉండకపోవచ్చు కాని దిగుమతులు మాత్రం పెరుగుతాయి. బహుశా ఎగుమతుల వస్తు ఉత్పత్తి తగ్గుతుంది. ఉత్పత్తి కారకాలను ఎగుమతి వస్తువుల రంగం నుంచి వినియోగ వస్తువుల డిమాండు పెరుగుట చేత దేశీయ పరిశ్రమలకు మార్పిడి జరుగవచ్చు. ద్రవ్యోల్బణ వత్తిడి పరిస్థితుల్లో ఉత్పత్తి పద్ధతిలో మార్పుకు ముఖ్యమైన అంశంగా గమనించవలసి ఉంటుంది. దేశీయ పొదుపు మొత్తాలు అధికమై దిగుమతులు ఎగుమతుల కంటే పెరుగుతాయి.

ఈ సందర్భంలో గమనించవలసిన విషయమేమంటే డిమాండు పరంగా పెరిగే జాతీయాదాయం కొన్ని సందర్భాలలో చెల్లింపుల శేషంలో లోటుకు దారి తీస్తుంది. ద్రవ్యోల్బణ ఒత్తిడి కారణంగా ఆర్థిక వ్యవస్థలో ధరలు పెరగాలనే నియమం లేదు కాని చెల్లింపుల శేషంలో లోటువచ్చే అవకాశం ఉంది. దీనిని భర్తీ చేయుటకు ఊహించని విధంగా మూలధన ఇన్‌ఫ్లో ద్వారా సర్దుబాట్లు చేసి సరిచేయవచ్చు. ఈ విధంగా మూలధన ఇన్‌ఫ్లో చేసే పద్ధతి కీన్సు సిద్ధాంతంలో శ్రేష్టమయిన అంశం. ఈ పరంగా విధాన పరమైన భావనలు చాలా విశదంగా ఉన్నాయి.

ఏ కారణం చేతయినా పూర్తి ఉద్యోగిత స్థాయి వద్ద సమతౌల్య స్థితిలో, ఎగుమతులు తగ్గినాయనుకుంటే, అది జాతీయాదాయం మీద ప్రభావం చూపి, గుణకం ఫలితం వల్ల ప్రథమంలో ఉన్న ఎగుమతుల కంటే ఎక్కువ తగ్గుదల ఉంటుంది. జాతీయాదాయం పడిపోయినట్లుగానే దిగుమతులు కూడా తగ్గుతాయి. కాని ఎగుమతుల్లో తగ్గుదల కంటే దిగుమతుల్లో తగ్గుదల తక్కువగా ఉంటుంది. కాబట్టి దేశం నిరుద్యోగిత పరిస్థితి నుండి తప్పించుకోవడం కష్టసాధ్యం. ద్రవ్యోల్బణ విధానం దేశంలో పూర్తి ఉద్యోగితకు దారి తీయగలదు. ఈ పరిస్థితి చెల్లింపుల శేషంలో లోటు వుంటే సంభవిస్తుంది. ఈ పరిస్థితిని అధిగమించడానికి కీన్సు విధానంలో ద్రవ్యోల్బణం ద్వారానో, ప్రతి ద్రవ్యోల్బణం ద్వారానో నివారణోపాయాలు లేవు అని చెప్పవచ్చు.

మరొక సందర్భంలలో పూర్తి ఉద్యోగిత గల దేశంలో పొదుపు షెడ్యూలుకు స్వతంత్ర ప్రతిపత్తిగల పెరుగుదలకంటే, వినియోగదారులు ఎక్కువ పొదుపు చేస్తే (తక్కువ వ్యయంతో) జాతీయాదాయంలో ప్రతి ద్రవ్యోల్బణ పరిస్థితులు ఏర్పడవచ్చు. తద్వారా ఆదాయాలు పడిపోయి నిరుద్యోగిత పెరగవచ్చు. జాతీయాదాయం పడిపోయిన రీతిలోనే దిగుమతులకు డిమాండు కూడా పడిపోతుంది. కాని ఎగుమతుల్లో మార్పుకు కారణం ఊహించడం కష్టం. ఎందుకంటే ఎగుమతులు దేశీయ పరిస్థితుల కంటే విదేశీ వినియోగదారుల మీద ఆధారపడి ఉంటాయి. అంతేకాక విదేశస్తుల ఆదాయాలపై కూడా ఆధారపడి ఉంటాయి. నిరుద్యోగిత ప్రభావం వల్ల వేతనాల్లో తగ్గుదల సంభవించి స్వదేశంలో ఉన్న ఎగుమతిదారులు ఇదివరకటి కంటే మంచి పోటీ పరిస్థితులను ఎదుర్కొంటారు. తద్వారా ఎగుమతిదారులు ఉత్పత్తి కారకాలను ఇదివరకటి కంటే తక్కువ ధరకు పొందుతారు. కనుక దేశం చెల్లింపుల శేషంలో మిగులు ఉంటుంది. దానితో పాటుగా నిరుద్యోగిత స్థాయి అనుకూల చెల్లింపుల శేషంతో కలిగి ఉంటుంది. అయితే ఈ పరిస్థితులను ఎదుర్కొనడం చాలా సులభం. దేశంలో ద్రవ్యోల్బణం విధానం పూర్తి ఉద్యోగిత స్థాయి వద్ద మరల జాతీయాదాయంలో సమతౌల్య స్థితికి చేరుకోడానికి దోహదం చేస్తుంది. ఎగుమతుల స్థాయిలో మార్పు లేకుండా ఇది ఎగుమతుల డిమాండును అధికం చేస్తుంది. కాని దేశంలో చెల్లింపుల శేషం మిగులుగా ఉన్నందు వల్ల పెద్దగా మదన పడనవసరం లేదు. చెల్లింపుల శేషం, ఆదాయంలో మార్పుల మధ్య అనోన్యమైన సంబంధం కలిగి ఉన్నందున జాతీయాదాయంలో ఎలాంటి మార్పు కలిగినప్పటికీ చెల్లింపుల శేషంపై తప్పక కొంత ప్రభావం చూపుతుంది. సాధారణ పరిస్థితులలో జాతీయాదాయంలో ద్రవ్యోల్బణ మార్పు చెల్లింపుల శేషంపై ప్రతికూల ప్రభావం, జాతీయాదాయం ప్రతి ద్రవ్యోల్బణ మార్పు చెల్లింపుల మీద అనుకూల ప్రభావం కలిగి ఉన్నప్పటికీ ఎగుమతుల్లో కొన్ని మినహాయింపులున్నాయి. స్వయం పరిపాలనాధికారం గల తగ్గుదల జాతీయాదాయంలో ప్రతి ద్రవ్యోల్బణ ప్రభావం, చెల్లింపుల శేషంలో లోటుకు దారి తీస్తుంది. దీనికి వ్యతిరేకంగా దిగుమతి వస్తువుల వినియోగాన్ని తగ్గించుకొని, దేశంలో తయారైన వస్తువుల వినియోగం ఎక్కువ అయినచో జాతీయాదాయం మీద ద్రవ్యోల్బణ ప్రభావం ఉండటమే కాక, చెల్లింపుల శేషంలో మిగులు పరిస్థితికి దారితీయవచ్చును.

## 13.7. సారాంశము :

ఈ పాఠంలో చెల్లింపుల శేషం, ఆదాయంలో మార్పుల మధ్యగల అన్యోన్యమైన సంబంధాన్ని వివరించాము. అలానే జాతీయాదాయంలో ఎలాంటి మార్పు కలిగినప్పటికీ చెల్లింపుల శేషంలో తప్పక కొంత ప్రభావం చూపుతుంది. సాధారణ పరిస్థితులలో జాతీయాదాయంలో ద్రవ్యోల్బణ మార్పు చెల్లింపుల శేషంపై ప్రతికూల ప్రభావాన్ని, జాతీయాదాయం ప్రతిద్రవ్యోల్బణ మార్పు చెల్లింపుల శేషంపై అనుకూల ప్రభావాన్ని కలిగి ఉంటుందని చెప్పవచ్చును. అయినప్పటికీ ఈ విషయంలో కొన్ని మినహాయింపులు లేకపోలేదు. ఎగుమతుల్లో స్వయం పాలనాధికారం గల తగ్గుదల జాతాయాదాయంలో ప్రతిద్రవ్యోల్బణ ప్రభావం చెల్లింపుల శేషంలో లోటుకు దారితీస్తుంది. దీనికి వ్యతిరేకంగా దిగుమతి వస్తు వినియోగాన్ని తగ్గించుకొని, దేశంలో తయారైన వస్తువుల వినియోగం ఎక్కువ అయినచో జాతీయాదాయం మీద ద్రవ్యోల్బణ ప్రభావం ఉండటమేకాక చెల్లింపుల శేషంలో మిగులు పరిస్థితికి దారితీస్తుంది.

## 13.8. ముఖ్య పదాలు

1. జాతీయాదాయం : ఒక సంవత్సర కాలంలో ఒక దేశానికి వస్తు సేవల రూపంలో సంక్రమించే నికర ఆదాయం
2. గుణకము : పెట్టుబడిలో మార్పు వల్ల ఆదాయంలో మార్పు కొన్ని రెట్లు మారుతుందని వివరిస్తుంది.

| | | |
|---|---|---|
| 3. నియమిత ఆర్థిక వ్యవస్థలు | : | విదేశీ వ్యాపార సంబంధాలు లేని దేశాల ఆర్థిక వ్యవస్థలు |
| 4. బహిర్గత ఆర్థిక వ్యవస్థ | : | విదేశీ వ్యాపార సంబంధాలు గల దేశ ఆర్థిక వ్యవస్థ |
| 5. సమతౌల్య స్థాయి | : | మార్పుకు అవకాశం లేని నిర్దిష్ట స్థాయి |
| 6. MPC | : | ఉపాంత వినియోగ ప్రవృత్తి, అదనపు ఆదాయాల వల్ల కలిగే అదనపు వినియోగ పరిమాణాన్ని, నిర్ధారించు వినియోగదారుని భావనను తెల్పుతుంది |
| 7. ఇంపోర్టు ఫంక్షను | : | దిగుమతులను నిర్ణయించు అంశాల వల్ల దిగుమతుల్లో కలిగే ఫలితము |
| 8. దేశీయ పెట్టుబడి | : | దేశంలో అంతర్గతంగా విదేశీ మూలధనం లేని పెట్టుబడులు |
| 9. సంపూర్ణ ఉద్యోగిత | : | ఆర్థిక వ్యవస్థలో గల అన్ని ఉత్పత్తి కారకాలు ఉద్యోగిత కల్గి ఉండుట |
| 10. కేపిటల్ ఇన్‌ఫ్లో | : | దేశంలోకి ప్రవహించే మూల ధనం. ఇది ఇతర దేశాలు ఇతర దేశాల్లో పెట్టే పెట్టుబడులు ద్వారా రావచ్చును. |

## 13.9. నమూనా ప్రశ్నలు :

1. బహిర్గత ఆర్థిక వ్యవస్థలో జాతీయాదాయ సమతౌల్య పరిస్థితులను వివరించండి.
2. విదేశీ వ్యాపార గుణకం గురించి వ్రాయుము
3. చెల్లింపుల శేషం విషయంలో జాతీయాదాయ పోకడలను లేదా జాతీయాదాయ ప్రభావాన్ని వ్రాయుము.
4. చెల్లింపుల శేషం మరియు జాతీయాదాయ సమతౌల్యాన్ని వివరించుము
5. నియమిత ఆర్థిక వ్యవస్థలో జాతీయాదాయ సమతౌల్యం మరియు బహిర్గత ఆర్థిక వ్యవస్థలో జాతీయ సమతౌల్యానికి గల సంబంధం వివరించుము.

## 13.10. చదవదగిన గ్రంథాలు


1. Bo. Sodersten & Geofferey Reed : International Economics
2. Bhagwati. J.N. (ed) : International Trade
3. Greenawy. D : Current Issues in International Trade
4. R.M. Sterm : The Balance of Payments Theory & Economic Policies
5. B. Hansen : The Economic Theory of Fiscal Policy
6. J.E. Meade : The Balance of payments oxford university press, 1951.


ఆచార్య. మోపిదేవి సుందరరావు

పాఠం - 14

# అంతర్గత మరియు బహిర్గత సమతౌల్యము సాధించుటకు అనుసరించవలసిన మార్గాలు

## 14.0 ఉద్దేశ్యం :

ఈ పాఠ్యభాగము నందు క్రింది అంశాలు తెలుసుకోగలము :

ఒక ఆర్థిక వ్యవస్థ యొక్క ఆర్థిక విధానాల ఆశయాలు

స్వాన్ పటముతో సహా బహిర్గత, అంతర్గత సమతౌల్యాల వివరణ

IS, LM మరియు FE నమూనాలు మరియు మారకపు రేటు విధానాలు

ద్రవ్యకోశ విధానాలు మొదలగునవి

## విషయ సూచిక :


14.0 ఉద్దేశ్యం

14.1 ఉపోద్ఘాతము

14.2 ఆర్థిక విధాన ఆశయాలు

14.3 బహిర్గత మరియు అంతర్గత సమతౌల్యాలు - స్వాన్ పటము

14.4 ద్రవ్యకోశ మరియు మారకపు రేటు విధానాలు LM - IS - FE నమూనా

14.5 సారాంశము

14.6 ముఖ్యపదాలు

14.7 స్వయం సమీక్షా ప్రశ్నలు

14.8 చదవవలసిన గ్రంథాలు

## 14.1 ఉపోద్ఘాతము

ఒక నియమిత ఆర్థిక వ్యవస్థలో సమతౌల్యము సాధించాలన్న సంపూర్ణముగా అన్ని ఉత్పత్తి వనరులను ఉత్పత్తి ప్రక్రియలో ఉపయోగించవలసి యున్నది. అదే విధముగా ఒక బహిర్గత ఆర్థిక వ్యవస్థలో సమతౌల్యము సాధించవలెనన్నచో విదేశీ వ్యాపార చెల్లింపుల శేషములోని స్వయం పాలనాధికారం గల రాబడులు చెల్లింపులు సమానం కావలసియున్నది. అనగా ప్రభుత్వము ఉద్దేశ పూర్వకముగా విదేశీ చెల్లింపుల శేషంలోని సమతౌల్యము కొరకు చేయు మూలధన కల్పనలు లేకుండా ఉండవలెను. అదే విధముగా బహిర్గత ఆర్థిక వ్యవస్థలలో ఏక కాలములో సంపూర్ణ ఉద్యోగిత విదేశీ చెల్లింపుల శేష సమతౌల్యము రెండు పరిస్థితులు కలిగి ఉన్నపుడే ఆ ఆర్థిక వ్యవస్థ సాధారణ సమతౌల్య పరిస్థితులు ఏర్పడును. బహిర్గత ఆర్థిక వ్యవస్థలలో ఆర్థికాభివృద్ధి తుది దశలకు చేరవలెనన్నచో దేశీయ, విదేశీ సమతౌల్యం రెండింటినీ ఏకకాలములో నిర్వహణ చేసుకోవలసి యున్నది. ఈ పాఠ్యాంశములో మనం ఈ దేశీయ విదేశీయ సమతౌల్యాలను ఏక కాలంలో సాధించుటకు సంపూర్ణ సాధారణ సమతౌల్యముతో ఆర్థిక వృద్ధిని సాధించుటకు గల వివిధ మార్గాలను గురించి వివరంగా తెలుసుకుందాము.

ప్రస్తుతము ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వివిధ దేశాలన్నీ అంతర్జాతీయ వ్యాపారంలో చురుకుగా పాల్గొనుచున్నాయి. ఈ దేశాలన్నిటికి విదేశీ చెల్లింపుల ఖాతా సమతౌల్యము లేదా బహిర్గత సమతౌల్యము అత్యంత ప్రధానమైన అంశంగా పరిగణించబడుతుంది. బహిర్గత సమతౌల్యంతో పాటు ఈ దేశాలు అంతర్గత సమతౌల్యముపై కూడా దృష్టి సారించక తప్పడం లేదు. అనగా దేశీయంగా సంపూర్ణ ఉద్యోగితతో కూడిన అభిలాషణీయ వనరుల వినియోగం ఎంతో ఆవశ్యకమై యున్నది. దీనినే అంతర్గత లేదా దేశీయ సమతౌల్యముగా పరిగణన చేయుదురు. వర్తమాన ప్రపంచ ఆర్థిక వ్యవస్థలోని దేశాలన్నీ ఏక కాలంలో అంతర్గత మరియు బహిర్గత సమతౌల్య స్థితులను పొందే దిశలో వివిధ రకాలయిన విధానాలను అనుసరిస్తున్నాయి. అనగా ఒక దేశ ఆర్థికాభివృద్ధికి కావలసిన అంతర్గత మరియు బహిర్గత సమతౌల్య స్థితులను నెలకొనేలా చూడటం ఆర్థిక విధానానికి ముఖ్యమైన అంశంగా పరిణమించింది. ప్రస్తుతం అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో నెలకొనిన ప్రపంచీకరణ ధోరణులు కూడా ఆర్థిక విధాన రూపకల్పనలో ఈ రెండు సమతౌల్యాలకు అత్యధిక ప్రాధాన్యతను ఇస్తున్నాయి. ఈ నేపధ్యంలో అంతర్గత బహిర్గత సమతౌల్యాలను ఏకకాలంలో సాధించుటకు గల వివిధ మార్గల అన్వేషణ ఎంతో ప్రాధాన్యాన్ని సంతరించుకుంది.

## 14.2 ఆర్థిక విధాన ఆశయాలు - లక్ష్యాలు

సాధారణంగా దేశాలన్నీ ఆర్థిక విధానాల విషయంలో ఒకే రకమయిన ఆశయాలు కల్గి ఉంటాయి. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలలో సంపూర్ణ ఉద్యోగిత ధరల స్థిరీకరణ, విదేశీ చెల్లింపుల ఖాతా సమతౌల్యము మరియు అభివృద్ధి రేటు ప్రధాన లక్ష్యాలుగా ఉంటాయి. ప్రణాళికాబద్ధమయిన ఆర్థిక వ్యవస్థలలో ఆర్థిక విధానాలకు సంబంధించిన ఆశయాలు మరింత విస్తృతంగాను, దీర్ఘకాలానికి సంబంధించినవిగాను ఉంటాయి. ముఖ్యంగా ఈ ఆశయాలు ఏకకాలంలో అంతర్గత మరియు బహిర్గత సమతౌల్యాలను పొందే దిశలో పేర్కొంటాయి.

ఆర్థిక విధానాలకు సంబంధించిన వివిధ ఆశయాలను ఒక నమూనా రూపంలో ఉంచడానికి ప్రయత్నించినపుడు అది 'N' సమీకరణాలు 'M' వివిధ రకాల మార్గాలు లేదా పెరామీటర్లు కల్గి ఉంటాయి. ఈ నమూనాలోని వివిధ సమీకరణాల మధ్యగల సంబంధాలను పరిశీలించిన మీదట వివిధ మార్గలు, ఆశయాలు గూర్చి కొంతమేరకు తెలియును. ఇందు కొన్ని సిద్ధాంత పరమయిన, ఆచరణ పరమైన అంశాలు ఎన్నో కూడి ఉంటాయి. ఇవన్నీ ఆర్థిక విధాన ఆశయాలు మార్గాలు రూప కల్పనలో కొన్ని సమస్యలను తీసుకొని వస్తాయి. ఒక్కొక్కసారి ఈ నమూనాలో ఆర్థిక విధాన ఆశయాలు అనుకోకుండా ఇమిడి ఉంటాయి. ముఖ్యంగా సంప్రదాయ మరియు నవ్య సంప్రదాయ నమూనాలలో ఈ నిబద్ధత పొందు పరచబడి ఉంటుంది. ఉదాహరణకు వాల్రస్ మహాశయుని సాధారణ సమతౌల్య నమునాను పేర్కొనవచ్చు. అందులో ధరలన్నీ సరళంగాను అదే విధంగా మారకపు రేటు కూడా సరళంగా ఉంటుందని ప్రమేయం చేయబడింది. అలాంటి నమూనాలో

స్వసిద్ధంగా మార్కెట్లను పనిచేసి డిమాండు సప్లయికి కాబడుతుంది. అందువల్ల సంపూర్ణ ఉద్యోగిత మరియు బహిర్గత సమతౌల్యము ఎల్లపుడూ స్వతసిద్దంగా నెలకొని ఉంటాయి. ఆర్థిక విధానం దృష్ట్యా ఈ రకమైన నమూనాలు చాలా ఉపయుక్తంగా ఉంటాయి.

ఇతర నమూనాలు పరిశీలించిన మీదట తెలియునదేమనగా కొన్ని నమూనాలలో అంతర్గత బహిర్గత సమతౌల్యాలు రెండూ ఏకకాలంలో పొందగలిగాయి. మరికొన్ని నమూనాలు కేవలం విదేశీ వ్యాపార రహిత ఆర్థిక వ్యవస్థను ప్రమేయంగా తీసుకొన్నపుడు వానికి ముఖ్య ఆశయాలుగా కేవలం సంపూర్ణ ఉద్యోగిత, స్థిరమైన ధరలు చెప్పబడతాయి. కాని ధరలు సరళంగా ఉన్నపుడు డిమాండు సరఫరాలు సమానమయినపుడు మార్కెటు సమతౌల్యం సిద్ధిస్తుంది. తద్వారా సాపేక్ష ధరల వ్యవస్థను నిర్ణయించబడతాయి. దానికి కారణం ద్రవ్య సరఫరా దీర్ఘకాలమున సర్దుబాటు అగుతుంది. అటువంటి సమయాల్లో దీర్ఘకాలంలో కూడా ఉద్యోగితపై ఎటువంటి ప్రభావితం ఉండక సంపూర్ణ ఉద్యోగిత ఉండటానికి అవకాశం ఉంటుంది. కాని సాధారణ ధరల స్థాయిపై కొంత ప్రభావం ఉండవచ్చును. కావున ధరలపై కొంత ప్రభావం ఉండవచ్చు. కావున ధరలస్థాయి కొంత మేరకు నియంత్రణ చేయవలసి వస్తుంది. అప్పుడు ఆర్థిక వ్యవస్థలో స్థిరీకరింప బడిన ధరలతో కూడిన సంపూర్ణ ఉద్యోగిత ఉండును.

ఒక్కొక్కసారి కొన్ని ఆర్థిక వ్యవస్థలలో ఈ రెండు ఆశయాలు అనగా ధరల స్థిరీకరణ మరియు సంపూర్ణ ఉద్యోగితను అప్రయత్నంగా కలుగకపోవచ్చును. అలాంటపుడు ధరలలోని మార్పులు అధిక సరఫరా మరియు వస్తుసేవల డిమాండులలో మార్పుల వల్ల ప్రభావితమవుతాయి. అపుడు ఆ వ్యవస్థ విదేశీ వ్యాపారంతో కూడి ఉన్నపుడు సంపూర్ణ ఉద్యోగిత విదేశీ చెల్లింపుల ఖాతా సమతౌల్యం రెండూ ప్రధాన ఆశయాలుగా ఉంటాయి. ఇలాంటి నమూనాలలో నిరుద్యోగిత వ్యాపార శేషంలో అసమతౌల్యము కల్గును. అటువంటి సందర్భాలలో సంపూర్ణ ఉద్యోగితను ఆర్థిక వ్యవస్థ సాధించగలిగినచో చెల్లింపుల ఖాతా సమతౌల్యము అప్రయత్నంగా వచ్చును. ఈ నమూనాలో ఒక మార్గం ద్వారా రెండు ఆశయాలను సాధించగలవు.

మరోరకమైన నమూనాలో రెండు ఆశయాలను సాధించుటకు రెండు మార్గములు కావలసి వచ్చును. ఉదాహరణకు కీన్సు ప్రతిపాదించిన నమూనాలో సంపూర్ణ ఉద్యోగిత చెల్లింపుల ఖాతా సమతౌల్యము అప్రయత్నంగా రాలేదు. అందువల్ల ఈ నమూనాలలో పై రెండు ఆశయాలను నెరవేర్చుటకు రెండు మార్గములు కావలసియుండును. సంపూర్ణ ఉద్యోగితను సాధించుటకు కోశ విధానం, చెల్లింపుల ఖాతా సమతౌల్యము కొరకు మారకపు రేటు విధానమును అనుసరించవలసి ఉంటుంది.

సాధారణంగా ఆర్థిక వ్యవస్థలలో ఒక ప్రత్యేక పరిస్థితిని ఎదుర్కొనుటకు ఎక్కువ ఆశయాలు సాధించుటకు తక్కువ విధాన మార్గాలను అవలంబించుట జరుగును. సాధారణంగా ప్రతీ ఆశయం తీర్చుటకు ఒక విధాన మార్గం కావలసి ఉంటుంది. రెండు ఆశయాలు తీర్చుటకు రెండు విధాన మార్గములు ఆ విధంగా ఉండును. ఆశయాల సంఖ్య కన్నా ఎక్కువ విధాన మార్గాలు ఉన్న పరిస్థితులలో కొన్ని మార్గములను మాత్రం ఉంచుకొని ఆశయాలు సాధించకొనవలసి ఉంటుంది.

ఒక్కొక్కసారి వ్యవస్థలో పరస్పర విరుద్ధమైన ఆశయాలు సిద్ధించవలసి యుండును. ఉదాహరణకు ఏకకాలంలో ఉండుట ఒకదానికొకటి విరుద్ధం కావచ్చును. అలాగే ఒక్కొక్కసారి ఏకకాలంలో అంతర్గత, బహిర్గత సమతౌల్యంలో ఆర్థిక వ్యవస్థ స్థితిగతులపై అక్కడ నెలకొనియున్న ప్రత్యేక పరిస్థితులపై ఆధారపడి ఉండును. అటువంటి సందర్భాలలో పరస్పర విరుద్ధభావన కల్గిన ఆశయాలను తీర్చుకొనుటకు కొన్ని ప్రత్యేక మార్గాల సమూహము కావలసి యుండును. అదే విధంగా కాలానుగుణంగా ఆర్థిక వ్యవస్థలో సంభవించు ప్రత్యేక పరిణామాలు కూడా వివిధ ఆశయాల మధ్య విరుద్ధ భావనలను తీసుకొని రావచ్చును. సాధారణంగా స్వల్పకాలంలో ఈ ఆశయాలను పరస్పర విరుద్ధ భావనలు దీర్ఘకాలంలో కాలానుగుణంగా సమసిపోవచ్చును. ఒక్కొకసారి పరస్పర విరుద్ధమైన ఆశయాలను నెరవేర్చుకొనుటకు కొత్త విధాన మార్గాలను కూడా ప్రవేశపెట్టవలసి యుండును. మొత్తం మీద ఆర్థిక వ్యవస్థ పరిణామ క్రమంలో ఈ సమస్య పరిష్కారమగును.


మరో ముఖ్యాంశమేమనగా ఆశయాలకు వానిని పొందుటకు అనుసరించు విధాన మార్గాలకు మధ్యగల పరస్పర సంబంధం ముఖ్యంగా మారును. ప్రధానంగా సాధారణ సమతౌల్య పరిస్థితులలో వివిధ ఆశయాలు మరియు విధానాల మార్గాల మధ్య సంబంధం సంతులితంగా నుండును. కాని కొన్ని విపత్కర పరిస్థితులలో ఈ ఆశయాలు, విధాన మార్గాల మధ్య పరస్పర వైవిధ్యం కన్పించినప్పటికీ కాలానుగుణంగా వివిధ అంశాల గుండా వచ్చు మార్పులవల్ల ఈ సమస్య పరిష్కారం కావచ్చునని ఆర్థికశాస్త్రవేత్తల అభిప్రాయం.

ఈ వివిధ అంశాల నేపథ్యంలో కొన్ని విధాన మార్గాలు మరియు ఆశయాలు సమూహాలుగా లేదా జంటలుగా అభిలాషణీయమయిన విధంగా ఎన్నుకొనుట ముఖ్యాంశమైయున్నది. ఉదాహరణకు సంపూర్ణ ఉద్యోగిత స్థిర ధరల స్థాయి ఒక ఆశయ సమూహం కాగా వాటిని సిద్ధించుటకు కావలసిన మార్గాల సమూహాకంగా కోశ మరియు ద్రవ్య విధానాలను పేర్కొనవచ్చు. ఇందు ఏ విధాన మార్గంలోని స్వల్పమార్పులైనా అది రెండు ఆశయాలను ప్రభావితం చేయును. అలాకాక ప్రత్యేకంగా కోశ విధానంను సంపూర్ణ ఉద్యోగితకు ద్రవ్య విధానమును, ధరల స్థిరీకరణకు అనుసరించునప్పటికి వాని ప్రాథమిక ప్రభావాలు మలిదశ ప్రభావాలు వివిధ రకాలుగా ఉండును.

సాధారణ సమతౌల్యం నమూనాలో ఒక్క ఆశయాప్న్, ఒక్క చలాంకం కాని మార్పు వచ్చినప్పటికి అది ఇతర ఆశయాలపై ప్రభావం చూపక పోవచ్చును. ఇది సిద్ధాంతపరంగా సరియైనదైనప్పటికీ ఆచరణలో కొన్ని సమస్యలు ఏర్పడును. ఒక్కొక్కసారి సాధారణ సమతౌల్య పరిస్థితులలో అన్ని విధాన మార్గాలను అన్ని ఆశయాలను వనగూర్చుటకు ఉపయోగించవచ్చును. అవగా ఒక కాలంలో ఒక ఆశయం తీర్చుటకు ఒక విధాన మార్గంను అమలుచేయుటకు కాగా ఒకే కాలంలో అన్ని ఆశయాలు తీర్చుటకు అన్ని విధాన మార్గాలను తీర్చుటకు అనుసరించుట తప్పనిసరి కావచ్చు. అలాంటపుడు ఆర్థిక వ్యవస్థ కొన్ని ప్రత్యేక సమస్యలను ఎదుర్కొనవచ్చును.

## 14.3 బహిర్గత మరియు అంతర్గత సమతౌల్యాలు - స్వేన్ పటము :

పై అంశాలవలన తెలియునదేమనగా ఒక విధాన మార్గంలోని మార్పు అది ఉద్దేశింపబడిన ప్రత్యేక ఆశయమునే గాక మిగిలిన వానిపై కూడా ప్రభావాన్ని చూపును. ఉదాహరణకు మారకపు రేటు విధానంలోని మార్పు కేవలం చెల్లింపుల ఖాతా అంశాలనే కాక దేశీయ అంశాలైన ఉద్యోగిత ఆదాయాలను ప్రభావితం చేయును. అందువలన మనం ఈ ఆశయాలను విధాన మార్గాల విశ్లేషణకు సంబంధించి ఒక సమతౌల్య స్థితిని విశదీకరింపవలసి యున్నది. ఈ ఆశయాల విధాన మార్గాల విశ్లేషణను ఒక చక్కని పటం రూపంలో ఆస్ట్రేలియా అర్థశాస్త్రవేత్త ట్రవర్ స్వేన్ అను మహాశయుడు వివరించాడు. దీనినే స్వేన్ పటంగా పేర్కొంటారు.



పై పటంలో ఒక దేశపు విదేశీ మారకపు రేటు 'a' గా పేర్కొనవచ్చు. OX అక్షముపై నిజ దేశీయ వ్యయంగా తీసుకోవడమైనది. E E రేఖ చెల్లింపుల ఖాతా సమతౌల్యము రేఖ. ఈ రేఖపై గల వివిధ బిందువులు ఒక మారకపు రేటు దగ్గర దేశీయ నిజ వ్యయాల పరిస్థితిని తెల్పును. ఈ రేఖ (E E) ఎగువకు కుడివైపు వాలు కల్గి ఉంటుంది. తక్కువ స్థాయి దేశీయ వ్యయం $D_1$ వద్ద జాతీయ ఆదాయం సమతౌల్యం తక్కువ స్థాయిలో ఉండును. కావున దిగుమతులకు డిమాండు తక్కువ ఉండును. విదేశీ కరెన్సీ ధర కూడా తక్కువగా ఉండును. $R_2$ తక్కువ స్థాయి విదేశీ మారకపు రేటును సూచించును. దీని వలన ఎగుమతులు తగ్గి తక్కువ దిగుమతుల వద్ద దేశీయ కరెన్సీ ఎక్కువ విలువ కలిగి ఉండి E E రేఖపై 'a' బిందువు వద్ద ఆర్థిక వ్యవస్థ సమతౌల్యంగా నుండును. దేశీయ వ్యయ స్థాయి ఎక్కువ అయినచో దిగుమతులు కూడా పెరుగును. అపుడు మారకపు రేటులో తరుగుదల ఏర్పడును. ఉదాహరణకు $D_0$ దేశీయ వ్యయం వద్ద మారకపు రేటులో తరుగుదల ఏర్పడి $R_0$ వద్ద విదేశీ సమతౌల్యము కల్గవచ్చును. E E రేఖకు ఎడమ ప్రక్క ఉన్న బిందువులన్నీ (b) విదేశీ వ్యాపార శేషంలో మిగులును సూచించు వివిధ దేశీయ వ్యయము మరియు మారకపు రేట్లు కలయికలుగా చెప్పవచ్చు. అదే విధంగా E E రేఖకు కుడి ప్రక్కకు ఉన్న బిందువులన్నీ (e) విదేశీ వ్యాపార శేషంలో మిగులును సూచించు దేశీయ వ్యయం మరియు విదేశీ మారకపు రేట్ల కలయికలై ఉన్నవి. అనగా 1, 2 జోన్లు విదేశీ వ్యాపార శేషంలో మిగుల్లను సూచించుచుండగా, 3, 4, జోన్లు లోటును సూచించుచున్నవి.

YY రేఖ దేశీయ వ్యయాన్ని మరియు మారకపు రేట్ల కలయికను సంపూర్ణ ఉద్యోగిత మరియు స్థిర ధరలు దేశీయంగా కల్గు స్థితులను (దేశీయ సమతౌల్యం) సూచించును. దేశీయ డిమాండు $D_2$ అయినపుడు విదేశాల నుండి మన ఎగుమతులకు వచ్చు డిమాండు తక్కువగా ఉండును. ఎందువల్లననగా మారకపు రేట్లు $R_2$ దేశీయ కరెన్సీ ధర ఎక్కువను చూపును. ఇది ఎగుమతులను తగ్గించి వేయును. అందువల్ల విదేశీ ద్రవ్యం తక్కువగా లభ్యమగును. Y Y రేఖ మీద 'C' బిందువు వద్ద దేశీయంగా ఎక్కువ లోటు మరియు ఎక్కువ వ్యయం ఉండును. దీని వలన ఎగుమతులు పెరుగును. అదే విధంగా 'd' బిందువు వద్ద తక్కువ దేశీయ వ్యయాన్ని సూచిస్తుంది. అచ్చట సంపూర్ణ ఉద్యోగిత దేశీయ కరెన్సీ విలువ తగ్గి $R_1$ రేటు వద్ద వచ్చును. ఈ తగ్గిన మారకపు రేటు వద్ద ఎక్కువ ఎగుమతులు జరిగి వ్యయం తగ్గును. అచ్చట సంపూర్ణ ఉద్యోగిత నెలకొంటుంది. పటంలో గల Y Y రేఖకు కుడి ప్రక్క ఉన్న బిందువులు ఆర్థిక వ్యవస్థలోని అధిక డిమాండులను, దాని వల్ల ద్రవ్యోల్బణం ఏర్పడు పరిస్థితులను సూచిస్తుంది. ఎడమ ప్రక్క బిందువులు తక్కువ డిమాండు స్థితిని చూపుతుంది. దీని వల్ల ఆర్థిక వ్యవస్థలో నిరుద్యోగిత ఉండదు. ఈ అంశాలను పటంలో 2, 3 జోన్ల ద్రవ్యోల్బణ స్థితిని 1, 4 జోన్లు నిరుద్యోగితను సూచిస్తున్నాయి. 'P' బిందువు వద్ద ఆ దేశపు అంతర్గత మరియు బహిర్గత సమతౌల్యం రెండింటిని ఏకకాలంలో కల్గి ఉన్నట్లు E E రేఖ Y Y రేఖ కలయిక వివరిస్తుంది.


P బిందువు బయట ఆర్థిక వ్యవస్థ అసమతౌల్యంలో ఉంటుంది. వివిధ జోన్లలో అసమతౌల్యం క్రింది విధంగా ఉండుట వివరించవచ్చు.

**1 వ జోను :** విదేశీ వ్యాపార శేషము మరియు దేశీయ నిరుద్యోగంను సూచించగా

**2 వ జోను :** విదేశీ వ్యాపార మిగులు దేశీయ ద్రవ్యోల్బణ వత్తిడిని సూచిస్తుంది

**3 వ జోను :** విదేశీ వ్యాపార లోటు దేశీయ ద్రవ్యోల్బణ వత్తిడిని ;

**4 వ జోను :** విదేశీ వ్యాపారలోటు దేశీయ నిరుద్యోగమును వివరిస్తుంది. ఈ అంశాల పరిస్థితులను క్రింది పటంలో వివరించబడింది.




అసమతౌల్య పరిస్థితులను వివిధ జోన్ల విభజన ఒక్కొక్క దేశంలో ఎదుర్కొంటున్న ప్రత్యేక సమస్యల గూర్చిన అవగాహనలను కలుగజేయును. అంతేకాక ఒక్కొక్క పరిస్థితికి తగిన పరిష్కారములను విధాన మార్గాలను కనుగొనుటకు ఉపకరించెను. వివిధ రకాల అసమతౌల్యాన్ని 4 జోన్లలో చెప్పినప్పటికి ఒక్కొక్కసారి ఒక్క జోన్‌లోనే వివిధ బిందువుల వద్ద పరిస్థితులు వేరుగా ఉండవచ్చును. ఉదాహరణకు నాల్గవ జోన్‌లోని 'a b' పాయింట్లు నిరుద్యోగితను విదేశీ వ్యాపారలోటును సూచించినప్పటికి 'a' బిందువు వద్ద సమస్య పరిష్కారమునకు మూల్యన్యూనీకరణ మరియు దేశీయ వ్యయంలోని పెరుగుదల విధానం కావలసివచ్చును. కాని 'b' బిందువు వద్ద మూల్యహీనీకరణతో పాటు దేశీయ వ్యయంలో తగ్గుదల విధానం పనికి వచ్చును. అదే విధంగా 'c' బిందువు వద్ద మూల్యహీనీకరణ చేయవచ్చు. దాని వల్ల 'd' బిందువు వద్ద బహిర్గత సమతౌల్యం ఏర్పడును. అదే సమయంలో దేశీయంగా ద్రవ్యోల్బణ పరిస్థితి ఏర్పడును. అందువల్ల కొద్దిపాటి మూల్యన్యూనీకరణ మరియు దేశీయ వ్యయంలో తగ్గుదల విధానాలను అనుసరించుట ద్వారా 'd' నుండి p బిందువు వద్ద సమతౌల్యం వచ్చు. అదే విధంగా 'c' వద్ద ఉపయోగించిన విధానాల కలయికే 'b' వద్ద కూడా ఉపకరించును.


సాధారణ సమతౌల్యంగా ఏర్పడు విభిన్న పరిస్థితులకు వివిధ విధానాలను ఏ విధంగా ఎన్నుకుంటాయో మిక్కిలి ఆవశ్యకమైయున్నది. ఉదాహరణకు 'a b' పరిస్థితుల రెండింటి వద్ద తొలిదశలలో నిరుద్యోగం ఉన్నప్పటికి వాని వద్ద వివిధ విధాన మార్గాలు కావలసివచ్చును. సమతౌల్య స్థితి పొందుటకు 'a b c' ల బిందువుల వద్ద వివిధ విధాన మార్గాలు ఆవశ్యకమగును. 'a' విషయంలో దేశీయ వ్యయం పెంచుట ద్వారా నిరుద్యోగితను తగ్గించవచ్చును. అలాగే మూల్యహీనీకరణ ద్వారా బహిర్గత సమతౌల్యాన్ని పొందవచ్చును. కాని 'b' వద్ద మూల్యహీనీకరణ నిరుద్యోగితను దేశీయ వ్యయాన్ని తగ్గించుట ద్వారా సంపూర్ణ సమతౌల్యం తీసుకువచ్చును. అదే విధంగా 2 వ జోనులో విదేశీ మారకపు రేటులో పెరుగుదల అవశ్యకమగును. దాని ద్వారా విదేశీ వ్యాపార సమతౌల్యం పొందవచ్చును. చాలా చోట్ల అలాంటి విధానం ద్రవ్యోల్బణ, ప్రతి ద్రవ్యోల్బణ విధానంతో కలిపి సంయుక్తంగా ఉపయోగించవలసియుంది. 1 వ జోనులో ద్రవ్యోల్బణ విధానం సంపూర్ణ ఉద్యోగితకు మరియు వ్యాపార మిగుళ్లు తగ్గించుటకు ఉపయోగపడును. మరల విదేశీ మారకపు రేటులోని పెరుగుదల, తగ్గుదలలో సంపూర్ణ సమతౌల్యమునకు కావలసివచ్చును. అనగా మారకపు రేట్లులేని మార్పు ఇచ్చుట తప్పనిసరి కావచ్చు.

ఈ విధంగా స్వేన్ (swan) ప్రతిపాదించిన పటము దేశీయ విదేశీయ సమతౌల్యం సాధించుటకు కావలసిన ఆశయాల విధాన మార్గముల విశ్లేషణలో ఎంతో ప్రాముఖ్యత వహించియుంది. ఒక్క ఆర్థిక వ్యవస్థకు రెండు లక్ష్యములున్నచో సాధారణంగా కనీసం రెండు విధాన మార్గాలు వానిని తీర్చుటకు కావలసి యుండును. సాధారణంగా దేశీయ విదేశీయ సమతౌల్యమును సాధించుటకు ద్రవ్య, కోశ విదేశీ మారకరేట్ల విధానాలు ప్రధానమైయున్నవి. ఈ విధానాలనే వివిధ కలయికలలో వివిధ పరిస్థితులయందు వినియోగించవలసి యుండును. ఈ విధంగా మనకు దేశీయ సమతౌల్యమునకు ద్రవ్యకోశ విధానాలు చెల్లింపుల ఖాతా సమతౌల్యమునకు, విదేశీ మారకపు రేటు విధానం ముఖ్యమైన విధాన మార్గముగా పేర్కొనబడినది. వివిధ పరిస్థితులలో ఈ విధాన మార్గములను వివిధ రకాలుగా సమ్మేళనం చేయుట ద్వారా పరిష్కారం పొందవచ్చునని అర్థశాస్త్రవేత్తల అభిప్రాయం. ఈ విధానాల మార్గాలను ఏ ఏ పరిస్థితులను బట్టి ఏ మేరకు సమ్మేళనం చేసి జంట విధానాలుగా వాడాలన్నది ప్రధానమైన విషయంగా రూపొందించారు. ఉదాహరణకు 2 వ జోన్‌లోని 'a' బిందువు వద్ద ద్రవ్యోల్బణ వత్తిడి, వ్యాపారములోని నిధులు రెండూ కలవు. మారకపు రేటు పెరుగుదల చేసినచో 'a' నుండి 'b' బిందువు వద్దకు చేరవచ్చును. అచ్చట విదేశీ చెల్లింపుల సమతౌల్యం కలదు. ఈ 'a' నుండి 'b' కి చేరుటకు రెండు మార్గములు కలవు. ఆ దేశపు మారకపు రేటును పెంచుట ద్వారాను లేదా దేశీయ ఆర్థిక వ్యవస్థలో ప్రతి ద్రవ్యోల్బణ కోశ విధానాలనుగాని అవలంభించవచ్చును. వీటిలో ఏది తీసుకోవలసినదని ఆ దేశ ప్రత్యేక పరిస్థితులను బట్టి నిర్ణయించవలసియుండును.

## 14.4. ద్రవ్య, కోశ మరియు మారకపురేటు విధానాలు - LM - IS - FE - నమూనా

దేశీయ అంతర్జాతీయ సమతౌల్య స్థితులను సాధించుటకు కోశపరమైన విశ్లేషణ ప్రాముఖ్యం కల్గి ఉన్నది. సాధారణంగా వ్యయ తగ్గింపు విధానాలను జాతీయ ఆదాయమును నియంత్రించుటకు ఉపయోగించెదురు. అదే విధంగా వ్యయ పెంపు విధానాలను విదేశీ వ్యాపార చెల్లింపుల నియంత్రణకు ఉద్దేశింపబడ్డాయి. అయినప్పటికి ద్రవ్య విధానాలు కూడా చాలా ప్రాముఖ్యతను కలిగి ఉన్నాయి. దీనికి ఉదాహరణగా - మూలధన కదలికలు ఇటీవల కాలంలో అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ ప్రభావితం చేయుటలో ప్రధాన పాత్ర వహించుటను వివరించవచ్చు. అంతర్జాతీయ చెల్లింపుల సమతౌల్యాన్ని సాధించుటకు మూలధన కదలికలను వడ్డీరేట్ల విధానం ద్వారా నియంత్రించవచ్చు. ఈ విధంగా ఆశయాల సాధానా మార్గాలు విశ్లేషణ మూలధన కదలికలను కూడా పరిగణనలోకి తీసుకొని విశ్లేషణ చేయవలసియుంది. వీటిలో ముఖ్యముగా IS - LM రేఖల విధానమును చెప్పవచ్చు. J.R. హిక్స్ మరియు ఐవన్ హాన్‌సన్‌లు కీన్సు ఆర్థిక సూత్రాల ప్రాతిపదికన ప్రతిపాదించారు. ఈ విశ్లేషణ స్థూల అర్థశాస్త్ర పరిధిలో విస్తృత ప్రచారం పొందింది.

ఒక మార్కెటులో వడ్డీరేట్లు మరియు జాతీయాదాయ కలయిక ఏ విధంగా సమతౌల్యంలో ఉంటుందో. IS రేఖ వివరిస్తుంది. ఈ రేఖ వాలు దిగువకు వాలి ఉంటుంది. ఎందువలననగా వడ్డీరేట్లలోని తగ్గుదల పెట్టుబడిని పెంపొందింప చేయును. తద్వారా జాతీయాదాయంపై విస్తృత ప్రభావం చూపును. IS రేఖ పైకి కదలినపుడు క్రింది పటంలో చూపిన విధంగా $IS_1$ నుండి $IS_2$ కు మార్పు చెందుట ఆ దేశ పెట్టుబడి సాదును ప్రవర్తనలోని మార్పును సూచించును. అనగా ఆ దేశంలోని పెట్టుబడి రేట్లు ఏ వడ్డీరేట్ల స్థాయి వద్దయినను ఎక్కువ పెట్టుబడి పెట్టుటను IS రేఖ పైకి మార్పుచెందుట సూచించును. అనగా సమతౌల్యం $R_1$ వడ్డీ రేటు వద్ద జాతీయ ఆదాయం $Y_1$ ఉండగా IS రేఖ మారుటవలన జాతీయ ఆదాయ సమతౌల్యం $Y_1$ నుండి $Y_2$ కు పెరుగుట జరిగింది.





అదే విధంగా LM రేఖ ద్రవ్య సరఫరా వడ్డీరేటు మరియు జాతీయాదాయాల మధ్య గల పరస్పర సంబంధమును తెలుపును. LM రేఖ మీద ఏ బిందువైననూ ఒక వడ్డీరేటు క్రింద జాతీయాదాయం ద్రవ్య సరఫరాల సమ్మేళనము ఏ విధముగా నుండునో ద్రవ్య మార్కెటులోని సమతౌల్య స్థితిని సూచించును. ఈ రేఖ యొక్క ధనాత్మక వాలు సూచించునదేమనగా జాతీయాదాయం పెరిగినచో ద్రవ్య డిమాండు పెరిగి తద్వారా వడ్డీరేట్ల ద్రవ్య సరఫరా నిలకడగా ఉండటం వల్ల వడ్డీరేటు ఏ విధంగా పెరుగునోచూపును. ఆ సమయంలో ద్రవ్య సరఫరా కూడా పెరిగినచో LM రేఖ కుడి ప్రక్కకు మారును ఈ మార్పు పరపతిలోని పెరుగుదలను తద్వారా జాతీయాదాయంలోని పెరుగుదలను తద్వారా వడ్డీరేట్ల తగ్గుదలను సూచించును. పై పటంలో LM రేఖ$LM_1$ నుండి $LM_2$ కు మార్పు చెందినది. ఆ సమయంలో IS రేఖ స్థిరంగా ఉందని భావిస్తే జాతీయాదాయం $Y_1$ నుండి $Y_3$ కి పెరుగును. వడ్డీరేటు $r_1$ నుండి $r_3$ కి తగ్గును. అంతర్జాతీయ వ్యాపారము కల్గియున్న బహిర్గత ఆర్థికవ్యవస్థలో విదేశీ మారకపు రేటు ప్రభావాలు IS LM రేఖలపై ఎక్కువగా ఉంటాయి. ఉదాహరణకు ఒక IS రేఖ వద్ద మూల్యహీనీకరణ జరిగినచో సాపేక్ష ధరలను మరియు వ్యయాలను మార్పుచేయును. ఎగుమతి వస్తు తయారి పరిశ్రమలు, దిగుమతి ప్రత్యామ్నాయ వస్తు పరిశ్రమలు ఎక్కువ పోటీ తత్వాన్ని పొంది ఉంటాయి. కావున ఎక్కువ లాభాలను ఆర్జించి ఏ వడ్డీరేట్ల వద్దనయినా ఎక్కువ పెట్టుబడి పెట్టెదరు. అందువల్ల IS రేఖ మూల్యహీనీకరణ అనంతరం కుడి ప్రక్కకు మారును.


అదే విధంగా మూల్యన్యూనీకరణ ద్రవ్య డిమాండ్లలో కూడా మార్పును తెచ్చును. తద్వారా ధరల స్థాయి పెరుగును. అనగా నిజ శేష ప్రభావం వలన కూడా ద్రవ్య డిమాండు పెరుగును. ఇలా పెరుగుట వల్ల మూల్యహీనీకరణ తద్వారా LM రేఖ ఎడమ ప్రక్కకు మారును. మూల్యహీనీకరణ తర్వాత సమతౌల్యం పటంలో P నుండి $P_1$ కు వృద్ధి చెందుటను గమనించవచ్చు. దీనితో వడ్డీ రేట్లు పెరుగును. మొత్తం మీద జాతీయాదాయంపై కొంత ధనాత్మక ప్రభావం కలిగి ఉండును. ఈ విశ్లేషణ చెప్పునదేమనగా మూల్యహీనీకరణ ద్రవ్యమార్కెటును నియంత్రణ చేయును. దాని వల్ల ఆర్థిక వ్యవస్థ మొత్తం నియంత్రణలోనికి వచ్చును. ఈ విశ్లేషణ ఆధారంగా ఈ దిగువ పటంలో IS, LM రేఖలతో పాటు FE రేఖను కూడా ప్రవేశపెట్టుట జరిగింది. FE రేఖను విదేశీ మారక పట్టికగా పరిగణింతురు. ఈ రేఖపై ప్రతిబిందువు వడ్డీ రేట్లు మరియు జాతీయాదాయం విదేశీ మారక మార్కెట్లు సమతౌల్యంగా ఉన్నపుడు ఏ విధంగా ఉండునో తెలియజేయును. అచ్చట మూలధన ప్రవాహాలు కూడా పరిగణనలోకి తీసుకొనుట ముఖ్య విషయము. సాధారణంగా విదేశీ చెల్లింపుల సమతౌల్యం రెండు భాగాలుగా పరిగణింతురు. అందులో మొదటిది వ్యాపార శేషం రెండవది మూలధన శేషము. వ్యాపార శేషమందలి మిగులు లేదా లోటు మూలధన ఖాతాలోని మూలధన ప్రవాహాలు తదనుగుణంగా మార్చుట ద్వారా విదేశీ చెల్లింపుల ఖాతా సమతౌల్యం

ఏర్పడును. అనగా వ్యాపార ఖాతాలో మిగులున్నపుడు మూలధనమును బయటకు ప్రవహించెదరు. తద్వారా చెల్లింపుల సమతౌల్యం ఏర్పడును. అందువల్ల FE రేఖ వాలుపైకి మరియు కుడి ప్రక్కకు ఉండును. అంతేకాక దీనివల్ల దిగుమతులు జాతీయాదాయం పెరుగుతాయి అనే భావనలను ఇది చూపుతుంది. మరోవైపు మూలధనం వడ్డీరేట్లను అనుసరించి దేశాలమధ్య కదలుచుండునని వివిధ దేశాలలోగల వడ్డీరేట్లలోని తేడాలను బట్టి ఈ కదలికలుండునని తెలియుచున్నది. జాతీయాదాయం పెరిగినపుడు వడ్డీరేట్లు పెరుగుటవల్ల ఆ పెరిగిన వడ్డీ రేటు మూలధనాన్ని ఆకర్షించునని తద్వారా చెల్లింపుల ఖాతాను సమతౌల్యం చేయునని తెలియును. అందువల్ల FE రేఖ వడ్డీరేట్లు మరియు జాతీయాదాయ సమేళనాన్ని విదేశీ మారక మార్కెటు సమతౌల్యంలోనున్నపుడు ఎలా ఉండునో తెల్పును. అందువల్ల ఆ రేఖ వాలుపైకి ఉండును. మరియు కుడి ప్రక్కకు మారును.

మూల్యహీనీకరణ వల్ల FE రేఖ దిగువకు మరియు కుడి ప్రక్కకు మారును. క్రింది పటంలో ఈ రేఖ $FF_1$ నుండి $FF_2$ కు మారింది. మూల్యహీనీకరణ ఎగుమతులను పెంచి జాతీయాదాయం పెరుగుటవల్ల ఈ మార్పు జరిగింది.




కావున ఇవ్వబడిన వడ్డీరేట్ల వద్ద వ్యాపారలోటు చిన్నదిగాను మిగులు పెద్దదిగాను మారును. అనగా ఒక ఇవ్వబడిన జాతీయాదాయ స్థాయి వద్ద కొద్దిపాటి మూలధనం దేశంలోకి ప్రవేశించేటపుడు లోటును భర్తీ చేయును. ఈ లోటు చిన్నపాటిదైనచో పర్వాలేదు. దానికై వడ్డీరేటును తగ్గించవలసి యుండును. పై పటం నుండి మనకు ఈ విషయాలు తెలుస్తాయి. కొత్త సమతౌల్య బిందువు P నుండి ఎగువకు మరియు కుడి ప్రక్కకు మారి $P_1$ గా అవతరించింది. అనగా మూల్యహీనీకరణ వల్ల జాతీయ ఆదాయం పెరుగుదల మరియు వడ్డీరేట్లు పెరుగుట జరుగును. సాధారణంగా ఆర్థికాభివృద్ధి దీనివల్ల ఉత్తేజమగును. విదేశీ వ్యాపార రంగం సాపేక్షంగా ఎక్కువ ప్రాధాన్యత పొందును. ఎగుమతి పరిశ్రమలకు లాభాలు ఎక్కువగా చేరును. ఈ సంధి కాలంలో వేతనం పొందువారు కొంత వరకూ బాధపడవచ్చు. అదే విధంగా ఆస్తులు కల్గిఉన్నవారు కూడా కొంత మేరకు క్లిష్టపరిస్థితులు ఎదుర్కొనవలసి వచ్చు. ఎందుకంటే ఆస్తుల విలువలు తగ్గును. పై పటమందు FE రేఖ LM రేఖతో పోల్చినపుడు తక్కువ వాలు కల్గి ఉంది. ఎందుకంటే కీన్సు విశ్లేషణ ప్రకారం మూల్యహీనీకరణ దేశీయంగా ఆదాయాన్ని పెంచును. ద్రవ్య సరఫరా స్థిరంగా ఉన్నపుడు వడ్డీరేటు అధికమగును IS LM విశ్లేషణ ద్వారా దేశీయంగా సమతౌల్యాన్ని ఏ విధంగా సాధించవచ్చునో తెలియును. ఈ IS LM విశ్లేషణలో FE రేఖను కూడా ప్రవేశపెట్టుట ద్వారా దేశీయ అంతర్జాతీయ సమతౌల్యాలను ఏకకాలంలో ఏ విధంగా ఉంచవచ్చునో ఈ క్రింది పటం ద్వారా వివరించుట జరిగింది.




పై పటం నుండి తొలుత P బిందువు వద్ద సమతౌల్యం $r_1$ వడ్డీరేటు $y_1$ జాతీయ ఆదాయం కల్గియున్నది. ఈ పరిస్థితులలో P బిందువు $y_1$ ఆదాయం వద్ద పూర్తి ఉద్యోగిత స్థాయిని కల్గిలేదు. ఈ పరిస్థితులలో సంపూర్ణ ఉద్యోగిత కొరకు ప్రభుత్వము ద్రవ్య విధానమును ఉపయోగించినపుడు ఆ విధానం వలన ఎక్కువ ద్రవ్య O సరఫరా చేయబడును. అందువల్ల LM రేఖ $LM_1$ నుంచి $LM_2$ కు మార్పు చెందినది. Q బిందువు వద్ద $y_2$ పెరిగిన జాతీయాదాయం $r_2$ తగ్గిన వడ్డీరేట్ల వద్ద ద్రవ్యం సరఫరా పెరిగి కొంత సమతౌల్యత ఏర్పడింది. అయినప్పటికి Q బిందువు వద్ద దేశీయ సమతౌల్యం ఉన్నది గాని అంతర్జాతీయ చెల్లింపుల సమతౌల్యం లేదు. వడ్డీ రేటు తక్కువ ఉండటం వల్ల Q బిందువు వద్ద ఆర్థిక వ్యవస్థకు కావలసినంత మూలధన ప్రవాహాలు వచ్చుట లేదు. అందువల్ల Q బిందువు వద్ద చెల్లింపుల శేషంలో లోటు ఏర్పడి చెల్లింపుల సమతౌల్యం పొందలేకపోవుట జరిగింది.

ఈ పరిస్థితులలో ప్రభుత్వం జోక్యం చేసుకోకుండా ఉన్నచో ఈ పరిస్థితి ఎట్లు సర్దుబాటు అగునో చూచెదము. విదేశీమారక మార్కెటులోనున్న అధిక డిమాండ్ల పరిస్థితి మారకం రేట్లలో తగ్గుదల తీసుకునవచ్చును. ఈ తగ్గుదల వలన నగదు విలువలకు డిమాండు పెరుగును. అందువల్ల LM రేఖ వెనుకకు అనగా ఎడమ వైపుకు $LM_2$ నుండి $L_3$ కి మారును. అదే సమయంలో పెట్టుబడులు పెరిగి IS రేఖ $IS_1$ నుండి $IS_2$ కు మారును. దాని వల్ల ఎగుమతులు ఉత్తేజమై మారకపు రేటు తగ్గుటవల్ల ఎగుమతులు పెరుగును. అదే సమయంలో ఇవ్వబడిన వడ్డీరేట్ల వద్ద పెద్ద మొత్తంలో దిగుమతులు నిర్వహించబడును. అందువల్ల FE రేఖ $FE_1$ నుంచి $FE_2$ కు మారును. ఈ కారణంగా సమతౌల్యం $Q^1$ బిందువు నుండి $P_1$ బిందువు వద్దకు కొత్త సమతౌల్యం ఏర్పడును. అచ్చట జాతీయాదాయం సంపూర్ణ ఉద్యోగ స్థాయిలో నుండును $Y_3$ జాతీయాదాయం $r_1$ వడ్డీ రేట్లు రెండు కలసి మరియు $FE_2$ రేఖమీద కొత్త మారకపు రేటు అన్నీ కలసి $P_1$ బిందువు వద్ద ఏకకాలంలో అంతర్గత మరియు బహిర్గత సమతౌల్యమును తీసుకువచ్చును. ఈ విశ్లేషణ తెలియజేయునదేమనగా విదేశీ మారకపు రేటులోని సర్దుబాటు మూడు మార్కెట్లలోనూ సమతౌల్య స్థితిని తీసుకువచ్చును. విదేశీ చెల్లింపుల ఖాతా సమతౌల్యంలో లేనిచో మారకపు రేటు లోను మార్పులు LM IS రేఖలలో కొత్త సమతౌల్యం వచ్చు వరకు మార్పులను తీసుకొని వచ్చుచునేయుండును.

మరో ప్రమేయమేమనగా $P_1$ బిందువు పైననే సంపూర్ణ ఉద్యోగిత సిద్ధించును కాని ఇది తప్పనిసరి పరిస్థితి కాదు. సాధారణంగా విదేశీ మారకపు రేట్లలోని మార్పు స్వత సిద్ధంగా దేశీయ అంతర్జాతీయ సమతౌల్యమును సంపూర్ణ ఉద్యోగితతో కూడి తీసుకొని వచ్చును. ఈ ఆశయము నెరవేరవలయునన్నచో మరికొన్ని ప్రధాన మార్గాలను అనుసరించవలయును. ఏమైనప్పటికీని ద్రవ్యకోశ విధానాలు రెండింటిని విదేశీ మారకపు రేటు విధానంతో కలిపి ఉపయోగించునపుడు తప్పక సంపూర్ణ ఉద్యోగితతో కూడిన అంతర్జాతీయ చెల్లింపుల సమతౌల్యం వచ్చునని ఆర్థికవేత్తల అభిప్రాయం. వీలయినంత వరకు వడ్డీరేట్లను లేదా మారకపు రేట్లను స్థిరంగా ఉంచుటకై ప్రయత్నించవలెను. విధానపరమైన అంశాల దృష్ట్యా అవసరమయినపుడు వాటిని మార్చాలని LM, IS, FE నమూనా తెలుపుచున్నది.

## 14.5. సారాంశము :

సాధారణంగా ఒక దేశం దాని ఆర్థిక విధానాన్ని ఒకటికన్నా ఎక్కువ లక్ష్యాలను చేరుకోవడానికి రూపొందించుకుంటుంది. దేశాలు తరచుగా సంపూర్ణ ఉద్యోగిత, స్థిరమయిన ధరలు మరియు విదేశీ చెల్లింపుల శేషం సమతౌల్యం వంటి లక్ష్యాలకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తాయి. ఒకసారి ఆ లక్ష్యాలన్నింటినీ చేరుకోవడానికిగాను ఆర్థిక విధానానికి రూపుదిద్దుతాయి. దేశాలు అనుసరించే ప్రాథమిక సూత్రంగా ఎన్ని విధాన పరమయిన మార్గాలనయినా లక్ష్యాలకు గురిచేస్తాయి. ఒక్కొక విధాన మార్గము కొన్ని కొన్ని లక్ష్యాలకు మార్గం సుగమం చేస్తాయి. సంపూర్ణ సమతౌల్య లక్ష్యం చేరే వరకు విధాన మార్గాలనే భాగాలను లక్ష్యాల దిశవైపు దేశాలు ఎక్కుపెడుతూనే ఉంటాయి. దేశీయంగా ద్రవ్య కోశ విధానాలను అంతర్దేశీయంగా చెల్లింపుల శేషంలోని అసమతౌల్యాన్ని చక్కదిద్దుటకు గల అన్ని పద్ధతులను సంయుక్తంగా ప్రభుత్వాలు అమలుజేస్తాయి. ఏ నిష్పత్తిలో ఈ విధానాల కలయిక ఉండాలి అనేది ఆ దేశ దేశీయ పరిస్థితులు స్థిరమైన అంతర్జాతీయ వ్యాపారంలో ఆ దేశ పాత్రపైన ఆధారపడి ఉంటుంది. దీర్ఘకాలంలో సంపూర్ణ సమతౌల్య సాధనకు వివిధ వ్యాపార దేశాలు నిరంతరం మార్గాలను విధానాలను అన్వేషిస్తూనే ఉంటాయి.

## 14.6. ముఖ్య పదాలు

1. ఆర్థిక విధానం
2. అంతర్గత సమతౌల్యము
3. బహిర్గత సమతౌల్యము
4. IS, LM, FE నమూనా
5. ప్రతి ద్రవ్య కోశ విధానం
6. మూల్యన్యూనీకరణ

## 14.7. స్వయం సమీక్షా ప్రశ్నలు :

1. ఆర్థిక విధాన ఆశయాలు గురించి వ్రాయండి
2. IS, LM, మరియు FE నమునా గురించి వివరించుము
3. స్వేన్ పటము ఉద్దేశ్యము, మరియు వివిధ సమతౌల్య విశ్లేషణలు వివరించండి.
4. ద్రవ్యకోశ మరియు మారకపురేటు విధానాలు తెలుపుము

## 12.11. చదువవలసిన పుస్తకములు


1. B. Hansen - The Economic Theory of Fiscal Policy, London, Allew & union 1958
2. R.N. Stern - The Balance of Payments Theory & Economic Polices, Chicago, Aldeme, 1973
3. M. Lorden - The Geometric Representation of policies to attain internal & external balances, RES, Oxford 1951

..J.E. Meede - The Balance of Payments, Oxford University press - 115


ఆచార్య మోపిదేవి సుందరరావు

పాఠం - 15

# అంతర్జాతీయ ద్రవ్య వ్యవస్థ : సమస్యలు - అంతర్జాతీయ ద్రవ్యత్వము - అంతర్జాతీయ ద్రవ్య నిధి, ఎస్.డి.ఆర్‌లు - యూరో డాలరు మార్కెట్లు

**లక్ష్యాలు :**

1. అంతర్జాతీయ ద్రవ్య వ్యవస్థ - స్వర్ణ ప్రమాణము నుండి బ్రెట్టన్ వుడ్స్ వ్యవస్థ వరకు పరిణామక్రమాన్ని తెలుసుకోవడం
2. అంతర్జాతీయ ద్రవ్యత్వ సమస్యను, దానిని పరిష్కరించటంలో అంతర్జాతీయ ద్రవ్యనిధి పాత్రను పరిశీలించడం
3. స్పెషల్ డ్రాయింగ్ రైట్స్, ఏ విధంగా ద్రవ్యత్వ సమస్యను పరిష్కరించగలిగాయో తెలుసుకోవడం
4. యూరో డాలరు మార్కెటు స్వరూప, స్వభావాలను తెలుసుకోవడం

**విషయసూచిక :**

15.0 పరిచయము

15.1 అంతర్జాతీయ ద్రవ్యవ్యవస్థ

15.2 స్వర్ణప్రమాణము (1870-1914)

15.3 అంతరయుద్ధ కాలపు అనుభవము

15.4 బ్రెట్టన్ వుడ్స్ వ్యవస్థ

15.4.1 స్వర్ణ వినిమయ ప్రమాణము.

15.4.2 బ్రెట్టన్ వుడ్స్ వ్యవస్థ : సమస్యలు

15.5 అంతర్జాతీయ ద్రవ్య నిధి

15.6 అంతర్జాతీయ ద్రవ్యత్వము

15.7 స్పెషల్ డ్రాయింగ్ రైట్సు

15.7.1 ఎస్.డి.ఆర్ ల ఉపయోగాలు

15.8 యూరో డాలరు మార్కెటు

15.8.1 యూరో డాలరు మార్కెటు : కారణాలు

15.9 సారాంశము

15.10 ముఖ్యపదాలు

15.11 నమూనా ప్రశ్నలు

15.12 చదువదగిన గ్రంథాలు

## 15.0 పరిచయం :

ఈ పాఠములో మనము అంతర్జాతీయ ద్రవ్య వ్యవస్థ, దాని పరిణామ క్రమాన్ని గూర్చి తెలుసుకుందాము.

స్వర్ణప్రమాణము నుండి, బ్రెట్టన్ వుడ్స్ వ్యవస్థ వరకు పరిణామం చెందిన ఈ వ్యవస్థ అనేక ఆటుపోట్లనెదుర్కొన్నది. బ్రెట్టన్ వుడ్స్ వ్యవస్థ కుప్పకూలడానికి కారణాలను కూడా పరిశీలిస్తాము. ముఖ్యంగా అంతర్జాతీయ ద్రవ్యత్వసమస్య - అంతర్జాతీయ ద్రవ్య వ్యవస్థ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలలో ఒకటి . దీని స్వరూప, స్వభావాలను, బ్రెట్టన్ వుడ్స్ వ్యవస్థలో అంతర్భాగమైన అంతర్జాతీయ ద్రవ్య నిధి ఈ సమస్యను ఏ విధంగా పరిష్కరించ యత్నించిందీ పరిశీలిస్తారు. స్పెషల్ డ్రాయింగ్ రైట్సును సృష్టించటం ద్వారా, ఈ సమస్య నెదుర్కోవటానికి జరిగిన ప్రయత్నాలు, అవి ఎంతవరకూ సఫలీకృతమైనవవీ తెలుసుకుందాము. చివరగా, అంతర్జాతీయ ద్రవ్య వ్యవస్థలో ముఖ్య పాత్రను పోషిస్తున్న యూరోడాలరు మార్కెటు దాని పని తీరును పరిశీలిస్తారు. ఈ పాఠములో, మనము అధ్యయనము చెసే విషయాలివే. ముందుగా మనము అంతర్జాతీయ ద్రవ్య వ్యవస్థ అంటే ఏమిటో తెలుసుకుందాము.

## 15.1 అంతర్జాతీయ ద్రవ్య వ్యవస్థ :

అంతర్జాతీయంగా, ద్రవ్యపరంగా దేశాలు అనుసరించవలసిన నియమాలు, నిబంధనలే అంతర్జాతీయ ద్రవ్య వ్యవస్థ దేశాల మధ్య ద్రవ్య సంబంధాలను నిర్దేశించే వ్యవస్థ. అంతర్జాతీయ ద్రవ్య వ్యవస్థ ఏ రూపంలోనైనా వుండవచ్చు. వివిధ ప్రామాణికాల (criteria) ప్రకారము, ఆర్థికవేత్తలు ఈ వ్యవస్థను వర్గీకరిస్తారు. ముఖ్యంగా రెండు ప్రమాణికాలు పరిగణిస్తారు. 1) మారకపు రేట్ల పాత్ర 2) రిజర్వు ఆస్తుల స్వభావము. అంతర్జాతీయ ద్రవ్య వ్యవస్థను, ఈ రెంటిని బట్టి వర్గీకరింపవచ్చును. మారకపు రేట్లు నిర్ణయింపబడే పద్ధతినిబట్టి కానీ, అంతర్జాతీయ రిజర్వు ఎస్సెట్ల బట్టికానీ, వర్గీకరింపవచ్చును. స్థిర మారకపు రేట్ల పద్ధతిగానీ, సరళ మారకపు రేట్ల పద్ధతిగానీ, స్థిరీకరింపబడిన మారకపు రేటు పద్ధతి కానీ, లేదా స్వేచ్ఛగా మారే మారకపు రేటు పద్ధతి కానీ వుండవచ్చు. అదే విధంగా, అంతర్జాతీయ రిజర్వుల వర్గీకరణలో, స్వర్ణప్రమాణము కానీ, స్వర్ణ వినిమయప్రమాణము కానీ, Pure Fiduciary Standard కానీ వుండవచ్చు. వీటి స్వభావాలను బట్టి, మనము అంతర్జాతీయ ద్రవ్య వ్యవస్థను వర్గీకరింపవచ్చు.

అంతర్జాతీయ వ్యాపారాన్నీ, పెట్టుబడుల పరిణామాన్ని గరిష్టీకరించి, వ్యాపారం వల్ల వచ్చే లాభాలను అన్ని దేశాల మధ్య సమంగా పంపిణీ చేసే వ్యవస్థను ఉత్తమ అంతర్జాతీయ ద్రవ్యవ్యవస్థగా పరిగణిస్తాము.

ఒక అంతర్జాతీయ ద్రవ్య వ్యవస్థను మూడు ప్రామాణికాలాధారంగా మదింపు చేయవచ్చు.

1. సర్దుబాటు (adjustment) 2. ద్రవ్యత్వము(liquidity) నమ్మకము(confidence). సర్దుబాటు, విదేశీ చెల్లింపుల శేషములో అసమతుల్యాన్ని సరిదిద్దే ప్రక్రియకు, సర్దుబాటు సంబంధించినది ఈ అసమతుల్యాన్ని పరిష్కరించటానికి అంతర్జాతీయ

రిజర్వులు అందుబాటులో ఉన్నాయా అనే అంశము ద్రవ్యత్వానికి సంబంధించినది. ద్రవ్యోల్బణానికిగానీ, ప్రతిద్రవ్యోల్బణమునకుగానీ, దారితీయకుండా, అసమతుల్యాన్ని పరిష్కరించటానికి అవసరమైన అంతర్జాతీయ రిజర్వులు అందజేసేదే ఉత్తమ అంతర్జాతీయ ద్రవ్యవ్యవస్థ. ఈ సర్దుబాటు విధానము సరిగా పనిచేస్తోందని, అంతర్జాతీయ రిజర్వు విలువలు అదే విధంగా వుంటాయనే అంశం నమ్మకానికి సంబంధించినది.

## 15.2 స్వర్ణప్రమాణము (1870-1914) :

ఈ పద్ధతి, 1870లో ఆవిర్భవించి, 1914, మొదటి ప్రపంచ యుద్ధం జరిగే వరకు కొనసాగింది. ఈ స్వర్ణ ప్రమాణములో ప్రతి దేశము తన కరెన్సీ యొక్క స్వర్ణభాగాన్ని నిర్వచించింది. ఈ ధర వద్ద బంగారాన్ని ఎంత పరిమాణములోనైనా అమ్మడానికి, కొనడానికి సుముఖంగా ఉంది. ప్రతి కరెన్సీ యూనిట్టు స్వర్ణభాగము స్థిరంగా ఉంది కాబట్టి, మారకపు రేటు కూడా స్థిరంగా ఉంటుంది. దీనికే 'మింట్ పారిటీ ' (mint parity) అని అంటారు. దీనికంటూ అధికంగా కానీ, తక్కువగా కానీ మారకపు రేటులో మార్పులుండవచ్చు.

వీటనే స్వర్ణ బిందువులు (Gold Points) అని అంటారు. ఈ స్వర్ణ బిందువుల మధ్య ఉంటేటట్లు, మారకపు రేటు, డిమాండ్ సప్లయ్ శక్తులను బట్టే నిర్ణయింపబడుతుంది. మారకపు రేటు ఈ బిందువు వెలుపల ఉండకుండా, బంగారాన్ని తగు విధంగా తరలించేవారు. స్వర్ణ ఎగుమతి బిందువుకు దిగువగా కరెన్సీ విలువపడిపోకుండా, బంగారము బయటకు తరలేది. బయటకు తరలే బంగారమే, దేశపు విదేశీ చెల్లింపుల శేషములో లోటు. అదేవిధంగా, స్వర్ణ దిగుమతి బిందువును దాటి దేశపు కరెన్సీ విలువ పెరగకుండా, దేశంలోకి బంగారాన్ని రప్పించేవారు. ఈ బంగారపు రాకలు, దేశపు విదేశీ చెల్లింపుల శేషములో మిగులును సూచిస్తాయి. ఈ విధంగా చెల్లింపుల శేషములోని లోట్లను బంగారం రూపంలో పరిష్కరించటం వలన, దేశాల బంగారపు నిల్వలు (reserves) పరిమితంగా ఉండటం వలన, ఈ లోట్లు ఎక్కువ కాలం కొనసాగకుండా, త్వరగా పరిష్కరించవలసిన ఆవశ్యకత ఉంది.

స్వర్ణ ప్రమాణములో, David Hurro చెప్పిన Price-Specie Flow Mechanism ద్వారా సర్దుబాటు జరిగేది. బంగారం కానీ, పేపరు కరెన్సీ (బంగారం back up వున్న) ప్రతి దేశపు ద్రవ్యపు సప్లయ్‌గా ఉండేది. అందువలన లోటు గల దేశములో ద్రవ్యపు సప్లయ్ తగ్గి; మిగులు గల దేశములో ద్రవ్యపు సప్లయ్ పెరిగేది. లోటు గల దేశములో అంతర్గతంగా ధరలు తగ్గి, మిగులు గల దేశములో ధరలు పెరిగేవి. ద్రవ్య రాశి సిద్ధాంతం ప్రకారము, లోటు దేశము యొక్క ఎగుమతులు పెరిగి, దిగుమతులు తగ్గేవి. ఈ ప్రక్రియ విదేశీ చెల్లింపుల శేషములో లోటు తగ్గే వరకు కొనసాగేది. మిగులు గల దేశములో, దీనికి పూర్తిగా విరుద్ధమైన ప్రక్రియ జరిగేది.

విదేశీ చెల్లింపుల శేషములో మార్పులను బట్టి, దేశీయంగా ద్రవ్యపు సప్లయ్ మారేది. అందువలన ద్రవ్యోల్బణ రహిత సంపూర్ణ ఉద్యోగితను సాధించటానికి ఒక దేశము ద్రవ్య విధానాన్నుపయోగించలేని పరిస్థితి ఉండేది. కాని సాంప్రదాయక ఆర్థిక వేత్తలకు ఇది ఒక సమస్యగా కనిపించలేదు. వారి ఆలోచన ప్రకారము, ఆర్థిక వ్యవస్థ, సంపూర్ణ ఉద్యోగితా స్థాయిని చేరటానికి, స్వయంచాలక శక్తులు పని చేస్తాయి.

ఈ రకపు సర్దుబాటు ప్రక్రియ పనిచేయుటకు, దేశపు ద్రవ్యపు సప్లయ్‌పై, విదేశీ చెల్లింపుల శేషములోని లోటులో, మిగులు యొక్క ప్రభావాన్ని తొలగించే చర్యలేవీ, ఆ దేశం చేపట్టరాదు. కానీ, స్వర్ణ ప్రమాణ నియమాల ప్రకారం, లోటు దేశపు

పరపతిని నియంత్రించి, మిగులు దేశపు పరపతిని విస్తరించి, యీ సర్దుబాటు ప్రక్రియను బలోపేతం చేయాలి. కాని స్వర్ణ ప్రమాణ కాలంలో, ద్రవ్య అధికారులు, ఈ నిబంధనలను పాటించక, విదేశీ చెల్లింపుల శేషములోని అసమతుల్యము వల్ల, ద్రవ్యపు సప్లయ్‌లో సంభవించే మార్పులను, పాక్షికంగానైనా తగ్గించటానికి ప్రయత్నం చేసారు. కాని లోటు దేశపు ద్రవ్యసప్లయ్‌లో అధిక తగ్గుదలను, మిగులు దేశపు ద్రవ్యసప్లయ్‌లో అధిక పెరుగుదలను నివారించటానికి సర్దుబాటు ప్రక్రియలో, ఈ రకమైన నియంత్రణ అవసరమని కొందరి వాదన.

స్వర్ణ ప్రమాణ వ్యవస్థలో, సర్దుబాటు ప్రక్రియ ఈ విధంగా పనిచేయాలి. కాని టౌసిగ్ ప్రకారము, 1920లలో ఈ సర్దుబాటు ప్రక్రియ చాలా వేగంగా, సులభంగా, దేశాల మధ్య బంగారం తరలించకుండా, పనిచేసింది. కాని టౌసిగ్ ప్రకారము, అంతర్జాతీయ మూలధన ప్రవాహాల వలన, విదేశీ చెల్లింపుల శేషములోని, అసమతుల్యాలు పరిష్కరింపబడ్డాయి. బంగారపు తరలింపులతో నిమిత్తం లేకుండా, ఈ సర్దుబాటు జరిగింది. బ్రిటన్ దేశానికి, దాని విదేశీ చెల్లింపుల శేషములో లోటు ఉన్నపుడు, దాని ద్రవ్య సప్లయ్ తగ్గి, వడ్డీ రేట్లు పెరిగి, స్వల్పకాలిక మూలధన ప్రవాహాలు దేశంలోనికి వచ్చి, లోటును సరిదిద్దింది.

బ్యాంకు రేటుని పెంచి, తద్వారా వడ్డీరేట్లను పెంచి, దేశంలోకి మూలధం రావటాన్ని ప్రోత్సహించింది. లోటు వలన, బ్రిటన్ ద్రవ్య సప్లయ్ తగ్గుదల, దేశీయంగా ఆర్థిక కార్యకలాపాలను, ధరలకన్నా ఎక్కువ తగ్గించింది. బ్రిటన్ విదేశీ చెల్లింపుల శేషములో మిగులును, దీనికి విరుద్ధమైన ప్రక్రియ పరిష్కరించింది.

Price - Specie Flow Mechanism నిర్దేశించినట్లు, సర్దుబాటు జరుగలేదు. కానీ, శీఘ్రంగా, సులభంగా సర్దుబాటు ప్రక్రియ జరగటానికి, స్వర్ణ ప్రమాణంలోని ప్రత్యేక పరిస్థితులే కారణము. ప్రపంచంలో, ఆ కాలంలో ఆర్థిక విస్తరణ జరిగింది. స్థిరత్వం కూడా ఉంది. పౌండ్ స్టెర్లింగ్ ఒకటే ముఖ్యమైన అంతర్జాతీయ కరెన్సీ. లండన్ ఏకైక అంతర్జాతీయ ద్రవ్య కేంద్రము. అయినా, పౌండ్‌లో నమ్మకరాహిత్యమను ప్రశ్న ఉదయించలేదు. మిగతా కరెన్సీలలోని మార్పులుకానీ, యితర ప్రత్యర్థి ద్రవ్య కేంద్రాలలో మార్పులు కానీ సంభవించలేదు. వర్తమాన పరిస్థితులకు భిన్నంగా, అప్పుడు ధర సరళత ఉంది. దేశాలు బహిర్గత సమతుల్యానికి, అంతర్గత సమతుల్యానికన్నా, ఎక్కువ ప్రాముఖ్యతనిచ్చాయి. ఆ పరిస్థితులలో ఏ అంతర్జాతీయ ద్రవ్య వ్యవస్థ అయినా బహుశా సులభంగా పనిచేసేది.

## 15.2.1 స్వర్ణ ప్రమాణ వ్యయ, లాభాలు :

బహిర్గత అసమతుల్యాన్ని బట్టి, ధరలస్థాయి, ఉత్పత్తి స్వయంచాలకంగా సర్దుబాటు అయ్యేవి. ఇది స్వర్ణ ప్రమాణము యొక్క ముఖ్య లాభము. ఒకసారి ఒక దేశము తన కరెన్సీ యొక్క స్వర్ణ అంశాన్ని సూచించిన తర్వాత, ఆ ధర వద్ద తన దేశపు కరెన్సీ (బంగారాన్ని) అమ్మడానికి కానీ, కొనడానికి కానీ సంసిద్ధం కావాలి. అపుడు అంతర్జాతీయ ద్రవ్య వ్యవస్థ స్వయంచాలకంగానే పనిచేసేది. స్వర్ణ ప్రమాణాన్ని పాటించినంత కాలము, అమెరికాలో కేంద్రబ్యాంకుదేమీ లేదు. అమెరికా దేశపు రెండవ బ్యాంకు 1837లో మూసివేసారు. ఇప్పుడున్న ఫెడరల్ రిజర్వు సిస్టమ్ 1913లో స్థాపించబడింది. ఈ కాలంలో, అమెరికాలో విచక్షణా ద్రవ్య విధానమేది లేదు. స్వర్ణ ప్రమాణము యొక్క ఊరటనిచ్చే స్వభావమిదే. విదేశీ చెల్లింపుల శేషములోని అసమతుల్యము వల్ల ఒక దేశానికి ఏమి జరుగుతుందనే ప్రశ్న ఎప్పుడూ ఉత్పన్నమవలేదు.

స్వర్ణ ప్రమాణము యొక్క రెండవ లాభము - దీర్ఘకాల ధర స్థిరత్వము. ఉదాహరణకు, అమెరికాలో స్వర్ణ ప్రమాణ కాలములో, సగటు సాలుసరి ద్రవ్యోల్బణములు 0.1 శాతము మాత్రమే. బ్రిటన్‌లో, స్వర్ణ ప్రమాణ కాలములో సగటు సాలుసరి

ద్రవ్యోల్బణరేటు - 0.7 శాతము. అంటూ, స్వర్ణ ప్రమాణ కాలములో, బ్రిటన్‌లో ధరలు పడిపోయాయి. ప్రస్తుత ద్రవ్యోల్బణ పరిస్థితులను బట్టి చూస్తే, ఇది నమ్మశక్యమైన విషయం కాదు. కాని స్వర్ణ ప్రమాణ ప్రతిపాదనలు, స్వల్పకాలాన్ని విస్మరించారు. స్వర్ణ ప్రమాణం, స్వల్పకాల ధరస్థిరత్వాన్ని అందజేస్తుందని గ్యారంటీ యివ్వలేక పోయారు. ఒక సంవత్సరము, తర్వాత సంవత్సరాల మధ్య స్వర్ణ ప్రమాణంలో ధరలు బాగా మారేవి. కానీ, స్వర్ణ ప్రమాణ వ్యవస్థలో, ధర మార్పుల స్వభావము, ఇటీవల కాలపు అనుభవానికి భిన్నంగా ఉంది. ఉదాహరణకు రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత, ధరలు మారాయి - కానీ అవి ఎప్పుడు పెరిగాయి. అయితే, ఏ మేరకు పెరిగాయన్నది ప్రశ్న ? స్వర్ణప్రమాణకాలంలో, ఒక దేశంలో ధరలు కొన్ని సంవత్సరాలలో పెరగవచ్చు (ద్రవ్యోల్బణము) మరికొన్ని సంవత్సరాలలో తగ్గవచ్చు (ప్రతి ద్రవ్యోల్బణము) సంవత్సరానికి, సంవత్సరానికి మధ్య మార్పులున్నా, దీర్ఘకాలంలో ధరలు స్థిరంగా ఉంటాయి. అంటూ ద్రవ్యోల్బణము వలె, ప్రతి ద్రవ్యోల్బణము కూడా సాధారణ పరిస్థితే. ద్రవ్యోల్బణము వల్ల కానీ, ప్రతి ద్రవ్యోల్బణము వల్ల కానీ, ఉత్పన్నమయ్యే విపత్కర పరిస్థితులు మనకు తెలుసు. కాబట్టి, స్వర్ణ ప్రమాణము ధర స్థిరత్వాన్ని చేకూరుస్తుందని చెప్పేటప్పుడు కొంత జాగరూకత ఉండాలి. దీర్ఘకాలంలోనే యిది ఉంటుందనీ, స్వల్పకాలంలో ధరలు మారతాయని గ్రహించాలి.

కాబట్టి, స్వర్ణ ప్రమాణమునకు అంతర్జాతీయ ద్రవ్య వ్యవస్థ వల్ల రెండు లాభాలున్నాయి. కానీ, స్వర్ణ ప్రమాణాన్ని పాటించే దేశాలకు, ఈ వ్యవస్థ వల్ల, ఒక ముఖ్యమైన సమస్య కూడా ఉంది. విదేశీ చెల్లింపుల శేషములో లోటు వల్ల, ద్రవ్యపు సప్లయ్ తగ్గి, ఆర్థిక వ్యవస్థ క్షీణిస్తుంది. కానీ, శేషములో మిగులు వలన, ద్రవ్యోల్బణ పరిస్థితులేర్పడతాయి. ఉదాహరణకు, స్వర్ణ ప్రమాణ కాలంలో, అమెరికా దేశపు తలసరి నిజ ఆదాయ పెరుగుదల సంవత్సరానికి సగటున 1-4%. స్థూల దేశీయోత్పత్తి సగటు పెరుగుదల ఆరోగ్యకరంగా ఉన్నా, సగటు నుండి హాని తేడా గణనీయంగా ఉంది. స్వర్ణ ప్రమాణం వలన, స్థిర మారకపు రేట్ల వ్యవస్థ ఉండేది కానీ, స్థూల దేశీయోత్పత్తి వృద్ధి రేటులో అస్థిరత ఉండేది.

1870-1914 ఈ నాలుగు దశాబ్దాలు - స్వర్ణ ప్రమాణం యొక్క 'స్వర్ణయుగం' గా వర్ణిస్తారు. ఈ కాలంలో, ప్రపంచ వాణిజ్యము, పెట్టుబడి విస్తరించి, అంతర్జాతీయ ప్రత్యేకీకరణకు, ప్రపంచ సంక్షేమానికి దోహదం చేసాయి. విదేశీ చెల్లింపుల శేషపు యంత్రాంగము చక్కగా పనిచేసింది. దేశాలమధ్య, విధానపరంగా ఎటువంటి సంఘర్షణలు తలెత్తలేదు. అందువలనే, మొదటి ప్రపంచ యుద్ధానంతరం, స్వర్ణ ప్రమాణపు వైపు, ప్రపంచదేశాలన్నీ మరల దృష్టి సారించాయి.

## 15.3 అంతర - యుద్ధకాలపు అనుభవము : (Inter - War Experience)

స్వర్ణప్రమాణముపై ఆధారపడిన అంతర్జాతీయ ద్రవ్యవ్యవస్థ; మొదటి ప్రపంచ యుద్ధంరాగానే, అంతరించింది. దానితో, స్వర్ణయుగము అంతరించింది. 1919-1924 మధ్యకాలంలో, మారకపురేట్లు విపరీతమైన ఒడుదుడుకుల నెదుర్కొన్నాయి. ఆరంభంలో, కొన్నిదేశాలు, తమ కరెన్సీలను బంగారంలోనికి మార్పు చేయడాన్ని నిలుపుచేసి, బంగారపు ఎగుమతులపై నిషేధం విధించి, తమ బంగారపు నిల్వలను రక్షించుకొనే ప్రయత్నాలు చేసాయి. తర్వాత చాలా దేశాలు ఇదే విధానాన్ని అవలంబించాయి. ఫలితంగా, సాంప్రదాయ స్వర్ణప్రమాణము అంతరించింది.

ఈ పరిస్థితులలో, స్వర్ణప్రమాణపు స్థిరత్వంపై చాలా దేశాలకు తిరిగి నమ్మకం కలిగింది. దానిని మరల పునరుద్ధరించాలని కోరిక తలెత్తింది. 1925 ఏప్రిల్‌లో, బ్రిటన్, పౌండ్‌ను, యుద్ధానికి పూర్వపు ధర వద్ద, బంగారంలోకి మార్చడానికి సిద్ధపడింది. బంగారపు ఎగుమతులపై నిషేధాన్ని తొలగించింది. మిగతా దేశాలు కూడా బ్రిటన్ మార్గములో, స్వర్ణప్రమాణానికి తిరిగి వెళ్ళే ప్రయత్నాలు చేసాయి. (1919లో అమెరికా స్వర్ణ ప్రమాణానికి అంతకు మునుపే వెళ్ళింది.) కానీ ఈ నూతన వ్యవస్థ, అంతకు

ముందున్న శుద్ధ స్వర్ణ ప్రమాణము(pure gold standard) కాదు. దీనిని స్వర్ణ వినిమయ ప్రమాణము (Gold Exchange standard) అని అనవచ్చు. బంగారము, బంగారంలోకి మార్చగలిగే కరెన్సీలు (ఎక్కువగా పౌండ్లు, కాని అమెరికన్ డాలర్లుకానీ, ఫ్రెంచి ఫ్రాండ్లుకాని) అంతర్జాతీయ రిజర్వులుగా ఉపయోగింపబడినాయి.

బ్రిటన్ దేశము, తన పోటీ పటిమను చాలా వరకు పోగొట్టుకొంది. (ముఖ్యంగా అమెరికా దేశానికి) తన విదేశీ పెట్టుబడిలో చాలా భాగాన్ని, యుద్ధ వ్యయానికి చెల్లించవలసి వచ్చింది. యుద్ధానికి ముందువున్న సామ్యము(parity) పునరుద్ధరింపబడింది. కానీ, దీని వలన బ్రిటిష్ పౌండ్, అధిక మూల్యీకరణ (over valued) అయింది. ఫలితంగా విదేశీ చెల్లింపుల శేషములో లోట్లు ఏర్పడి, వీటిని నియంత్రించే ప్రయత్నంలో, ప్రతి ద్రవ్యోల్బణం ఏర్పడింది. దీనికి భిన్నంగా, ఫ్రాన్స్‌దేశపు విదేశీ చెల్లింపుల శేషములో మిగులు ఏర్పడింది.

కానీ, ఈ స్వర్ణ వినిమయ ప్రమాణము కూడా కుప్పకూలింది. ప్రపంచంలో ఆర్థిక మాంద్యం ఏర్పడింది. 1931-36 సంవత్సరాల మధ్య, అస్థిర పరిస్థితులేర్పడ్డాయి. దేశాలు, పోటాపోటీగా, మూల్యహీనీకరణకు పాల్పడి, తమ నిరుద్యోగితను ఎగుమతి చేయడానికి ప్రయత్నించాయి. 1931-35 సంవత్సరాల మధ్య, అంతర్జాతీయ సహకారము పూర్తిగా క్షీణించింది. దేశాలు అధిక సుంకాలను విధించాయి. దిగుమతులపై ఇతర ఆంక్షలు విధించాయి. ఫలితంగా, అంతర్జాతీయ వాణిజ్యం సగానికి తగ్గిపోయింది.

1936వ సం॥లో బ్రిటన్, ఫ్రాన్స్, అమెరికా దేశాల మధ్య ఒక త్రైపాక్షిక ఒప్పందం కుదిరింది. అధిక మూల్యీకరణమయిన ఫ్రెంచి ఫ్రాంకును, మూల్యహీనీకరణ చేయటానికి ఫ్రాన్సుకు వెసులుబాటు కల్పించారు. ఈ అంతర్జాతీయ సహకారము కూడా, రెండవ ప్రపంచ యుద్ధం రావడంతో, ఆగిపోయింది. అర్థవంతమైన అంతర్జాతీయ ద్రవ్య సహకారము యుద్ధానంతరకాలం వరకు వేచి ఉండవలసి వచ్చింది. అంతర యుద్ధకాలపు అనుభవము, అస్థిరపరచే స్పెక్యులేషన్, అస్థిర మారకపు రేట్లను సూచించింది. ఈ అనుభవము, రెండవ ప్రపంచ యుద్ధానంతరం, మిత్రదేశాలను ప్రభావితం చేసి, యుద్ధానంతరకాలంలో, కొంత సరళత ఉండే అంతర్జాతీయ ద్రవ్య వ్యవస్థను నెలకొల్పవలసిన ఆవశ్యకతను వారు గుర్తించేటట్లు చేసింది. ఈ వ్యవస్థలో, మారకపు రేట్లు సంబంధించినంత వరకు వాటి స్థిరత్వానికి ప్రాముఖ్యత ఉండేటట్లుగా గుర్తించారు. ఇటీవల కాలంలో, ఈ అంతర యుద్ధకాలపు అనుభవాన్ని మరొక విధంగా కూడా వివరించారు. 1919-24 మధ్యకాలంలో, ఉత్పన్నమయిన మారకపు రేట్లలో విపరీతమయిన ఒడుదుడుకులు, మొదటి ప్రపంచ యుద్ధకాలంలో తీవ్రమైన అసమతుల్యం వలననూ, యుద్ధానంతర పునర్నిర్మాణ కార్యక్రమంతో ముడిపడిన అస్థిరత్వం వలననూ, ఏర్పడ్డాయని ఒక వివరణ. అటువంటి పరిస్థితులలో, ఏ స్థిరమారకపు రేటు వ్యవస్థ కూడా బ్రతికి బట్టకట్ట లేకపోయేది.

## 15.4. బ్రెట్టన్ వుడ్స్ వ్యవస్థ : (Bretton Woods System)

### 15.4.1 స్వర్ణ వినిమయ ప్రమాణము (1947-71) :

1944వ సంవత్సరంలో, 44 కమ్యూనిస్టేతర దేశాలు ప్రతినిధుల, అమెరికాలోని న్యూ హాంప్‌షైరు రాష్ట్రములోని బ్రెట్టన్ వుడ్స్‌లో, యుద్ధానంతరం ఎటువంటి అంతర్జాతీయ ద్రవ్య వ్యవస్థను నెలకొల్పాలనే అంశంపై నిర్ణయించటానికి సమావేశమయ్యారు. అంతర్జాతీయ ద్రవ్య వ్యవస్థను సంస్కరించటమే, ఈ సమావేశ ముఖ్య లక్ష్యము. ఈ దిశగా, ప్రతినిధులు రెండు రకాల ప్రణాళికలను పరిశీలించారు. ఒకటి : బ్రిటన్‌కి చెందిన లార్డు కీన్సు ప్రతిపాదించిన బ్రిటిష్ ప్రణాళిక (Keynes Plan) రెండవది : అమెరికన్ ట్రెజరీ డిపార్టుమెంటుకి చెందిన హారీవైటు ప్రతిపాదించిన అమెరికన్ ప్రణాళిక. (Whites Plan)

కీన్సు, ఓవర్ డ్రాఫ్ట్ సౌకర్యంతో గూడిన క్లియరింగ్ యూనియన్ స్థాపించాలని, ప్రతిపాదించారు. దీనికి, రిజర్వులను సృష్టించకలిగే శక్తి కూడా ఉంటుంది. క్రొత్త అంతర్జాతీయ యూనిట్ ఆఫ్ అకౌంట్, 'బాంకర్, (Banker) ని సృష్టించాలని ప్రతిపాదించారు. ఈ బాంకర్‌ను అప్పుగా తీసుకొనేవారు, పరపతిదార్లు తమ తమ నిల్వలపై వడ్డీని చెల్లించాలి. దీనివలన, మిగులు దేశాలపై, సర్దుబాటు బాధ్యత పాక్షికంగానైనా వుండే విధంగా దీనిని ప్రతిపాదించారు.

కానీ, ప్రతినిధులు ఆమోదించిన ప్రణాళిక, వైట్ ప్రణాళికకు దగ్గరగా వుంది. ఇదే బ్రెట్టన్ వుడ్స్ వ్యవస్థ అని పేర్కొన బడింది. 1944 నుండి 1971 వరకు ఈ వ్యవస్థ కొనసాగించి ఈ 27 సంవత్సరాల కాలాన్ని, బ్రెట్టన్ వుడ్స్ శకంగా పేర్కొంటారు.

ఈ బ్రెట్టన్ వుడ్స్ సమావేశము, అంతర్జాతీయ ద్రవ్య సహకారానికి, నిర్దిష్టమైన విధులు, అధికారాలు కలిగిన ఒక అంతర్జాతీయ సంస్థ అవసరమని అంగీకరించింది. ద్రవ్య విషయాలపై చర్చలకు, సహకారానికి, వేదికగా ఉపయోగపడే ఒక శాశ్వత సంస్థ అవసరమని అభిప్రాయపడ్డారు. ఈ ఉద్దేశానికనుగుణంగా, అంతర్జాతీయ ద్రవ్య నిధి(International Monetary Fund)ని నెలకొల్పడానికి అంగీకరించారు. యుద్ధానంతర అంతర్జాతీయ ద్రవ్య వ్యవస్థకు ప్రవర్తనా నియమావళిని, యీ సంస్థయే నిర్దేశించింది.

బ్రెట్టన్ వుడ్స్ వ్యవస్థను స్వర్ణ వినిమయ ప్రమాణంగా పేర్కొనవచ్చు. బంగారం ధర, ఔన్సుకి \$35 "డాలర్లు" గా ఉండేటట్లు, ఈ ధర వద్ద ఎటువంటి నిర్బంధాలు, పరిమితులు లేకుండా, బంగారానికి బదులుగా, డాలర్లను మారకం చేయడానికి మరికా అంగీకరించింది. మిగతా దేశాలు, తమ కరెన్సీ విలువలను, డాలర్ల రూపంలో నిర్ణయిస్తాయి. సామ్యవిలువ(par value) కన్నా, ఒక శాతం ఎక్కువగా కానీ, తక్కువగా కానీ, మారకపు రేటు మార్పు చెందకుండా, విదేశీ మారకపు మార్కెట్లలో దేశాలు జోక్యం చేసుకుంటాయి. అనుమతింపబడిన మార్పు పరిమితులలో, డిమాండ్, సప్లయశక్తులు మారకపు రేటును నిర్ణయిస్తాయి.

సామ్యవిలువ కన్నా 1 శాతం తక్కువకంటూ కరెన్సీ విలువ పడిపోతే, ఒక దేశీయ డాలరు నిల్వలనుపయోగించి, తన కరెన్సీని కొనుగోలు చేయాలి. అదే విధంగా, కరెన్సీ విలువ, సామ్యవిలువపై 1 శాతం కన్నా అధికంగా పెరిగితే, తన కరెన్సీతో డాలర్లను కొనుగోలు చేయాలి. 1950 ల ఉత్తరార్థంలోనూ, 1960 ల ఉత్తరార్దంలోను మిగతా కరెన్సీలు, డాలర్లలోకి పూర్తిగా మారేవి. అమెరికన్ డాలరు ఒక్కటే అంతర్జాతీయ కరెన్సీ. అందువలన, ఈ నూతన వ్యవస్థను స్వర్ణ - డాలర్ ప్రమాణము అని అంటారు. అమెరికన్ డాలరు కీలక కరెన్సీ. అమెరికా మాత్రము, విదేశీ మారకపు మార్కెటులో జోక్యం చేసుకొనవసరం లేదు. మిగతా దేశాలు మాత్రం తమ స్థిర డాలరు ధరలను కొనసాగించాలి.

దేశాలు, తమ విదేశీ చెల్లింపుల శేషాలలోని తాత్కాలిక లోట్లను, తమ అంతర్జాతీయ రిజర్వులను, IMF నుంచి అప్పు చేయడం ద్వారా భర్తీ చేయాలి. ద్రవ్య నిధి అనుమతితో, ప్రాధమిక అసమతుల్య(Fundamental disequilibrium) ఉన్నపుడే, ఒక కరెన్సీ యొక్క సామ్య విలువను మార్చడానికి వీలవుతుంది. అయితే యీ ప్రాధమిక అసమతుల్యాన్ని ఎక్కడా స్పష్టంగా నిర్వచించలేదు. కాని స్థూలంగా, విదేశీ చెల్లింపుల శేషములో, లోటుకానీ, మిగులు కానీ ఎక్కువగా ఉండి, అది కొంతకాలంపాటు, అదే విధంగా కొనసాగితే, అది ప్రాధమిక అసమతుల్యంగా పరిగణించేవారు. 10 శాతం కన్నా, తక్కువగా వుండే మారకపు రేటులో మార్పులకు, ద్రవ్యనిధి ఆమోదం అవసరం లేదు అంటే యీ బ్రెట్టన్ వుడ్స్ వ్యవస్థ -Adjustable peg- అని చెప్పవచ్చు. స్థిర, సరళ మారకపు రేట్ల వ్యవస్థల రెండింటి ప్రయోజనాలు కలిగివున్న వ్యవస్థ యిది. దీని వలన, స్వల్ప కాలంలో, మారకపురేటు స్థిరత్వం ఉండాలి. కానీ, విదేశీ చెల్లింపుల శేషములో ప్రాధమిక అసమతుల్యమేర్పడినపుడు, మారకపురేటు సర్దుబాటుకవకాశం ఉంటుంది. (సరళమారకపు రేటు వ్యవస్థలో లాగా) అంతర యుద్ధకాలంలో, అంతర్జాతీయ వాణిజ్యంలో ఏర్పడిన చిన్నాభిన్న పరిస్థితులను దృష్టిలో వుంచుకొని, చాలా దేశాలు ఇటువంటి స్థిరత్వంపై ఆసక్తిని కనబరచాయి.

యుద్ధానంతరం కొంత సంధికాలం తర్వాత, దేశాలన్నీ తమ తమ కరెన్సీలను యితర కరెన్సీల్లోకి, అమెరికా డాలరు పూర్తి మార్పుకు అవరోధాలన్నీ తొలగించాలి. దేశాలు అదనంగా వ్యాపార నిర్బంధాలేవీ విధించరాదు. ప్రస్తుతం అమలులో వున్న నిర్బంధాలన్నీ బహు పాక్షిక (Multi lateral) సంప్రదింపుల ద్వారా క్రమేపీ తొలగించాలి. మూలధన ప్రవాహాల (capital flows) పై మాత్రం నిర్బంధాలను అనుమతించారు.

అంతర్జాతీయ ద్రవ్య నిధి నుండి, విదేశీ చెల్లింపుల శేషములోని తాత్కాలిక లోటును పూడ్చడానికి మాత్రమే అప్పుతీసుకోవచ్చు. దీర్ఘకాలిక అభివృద్ధి సహాయము ప్రపంచ బ్యాంకు(world bank), దాని అనుబంధ సంస్థ, అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ (IDA) అందజేస్తాయి.

## 15.4.2 బ్రెట్టన్ వుడ్స్ వ్యవస్థ : సమస్యలు :-

1950 లలోను, 1960 లలోనూ, బ్రెట్టన్ వుడ్స్ వ్యవస్థ బాగానే పని చేసింది. ప్రాథమిక అసమతుల్యమున్నపుడు కరెన్సీల సామ్య విలువలలో మార్పునకు అనుమతిని ఈ వ్యవస్థ నిర్దేశించింది. అయితే, పారిశ్రామిక దేశాలు, దీని కనుగుణంగా, తమ కరెన్సీల సామ్య విలువలను మార్చడానికి అయిష్టతను చూపారు. గత్యంతరం లేనప్పుడూ, స్పెక్యులేషన్ వల్ల అస్థిర పరిస్థితి ఏర్పడుతుందని పరిస్థితులలోను మాత్రమే, మార్పులకంగీకరించారు. విదేశీ చెల్లింపుల శేషములో లోటు ఉన్న దేశాలు, తమ కరెన్సీలను మూల్యహీనీకరణ చేయడానికి యిష్టపడలేదు. అట్లా చేయడం, తమ దేశాల బలహీనతకు చిహ్నమని భావించారు. మిగులు దేశాలు తమ కరెన్సీల పునర్మూల్యాంకనము(Revaluation) చేయకుండా, అంతర్జాతీయ రిజర్వులను పెంపొందించుకునే ప్రయత్నం చేసారు. అయితే, అభివృద్ధి చెందుతున్న దేశాలు మాత్రం, తమ కరెన్సీలను చాలాసార్లు మూల్యహీనీకరణము చేసాయి. మిగులు దేశాలు, నిర్దేశించిన విధంగా అనుసరించకపోతే, వారిని ఎదుర్కొనే మార్గము బ్రెట్టన్ వుడ్స్ వ్యవస్థలో లేదు.

ప్రాథమిక అసమతౌల్యమున్నపుడు, కరెన్సీ సామ్య విలువలు మార్చడానికి పారిశ్రామిక దేశాలు యిష్టపడక పోవడం వలన రెండు రకాల ప్రభావాలు కన్పించాయి.

1. బ్రెట్టన్ వుడ్స్ వ్యవస్థలోని సరళత, విదేశీ చెల్లింపుల శేషములోని అసమతుల్యాన్ని సర్దుబాటు చేయడానికి అది నిర్దేశించిన యంత్రాంగము పని చేయడానికి వీలు కల్పించలేదు. అందువలన బ్రెట్టన్ వుడ్స్ వ్యవస్థ 1971లో కుప్పకూలింది.

2. ప్రాథమిక అసమతుల్యమున్నపుడు, తమ కరెన్సీల సామ్య విలువలను మార్చడానికి, పారిశ్రామిక దేశాలు కనపరచిన అయిష్టత స్పెక్యులేషన్ను ప్రోత్సహించి, అధిక మూలధన ప్రవాహం ద్వారా అస్థిరత ఏర్పడటానికి కారణ భూతమయింది.

బ్రెట్టన్ వుడ్స్ వ్యవస్థ పనిచేయడంతో, యింకొక తీవ్రమైన సమస్య ఉత్పన్నమయింది. అన్ని కరెన్సీలు డాలరుకు ముడి పడడంవలన, అమెరికా దేశము స్థిర ధర వద్ద, డాలర్లకు బదులుగా, బంగారాన్ని మారకము చేయడానికి సిద్ధపడాలి. అమెరికా దేశపు విదేశీ చెల్లింపుల శేషములో సంతులనమున్నంత కాలము, ఇది పని చేసింది. కాని 1960 మధ్య కాలము నుండి, అమెరికా దేశపు విదేశీ చెల్లింపుల శేషములో లోటు ఏర్పడి, కొనసాగింది. డాలరు, ప్రపంచపు ముఖ్య రిజర్వు కరెన్సీ కాబట్టి మిగతా దేశాలన్ని డాలర్లను తమవద్దే వుంచుకున్నాయి. అందువలన అమెరికా, ఈ అసమతుల్యాన్ని పరిష్కరించడానికి ప్రయత్నం చేయలేదు. బహిర్గతా అసమతుల్యాన్ని సరి చేయటానికి, దేశీయ ద్రవ్య విధానంలో కాని, కోశ విధానంలో కాని మార్పులు చేయనవసరము లేదని భావించింది. అందువలన విదేశీ కేంద్ర బ్యాంకులలో - డాలరు నిల్వలు పెరిగాయి. మిగులు దేశాలు, డాలర్లను కొనుగోలు

చేసి తమ కరెన్సీలను అమ్మవలసి వచ్చింది. తర్వాత, తమ కరెన్సీ విలువలు పెరగకుండా నిరోధించాయి. 1960 దశకం అంతంలో, అనుకొన్నట్లుగానే సమస్యలెదురయ్యాయి. విదేశీ కేంద్ర బ్యాంకులలో ఉన్న డాలర్లు, అమెరికా వద్ద నున్న బంగారపు నిల్వల కన్నా ఎక్కువ. అమెరికా, తన విధానాలను మార్చుకోవడానికి యిష్టపడకపోతే, పరిస్థితి తీవ్రతరమవుతుంది.

ఈ పరిస్థితులలో, బ్రెట్టన్ వుడ్స్ వ్యవస్థ అంతరించడం వూహించిన పరిణామమే. అమెరికాకు ప్రత్యామ్నాయ మార్గాలు:

1. బహిర్గతలోటును తగ్గించటానికి లేదా పూర్తిగా నిర్మూలించుటకు తన స్థూల ఆర్థిక విధానాలను మార్చుకొనడం
2. విదేశీ కేంద్ర బ్యాంకులు తమ డాలర్లను, బంగారానికి మారకము చేయడం.
3. డాలరును మూల్యహీనీకరణ చేయడం.

అమెరికా మూడో ప్రత్యామ్నాయాన్ని ఎంచుకొంది. 1971 ఆగష్టులో అమెరికా తాను ఇంకెంత మాత్రము డాలర్ల సమానం బంగారం మారకం చెయ్యనని స్పష్టం చెయ్యడంతో, బ్రెట్టన్ వుడ్స్ వ్యవస్థ అంతరించిందని చెప్పనచ్చు. తరువాత రెండు సంవత్సరాలలో, ఈ వ్యవస్థను పునర్నిర్మించడానికి సభ్య దేశాలు ప్రయత్నం చేసాయి. కాని అసలు సమస్యలు దారి తీసిన తన విధానాలను మార్చుకోడానికి అమెరికా తన అయిష్టతను ప్రదర్శించడంలో, ఈ ప్రయత్నాలేవీ సఫలీకృతం కాలేదు. 1973లో, చమురు ధరల పెరుగుదల వలన ఉత్పన్నమయిన ప్రపంచ వ్యాప్త సంక్షోభము సభ్య దేశాల ప్రయత్నాలను, వ్యవస్థను పునర్నిర్మించే ప్రయత్నాలను భగ్నం చేసింది. గత 30 సంవత్సరాలలో, ప్రపంచంలో ఒక నిర్దిష్ట ద్రవ్య వ్యవస్థ అనేదేమీ లేదు.

## 15.5 అంతర్జాతీయ ద్రవ్య నిధి: (International Monetary Fund)

మనము పైన చర్చించిన బ్రెట్టన్ వుడ్స్ వ్యవస్థకు రూపకల్పన చేసిన సంస్థ : అంతర్జాతీయ ద్రవ్యనిధి 1944, సంవత్సరము జూలై నెలలో, 44 దేశాలు బ్రెట్టన్ వుడ్స్‌తో సమావేశమయినప్పుడు కుదిరిన ఒప్పందం ప్రకారము ఆవిర్భవించిన సంస్థే అంతర్జాతీయ ద్రవ్యనిధి. 1945లో ద్రవ్యనిధి వాషింగ్టన్, డి.సి. కేంద్ర కార్యలయంగా, తన కార్యకలాపాలను ఆరంభించింది. ఈ రోజున 180 కన్నా ఎక్కువ ప్రపంచదేశాలు ఈ ద్రవ్యనిధిలో సభ్యులుగా ఉన్నాయి. ప్రారంభంలో దాని ముఖ్యవిధి - ప్రపంచ అంతర్జాతీయ చెల్లింపుల వ్యవస్థను పునర్నిర్మించడం ఒప్పందపు నిబంధనల ప్రకారము, తాత్కాలికంగా, విదేశీ చెల్లింపుల శేషములో సమస్యలున్న దేశాలకు, అందుబాటులో ఉండే విధంగా అంతర్జాతీయ రిజర్వులపూల్‌ను ఏర్పాటు చేయడం.

## అంతర్జాతీయ ద్రవ్య నిధి ముఖ్య లక్ష్యాలు :

1. అంతర్జాతీయ ద్రవ్య సమస్యల పై సభ్యులలో సంప్రదింపులకవకాశమిచ్చే, యంత్రాంగము ద్వారా, అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందించడం.
2. అంతర్జాతీయ వ్యాపారంలో విస్తరణ, సంతులిత వృద్ధి సాధించడం.
3. విదేశీ మారకపు రేట్ల స్థిరత్వాన్ని పెంపొందించడం, అంతర్జాతీయ వ్యాపారాభివృద్ధికి అవరోధంగా ఉండే విదేశీ మారక నిర్బంధాలను తొలగించడంలో సహాయ, సహకారాలనందించడం.

4. బహుపాక్షిక చెల్లింపుల వ్యవస్థను పెంపొందించడం.

5. సభ్య దేశాలకు ద్రవ్య వనరులనంద జేసి, వారికి ఆత్మ స్థైర్యం కలిగించడం., తద్వారా జాతీయ, అంతర్జాతీయ అభివృద్ధికి అడ్డ పడే విధానాలనవలంబించకుండా, వారి అంతర్జాతీయ చెల్లింపుల శేషములో లోట్లను సరిదిద్దు కొనేటట్ల చేయడం.

6. పై సూత్రాల ప్రకారం, సభ్య దేశాల అంతర్జాతీయ చెల్లింపుల శేషములో అసమతుల్యాపు తీవ్రతను, వ్యవధిని తగ్గించడం.

అంతర్జాతీయ ద్రవ్య నిధిని, సభ్య దేశాల కేంద్ర బ్యాంకులకు కేంద్ర బ్యాంకుగా పరిగణించవచ్చు. కొన్ని సభ్య దేశాల విదేశీ చెల్లింపుల శేషములో మిగులు ఉండవచ్చు; మరికొన్ని వాటాకి లోటుండవచ్చు. చెల్లింపుల శేషములో లోటు ఉన్న దేశము, తన అంతర్జాతీయ రిజర్వుల నిల్వలనుపయోగించి - అనగా డాలర్లనుపయోగించి - చెల్లింపులు చేయవచ్చు. కాని ఒక్కొక్కప్పుడు, లోటు దేశాల్లను తగు పరిమాణములో అంతర్జాతీయ రిజర్వులుండక పోవచ్చు. అప్పుడు, మిగతా దేశాలు, ద్రవ్య నిధి ద్వారా ఈ దేశానికి సహాయాన్నందించవచ్చు. మిగులు దేశాలు, తమ అంతర్జాతీయ రిజర్వులను ద్రవ్యనిధికందజేసి, నిధులను తాత్కాలికంగా చెల్లింపుల శేషములో లోటు నెదుర్కొనే దేశాల కందజేయవచ్చు. దీర్ఘకాలంలో, చెల్లింపుల శేషములో లోట్లను సరిదిద్దాలి. ఈ సర్దుబాటు త్వరితంగాను, క్రమ పద్ధతిలోను జరిగేటట్లు ద్రవ్య నిధి ప్రయత్నిస్తుంది.

**అంతర్జాతీయ ద్రవ్య నిధి ఋణంగా అందజేయగల రిజర్వులు రెండు రకాలు :**

1. కోటాలు

2. అప్పులు

ప్రతి సభ్య దేశానికి, IMF ఉమ్మడి పూల్‌కు, చందాగా అందజేయవలసిన కోటా నిర్దేశించబడింది. ఈ కోటాలో నాల్గొవ వంతు బంగారం రూపంలోనూ, మిగతాది ఆ దేశపు కరెన్సీ రూపంలోనూ అందజేయాలి. ఈ కోటా పరిమాణాన్ని బట్టి, ద్రవ్య నిధి నుండి ఒక దేశము ఏ మేరకు అప్పు చేయగలదో నిర్ణయింపబడుతుంది. ఒక సభ్య దేశపు కోటా, ప్రపంచంలో దాని ఆర్థిక ప్రాముఖ్యతను బట్టి నిర్ణయింపబడుతుంది. ఆర్థిక ప్రాముఖ్యత ఎక్కువగా ఉన్న దేశాల కోటాలు ఎక్కువగా ఉంటాయి. ఈ కోటాలను కాలక్రమేణా పెంచి, అంతర్జాతీయ ద్రవ్య నిధి వనరులను పెంచుతారు. అప్పులివ్వడానికి అనువైన వనరులను సభ్య దేశాల నుండి అప్పుల ద్వారా కూడా ద్రవ్యనిధి పొందుతుంది.

ఏ దేశమైన, తన కోటాలా నాల్గవ భాగము ఎప్పుడైనా, ఎట్టి షరతులు లేకుండా అప్పులుగా తీసుకొనచ్చు. అయితే ద్రవ్య నిధి నుండి ఎక్కువగా అప్పు తీసుకొని, తన విదేశీ చెల్లింపుల శేషములోని అసమతుల్యాన్ని పరిష్కరించుటలో, ద్రవ్య నిధి కొన్ని షరతులను విధిస్తుంది. ఈ షరతులు - ముఖ్యంగా అప్పు తీసుకొనే దేశము, దీర్ఘకాలంలో బహిర్గత సమతుల్యాన్ని సాధించే ద్రవ్య, కోశ విధానాలనవలంబించాలి. అప్పు తీసుకొనే దేశాలు, ఎక్కువ లోటు గల దేశాలు కావడం వలన, అవి కఠిన ద్రవ్య కోశ విధానాలనవలంబించ వలసి వస్తుంది. ఒక దేశము, తన స్వంత రిజర్వులన్నీ పూర్తిగా ఉపయోగించిన తర్వాత, అసంబద్ధ విధానాలనవలంబించటానికి ఒక పరిమితి ఉంటుందన్నమాట. అంతర్జాతీయ ద్రవ్య నిధి అందించే ఋణాలు స్వల్ప కాలికమైనవి; వీటి కాల పరిమితి 3 లేక 5 సంవత్సరాలు మాత్రమే.

ఆచరణలో, ఈ అప్పులన్నీ సమస్యాత్మకంగా మారాయి. అంతర్జాతీయ ద్రవ్య నిధి నుండి అప్పులు తీసుకొనే దేశాలన్నింటికీ, విదేశీ చెల్లింపుల శేషములలో తీవ్ర అసమతుల్యాలున్నాయి. ఇవి స్వల్ప కాలంలో సరిదిద్దటానికి వీలులేనివి. అందువలన సమస్యలుత్పన్నమయ్యాయి. స్వల్ప కాలంలో, ఈ సమస్యలు సరిదిద్దటానికి ద్రవ్య నిధి విధించిన షరతుల మేరకు అవలంబించ వలసిన ద్రవ్య, కోశ విధానాల వలన, ఒక దేశము స్వల్ప కాల ఆర్థిక కుదింపు(Contraction) కు గురి అవవచ్చు. విదేశీ చెల్లింపుల శేషములోని లోటు సమస్య తీరవచ్చు. కానీ అందువలన ఉత్పత్తిలో ఎక్కువగా నష్టపోవచ్చు. ఈ రకంగా, ఒక సార్వభౌమ దేశపు ఆర్థిక విధానాలను, అంతర్జాతీయ ద్రవ్య నిధి నిర్దేశించినట్లవుతుంది. అందువలన అంతర్జాతీయ ద్రవ్య నిధి ప్రజాదరణ కోల్పోయింది. అయితే, చెల్లింపుల శేషములో లోటు ఏర్పడడానికి కారణభూతమైన ఆర్థిక విధానాలకు అంతర్జాతీయ ద్రవ్య నిధి కారణం కాదు. వాటి పరిష్కారానికి అవసరమైన ఆర్థిక విధానాల నిర్దేశంలో అంతర్జాతీయ ద్రవ్యనిధి జోక్యం చేసుకున్నట్లవుతుంది. అందువలన, చాలా అభివృద్ధి చెందుతున్న దేశాలు, అంతర్జాతీయ ద్రవ్యనిధిని ఒక విలన్‌గా పరిగణిస్తారు.

## 15.6 అంత ర్జాతీయ ద్రవ్యత్వము :

అంతర్జాతీయ ద్రవ్య వ్యవస్థ పని తీరుని మదింపు చేయటానికి మూడు ప్రామాణికాలున్నాయనీ, అవి :

1. సర్దుబాటు (Adjustment)

2. ద్రవ్యత్వము మరియు (Liquidity)

3. నమ్మకము (Confidence)

అనీ ఇంతకు ముందు చెప్పాము. వీటిలో ద్రవ్యత్వము చాలా ముఖ్యమైనది. తగుపరిమాణంలో రిజర్వులు ఉండాలి. బహిర్గత అసమతుల్యాలను finance చెయ్యటానికి తగు పరిమాణములో రిజర్వులుండాలి.

అంతర యుద్ధ కాలపు అనుభవాన్ని దృష్టిలో పెట్టుకొని, బ్రెట్టన్ వుడ్స్ సమావేశము, తగిన అంతర్జాతీయ ద్రవ్య రిజర్వులుండాలని, అభిప్రాయపడింది. దీనికనుగుణంగా, అంతర్జాతీయ ద్రవ్య నిధికి కోటాలను, చందాలను నిర్దేశించింది.

అయితే, Robert Triffin, 1959లో బ్రెట్టన్ వుడ్స్ వ్యవస్థలో, అంతర్జాతీయ ద్రవ్య రిజర్వులు తగు వేగంగా పెరగటం లేదని గ్రహించారు. ఈ వ్యవస్థ తగు పరిమాణంలో, రిజర్వులను సృష్టించగలదా అని కూడా సందేహం వెలిబుచ్చారు. 1960లో ఈ అంతర్జాతీయ ద్రవ్యత్వ సమస్య ఏర్పడింది. ఈ సమస్యను గూర్చి యిప్పుడు వివరంగా తెలుసుకుందాము.

అంతర్జాతీయ ద్రవ్యత్వము, ఒక దేశానికి గల రిజర్వులను గూర్చి, ఆ దేశపు విదేశీ చెల్లింపులశేషములోని లోటును పరిష్కరించటానికి అవసరమైన రిజర్వులను గూర్చి తెలియ జేస్తుంది. సర్దుబాటు చర్యలు చేపట్టకుండా, విదేశీ చెల్లింపుల శేషములోని లోటును finance చెయ్యగల శక్తిని అంతర్జాతీయ ద్రవ్యత్వంగా పరిగణిస్తాము.

సామాన్యంగా, అంతర్జాతీయ ద్రవ్యత్వము, అంతర్జాతీయ రిజర్వుల పర్యాయ పదంగా వాడతారు. ఒక దేశపు అధికారిక బంగారపు నిల్వలు, మార్చుకునేందుకు వీలున్న విదేశీ కరెన్సీలు, ఎస్. డి. ఆర్లు, మరియు అంతర్జాతీయ ద్రవ్య నిధి వద్దనున్న నికర రిజర్వులు - వీటన్నిటి మొత్తాన్ని అంతర్జాతీయ రిజర్వులుగా పరిగణిస్తాము. కానీ, స్థూలంగా చూస్తే, అంతర్జాతీయ ద్రవ్యత్వము - ప్రభుత్వం వద్దనున్న పై assets గాక ప్రైవేటుగావున్న వాటిని గూర్చి అంతర్జాతీయ ద్రవ్యత్వంగా పరిగణించవచ్చు.

అయితే, అంతర్జాతీయ ద్రవ్యత్వాన్ని చర్చించేటప్పుడు, స్వంత రిజర్వులు, అప్పు చేసిన రిజర్వులు అని తేడాలుంటాయి. కరెంటు, మూలధన ఖాతాలోని బాధ్యతలన్నీ (Obligations) తీర్చిన తర్వాత, మిగిలిన విదేశీ మారకపు నిల్వలు స్వంత రిజర్వులు. అధికారిక బంగారపు నిల్వలు కూడా ఈ తరగతి క్రిందకే వస్తాయి. విదేశాల్నించి అప్పులుగా తీసుకొన్న మూలధన దిగుమతులు, విదేశాల ప్రత్యక్ష పెట్టుబడులను అప్పులుచేసిన రిజర్వులుగా పరిగణిస్తాము. స్వంత మరియు అప్పులు చేసిన రిజర్వులను రెండూ కలిపి అంతర్జాతీయ ద్రవ్యత్వముగా పరిగణిస్తాము.

అంతర్జాతీయ ద్రవ్యత్వపు డిమాండ్, దాని సప్లయ్ కన్నా ఎక్కువగా పెరుగుతుండడం వల్ల, అంతర్జాతీయ ద్రవ్యత్వపు సమస్య (కొరత) ఉత్పన్నమవుతోంది. ప్రపంచంలో, అనేక దేశాల చెల్లింపుల శేషములలో లోట్లు పెరగటం వలన ఈ సమస్య ఎదురవుతోంది. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాలు, ఈ రకమైన సమస్య నెదుర్కొంటున్నాయి. వాటి ఎగుమతుల డిమాండ్, ధరలలో ఒడుదుడుకుల వలన ఈ పరిస్థితి ఏర్పడుతుంది. మరొకవైపు, వాటి దిగుమతి అవసరాలు పెరుగుతున్నాయి. అందువలన, విదేశీ మారకపు సమస్య ఎదురవుతోంది.

ప్రపంచ వాణిజ్యము పెరిగినంత మేరకు, అంతర్జాతీయ రిజర్వులు పెరగటం లేదు. అందువలన అంతర్జాతీయ ద్రవ్యత్వ సమస్య ఎదురవుతోంది. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాల ఈ సమస్యనెదుర్కొంటున్నాయి.

1960కి పూర్వము ఈ సమస్య లేదు. బ్రెట్టన్ వుడ్స్ వ్యవస్థ ఒప్పందం ప్రకారము, దేశాల మారకపు రేట్లు, బంగారంలోకి గాని, అమెరికన్ డాలర్లకు గాని, 1 ఔన్సు బంగారం $35 డాలర్ల వద్ద నిర్ణయింపబడ్డాయి. సభ్య దేశాలు, తాత్కాలికంగా తప్ప, వ్యాపారంపై గాని, చెల్లింపులపై కాని ఎటువంటి ఆంక్షలు విధించరాదు. తమ ద్రవ్య నిల్వలను, కొంత బంగారం రూపంలోనూ, కొంత డాలర్లలోగానీ, పౌండ్ స్టెర్లింగ్‌లలో కాని ఉంచుకొనవచ్చు. ఈ ద్రవ్య నిల్వలను, సభ్యదేశాలు తమ చెల్లంపుల శేషములో ఏర్పడే తాత్కాలిక లోటును సరిదిద్దటానికి ఉపయోగించుకోవచ్చు. తద్వారా మారకపు రేట్లను స్థిరంగా ఉంచుకోవచ్చు. వ్యయ నియంత్రణ విధానాల ద్వారా, మరియు మూల్యహీనీకరణ ద్వారా, చెల్లింపుల శేషములోని లోటును సరిదిద్దాలని అంతర్జాతీయ ద్రవ్యనిధి నిర్దేశించింది. కాబట్టి, ద్రవ్యనిధి నుండి అంటే తాత్కాలిక ఋణాలుకాకుండా, ప్రపంచ వాణిజ్య విస్తరణను ఫైనాన్స్ చేయడాని కవసరమైన ద్రవ్యత్వము - బంగారము మరియు డాలరు, పౌండ్ స్టెర్లింగ్‌ల విస్తరణ ద్వారా రావలసి ఉంది. అయితే, బంగారపు సప్లయ్ దక్షిణాఫ్రికా, మరియు సోవియట్ యూనియన్‌లలోని బంగారపు గనుల ఉత్పత్తికే పరిమితమయింది. అంతర్జాతీయ ద్రవ్య నిధి వ్యవస్థలలో, డాలరు, ద్రవ్యపు విధులన్నిటినీ నిర్వర్తిస్తూండడం వలన, ప్రతి దేశము తన డాలరు నిల్వలనధికం చేయడానికి ప్రయత్నించింది. అందువలన, అవసరమైన వాటికన్నా, ఎక్కువ డాలరు నిల్వల నుంచుకోవడం జరిగింది. ఫలితంగా, అమెరికా దేశపు బంగారపు నిల్వలు పడిపోయి, దాని విదేశీ చెల్లింపులశేషము క్షీణింపసాగింది. ఇది గమనించే, మనము పైన చెప్పినట్లు, Robert Triffin, 1959లో ప్రపంచ ద్రవ్యత్వానికి డిమాండ్, దాని సప్లయ్ కన్నా అధిక రేటులో పెరుగుతుందని సూచించారు. దీనికి కారణము - బంగారపు సప్లయ్‌లో పెరుగుదల తక్కువగా ఉండడం. డాలరుని, బంగారంలోనికి మార్చవచ్చు కనుక, మిగతా దేశపు ద్రవ్యత్వపు అవసరాలతో పోలిస్తే, అమెరికన్ డాలర్ల సప్లయ్ తక్కువగా ఉంది. అందువలన, దేశాలు వ్యాపారంపై ఆంక్షలు విధించి, తద్వారా చెల్లింపుల శేషములో మిగులును సాధించి, నిల్వలను పెంచే అవకాశం ఉంది. అందువలన పెరిగే ద్రవ్యత్వపు కొరత, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ విస్తరణలో బెడదగా పరిణమించి, 1930 నాటి ఆర్థికమాంద్య పరిస్థితులకు దారి తీస్తుందని Triffin హెచ్చరించారు. ఫలితంగా నమ్మకము (Confidence) సమస్య ఉత్పన్నమయింది. 1967 నవంబరులో, పౌండ్ మూల్యహీనీకరణమయింది. ప్రపంచ బంగారపు మార్కెటుపై నియంత్రణ ఏమీ లేదు. బహిరంగ మార్కెటులో ప్రత్యేక ధర ఉండటం వలన, 1970 ఆగష్టు 15న, అమెరికా డాలర్లను బంగారంలోకి మార్చడాన్ని రద్దు చేసింది. మారకపు రేటు స్థిరత్వానికై,

విదేశీమారకపు మార్కెట్లలో జోక్యం చేసుకోడానికి నిరాకరించింది. పారిశ్రామిక దేశాల "Group of 10" వాషింగ్టన్‌లోని Smith sonian Institute లో 1971 డిసెంబరులో సమావేశమయి, ముఖ్య కరెన్సీల Realignment కి ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. డాలరు, 10 శాతము మూల్యహీనీకరణ చేసి, మిగతా కరెన్సీలను పునర్మూల్యాంకన చేయటానికంగీకరించాయి. అయితే, అమెరికా 1937 ఫిబ్రవరిలో డాలరును మరల మూల్యహీనీకరణ చేయడం వలన, యీ ఒప్పందం భగ్నమయింది. 1973 మార్చిలో, అనేక దేశాలు Flowing Exchange Rates ను కలిగివున్నాయి. EEC దేశాల వారి కరెన్సీలు, Joint Flow గా ఉన్నాయి. 1976 జనవరిలో జమైకా ఒప్పందం ఈ రకపు వ్యవస్థను ధృవపరిచింది. అంతర్జాతీయ ద్రవ్య నిధి Charter కు 1978లో రెండవ సవరణ ద్వారా, సభ్య దేశాలు బంగారంలోగానీ, డాలరులో కానీ సామ్య విలువలను నిర్ధారించటంగానీ, కొనసాగించడం కానీ చెయ్యకూడదు. సభ్య దేశాల మారకపు రేటు సర్దుబాటు విధానాలపై అంతర్జాతీయ ద్రవ్య నిధికి నియంత్రణ లేదు. అయితే యీ విధానాలపై దాని నిఘా మాత్రం ఉంది. సరళమారకపు రేట్ల పద్ధతి వలన, ఎక్కువ రిజర్వుల ఆవశ్యకత తగ్గిపోయింది.

## 15.7 ఎస్. డి. ఆర్స్ :- (Special Drawing Rights)

డాలరు, బంగారముపై ఆధారపడిన స్వర్ణ వినిమయ ప్రమాణము వలన, ద్రవ్యత్వము (Liquidity) మరియు నమ్మకము (Confidence) సమస్య ఎదురయ్యాయి. అందువలన 1970లో, అంతర్జాతీయ ద్రవ్య నిధి SDR అనే క్రొత్త రిజర్వు ఎస్సెట్‌ని సృష్టించింది. చెల్లింపుల శేషములో లోట్లను పరిష్కరించే చెల్లింపులకు, డాలరు, బంగారానికి అదనంగా మరొక క్రొత్త రిజర్వు ఎస్సెట్‌ని ప్రవేశ పెట్టటమే దీని లక్ష్యము. ఈ SDR నిల్వలను, అంతర్జాతీయ ద్రవ్యనిధి నిర్వహిస్తుంది. కాబట్టి అంతర్జాతీయ వాణిజ్యాంకు అనుగుణంగా ఇవి పెరగవచ్చు. అంతర్జాతీయ ద్రవ్యత్వ సమస్య పరిష్కారానికి, ఈ SDR లు ఉద్దేశించబడ్డాయి. సభ్య దేశాలకు, వారి వాటాల నిష్పత్తిలో, ఈ SDR లు కేటాయింపబడ్డాయి. Special Drawing Account అని, ఒక ప్రత్యేక అకౌంట్‌ను ద్రవ్య నిధి నెలకొల్పింది.

ప్రారంభంలో, ఈ SDR లకు, దేశాలు తమ రిజర్వులలో భాగంగా ఉంచుకొని, చెల్లింపుల శేషములో సమస్యలు తల ఎత్తినపుడు, కరెన్సీలోనికి మార్చారు. 1SDR= 0.888671 gram of gold = 1 Annual Dollar. 1975 తర్వాత, సామ్య విలువ పద్ధతిని విడనాడి, అమెరికన్ డాలరు మరియు మిగతా కరెన్సీలు float అవడం ప్రారంభించాక, SDR మారకపు విలువను స్థిరీకరించాలని నిర్ణయించారు. తదనుగుణంగా, SDR విలువ, ఎక్కువగా ఉపయోగించే 6 దేశాల కరెన్సీల Basket ఆధారంగా చేసుకొని నిర్ణయించబడినది. అంతర్జాతీయ ద్రవ్య నిధి ఒప్పందపు ఆర్టికల్ ప్రకారము, 1978లో, SDR అంతర్జాతీయ యూనిట్ ఆఫ్ అకౌంట్ అయింది. అందువలన Basketలో కరెన్సీల సంఖ్య ఐదుకు తగ్గింది. అవి : అమెరికన్ డాలరు, బ్రిటిష్ పౌండు, ఫ్రెంచిఫ్రాంకు, జర్మన్ మార్కు, మరియు జపాన్ యెన్ కరెన్సీలు. అక్టోబరు, 2 1984 తేదీన 1 SDR = $ 1.031. కాని జనవరి 1986 నుండి, ప్రతి ఐదేళ్ళ కొకసారి, SDR లోని కరెన్సీ comparison మరియు weighting పద్ధతిని సవరించారు. వస్తు, సేవల ఎగుమతుల విలువలను బట్టి, మరియు ఇతర సభ్య దేశాల వద్ద నున్న కరెన్సీ నిల్వలను బట్టి ఈ పునఃపరిశీలన జరిగేది.

ఇతర దేశాల కరెన్సీలను Draw చెయ్యడానికి షరతులు లేని హక్కులే SDRలు. అంతర్జాతీయ ద్రవ్య నిధి సృష్టించిన SDR లు, వారివారి కోటాల దామాషాలో సభ్య దేశాలకు కేటాయింపబడతాయి. చెల్లింపుల శేషములలోని లోట్లను Finance చెయ్యటానికి, వారి SDR నిల్వల నుండి Draw చేసుకొనవచ్చును. లోటు ఉండే దేశాలు, విదేశీమారక నిల్వలు అవసరమైన దేశాలకు ద్రవ్య నిధి నిర్దేశించిన మిగులు దేశాలు, SDR లకు బదులుగా వారి కరెన్సీలను బదులుగా అందజేయవచ్చు. ఏ దేశాల కరెన్సీలు విదేశీ మారకముగా పొందబడ్డాయో, వారి కోటాల 3 రెట్ల కన్నా అధికంగా SDR లను పొందకూడదు.

SDR Account లో ఉన్న అన్ని SDRల పైనా అంతర్జాతీయ ద్రవ్యనిధి వడ్డీ చెల్లిస్తుంది. మిగులు దేశాలలో, తమ కోటాల కన్నా ఎక్కువగా వున్న SDR నిల్వలపై వడ్డీని చెల్లిస్తుంది. వారికి కేటాయించిన వాటాను తక్కువ SDR లు వున్న దేశాలు, అదే రేటున ద్రవ్యనిధికి వడ్డీని చెల్లించాలి. ప్రపంచ ద్రవ్య మార్కెట్లలో స్వల్పకాలిక వడ్డీ రేట్ల మార్పులకనుగుణంగా, ఈ వడ్డీ రేటును మార్పు చేసేవారు. ప్రతి మూడు నెలలకొకసారి సమీక్ష జరిపి, అమెరికా, బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్సు మరియు జపాను దేశాలలోని స్వల్పకాలిక వడ్డీరేట్లను బట్టి దీనిని నిర్ణయించేవారు.

## 15.7.1 SDR ల ఉపయోగాలు:

1. దేశాలు, తమ చెల్లింపుల శేషములోని లోటును Finance చెయ్యటానికి ఉపయోగపడతాయి.

2. చాలా దేశాలు, తమ కరెన్సీ విలువను SDRలో స్థిరీకరించారు (Pegged).

3. అంతర్జాతీయ ద్రవ్య నిధి లావాదేవీలకు SDR యూనిట్ ఆఫ్ అకౌంట్. కొందరికి (ఎగుమతిదారులకు, దిగుమతిదారులకు, పె ్టుబడి పెట్టేవారికి) యిది యూనిట్ ఆఫ్ అకౌంట్, దీని వలన, మారకపు రేట్లలో ఒడుదుడుకుల నుండి వారికి రక్షణ ఉ ది.

4. నిర్దేశించిన లావాదేవీలు (Transactions with Designation) నిధి, SDR Schemes నిల్వల పరిస్థితి, చెల్లింపుల శేషముల పరిస్థితి చాలా అనుకూలముగా ఉన్న దేశాన్ని, ఇంకొక సభ్య దేశానికి అవసరమైతే, తమ కరెన్సీని SDR కి బదులుగా అందజేయమని నిర్దేశిస్తుంది.

5. ద్రవ్య నిధిలో అన్ని లావాదేవీలకు, ఈ SDR లు ఉపయోగించాలి.

6. ఒప్పందం ప్రకారం లావాదేవీలు-Transaction by Agreement ఇంకొక దేశంతో, ఒప్పందం ప్రకారము తమ SDR లను, కరెన్సీ కోసం అమ్మకం చేయవచ్చు. 1978 నుండి, ఈ సౌకర్యం అందుబాటులో ఉంది.

మనము పైన చెప్పినట్లు, ఈ SDR లను సభ్య దేశాలకు వారి ద్రవ్యనిధి కోటాలను బట్టి కేటాయిస్తుంది. ఆరంభంలో, అంతర్జాతీయ ద్రవ్యనిధి 1970-72 సంవత్సరంలో, 9.3 బిలియన్ల SDRలను సృష్టించింది. వీటిని 112 దేశాలకు కేటాయించింది. 1978 వరకు, ఈ 9.3 బిలియన్ డాలర్ల SDR లు కొనసాగాయి. 1979, 80, 81 ఈ మూడు సంవత్సరాలలోనూ, సంవత్సరానికి 4 బిలియన్ల SDRల చొప్పున పెంచటానికి 1978లో నిర్ణయించింది. అందువలన 1981 నాటికి ఇవి 21.4 బిలియన్ల SDR లయ్యాయి. 1981 నుండి, ద్రవ్యనిధి ఏ SDR కేటాయింపు చేయలేదు.

ఈ విధంగా, అంతర్జాతీయ ద్రవ్యనిధి SDRల ద్వారా, అంతర్జాతీయ రిజర్వులను పెంచి, అంతర్జాతీయ ద్రవ్యత్వ సమస్యను పరిష్కరించటానికి ప్రయత్నించింది. వీటి ద్వారా, అంతర్జాతీయ ద్రవ్యవ్యవస్థ పూర్తిగా అమెరికన్ డాలరు పైకానీ, బంగారపు ధరలలోని ఒడుదుడుకులపైన గానీ ఆధారపడకుండా ఉండేటట్లు ప్రయత్నించింది. సభ్యదేశాల చెల్లింపుల శేషములోని అసమతుల్యాన్ని పరిష్కరించటానికి ద్రవ్యత్వ పరిస్థితి మెరుగుగా ఉండే దిశగా ప్రయత్నించింది.

అయితే, అంతర్జాతీయ ద్రవ్యనిధి పాత్రపై విమర్శలు లేకపోలేదు.

1. ఈ పరిస్థితి సంపన్న దేశాలకనుకూలంగా ఉందని విమర్శ. SDR ల కేటాయింపు సభ్యదేశాల కోటాలపై ఆధారపడి వుంటుంది. అందువలన అభివృద్ధి చెందుతున్న దేశాలలో, వాటి అవసరాలతో పోలిస్తే, ఈ కేటాయింపులు చాలా తక్కువ. తక్కువ SDRల కేటాయింపు వలన, ఆ దేశాల అప్పు చేసే శక్తి తగ్గుతుంది.

2. SDRల రూపంలో అంతర్జాతీయ రిజర్వుల సృష్టికి, అభివృద్ధి చెందుతున్న దేశాల అభివృద్ధికవసరమైన సహాయానికి (Development Assistance) సంబంధంలేదు. ఈ దేశాలలో ద్రవ్యత్వ ఆవశ్యకత చాలా ఎక్కువ. అందువలన, తక్కువ పరిమాణములో SDRలను సృష్టించి, వాటిని న్యాయమైన పద్ధతిలో పంపిణీ చేసి, షరతులు లేని ద్రవ్యత్వాన్ని అభివృద్ధి చెందుతున్న దేశాలకందజేయవలసిన ఆవశ్యకత చాలా ఉంది.

3. అమెరికా, ఇతర అభివృద్ధి చెందిన దేశాల మొండి వైఖరి కారణంగా, 1982 జనవరి నుండి SDR ల కేటాయింపు కొనసాగలేదు. ఈ అంశంపై అభివృద్ధి చెందిన దేశాలనేకమార్లు విజ్ఞప్తులు చేసినా ఫలితం లేకపోయింది. అందువలన అంతర్జాతీయ ద్రవ్యనిధి, SDR ల ద్వారా అంతర్జాతీయ ద్రవ్యత్వాన్ని పెంపొందించే లక్ష్యంలో విఫలమయింది. అందువలన అభివృద్ధి చెందుతున్న దేశాలు తీవ్రమైన చెల్లింపుల సమస్యలు, ఋణ సమస్యలనెదుర్కొంటున్నాయి.

## 15.8 యూరో డాలరు మార్కెటు (Euro Dollar Market) -

అంతర్జాతీయ ద్రవ్య మార్కెటులో అతిపెద్ద మార్కెటు యూరో డాలరు మార్కెటు. అంతర్జాతీయ విత్తములో ఇది కీలక పాత్ర పోషిస్తోంది. అందువలన దీనిని గూర్చి తెలుసుకుందాము.

యూరో డాలరు, అమెరికన్ డాలరు నుండి భిన్నమైన కరెన్సీ కాదు. అమెరికా వెలుపల, బ్యాంకులలో డిపాజిట్ చేయబడిన అమెరికన్ డాలర్లను యూరో డాలర్లని అంటారు. ఉదాహరణకు, ఒక బ్రిటీష్ వాణిజ్య బ్యాంకులో డిపాజిట్ చేయబడిన అమెరికన్ డాలరును యూరో డాలరు అని అంటారు. ఇప్పుడు యూరో డాలరు అనేది దీనికే పరిమితము కాలేదు. యూరప్ వెలుపలి దేశాలు - జపాన్, కెనడా, హాంగ్‌కాంగ్, సింగపూరు మొదలైన దేశాలలో, ఎక్కువ పరిమాణములో అమెరికన్ డాలర్లు ఉన్నాయి. అంతేకాకుండా, యూరో బ్యాంకులు (యూరప్‌లోని బ్యాంకులు), మిగతా కరెన్సీలలో కూడా లావాదేవీలు కొనసాగిస్తున్నాయి. పౌండ్‌స్టెర్లింగ్, జర్మన్ మార్కు, స్విస్ ఫ్రాంకు, డచ్ గిల్డర్లు మొదలైన కరెన్సీలను కూడా ఈ బ్యాంకులు Deal చేస్తున్నాయి. అందువలన వీటిని యూరో కరెన్సీ మార్కెట్లుగా కూడా వ్యవహరిస్తున్నారు.

యూరో కరెన్సీ మార్కెటు అనగా ఒక కరెన్సీని విడుదల చేసిన దేశము కాకుండా, బయట వాణిజ్య బ్యాంకులలోని కరెన్సీ డిపాజిట్లు, ఫ్రెంచి వాణిజ్య బ్యాంకులు డిపాజిట్ చేయబడిన పౌండ్ స్టెర్లింగ్ డిపాజిట్లను యూరో స్టెర్లింగ్ అంటారు. ఈ డిపాజిట్ నిల్వల నుండి అప్పులు యివ్వడం కానీ, అప్పులు తీసుకోవడంగానీ జరుగుతుంది. అంతర్జాతీయ బ్యాంకులు, అంతర్జాతీయ కార్పొరేషన్లు, ప్రభుత్వాలు, తమకవసరమైనపుడు, ఈ నిల్వలనుపయోగిస్తారు. ఈ రకమైన అప్పు యిచ్చే లేదా తీసుకొనే కార్యకలాపాలు జరిగే మార్కెటును యూరో కరెన్సీ మార్కెటు అని అంటాము. ప్రారంభంలో, ఈ రకపు కార్యకలాపాలలో డాలరు మాత్రమే ఉపయోగించేవారు కాబట్టి యూరో డాలరు మార్కెటు అని వ్యవహరించారు. కాలక్రమేణా మిగతా కరెన్సీలను కూడా ఈ విధంగా ఉపయోగించటం వలన, ఈ మార్కెట్‌ను యూరో కరెన్సీ మార్కెటు అని పిలుస్తున్నారు. అయితే ఈ మార్కెట్‌లో డాలరు ప్రముఖ పాత్ర వహిస్తుండటం వలన యూరో డాలరు మార్కెటు అని అంటున్నారు.

## 15.8.1 యూరో డాలరు మార్కెటు : కారణాలు :

యూరో డాలరు మార్కెటు ఆవిర్భవించడానికి, దాని పెరుగుదలకు కారణాలను యిప్పుడు పరిశీలిద్దాము.

1. రెండవ ప్రపంచ యుద్ధానంతరం, ఈ యూరో డాలరు మార్కెటు ఆవిర్భవించింది. యూద్ధానంతర కాలంలో అమెరికా ప్రపంచంలో అతిశక్తివంతమైన దేశంగా అవతరించింది. అందువలన, యుద్ధానంతర యూరపు పునర్నిర్మాణంలో ప్రముఖ పాత్ర వహించింది. అందుకు అవసరమైన ఆర్థిక, సైనిక సహాయము చేసింది. దీనివలన, యూరో బ్యాంకులకు, ఎక్కువ పరిమాణంలో డాలర్లు బదిలీ అయ్యాయి.

2. 1950లలోని ప్రచ్ఛన్న యుద్ధ పరిస్థితులలో, సోవియట్ యూనియన్, ఇతర కమ్యూనిస్ట్ దేశాలు, తమ డాలరు డిపాజిట్లను, అమెరికా వెలుపల యూరో బ్యాంకులలో ఉంచాలని అభిప్రాయపడ్డాయి. భద్రతా కారణాలదృష్ట్యా, యిది శ్రేయస్కరమని ఆదేశాలు భావించాయి.

3. విదేశాలలో స్వల్పకాలిక డిపాజిట్లపై అధిక వడ్డీ రేట్లు వుండటం, అమెరికాలోని ఫెడరల్ రిజర్వు సిస్టమ్ యొక్క Q- నిబంధన (Q-Regulation) వలన, అమెరికన్ బ్యాంకులు తమ డిపాజిట్లపై చెల్లించే వడ్డీ రేట్లపై ఒక పరిమితిని విధించారు. ఈ వడ్డీ రేట్లు, యూరో బ్యాంకులు చెల్లించే వడ్డీ రేట్ల కన్నా తక్కువ. అందువలన స్వల్పకాలిక డిపాజిట్లు, యూరో బ్యాంకులకు ఆకర్షింపబడి, వాటికి తరలిపోయాయి. ఆ విధంగా అవి యూరో డాలర్లయ్యాయి.

4. అంతర్జాతీయ కార్పొరేషన్లు, విదేశాలలో తమ నిల్వలను డాలర్ల రూపంలో ఉంచుకోవటానికి యిష్టపడ్డాయి. డాలరు ముఖ్యమైన అంతర్జాతీయ కరెన్సీ కాబట్టి, చెల్లింపులన్నీ ఈ కరెన్సీ రూపంలోనే చెయ్యటం వలన, యూరో డాలర్ల రూపంలో ఉంచడం సులువని భావించాయి. అంతేకాక, అంర్జాతీయ కార్పొరేషన్లు యూరో మార్కెటు నుండి అప్పు చేయడం ద్వారా, కొన్ని పరపతి నిబంధనలనధిగమించవచ్చు.

5. 1973 తర్వాత, పెట్రోలియం ఎగుమతి చేసే దేశాలకు అధిక పరిమాణములో డాలర్లు రాసాగాయి. వీటిని ఆ దేశాలు అమెరికాలో ఉంచటంకన్నా, బయట దేశాలలో ఉంచటం క్షేమమని భావించాయి. ఈ పరిణామము, యూరో డాలరు మార్కెటు వృద్ధి చెందటానికి బాగా దోహదం చేసింది.

విదేశీ కరెన్సీలలో డిపాజిట్లను స్వీకరించడానికి, యూరోపియన్ బ్యాంకులు బాగా ఆసక్తి చూపాయి. వీటిపై ఎక్కువ వడ్డీ రేటును యివ్వటానికి సిద్ధపడ్డాయి. ఆ డిపాజిట్లను వారు ఇంకా ఎక్కువ వడ్డీ రేటుకు అప్పివ్వవచ్చు. 1950లలోనూ, తరువాతి కాలంలోనూ ఉత్పన్నమయిన ప్రత్యేక పరిస్థితుల వలన, ఈ యూరో డాలరు మార్కెటు త్వరితగతిన వృద్ధి సాధించింది. అంతర్జాతీయ లావాదేవీలలో, యూరో కరెన్సీ మార్కెటు ఆధిపత్యం ఎక్కువ. అంతర్జాతీయ బ్యాంకింగ్‌లూ, సాంప్రదాయిక విదేశీ బ్యాంకింగ్ వ్యవస్థ వాటా కేవలం 11 శాతమే.

1960 నుండీ, యూరో కరెన్సీ డిపాజిట్లు గణనీయంగా పెరగడం వలన, అంతర్జాతీయ ద్రవ్యత్వాన్ని అధికం చేయడంలో ప్రముఖ పాత్ర వహించాయి. దేశీయ, అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్లను బాగా సంఘటితం చేసి, సమన్వయం చేసి, పోటీని పెంచి, పారిశ్రామిక దేశాలలోని దేశీయ బ్యాంకింగ్ వ్యవస్థ సామర్థ్యాన్ని పెంచాయి.

అంతర్జాతీయ ద్రవ్యవ్యవస్థలో యూరో డాలరు మార్కెటు ముఖ్య పాత్రను నిర్వహిస్తోంది. డాలర్లలో పెట్టుబడి పెట్టటం, అప్పు తీసుకోవటం, యూరో కరెన్సీ (డాలరు) మార్కెటు ముఖ్య విధి. స్వల్పకాలిక, దీర్ఘ కాలిక నిధులను ప్రపంచవ్యాప్తంగా బదిలీ చేసి, అంతర్జాతీయ మూలధన గమనశీలతను పెంచుతోంది. ఎక్కువ వడ్డీ రేట్లనివ్వడం ద్వారా, డాలరు డిపాజిట్లనాకర్షిస్తోంది. తక్కువ వడ్డీరేట్ల కప్పివ్వడం ద్వారా, అప్పు తీసుకొనేవారిని ఆకర్షిస్తోంది.

అయితే, ఈ యూరో డాలర్ల ప్రవాహము వల్ల, అంతర్గతంగా ద్రవ్య విధానంపై ప్రతికూల ప్రభావం వుంటుంది. ద్రవ్యోల్బణాన్ని అరికట్టడానికి, నిర్బంధ ద్రవ్య విధానాన్ని అమలు చేసేటపుడు, ఇటువంటి స్వల్పకాలిక మూలధన రాకలు, ఆవిధానాన్ని నిర్వీర్యం చేస్తాయి. అదేవిధంగా, సులభ ద్రవ్య విధానం ద్వారా నిరుద్యోగతను అరికట్టడానికి ప్రయత్నిస్తునపుడు, మూలధనము బయటకు తరలివెళ్తే ఆ విధానము నిష్ఫలమవుతుంది.

అంతేకాక, ఈ యూరో డాలర్లు మూలధన కదలికలకు కారణమవుతాయి. అందువలన, ఆయాదేశాలు సంక్షోభానికి గురి అవుతాయి. వ్యాపార ఆంక్షలుకానీ, విదేశీ మారక నియంత్రణలు కానీ లేని దేశాలు ఇటువంటి మూలధన కదలికలు - దేశంలోకి గానీ, వెలుపలకుగానీ, ఎక్కువ పరిమాణంలో జరిగితే, తీవ్ర సంక్షోభానికి దారితీసి, మొత్తము అంతర్జాతీయ ద్రవ్య వ్యవస్థనే ప్రభావితం చేస్తాయి. అభివృద్ధి చెందిన దేశాలకన్నా, అభివృద్ధి చెందుతున్న దేశాలు ఈ పరిణామాల వల్ల భారీగా నష్టపోతాయి. యూరో మార్కెటు వంటి ప్రత్యేక అంతర్జాతీయ ద్రవ్య కేంద్రంపై ఈ దేశాలు ఆధారపడటం వలన ఈ ప్రమాదం ఉంది.

## 15.9 సారాంశము:

ఈ పాఠములో, మనము స్వర్ణ ప్రమాణము నుండి, ప్రస్తుత వ్యవస్థ వరకు, అంతర్జాతీయ ద్రవ్య వ్యవస్థ పరిణామ క్రమాన్ని పరిశీలించాము. అంతర్జాతీయ చెల్లింపులకు దోహదపడే నియమాలు, పద్ధతులు, నిబంధనలు, సౌకర్యాలు, వ్యవస్థల స్వరూపమే అంతర్జాతీయ ద్రవ్య వ్యవస్థ. అంతర్జాతీయ ద్రవ్య వ్యవస్థలను, మారకపు రేట్ల నిర్ణయ పద్ధతులను బట్టి గానీ, అంతర్జాతీయ రిజర్వు Assets స్వరూపాన్ని బట్టి గానీ వర్గీకరింపవచ్చును. అంతర్జాతీయ వాణిజ్యాన్ని, పెట్టుబడిని గరిష్టం చేసి, వ్యాపారం వల్ల వచ్చే లాభాలను సమంగా పంపిణీ చేసే వ్యవస్థను ఉత్తమ అంతర్జాతీయ ద్రవ్య వ్యవస్థగా పరిగణిస్తాము. ఏ అంతర్జాతీయ ద్రవ్య వ్యవస్థనైనా మూడు ప్రామాణికలను బట్టి సర్దుబాటు, ద్రవ్యత్వము, నమ్మకము - మదింపు చేయవచ్చు.

1880 నుండి 1914 వరకు స్వర్ణ ప్రమాణము అమలులో ఉంది. ఈ స్వర్ణ ప్రమాణ వ్యవస్థలో, స్వల్పకాలిక మూలధన ప్రవాహాల స్థిరీకరణ ద్వారా, ప్రేరేపింపబడిన ఆదాయపు మార్పులద్వారాను, సర్దుబాటు చాలా వరకు జరిగింది. అంతేకాని, Price - Specie Flow Mechanism నిర్దేశించినట్లు, అంతర్గత ధరలలో మార్పుల ద్వారా జరగలేదు. అప్పటి ఆర్థిక పరిస్థితులు స్థిరంగానూ, ఆశాజనకంగానూ ఉండడం వలన, సర్దుబాటు సులభతరమయింది. 1919-1924 కాలములో, మారకపు రేట్లు విపరీతమైన ఒడుదుడుకులనెదుర్కొన్నాయి. అందువలన, 1925లో బ్రిటన్, మిగతా దేశాలు స్వర్ణ ప్రమాణాన్ని పునరుద్ధరించడానికి ప్రయత్నం చేసాయి. కాని 1931లో సంభవించిన ఆర్థిక మహామాంద్యం వలన యీ ప్రయత్నాలు ఫలించలేదు. ప్రతిదేశము, పోటాపోటీగా తమ కరెన్సీని మూల్యహీనీకరణ చేసి, తన నిరుద్యోగితను ఎగుమతి చేయటానికి ప్రయత్నించింది. చాలా దేశాలు వ్యాపారంపై ఆంక్షలు విధించాయి. ఫలితంగా, అంతర్జాతీయ వ్యాపారం సగానికి తగ్గిపోయింది.

ఈ పరిస్థితులలో, 1944లో అంతర్జాతీయ ద్రవ్యనిధిని స్థాపించడం ద్వారా అంతర్జాతీయ ద్రవ్య వ్యవస్థను చక్కదిద్దడానికి ప్రయత్నం జరిగింది. ఆ ప్రయత్నాల ఫలితంగా బ్రెట్టన్‌వుడ్స్ వ్యవస్థ ఆవిర్భవించింది. ఈ వ్యవస్థను స్వర్ణ వినిమయ ప్రమాణముగా అభివర్ణించవచ్చు. బంగారము, మార్పునకు వీలైన కరెన్సీలను, అంతర్జాతీయ రిజర్వులుగా పరిగణించారు. మారకపు రేట్లు, స్థాపింపబడిన సామ్యవిలువలకన్నా, 1 శాతం కన్నా ఎక్కువగా కానీ, 1శాతం కన్నా తక్కువగా కానీ - ఆ పరిధిలో మార్పు చెందవచ్చు. చెల్లింపుల శేషములో ప్రాథమిక అసమతుల్యమేర్పడినపుడు, అంతర్జాతీయ ద్రవ్యనిధి అనుమతితో, సామ్య విలువలను మార్పు చేయవచ్చు. ప్రతి దేశానికి, అంతర్జాతీయ వాణిజ్యంలో దాని ప్రాముఖ్యతను బట్టి ఒక కోటా నిర్దేశించబడింది. ఈ నిర్దేశించిన కోటాలో 25 శాతం బంగారం రూపంలోనూ, మిగతా 75 శాతం తన కరెన్సీ రూపంలోనూ అంతర్జాతీయ ద్రవ్యనిధిలో ప్రతి దేశము డిపాజిట్ చెయ్యాలి. చెల్లింపుల శేషములో సమస్యలున్న దేశము, తన కరెన్సీని మిగతా కరెన్సీలకిచ్చి, తన కోటాలో 25 శాతం వరకూ అప్పు తీసుకోవచ్చు. కానీ ఇది ఆ దేశపు కరెన్సీ కోటాకు 200 శాతం మించి అధికంగా ద్రవ్యనిధిలో ఉండరాదు. ఆ పరిమితి వరకూ అప్పు తీసుకోవచ్చు.

బ్రెట్టన్ వుడ్స్ వ్యవస్థలో, పారిశ్రామిక దేశాలు, తమ చెల్లింపుల శేషములో ప్రాథమిక అసమతుల్యమున్నప్పుడే తమ కరెన్సీల సామ్య విలువలను మార్చడానికి యిష్టపడలేదు. దాని వలన, స్పెక్యులేషన్ కార్యకలాపాలు అధికమయి, అస్థిరతకు దారి తీసాయి. 1971 ఆగష్టులో, అమెరికా తాను డాలర్లకు బంగారాన్ని మారకము చెయ్యవచ్చునని ప్రకటించడంతో, బ్రెట్టన్ వుడ్స్ వ్యవస్థ అంతరించిందని చెప్పవచ్చు.

బ్రెట్టన్ వుడ్స్ వ్యవస్థలో ముఖ్య సంస్థ - అంతర్జాతీయ ద్రవ్య నిధి. ఈ ద్రవ్యనిధి ప్రపంచ అంతర్జాతీయ చెల్లింపుల వ్యవస్థను పునర్నిర్మించడంలో ప్రముఖ పాత్ర నిర్వహించింది. తన వనరులను సభ్య దేశాల కందజేసి, తద్వారా వారి చెల్లింపుల శేషములో సమస్యలను పరిష్కరించటానికి తోడ్పడింది. అంతర్జాతీయ ద్రవ్య వ్యవస్థ ఎదుర్కొన్న ముఖ్య సమస్య అంతర్జాతీయ ద్రవ్యత్వము. అంతర్జాతీయ రిజర్వులు, తగు పరిమాణంలో పెరగక పోవడం వలన, ఈ ద్రవ్యత్వ సమస్య ఉత్పన్నమయింది. స్పెషల్ డ్రాయింగ్ రైట్లకే క్రొత్త రిజర్వు ఎస్సెట్లను సృషించడం ద్వారా, అంతర్జాతీయ ద్రవ్య నిధి ఈ సమస్యను పరిష్కరించడానికి ప్రయత్నించింది. కానీ, యీ పద్ధతి సంపన్న దేశాలకే అనుకూలంగా ఉందనీ, అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఎస్.డి. ఆర్ల కేటాయింపులు, వాటి అవసరాలతో పోలిస్తే, చాలా తక్కువని, విమర్శ.

అంతర్జాతీయ ద్రవ్యత్వ సమస్యలో యూరో డాలరు మార్కెటు పాత్ర గూడా పరిశీలించాము. ఈ యూరో డాలరు మార్కెటు, అంతర్జాతీయ ద్రవ్యత్వాన్ని అధికం చేయడంలో ప్రముఖ పాత్ర వహించింది. అందువలన, అంతర్జాతీయ ద్రవ్య వ్యవస్థలో యూరో డాలరు మార్కెటు పాత్ర గణనీయమైనది.

## 15.10 ముఖ్యపదాలు:

**అంతర్జాతీయ ద్రవ్య వ్యవస్థ**

**సర్దుబాటు**

**ద్రవ్యత్వము**

**నమ్మకము**

స్వర్ణ ప్రమాణము

స్వర్ణ వినిమయ ప్రమాణము

బ్రెట్టన్ వుడ్స్ వ్యవస్థ

అంతర్జాతీయ ద్రవ్యనిధి

అంతర్జాతీయ ద్రవ్యత్వము

స్పెషల్ డ్రాయింగ్ రైట్సు

యూరో డాలరు మార్కెటు

## 15.11 నమూనా ప్రశ్నలు:

1. అంతర్జాతీయ ద్రవ్యవ్యవస్థ అనగానేమి? ఉత్తమ అంతర్జాతీయ ద్రవ్య వ్యవస్థ లక్షణాలేవి?

2. స్వర్ణ ప్రమాణ పనితీరును వివరింపుము.

3. బ్రెట్టన్ వుడ్స్ వ్యవస్థను మదింపు చేయుము.

4. స్పెషల్ డ్రాయంగ్ రైట్సు అనగానేమి? అంతర్జాతీయ ద్రవ్యత్వ సమస్య పరిష్కారములో వీటి పాత్రను పరిశీలింపుము.

5. యూరో డాలరు మార్కెటు ఆవిర్భావానికి కారణాలను వివరించి, దాని పనితీరును పరిశీలింపుము.

## 15.12 చదువదగిన గ్రంథాలు:


| | | | |
|---|---|---|---|
| 1. | Bo Soderston & Geoffrey Reed | : | International Economics Chapter 31. |
| 2. | D. Salvatore | : | International Economics Chapter 21. |
| 3. | M. Chacholiades | : | International Economics Chapter 20. |


ఆచార్య. యం. జగదీశ్వరరావు

పాఠం - 16

# అంతర్జాతీయ ద్రవ్య వ్యవస్థ సంస్కరణలు, ప్రణాళికలు మరియు దాని భవిష్యత్తు

## 16.0 లక్ష్యం :

1) ప్రస్తుతం అమలులో వున్న అంతర్జాతీయ ద్రవ్య వ్యవస్థ పని తీరును, ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడం.

2) ప్రస్తుత ద్రవ్య వ్యవస్థ సంస్కరణలు చేసిన వివిధ ప్రతిపాదనలను పరిశీలించడం.

## విషయసూచిక :

16.1 పరిచయము

16.2 ప్రస్తుత వ్యవస్థ పనితీరు

16.3 ప్రస్తుత మారకపు రేట్ల ఏర్పాట్లతో సమస్యలు

16.4 ప్రస్తుత మారకపు రేట్ల ఏర్పాట్లను సంస్కరించే ప్రతిపాదనలు

16.5 సారాంశము

16.6 ముఖ్యపదాలు

16.7 నమూనా ప్రశ్నలు

16.8 చదువదగిన గ్రంథాలు

## 16.1 పరిచయం :-

మనము ముందు పాఠములో అంతర్జాతీయ ద్రవ్య వ్యవస్థ, అది ఏ విధంగా పరిణమించింది ప్రస్తుత దశను చేరుకొన్నదీ తెలుసుకున్నాము. స్వర్ణ ప్రమాణము నుండి, బ్రెట్టన్ వుడ్స్ వ్యవస్థ వరకూ పరిణామం చెందిన ఈ వ్యవస్థ అనేక ఆటుపోట్ల నెదుర్కొన్నది. బ్రెట్టన్ వుడ్స్ వ్యవస్థ కుప్పకూలడానికి గల కారణాలను కూడా మనము పరిశీలించాము. ఇప్పుడు అమలులో వున్న ద్రవ్య వ్యవస్థ పనితీరును, ఉత్పన్నమవుతున్న సమస్యలను యీ పాఠములో తెలుసుకుందాము. గత అనుభవాల దృష్ట్యా, ఈ వ్యవస్థను ఏ విధంగా సంస్కరిస్తే, చరిత్ర పునరావృతం కాకుండా ఉంటుందో అని వచ్చిన వివిధ ప్రతిపాదనలను గూర్చి కూడా ఈ పాఠములో తెలుసుకుందాము.

## 16.1 ప్రస్తుత వ్యవస్థ పనితీరు :-

అంతర్జాతీయ ద్రవ్య వ్యవస్థ స్వరూపము మారకపు రేట్ల పద్ధతిని బట్టి నిర్ణయింపబడుతుందని ముందు పాఠములో తెలుసుకున్నాము. బ్రెట్టన్ వుడ్స్ వ్యవస్థ కుప్పకూలిన తర్వాత ఏ వ్యవస్థ అమలులోకి వచ్చినదీ పరిశీలిద్దాము. మార్చి 1973 నుండి, ప్రపంచంలో Managed Float మారకపు రేటు వ్యవస్థ అమలులో వున్నది. ఈ వ్యవస్థలో, మారకపు రేట్లలో స్వల్పకాలిక ఒడుదుడుగులను సరిదిద్దడానికి, విదేశీ మారకపు మార్కెట్లలో జోక్యం చేసుకోవడానికి, దేశాల ద్రవ్య అధికారులకు బాధ్యతలు అప్పగించడం జరిగింది. ఈ పద్ధతి కావాలని ఎంపిక చేసినది కాదు., విదేశీ మారకపు మార్కెట్లలోని సంక్షోభం దృష్ట్యా, పెద్ద ఎత్తున అస్థిర పరచి స్పెక్యులేషన్ కారణంగా కుప్పకూలిన బ్రెట్టన్ వుడ్స్ వ్యవస్థ దృష్ట్యా, ఈ పద్ధతి ప్రపంచంపై బలవంతంగా రుద్దబడినది.

ఈ Managed Float మారకపు వ్యవస్థ ప్రారంభ దశలో, యీ Float ని Manage చెయ్యటానికి నిర్దిష్టమైన నిబంధనలను విధించి, పోటాపోటీగా మూల్యహీనీకరణను నివారించడానికి తీవ్ర ప్రయత్నాలు జరిగాయి. తద్వారా 1930ల నాటి అస్తవ్యస్థ పరిస్థితులు, తిరిగి పునరావృతం కాకుండా చెయ్యాలని ప్రయత్నం జరిగింది. కానీ యీ ప్రయత్నాలేవీ ఫలించలేదు. నిజానికి, 1976 జమైకా ఒప్పందాలు, any Managed Float వ్యవస్థను గుర్తించాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు భంగం కలిగించని రీతిలో, ప్రపంచ వ్యాపార భాగస్వాములకు, వారి విదేశీ మారకపు పద్ధతిని ఎన్నుకొనేందుకు ఈ ఒప్పందాలు స్వేచ్ఛనిచ్చాయి. ఈ జమైకా ఒప్పందాలు, ధృవీకరింపబడి, ఏప్రిల్, 1978 నుండి అమలులోకి వచ్చాయి.

2000 సంవత్సరము ప్రారంభంలో, అంతర్జాతీయ ద్రవ్యనిధి సభ్యుల (182)లో మూడింట రెండు వంతుల మారి, మారకపు రేటులో ఒకే రకపు సరళీకృత వైపు మొగ్గారు. పారిశ్రామిక దేశాలు, అభివృద్ధి చెందుతున్న దేశాలు వీటిలో ఉన్నాయి. అందువలన ప్రపంచ వాణిజ్యంలో, 80 శాతము, స్వతంత్రంగాకానీ, ఉమ్మడిగాకానీ మారకపు రేటును Manage చేసిన దేశాల మధ్యనే ఉంది. మిగిలిన దేశాలు, తమ కరెన్సీలను, అమెరికన్ డాలరు, ఫ్రెంచి ఫ్రాంకు, ఎస్.డి. ఆర్లు, లేదా Basket of currencies తో Peg చేసాయి. 1974 నుండి 1977 వరకు, తిరిగి 1981 నుండి 1985 వరకు, మరియు 1990లలోనూ, అమెరికా, డాలరు విలువను స్థిరీకరించడానికి విదేశీ మారకపు మార్కెట్‌లో జోక్యం చేసుకోలేదు.

మార్చి 1979లో, యూరోపియన్ యూనియన్ యూరోపియన్ ద్రవ్య వ్యవస్థ (European Monetary System) నేర్పాటు చేసింది. 1999 జనవరిలో, సభ్య దేశాలన్నిటినీ ఒకే కరెన్సీ - యూరో (Euro) ని ప్రవేశపెట్టారు.

ప్రస్తుత Managed Float వ్యవస్థలో కూడా, మారకపు రేట్లలో స్వల్పకాలిక ఒడుదుడుకులను సరిదిద్దడానికి, విదేశీ మారకపు మార్కెట్లలో జోక్యం చేసుకోడానికి, దేశాలకు అంతర్జాతీయ రిజర్వులవసరము. ప్రస్తుతము ఇటువంటి జోక్యము డాలర్ల రూపంలోనే ఉంది. 1975, జనవరిలో, 1973 తర్వాత మొదటిసారిగా అమెరికన్ పౌరులు బంగారాన్ని (నగలరూపంలో కాకుండా) ఉంచుకునేందుకు వీలు కల్పించారు. స్వేచ్ఛా విపణిలో, అమెరికా తన బంగారపు నిల్వలలోని కొద్ది భాగాన్ని విక్రయించింది. జమైకా ఒప్పందాలలో భాగంగా, 1976, 80ల మధ్య, అంతర్జాతీయ ద్రవ్య నిధి తన బంగారపు నిల్వలలో 6వ భాగాన్ని, స్వేచ్ఛా విపణిలో విక్రయించింది. తద్వారా, అంతర్జాతీయ రిజర్వు asset గా బంగారాన్ని తొలగించటానికి ప్రయత్నించింది. బంగారపు అధికారిక ధర రద్దు చేయబడింది. అంతర్జాతీయ ద్రవ్య నిధికి, సభ్య దేశాల మధ్య భవిష్యత్తులో బంగారపు లావాదేవీ కూడా ఉండేటట్లుగా ఒప్పందం కుదిరింది. అంతర్జాతీయ ద్రవ్య నిధి కూడా తన బంగారపు నిల్వలను, 1971 పూర్వపు అధికారిక ధర \$35 లేదా 35 ఎస్.డి.ఆర్లు (ఒక ఔన్సు) వద్దనే విలువ కట్టింది. 1996లో, అంతర్జాతీయ ద్రవ్యనిధి తన 2 బిలియన్ డాలర్ల బంగారపు నిల్వలను అమ్మి, తద్వారా వచ్చే నిధులను బడుగు దేశాల విదేశీ ఋణాన్ని తగ్గించటానికి ఒప్పుకుంది.

## 16.2 ప్రస్తుత మారకపు రేట్ల ఏర్పాట్లతో సమస్యలు :-

ప్రపంచము నేడు అనేక తీవ్రమైన అంతర్జాతీయ ద్రవ్య సమస్యలనెదుర్కొంటుంది. ఇవన్నీ ఒక దానితో ఒకటి ముడిపడినవే. మారకపు రేట్లలో అస్థిరత మరియు అధిక రేటులో అసమతుల్యతల కొనసాగింపు, ప్రస్తుత Floating System లో తలెత్తిన తీవ్ర సమస్యలు.

1973 నుండి, మారకపు రేట్లలో తీవ్ర అస్థిరత ఏర్పడిందని మనకు తెలుసు. ఈ పరిస్థితులు, అంతర్జాతీయ వాణిజ్యాన్ని, పెట్టుబడులకు ప్రతికూలంగా ప్రభావితం చేస్తాయి. ప్రస్తుత Managed Float మారకపు రేటు వ్యవస్థలోని ఒక వాస్తవాన్ని మనము గ్రహించాలి. ఇటువంటి వ్యవస్థలు మారకపు రేట్లలో పెద్ద అసమతుల్యాలు ఏర్పడి, అవి చాలాకాలం కొనసాగవచ్చు. 1980 నుండి 1985 వరకు అమెరికన్ డాలరు over valuation మరియు 1985 ఫిబ్రవరి నుండి 1990 చివరి వరకు డాలరు విలువలో తగ్గుదల ఇందుకు ఉదాహరణలు. 1999 జనవరి 1 నుండి, 2000 ఏప్రిల్ వరకు యూరో విలువ, డాలరుతో పోలిస్తే, 24 శాతం తగ్గిపోయింది, జపానీస్ యెన్‌తో పోలిస్తే యింకా తగ్గిపోయింది. డాలరు విలువలో అధిక పెరుగుదల 1980లలో మొదటి అర్ధ భాగంలో, అమెరికా దేశపు వాణిజ్య లోటుతో ముడిపడింది. దీని మూలంగా వ్యాపార రక్షణ విధానాలకు పిలుపులు అధికమయ్యాయి. 1990ల ఉత్తరార్థంలోనూ, 2000ల ప్రారంభంలోనూ, డాలరు over valuation అమెరికాదేశపు వాణిజ్యలోటు అధికంగా ఉండడం వల్ల, సంభవించింది.

1980 నుండి 1985 వరకు, డాలరు over valuation అమెరికా దేశపు బడ్జెట్ లోటుతో ముడిపడింది. దానివలన వాస్తవిక (Real) వడ్డీరేట్లు అధికంగా ఉండి, దేశంలోని మూలధనపు రాకలు అధికమయ్యాయి. నిజానికి 1985 మధ్య కాలంలో, అమెరికా ఒక Creditor Nation నుండి, Debt or Nation గా మారింది.

1990 చివరలో, చరిత్ర పునరావృతమవుతుందనిపించింది. అమెరికా దేశపు వృద్ధి, విదేశీ మూలధనాన్ని అధిక పరిమాణంలో ఆకర్షించింది. (ముఖ్యంగా యూరప్, జపాను దేశాల నుండి). దాని వలన డాలరు over valuation అయింది. అమెరికా దేశపు పెద్ద వాణిజ్య లోటుకు కారణమయింది. 2000 సం॥లో అమెరికా ప్రపంచంలో అతి పెద్ద ఋణగ్రస్త దేశంగా అవతరించింది. ఇట్లా అసమతుల్యము కొనసాగడం, మారకపు రేట్లలో విపరీతమైన అస్థిరతల వలన, ప్రస్తుత అంతర్జాతీయ ద్రవ్య వ్యవస్థను సంస్కరించవలసిన అవసరం ఉందని గుర్తించి, ఆ దిశగా మరల ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ సహకారము అధికంగా ఉండేటట్లుగా, ముఖ్యమైన దేశాల మధ్య విధాన సమన్వయము ఉండేటట్లుగా సంస్కరణలుండాలని సూచించడం జరిగింది. లోగడ, స్థిర, మారకపు రేట్ల వ్యవస్థల సాపేక్ష, గుణదోషాలపై చర్చ కేంద్రీకృత మయింది. కానీ ఇపుడు, మారకపు రేట్లలో సరళత, అభిలషణీయ స్థాయిపైనా, విధాన సహకారంపైనా చర్చ మళ్ళింది.

## 16.3 ప్రస్తుత మారకపు రేట్ల ఏర్పాట్లను సంస్కరించే ప్రతిపాదనలు :-

మారకపు రేట్లలో అస్థిరతలను నివారించటానికి అనేక ప్రతిపాదనలు చేయబడినాయి. వాటిలో కొన్నిటిని పరిశీలిద్దాము.

విలియమ్‌సన్ (1986)లో, Target zones ఏర్పాటు చెయ్యాలని ప్రతిపాదించారు. ఈ వ్యవస్థలో, ప్రముఖ పారిశ్రామిక దేశాలు, సమతుల్య మారకపు రేటును అంచనా వేసి, ఏ పరిమితులలో అది మారవచ్చునో ఒక అంగీకారానికి వస్తాయి.

సమతౌల్య మారకపు రేటుకన్నా 10శాతం ఎక్కువగా కానీ, 10శాతం తక్కువగా కానీ (± 10%) ఈ పరిమితులలో మారకపు రేటు మార్పు చెందవచ్చు. ఈ పరిమితులకు లోబడి, డిమాండ్, సప్లయ్ శక్తులను బట్టి మారకపు రేటు మార్పు చెందవచ్చు. వీటినే Target Zones అంటారు. ఈ పరిమితులను దాటి మారకపు రేటు మార్పు చెందకుండా, విదేశీ మారకపు మార్కెట్లలో అధికారిక జోక్యం ఉంటుంది. ఈ Target Zones soft గా ఉంటాయి, సంబంధిత సమతౌల్యమారకపు రేటు, ఈ Target Zones ను అతిక్రమించినపుడు గానీ, వాటికి దగ్గరగా ఉన్నపుడు, మారుతుంది. పైకి వ్యక్తం చేయకపోయినా, ప్రముఖ పారిశ్రామిక దేశాలు యిటువంటి Target Zones కి ఒప్పుకొన్నాయి. ముఖ్యంగా డాలరు, యెన్‌ల మధ్య మారకపు రేటు, మరియు డాలరు, జర్మన్ మార్కుల మధ్య మారకానికి యిటువంటి Target Zones కి ఆయా దేశాలు ఒప్పుకొన్నాయి. కానీ 1990 ఆరంభంలో, యిటువంటి అప్రకటిత ఒప్పందాన్ని త్రోసిరాజన్నాయి. మార్కెటు తీవ్ర వత్తిడి వలన, డాలరు విలువ, యెన్‌తో పోలిస్తే విపరీతంగా పెరగటం వలన, ఈ ఒప్పందం పాటించబడలేదు.

ఈ Target Zones ప్రతిపాదనపై విమర్శలు లేకపోలేదు. స్థిర, సరళ మారకపు రేటు వ్యవస్థల రెండింటి అవలక్షణాలు ఈ ప్రతిపాదించిన వ్యవస్థలో వుంటాయని విమర్శకుల నమ్మకము. సరళమారకపు రేట్ల వ్యవస్థలో వలే ఈ పద్ధతి, మారకపు రేట్లలో గణనీయమైన మార్పులకవకాశమిచ్చి, తీవ్రమైన ఒడుదుడుకులకు దారితీసి ద్రవ్యోల్బణానికి కారణమవవచ్చు. స్థిరమారకపు రేట్ల వ్యవస్థలో వలే, విదేశీ మారకపు మార్కెట్లలో అధికారిక జోక్యాన్ని సమర్థించి, ద్రవ్య అధికారపు (Monetary Authority) స్వయం ప్రతిపత్తిని, ఈ Target Zones వ్యవస్థ, తగ్గిస్తుంది. అయితే విధాన సమన్వయము ద్వారా, ప్రముఖ పారిశ్రామిక దేశాలు, Target zones పరిమితులలో ఉండేటట్లు, విదేశీ మారకపు మార్కెట్లలో జోక్యాన్ని తగ్గించవచ్చు.

ప్రస్తుత అంతర్జాతీయ ద్రవ్యవ్యవస్థ సంస్కరణలో అనేక ఇతర ప్రతిపాదనలు చేయబడినాయి. ఇవన్నీ ప్రముఖ దేశాల మధ్య విస్తృతమైన విధాన సమసన్వయమునకు సంబంధించినవే. ఇందులో Mekuinan ప్రతిపాదన ముఖ్యమైనది. ఈ వ్యవస్థలో అమెరికా, జపాను మరియు జర్మనీ దేశాలు వారి కరెన్సీల మారకపు రేట్లను, వాటి వాటి సమతుల్య స్థాయిలో, (కొనుగోలు శక్తి సామ్యాన్ని బట్టి నిర్ణయింపబడిన) నిర్ణయించి, వారి ద్రవ్య విధానాలను బాగా సమన్వయ పరచి, మారకపు రేట్లను స్థిరంగా ఉంచుతాయి. ఉదాహరణకు, యెన్‌తో పోలిస్తే, డాలరు విలువ పడిపోతే, అమెరికా తన ద్రవ్య సప్లయ్ వృద్ధి రేటును తగ్గించాలి. అదే సమయములో జపాను దాన్ని పెంచాలి. ఈ మూడు దేశాల ద్రవ్య సప్లయిలో నికరవృద్ధి, ద్రవ్యోల్బణ రహిత ప్రపంచ ఆర్థిక వ్యవస్థ విస్తరణకు తోడ్పడటానికనుగుణంగా జరగాలి.

అంతర్జాతీయ ద్రవ్యనిధి తాత్కాలిక సంఘము (Interim Committee of IMF) 1986 లో మరొక ప్రతిపాదన చేసింది. ఈ ప్రతిపాదన, దేశాల ఆర్థిక పనితీరును మదింపు చేయగల కొన్ని గుణాత్మ సూచికలపై (Objective Indication) ఆధారపడిన ప్రతిపాదన. వీటి ప్రకారము, దేశాల ఆర్థిక పనితీరును మదింపు చేసి, ద్రవ్యనిధి పరివేక్షణలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, ద్రవ్యోల్బణ రహిత మార్గములో పయనించడానికి అవలంబించవలసిన సమన్వయ స్థూల ఆర్థిక విధానాలను సూచించడం. ఈ సూచికలలో కొన్ని స్థూల జాతీయోత్పత్తి వృద్ధి, ద్రవ్యోల్బణము, నిరుద్యోగిత, వ్యాపార శేషము, ద్రవ్య సప్లయ్‌వృద్ధి, కొశమిగులు, మారకపు రేట్లు, వడ్డీ రేట్లు మరియు అంతర్జాతీయ రిజర్వులు.

ఒక దేశపు ఈ సూచికలలో పెరుగుదలకానీ, తగ్గుదలకానీ ఆ దేశాలు అనుసరించవలసిన నిర్బంధ లేదా విస్తరణ విధానాలను సూచిస్తుంది. ప్రపంచం మొత్తానికి ఒక సూచిక స్థిరంగా ఉంటూ, ద్రవ్యోల్బణరహిత ప్రపంచ అభివృద్ధికి అది చుక్కాని.

ప్రతిదేశానికి, నిరుద్యోగిత - ద్రవ్యోల్బణము మధ్య Trade-off వివిధంగా ఉండవచ్చు. అపుడు, సమర్థవంతమైన స్థూల ఆర్థిక విధానాల మధ్య సమన్వయము అసాధ్యము. 1980 దశకం ఉత్తరభాగంలో, యూరోపియన్ ద్రవ్య వ్యవస్థ (European Monetary System) గణనీయమైన స్థూల ఆర్థిక విధాన సమన్వయము సాధ్యపడుతుందని నిరూపించిందని కొంతమంది విశ్లేషకుల భావన. కాని 1992 సెప్టెంబరు లోనూ 1993 ఆగస్టులోనూ సంభవించిన కరెన్సీ సంక్షోభము ఇది నిజంకాదని నిరూపించింది. యూరపులో మాంద్య పరిస్థితుల దృష్ట్యా, జర్మనీ తన వడ్డీ రేట్లను తగ్గించడానికి నిరాకరించడంతో, యీ సంక్షోభం సంభవించింది. సాంఖ్యక పరిశోధనలు కూడా, దేశాలు, విధాన సమన్వయము అటు మూడొంతులు లాభపడతాయని సూచించాయి. కానీ, సంక్షేమ పరంగా ఉత్పన్నమయ్యే లాభాలు, సమన్వయము వలన, అంత ఎక్కువగా ఉండవు.

ప్రస్తుత ప్రపంచంలో, అధిక అంతర్జాతీయ మూలధన ప్రవాహాలు, మారకపు రేటు అస్థిరతకు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అసంతులితకు కారణమని ఒక భావన. అందువలన దీనికి సంబంధించిన ప్రతిపాదనలు కొన్ని చేయబడినాయి. స్పెక్యులేటివ్ మూలధన ప్రవాహాలను కట్టడి చేయాలని ఒక ప్రతిపాదన. 1978లో, James Tobin, Transactions Taxను విధించి, పురోగామి తరహాలో దానిని అమలు చేసి, వీటిని నిరోధించవచ్చని సూచించారు. Dornbusaw ard Frankel (1987) ద్వంద్వ మారకపు రేట్ల విధానం ద్వారా, అంతర్జాతీయ మూలధన ప్రవాహాల్ని కట్టడి చేయవచ్చని ప్రతిపాదించారు. ఈ వ్యవస్థలో, రెండు మారకపు రేట్లు ఉంటాయి - వ్యాపార లావాదేవీలకు, సరళత తక్కువగా గల మారకపు రేటు, ద్రవ్యపరమైన లావాదేవీలు (వ్యాపారం, పెట్టుబడికి సంబంధించినవి) సరళత ఎక్కువగా వున్న మారకపు రేటును ఉపయోగించాలని సూచించారు. మూలధన మార్కెట్టును విభజించటం ద్వారా, Hot money ప్రవాహాల్ని కొంతమేరకు నిరోధించవచ్చు. ఇలా చేయటం వలన, అంతర్జాతీయ ద్రవ్య వ్యవస్థ, ప్రముఖ పారిశ్రామిక దేశాల మధ్య విధాన సమన్వయంతో నిమిత్తం లేకుండా, పనిచేసేటట్లు చేయవచ్చు. ఎందుకనగా, విధాన సమన్వయము సాధ్యపడదు, ఉపయోగపడదు. ఈ ప్రతిపాదన విమర్శకులు - అనుత్పాదక లేదా స్పెక్యులేటివ్ మూలధన ప్రవాహాలు, ఉత్పాదక మూలధన ప్రవాహాలు (అంతర్జాతీయ వ్యాపారానికి, పెట్టుబడికి సంబంధించినవి) మధ్య తేడా చూపించడం అసాధ్యమని సూచించారు.

ప్రపంచంలో ఇపుడు పరస్పర ఆధారిత పెరుగుతోంది. అందువలన అంతర్జాతీయ సహకారము, విధానసమన్వయము ద్వారానే, దేశాలు తమ సర్వసత్తాక ప్రతిపత్తిని (Sovergnity) సమర్థవంతంగా అమలుచేయవచ్చని Cooper (1984) సూచించారు. కానీ, ఆర్థిక లక్ష్యాలను సాధించడంలో సఫలీకృతం కావడానికి, ప్రముఖ దేశాలు ఎంతవరకు, తమ స్వయం ప్రతిపత్తి (Autonomy)ని వదులుకోవడానికి సిద్ధపడతాయనేది ముఖ్యమైన ప్రశ్న. అంతిమంగా, ప్రస్తుత అంతర్జాతీయ ద్రవ్య వ్యవస్థను సంస్కరించడం ద్వారానే, దాని పనితీరును మెరుగు పరచవచ్చును, కానీ దాని స్థానంలో ఇంకొక వ్యవస్థను నెలకొల్పడం ద్వారా కాదని గ్రహించాలి.

## 16.4 సారాంశము:

గత వంద సంవత్సరాలలో, అంతర్జాతీయ ద్రవ్య వ్యవస్థలో అనేక మార్పులు వచ్చాయి. స్వర్ణ ప్రమాణములో స్థిర మారకపు రేట్ల వ్యవస్థ నుండి, బ్రెట్టన్ వుడ్స్ వ్యవస్థలో Pegged Exchange Rate వ్యవస్థ వరకు పరిణామం చెందింది. బ్రెట్టన్ వుడ్స్ వ్యవస్థ కుప్పకూలడంతో, ప్రస్తుతం Managed Float వ్యవస్థ అమలులో వున్నది. ఈ రకంగా ఏర్పాట్లూ, మార్పులు, వివిధ సమయాలలో సంభవించిన సంక్షోభాల వలన, ఈ ప్రస్తుత వ్యవస్థ తాత్కాలికమైనదే (Transitory) అనే అంశంపై ఏకాభిప్రాయం లేదు. విధాన నిర్దేశనలలో చాలా మంది, స్థిర లేదా Managed మారకపు రేట్ల వైపు మొగ్గు చూపేవారే. ప్రస్తుత వ్యవస్థలో సమస్యలనధిగమించటానికి, Target Zones మరియు స్థూల ఆర్థిక విధానాల మధ్య ఎక్కువ సమన్వయము - పరిష్కార మార్గములో సూచించారు.

ప్రస్తుతము ఒక ద్రవ్య 'వ్యవస్థ' ఉందని చెప్పలేము. స్వర్ణ ప్రమాణము లేదా బ్రెట్టన్ వుడ్స్ వ్యవస్థ లాంటివేమీ ఇపుడు అమలులో లేదు. దేశాల మధ్య అంతర్జాతీయ ద్రవ్య సంబంధాలు కేవలము తాత్కాలిక ఏర్పాట్లపై ఆధారపడినవి. క్రొత్త ద్రవ్య వ్యవస్థ ఆవిర్భవించాలంటే, ఎక్కువ స్థిరంగా ఉండే మారకపు రేట్ల దిశగా పయనించాలి. ఈ దిశగా పయనించాలంటూ, కొన్ని నియమాలు, నిబంధనలు మరియు ఎక్కువ సహకారము అవసరము. ఇది ఎక్కువగా అమెరికా దేశము మీద ఆధారపడి వుంటుంది. దేశాలు అంతర్గత సమతుల్యానికి ప్రాధాన్యతనిచ్చి, బహిర్గత సమతుల్యానికి, మారకపు రేటుకు తర్వాతి ప్రాధాన్యతనిస్తున్నారు. కాబట్టి సహకారము ఆశించిన మేర లేదు. కాబట్టి ప్రస్తుత వ్యవస్థ చాలా గందరగోళ పరిస్థితిలో ఉంది. అందువలన దాని భవిష్యత్ స్వరూపం చెప్పడం సాహసమే అవుతుంది.

## 16.5 ముఖ్య పదాలు :-

మేనేజ్డ్ ఫ్లోట్ ద్వంద్వ మారకపు రేట్లు

టార్కెటు జోన్స్

## 16.6 నమూనా ప్రశ్నలు :-

1. ప్రస్తుత అంతర్జాతీయ ద్రవ్య వ్యవస్థ సమస్యలను క్లుప్తంగా వివరింపుము.

2. ప్రస్తుత ద్రవ్య వ్యవస్థను సంస్కరించుటకు, చేయబడిన వివిధ ప్రతిపాదనలను పరిశీలింపుము.

## 16.7 చదువదగిన గ్రంథాలు :


1. James Tober : "A proposal for International Monetary Reform" Eastern Economic Journal July/Oct 1978.

2. J.Williamson : "Target Zones and Management of the Problem" Brooking Papers on Economic Activites Nov 11, 1986.


ఆచార్య యం. జగదీశ్వరరావు